# కర్నూలు జిల్లా జానపద కథలు




## డా॥ ఎం. హరికిషన్

94410 32212



కర్నూలు బుక్ ట్రస్ట్

విజ్ఞాన ప్రచురణలు (జనవిజ్ఞాన వేదిక)



**కర్నూలు జిల్లా జానపద కథలు**
**Kurnool Jilla Janapada Kathalu**

**రచయిత** : డా॥ ఎం. హరికిషన్
**ప్రచురణ** : కర్నూలు బుక్ ట్రస్ట్
**మొదటి ముద్రణ** : 19.05.2017

**చిత్రకారులు** : ఎస్. సత్యం, కూరెళ్ళ శ్రీనివాస్,
యెనికపాటి కరుణాకర్, లక్ష్మణ్

**ముఖ చిత్రం** : ఎస్. సత్యం, 99633 23633
**కవర్ డిజైన్** : టి. సాయిబాబా, 90593 93251

ప్రతులకు

**1. డా॥ ఎం. హరికిషన్**
45/205-1,
లేబర్ కాలనీచర్చ్ ఎదురుగా,
టీచర్స్ కాలనీ, కర్నూలు.
సెల్: 94410 32212
email: drmharikishan@rediffmail.com
facebook : harikishan kurnool

**2. జన విజ్ఞాన వేదిక**
జి. మాల్యాద్రి, కన్వీనర్, ప్రచురణల విభాగం
ప్లాట్ నెం. 162, విజయలక్ష్మి నగర్.
నెల్లూరు - 524 004
సెల్ : 94405 03061

ముద్రణ
**Apsara Printing Works**
Kachiguda, Hyderabad.
Cell: 99486 63719

**వెల:** 200/-

# కథల వరుస


1. వేలెడంత పొట్టిగాని కథ – 5
2. కోటకొండ మొనగాడు – 8
3. ఎల్లిగాడు – మల్లిగాడు – 11
4. ఉంగురుబిళ్ళ – 16
5. ఎవరు గొప్ప – 18
6. యాక్... థూ – 20
7. మనిషిగా మారిన గాడిద – 22
8. కోతి – దొంగోడు – 25
9. బిచ్చగాళ్ళు – బిరియాని – 27
10. అత్తా కోడళ్ళు – 29
11. చిన్నపాప – పెద్దపాప – 31
12. పేరు మరిచిన ఈగ – 33
13. తిక్క రాజు – 35
14. పిరికివానితో చేతులు కలపకు – 38
15. బంగారు ఆవు – 41
16. కాకమ్మ – పిట్టమ్మ – 44
17. సింతకాయంత సిన్నోని కథ – 46
18. అమాయకునికి పట్టిన అదృష్టం – 47
19. మూడొంకాయలు – 49
20. పెద్దపాప – నాగేంద్రుడు – 51
21. పెళ్ళి కాని దోమ – 56
22. అత్తా నలుగురు కోడళ్ళు – 58
23. సలసల కాగే సూర్యుడు – సల్లాసల్లని చందమామ
24. అంతా మా మంచికే గదా – 62
25. చిలక ముక్కు వూడిపాయ – 66
26. మెక్కూ మెక్కూ మూక్కా మెక్కు – 69
27. నాకు కాబోయే మొగుడు ఎట్లా వుండాలంటే – 71
28. టక్కుపల్లి సుబ్బయ్య – 75
29. కుంటికోతి – మంచికోతి – 77
30. బంగారు పక్షి – 79
31. చెప్పిందొకటి – చేసిందొకటి – 85
32. పేను నల్లి చీమల కథ – 87
33. నక్క బావ – పిల్లి బావ – 89
34. ఎవడూ తక్కువోడు కాదు – 91
35. వంకర టింకర పండ్లు – 97
36. వూకూకె – 99
37. ధాం... ధాం... ధాం... – 101
38. నవాబు – దర్జీ – 104
39. ముద్దుంగరం – 106
40. సముద్రం వుప్పగా ఎందుకుందంటే – 109
41. నీలాంటోడు వూరికొక్కడుంటే చాలు – 112
42. ఒకటి తిందునా...రెండు తిందునా...– 115
43. పిట్టపిల్లా సముద్రుడు – 119
44. కిర్రు కిర్రు లొడ్డప్పొ – 121
45. సూది – వైద్యుడు – 123
46. ముగ్గురూ ముగ్గురే – 125
47. అవ్వా పొట్టేలు – 126
48. మా మల్లన్న సచ్చిపాయ – 129
49. నవ్వితే నవరత్నాలు – 131
50. దొర్లు దొర్లు పుచ్చకాయ్ – 135
51. అద్దిరబన్నా – 138
52. చేసిన మేలు మరవకు – 140
53. చందమామ కథ – 144
54. మోసంచేయాలనుకోకు మోసపోతావు – 146
55. వానదేవుడు గాలిదేవుడు అగ్నిదేవుడు – 149
56. పిసినారి అవ్వ – టక్కరి పిల్లోళ్ళు – 152
57. ఒక వెంట్రుక రాణి కథ – 154
58. ఉల్లిగడ్డ కథ – 157
59. కుందేలు దెబ్బ – 158
60. అంటగాకు ముట్టగాకు ఓయత్తా – 160

61. నల్లకుక్క – 162
62. మొగుడెవరు – 164
63. పెద్దోళ్ళ మాట సద్దన్నం మూట– 166
64. ఇదేం సావురా దేవుడా – 169
65. సోమరిపోతు మహావీరునికి జై – 172
66. బోడి రూపాయ – 178
67. ఒక పూవు కథ – 180
68. నక్క – సింహం – 182
69. ఎలుకగాడు – 184
70. ముత్యాల హారం – 187
71. మూడు టెంకాయలు – 191
72. మోసం చేసినోని కాలే గుంతలోకి – 193
73. దెబ్బకి దెబ్బ – 196
74. చిచ్చర పిడుగు – 198
75. పండితుడు – వంటవాడు – 202
76. గుడ్డోడు – గూనోడు – 204
77. అక్క – చెల్లెలు – 206
78. శ్రీ మద్రమారమణ గోవిందా హరీ – 208
79. పాపిష్టిసొమ్ము – 211
80. రాయి... బండ... మా వూరి కొండ – 214
81. పులికి గురువు పిల్లే గురూ... – 216
82. దోసకాయల దొంగనక్క కథ – 218
83. మంత్రాల మర్రిచెట్టు – 220
84. చిటికెల పందిరి – 222
85. నువ్వు చెప్పిందే నే చేస్తా – 224
86. పిచుక కథ – 226
87. పిరికి దయ్యం – 229
88. దాసరయ్య – జంగమయ్య – 232
89. అనుభవమే అన్నీ నేర్పిస్తుంది – 235
90. శ్రావణ భాద్రపదాలు – 237
91. నల్లడబ్బా – ఎర్రడబ్బా – 239
92. ఏడుగురు మూర్ఖులు – 241
93. పిల్ల పెత్తనం చేసిన నక్క – 244
94. నాకు మూడు నీకు రెండు – 248
95. అమ్మో ఇది సామాన్యురాలు కాదు – 250
96. పిసినారి – టెంకాయ – 254
97. రోకలి పూజ – 256
98. కొండముచ్చు పెండ్లాం – 258
99. నలుగురు చెవిటోళ్ళు – 262
100. రేచీకటి అల్లుడు – 264
101. భం... భం... చుక... చుక... – 267
102. దెబ్బకు ఏడుమంది – 269
103. వ్వె... వ్వె... వ్వె... – 273
104. మంత్రి – సేవకుడు – 276
105. గిలిగాడు – 279
106. నలుగురు మూర్ఖులు – 281
107. వురుములయ్య – మెరుపులమ్మ – 283
108. దొరికిన దొంగ – 286
109. నమ్మొద్దురా నాయనా దొంగ నక్కల్ని – 289
110. మల్లెపూల పిల్ల – 292
111. ఒకళ్ళనుమించిన ఘనుడు ఇంకొకడు – 295
112. సూడసక్కని పిల్ల – 297
113. రాజు – దేముడు – 300
114. దొరికిపోయినావురా మిడతంబొట్లూ – 302
115. నెయ్యి – పులగం – 306
116. పుణ్యావతి – భాగ్యావతి – 308
117. ఆహా – అబ్బా – 312
118. తిక్క పెండ్లాం – 314
119. ఒక రాకుమారి ఏడుమంది గంధర్వ కన్యలు
120. ఏం వదినా చాలా ఇంకా కావాల్నా – 321
121. మేమెప్పుడూ సూళ్ళా ఇట్లాంటి విచిత్రం – 325

# 1 వేలెడంత పొట్టెగాని కథ

ఒకూర్లో ఒక అవ్వ వుండేది. ఆ అవ్వ రోజూ పొద్దున్నే ఇంటి ముందు నున్నగా కసువు కొట్టి, పేడనీళ్ళు చల్లి, ముచ్చటయిన ముగ్గులు పెట్టేది. ఒకరోజు ఇంటి ముందు కసువు కొడ్తా వుంటే తెల్లని కోడిగుడ్డు ధగధగా మెరిసిపోతా కనబడింది. అవ్వ దాన్ని తీసుకోనొచ్చి అట్టు వేసుకుందామని పొయ్యి మీద పెట్టింది. పెనం బాగా సలసలసల కాగినాక పగలగొట్టడానికని గుడ్డు చేతిలోకి తీసుకోనింది.


అంతలో... దాని లోపలి నుంచి "అవా... అవా... జాగ్రత్త... కొంచెం నెమ్మదిగా పగలగొట్టు" అని వినబడింది. "ఇదేందిరా నాయనా... కోడిగుడ్డు మాట్లాడ్తా వుందని అవ్వ ఆశ్చర్యపోయి దాన్ని జాగ్రత్తగా పట్టుకోని నెమ్మదిగా పగలగొట్టింది. అంతే... లోపల్నుంచి మన బొటనవేలుంటాది గదా... అంత చిన్న పొట్టెగాడు కిలకిలకిల నవ్వుకుంటా బైటికొచ్చినాడు. అవ్వ వాన్ని జాగ్రత్తగా చేతిలోకి తీసుకోని, వేడినీళ్ళు కాచి తలస్నానం చేపిచ్చి... మెత్తని బట్టతో శుభ్రంగా తుడిచి... చక్కగా పాపిడి దీసి దువ్వి, ముద్దు పెట్టుకోనింది.

పొట్టోడుండేది వేలెడంతనే గదా... మరి వానికి బట్టలెట్లా... అందుకని అవ్వ వాని కోసం రంగురంగుల బట్టముక్కలు తెచ్చి చిన్న అంగీ, చిన్న ప్యాంటు, చిన్న టోపీ కుట్టిచ్చింది. వాడు రంగురంగుల ప్యాంటూ అంగీ వేసుకోని, నెత్తిన టోపీ పెట్టుకోని "మా మంచి అవ్వ" అని సంబరంగా అవ్వను ముద్దు పెట్టుకున్నాడు.

పొట్టోడు ఒకరోజు ఇంట్లో తిరుగుతా వుంటే ఒక మూలన కొన్ని చెక్కముక్కలు కనబన్నాయి. అవన్నీ ఒక చోటేసుకోని ఉలి, రంపం, సుత్తి తెచ్చి కష్టపడి ఒక చిన్నబండి తయారు చేసుకున్నాడు. బండికి మంచి రంగులేసి పూలు కట్టినాడు. రెండు ఎలుకల్ని పట్టుకోనొచ్చి బండికి కట్టినాడు.



కట్టినాక ఇంగ బండిమీదెక్కి ఛల్ ఛల్ అనుకుంటా సంబరంగా వీధుల్లో అటూ యిటూ తిరుగుతా వుంటే దారిలో వానికి ఒకచోట ఒక రాగిబిళ్ళ దొరికింది. దాన్ని తెచ్చి అవ్వకిచ్చినాడు. అది చూసి అవ్వ "ఒరేయ్... రాగిబిళ్ళ దొరికినోనికి రాజు కూతురితో పెండ్లయితాదంట... పో... పోయి... చేస్కోని రాపో" అనింది.



పొట్టోడు సరేనని అవ్వ కాళ్ళకు మొక్కి ఆశీర్వాదం తీసుకోని బండెక్కి రాజు కూతురిని పెండ్లి చేసుకోడానికి బైలుదేరినాడు. అట్లా పోతావుంటే దారిలో ఒక నల్లపిల్లి ఎదురయి "పొట్టి బావా... పొట్టిబావా... యాడికెళుతున్నావ్" అనడిగింది. దానికి వాడు "రాజు బిడ్డను పెండ్లి చేసుకోడానికి" అని చెప్పినాడు. "ఐతే నేనూ వస్తా... నన్ను గూడా తీస్కోనిపో" అనిందా పిల్లి.

వాడు సరేనని తలూపి "ఈ చెవిలోకెక్కు" అని దాన్ని ఎడమ చెవిలోకి ఎక్కించుకున్నాడు.

మళ్ళా పోతావుంటే దారిలో ఒక చిరుతపులి ఎదురయి "పొట్టిబావా... పొట్టిబావా... ఎక్కడికెళుతున్నావ్" అనడిగింది. దానికి వాడు "రాజు బిడ్డను పెండ్లి చేసుకోడానికి" అని చెప్పినాడు. "ఐతే నేనూ వస్తా... నన్ను గూడా తీస్కోనిపో" అనిందా పులి. వాడు సరేనని తలూపి దాన్ని కుడిచెవిలోకి ఎక్కించుకున్నాడు.

మళ్ళా నెమ్మదిగా ఛల్‌ఛల్‌మని ఎలుకల్ని అదిలిస్తూ పోతావుంటే దారిలో ఒక పెద్ద సముద్రమంత చెరువు అడ్డమొచ్చింది.

పొట్టోడంటే మామూలు పొట్టోడు కాదు గదా... పెద్ద అసాధ్యుడు. వెంటనే నోరు తెరచి అంత పెద్ద చెరువులోని నీళ్ళన్నిటినీ ఒక్క చుక్కకూడా మిగలకుండా సయ్యని పొట్టలోకి పీల్చేసుకున్నాడు. మళ్ళా ఛల్ ఛల్‌మని ఎలుకల్ని అదిలిస్తా సాయంత్రానికల్లా రాజ్యానికి చేరుకున్నాడు.

రాజు సభలో సింహాసనంపై కూచోనున్నాడు. పొట్టోడు చక్కగా లోపలికెళ్తా వుంటే భటులు అడ్డంపడి లోపలికి వెళ్ళనియ్యలేదు. వాడు సరేనని నెమ్మదిగా బండి వెనక్కి తిప్పి ఒక్కసారిగా ఛల్‌మని ఎలుకల్ని అదిలించి కండ్లు మూసి తెరిచేలోగా భటుల కాళ్ళసందుల్లోంచి రయ్యిన లోపలికి దూసుకోని పోయి సభ మధ్యలో బండి ఆపినాడు. రాజు వాన్ని చూసి కండ్లెర్ర జేస్తా "ఎవర్రా నువ్... నా అనుమతి లేకుండా సరాసరి నా ముందుకొచ్చినావ్" అన్నాడు కోపంగా. దానికి వాడు బండి మీద నుండి కిందికి దిగి ఏ మాత్రం భయం లేకుండా "రాజా... నేను నీ కూతుర్ని పెండ్లి చేసుకోవడానికి వచ్చినా, నాకు నీ కూతురినిచ్చి మర్యాదగా పెండ్లి చేయ్" అన్నాడు.

ఆ మాటలింటానే రాజుకి చిర్రెత్తుకొచ్చింది. వాన్ని కోపంగా ఎగాదిగా చూస్తా "వేలెడంత లేవు... నీకు నా

కూతురు గావాల్నా... రేయ్ ఎవరక్కడ" అన్నాడు. వెంటనే సైనికులు పరుగెత్తుకోనొచ్చినారు. "రేయ్... వీన్ని తీస్కోనిపోయి మన కోళ్ళ కొట్టంలో పాడెయ్యండ్రా... అవన్నీ వీన్ని పొడిచి పొడిచి చంపేస్తాయి" అన్నాడు. సరేనని సైనికులు వాన్ని పట్టుకోని పోయి కోళ్ళ కొట్టంలో పడేసినారు.

కోళ్ళన్నీ ఒక్కసారిగా పొట్టోనొంక చూసినాయ్. "కొక్కరోకో" అని అరుస్తా పొడవడానికి ముందుకు వురుక్కుంటా వచ్చినాయి. వెంటనే వాడు ఎడమ చెవిలోని పిల్లిని పిల్చినాడు. అంతే అది 'మ్యావ్' అని భయంకరంగా అరుస్తా ఎగిరి కోళ్ళ మీదకి దుంకింది. ఇంకేముంది... కోళ్ళన్నీ పరుగో పరుగు. పిల్లి దాన్ల వెంటపడి దొరికిందాన్ని దొరికినట్టు మట్టసంగా చంపి తినేసింది. పొద్దున్నే భటులొచ్చినారు. చూస్తే ఇంకేముంది. పొట్టోడు హాయిగా కిలకిల నవ్వుతా కులాసాగా కనబన్నాడు. భటులు వురుక్కుంటా... రాజు దగ్గరికి పోయి "రాజా... రాజా... ఆ పొట్టోడు మామూలోడు గాదు. మన కోళ్ళన్నిటినీ ఒక్కటిగూడా మిగలకుండా చంపి తినేసినాడు" అని చెప్పినారు.

రాజుకి కోపం పెరిగిపోయింది. "అట్లాగా... ఐతే వాన్ని పట్టుకోని పోయి మన ఎద్దుల కొట్టంలో పడేయండ్రా" అన్నాడు. భటులు అలాగేనంటూ పొట్టోన్ని పట్టుకోని పోయి ఎద్దుల కొట్టంలో పడేసినారు. ఎద్దులంటే మామూలు ఎద్దులు కాదు. రాజుగారి ఎద్దులు. బాగా తినీ తినీ బలిసి కొవ్వెక్కి ఒక్కోటీ, ఒక్కో ఏనుగులాగున్నాయి. పొట్టోడు ఏ మాత్రం బెదరలేదు. వెంటనే కుడిచెవిలోని చిరుతపులిని పిల్చినాడు.

అంతే... చిరుతపులి గాండ్రిస్తా ఎగిరి ఎద్దుల మీదికి దుంకింది. పులిని చూస్తానే ఎద్దులన్నీ వురుకో వురుకు. పులి దాన్లెంబడి పడి దొరికిందాన్ని దొరికినట్లు చంపి తినేసింది. తర్వాత రోజు పొద్దున్నే భటులొచ్చి చూసినారు. చూస్తే ఇంకేముంది పొట్టోడు హాయిగా కిలకిలకిల నవ్వుతా కనబన్నాడు. భటులు వురుక్కుంటా రాజు దగ్గరికి పోయి "రాజా... రాజా... ఆ పొట్టోడు మన ఎద్దుల్ని గూడా చంపి తినేసినాడు" అని చెప్పినారు. రాజు ఆశ్చర్యపోయి "ఇట్లా కాదు గానీ... వాన్ని తీసుకోని పోయి మంటల్లో యేసి కాల్చండ్రా" అన్నాడు.

భటులు పొట్టోన్ని పట్టుకోని పోయి పెద్ద ఎండుగడ్డి వాము మీద పడేసి... గడ్డునూనె తెచ్చి వామంతా బాగా చల్లి నిప్పంటించినారు. అంతే... భగ్గున గడ్డంటుకోనింది. ఐనా పొట్టోడు ఏమీ భయపళ్ళేదు. ఒక్కసారిగా కడుపులో దాచిపెట్టుకున్న నీళ్ళన్నీ నెమ్మదిగా వదలసాగినాడు. మంటంతా ఆరిపోయింది. ఐనా నీళ్ళు వదలడం మాత్రం ఆపలేదు. వదుల్తానే వున్నాడు. దెబ్బకి ఇండ్లు, చెట్లు, పశువులు అన్నీ కొట్టుకుపోసాగినాయి. జనాలంతా వురుక్కుంటా రాజు దగ్గరికి పోయి "రాజా... రాజా... కాసేపాగితే రాజ్యమంతా మునిగి అందరూ చచ్చిపోయేట్టున్నారు. నీవే ఎట్లాగయినా మమ్మల్ని కాపాడాల" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు.

రాజుకి పొట్టోడు సామాన్యుడు కాదని అర్థమయిపోయింది. వురుక్కుంటా... పొట్టోని దగ్గరికి పోయి "తప్పయిపోయింది నన్ను క్షమించు. నా కూతురిని నీకిచ్చి పెండ్లి చేస్తా. నా రాజ్యాన్ని నాశనం చేయొద్దు" అని బతిమలాడాడు. అప్పుడు పొట్టోడు సరేనని నీళ్ళన్నీ వెనక్కు పీల్చేసుకున్నాడు. రాజు ఇచ్చిన మాట ప్రకారం పల్లకీ మీద పొట్టోన్ని ఎక్కించి మేళతాళాలతో రాజభవనానికి తీసుకొచ్చినాడు. తరువాత రోజు జనాలందరినీ పిలిచి భూదేవంత అరుగు, ఆకాశమంత పందిరీ వేసి ఏడేడు పధ్నాలుగు లోకాలు అదిరిపోయేటట్లు బ్రమ్మాండంగా పెండ్లి చేసినాడు.

# 2 కోటకొండ మొనగాడు

మన కర్నూలు జిల్లాలో కోటకొండ అని ఒకూరుంది. ఆ వూర్లో ఒక మొనగాడున్నాడు. వాడు ఆరడుగుల ఎత్తు, కండలుదీరిన ఒళ్ళు, మెలితిరిగిన మీసాలు, సింహంలాంటి గొంతుతో దేనికయినాసరే సయ్యంటే సయ్యంటూ అందరికన్నా ముందుండేటోడు. వానంత వీరుడు ఆ చుట్టుపక్కల వూర్లలో యాడాలేడని పేరు. అంతేగాదు వానికి చిన్నప్పటి నుండి అస్సలు భయమంటే ఏమిటో గూడా తెలీదు. అర్ధరాత్రి శ్మశానంలో ఒంటరిగా పండుకోమన్నా పండుకునేటోడు.

ఆ వూరికి పక్కనే మానపాడు అని మరొక వూరుంది. ఆ వూరిబైట మర్రిచెట్టు మీద ఒక దయ్యం వుంది. అది భలే అల్లరిది. రాత్రిపూట ఎవరయినా సరే ఆ దారెంబడి వచ్చినారంటే చాలు వాళ్ళ మీద బడి నానా అల్లరీ చేసేది. దాని దెబ్బకు బెదపడి జనాలు కిందా మీదా పడి వురుకులాడ్తా వుంటే పడీపడీ నవ్వుకునేది.

దాంతో చీకటిపడ్తే చాలు ఎవరయినా సరే...ఎంత పనున్నా సరే... చస్తేగూడా అటువైపు పోయేటోళ్ళు కాదు.

ఒకరోజు మన కోటకొండ మొనగాడు పనిబడి వాళ్ళత్తోళ్ళ వూరికి పోయినాడు. పనయిపోయేసరికి బాగా చీకటిపడింది. వాళ్ళత్తోళ్ళ వూరి నుండి తిరిగి కోటకొండకు రావాలంటే మధ్యలో మానపాడు దాటాల. వీనికి భయమంటే ఏమిటో తెలుస్తే గదా...బైలుదేరినాడు. అది చూసి వాళ్ళత్తామామా “అల్లుడూ... అల్లుడూ... మానపాడు దయ్యం మంచిదిగాదు. చూసిందంటే చాలు మీదపడి భయపడిస్తాది. రాత్రయిందంటే ఆ దారెంబడి ఎవరూ పోరు. నీవు గూడా ఈ రాత్రికి ఈన్నే పండుకోని రేప్పొద్దున్నే పో” అన్నారు. కానీ అట్లాంటి దాండ్లకు మనోడు బెదపడేరకం కాదు గదా... ఉత్త చేతుల్తో పులులను చంపేంత మొనగాడు వాడు. అందుకే వద్దు...వద్దంటున్నా వినకుండా కత్తి బొడ్డుకాడ దోపుకోని బైలు దేరినాడు.

వాడట్లా...ఆ చీకటిలో... ఒక్కడే... నడుస్తా... నడుస్తా... నెమ్మదిగా మానపాడు చేరుకున్నాడు. దూరంగా మర్రిచెట్టు కనబడింది. వాళ్ళత్తామామ చెప్పినేది గుర్తుకొచ్చి జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటా...అటూయిటూ గమనిస్తా పోసాగినాడు.

వాడు సరిగ్గా ఆ చెట్టు కిందకి వచ్చినాడో... లేదో... వీని సంగతి తెలీని ఆ దయ్యం పైనుండి “ఓ” అని అరుస్తా ఎగిరి వాని మీదకి దుంకింది. కానీ వాడు భయపడ్తేనా...ఉత్తచేతుల్తో పెద్దపులిని ఎదిరించినోడు... దయ్యమట్లా దుంకడం... దుంకడం... లటుక్కున దాని జుట్టు పట్టుకోని గిరగిరగిర తిప్పి నేలకేసి కొట్టి... ఛటుక్కున బొడ్లో నుండి కత్తి తీసి పరపరపర దాని జుట్టు కోసేసినాడు. ఆ జుట్టంటే దానికి చానా చానా ఇష్టం.

దాంతో అది లబోదిబోమని ఏడుస్తా వాని కాళ్ళు పట్టుకోని "పొరపాటయింది... ఇంగ జన్మలో మరలా ఎప్పుడూ మనుషుల జోలికి రాను... నా జుట్టు నాకియ్యి" అని వెంటపడింది.

వాడు ఆ జుట్టును బొడ్లో దోపుకోని "నా ఎంబడే వచ్చి...నేను చెప్పిన పనులన్నీ చెయ్యి...అప్పుడిస్తా" అన్నాడు. సరే అని అది వానెంబడే ఎవరూ బెదపడకుండా ఆడమనిషి వేషం వేసుకోని మానపాడు నుండి కోటకొండకు వచ్చేసింది.

ఆ కోటకొండ మొనగానికి పూరిబైట ఒక పెద్ద పొలముందిగానీ అది బీడుభూమి. చేనంతా రాళ్ళు, రప్పలు, పెద్దపెద్ద గుండ్లు, తిక్కతిక్క చెట్లూ వున్నాయి. వాడు ఆ దయ్యాన్ని పిలిచి "పో...పోయి... నా చేనంతా కన్నెగ శుభ్రం చేసిరాపో" అన్నాడు.

వాడట్లా చెప్పడమాలస్యం ఆ దయ్యం వురుక్కుంటా... వురుక్కుంటా... చేనుకాడికి పోయి... రాళ్ళూరప్పలూ... చెట్లూగిట్లూ అన్నీ శుభ్రంగా తీసి పడేసి... వురుక్కుంటా వచ్చి "నీవు చెప్పినట్లే నీ చేనంతా బాగుచేసినా... నా వెంట్రుకలు నాకియ్యి" అనడిగింది.

దానికి వాడు కాలు మీద కాలేసుకోని కూచోని చిరునవ్వు నవ్వుతా "చేను బాగు చేస్తే ఐపాయనా... నీళ్ళు కావద్దా... పో... పోయి... ఒక పెద్ద బావి తవ్విరాపో" అన్నాడు. వాడట్లా చెప్పడం ఆలస్యం ఆ దయ్యం వురుక్కుంటా చేనుకాడికి పోయి... ఏడు రాత్రులూ, ఏడు పగల్లూ కష్టపడి ఒక పెద్దబావి తవ్వి నీళ్ళు పడగానే వురుక్కుంటా వాని దగ్గరకొచ్చి "నీవు చెప్పినట్లే నీ చేనులో బావి తవ్వినా... ఇప్పుడన్నా నా వెంట్రుకలు నాకియ్యి" అనడిగింది.

దానికి వాడు కాలు మీద కాలేసుకోని కూచోని చిరునవ్వు నవ్వుతా "చేనంతా బాగు చేసి, బావి తవ్వితే ఐపాయనా... పొలమెవడు దున్నుతాడు" అన్నాడు. వాడట్లా అనడమాలస్యం ఆ దయ్యం వురుక్కుంటా చేనుకాడికి






పోయి...నాగలి ఎద్దులకు కట్టి... చేనంతా దున్ని... వురుక్కుంటా... వాని దగ్గరకొచ్చి "నీవు చెప్పినట్లే నీ చేనంతా చక్కగా దున్నినా... ఇప్పుడన్నా నా వెంట్రుకలు నాకియ్యి" అనడిగింది.

దానికి వాడు కాలు మీద కాలేసుకోని కూచోని చిరునవ్వు నవ్వుతా "చేను బాగు చేసి, బావి తవ్వి, దున్నితే ఐపాయనా...పొలంలో నాట్లెవడు ఏస్తాడు'' అన్నాడు. వాడట్లా అనడమాలస్యం ఆ దయ్యం విత్తనాల మూటలు భుజాన ఎత్తుకోని వురుక్కుంటా చేనుకాడికి పోయి చేనంతా బాగా నీళ్ళుగట్టి... భూమి బాగా తడి పీల్చినాక... విత్తనాలన్నీ నాటి వురుక్కుంటా మళ్ళా వాని దగ్గరకొచ్చి "నీవు చెప్పినట్లే నీ చేనంతా విత్తనాలు నాటినా... ఇప్పుడన్నా నా వెంట్రుకలు నాకియ్యి" అనడిగింది.

దానికి వాడు కాలు మీద కాలేసుకోని కూచోని చిరునవ్వు నవ్వుతా "చేను బాగు చేసి, బావి తవ్వి, దున్ని, నాట్లేస్తే ఐపాయనా...పంట ఎవడు పండిస్తాడు" అన్నాడు. వాడట్లా అనడమాలస్యం ఆ దయ్యం వురుక్కుంటా చేనుకాడికి పోయి... పంటకు అవసరమయినప్పుడల్లా ఎరువులేస్తా... నీరు పెడతా... పురుగుమందులు చల్లుతా... పశువులూ పక్షులూ వచ్చి తినిపోకుండా... రాత్రింబవళ్ళూ కాపలా కాసి ఆఖరికి బ్రమ్మాండంగా పంట పండినాక వురుక్కుంటా... వురుక్కుంటా... వాని దగ్గరకొచ్చి "నీవు చెప్పినట్లే నీ చేనులో బ్రమ్మాండంగా పంట పండించినా... ఇప్పుడన్నా నా వెంట్రుకలు నాకియ్యి" అనడిగింది.

దానికి వాడు కాలు మీద కాలేసుకోని చిరునవ్వు నవ్వుతా "చేను బాగు చేసి, బావి తవ్వి, దున్ని, నాట్లేసి, పంట పండిస్తే ఐపాయనా...కోసి కుప్ప చేసి ఇంటికెవడు తెచ్చిస్తాడు" అన్నాడు. వాడట్లా అనడమాలస్యం ఆ దయ్యం వురుక్కుంటా చేనుకాడికి పోయి... పంటనంతా కోసి, కుప్ప చేసి, బస్తాలకెత్తి ఇంటికి తెచ్చి "నీవు చెప్పినట్లే పంటంతా నీ ఇంటికి చేర్చినా... ఇప్పటికన్నా నా వెంట్రుకలు నాకియ్యి" అనడిగింది.

అప్పుడు వాడు దాని జుట్టు తీసుకోనొచ్చి "ఇంగోసారి గనుక... నీవు ఎక్కడయినా... ఎవరినయినా... ఏడిపించినట్లు తెలిసిందనుకో... జాగ్రత్త... ఈసారి నీ జుట్టు కత్తిరించడంగాదు. ఏకంగా నీ మెడనే కత్తిరిస్తా ఏమనుకుంటా వున్నావో" అని బెదపడిచ్చి దాని జుట్టు దాని చేతిలో పెట్టేసినాడు. అంతే... ఆ దయ్యం ఆ జుట్టును తీసుకోవడమాలస్యం మరలా ఆ చుట్టుపక్కల కనబడకుండా కిందామీదా పడతా పారిపోయింది.

# 3 ఎల్లిగాడు - మల్లిగాడు

ఒకామెకు ఎల్లిగాడు  మల్లిగాడు అని ఇద్దరు కొడుకులుండేటోళ్ళు. వాళ్ళిద్దరూ కవల పిల్లలు. కవల పిల్లలంటే తెలుసు గదా... చూడ్డానికి ఇద్దరూ అచ్చం ఒకేలా వుంటారన్నమాట. ఎల్లిగాడెవడో, మల్లిగాడెవడో వాళ్ళు చెప్తేగానీ తెలుసుకోలేం. కాకపోతే ఎల్లిగాడు చానా చానా అమాయకుడు. కానీ మల్లిగాడట్లా కాదు బాగా తెలివైనోడు.

ఇద్దరూ పెరిగి పెద్దగైనారు. పెద్దగైనాక్కూడా తల్లి మీదే పడి తింటే మర్యాదేముంటాది. అందుకని ఏదైనా పనెతుక్కోని తమ కాళ్ళ మీద తాము నిలబడాలనుకున్నారు.

మల్లిగాడు వున్న వూర్లోనే సేద్యం చేయడం మొదలుపెట్టినాడు. ఎల్లిగాడు పక్కూర్లో ఒక శెట్టి దగ్గరకు పోయినాడు. ఆ శెట్టి పెద్ద పిసినారి. అంతేగాదు పెద్ద టక్కరోడు. వాడు ఎల్లిగాని అమాయకత్వాన్ని చూసి "చూడు. నా దగ్గర పనిస్తా... కానీ మధ్యలో మానేయగూడదు. ఖచ్చితంగా చేయాల. మధ్యలో మానేసినావనుకో... నాకు కోడిగుడ్డంత బంగారమియ్యాల. అదే నేను నిన్ను పనిలోనించి తీసేశాననుకో. నేను నీకు కోడిగుడ్డంత బంగారమిస్తా. ఈ ఒప్పందం నీకిష్టమైతే చేరు. లేదంటే లేదు" అన్నాడు. ఎల్లిగానికి శెట్టి నక్కజిత్తులు తెలియవు గదా. అందుకే అమాయకంగా సరేనంటూ పనిలో చేరిపోయినాడు.

అంతే... ఆరోజు నుండీ శెట్టి వాన్ని రాత్రీపగలూ ఒకటే పని చేయించుకుంటా తెగ సతాయించేటోడు. శెట్టికి ఒక పెద్ద అంగడుంది. రోజూ ఎల్లిగాన్ని పిల్చి "రేయ్... సామానంతా బైటేసి శుభ్రం చెయ్" అనేటోడు. "రోజూ ఎందుకయ్యా" అని ఎల్లిగాడంటే చాలు. గయ్యిమని మీదకొస్తూ "నీకిష్టమైతే చేయ్... లేకపోతే మానెయ్" అనేటోడు. పాపం ఎల్లిగాడు నోర్మూసుకోని ప్రతిరోజూ సామాన్లన్నీ బైటపెట్టి శుభ్రం చేసి మళ్ళా అన్నీ లోపల పెట్టేటోడు. శెట్టి ఎల్లిగాన్ని పిల్చుకోని రోజూ తోటకు తీసుకోని పోయేటోడు. బావి పక్కనే ఒక పెద్ద కడవ వుండేది. దాన్నిండా నీళ్ళు తోడమనేటోడు. ఎల్లిగాడు ఎన్ని నీళ్ళు పోసినా అది నిండేది గాదు. ఎందుకంటే దానడుగున శెట్టి ఒక పెద్ద బొక్క పెట్టినాడు. దాంతో పోసిన నీళ్ళు పోసినట్టు కారిపోయేవి. వీడమాయకుడు గదా, వానికి నీళ్ళేమైపోతున్నాయో అర్థమయ్యేది గాదు. శెట్టి తోటంతా బాగా తడిసినాక "సరే... సరే... ఇంక చాల్లే, బానగూడా నింపలేవు. రేపు నింపుదువుగానీ పద" అంటూ పిల్చుకోని పోయేటోడు. అలా ప్రతిరోజూ తోటంతా నీళ్ళు పెట్టిచ్చుకొనేటోడు. పాపం కడవలకు కడవలు నీళ్ళు తోడీతోడీ వాని చేతులు పీక్కుపోయేవి.

శెట్టికి ఒక చిన్నపిల్ల వుండేది. శెట్టి పెళ్ళాం ఎల్లిగాన్ని పిల్చి దాన్నెత్తుకోమని ఇచ్చేది. ఎల్లిగాడు ఆ పిల్లను సంకనేసుకోని తిరిగేటోడు. ఎప్పుడన్నా చేతులు నొప్పి పుట్టి కాస్త దించితే చాలు... అది కెవ్వుమని ఏడ్చేది. అంతే...నోటికొచ్చినట్లల్లా శెట్టి, శెట్టి పెళ్ళాం తిట్టేటోళ్ళు. దాంతో పాపం వాడు సంకలు ఎంత నెప్పిపెడ్తావున్నా ముక్కుతా, మూల్గుతా అట్లాగే దాన్ని ఎత్తుకోని తిరిగేటోడు.

ఇంతపని చేపించుకుంటున్నారు గదా... కనీసం అన్నమన్నా బాగా పెడ్తారా అంటే అదీ లేదు. సంగటి, గంజి, మిగిలిపోయిన, పాచిపోయిన అన్నం, కూరలు పెట్టేటోళ్ళు. పాపం... అవి తినలేక వాడు సగానికి సగం చిక్కిపోయినాడు. ఒక నెలరోజులు గడిచేసరికి వానికి బతుకు మీదనే విరక్తి వచ్చింది. పని చేయలేకపోయినాడు. మానేద్దామా అంటే ఒప్పందం ప్రకారం కోడిగుడ్డంత బంగారమియ్యాల గదా దాంతో వానికేం చేయాలో తోచలేదు.

ఒకరోజు అర్ధరాత్రి అందరూ నిద్రపోగానే చెప్పాపెట్టకుండా వాళ్ళూరికి చేరుకున్నాడు. మల్లిగాని దగ్గర కూచోని కళ్ళనిండా నీళ్ళు కారిపోతా వుంటే శెట్టి పెడతావున్న బాధలన్నీ చెప్పుకోని భోరున ఏడ్చినాడు. మల్లిగాడు బాగా ఆలోచించి "రేయ్... నువ్వూ నేను అచ్చం ఒకేలా వుంటాం గదా. నీవు మట్టసంగా ఈన్నే వుండు. నేను పోతా శెట్టి దగ్గరికి. ముందు ముందు ఏం జరుగుతాదో నువ్వే చూద్దువుగానీ" అంటూ రాత్రికి రాత్రే ఎల్లిగాని బదులు శెట్టింటికి పోయి ఏమీ ఎరుగని అమాయకునిలా మట్టసంగా అక్కన్నే పండుకొన్నాడు.

శెట్టికి ఇదంతా తెలియదు గదా... పొద్దున్నే ఎప్పట్లాగే వాన్ని పిల్చి "రేయ్...సామాన్లన్నీ బైటేసి శుభ్రం చేయ్" అని చెప్పి వెళ్ళిపోయినాడు. కాసేపటికి వచ్చి చూస్తే ఇంగేముంది. కుండలన్నీ అంగడి ముందు పగిలిపోయి కనబడినాయి. ఇనుప సామాన్లన్నీ లొక్కులు పోయినాయి. ధాన్యమంతా రోడ్డు మీద పడి వుంది. వాడదిరిపడి లబోదిబోమని అరుచుకుంటా "రేయ్... ఏందిరా ఇదంతా" అంటూ వురుక్కుంటా లోపలికొచ్చినాడు. మల్లిగాడు వినయంగా చేతులు కట్టుకోని "మీరే గదయ్యా. సామానంతా బైటేసి శుభ్రం చేయ్ అన్నారు. అందుకే ముందు అన్నీ బైటేస్తున్నా... ఆ తర్వాత శుభ్రం చేస్తా" అన్నాడు. దానికి శెట్టి "అట్లాగేనా విసిరిసిరి పాడేసేది. నెమ్మదిగా పెట్టొద్దా" అంటూ మండిపడినాడు. అప్పుడు మల్లిగాడు కోపంగా "మీరెట్లా చెప్తే అట్లా చెయ్యడమే నా పని. నెమ్మదిగా పెట్టాలని ముందే చెప్పాల గదా" అన్నాడు. శెట్టి గొణుక్కుంటా అన్నీ ఏరుకోనొచ్చి లోపల పెట్టుకున్నాడు.

తర్వాత వాన్ని పిల్చి "రేయ్... తోటకాడికి పోయి బాన నిండా నీళ్ళు నింపిరాపో" అన్నాడు. మల్లిగాడు సరేనని పోయి రెండు బిందెల నీళ్ళు పోసినాడు. పోసిన నీళ్ళు పోసినట్టు మాయమయినాయి. ఇదేందబ్బా ఇట్లా మాయమవుతున్నాయని బాన ఎత్తి చూసినాడు. చూస్తే ఇంగేముంది... కింద అరచేయంత బొక్క కనబడింది. "ఓహో... ఇదన్నమాట సంగతి" అని మైనం తీస్కోనొచ్చి ఆ బొక్క బూడ్చి నిండా నీళ్ళు నింపి ఇంటికి పోయినాడు. వాన్ని చూసి శెట్టి "ఏందిరా ఇప్పుడైతే పోతివి. అప్పడే వచ్చేస్తివి" అన్నాడు. దానికి వాడు నవ్వి "ఏముందయ్యా. బాన నిండింది. అందుకే వచ్చేసినా" అన్నాడు. శెట్టి వురుకులు పరుగుల మీద పోయి చూస్తే ఇంకేముంది బాన నిండా నీళ్ళు కనబన్నాయి.

మల్లిగాడు హాయిగా ఈలేసుకుంటా కూచోగానే శెట్టి పెళ్ళాం వాన్ని పిల్చి "రేయ్. దీన్ని ఎత్తుకోని తిప్పుకోని రాపో..." అంటూ పిల్లను చేతికిచ్చింది. వాడు ఎత్తుకోని పక్కకు తీస్కోని పోయి ఎవరూ చూడకుండా దాని పిర్ర మీద గట్టిగా ఒక్క గిచ్చు గిచ్చినాడు. అంతే అది లబోదిబోమని ఏడ్చడం మొదలుపెట్టింది. వాడు పిల్లను తీస్కోని పోయి "అమ్మగారూ... ఇది ఏడుస్తా వుందండీ" అంటూ తిరిగి శెట్టి పెళ్ళానికి ఇచ్చేసినాడు. ఆరోజు నుండి

ప్రతిసారీ పిల్లనివ్వడం ఆలస్యం దాన్ని గట్టిగా ఒక్క గిచ్చు గిచ్చేటోడు. అంతే అది "ఓ" అని ఏడుపందుకొనేది. ఇంకేముంది కొంతకాలానికి పాపమా పిల్ల వాన్ని చూస్తే చాలు భయంతో వణికిపోయేది. వాడు ఎత్తుకోడానికి చేతులు చాపడం ఆలస్యం కెవ్వుమని ఏడుస్తా వాళ్ళమ్మను గట్టిగా కర్చుకునేది. అది ఎందుకలా ఏడుస్తా వుందో తెలీక శెట్టి పెళ్ళాం గొణుక్కుంటా తానే ఎత్తుకోని తిరగసాగింది.

దాంతో... మల్లిగాడు పనీపాటా లేకుండా దర్జాగా తిరగడం మొదలుపెట్టినాడు. శెట్టికి వానికేం పని చెప్పాలన్నా భయం పట్టుకోనింది. ఏదో ఒకటి పగలగొట్టేటోడు. దాంతో వాన్నెలా వదిలించుకోవాలా అని ఆలోచించసాగినాడు. పోనీ పని మానెయ్యమందామా అంటే ఒప్పందం ప్రకారం కోడిగుడ్డంత బంగారమియ్యాల గదా అది వానికిష్టం లేదు.

ఒకరోజు శెట్టి పెళ్ళాం శెట్టిని పిల్చి "వాన్ని మా నాయనోళ్ళ వూరికి తీస్కోని పోయి ఆడ కొన్నిరోజులు పనికి పెట్టు. వాళ్ళయితే వీనికి బాగా బుద్ధి చెబుతారు" అనింది. శెట్టి సరేనన్నాడు.

తర్వాత రోజు పొద్దున్నే శెట్టి మల్లిగాన్ని పిల్చి "రేయ్.... మనం మా అత్తోళ్ళ వూరికి పోవాల, బైలుదేరు" అన్నాడు. మల్లిగాడు సరేనన్నాడు. శెట్టి పెళ్ళాం ఇద్దరికీ వేరు వేరు మూటల్లో అన్నం కట్టిచ్చింది. శెట్టి దాంట్లోనేమో బాగా బచ్చాలూ, లడ్లూ, కర్జికాయలూ పెట్టి, మల్లిగాని దాంట్లోనేమో సంగటి, ఎందుకారం పెట్టి "రేయ్. ఇది నీకు, ఇది మీ అయ్యగారికి" అని చెప్పి ఇచ్చింది. సరేనని ఇద్దరూ బైలుదేరినారు. అప్పట్లో బస్సులు, రైళ్ళూ లేవు గదా. యాడికి పోవాలన్నా నడచి పోవాల్సిందే.

ఇద్దరూ నెమ్మదిగా నడుచుకుంటా పోసాగినారు. అట్లా రెండు గంటలు నడిచేసరికి శెట్టికి పొద్దున తిన్నదంతా అరిగిపోయి ఆకలి కావడం మొదలుపెట్టింది. దాంతో ఒకచోట "రేయ్... నాకు బాగా ఆకలవుతా వుంది. పోయి ఆ నది దగ్గర మొగం కడుక్కోనొస్తా. తిని పోదాం" అని చెప్పి మొగం కడుక్కోడానికి పోయినాడు. శెట్టి అట్లా పోయినాడో లేదో వెంటనే మల్లిగాడు గబగబా శెట్టి మూట విప్పి అందులోని లడ్లు, భక్షాలు, కర్జికాయలు అన్నీ లొట్టలేసుకుంటా నున్నగా తినేసినాడు. తన మూట విప్పి అందులోని సంగటి, ఎందుకారం శెట్టి మూటలో పెట్టి



కట్టేసి ఏమీ ఎరుగని అమాయకునిలా మట్టసంగా కూచున్నాడు. శెట్టి శుభ్రంగా కాళ్ళూ చేతులూ కడుక్కోని రాగానే "ఏందయ్యగారూ. అమ్మగారు సంగటీ, గొడ్డుకారం పెట్టింది. తినలేక చచ్చిపోయినాననుకో. ఇంతకూ నీకేం పెట్టింది" అన్నాడు. శెట్టి తన మూట విప్పినాడు. మల్లిగాడు దాంట్లోకి తొంగి చూసి "అరెరే. నీక్కూడా సంగటీ కారమేనా, నీకు మంచివి పెట్టి నాకు పాడువి పెట్టిందనుకున్నా... అమ్మగారెంత మంచిది. ఇద్దరికీ ఒకే రకంగా పెట్టింది" అన్నాడు.

శెట్టికి సంగటి, కారాన్ని చూస్తానే పై ప్రాణాలు పైన్నే పోయినాయి. ఏం మాట్లాడాల్నో అర్థం కాలేదు. వాటిని చూస్తా వుంటే భయమేయసాగింది. ఎందుకంటే పుట్టి బుద్ధి ఎరిగినప్పన్నించీ ఎప్పుడూ సంగటీ కారం తినలేదు. కానీ కడుపులోనేమో ఆకలి దంచేస్తా వుంది. దాంతో లోలోన గొణుక్కుంటా ఒక్కొక్క ముద్దా బలవంతంగా మింగసాగినాడు. కారం దెబ్బకు కళ్ళలో నీళ్ళు తిరిగినాయి. కొంచెం గూడా తినలేక చేయి కడిగేసుకున్నాడు. మళ్ళా ఇద్దరూ నడవడం మొదలు పెట్టినారు.

అట్లా... కాస్త దూరం నడిచేసరికి శెట్టికి నీరసమొచ్చేసింది. సరిగ్గా తినలేదు గదా. దాంతో ఆకలెక్కువైంది. మల్లిగాన్ని పిల్చి "రేయ్...నేను నడవలేకుంటున్నా. నువ్వు వురుక్కుంటా పోయి మా అత్తోళ్ళకు మంచి భోజనం వండి నేనొస్తూనే పెట్టమని చెప్పు, నేను నెమ్మదిగా వస్తా" అన్నాడు. మల్లిగాడు సరేనని వురుక్కుంటా పోయి శెట్టి వాళ్ళ వూరికి చేరుకున్నాడు.

వాడు శెట్టి అత్తోళ్ళింటికి పోయి "నన్ను నీ కూతురు పంపిచ్చింది. నీ అల్లుడు వెనుకే వస్తా వున్నాడు. అల్లుడొస్తున్నాడు గదా అని మీరు మంచి మంచి పిండి వంటలు చేసి పెట్టేరు. ఈ మధ్యే నీ అల్లునికి పచ్చకామెర్ల రోగమొచ్చింది. నెల రోజులు పత్యముండాలంట. సంగటి, పచ్చికారం తప్ప ఏమీ తినగూడదని వైద్యుడు చెప్పినాడంట. జాగ్రత్త" అని చెప్పినాడు. వాళ్ళు నిజమే అనుకోని "సరే" అన్నారు.

శెట్టి నెమ్మదిగా నడుచుకుంటా వచ్చేసరికి మధ్యాన్నమైంది. కడుపులో సలసలసల కాగిపోతా వుంది. అందరూ భోజనాలకు కూచున్నారు. శెట్టి అత్త అందరికీ పిండి వంటలు పెట్టింది. అల్లునికి మాత్రం సంగటీ, పచ్చికారం పెట్టింది. వాటిని చూస్తానే శెట్టి అదిరిపోయినాడు. చుట్టూ వున్నోళ్ళంతా లొట్టలేసుకుంటా ఆవురావురని తింటా వున్నారు. వాటిని చూస్తే శెట్టికి నోట్లో నీళ్ళూరసాగినాయి. కానీ అడిగితే అందరూ ఏమనుకుంటారో ఏమో అనుకోని ఆకలికి తట్టుకోలేక ఆ సంగటీ, పచ్చికారమే తిన్నాడు. ఎప్పుడూ అలవాటు లేదుగదా. అందుకే అది తిన్న కాసేపటికి శెట్టి కడుపులో గుడగుడమనసాగింది. చెంబు పట్టుకోని వూరి చివరన వున్న చెరువు కాడికి పోయొచ్చినాడు. వచ్చిన కాసేపటికే మళ్ళా గుడగుడమనింది. శెట్టి మళ్ళా పోయొచ్చినాడు. రాత్రయింది. మళ్ళా మామూలే. అత్త అందరికీ పిండి వంటలు పెట్టి అల్లునికి మాత్రం సంగటీ, కారమే పెట్టింది. అత్త అట్లా ఎందుకు చేస్తా వుందో అర్థంగాక... కక్కలేక మింగలేక పాపం శెట్టి మళ్ళా అవే తిన్నాడు.

రాత్రి అందరూ ఆరుబైట మంచాలేసుకొని పండుకొన్నారు. శెట్టికేమో కడుపులో గుడగుడలాడసాగింది. చుట్టూ చీకటి. భయమేసింది. నెమ్మదిగా మల్లిగాన్ని లేపి "రేయ్... కడుపులో గుడగుడమంటోంది. పోయి చెంబు తాపో... చెరువుకాడికి పోయొద్దాం" అన్నాడు.

మల్లిగాడు అటూ ఇటూ చూసి "అయ్యగారూ...ఈ రాత్రిపూట చెరువుకాడికి మాటిమాటికీ ఎన్నిసార్లని పోతావు. అసలే అమావాస్య. పాములూ, తేళ్ళూ తిరుగుతా వుంటాయ్. తొక్కినావంటే అంతే" అని భయపడిచ్చినాడు.

శెట్టి కడుపు పట్టుకోని "మరెట్లరా" అన్నాడు. దానికి మల్లిగాడు "అందరూ హాయిగా గురుకలు పెట్టి నిద్రపోతా వున్నారు. మీద బండ పన్నా లేసేటట్లు లేరు. నేనొక కుండ తెచ్చి పెడ్తా. మీకు గుడగుడమన్నప్పుడల్లా అందులో కూచోండి. తెల్లారక ముందే చీకట్లో నన్ను లేప్తే నేను దాన్ని తీస్కోనిపోయి దూరంగా పడేసొస్తా" అన్నాడు. శెట్టి "సరే" అన్నాడు. మల్లిగాడు ఒక కుండ తెచ్చి శెట్టి మంచం దగ్గర పెట్టి నిద్రపోయినాడు. శెట్టికి రాత్రంతా కడుపు గుడగుడమంటానే వుంది. దాంతో నెమ్మదిగా కుండ నిండిపోయింది.

పొద్దున్నే నాలుగైంది. ఇంకో గంట దాటితే ఒకొక్కరే లేవడం మొదలుపెడ్తారు. శెట్టి నెమ్మదిగా మల్లిగాని దగ్గరకు పోయి "రేయ్...లేవరా... తెల్లవారుతోంది. కుండ పాడేసి రాపో" అన్నాడు. మల్లిగాడు ఏమీ వినబడనట్లు అట్లాగే పండుకున్నాడు. శెట్టి ఎన్నిసార్లు తట్టినా వులకలేదు, పలకలేదు... శెట్టికి ఏం చేయాల్నో అర్థం కాలేదు. పొద్దున్నే అత్తామామా, బావమరుదులు చూస్తే ఇంగేమన్నా వుందా? పరువు పోతాది. దాంతో ఇక లాభం లేదనుకోని పారేసి రావడానికి కుండ తీసుకోని అడుగులో అడుగేసుకుంటా నెమ్మదిగా ఇల్లు దాటినాడు.

శెట్టి అట్లా బైటకి పోయినాడో లేదో మల్లిగాడు టక్కున నిద్రలేసినాడు. వురుక్కుంటా పోయి అత్తామామలను, బావమరుదులను గబగబా లేపి "మీరు మీ అల్లునికి నిన్న సరిగా మర్యాద చేయలేదంట. అలిగినాడు. అందుకే పొద్దున్నే ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్ళిపోతా వున్నాడు" అన్నాడు. వాళ్ళు నిజమా కాదా అని లేచి వచ్చి చూస్తే ఇంగేముంది శెట్టి మంచమ్మీద లేడు. గబగబా బైటకొచ్చి చూస్తే దూరంగా పోతా కనబన్నాడు.

"అల్లుడూ కాస్త ఆగు" అంటూ గట్టిగా అరచినారు. ఆ అరుపు విని శెట్టి అదిరిపడినాడు. చేతిలో కుండ చూస్తే ఇంకేమన్నా వుందా? మర్యాద పోతాది గదా, అందుకని వాళ్ళ అరుపులు విననట్టే నటిస్తూ బెరబెరా నడవడం మొదలుపెట్టినాడు. అది చూసి అత్తామామా అల్లుడు నిజంగానే అలిగి పోతున్నాడనుకొని అల్లున్ని వెనక్కు పిల్చుకోని రావడం కోసం "ఆగల్లుడూ.. ఆగల్లుడూ.." అనరుస్తా వెంట పడినారు.

అంతే... అది చూసి శెట్టి అదిరిపడి వాళ్ళకు దొరకగూడదని తాను కూడా వురకడం మొదలు పెట్టినాడు. శెట్టి వెనుకే అత్తామామా, బావమరుదులూ అందరూ ఆగాగని అరుస్తా వురకడం మొదలుపెట్టినారు. శెట్టి గసబెడతా ముళ్ళ మీదా, దిబ్బల మీదా అడ్డం పడి వురకసాగినాడు. అంతలో ఎదురుగా ఒక పెద్ద బోటురాయి అడ్డం వచ్చింది. శెట్టి దాన్ని చూసుకోలేదు. అంతే అది కాలికి తగిలి దభీమని ఎగిరి బోర్లబొక్కలా పడిపోయినాడు. చేతిలోని కుండ గూడా ఎగిరి కిందపడి ఫెటిళ్ళని పగిలిపోయింది. అంతే అందులో వున్నదంతా వాని ఒళ్ళంతా చిట్లింది. ఆడికి వురుక్కుంటా వచ్చిన అత్తామామా ఆ కంపుకు ముక్కు మూసుకున్నారు. బావమరిది మొగమంతా వికారంగా పెట్టి "ఏంది బావా... ఇదంతా" అన్నాడు. శెట్టి నెత్తీనోరూ కొట్టుకుంటా మల్లిగాని వల్ల తాను పడిన బాధలన్నీ కళ్ళనీళ్ళుబెట్టుకోని ఏడ్చుకుంటా చెప్పినాడు.

అదంతా విని "కోడిగుడ్డంత బంగారం కోసం ఎందుకు నీకీ తిప్పలు. ఇట్లాగే వుంటే ముందు ముందు వాడు నిన్ను ఇంగెన్ని బాధలు పెడ్తాడో ఏమో... ముందు వాన్ని వెంటనే పని మాన్పించు" అన్నారు. శెట్టి సరేనని మల్లిగాన్ని పని మాన్పించి ఒప్పందం ప్రకారం కోడిగుడ్డంత బంగారం వాని చేతిలో పెట్టి పంపేసినాడు.

మల్లిగాడు హాయిగా నవ్వుకుంటా దాన్ని తీస్కోని వాళ్ళూరికి పోయి ఎల్లిగాని చేతిలో పెట్టినాడు.

# 4 రింగురుబిళ్ళ

ఒకూర్లో ఒక పిల్లోడుండేటోడు. వానికి చిన్నప్పుడే అమ్మానాన్నా చచ్చిపోయినారు. దాంతో తల్లీదండ్రీ లేని పిల్లోడు గదా అని వాళ్ళవ్వ వాన్ని ప్రేమగా, గారాబంగా పెంచింది. వాడు ఏమడిగితే అది ఇట్లా అడగడం ఆలస్యం అట్లా కొనిచ్చేది. రోజుకోరకం తినుబండారాలు చేసి పెట్టేది. దాంతో వాడు అవన్నీ తినీ తినీ బాగా లావెక్కినాడు.

ఒకరోజు పొద్దున్నే అవ్వ వానికి తలస్నానం చేపిచ్చి, కొత్త బట్టలేపిచ్చి, సుబ్బరంగ తల దువ్వి, చక్కగా పాపిడిదీసి, నుదుట కుంకుమ బొట్టు పెట్టి, పలకా బలపం చేతికిచ్చి 'ఒరే నాయనా... నువ్వు బాగా సదువుకోని పెద్ద వైద్యునివి కావాలరా" అని దీవించి బడిలో చేర్పించింది.


వాడు బాగా లావు గదా... దాంతో బళ్ళో పిల్లోల్లందరూ వాన్ని చూస్తానే "ఏయ్ దుబ్బోడొచ్చు... ఏయ్ దుబ్బోడొచ్చు" అంటా ఒగటే ఎగతాళి చేయసాగినారు. అట్లా వూరికెనే ఎవరయినా మనల్ని ఎక్కిరిస్తా మనకేడుపు వస్తాది గదా... పాపం వానికి గూడా బాధేసి కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా మట్టసంగా ఇంటికి తిరిగి వచ్చేసినాడు.

అవ్వ వాన్ని దగ్గరికి తీసుకోని బుజ్జగిస్తా "ఏరా ఎందుకట్లా వెక్కివెక్కి ఏడుస్తా వున్నావ్... ఏంది నీ బాధ" అనడిగింది. దానికి వాడు కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే తుడుచుకుంటా "అవ్వా... అవ్వా... నేనింక ఆ బడికి పోనే... అందరూ దుబ్బోడు... దుబ్బోడని వూకూకెనే ఎక్కిరిస్తా వున్నారే" అన్నాడు. అవ్వ చీరచెంగుతో వాని కండ్లనీళ్ళు తుడుస్తా "ఈసారి నిన్నెవరయినా అట్లా అంటే వెంటనే రింగురుబిళ్ళ అను... ఏం జరుగుతా వుందో నువ్వే చూద్దువు గానీ" అనింది.

సరేనని వాడు పలకాబలపం తీసుకోని మళ్ళా బడికి పోయినాడు. వాన్ని చూస్తానే పిల్లలందరూ కిందామీదాపడి నవ్వుతా "రేయ్... దుబ్బోడు మళ్ళా బడికొచ్చినాడ్రోయ్... మీమీ సద్దన్నం మూటలు జాగ్రత్తరోయ్" అంటా ఒగటే ఎగతాళి చేయసాగినారు. వాళ్ళట్లా ఎగతాళి చేస్తా వుంటే వాని కండ్లల్లో నీళ్ళు తిరిగినాయ్. అంతలో వానికి అవ్వ చెప్పినేది గుర్తుకొచ్చింది. వెంటనే అందరినీ కోపంగా చూస్తా 'మీకందరికీ రింగురుబిళ్ళ" అని గట్టిగా ఒక్కరుపు అరిచినాడు.

అంతే... యాడున్నోళ్ళు ఆపూకప దభీమని కిందపడి చచ్చిపోయినారు.

కాసేపటికి వాళ్ళ అయ్యవారు పాఠం చెప్పడానికి బడిలోకి వచ్చినాడు. వచ్చి చూస్తే ఇంగేముంది... వీడు తప్ప అందరూ చచ్చిపడున్నారు. "ఏందిరా... ఏమయిందిరా వీళ్ళకి... అందరూ ఇట్లా చచ్చిపడున్నారు" అని



అడిగినాడు. వాడు జరిగిందంతా చెప్పినాడు. దాంతో అయ్యోరుకి కోపమొచ్చి కట్టె తీసుకోని “యెంత పని చేసినావురా దుబ్బోడా... వుండు నీ పని చెబ్తా’ అంటూ కిందా మీదా యేసి కొట్టినాడు. అయ్యోరు గూడా దుబ్బోడంటూ కొట్టేసరికి వానికి చానా కోపమొచ్చేసి ‘అయ్యోరుకి ఠింగురుబిళ్ళ’ అన్నాడు.

అంతే... అయ్యోరు కుర్చీ మీద నుండి దభీమని కిందపడి చచ్చిపోయినాడు.

బళ్ళో పిల్లోలెవరూ లేరు. అయ్యోరుగూడా లేదు.  ఇంక ఆడ కూచోని ఏం చేయాల. దాంతో వాడు తిరిగి ఇంటికొచ్చేసినాడు. అంత తొందరగా తిరిగొచ్చిన మనవన్ని చూసి అవ్వ కోపంగా “ఏరా... నీకేం పోయేకాలమొచ్చిందిరా... బడికి పోయి అయిదు నిమిషాలు గూడా కాలేదు... అప్పుడే సంచెత్తుకోని తిరిగొచ్చేసినావ్. తినీ తినీ నీకు ఒళ్ళు పెరిగిందేగానీ బుద్ధి పెరగలేదు... దుబ్బనాయాలా” అని తిట్టింది. అవ్వగూడా తనని దుబ్బోడని తిట్టేసరికి వానికి చానా కోపమొచ్చేసింది. వెంటనే “అవ్వకి ఠింగురుబిళ్ళ” అన్నాడు.

అంతే... అవ్వ వున్నదున్నట్లు ఠపీమని కిందపడి చచ్చిపోయింది.

ఒక్కడే ఇంట్లో కూచోలేక చానాసేపు అటూ యిటూ తిరిగినాడు. కాసేపటికి ఆకలైంది. తినడానికి ఇంట్లో ఏమీ లేదు. చెయ్యడానికి అవ్వగూడా లేదు. ఆడుకుందామా అంటే పిల్లోలెవరూ లేరు. బడికి పోదామా అంటే సారు లేదు. దాంతో వానికి ఏం చేయాల్నో అర్థం కాలేదు. దిగులుగా కూచున్నాడు. అంతలో ఎదురుగా అద్దం కనబడింది. దాంట్లోకి తొంగి చూసినాడు. వాని బొమ్మ వానికే లావుగా వెక్కిరిస్తున్నట్లుగా కనబడింది. వెంటనే కోపంగా అద్దంలోకి వేలు చూపిస్తా “నీకు ఠింగురుబిళ్ళ” అన్నాడు.

అంతే... పాపం... వాడు గూడా కిందపడి చచ్చిపోయినాడు.

# 5 ఎవరు గొప్ప

ఒకూర్లో రామయ్యని ఒకడుండేటోడు. వానికో రోజు ఈ లోకంలో అందరికన్నా ఎవరు గొప్ప అని ఒక అనుమానమొచ్చింది. అనుమానమొచ్చినాక తీర్చుకోవాల గదా... దాంతో ఎట్లా తెలుసుకోవాలబ్బా అని కనపన్న ప్రతొక్కరినీ అడగడం మొదలు పెట్టినాడు. కానీ ఎవరినడిగినా " నాకు తెలీదంటే... నాకు తెలీదు" అనేటోళ్ళే గానీ సమాధానం చెప్పేటోళ్ళు కరువయినారు.

ఒకరోజు వాళ్ళూరికి ఒక సాధువు వచ్చినాడు. రామయ్య వురుక్కుంటా ఆ సాధువు కాడికి పోయి "సామీ... సామీ... ఈ లోకంలో అందరికన్నా గొప్పెవరూ" అని అడిగినాడు. దానికా సాధువు చిరునవ్వు నవ్వి జోలెలోంచి ఒక చిన్న దేముని విగ్రహం తీసి రామయ్యకిచ్చి "చూడు రామయ్యా... ఈ లోకంలో దేముని కంటే గొప్పోడు ఎవడూ లేడు... తీస్కోని పోయి ఈ బొమ్మకు పూజ చేసుకోపో" అన్నాడు.

రామయ్య అప్పటినుండీ రోజూ దేముని బొమ్మకు పూజ చేసి, ప్రసాదం పెట్టి ఆ తర్వాత తాను తినేటోడు. ఒక రోజు ఎప్పటిలాగే ప్రసాదం పెట్టి వెనక్కు తిరగ్గానే దభీమని చప్పుడొచ్చింది. "ఏమైందబ్బా" అని తిరిగి చూస్తే ఇంకేముంది... ఒక ఎలుక దేముని బొమ్మను కింద పడేసి ప్రసాదం తింటా వుంది. అది చూసిన రామయ్య "అరెరే... ఇన్ని రోజులూ దేముడే గొప్పోడనుకోని అనవసరంగా పూజ చేస్తి. కానీ ఆ దేముడేం గొప్పోడు. ఆ దేమున్నే కింద పడేసిన ఈ ఎలుకనే నిజంగా గొప్పది" అనుకోని ఆ రోజు నుండీ ఎలుకకు పూజ చేస్తా ప్రసాదం పెట్టడం మొదలుపెట్టినాడు.

ఒకరోజు ఎలుకకు ప్రసాదం పెట్టి పూజ చేస్తా వుంటే ఆ ఎలుకను చూసిన ఒక పిల్లి "అబ్బ... ఎన్నాళ్ళకు దొరికిందిది" అనుకుంటా దాన్ని పట్టుకోని గుటుక్కుమనిపిద్దామని ఒక్క దుంకు దుంకింది. అంతే... పిల్లిని చూసిన ఎలుక అదిరిపడి కీసుకీసుమనుకుంటా దానికి దొరక్కుండా సర్రున పారిపోయింది. అది చూసిన రామయ్య " అరెరే... ఇన్ని రోజులూ ఎలుకే గొప్పదనుకోని అనవసరంగా పూజ చేస్తి... కానీ ఈ ఎలుకేం గొప్పది... దీన్ని వురికిచ్చిన పిల్లే నిజంగా గొప్పది" అనుకోని ఆ రోజు నుండీ పిల్లికి పూజ చేస్తా ప్రసాదం పెట్టడం మొదలు పెట్టినాడు.

ఒకరోజు పిల్లి ప్రసాదం తింటా వుంటే యాన్నించొచ్చిందో ఒక కుక్క వచ్చి "అబ్బ... ఎన్నాళ్ళకు కనబడిందిది" అనుకుంటా దాన్ని పట్టుకోడానికి ఒక్క దుంకు దుంకింది. అంతే... పిల్లి అదిరిపడి దానికి దొరక్కుండా 'మ్యావ్ మ్యావ్' అనుకుంటా సర్రున పారిపోయింది. అది చూసిన రామయ్య "అరెరే... ఇన్ని రోజులూ పిల్లే గొప్పదనుకోని అనవసరంగా పూజ చేస్తి... కానీ ఈ పిల్లేం గొప్పది... దీన్ని వురికిచ్చిన కుక్కే నిజంగా గొప్పది" అనుకోని ఆ రోజు నుండీ కుక్కకు పూజ చేస్తా ప్రసాదం పెట్టడం మొదలుపెట్టినాడు.



ఆ కుక్క రోజూ ప్రసాదం మెక్కీ మెక్కీ బాగా కొవ్వు పట్టింది. ఒకరోజు రామయ్యకు జ్వరమొచ్చి మంచమ్మీద నుండి లేవలేక పోయినాడు. కుక్కకు రోజూ పొద్దున్నే తినడం అలవాటయింది గదా... అందుకని "ఇదేందబ్బా నాకింకా ప్రసాదం పెట్టలేదు" అనుకుంటా ఇంట్లోకొచ్చి పొయ్యి మీదున్న అన్నం కుండలన్నీ కింద పడేసి నాకడం మొదలు పెట్టింది.

అప్పుడే లోపలికొచ్చిన రామయ్య పెండ్లాం పగిలిపోయిన కుండల్ని, కుక్కను చూసి "ఓసి దొంగదానా... అన్నం కుండలన్నీ పగలగొడ్తావా" అని మూలనున్న పొరక తీసుకోని దాన్ని కిందామీదా ఏసి కొట్టింది. ఆ దెబ్బలకది కుయ్యికుయ్యిమని అరుస్తా పారిపోయింది. అది చూసిన రామయ్య "అరెరే... ఇన్ని రోజులూ కుక్కే గొప్పదనుకోని అనవసరంగా పూజ చేస్తి... కానీ ఆ కుక్కేం గొప్పది... దాన్నే కిందా మీదా ఏసి కొట్టిన నా పెండ్లామే నిజంగా గొప్పది" అనుకోని ఆ రోజు నుండీ పెండ్లానికి పూజ చేస్తా ప్రసాదం పెట్టడం మొదలు పెట్టినాడు.

అది చూసి ఆమె " అబ్బ... నేనెంత అదృష్టవంతురాలిని... నా మొగుడు నన్నెంత బాగా చూసుకుంటా వున్నాడు" అని మురిసిపోయింది. ఒకరోజు ఆమె కూర చేస్తా... చేస్తా మర్చిపోయి రెండుసార్లు కారమేసింది. రామయ్య నోట్లో ముద్ద పెట్టుకోడం ఆలస్యం నోరంతా సుర్రుమనింది. దాంతో వానికి పెండ్లామ్మీద చానా కోపమొచ్చి " ఓసి దొంగదానా... కూరలో ఇంతనా కారమేసేది" అని జుట్టు పట్టుకోని దభీదభీమని నాలుగు గుద్దులు గుద్దినాడు. ఆమె భయంతో వణికిపోతా తప్పయిపోయిందని వాని కాళ్ళు పట్టుకోనింది.

అంతలో వాడు "అరెరే... ఇన్నాళ్ళూ... నా పెండ్లామే గొప్పదనుకోని అనవసరంగా పూజ చేస్తి... కానీ నా పెండ్లానిదేం గొప్ప... నన్ను చూసి భయంతో గజగజా వణికిపోతా వుంది. అంటే నేనే అందరికన్నా గొప్పన్నమాట" అనుకోని ఆ రోజు నుండీ వాడు వేరే వాళ్ళకు పూజ చేయడం మానేసి తనకు తానే చేసుకోవడం మొదలుపెట్టినాడు.

# 6 యాక్... థూ

ఒకూర్లో ఒక బాపనాయన వుండేటోడు. ఆయనకు మూఢనమ్మకాలు చానా ఎక్కువ. ఎప్పుడూ పూజలు, జపాలు చేస్తా వుండేటోడు. అయినదానికీ కానిదానికీ వూకూకెనే భయపడేటోడు. మడికట్టుకున్నప్పుడు పెండ్లాం బిడ్డలను గూడా దగ్గరికి రానిచ్చేటోడు కాదు.

ఒకసారి ఆయన పెండ్లాం వంట చేస్తా చేస్తా ఆకలేస్తా వుంటే ఒక కొబ్బరిముక్క తీసుకోని తినసాగింది. అంతలో పక్కింటామె తోడు కోసమని వచ్చి ఆమెని పిలిచింది. ఆమె తింటా వున్న ఆ కొబ్బరిముక్కను ఆన్నే గూట్లో పెట్టి బైటికి పోయింది. అప్పుడే ఆ బాపనాయన స్నానం చేసి మడి కట్టుకోని బైటికి వచ్చినాడు. ముందు రోజంతా ఉపవాసం వుండటంతో బాగా ఆకలేయసాగింది. దాంతో తట్టుకోలేక ఏమన్నా దొరుకుతుందేమోనని వంటగదిలోనికి పోయినాడు. ఆడ గూట్లో కొబ్బరిముక్క కనబడింది. అది పెండ్లాం కొరికినేదని వానికి తెలీదు... దాంతో ఆ ముక్కను నోట్లో వేసుకోని నమలసాగినాడు.

కాసేపటికి వాని పెండ్లాం ఆడికి వచ్చింది. కొబ్బరిముక్క కోసం గూట్లో వెదకసాగింది. అది చూసి వాడు "ఏందే... వెదుకుతా వున్నావు. ఏం కావాల" అనడిగినాడు. దానికామె "ఇందాక తింటా తింటా కొబ్బరిముక్క ఒకటి ఈడపెట్టి పోయినా. దాని కోసం వెదుకుతా వున్నా" అనింది. ఆ మాటింటానే వాడు అదిరిపోయినాడు.

"ఏందీ... ఆ కొబ్బరిముక్క నువ్వు ఎంగిలి చేసినేదా... ఎంత అపచారం. నీ ఎంగిలి తిన్నాను" అంటూ నోట్లో నీళ్ళు పోసుకోని మళ్ళా... మళ్ళా... కడుక్కోసాగినాడు. అది చూసి ఆమె "ఏందండీ మీరు మరీనూ... మొగుడూ పెండ్లాల నడుమ ఎంగిలేంది" అనింది. దానికి వాడు కోపంగా ఆమెని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ "నీకేం తెలుసే శాస్త్రాలు. ఆచారమంటే ఆచారమే. ఇంతవరకూ నేను చేసిన పుణ్యమంతా సర్వనాశనం చేసి పెట్టినావు గదా" అని నెత్తీ నోరు కొట్టుకుంటా ఆ వూర్లోని పెద్ద పండితుని దగ్గరికి పోయినాడు. ఆయనకి జరిగిందంతా చెప్పినాడు.

ఆ పండితుడు వాని దగ్గర ఐదొందలు తీసుకోని, పెద్దపెద్ద పుస్తకాలన్నీ తిరగేసి, అరగంటసేపు గాల్లో చూస్తా ఏవేవో లెక్కలేసి "చూడు నాయనా... నువ్వు ఎవరయినా ఒక మహా పతివ్రత చేతి వంట తింటే చాలు. నీ పాపం పోతుంది" అని చెప్పినాడు. దానికా బాపనాయన "అట్లాంటి పతివ్రత యాడుందో కాస్త చెప్పండి సామీ" అన్నాడు. పండితుడు కాసేపు ఆలోచించి "పక్కూర్లో శేషమ్మ అని ఒక గొప్ప పతివ్రత వుంది. ఆడికి పో" అని చెప్పినాడు. బాపనాయన తర్వాత రోజు పొద్దున్నే తలస్నానం చేసి పక్కూరికి బైలుదేరినాడు. శేషమ్మ ఇంటికి చేరుకోని తాను వచ్చిన పని చెప్పినాడు. దానికామె "సర్లే నాయనా... దానికేముందిలే... కాసేపు కూచో... వంట చేసి పిలుస్తా" అంటూ ఆ బాపనాయనను కూచోబెట్టి వంట పనిలో పడింది.

వంట పూర్తి కాగానే కోడలిని పిలిచి ఆ బాపనాయనకు వడ్డించమనింది. ఆమె ఆయనకు అన్నం, పప్పు అన్నీ వడ్డించి ఆఖరున ఇంట్లో వున్న పాయసమంతా ఆయనకే వడ్డించింది. అది చూసి అత్త కోడలిని లోపలికి పిలిచి "ఏమే... పాయసమంతా ఆయనకే వడ్డించినావు. కొంచం గూడా మనకి వుంచకుండా" అనింది. దానికామె గొంతు తగ్గించి "ఏమీ లేదత్తా... ఇందాక మనం పని చేసుకుంటా వున్నప్పుడు పక్కింటి గజ్జికుక్క వచ్చి సగం పాయసం లొడలొడలొడ తాగేసింది. అందుకే దాన్ని పారబోయడం ఎందుకని అంతా ఆయనకే పోసేసినా" అనింది. అప్పుడే చేయి కడుక్కోడానికని అటువైపు వచ్చిన బాపనాయనకు ఆ మాటలన్నీ వినబన్నాయి. "థూ... థూ... ఇంతసేపూ నేను తిన్నది కుక్క ఎంగిలా" అనుకుంటా ఆ అత్తాకోడళ్ళని తిట్టిన తిట్టు తిట్టకుండా బాగా తిట్టి వురుక్కుంటా ఇంటి బైటికొచ్చి తిన్నదంతా యాక్కు యాక్కుమని చెయ్యి నోట్లో పెట్టుకుని కక్కుకున్నాడు. నెమ్మదిగా తిరిగి ఇంటికి బైలుదేరినాడు. కొంచం దూరం నడిచేసరికి బాగా అలసిపోయినాడు. ఒక ఇంటి ముందు కూలబన్నాడు.

కొంచం ఆకూవక్కా వేసుకుందామని బొడ్లోంచి సంచి తీసినాడు. అందులో ఆకులు, సున్నం వున్నాయి గానీ వక్క లేదు. దాంతో ఇంటామెని పిలిచి "అమా... ఏమీ అనుకోకుండా ఒక వక్క వుంటే ఇవ్వమ్మా... నీకు పుణ్యమొస్తాది" అన్నాడు. దానికామె "దానికేముందిలే నాయనా... వక్కనే గదా... తెస్తానుండు" అంటూ లోపలికి పోయి ఒక వక్క తెచ్చి ఇచ్చింది.

బాపనాయన ఆ వక్కను నోట్లో వేసుకోని క్షణంలో పటపటపటమని ముక్కలు చేసి నమలసాగినాడు. అది చూసి ఆ ఇంటామె "అబ్బ... నీవి అల్లాటప్పా మామూలు పండ్లు కాదు నాయనా... ఇనుపగుండ్లు" అంటూ ముక్కున వేలేసుకోనింది. ఆ మాటలకా బాపనాయన "ఏమయిందమ్మా... ఎందుకట్లా మెచ్చుకుంటా వున్నావు" అనడిగినాడు. దానికామె "ఏమీ లేదు నాయనా... ఆ వక్కను నేను కొరికినా... నా మొగుడు కొరికినాడు.. నా కొడుకు కొరికినాడు... నా కోడలు కొరికింది... ఆఖరికి ఇంటికొచ్చిన బంధువులంతా కొరికినారు. ఐనా అది ఒక్క రవ్వ గూడా పగలలేదు. అట్లాంటిది అంత గట్టి వక్కను నువ్వు క్షణంలో పటపటలాడించినావు. అందుకే అట్లా మెచ్చుకున్నా" అనింది. ఆ మాటలింటానే ఆ బాపనాయన అదిరిపోయినాడు.

"ఏందీ... ఇప్పుడు నేను నములుతా వున్న వక్క ఇంతమంది ఎంగిలి చేసినేదా" అంటూ ఆమెని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి "థూ..." అంటూ నోట్లోదంతా వుమ్మేసినాడు. నోరు కడుక్కుందామని చుట్టూ చూస్తే ఒక ఇంటి ముందు కుండలో నీళ్ళు కనబన్నాయి. వాడు వురుక్కుంటా పోయి ఆ నీళ్ళు నోట్లో పోసుకోని నోరంతా పుక్కిలించసాగినాడు.

అంతలో ఆ ఇంటామె అది చూసి బెరబెరా బైటికొచ్చి "ఏంది నాయనా... నీళ్ళు కావాలంటే అడిగి తీసుకోవచ్చు గదా... అట్లా పందులు మూతి పెట్టిన నీళ్ళతో కడుక్కునే బదులు" అనింది. ఆ మాటింటానే వాడు అదిరిపడి "ఏందీ ఇవి పంది ముట్టిన నీళ్ళా" అంటూ మరోసారి లోపలున్నదంతా భలుక్కు భలుక్కుమని కక్కుకున్నాడు.

"పెండ్లాం ఎంగిలే కదా అని మట్టసంగా ఇంట్లో పడి వుండక దోషం... దోషం... అనుకుంటా వచ్చినందుకు తగిన శాస్తే జరిగింది" అనుకుంటా గమ్మున ఇంటిదారి పట్టినాడు.

# 7 మనిషిగా మారిన గాడిద

ఒక ఊరిలో ఒక పండితుడు వుండేటోడు. అతని దగ్గరికి చానా మంది చదువుకోడానికి వచ్చేవాళ్ళు. అతను ఎలాంటి మూర్ఖుడినైనా సరే తన తెలివితేటలతో తీర్చిదిద్ది మాంచి పండితునిగా తయారు చేసి పంపించేటోడు.

పక్కవూరిలో ఒక పిల్లోడుండేటోడు. వాడు పరమ పనికిమాలిన వెధవ. ఆ అంటే ఈ అంటాడు. ఈ అంటే ఊ అంటాడు. వాళ్ళ నాయన ఎందరెందరో గురువుల దగ్గరికి తీసుకుపోయినాడు గానీ ఎవరూ ఒక్క ముక్క గూడా నేర్పియ్యలేక పోయినారు. ఎట్లాగబ్బా వీన్ని బాగుచెయ్యడం అని తలకొట్టుకుంటా వుంటే ఒకాయన ఈ పండితుని గురించి చెప్పినాడు. దాంతో వాడు ఆ పండితున్ని కలసి తన బాధంతా చెప్పుకున్నాడు. దానికి ఆ పండితుడు నవ్వి "ఏం భయపడొద్దు... నా జీవితంలో ఇంతవరకూ ఇట్లాంటి గాడిదలను ఎన్నింటినో కష్టపడి మంచి మనుషులుగా మార్చివేశాను. మీ గాడిదొక లెక్కా... పంపియ్యండి. ఆరు నెల్లు తిరిగేసరికల్లా మంచి మనిషిగా మార్చి పంపించేస్తా" అన్నాడు.

సరిగ్గా గురువు ఆ మాటలంటా వున్న సమయంలో ఆ ఇంటిముందు ఒక అమాయకుడు పోతా వున్నాడు. వానికి పిల్లల్లేరు. దాంతో ఒక గాడిదను తెచ్చుకోని సొంత కొడుకులెక్క పెంచుకుంటా వున్నాడు. వాడు ఆ మాటలు విన్నాడు. వాడు చానా చానా అమాయకుడు గదా... దాంతో... "ఓహో... గురువు గారు ఎట్లాంటి గాడిదనయినా సరే ఆరు నెల్లు తిరిగేసరికల్లా మంచి మనిషిగా మార్చివేస్తాడన్నమాట" అనుకోని వురుక్కుంటా ఇంటికి పోయినాడు. పెండ్లాంతో "ఏమే... ఏమే... ఇంతవరకూ మనకు తెలీదుగానీ మన ఊరి చివరనున్న పండితుడు అట్లాంటిట్లాంటి మామూలు మనిషిగాదు. గాడిదల్ని గూడా మనుషులుగా చేసేంత శక్తి ఆయనకున్నదంట" అన్నాడు. ఆమె మొగునికన్నా పెద్ద అమాయకురాలు. దాంతో ఆచ్చర్యపోయి "అలాగా... సరే... మనకు ఎట్లాగూ పిల్లలు లేరుగదా... ఆయన కాళ్ళ మీద పడి మనం పెంచుకుంటా వున్న గాడిదనే మనిషిగా మార్చమందాం. సరేనా..." అనింది. దానికి ఆ అమాయకుడు 'సరే' అన్నాడు.

ఇద్దరూ కలసి గాడిదను తోలుకోని పండితుని దగ్గరికి పోయినారు. "సామీ... ఎట్లాగయినా సరే... మా గాడిదను మనిషిగా చేసి పున్నెం కట్టుకోండి సామీ... మీ మేలు ఈ జన్మకు మరచిపోము. పిల్లలు లేని మాకు ఈ ఒక్క సాయం చేయండి సామీ" అంటూ ఆయన కాళ్ళు పట్టుకున్నారు.

పండితునికి ఏమీ అర్థం కాలేదు. "ఏందిరా ఇది. లెయ్యండి. నేనేంది... గాడిదను మనిషిగా మార్చడమేంది. అది ఎవరికీ సాధ్యం గాని పని" అన్నాడు.

"సామీ... అంతమాటనకండి సామీ... మనిషి మనిషికీ మాట మారిస్తే ఎట్లా... పొద్దున మీరు పక్కూరాయనతో మాట్లాడిందంతా నేను విన్నాను. మేము ఈన్నే సావనయినా సస్తాంగానీ మీ కాళ్ళు మాత్రం వదలం. మీరు ఏం చేస్తారో తెలీదు... మా గాడిదను మాత్రం మనిషిగా మార్చాల్సిందే" అన్నారు.

పండితునికి పొద్దున తాను పక్కూరాయనతో మాట్లాడినదంతా గుర్తుకు వచ్చింది. మాట వరసకు గాడిదంటే నిజంగానే గాడిద అనుకున్న వాళ్ళ అమాయకత్వానికి జాలి వేసింది. ఎట్లాగయినా సరే వాళ్ళ నుంచి తప్పించుకోవాలని "ఒరేయ్... గాడిదను మనిషిగా మార్చడమంటే మాటలు కాదురా. లక్షల్తో పని... నెలకు యాభైవేల చొప్పున ఆరునెల్లు ఖర్చు పెట్టాలి" అన్నాడు.

దానికా అమాయకుడు ఏ మాత్రం వెనకడుగు వేయకుండా "ఎంతయినా సరే... నేను సిద్ధం సామీ... నా ఇల్లూ పొలమూ అన్నీ అమ్మయినా సరే కావల్సినంత డబ్బు తెచ్చిస్తా.... ఈ గాడిదను మాత్రం మనిషిగా మార్చండి చాలు" అన్నాడు పట్టుకున్న కాళ్ళు వదలకుండా.

ఇక ఆ పండితునికి ఏం చేయాల్నో తోచలేదు. "సరే... ఆ గాడిదను ఆశ్రమంలో ఓ మూలకు కట్టేసి వెళ్ళండి" అన్నాడు. వాళ్ళు సంబరంగా గాడిదను ఆశ్రమంలో ఓ మూలకు కట్టేసి వెళ్ళిపోయినారు. పండితుడు దానిని ఎవరికీ తెలీకుండా రాత్రికి రాత్రి పక్కవూరిలోని తన స్నేహితుని దగ్గరకు పంపి దాచిపెట్టినాడు.

ఆ అమాయకుడు నెలకోసారి రావడం ఆడా ఈడా అప్పు చేసి జమ చేసిన డబ్బునంతా పండితుని చేతిలో పెట్టడం చేసేవాడు."'గాడిద పూజలో వుంది. మనిషిగా మారుతా వుంది. ఇప్పుడెవరూ చూడగూడదు. ఆరునెల్లు పూర్తి గానీ. ఒకేసారి చూద్దువు గానీ" అని పండితుడు డబ్బు తీసుకోని పంపించేవాడు.

అట్లా... ఒకొక్క నెల దాటుకుంటా... దాటుకుంటా... నెమ్మదిగా ఆరునెల్లు పూర్తయినాయి. వెంటనే ఆ అమాయకుడు పరుగెత్తుకుంటా వచ్చి "సామీ... ఆరునెల్లు పూర్తయినాయి. నా కొడుకెక్కడ" అనడిగినాడు సంబరంగా.

దానికా పండితుడు "ఒరేయ్... నువ్వు ఇచ్చిన గాడిద వయసులో చానా పెద్దది గదా... దాంతో నీ కొడుకు గూడా ఒకేసారి పెద్దోడయి పక్కూరికి గ్రామాధికారి అయిపోయినాడు" అని చెప్పినాడు.

దానికా అమాయకుడు చానా సంబరపడిపోయి "అలాగా సామీ మరి నా కొడుకు నన్ను గుర్తు పడతాడా" అనడిగినాడు. దానికా పండితుడు చిరునవ్వు నవ్వి "గుర్తుపట్టొచ్చు. పట్టకపోవచ్చు. ఎందుకయినా మంచిది. నువ్వు నీ గాడిదకెప్పుడూ పెట్టే పచ్చగడ్డి కొంచం నీ వెంబడి తీసుకోనిపో. నిన్ను గుర్తు పట్టకపోతే దాన్ని చూపించు. గుర్తు పడతాడు" అని చెప్పినాడు.

ఆ అమాయకుడు చానా సంబరంగా పక్క వూరికి పోయినాడు. ఆ సమయంలో ఆ గ్రామాధికారి రచ్చబండ మీద కుర్చీలో కాలు మీద కాలేసుకోని కూచోని ఏదో గొడవకు సంబంధించి తీర్పు చెబుతా వున్నాడు. "ఆహా! నా కొడుకు ఎంత పెద్ద హోదాలో వున్నాడు" అని మురిసిపోతా అతన్నే గుడ్లప్పగించి చూస్తా వున్నాడు.

ఆ గ్రామాధికారి "ఎవరబ్బా ఈ కొత్తాయన నా వంక అట్లా నోరెళ్ళబెట్టుకోని చూస్తా వున్నాడు" అనుకోని మాటిమాటికీ వాన్నే చూడసాగినాడు. ఆ అమాయకుడు "ఈయనేమబ్బా... ఇన్ని సార్లు నన్ను చూస్తా వున్నాడు గానీ కొంచం గూడా పలకరియ్యడం లేదు. కొంపదీసి మర్చిపోయినాడో ఏమో" అనుకోని సంచీలోంచి పచ్చగడ్డి తీసి ఆ గ్రామాధికారికి చూపిస్తా "దామ్మా... దా... దా... నా బుజ్జిగదా... నా బంగారు కొండ గదా... దామ్మా... దా... దా... అంటూ పిలవసాగినాడు.

అది చూసిన గ్రామాధికారికి కోపం వచ్చి "ఎవర్రా నువ్వు. అట్లా పిలుస్తా వున్నావ్. మంచీ మర్యాదా లేకుండా." అన్నాడు కోపంగా.



దానికా అమాయకుడు ''ఏరా... గాడిదకొడకా... నన్నే మరచిపోయినావా... నిన్ను మనిషిని చేయడానికి ఎంత ఖర్చు పెట్టినాను" అని కోపంగా అరచినాడు.

దానికా గ్రామాధికారికి తిక్కలేసి "ఎవర్రా నువ్వు. గాడిదా... గీడిదా... అని తెగ రెచ్చిపోతా వున్నావు" అంటూ పక్కనున్న కట్టె తీసుకోని రపారపా రెండు పెరికి, కాపలా వాళ్ళతో వాన్ని మెడపట్టుకోని వూరి బైటకి దొబ్బించినాడు.

ఆ అవమానానికి అమాయకుడు తట్టుకోలేక పోయినాడు. పరుగు పరుగున పండితుని దగ్గరకు పోయి "సామీ... ఎంతో కష్టపడి పెంచి పెద్దచేసి ఒక మనిషిగా మార్పించిన నన్నే గుర్తుపట్టలేని ఇట్లాంటి కొడుకు వుంటే యెంత లేకుంటే యెంత... వాడు నాకు వద్దే వద్దు. ఎంత ఖర్చయినా పరవాలేదు. వాన్ని మళ్ళా గాడిదగా మార్చండి" అంటూ ఆయన కాళ్ళు పట్టుకున్నాడు.

"సరే... ఒక ఆరునెల్ల తర్వాత రాపో" అని చెప్పినాడు పండితుడు. ఆరు నెలలు పూర్తి కాగానే వాని గాడిదను వానికి తెచ్చి అప్పగించినాడు. ఆ గాడిదను చూడగానే ఆ అమాయకుడు "ఏమే... మనిషిగా మారగానే అంత పొగరెక్కిందా నీకు... నన్నే గుర్తు పట్టనట్లు మాట్లాడతావా... తన్ని నీ మనుషుల్తో వూరి బైటకి దొబ్బిస్తావా... ఇప్పుడొచ్చిందా బుద్ధి. దిగిందా కొవ్వు" అంటూ కట్టె తీసుకోని రపారపా దాన్ని పెరికినాడు.

అంతలో పండితుడు అంతకు ముందు వాడిచ్చిన డబ్బుతో బైటకు వచ్చి "వద్దొద్దు... అనవసరంగా దాన్ని కొట్టొద్దు. పాపం అది తిరిగి గాడిద కాగానే జరిగిందంతా మర్చిపోయింటాది" అని చెప్పి "ఇదిగో ఈ డబ్బు మూట తీసుకో... నిన్న వూరిబైట నుంచి వస్తా వుంటే పొలంలో దొరికినాయి. నీవెలాగూ దీన్ని మనిషిగా మార్చడం కోసం బాగా అప్పు చేసినట్టున్నావు. దీనితో అవన్నీ తీర్చుకోపో" అంటూ వాడిచ్చిన డబ్బు వాని చేతిలోనే పెట్టినాడు.

వాడు ఆ మూటను తీసుకోని వంగి దండం పెట్టి "రారా... బుజ్జీ... దా... పోదాం పా" అంటూ ఆ గాడిదను తోలుకోని సంబరంగా ఇంటికి పోయినాడు.

# 8 కోతి-దొంగోడు

ఒకూర్లో ఒక ముసల్ది వుండేది. ఆమె చానా బీదది. ఆమెకు పిల్లల్లేరు. దాంతో ఒక కోతిపిల్లను తెచ్చుకోని ప్రేమగా పెంచుకోనింది. అది చూసి వూర్లో వాళ్ళందరూ "ఒసే ముసల్దానా...నీకే తినడానికి తిండి లేదు. మళ్ళా ఆ కోతెందుకే" అని ఎగతాళి చేసేటోళ్ళు. ఎవరేమన్నా ఏమీ పట్టించుకోకుండా ఆ ముసల్ది కోతిని బాగా ప్రేమగా చూసుకొనేది. రోజూ పొద్దున్నే దానికి స్నానం చేపిచ్చి, చక్కగా తల దువ్వి, వుతికిన బట్టలేసేది. తాను తిన్నా తినకపోయినా దానికి మాత్రం కడుపు నిండా పెట్టేది.

ఒకరోజు ఆ కోతి అవ్వ దగ్గరకొచ్చి "అవ్వ...అవ్వా...నేను అడవికి పోయి పండ్లు ఏరుకోనొస్తా..." అని చెప్పి గంప నెత్తిన పెట్టుకోని పండ్ల కోసం వెదుకుతా... అడవి లోనికి పోయింది. అట్లా పోతా వుంటే ఒకచోట ఒక పెద్ద మామిడిచెట్టు కనబడింది. వెంటనే అది దాని పైకెక్కి పండ్లు కోసుకుంటా వుంటే కాసేపటికి ఎవరో వస్తున్న అలికిడి అయింది.

"ఎవరబ్బా" అని పైనుండి చూస్తే ఇంగేముంది... ఒక దొంగోడు గుర్రం మీద తాను దొంగిలించుకోనొచ్చిన బంగారమంతా వేస్కోని వస్తా కనబన్నాడు. వాడెక్కడికి పోతున్నాడబ్బా అని ఆ కోతి వాని వెనుకెనుకే...వెనుకెనుకే... దాచిపెట్టుకుంటా ...దాచిపెట్టుకుంటా... పోయింది. వాడు అట్లా కొంచం దూరం పోయినాక ఒక గుహలోనికి దూరి బంగారమంతా ఆడ దాచిపెట్టి, గుహ ఎవరికీ కనబడకుండా చెట్టుకొమ్మలు అడ్డుపెట్టి వెళ్ళిపోయినాడు.

వాడట్లా పోయినాడో...లేదో...అందుకోసమే కాసుకోనున్న కోతి బెరబెరా లోపలికి పోయింది. పోయి చూస్తే ఇంగేముంది. రత్నాలు, వజ్రాలు, హారాలు, వడ్డాణాలు, ముక్కుపుడకలు, చేతిగాజులు, చెవి కమ్మలు...బంగారువి ధగధగా మెరిసిపోతా కుప్పలు కుప్పలు కనబన్నాయి. వెంటనే కోతి సంబరంగా గంప తీసుకోని దాన్నిండా అన్నీ నింపుకోనింది. మళ్ళా వున్నది వున్నట్లుగా గుహకు చెట్ల కొమ్మలు అడ్డం పెట్టేసి, గంపనెత్తికెత్తుకోని బెరబెరా ఇంటికొచ్చి, "అవ్వా... అవ్వా... కాస్త ఈ గంప దించుదురా" అనింది. "ఎన్ని పండ్లు ఏరుకొచ్చినావే.... అంత గస పెడ్తా వున్నావ్" అంటూ అవ్వ గంప దించి చూస్తే ఇంగేముంది... వజ్రాలు, రత్నాలు... బంగారం ..ధగధగా మెరిసిపోతా కనబన్నాయి. అవ్వ అవన్నీ దాచిపెట్టి అవసరమైనప్పుడల్లా ఒకొక్కటి అమ్ముకోని హాయిగా బతకసాగింది.

ఇంట్లో డబ్బులు అయిపోయినప్పుడల్లా ఆ కోతి గంప తీస్కోనిపోయి బంగారం తేవడం మొదలుపెట్టింది. అట్లా కోతి గంపలు గంపలు ఎత్తుకోనొస్తావుంది గదా...దాంతో దొంగోనికి అనుమానమొచ్చింది. "ఇదేందబ్బా...నేను రోజూ ఎక్కడెక్కడి నుంచో...ఏమేమో...ఎత్తుకోనొచ్చి దాచిపెడతా వుంటే...రోజురోజుకీ సొమ్ములు పెరగాల గానీ



తగ్గిపోతా వున్నాయే" అనుకోని యాడికీ పోకుండా ఎదురుగా వున్న ఒక పెద్ద మర్రి చెట్టెక్కి చూడడం మొదలుపెట్టినాడు.

కోతికి దొంగోడు అన్నే చెట్టుపైన దాచిపెట్టుకొన్నేది తెలీదు గదా. అందుకని ఎప్పట్లాగే ఒకరోజు గంప తీసుకోని గుహలోనికి పోయి నింపుకోవడం మొదలుపెట్టింది. "ఓహో ఇదన్నమాట సంగతి" అనుకోని వాడు నెమ్మదిగా చెట్టు దిగొచ్చి అడుగులో అడుగేసుకుంటా వెనుకమాటుగ వచ్చి లటుక్కున దాన్ని పట్టేసుకున్నాడు. అది ఎంత గింజుకున్నా వదల్లేదు. ఇట్లా లాభం లేదనుకున్న ఆ కోతి ఒక ఉపాయమాలోచించి "దొంగోడా... దొంగోడా... నాకో అక్కుంది. ఆమె సక్కదనాల సుక్క. నన్ను గనక వదిలేస్తే మా అక్కనిచ్చి పెండ్లి చేస్తా... సరేనా" అనింది. సరేనని దొంగోడు దాన్ని విడిచిపెట్టినాడు. అప్పుడాకోతి "రేపు మా ఇంటికి రా. మా అక్కను తీసుకోని పోదువుగానీ" అని చెప్పింది. వాడు 'సరే'నని సంబరంగా దానికి గంప నిండా బంగారమెత్తి పంపిచ్చినాడు.

కోతికి అస్సలు అక్కాచెల్లెళ్ళు ఎవరూ లేరు గదా...దాంతో "రేపు దొంగోడొస్తే ఏం చేయాలబ్బా" అని ఆలోచించి... ఆఖరికి ఒక బస్తా మైదాపిండి తీసుకోనొచ్చి ఒక పెద్దబొమ్మ చేసింది. దానికి చీర చుట్టి, గాజులు తొడిగి, నుదుట తిలకం దిద్ది, సవరం పెట్టి, అచ్చం అందమైన ఆడపిల్లలెక్కనే తయారుచేసి మంచమ్మీద పన్నబెట్టింది.

తర్వాత రోజు పొద్దున్నే దొంగోడు గుర్రమేస్కోని వాళ్ళింటికొచ్చినాడు. కోతి కడుక్కోడానికి కాళ్ళకునీళ్ళిచ్చి లోపల కూచోబెట్టి "మా అక్క వ్రతం చేస్తా వుంది. ఐదు రోజుల వరకూ ఎవరితోనూ మాట్లాడదు – అన్నం తినదు. నీళ్ళు తాగదు. మంచం దిగదు. ఈ ఐదురోజులు నువ్వు ఆమెను ఏమీ అనొద్దు. వ్రతమైపోగానే హాయిగా పెండ్లి చేసుకో" అని చెప్పి బొమ్మను కిందికి దించకుండా మంచంతో సహా ఎత్తుకోనిపోయి దొంగోనింట్లో పెట్టి వచ్చేసింది. రావడం రావడం ఇంట్లో వున్నవన్నీ మూటగట్టేసి రాత్రికి రాత్రి అవ్వను తీస్కోని వూరిడిచి ఎవ్వరూ కనుక్కోలేని చోటికి పారిపోయింది.

దొంగోనికి మంచమ్మీదున్నది బొమ్మని తెలీదు గదా. దాంతో "అబ్బ నాక్కాబోయే పెండ్లాం ఎంత చూడముచ్చటగా వుందో" అని మురిసిపోతా వున్నాడు. ఒకరోజు గడిచిపాయ..... రెండ్రోజులు గడిచిపాయ... మూడురోజులు గడిచిపాయ... నాలుగు రోజులు గడిచిపాయ... ఐదు రోజులు గడిచిపాయ... ఆఖరికి వారం గూడా దాటిపాయ.

"ఇదేందబ్బా..... ఇన్ని రోజులైనా లేసి రాకుంటుంది" అని గట్టిగా పిలిచినాడు. ఆదుందేది బొమ్మ కదా. అందుకే వులకలా, పలకలా. దాంతో వానికి కోపమొచ్చి "లెయ్యే పైకి" అంటూ చేయి పట్టుకొని లాగితే ఇంకేముంది... చెయ్యూడొచ్చింది. కాలు పట్టుకోని లాగితే కాలూడొచ్చింది.

"అమ్మ... దొంగదానా... పిండిబొమ్మ పెట్టి నిజం మనిషని నన్నే మోసం చేస్తావా. వుండు నీ పని చెబ్తా" అని వాడు కోపంగా కత్తి తీసుకోని వూరికి పోయినాడు. పోయి చూస్తే ఇంగేముంది అవ్వాలేదు... కోతీ లేదూ...

# 9

# బిచ్చగాళ్ళు - బిరియానీ

ఒకూర్లో ముగ్గురు బిచ్చగాళ్ళు వుండేటోళ్ళు. వాళ్ళలో ఒకడేమో కుంటోడు. ఇంకొకడేమో గూనోడు. మరొకడేమో గుడ్డోడు. ముగ్గురూ బాగా కలసి మెలసి వుండేటోళ్ళు. ప్రతిరోజూ పొద్దున్నే ఒకొక్కరు ఒక్కొక్క వైపుకు పోయి వూరంతా తిరిగి అడుక్కునేటోళ్ళు. సాయంకాలం కాగానే తిరిగి అందరూ కలసి, తాము తెచ్చుకున్నదల్లా హాయిగా తిని పడుకొనేటోళ్ళు. వాళ్ళ ముగ్గురికీ చానా రోజుల నుండీ జీవితంలో కనీసం ఒక్కరోజైనా బాగా వేడి వేడి బిరియానీ చేసుకోని కడుపు నిండా తినాలని చానా కోరికగా వుండేది. కానీ బిరియానీ చేసుకోవాలంటే చానా డబ్బులు కావాల గదా... ఏ రోజు అడుక్కొచ్చినవి ఆ రోజు తినడానికే సరిపోయేవి కావు. మరెలా... దాంతో వాళ్ళు ముగ్గురూ బాగా ఆలోచించి ప్రతిరోజూ రూపాయో, అర్ధరూపాయో దాచిపెట్టడం మొదలు పెట్టినారు. అట్లా కొన్ని రోజులు గడచిపోయినాయి. ఒకరోజు ముగ్గురికీ బిరియానీ తినాలనే కోరిక బాగా పెరిగిపోయింది. దాంతో సంతకు పోయి వున్న కొంచెం డబ్బులతో సరుకులు వచ్చినన్ని కొనుక్కొచ్చుకున్నారు. ముగ్గురూ సంబరంగా ఆడతా, పాడతా బిరియానీ వండడం మొదలుపెట్టినారు. బియ్యం, నూనె, మసాలా, కారం, ఉప్పు అన్నీ సమపాళ్ళలో వేసినారు. కాసేపటికి ఘుమఘుమలాడుతా బిరియానీ తయారైంది. ఆ కమ్మని వాసనకి ముగ్గురి నోళ్ళలోనూ నీళ్ళు వూరసాగినాయి. లొట్టలేసుకుంటా తిందామని ఆత్రంగా మూత తెరచి చూస్తే ఇంగేముంది బియ్యం తక్కువ కావడంతో బిరియానీ కొంచమే తయారైంది. ముగ్గురూ తింటే ఎవరికీ కడుపు నిండదు. ఎవరికో ఒక్కరికి మాత్రమే సరిపోతుంది. "తింటే ఎవడో ఒకడు కడుపు నిండా తినాలగానీ... ముగ్గురమూ కొంచెం కొంచెం తిని ఏం లాభం" అనుకున్నారు.

మరి ముగ్గురిలో ఎవరు తినాల... ముగ్గురికీ దాన్ని తినాలనే వుంది. అందుకని బాగా ఆలోచించి "మనం ముగ్గురమూ పండుకొని నిద్రపోదాం. పొద్దున్నే లేచి రాత్రి ఎవరెవరికి ఏమేం కలలొచ్చినాయో చెప్పుకుందాం. ఎవరికి మంచి కల వస్తే వాళ్ళకే బిరియానీ" అనుకున్నారు. సరేనని ముగ్గురూ నిద్రపోయినారు. గుడ్డోడు, గూనోడు నిద్రపోయిన కాసేపటికి నెమ్మదిగా కుంటోడు నిద్ర లేచి చప్పుడు కాకుండా మట్టసంగా బిరియానీ అంతా నున్నగా తినేసి, ఏమీ ఎరుగని అమాయకునిలెక్క హాయిగా నిద్రపోయినాడు.

పొద్దున్నే ముగ్గురూ నిద్రలేచినారు. గుడ్డోనికి, గూనోనికి కుంటోడు బిరియానీ తినేసింది తెలీదు గదా. అందుకని గూనోడు ఎలాగైనా బిరియానీ తినాలనుకోని రాత్రి వానికి ఏ కలా రాకపోయినా "రేయ్.నాకు నిన్న రాత్రి ఎంత అద్భుతమైన కలొచ్చిందో తెలుసా.నేను కలలో హైదరాబాద్‌కు పోయినా, అక్కడ చార్మినార్,



గోల్కొండ, బిర్లామందిర్, అసెంబ్లీ అన్నీ చూసినా. అంతలో మన ముఖ్యమంత్రి కలసి ఏరా గూనోడా... బాగున్నావా అంటూ పలకరించి వాళ్ళింటికి తీస్కోనిపోయి వద్దు వద్దన్నా వినకుండా మంచి బిరియానీ పెట్టించినాడు. అబ్బ భలే రుచిగా వుందిలే" అన్నాడు.

ఆ మాటలిన్న గుడ్డోడు వెంటనే "ఓర్నీ నీవు హైదరాబాద్‌కు పోయినావా. నిన్న రాత్రి నేను ఏకంగా మన దేశ రాజధాని ఢిల్లీకి పోయినా, నన్ను చూస్తానే మన ప్రధానమంత్రి వురుక్కుంటా వచ్చి కౌగిలించుకోని వాళ్ళింటికి తీస్కోనిపోయి వద్దువద్దన్నా వినకుండా మాంచి బిరియానీ తినిపించినాడు. అబ్బ ఏం రుచిలే" అన్నాడు.

ఇద్దరి మాటలూ విన్న కుంటోడు మాత్రం ఏమీ మాట్లాడకుండా గమ్మున కూర్చున్నాడు. అది చూసి "ఏంరా. అట్లా గమ్మున కూచున్నావు. నీకేమీ కల రాలేదా" అన్నాడు కుంటోడు.

ఆ మాటలకు కుంటోడు "ఏం చెప్పమంటారన్నా. నిన్న రాత్రి అట్లా నిద్రపోయినానో లేదో.. వెంటనే ఒక పెద్ద రాక్షసుడొచ్చినాడు. వాడు నన్ను లేపి రేయ్... మర్యాదగా నువ్ బిరియానీ తింటావా లేక నన్ను నిన్ను తినమంటావా అని భయపడిచ్చినాడు. నాకేం చేయాల్నో తోచలేదు. నిన్ను పిలుద్దామా అంటే నువ్వేమో హైదరాబాదులో ముఖ్యమంత్రితో కలసి బిరియానీ తింటా వుంటివి. గుడ్డోన్ని పిలుద్దామా అంటే వాడేమో ఏకంగా ఢిల్లీలో ప్రధానమంత్రి దగ్గర కూచోని బిరియానీ తింటా వున్నాడు. దాంతో ఏం చేయాల్నో అర్థంగాక నా ప్రాణాలు కాపాడుకోడానికి... ఎట్లాగూ మీరిద్దరూ ఆడ బిరియానీ తింటున్నారు గదా అని నేను ఈడ బిరియానీ అంతా తినేసినా?" అన్నాడు. అంతే ఆ మాటలకు తిరిగి ఏం మాట్లాడాలో అర్థంగాక గుడ్డోడు, గూనోడు నోళ్ళు తెరిచినారు.

# 10 అత్తా కోడళ్ళ కథ

ఒకూర్లో ఒక అత్త వుండేది. ఆమెకు కోడలంటే అస్సలు పడేది కాదు. చీటికీ మాటికీ ఆమెను తిడతా కొడతా ఏడిపించేది. ఒకరోజు అత్త తన ఇంటి పెరట్లో ఒక బీరగింజ నాటింది. కొద్ది రోజులకే అది బాగా పెరిగి పెద్దదై కుప్పలు తెప్పలుగా కాయలు కాయసాగింది.

కోడలికి ఆ బీరకాయలు తెంపుకోని మంచిగా కూర చేసుకోని తినాలని ఎంతో ఆశ. కానీ అత్తేమో ఆ కాయలన్నీ తెంపి తానొక్కతే వండుకోని బాగా తినేది. మిగిలితే ఎదురింటోళ్ళకు, పక్కింటోళ్ళకు ఇచ్చేదేగానీ కోడలికి మాత్రం ఒక్క ముక్క కూడా పెట్టేది కాదు.

ఒక రోజు వాళ్ళింటికి అత్త చిన్న తమ్ముడు వచ్చి "అకా... అకా... రేపు నా కూతురి పెళ్ళి. నువ్వు తప్పకుండా మా వూరికి రావాల" అని పట్టుపట్టినాడు. సరేనని అత్త తమ్మునితోబాటు పెళ్ళికి పోయింది. అంతే... అత్త అట్లా బైటికి పోవడం ఆలస్యం, కోడలు సంబరంగా వురుక్కుంటా పెరట్లోకి పోయి బీరకాయలన్నీ తెంపి కూర వండుకోని బాగా తిని, తీగ మొత్తం పీకి దిబ్బలో పడేసింది.

నాలుగు రోజుల తర్వాత అత్త వచ్చి చూస్తే ఇంగేముంది తీగా లేదు, కాయలూ లేవు. ఇదంతా కోడలు పనేనని గ్రహించిన అత్తకు ఆమె మీద పీకల దాకా కోపమొచ్చింది. రాత్రి కోడలు అన్నం తిని నిద్రపోగానే ఓ పెద్దకర్ర తీసుకోనొచ్చి ఆమె నెత్తిన ఒక్కటేసింది. అంతే ఆ దెబ్బకు కోడలు కళ్ళు తిరిగి స్పృహ తప్పి అచ్చం శవం మాదిరి పడిపోయింది. ఎంత కదిపినా లెయ్యలేదు, అది చూసి కోడలు చచ్చిపోయిందని అనుకోనింది అత్త.

అంతలో ఆమె కొడుకు పొలం నుండి ఇంటికి వచ్చినాడు. వెంటనే అత్త దొంగ ఏడుపు ఏడుస్తా "రేయ్! నీ పెండ్లానికి ఏమయిందో ఏమో. ఎంత పిల్చినా పలకడం లేదు, పో! పోయి చూడుపో" అనింది. దాంతో వాడు పోయి పెండ్లాన్ని అటూ యిటూ కుదిపినాడు. గట్టిగా పిలిచినాడు.

ఆమె స్పృహలో లేదు కదా. అందుకే ఏమీ మాట్లాల్లేదు. దాంతో వాడు కూడా పెండ్లాం చచ్చిపోయిందని అనుకున్నాడు.

ఇద్దరూ శవాన్ని తీసుకోని చీకట్లోనే శ్మశానానికి పోయినారు. దాన్ని కట్టెల మీద పన్నబెట్టి అంటిద్దామని చూస్తే అగ్గిపెట్టె లేదు. దాంతో అత్త "రేయ్! నువ్వు ఇంటికాడికి పోయి అగ్గిపెట్టె తీసుకోని రాపో" అని కొడుక్కి

చెప్పింది. దానికి వాడు "నాకొక్కనికే చీకట్లో పోవాలంటే భయం. నువ్వు కూడా తోడుగారా" అన్నాడు. సరేనని ఆమె కొడుకుతో పాటు వూళ్ళోకి పోయింది.

వాళ్ళట్లా వూళ్ళోకి పోయిన కాసేపటికే కోడలికి స్పృహ వచ్చింది. లేచి చూస్తే ఇంకేముంది... శ్మశానంలో కట్టెల మీదుంది. ఆమెకు జరిగిందంతా అర్థమై నెమ్మదిగా లేచి పక్కనే పడున్న తుమ్మమొద్దుకు తన తెల్లచీర సగం చించి కట్టి, దానిని కట్టెల మీద పెట్టింది. తానేమో పక్కనే వున్న చింతచెట్టు మీదకు ఎక్కి ఏం జరుగుతుందా అని చూడసాగింది. కాసేపటికి అగ్గిపెట్టె తీసుకోని కొడుకుతో ఆడికొచ్చింది అత్త. చీకటి కదా సరిగా కనబడక తుమ్మ మొద్దునే కోడలనుకోని నిప్పు పెట్టింది. బాగా మంట అంటుకోని, కాలి బూడిదైపోగానే వాళ్ళు తిరిగి వెళ్ళిపోయినారు.

కోడలు చింతచెట్టు దిగుదామనుకుంటుండగానే నలుగురు దొంగలు ఆడికొచ్చినారు. వాళ్ళు చింతచెట్టు కిందనే కూర్చుని చుట్టుపక్కల వూళ్ళలో ఎత్తుకొచ్చిన బంగారం, రత్నాలు, వజ్రాలు, నగలు కుప్పలు కుప్పలుగా పోసి ఎవరి భాగం వాళ్ళు పంచుకోసాగినారు. ఇదంతా పైనుండి చూస్తా వున్న కోడలు ఎట్లాగైనా సరే ఆ బంగారం కొట్టేయాలనుకోని 'ఓ' అని దయ్యం మాదిరి అరుస్తా దభీమని వాళ్ళ మీదకు దుంకింది. అంతే నలుగురు దొంగలు అదిరిపన్నారు. చూస్తే యింకేముంది తెల్లచీరతో, జుట్టంతా విరబోసుకుని 'ఓ' అని వూగుతా వుంది. వాళ్ళు వచ్చింది దయ్యమేననుకోని భయంతో గజగజా వణుకుతా ఎక్కడివక్కడ వదిలేసి తలో దిక్కు పారిపోయినారు. కోడలు బంగారమంతా మూటగట్టుకోని సంబరంగా ఇంటికి పోయింది. తలుపులేమో మూసి వున్నాయి. దాంతో 'అత్తా! అత్తా!" అని పిలుస్తా తలుపు కొట్టసాగింది. ఎవరబ్బా అని లేచి తలుపు తెరిచిన అత్తకు ఎదురుగా కోడలు కనబడేసరికి ఇది దయ్యమై నన్ను పీక్కుతినడానికే వచ్చిందనుకోని భయపడి అక్కడికక్కడే గుండె పగిలి దభీమని కిందపడి చచ్చిపోయింది. పెండ్లాన్ని చూసి మొగుడు గజగజా వణుకుతా వుంటే ఆమె జరిగినదంతా చెప్పింది. వాడు "అలాగా" అని సంబరపడినాడు. ఆమె తెచ్చిన బంగారంతో పదంతస్తుల మిద్దె కట్టుకోని హాయిగా బతకసాగినారు.

# 11 చిన్నపాప - పెద్దపాప

ఒకూర్లో ఒక రాజు, రాణి వుండేటోళ్ళు. వాళ్ళ దగ్గర ఒక ఆడకుక్క వుండేది. అది చానా మంచిది. ఇంటికి బాగా కాపలా కాసేది. ఒకరోజు రాణి కడుపు పండింది. అదే సమయానికి కుక్కకు కూడా కడుపు పండింది. కడుపుతో వున్నోళ్ళకి ఏమేమో తినాలని వుంటాది గదా... రాణేమో లడ్లూ, జాంగిరీలు, కర్జికాయలు, జిలేబీలు, మైసూరుపాకులు... ఇట్లా ఒక్కటని కాదులే ఏది కావాలనుకుంటే అది బాగా నెయ్యేపిచ్చుకోని కమ్మకమ్మగా చేపిచ్చుకోని తినేది. అట్లాగే పుల్లపుల్లని చింతకాయలు, మామిడికాయలు బాగా తినేది.

కుక్క గూడా ఆమె మాదిరే కడుపుతో వుంది గదా... దానికి గూడా ఏమేమో తినాలని వుంటాది గదా... కానీ పాపం... దానికి మాత్రం పాచిపోయిన అన్నం, పాచిపోయిన కూరలు పెట్టేది. వూకూకెనే చీటికి మాటికి దాన్ని తిట్టేది. కొట్టేది. సరిగా తిండి లేకపోవడంతో అది సన్నగా బక్కచిక్కిపోయింది. ఒకరోజు పొద్దున్నించీ రాత్రి వరకూ ఎంత ఎదురుచూసినా చిన్న రొట్టెముక్క గూడా ఎయ్యలేదు. దాంతో కుక్కకు బాగా కోపమొచ్చి రాణికి ఒక శాపం పెట్టింది.

ఆ శాపం వల్ల రాణికేమో కుక్కపిల్లలు పుట్టినాయి. కుక్కకేమో ఇద్దరు అందమైన ఆడపిల్లలు పుట్టినారు. కుక్క తన పిల్లలిద్దరినీ నోట కరచుకోని అడవిలోకి తీసుకోనిపోయింది. రంగురంగుల పక్షుల ఈకలతో మెత్తని పరుపు చేసి పన్నబెట్టింది. అడవిలో దొరికే తియ్యతియ్యని పండ్లు ఏరుకోనొచ్చి తినిపించింది. పచ్చని తీగలతో ఉయ్యాల చేసి వూపింది. రోజూ శుభ్రంగా స్నానం చేపిచ్చి, చక్కగా జడేసి, రంగురంగుల పూలు పెట్టింది. అట్లా అల్లారుముద్దుగా, ప్రేమతో పెంచసాగింది. పిల్లలిద్దరూ ఆడతా... పాడతా... నెమ్మదిగా పెరిగి పెద్దగయినారు.

ఆ అడవికి దగ్గరలోనే ఒక రాజ్యముంది. దాన్ని పరిపాలిస్తావున్న రాజు మంత్రితో కలసి ఒకసారి వేటకొచ్చినాడు. వాళ్ళు అడవిలో ఈ అమ్మాయిలిద్దరినీ చూసి ఆశ్చర్యపోయినారు. ఇద్దరూ చానా అందంగా... చూడముచ్చటగా... అచ్చం బంగారు బొమ్మలైక్క వుంటారు గదా... దాంతో రాజు చిన్నపిల్లని “నాతో వస్తావా... నిన్ను పెండ్లి చేసుకుంటా” అని బతిమలాడినాడు. దాంతో చిన్నపిల్ల సరేనని ఒప్పుకోని రాజెంబడి సంబరంగా వెళ్ళిపోయింది.

మంత్రి పెద్దపిల్లను తనతో రమ్మన్నాడు. పెద్దపిల్ల చానాచానా మంచిది. అందుకే ఆమె ‘మా అమ్మకు చెప్పకుండా నేనెక్కడికీ రాను. అమ్మ అడవిలోకి పోయింది. రాగానే చెప్పి పోదాం’ అనింది. కానీ మంత్రి ‘లేదు... ఇప్పుడే ఎట్లున్నదానివి అట్లే రావాలి’ అంటా ఆమె ఏడుస్తున్నా వినకుండా బలవంతంగా గుంజుకు పోసాగినాడు. ఈ విషయం అమ్మకు ఎట్లా తెలపాల్నా అని ఆలోచిస్తా వున్న పెద్దపిల్లకు ఠక్కున తన మెడలోని పూసలదండ గుర్తుకొచ్చింది. వెంటనే ఆ దండ తెంచి దారిలో ఒకొక్క పూసా వేసుకుంటా... వేసుకుంటా వెళ్ళింది.

కాసేపటికి కుక్క ఇంటికొచ్చింది. వచ్చి చూస్తే ఇంగేముంది... పిల్లలిద్దరూ లేరు. యాడైనా ఆడుకుంటున్నారేమో అని గట్టిగా పిలిచింది. చుట్టుపక్కలంతా వెదికింది. అసలుంటే గదా కనబడ్డానికి. పాపం... అది ఏడ్చుకుంటా... ఏడ్చుకుంటా అడవంతా బాధగా తిరగసాగింది. అట్లా వెదుకుతా వుంటే దానికి ఒకచోట పూసలు కనబన్నాయి. ఆ పూసల్ని చూస్తానే అవి తన పెద్దపిల్లవని గుర్తుపట్టింది. ఒక్కొక్క పూసా ఏరుకుంటా... ఏరుకుంటా పోయి ఆఖరికి పెద్దపిల్ల ఇంటికి చేరుకోనింది.

తల్లిని చూస్తానే పెద్దపాప "అమా" అని వురుక్కుంటా పోయి సంబరంగా కౌగిలించుకోనింది. ఇంట్లోకి తీసుకోనిపోయి రకరకాల పిండివంటలు చేసి పెట్టింది. మెత్తని పరుపేసి పన్నబెట్టి కాళ్ళు ఒత్తింది. విసనకర్రతో ప్రేమగా గాలి వూపింది. ఆ కుక్క పెద్దపిల్ల దగ్గర ఒక నాలుగు రోజులుండి చిన్నపిల్ల ఎట్లా వుందో చూసొస్తానని వాళ్ళింటికి పోయింది.

చిన్నపిల్లకు చానా పొగరెక్కువ. కన్నతల్లి ఇంటికొస్తే సంతోషించక... కుక్క మా అమ్మని తెలిస్తే ఇంగేమన్నా వుందా... నా మర్యాద పోదూ అనుకోని "ఛీ... ఛీ... ఫో... ఈన్నించి... ఇంకోసారి నా యింటి గడప తొక్కినావంటే చూడు" అంటూ రోకలిబండతో దాని నడుమ్మీద కొట్టి, వేడివేడి గంజి మీద పోసింది. రోకలి దెబ్బకు పాపం దాని నడుం విరిగింది. వేడివేడి గంజి మీద పోసింది గదా... దాంతో దాని ఒళ్ళంతా బొబ్బలెక్కినాయి. పాపం... అది బాధతో ఏడుస్తా కుంటుకుంటా... కుంటుకుంటా... పెద్దపాప ఇంటికి చేరుకోనింది.

తల్లినట్లా చూసి పెద్దపాప కండ్లనీళ్ళు పెట్టుకోనింది. బొబ్బలకు వెన్న రాసింది. విసనకర్రతో చల్లని గాలి వీచింది. తల్లి పెద్దపాపను దగ్గరికి తీసుకోని "ఇంక నేను బతకను. నేను చచ్చిపోగానే నన్ను ఇంట్లోనే ఒక మూల పాతిపెట్టి... సరిగ్గా ఒక నెలకు అక్కడ తవ్వి చూడు" అని చెప్పి చచ్చిపోయింది. పెద్దపాప తల్లి చెప్పినట్లే ఇంట్లో ఒక మూల పూడ్చిపెట్టి నెల తరువాత ఆడ తవ్వి చూసింది. చూస్తే ఇంగేముంది... కండ్లు జిగేలుమన్నాయి. మణులూ, మాణిక్యాలూ, రత్నాలూ, వజ్రాలూ, నగలూ, హారాలూ ధగధగా మెరిసిపోతా కనబన్నాయి. పెద్దపాప అవన్నీ ఒంటి మీద వేసుకోని వూరంతా సంబరంగా తిరగసాగింది.

చిన్నపాప "అక్కకు ఈ నగలన్నీ ఎట్లా వచ్చినాయబ్బా" అని ఆశ్చర్యపోయి ఒకరోజు ఇంటికొచ్చి అడిగింది. అక్క అమాయకంగా జరిగిందంతా చెప్పింది. చిన్నది సామాన్యురాలు కాదు గదా... పెద్ద గయ్యాలిది. దాంతో "అమ్మ ఆస్తిలో నాకూ సగభాగం వస్తాది. మర్యాదగా ఇస్తావా... ఇయ్యవా" అంటూ కొట్లాడి సగం గుంజుకోని పోయింది. అద్దం ముందు కూచోని సంబరంగా ఆ నగలూ హారాలూ అన్నీ మెడలో వేసుకోనింది.

అంతే...

వెంటనే ఆమె ఒళ్ళంతా బొబ్బలు బొబ్బలు గాదు. మంటతో విలవిలలాడిపోయింది. ఎక్కడెక్కడి వైద్యులంతా వచ్చినారు. రకరకాల మందులేసినారు. ఐనా కొంచం గూడా తగ్గకపోగా రోజురోజుకీ ఇంకా ఎక్కువ కాసాగినాయి.

దాంతో చిన్నపిల్లకు చేసిన తప్పు అర్థమై వురుక్కుంటా, అక్క దగ్గరికి పోయి ఆమె నగలన్నీ తిరిగిచ్చేసింది. ఐనా బొబ్బలు కొంచం గూడా తగ్గలేదు. అప్పుడు తల్లి సమాధి దగ్గర కూచోని "అమా... అమా... పొరపాటయిపోయింది. ఈ ఒక్కసారికి నన్ను క్షమించు" అని కండ్లనీళ్ళు పెట్టుకోనింది. ఎంతయినా అమ్మ అమ్మే గదా... బిడ్డ తప్పు చేసినపుడు కోప్పన్నా మళ్ళా దగ్గరకు తీసుకుంటుంది గదా... దాంతో ఆమె ఒంటి మీది బొబ్బలన్నీ క్షణంలో మాయమైపోయినాయి. ఆమె తిరిగి మామూలు మనిషైపోయింది.

# 12 పేరు మరిచిన ఈగ

ఒకూర్లో ఒక ఈగుంది. దానిది చూడముచ్చటైన ఇండ్లు. ఒకరోజు ఒక పండగొచ్చింది. పండగరోజు ఈగ పొద్దున్నే లేసి, ఇంటి ముందంతా శుభ్రంగా కసువు కొట్టి, పేడతో అలుక్కోవడం మొదలుపెట్టింది. అట్లా అలుకుతా అలుకుతా అది తన పేరు మర్చిపోయింది.

"నా పేరు నాకు గుర్తు లేకుంటే ఎట్లా? ఎవరన్నా వచ్చి నీ పేరేమని అడిగితే ఏం చెప్పాల, మరియాద పోతాది గదా" అనుకోని చేస్తున్న పని చేస్తున్నట్టే వదిలేసి ఒక మూల కూచోని తెగ ఆలోచించింది. కానీ ఎంత ఆలోచించినా దానికి దాని పేరు గుర్తుకు రాలేదు. దాంతో ఎవరినన్నా అడిగి కనుక్కుందామని ఎగురుకుంటా పోతా వుంటే దానికి ఒకచోట ఒక పేదరాశి పెద్దమ్మ కనబడింది. వెంటనే అది పేదరాశి పెద్దమ్మ దగ్గరికి పోయి

"పేదరాశి పెద్దమ్మా! పేదరాశి పెద్దమ్మా! నా పేరేమిటో నీకు తెలుసా?" అనడిగింది. దానికామె "ఏమోనమ్మా నాకూ తెలీదు. పోయి నా కొడుకు నడుగు" అనింది.

'సరే" అని అది ఎగురుకుంటా పేదరాశి పెద్దమ్మ కొడుకు దగ్గరికి పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా! నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది. దానికి వాడు "ఏమోనమ్మా నాకూ తెలీదు. పోయి నా చేతిలోని గొడ్డలినడుగు" అన్నాడు.

దాంతో అది గొడ్డలి దగ్గరికి పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ! నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది. దానికా గొడ్డలి "ఏమోనమ్మా నాకూ తెలీదు. నేను కొట్టిన చెట్టునడుగు" అనింది. దాంతో అది చెట్టు దగ్గరికి పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది. దానికా చెట్టు "ఏమోనమ్మా నాకూ తెలీదు. నామీదున్న పక్షులనడుగు" అనింది.

దాంతో అది పక్షుల దగ్గరికి పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులారా నా పేరేమిటో మీకు తెలుసా" అనడిగింది. దానికా పక్షులు "ఏమోనమ్మా మాకూ తెలీదు. పోయి మేం తాగే నీళ్ళనడుగు" అన్నాయి.

దాంతో ఆ ఈగ నీళ్ళ దగ్గరకు పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులూ, పక్షులు తాగే నీళ్ళూ నా పేరేమిటో మీకు తెలుసా" అనడిగింది. దానికా నీళ్ళు "ఏమోనమ్మా మాకూ తెలీదు. పోయి మాలోని చేపలనడుగు" అన్నాయి.



దాంతో ఆ ఈగ చేపల దగ్గరకు పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులూ, పక్షులు తాగే నీళ్ళూ, నీళ్ళలోని చేపలూ నా పేరేమిటో మీకు తెలుసా" అనడిగింది. దానికా చేపలు "ఏమోనమ్మా మాకూ తెలీదు. పోయి మమ్మల్ని పట్టే జాలరినడుగు" అన్నాయి.

దాంతో ఆ ఈగ జాలరి దగ్గరకు పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులూ, పక్షులు తాగే నీళ్ళూ, నీళ్ళలోని చేపలూ, చేపలు పట్టే జాలరీ! నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది. దానికా జాలరి "ఏమోనమ్మా నాకూ తెలీదు. పోయి ఆ చేపల్ని తినే రాజును అడుగు" అన్నాడు.

దాంతో ఆ ఈగ రాజు దగ్గరకు పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులూ, పక్షులు తాగే నీళ్ళూ, నీళ్ళలోని చేపలూ, చేపల్ని పట్టే జాలరీ, జాలరి పట్టిన చేపల్ని తినే ఓ రాజా నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది. దానికా రాజు "ఏమోనమ్మా నాకూ తెలీదు. పోయి నేను ఎక్కే గుర్రాన్నడుగు" అన్నాడు.దాంతో ఆ ఈగ గుర్రం దగ్గరకు పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులూ, పక్షులు తాగే నీళ్ళూ, నీళ్ళలోని చేపలూ, చేపల్ని పట్టే జాలరీ, జాలరి పట్టిన చేపల్ని తినే రాజా, రాజెక్కే గుర్రమా! నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది. దానికా గుర్రం "ఏమోనమ్మా నాకూ తెలీదు. నా కడుపులోని పిల్లనడుగు" అనింది.

దాంతో ఆ ఈగ గుర్రం కడుపులోని పిల్ల దగ్గరకు పోయి "పేదరాశి పెద్దమ్మా, పెద్దమ్మ కొడుకా, కొడుకు చేతిలోని గొడ్డలీ, గొడ్డలి కొట్టిన చెట్టూ, చెట్టు మీదున్న పక్షులూ, పక్షులు తాగే నీళ్ళూ, నీళ్ళలోని చేపలూ, చేపల్ని పట్టే జాలరీ, జాలరి పట్టిన చేపల్ని తినే రాజా, రాజెక్కే గుర్రమా, గుర్రం కడుపులోని పిల్లా! నా పేరేమిటో నీకు తెలుసా" అనడిగింది.

దానికా గుర్రంపిల్ల "నీ పేరా? అదీ... అదీ... ఈ... హి... హిహి... హిహిహి..." అని సకిలించింది. గుర్రంపిల్ల "ఈహిహిహి" అని సకిలించటం వింటానే దానికి టక్కున తన పేరు గుర్తుకొచ్చింది.

"ఆ. గుర్తుకొచ్చింది. గుర్తుకొచ్చింది నా పేరు ఈగ కదా. అవును ఈగే, ఈగే" అనరచుకుంటా సంబరంగా ఆన్నించి ఇంటికి ఎగిరిపోయింది.

# 13 తిక్కరాజు

ఒకప్పుడు మనదేశంలో 'గుండురాజ్యం' అని ఒక రాజ్యముండేది. దాన్ని పాలించే రాజు పెద్ద తిక్కలోడు. తాను ఏమి చెప్తే అందరూ అదే చేయాలని అనేటోడు. కాదన్నా, ఎదిరించినా వాళ్ళని పట్టుకోనొచ్చి కాళ్ళో, చేతులో తీయించేటోడు. దాంతో జనాలంతా భయపడి ఎన్ని బాధలనుభవిస్తా వున్నా నోరు తెరవక గమ్మునుండేటోళ్ళు.

ఆ రాజుకు అందమైన జుట్టుండేది. ఆ జుట్టంటే రాజుకు చానా చానా ఇష్టం. ఒకసారి తనకు తప్ప ఎవరికీ జుట్టు వుండగూడదు అనుకున్నాడు. వెంటనే సైనికులను పిలిపించి 'రాజ్యంలో అందరూ గుండు కొట్టించుకోవాలనీ, ఎవరయినా జుట్టుతో కనబడితే అక్కడికక్కడే గుండు చేయించడంతో పాటు వంద కొరడా దెబ్బలు గూడా తప్పవని వూరంతా దండోరా వేయించినాడు. అంతే జనాలంతా భయపడిపోయి ఆడోళ్ళు, మొగోళ్ళు, ముసిలోళ్ళు, పిల్లోళ్ళు అనే తేడా లేకుండా అందరూ నున్నగా గుండు కొట్టించేసుకున్నారు. అందువల్లనే ఆ రాజ్యానికి ఆ పేరు వచ్చింది.

ఒకసారి రాజుకి వేటకి పోవాలనిపించింది. వెంటనే మంత్రిని పిలిచి "నీవు రాజ్యాన్ని చూసుకుంటా వుండు. నేను అడవిలోకి పోయి జంతువులను వేటాడొస్తా" అన్నాడు. మంత్రి 'సరే' అన్నాడు. రాజు వెయ్యిమంది సైనికులను వెంటేసుకొని వేటకు వెళ్ళినాడు. వాళ్ళు పోయినేది అట్లాంటిట్లాంటి అల్లాటప్పా అడవి కాదు. చానా చానా పెద్దది. యాడ చూసినా పులులూ, సింహాలూ, ఎలుగుబంట్లూ, ఏనుగులూ కనబడసాగినాయి. వాటిని చూసి రాజు భయంతో వణికిపోయినాడు.

"ఓరినాయనోయ్... మరీ ఇంత పెద్ద జంతువులా... దాండ్లను నేను పట్టుకోవడం సంగతేమోగానీ, వాటికి నేను దొరక్కుంటే చాలు" అనుకోని "రేయ్... ఇంత పెద్ద పెద్ద జంతువులు వద్దు గానీ... ఏవయినా చిన్నచిన్న జంతువులుంటే చూడండి. వేటాడుదాం" అన్నాడు.

సైనికులు 'సరే' అని వెదుకుతా వుంటే వాళ్ళకి ఒకచోట ఒక చిన్న ఎలుక కనబడింది. వెంటనే వాళ్ళు గట్టిగా "రాజా... రాజా... భయంకరమైన ఎలుకమృగం పారిపోతా వుంది. రండి. వేటాడుదాం" అని అరిచినారు. వెంటనే రాజు ఒక పెద్ద కత్తి తీసుకోని, సైనికులతో దాని వెంట పడినాడు. ఆ అరుపులకి, కేకలకి భయపడిన ఆ ఎలుక చించుకోని వురకసాగింది. అట్లా వురుకుతా... వురుకుతా... అది ఒక పెద్ద కొండ కింద వున్న ఒక చిన్న కన్నంలోనికి దూరింది. రాజు ఆయాసపడతా సైనికులతో ఆడికి చేరుకున్నాడు.

"రాజా... మీ దెబ్బకి భయపడి ఆ ఎలుకమృగం పారిపోయి ఆ కన్నంలో దాక్కుంది" అన్నాడు ఒక సైనికుడు.



‘‘యాడికి పోతాదో నేనూ చూస్తా... ఈరోజుతో అదో నేనో తేలిపోవాల” అంటూ రాజు మీసం దువ్వి కత్తి పట్టుకోని ఆ కలుగు పక్కనే కూచున్నాడు. రాజుతోపాటు సైనికులందరూ కత్తులూ, బళ్ళాలూ పట్టుకోని కాపలా కాయసాగినారు. ఒకరోజంతా గడిచింది గానీ ఎలుక మాత్రం భయంతో బైటకు రాలేదు. దాంతో రాజుకి ఇంకా పట్టుదల పెరిగిపోయింది. వెంటనే రాజ్యం నుండి మరో వెయ్యిమంది సైనికులను పిలిపించినాడు. పెద్దపెద్ద వలలు తెప్పించి ఎలుక ఎటూ పారిపోకుండా కొండ చుట్టూ కట్టించినాడు. సైనికులను వల బైట అడుగుకొక్కని చొప్పున కత్తులతో కాపలా పెట్టించినాడు. కూలీలను పిలిపించి కొండను తవ్వమన్నాడు. వాళ్ళు ఏడు పగళ్ళు, ఏడు రాత్రుళ్ళు కష్టపడి తవ్వేసరికి ఎలుక బైటపడింది. అది పారిపోతా వుంటే సైనికులు వలలేసి ఆఖరికి దాన్ని పట్టుకున్నారు.

వెంటనే రాజు దాని నాలుగు కాళ్ళు కట్టేసి, అందరికీ కనబడేలా ఒక ఎత్తయిన స్తంభం మీద పెట్టి, మేళతాళాలతో రాజ్యమంతా తిరగసాగినాడు. అది చూసి జనాలకు ఒకవైపు నవ్వు వస్తా వున్నా... ఏమంటే ఏమవుతుందో అనే భయంతో “జై మహారాజా... జైజై మహారాజా” అంటూ వీధులకు రెండు వైపులా నిలబడి పూలు చల్లుతా అరవసాగినారు.

ఆ చప్పుళ్ళకు, అరుపులకు ఎలుక బాగా బెదిరిపోయింది. ఎట్లాగయినా తప్పించుకోవాలని కాళ్ళకు కట్టిన తాళ్ళను కొంచం కొంచం కొరకసాగింది. అట్లా కొరుకుతా వుంటే అవి కొంచం కొంచం తెగుతా తెగుతా ఆఖరికి అన్నీ వూడిపోయినాయి. అంతే... అది ఒక్కుదుటున పైనుండి కిందకు దుంకి జనాల కాళ్ళ మధ్య దూరి వురకసాగింది. అది చూసి రాజు, సైనికులు మళ్ళా దాని వెంట పడినారు. అది అట్లా వురుకుతా... వురుకుతా... ఒక గుడిసెలోకి దూరింది. సైనికులు చుట్టుముట్టుకొని ఎంత వెదికినా దొరకలేదు.

దాంతో రాజుకు చానా కోపమొచ్చింది. వెంటనే ఒక కాగడా తీసుకోని గుడిసెకు అంటించినాడు. ఆ గుడిసె చుట్టూ చానా గుడిసెలున్నాయి. దాంతో మంటలు మిగతా గుడిసెలకు గూడా పాకినాయి. అప్పుడే పెద్ద ఎత్తున గాలి వీచడంతో మంటలు ఇంకా పెద్దగయి చుట్టూ వున్న ఇళ్ళకు, మిద్దెలకు గూడా పాకినాయి. అట్లా కొద్ది గంటల్లోనే రాజ్యం మొత్తం అంటుకోనింది. జనాలంతా బావుల్లోంచి నీళ్ళు తెచ్చి పోస్తా వున్నారు గానీ మంటలు కొంచం గూడా ఆరడం లేదు.

దాంతో... రాజు సైనికులను పిలిచి “రేయ్... వూరినానుకొని పెద్ద చెరువుంది గదా... పోండి... పోయి దాని కట్ట తెగ్గొట్టండి. నీళ్ళన్నీ వూర్లోకొచ్చి అంతా ఆరిపోతుంది” అని పంపించినాడు. కానీ ఆ చెరువు మామూలు చెరువు కాదు. దాన్నిండా మొసళ్ళు, విషపు పాములు వున్నాయి. జనాలు పొరపాటున గూడా ఆ చెరువు వంక

పోరు. అటువంటిది సైనికులు పోయి కట్ట తెగ్గొట్టగానే నీళ్ళు... దాంతోపాటు మొసళ్ళు, పాములు వూర్లోకి వచ్చేసినాయి. ప్రజలకు ఏం చేయాల్నో అర్థం కాలేదు. ఒక పక్క మంటలు, మరొకపక్క మొసళ్ళు. దిక్కుతోచక అల్లాడసాగినారు. చానా మంది చనిపోయినారు. చానా వరకు ఇళ్ళన్నీ కాలిపోయినాయి.

రాజు చేసే తిక్క పనులన్నీ చూసీ చూసీ ఆ వూరి మంగలాయనకు చానా కోపమొచ్చింది. అందరికీ గుండ్లే కావడంతో పెద్దగా పనీ దొరకడం లేదు. డబ్బులూ రావడం లేదు. దాంతో పాటు చెరువునీళ్ళ దెబ్బకి వున్న కొట్టం కాస్తా కొట్టుకోనిపోయింది. దాంతో వేరే దారి లేక ఆ వూరొదిలి వేరే చోటికి పోవాలని అనుకున్నాడు. పోయే ముందు ఎట్లాగయినా ఆ తిక్కరాజుకు తగిన శాస్తి చేయాలని అనుకున్నాడు.

ఆరోజు అర్ధరాత్రి అందరూ పండుకున్నాక మంగలాయన కత్తి తీసుకోని రాజభవనంలోనికి చప్పుడు కాకుండా పిల్లిలెక్క దూరినాడు. ఒకొక్క గదే దాటుకుంటా... దాటుకుంటా... ఆఖరికి రాజుండే గదికి చేరుకున్నాడు. రాజు మంచమ్మీద పడి హాయిగా గురకలు పెడ్తా వున్నాడు. మంగలాయన మట్టసంగా చప్పుడు కాకుండా రాజుకాడికి పోయి కత్తి తీసి నిద్ర చెడకుండా నున్నగా గుండు గీసి, మీసాలు కూడా తీసేసి ఆన్నించి వచ్చిందారిన వచ్చినట్టు వెళ్ళిపోయినాడు.

పొద్దున్నే తిక్కరాజు లేచి వేపపుల్లతో పళ్ళు తోముకుంటా అద్దంలో చూసుకున్నాడు. అందులో నున్నని గుండు జుట్టు, మీసాలు లేకుండా కనబడింది. వెంటనే రాజు అదిరిపడి “అరెరే. ఎవడో రాత్రికి రాత్రి నా తల తీసేసి వేరే వాళ్ళ తల పెట్టినట్టున్నాడు” అనుకున్నాడు. వెంటనే మంత్రిని పిలిపించి “నా తల ఎవడో ఎత్తుకుపోయినాడు. వెంటనే సైనికులను దేశమంతా మూలమూలకు పంపించి వెదికించండి. వారంలోగా నా తల నాకు తిరిగి తేకపోతే మీ అందరి తలలు తీయించేస్తాను” అని బెదిరించినాడు.

మంత్రికి ఏం చేయాల్నో అర్థం కాలేదు. ఈ తిక్కలోడు ఒక్కమాట అన్నాడంటే ఖచ్చితంగా చేసి తీర్తాడు. వీనికి అసలు విషయం చెప్పినా కొంచం గూడా అర్థం కాదు. ఇక వీన్తో లాభం లేదు. ఎట్లాగయినా సరే ఈ రాజ్యానికి వీని పీడ తొలగించాల్సిందే అనుకున్నాడు. దాంతో ఒక బొమ్మలు చేసే వాని దగ్గరికి పోయి అచ్చం రాజు తలమాదిరే వుండేటట్లు ఒక బొమ్మ తల చేయించి రాజు దగ్గరికి తీసుకొని వచ్చినాడు.

రాజు అది చూసి సంతోషించి “వెంటనే ఈ గుండు తల తీసేసి నా తల నాకు పెట్టండి” అంటూ కత్తి తీసుకొని తన తల తానే నరుక్కుని చచ్చిపోయినాడు. ఆ తిక్కరాజు పీడ తొలగిపోయినందుకు ఆ వూరి జనాలంతా సంతోషించి సంబరాలు చేసుకున్నారు.

# 14 పిరికివానితో చేతులు కలపకు

ఒకూర్లో ఒక రైతుండేటోడు. ఆయనకో పెండ్లాముండేది. ఆమె చానా తెలివైనది. వాళ్ళకు ఇద్దరు చిన్న పిల్లలున్నారు. ఒకసారి పండుగకని వాళ్ళు వాళ్ళ అత్తోళ్ళ వూరికి బైలుదేరినారు. అప్పట్లో ఇప్పట్లా రైళ్ళూ, బస్సులూ, రోడ్లూ లేవు గదా... యాడికైనా సరే నడుచుకుంటానే పోవాలి. నడుచుకుంటానే రావాలి.

వాళ్ళు అట్లా పిల్లల్తో పోతా వుంటే ఒక పెద్ద అడవి వచ్చింది. ఆ అడవి దాట్తానే వాళ్ళ వూరు. వాళ్ళు అడవిలో సగం దూరం పోయినాక నడిచీ నడిచీ కాళ్ళు నొప్పి పెట్టి ఒక చెట్టు కింద కూలబన్నారు. పిల్లోళ్ళు వాళ్ళ నాయనతో "నాయనా.. ఆకలితో అల్లాడిపోతా వున్నాం. ఏవైనా పండ్లుగానీ, కాయలుగానీ వుంటే తీసుకోనిరా" అన్నారు. సరేనని వాళ్ళ నాయన పండ్ల కోసం చుట్టూ చూసినాడు. కానీ యాడా ఏమీ కనబళ్ళేదు. దాంతో "సరే... మీరిక్కడే హాయిగా కాసేపు కూచోండి. నేను పోయి ఈ చుట్టుపక్కల యాడైనా ఏమైనా దొరుకుతాయేమో చూసొస్తా" అని పోయినాడు.

ఆ అడవిలో ఒక పులి వుంది. అది చూడ్డానికి ఎత్తుగా, లావుగా, భయంకరంగా వుంటాది గానీ వుత్త పిరికిది. చిన్న చిన్న జంతువులను వేటాడ్డమే గానీ పెద్ద జంతువుల జోలికి అస్సలు వెళ్ళేది కాదు. ఆ రోజు దానికి పొద్దున్నుంచీ ఒక్క జంతువూ దొరకలేదు. ఆకలితో అల్లాడిపోతా ఆహారం కోసం వెదుక్కుంటా తిరుగుతా వుంటే చెట్టు కింద ఈమె ఇద్దరు చిన్న పిల్లల్తో కనబడింది. దాంతో దానికి నోరూరింది. 'ఆమె ఏమైనా పక్కకి గానీ పోతే ఆ పిల్లల్లో ఎవర్నో ఒకర్ని ఎత్తుకోని పోయి కమ్మగా తినొచ్చుగదా' అని సంబరపడింది. మట్టసంగా చప్పుడు గాకుండా అడుగులో అడుగు వేసుకుంటా దగ్గరికి వచ్చి ఒక పొద వెనుక దాచిపెట్టుకోని నిక్కి నిక్కి చూడసాగింది.

ఆకులు వూకూకెనే కదులుతా వుంటే ఆమెకు అనుమానం వచ్చింది. లోపలేదో వుందని తల దించుకున్నట్టే దించుకోని మట్టసంగా గమనించసాగింది. ఇంకేముంది పెద్దపులి. తొంగి తొంగి చూస్తా వుంది. దాన్ని చూస్తానే ఆమె పై ప్రాణాలు పైన్నే పోయినాయి. భయంతో గుండె ధనధనా కొట్టుకోనింది. ఒళ్ళంతా చెమటలు పట్టినాయి. 'ఎట్లాగబ్బా దాన్నుంచి తప్పించుకోవడం' అని ఆలోచించసాగింది. 'కండ్ల ముందు ఆహారం కనబడతా వున్నా మీదికి దూకకుండా అట్లా తొంగి తొంగి చూస్తా వుందంటే ఇది చానా పిరికిదై వుండాలి' అనుకోనింది. దాంతో ఆమెకు ఛటుక్కున ఒక ఉపాయం తోచింది. వెంటనే చిన్న పిల్లోని వీపుపై గట్టిగా ఒక్క గిచ్చు గిచ్చింది. అంతే... వాడు వీపు సుర్రుమనే సరికి తట్టుకోలేక 'ఓ' అని అడవంతా అదిరిపోయేలా భయంకరంగా ఏడవడం మొదలుపెట్టినాడు.

అది చూసి ఆమె పైకి లేచి గట్టిగా పులికి వినబడేలా "ఏందిరా.. ఎప్పుడు చూసినా వూకె ఆకలి ఆకలి అంటా అట్లా ఏడుస్తా వుంటావు. పొద్దున్నే గదా ఒక పెద్ద ఏనుగును పట్టుకోని కమ్మగా కూర చేసి పెట్టింది. అప్పుడే అరిగిపోయిందా... కొంచెమాగు... ఈ అడవిలో ఒక పెద్దపులి తిరుగుతా వుందంట. అది కనబడగానే కమ్మగా కోసి పెడతా" అనింది.

అంతే ఆ మాటలింటానే పెద్దపులి అదిరిపడింది. "ఓరినాయనోయ్... ఇది అందరిలాగా అట్లాంటిట్లాంటి మామూలు ఆడది కానట్లుంది. ఏ బ్రహ్మరాక్షసో, రక్తపిశాచో అయ్యుంటాది. దీనికి దొరికితే అంతే. ఈ రోజుతో భూమ్మీద నాకు నూకలు చెల్లిపోతాయ్" అనుకోని వెనక్కి తిరిగి చూడకుండా వేగంగా కిందామీదా పడతా పారిపోసాగింది.

అదట్లా వురుకుతా వుంటే దారిలో ఒక నక్క చూసింది. అది దానికి అడ్డం పడి "ఏం మామా... అట్లా వురుకుతా వున్నావు. ఏమైంది" అనింది.

"అల్లుడూ...ఇది తీరిగ్గా కూచోని కబుర్లు చెప్పుకునే సమయం గాదు. వెనుక ఆపద ముంచుకొస్తా వుంది. పొరపాటున దానికి గనుక దొరికినానంటే అంతే, వుత్త పుణ్యానికే చచ్చిపోతాను" అనింది వురకడం ఆపకుండా.

నక్క గూడా పులి వెంబడే వురుకుతా "అదేంది మామా... అంత మాటంటావు. ఈ అడవిలో జంతువులన్నీ నువ్వు కలలో కనబన్నా చాలు ఎక్కడివక్కడ గుండె ఆగి చస్తాయి. అట్లాంటిది నువ్వు బెదపడి పారిపోవడమా... ఏం జరిగింది" అని అడిగింది సమాచారం కోసం. అప్పుడు పులి గసబెడతానే జరిగిందంతా చెప్పింది.

ఆ మాటలు విన్న నక్క "మామా.. నువ్వంటే ఏమనుకుంటా వున్నావు. ఈ అడవికి రాజువి. ఒక్కరుపు అరుస్తే చాలు ఏడేడు పధ్నాలుగు లోకాలు గజగజా వణికిపోతాయి. అదెవతో గానీ నిన్ను మాటల్తో మాయ చేసి



బోల్తా కొట్టిచ్చినట్లుంది. పద... ఈసారి నేనూ వస్తా... చూసుకుందాం దాని కత" అనింది రెచ్చగొడతా.

ఆ మాటలకు పులి అట్లాగే వణుకుతా "చూడు అల్లుడూ నువ్వు ఎన్నయినా చెప్పు. తలకిందులు తపస్సు చేసినా నేను రాను. నీకేం తెలివైనవాడివి. ఏలికేస్తే కాలికి, కాలికేస్తే ఏలికి ఏసి తప్పించుకునే రకం. ఏమైనా చెబుతావు. ఎన్నయినా చేస్తావు. చచ్చేది నేను గానీ నువ్వు కాదు గదా" అనింది.

దాంతో నక్క "మరీ అంత భయమైతే ఎట్లా మామా... నిన్నొదిలి నేనెక్కడికీ పారిపోనులే. ఒక పని చేద్దాం. నా కాలికి నీ కాలికి వూడిపోకుండా గట్టిగా ఒక తాడు కట్టుకుందాం. చావైనా బ్రతుకైనా కలిసే పోదాం... సరేనా" అనింది.

దాంతో పులి చివరకు 'సరే' అనింది. నక్క ఒక తాడు తెచ్చింది. పులి దాంతో తన కాలికి, నక్క కాలికి ఎంత లాగినా వూడిపోకుండా గట్టిగా కట్టు కట్టింది. రెండూ కలిసి మళ్ళా నెమ్మదిగా అడవిలోనికి పోసాగినాయి.

ఆడ ఆమె అడవిలో 'పండ్లు తెస్తానని పోయిన మొగుడు ఎప్పుడెప్పుడు వస్తాడా... ఈ చోటు వదిలేసి ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా' అని ఎదురుచూడసాగింది. ఆమె 'పులి గానీ మళ్ళా వస్తాదో ఏమో' అనుకోని చెట్టు ఎక్కి అప్పుడప్పుడు చుట్టూ గమనిస్తా వుంది. అంతలో ఆమెకు దూరంగా పులి, నక్కా ఒకదానికొకటి తాడు కట్టుకోని కలసి రావడం కనబడింది. అవి అట్లా తాడు కట్టుకోని రావడం చూసి "ఓహో... ఈ నక్క దాన్ని మళ్ళా పిల్చుకోని వస్తా వున్నట్లుంది. రానీ రానీ దగ్గరికి" అనుకోనింది.

పులీ నక్కా మట్టసంగా దాచిపెట్టుకుంటా, దాచిపెట్టుకుంటా ఆ చెట్టు దగ్గరికి వచ్చినాయి. అవి అట్లా దగ్గరికి రాగానే ఆమె ఈసారి ఇద్దరు పిల్లల వీపుల మీద గట్టిగా ఒక్క గిచ్చు గిచ్చింది. అంతే... వాళ్ళు ఓ అంటా అటు ఆరు వూర్లు, ఇటు ఆరు వూర్లు అదిరిపడేలా గట్టిగా ఏడుపు అందుకున్నారు. ఆ ఏడుపు వింటానే ఆమె "అరే... ఎన్ని సార్లు చెప్పాల్రా మీకు... ఏదో ఒక పులో సింహమో దొరికితే కోసి పెడతానని. కాసేపు గమ్మునుండండి. ఇక్కడెక్కడో దగ్గర్లోనే ఒక పులీ, నక్కా వున్నట్లున్నాయి. వాసన కమ్మగా వస్తా వుంది. వుండండి పట్టుకోనొస్తా" అంటా పైకి లేచింది, జుట్టు విరబోసుకోని, ముక్కు ఎగబీలుస్తా.

అంతే... ఆ మాట వింటూనే పులి " నే చెప్పలా... అది మామూలు ఆడది గాదు. మనిషి రూపంలోనున్న బ్రహ్మరాక్షసి అని, దొరికినామనుకో నిన్నూ, నన్నూ కలిపి చంపి, కమ్మగా కలిపి పెడతాది" అంటా సర్రున వెనక్కి తిరిగింది. నక్క "వుండు వుండు... అదంతా అబద్దాలు చెబుతోంది. అది నీవనుకున్నట్లు రాక్షసి గాదు మనిషే" అంటా గట్టిగా అరుస్తా వున్నా వినకుండా పులి చించుకోని వురకసాగింది. దాని కాలు నక్క కాలుకి గట్టిగా కట్టి వుంది గదా... దాంతో అది గూడా పులి వెంబడే కిందా మీదా పడతా వురకసాగింది. కానీ నక్క పులంత వేగంగా వురకలేదు గదా... దాంతో కిందబడిపోయింది.

అయినా పులి ఒక్క క్షణం గూడా ఆగలేదు. అట్లాగే నక్కను ముళ్ళకంపలల్లో, బండరాళ్ళల్లో ఈడ్చుకుంటా వురకసాగింది. దాంతో దానికి రాళ్ళు తగిలీ, ముళ్ళు గుచ్చుకోని ముక్కూ మొగం వాచిపోయినాయి. దాంతో అది ముక్కుతా మూల్గుతా "ఎవరితోనైనా పోవచ్చుగానీ పిరికోనితో మాత్రం కలసి పోగూడదు, అది చివరికి మన కొంపే ముంచుతాది అంటారు పెద్దలు. అది నిజమే" అనుకోనింది కళ్ళనీళ్ళతో....

# 15 బంగారు ఆవు

ఒకూర్లో రంగన్నని ఒకదుండేటోడు. వాడు చానా బీదోడు. ఆడా ఈడా పనిచేసి వచ్చిన డబ్బుల్తో బతికేటోడు. ఆయనకో కూతురుంది. ఆమె సక్కదనాల సుక్క. కూతురంటే రంగన్నకు చానా ప్రేమ. తాను తిన్నా తినకపోయినా కూతురికి మాత్రం ఏ లోటూ రాకుండా చూసుకునేటోడు. కొంతకాలానికి ఆమె పెద్దగైంది. పెద్దగైనాక పెండ్లి చేయాల గదా. పెండ్లి చేయాలంటే చానా డబ్బులు కావాల గదా... అంత డబ్బు రంగన్న దగ్గర లేదు. అందుకని ఆ వూరి రాజు దగ్గరకు పోయి "రాజా... రాజా... నా కూతురికి పెండ్లి వయసొచ్చింది. సాయం చేయవా" అనడిగినాడు.

ఆ రాజుకు అరవై ఏండ్ల వయసుంటాది. వాడు చానా దుర్మార్గుడు. రంగన్న కూతురి అందాన్ని చూసి "ఇంతందమైన పిల్లను ఎవరికో ఇచ్చి ఏం పెండ్లి చేస్తావు. నాకు నచ్చింది. నేనే చేస్కుంటా" అన్నాడు. ఆ మాటలకు రంగన్న అదిరిపన్నాడు. ఇయ్యనంటే ఏం చేస్తాడో ఏమో అని భయపడి లోలోన తిట్టుకుంటా సరేనన్నాడు.

విషయం తెలిసి రంగన్న కూతురు కండ్లనీళ్ళు పెట్టుకోనింది. ఆ ముసలిరాజు నుండి ఎలా తప్పించుకోవాలబ్బా అని ఆలోచించీ..ఆలోచించీ. "రాజా.రాజా. నువ్వంటే నాకిష్టమే. కానీ నాకో పెద్ద బంగారు ఆవును చేపిచ్చియ్యి. అట్లాగైతే చేస్కుంటా" అనింది. సరేనని రాజు ఒక పెద్ద బంగారు ఆవును చేపిచ్చి ఆమెకిచ్చినాడు.

పెండ్లిరోజు ఆమె పట్టుచీర కట్టుకొస్తానని లోపలికిపోయి ఎవరికీ కనబడకుండా మట్టసంగా ఆవులో దూరి దాచిపెట్టుకోనింది. ఎంతసేపైనా ఆమె రాకపోయేసరికి రాజు పెండ్లికూతుర్ని తీసుకురమ్మని భటుల్ని పంపిచ్చినాడు. వాళ్ళు పోయి చూస్తే ఇంగేముంది. యాడా కనబళ్ళేదు. భటులు రాజభవనం మొత్తం అడుగడుగునా వెదికినారు. ఐనా ఆమె యాడుందో ఎవరూ కనిపెట్టలేకపోయినారు. దాంతో రాజు పెండ్లి ఆగిపోయింది.

రాజు ఇంట్లో వున్న ఆ బంగారు ఆవును చూసి "పెండ్లే ఆగిపోయింది. ఇంక ఈ బంగారు ఆవెందుకు. దీన్ని తీస్కోనిపోయి అమ్మేయ్యండి" అన్నాడు. భటులు దాన్ని తీస్కోనిపోయి సంతలో అమ్మకానికి పెట్టినారు. పక్కవూరి రాజు కొడుకు ఆ ఆవును చూసి "అబ్బ. ఎంత చూడముచ్చటగా వుందిది" అనుకోని దాన్ని కొనుక్కోనిపోయి తన గదిలో పెట్టుకున్నాడు.

ఆ రాజకుమారునికి అంతకుముందే పెళ్ళయ్యింది. ఆమె చానా టక్కరిది. చీటికీ మాటికీ మొగున్తో కొట్లాడి పుట్టింటికి పోయేది. ఎప్పుడూ పుట్టింట్లోనే వుండేది. ఈ రాకుమారుడు బంగారు ఆవును తెచ్చుకున్నప్పుడు గూడా ఆమె పుట్టింట్లోనే వుంది.

బంగారు ఆవు రాజకుమారుని గదిలో వుంది గదా... రోజూ రాత్రి కాగానే ఆమె ఆవులోంచి బైటకొచ్చి ఆదున్న అన్నం, పండ్లు బాగా తిని మళ్ళా ఎవరికీ కనబడకుండా ఆవు లోపల దూరి దాచిపెట్టుకొనేది. రాకుమారుడు "ఇదేందబ్బా. నేను తినకుండానే రోజూ పొద్దునకల్లా అన్నీ మాయమైపోతా వున్నాయ్. ఇదేందో కనుక్కోవాల" అనుకున్నాడు.

ఆ రోజు రాత్రి నిద్ర రాకుండా చిటికెనవేలు కోసుకోని దానికి నిమ్మకాయ పెట్టుకున్నాడు. వేలు సుర్రుమంటా వుంటే ఇంక నిద్ర యాన్నుంచొస్తాది. దాంతో మంచమ్మీద కదలకుండా పన్నుకోని ఒక కన్ను తెరచి చీకట్లో బాగా చూడసాగినాడు.

ఆవు లోపలున్నామెకి ఈ విషయం తెలియదు గదా. దాంతో ఎప్పట్లాగే అర్ధరాత్రి కాగానే బంగారు ఆవులోంచి బైటకొచ్చి అన్నీ తినడం మొదలుపెట్టింది. అది చూసి రాకుమారుడు వెనుక నుండి చప్పుడు కాకుండా నెమ్మదిగా ఆమె దగ్గరకొచ్చి చటుక్కున చేయి పట్టుకొని "ఎవర్నువ్వు. దేవతవా? దయ్యానివా? రాక్షసివా? మానవ కన్యవా? చెప్పు" అనడిగినాడు. అప్పుడామె కండ్లల్లో నీళ్ళు కారిపోతా వుంటే జరిగిందంతా ఏడుస్తా చెప్పింది. అప్పుడా రాకుమారుడు ఆమె కండ్లు తుడ్చి "ఇంకేం భయపడొద్దు. ఇప్పన్నుంచి నువ్వు నాతోనే వుండు" అంటూ ఆమెను పెండ్లి చేసుకున్నాడు.

రాజు పెద్ద భార్యకు ఈ విషయం తెలిసి వురుకులు, పరుగుల మీద ఇంటికొచ్చింది. చిన్న రాణిని చూసి "అబ్బ. ఇది నాకంటే ఎంతందంగా వుంది. దీన్నెలాగైనా ఈన్నించి తరిమెయ్యకపోతే రాజు నావంక అస్సలు చూడడు" అనుకోనింది.

ఒకరోజు చిన్నామె దగ్గరకు పోయి "మన తోట చానా అందంగా వుంటాది. పోయొద్దాం రా" అంటూ తీస్కోని పోయింది. అక్కడ ఒక పెద్ద చెరువుంది. ఆ చెరువుకాడికి తీసుకోని పోయి "నీవందంగా వున్నావో. నేనందంగా వున్నానో నీళ్ళలో చూసుకుందామా" అనింది. దానికి చిన్నరాణి "ఎవరందం వాళ్ళదిలే అక్కా మనలో మనకు పోటీ ఎందుకు" అనింది. ఐనా పెద్దరాణి ఒప్పుకోలేదు. దాంతో సరేనని చిన్నామె చెరువులోనికి తొంగి చూసింది. వెంటనే పెద్దరాణి వెనుక నుంచి దభీమని ఆమెను చెరువులోనికి తోసేసింది.

చెరువులో పడిన చిన్నరాణి అందమైన వేయి రేకుల తామరపూవై పుట్టింది. ఒకరోజు రాకుమారుడు చెరువులో స్నేహితులతో ఈదులాడతా వుంటే వాళ్ళకు తామరపువ్వు కనబడింది. "అబ్బ ఎంతందంగా వుందీ తామరపువ్వు" అనుకుంటా అందరూ దాన్ని పట్టుకోడానికి పోయినారు. అది ఎవరికీ దొరకలేదు. కానీ ఆ తామరపూవు రాకుమారుడు ఎటువైపు ఈదులాడితే అటువైపు రాసాగింది. అది చూసి "ఇదేందబ్బా ఇది నా దగ్గరికే వస్తా వుంది" అనుకోని ఆశ్చర్యపోయి దాన్ని కోసుకోని ఇంటికి తీసుకోని పోయినాడు.

పెద్దరాణి ఆ వేయి రేకుల తామరపూవును చూసి "ఓహో... ఇది తామరపూవై పుట్టి మళ్ళా ఇంట్లోకి వచ్చిందే" అని కనుక్కోని దాని రెక్కలన్నీ ఇష్టమొచ్చినట్టుగా తెంపి విసిరి పెరట్లో పాడేసింది.

పెరట్లో పడిన ఆ తామరపూవు ఆన్నే మల్లెతీగై మొలిచింది. రాత్రికి రాత్రి పెద్ద చెట్టై కుప్పలు తెప్పలుగా పూలు కాయసాగింది. ఆ పూలవాసన రాజభవనమంతా నిండిపోయింది. రాకుమారుడు "ఇదేందబ్బా ఇంత మంచి వాసనొస్తా వుంది" అని ఆ మల్లెపూలన్నీ తెంపుకోనొచ్చి గదంతా చల్లుకున్నాడు.

పెద్దరాణి ఆ మల్లెపూలను చూసి "ఓహో! ఇది మళ్ళా మల్లెతీగై పుట్టిందా" అనుకోని రాజు బైటకు పోయినప్పుడు ఆ చెట్టు మొత్తం పెరికి కుప్పేసి, కిరసనాయిలు పోసి అంటించింది. అది కాలి బూడిద కాగానే దాన్ని వూరిబైట పాడేసింది. వెంటనే బూడిద పన్నచోటల్లా రాత్రికి రాత్రి పెద్దపెద్ద మామిడి చెట్లు మొలిచినాయి.

ఆ వూరి రాణి దగ్గర ఒక చాకలాయన వుండేటోడు. వాడు బట్టల మూటెత్తుకోని వస్తా వుంటే మామిడితోట కనబడింది. "ఇదేందబ్బా నిన్నటి వరకూ ఈడ ఒక్క చెట్టు కూడా లేదు. రాత్రికి రాత్రి తోట తయారైంది." అని ఆశ్చర్యపోయినాడు. తోట మధ్య పోతా వుంటే ఒక చెట్టుకు ఒక పెద్ద మామిడికాయ కనబడింది. "ఇదేందబ్బా ఇంత లావుంది. నేనింత వరకు ఇంతలావు పండును ఎప్పుడూ చూస్నేలేదు" అనుకోని నెమ్మదిగా దానిని తెంపి పెద్ద గోనెసంచిలో మూటగట్టుకోని ఇంటికి తీసుకోని పోయినాడు.

కత్తి తీసుకోని దాన్ని కోయబోతున్నంతలో లోపల్నుంచి "జాగ్రత్త...! జాగ్రత్త...! నా కాలో చేయో తెగకుండా నెమ్మదిగా కోయి" అని వినబడింది. "ఇదేందబ్బా మామిడిపండు మాట్లాడతా వుంది" అని ఆశ్చర్యపోయి నెమ్మదిగా కోసి చూస్తే ఇంగేముంది లోపల్నుంచి కిలకిలకిల నవ్వుకుంటూ చిన్నరాణి బైటకొచ్చింది. వాడు ఆమెను చూసి "నాకెట్లాగూ పిల్లల్లేరు. దేవుడే నిన్ను పంపిచ్చినాడు. నువ్వు నా దగ్గరే వుండు" అని పెంచుకోసాగినాడు.

ఒకసారి ఆ చాకలాయనకి పెద్ద జ్వరమొచ్చి మంచమ్మీద నుండి లేవలేకపోయినాడు. ఎన్ని రోజులైనా బట్టలు తేకపోయేసరికి పెద్దరాణి "ఏమయిందబ్బా వీనికి" అని వానింటికొచ్చింది. ఆడ వాని కూతుర్ని చూసి "ఇది అచ్చం చిన్నరాణి లెక్కనే వుందే. ఐతే ఇది మళ్ళా చాకలాయన కూతురి లెక్క పుట్టిందన్న మాట. ఎట్లాగైనా సరే దీన్ని చంపెయ్యాలి" అనుకోనింది.

ఇంటికి పోయి మంచమ్మీద పండుకోని "అమ్మా... అబ్బా..." అని మూలగడం మొదలుపెట్టింది. అది చూసి రాజు "ఏమైందే. అట్లా బాధ పడతా వున్నావ్" అనడిగినాడు. దానికామె తల పట్టుకోని "నిన్నటి నుంచీ ఒకటే తలనొప్పి.ఎన్ని మందులేసుకున్నా తగ్గడం లేదు. మన చాకలాయన వున్నాడు గదా. వాని కూతుర్ని చంపి ఆ రక్తం నా తలకు పూస్తే తప్ప నా నొప్పి తగ్గదు" అని చెప్పింది. ఆమెది దొంగ తలనొప్పని తెలీని ఆ రాకుమారుడు మంత్రిని పిల్చి ఆమెను చంపి నెత్తురు తెమ్మన్నాడు.

మంత్రి భటులను తీసుకోని చాకలాయన కూతురిని చంపడానికి వాళ్ళింటికి పోయినాడు. ఆమెను చూసి "ఈమెవరబ్బా. అచ్చం తప్పిపోయిన మా చిన్నరాణి లెక్కనే వుందే" అనుకోని, ఆమెను చంపకుండా వురుక్కుంటా పోయి రాకుమారునికి విషయమంతా చెప్పినాడు.

వెంటనే రాకుమారుడు గుర్రమెక్కి వేగంగా ఆడికొచ్చి ఆమెను చూసి ఆశ్చర్యపోయి "ఎవర్నువ్వు. అచ్చం నా చిన్న పెళ్ళాం మాదిరే వున్నావ్" అనడిగినాడు. అప్పుడామె జరిగిందంతా చెప్పింది.

దాంతో రాజు సంబరంగా ఆమెను ఇంటికి తీసుకోనిపోయి పెద్ద రాణిని పిలిచి "ఛీ... ఛీ... నీవింత దుర్మార్గురాలివనుకోలేదు. ఫో నా ఇంట్లోంచి" అని దొబ్బేసినాడు. అది చూసిన చిన్న రాణి మొగుని చేయి పట్టుకోని "ఏమోలెండి. తెలియక తప్పు చేసింది. ఆమెను క్షమించి ఇంట్లోకి రానీయండి" అని బతిమలాడింది. రాజు చిన్న రాణి మంచితనాన్ని మెచ్చుకోని ఆమెను ఐదంతస్తుల మేడలో పెట్టి పెద్ద రాణిని పశువుల కొట్టంలో పెట్టినాడు.

# 16 కాకమ్మ - పిట్టమ్మ

ఒక చింతచెట్టు మీద కాకమ్మ, పిట్టమ్మ వుండేటివి. కాకమ్మదేమో కొట్టం. పిట్టమ్మదేమో ఇండ్లు. ఒకరోజు రాత్రి పెద్ద ఎత్తున గాలీవానా వచ్చింది. ఆ దెబ్బకు కాకమ్మ కొట్టం కాస్తా ఎగిరిపోయింది. పిట్టమ్మది ఇండ్లు గదా...దానికేమీ కాలేదు. కాకమ్మ వానలో తడుస్తా... చలికి వణికిపోతా పిట్టమ్మ ఇంటి దగ్గరకొచ్చి "పిట్టమ్మా... పిట్టమ్మా... కొంచెం తలుపు తియ్యవా... నాకొట్టం పడిపోయింది" అని దీనంగా అడిగింది. పిట్టమ్మ చానా మంచిది గదా...దాంతో వెంటనే తలుపు తెరిచి కాకమ్మను లోపలికి రమ్మనింది.

కాకమ్మ బాగా తడిచిపోయింది గదా...అందుకని పిట్టమ్మ దానికి తుడుచుకోవడానికి తువ్వాలు ఇచ్చింది. వేడి వేడి అన్నం చేసి కడుపు నిండా పెట్టింది. పిట్టమ్మ ఇంటి నిండా గంపలే గంపలు. బియ్యం, పప్పులు, బెల్లం, జొన్నలు, గోధుమలు, శెనగలు అట్లా ఒక్కొక్క గంపలో ఒక్కొక్కటి వుండేటివి.

కాకమ్మ అన్నం తిన్నాక "నాకు నిద్రొస్తా వుంది. యాడ పన్నుకోమంటావ్" అనడిగింది. "బెల్లంగంప కాడ పడుకోపో" అనింది పిట్టమ్మ. కాకమ్మ బెల్లంగంప కాడ పన్నుకోని అర్ధరాత్రి మట్టసంగా లేచి బెల్లం తినసాగింది. తింటా వుంటే టకటకమని చప్పుడొస్తాది గదా...ఆ చప్పుడు విని పిట్టమ్మ "కాకమ్మా... కాకమ్మా...ఏందా చప్పుడు" అనడిగింది. దానికి కాకమ్మ "అబ్బే ఏం లేదు. వానకి బాగా తడిసిపోయినాను గదా... అందుకే చలికి పళ్ళు కొట్టుకుంటా వున్నాయి. అంతే" అనింది. "అట్లాగా" అని పిట్టమ్మ అమాయకంగా కాకమ్మ మాటలు నమ్మి నిద్రపోయింది.

కాకమ్మ బెల్లమంతా తిని దాన్నిండా పుర్రు పోసింది. పిట్టమ్మ నిద్రపోతా వుంది గదా...దాంతో నెమ్మదిగా శెనగల గంపలోకి దూరింది. అవన్నీ తినేసి దాన్నిండా పుర్రు పోసింది. అట్లా రాత్రంతా బియ్యం, గోధుమలు, పప్పులు, జొన్నలు అన్నీ తినేసి అన్నిట్లోనూ పుర్రు పోసేసి పొద్దున్నే "నేను పోయొస్తా పిట్టమ్మా" అని ఏమీ ఎరుగని నంగనాచిలెక్క మట్టసంగా యెగిరిపోయింది.

కాకమ్మ పోయిన కాసేపటికి పిట్టమ్మ పిల్లలు నిద్రలేచినాయి. లేచి "అమా... అమా... ఆకలేస్తా వుంది... కాస్త బెల్లం పెట్టు" అన్నాయి. సరేనని పిట్టమ్మ బెల్లం గంపలో చేయి పెట్టింది. అంతే...దాని చేయంతా పుర్రంటుకోనింది. పిట్టమ్మ అదిరిపడింది. ఏ గంప చూసినా పుర్రే. దాంతో పిట్టమ్మకి చానా చానా కోపమొచ్చేసింది. "పాపమని లోపలికి రానిస్తే ఇంత మోసం చేస్తాదా...ఎట్లాగైనా సరే దానికి బుద్ధి చెప్పాల" అనుకోనింది.



వేడివేడి నిప్పుల కుంపటి తెచ్చింది. మంచానికున్న నవారంతా ఇప్పేసి కింద నిప్పుల కుంపటి పెట్టింది. అది కనబడకుండా మంచంపైన దుప్పటి కప్పింది. కాకమ్మ దగ్గరికి పోయి "కాకమ్మా... కాకమ్మా... ఈరోజు నా పుట్టినరోజు. వేడి వేడి బచ్చాలు చేసి వూరందరికీ పెడ్తా వున్నా. నువ్వూ వచ్చి ఒక బచ్చం తినిపోదురా" అని పిల్చింది.

బచ్చమనే సరికి కాకమ్మ నోట్లో నీళ్ళూరినాయి. దాంతో సంబరంగా లొట్టలేసుకుంటా పిట్టమ్మ ఇంటికొచ్చింది. పిట్టమ్మ దాన్ని లోపలికి పిల్చి "వంటింట్లో బచ్చం కాల్తా వుంది. కాసేపు మంచం మీద కూచో... వేడివేడిగా తిందువుగానీ" అనింది.

మంచం కింద నిప్పుల కుంపటి వున్నేది దానికి తెలీదు గదా... దాంతో ఆనందంగా ఎగిరి మంచం మీద కూచోనింది.

మంచానికి నవారు లేదు గదా. దాంతో సర్రున దుప్పటి జారి కిందున్న వేడి వేడి నిప్పుల మీద దభీమని పడింది. ఆ వేడికి కాకమ్మ ఒళ్ళంతా సర్రున కాలింది. ఆ దెబ్బకి కాకమ్మ లబలబలాడతా అన్నించి పారిపోయింది. పిట్టమ్మ పిల్లలు సంబరంగా చప్పట్లు చరిచినాయి.

# 17 సింతకాయంత సిన్నోని కథ

ఒకూర్లో ఒక సింతకాయంత సిన్నోడున్నాడు. ఆ సింతకాయంత సిన్నోడికి పెసరగింజంత పెండ్లాముంది. వాళ్ళకు ఎలక్కాయంత ఎద్దులు, సెనక్కాయంత సేనూ వున్నాయి. ఒకరోజు సింతకాయంత సిన్నోడు సెనక్కాయంత సేనుని ఎలక్కాయంత ఎద్దులతో దున్నుతా వుంటే వంకాయంత వజ్రం దొరికింది.

వెంటనే ఆ సింతకాయంత సిన్నోడు ఆ వంకాయంత వజ్రం తీస్కోనిపోయి బీరకాయంత బీరువాలో పెట్టి తాటికాయంత తాళం వేసినాడు.

అది చూసిన ఒక దోసకాయంత దొంగోడు ఆ తాటికాయంత తాళం పగులగొట్టి బీరకాయంత బీరువాలో నుంచి వంకాయంత వజ్రాన్ని దొంగిలించుకోని పోయినాడు. అది చూసిన ఒక మునక్కాయంత ముసల్ది వెంటనే పొట్లకాయంత పోలీసుకు పనసకాయంత ఫోన్లో చెప్పింది.

వెంటనే ఆ పొట్లకాయంత పోలీసు కాకరకాయంత కారేసుకోనొచ్చి ఆ దోసకాయంత దొంగోన్ని పట్టుకొన్నాడు. ఆ పొట్లకాయంత పోలీసు దోసకాయంత దొంగోన్ని బెండకాయంత బెత్తంతో కొట్టి, జీడికాయంత జైలులో వేసి ఆ వంకాయంత వజ్రాన్ని తీస్కోని పోయి సింతకాయంత సిన్నోడికి తిరిగిచ్చేసినాడు.



# 18 అమాయకునికి పట్టిన అదృష్టం

ఒకూర్లో ఒక అమాయకుడున్నాడు. అమాయకుడంటే పెద్దగా తెలివితేటలు ఏమీ లేనోడన్నమాట. ఒకసారి వాడు బతకడానికి ఏదయినా యాపారం చేద్దామని బట్టలమూట నెత్తిన పెట్టుకోని ఒకొక్కవూరే తిరుగుకుంటా చీకటి పడే సమయానికి ఒక అడవిలోనికి వచ్చినాడు. అప్పటికే బాగా తిరిగీ తిరిగీ అలసిపోవడంతో బట్టలమూట ఒక చెట్టు చాటున దాచిపెట్టి ఆదారిలోనే అడ్డంగా పడి నిద్రపోయినాడు.

అది అమావాస్య. ముందేముందో వెనకేముందో తెలియనంత చిక్కని చీకటి. ఆ చీకట్లో కొందరు దొంగలు దొంగతనానికని ఆదారిలోనే పోతా వున్నారు. వీడు దారి నడుమ పడుకోనున్నాడు గదా... దాంతో ఒక దొంగ చూసుకోక కాలు తగిలి దభీమని కిందపడినాడు. వాడు బాధతో "ఎవడోగానీ చూడు... దారికడ్డంగా ఎంత పెద్ద మొద్దు వేసినాడో" అన్నాడు.

వాని కాలు తగలడంతో నిద్ర లేచిన అమాయకుడు "ఎవర్రా మీరు.. బంగారంలాంటి మనిషిని పట్టుకోని మొద్దంటారా... కొంచమన్నా బుద్దుందా మీకు" అని అరిచినాడు. ఆ మాటలు విన్న దొంగలు "అరెరే... ఈడెవరో మనిషున్నాడే" అని వెంటనే తిరిగి వచ్చి వాన్ని పట్టుకున్నారు. కాగడా వెలుగులో చూస్తే వాడు మట్టిగొట్టుకుపోయిన బట్టల్తో, చింపిరి జుట్టుతో, మాసిపోయిన గడ్డంతో ఒట్టి పేదోనిలెక్క కనబన్నాడు. దాంతో ఒకదొంగ "పద పద... వీని మొగం చూస్తే ఇళ్ళ ముందు అడుక్కుతినేటోని లెక్క వున్నాడు. వీని దగ్గర ఏముంటాయి" అన్నాడు.

ఆ మాటలకు ఆ అమాయకుడు కోపంగా "ఏందయ్యోయ్... తిరిగీ తిరిగీ బట్టలు మాసినంత మాత్రాన మరీ అంత తక్కువ చేసి మాట్లాడడమేనా... నేనేం అడుక్కుతినేటోన్నిగాదు. యాపారస్తున్ని. కావాలంటే చూడండి ఆ చెట్టుపక్కన బట్టల మూటలు" అన్నాడు. దాంతో దొంగలు వాన్ని పట్టుకోని తలా ఒక తన్ను తన్ని బట్టలమూట గుంజుకోని పోసాగినారు. అది చూసి వాడు వురుక్కుంటా వాళ్ళకు అడ్డంపోయి "అనా... అనా... ఈ బట్టలు కట్టుకుంటారా... అమ్ముకుంటారా" అనడిగినాడు.

దానికి వాళ్ళు "కట్టుకుంటే కట్టుకుంటాం... అమ్ముకుంటే అమ్ముకుంటాం. మధ్యలో నీకెందుకురా" అన్నారు కోపంగా."ఏం లేదన్నా. అమ్మేటట్టయితే కొంచం తక్కువకి నాకే అమ్మండి. మూడువేలిస్తా" అన్నాడు.

"ఏందీ... మూడువేలా... అంత డబ్బు యాడుందిరా నీ దగ్గర" అన్నాడో దొంగ."ఏందన్నా అంత మాటంటావ్. మాంసం తింటున్నాం గదాని యెముకలు మెడలో వేసుకోని తిరుగుతారా ఎవరన్నా... డబ్బులు పై జేబులో యెందుకుంటాయి. మీలాంటి దొంగలకి కనబడకుండా లోపలెక్కడో దాచిపెట్టుకుంటాం గానీ" అన్నాడు.

"ఆహా... ఐతే వీని దగ్గర మస్తుగ డబ్బులున్నాయన్నమాట" అనుకోని అందరూ చుట్టూ మూగి కిందామీదా అంతా వెదికి అంగీ లోపలి జేబులో దాచిపెట్టుకున్న డబ్బులన్నీ తీసేసుకున్నారు. వాళ్ళు పోతా వుంటే ఆ అమాయకుడు వురుక్కుంటా పోయి వాళ్ళకు అడ్డంపడి "అనా.. అనా.. తినడానికి గూడా లేకుండా నా దగ్గరున్నదంతా

దోచేసినారు. ఇంక నేనేం చెయ్యాలి. నన్నుగూడా మీ వెంబడే తీసుకోని పోండి. మీరేం చెయ్యమంటే అది చేస్తా. ఏదో తినడానికి ఇంత అన్నం పడేస్తే సాలు" అని అడుక్కోసాగినాడు. దాంతో వాళ్ళు "సరే... రా... జాగ్రత్త. మేము చెప్పినట్టే చెయ్యాలి చూడు" అని తీసుకోని పోయినారు.

వాళ్ళు ఆ రోజు ఆ అమాయకుడుండే వూరికే దొంగతనానికి పోయినారు. ఒక ఇల్లు బాగా కనబడడంతో దాంట్లోకి దూరినారు. వీడు గూడా వాళ్ళతో బాటు లోపలికి దూరతా "అనా... అనా... లోపల ఏం చేయాల" అనడిగినాడు. "ఏముంది... చప్పుడు గాకుండా బంగారం, వెండి దొరికినేవి దొరికినట్లు నున్నగా మూట గట్టేసెయ్" అన్నాడు. దానికి వాడు "వెండి, బంగారమా... ఎట్లుంటాయవి" అని మళ్ళా అడిగినాడు. "ఏముందిరా... పచ్చదంతా బంగారం, తెల్లదంతా వెండి... ఆ మాత్రం తెలీదా" అన్నారు వాళ్ళు.

సరేనని ఆ అమాయకుడు లోపలికి పోయినాడు. చప్పుడు గాకుండా ఒకొక్క గదే దాటుతా వంటింట్లోకి పోయినాడు. అక్కడ ఒక అవ్వ పండుకోనింది. ఆ గదిలో సత్తుగిన్నెలన్నీ తెల్లగా మెరిసిపోతావుంటే, కంచు పాత్రలన్నీ పచ్చగా ధగధగలాడతా కనబన్నాయి. ఆహా... ఎంత బంగారం, ఎంత వెండి అని సంబరపడిపోతా వాటిని ఒకొక్కటే తీసి మూటలో వేసుకోసాగినాడు. కాసేపటికి మూట నిండిపోయింది. ఇంగ ఏం చేయాలబ్బా అని ఆలోచిస్తా వుంటే వంటింట్లో చక్కెర, నెయ్యి, సేమ్యాలు, పాలు కనబన్నాయి. అవన్నీ చూడగానే వానికి నోరూరింది. "అబ్బ! పాయసం తిని ఎన్ని నాళ్ళయింది. వాళ్ళందరూ దొంగతనం పూర్తి చేసేలోగా పాయసం చేసుకొని తాగేద్దాం" అనుకోని పొయ్యి అంటించి పాయసం చేయసాగినాడు.

ఆ గదిలోనే అవ్వ పండుకోనింది గదా... ఆమె చేయి కడుపు మీద పెట్టుకోనింది. కాసేపటికి నిద్రలో ఆ చేయి కిందకు చాచింది. అది చూసిన అమాయకుడు అవ్వ పాయసం కోసం చేయి చాపుతుందేమో అనుకోని "వుండే ముసల్దానా... చేసేటోనికన్నా చూసేటోనికే తొందరెక్కువని... కాసేపు ఆగలేవా... ఐతూనే ఇస్తాగానీ" అంటూ చేయి తీసి మరలా కడుపు మీద పెట్టినాడు. కాసేపటికి మరలా నిద్రలో అవ్వ చేయి పక్కకు చాపింది. అది చూసిన అమాయకుడు "అర్రెర్రే... ఏందా తొందర... ఎప్పుడూ తిండిమొగం చూడనిదాని మాదిరి... ఒక్క నిమిషమాగు ఐపాయలే" అంటూ గిన్నె దించి... గంటెతో వేడి వేడి పాయసం తీసుకోనొచ్చి అవ్వ చేతిలో పోసినాడు.

అంతే... ఒక్కసారిగా చేయి సుర్రుమనేసరికి... అవ్వ "ఓరినాయనోయ్... ఓరిదేవుడోయ్... నా చేతిని ఎవడో కాల్చేసినాడురోయ్" అంటూ గట్టిగా అరుస్తా పైకి లేసింది. ఆ అరుపులకు భయపడిన అమాయకుడు పరుగెత్తబోయి మూటను కొట్టుకున్నాడు. అంతే దానిలోని గిన్నెలన్నీ ధనధనధన పెద్ద చప్పుడు చేస్తా కిందబన్నాయి. అంతే ఆ చప్పుళ్ళకు, అవ్వ అరుపులకు ఇంట్లోవాళ్ళేగాక వీధి వీధంతా వులిక్కిపడి లేచినారు. దొంగలంతా సామాన్లు తీసుకోని పారిపోతా కనబన్నారు. వెంటనే జనాలంతా ఎక్కడోన్ని అక్కడ పట్టుకోని మెత్తగ తన్నినారు. ఆ అమాయకుడు ఆ వూరోడే కాబట్టి, వాని గురించి తెలుసు కాబట్టి వాన్ని ఎవరూ ఏమీ చేయలేదు. తరువాత జరిగిందంతా తెలుసుకోని "రేయ్.. నీవు అమాయకునివయినా చానా మంచి పనే జరిగింది. ఈ దొంగలు అందరు దొంగల్లా అట్లాంటిట్లాంటి అల్లాటప్పా దొంగలు కాదు. పెద్ద గజదొంగలు. చుట్టుపక్కల ఏడేడు పధ్నాలుగూర్లలో వీళ్ళ పేరు చెబితేనే హడల్. వీళ్ళని ఎవరు పట్టిస్తారో వాళ్ళకి లక్ష రూపాయలిస్తామని ఎన్నోసార్లు దండోరా వేసినారు. కానీ ఎవరూ పట్టుకోలేక పోయినారు. ఈ రోజు నీవల్ల దొరికినారు" అని చెప్పి వాన్ని, దొంగల్ని తీసుకోని రాజు దగ్గరికి పోయినారు.

రాజు జరిగిందంతా తెలుసుకోని "ఏదేమైనా నీవల్లే వాళ్ళు పట్టుబన్నారు" అని చెప్పి ఆ లక్ష రూపాయలు వానికే ఇచ్చినాడు. దాంతో వాడు హాయిగా పెండ్లి చేసుకోని పిల్లాపాపలతో కాలు మీద కాలేసుకోని బతికినాడు.

# 19 మూడొంకాయలు

ఒకూర్లో ఎల్లన్నని ఒకడుండేటోడు. వానికి చిన్నప్పటి నుంచీ వంకాయ కూరంటే చానా చానా ఇష్టం. కానీ ఆ వూర్లో ఆ సమ్మచ్చరం ఎవరూ వంకాయ తోట ఎయ్యలేదు. దాన్తో తినాలని ఎంత కోరికున్నా వంకాయలు దొరకక బాధపడ్తా వుండేటోడు.

ఒకరోజు వానికి పనుండి పక్కూరికి పోతా వుంటే దారి మధ్యలో ఒక చెట్టుకు మూడు వంకాయలు కనబన్నాయి. దాండ్లను చూడగానే వాని నోట్లో సర్రున నీళ్ళూరినాయి. "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు" అని లొట్టలేసుకుంటా బెరబెరా ఆ మూడు కాయల్నే తెంపుకోని, పరుగు పరుగున ఇంటికి తిరిగి వచ్చేసినాడు.

అట్లా ఇంటికి రావడం, రావడం పెండ్లాన్ని పిల్చి "ఏమే!...నాకు పక్కూర్లో కొంచం పనుంది. జర్రున పోయి జర్రునొస్తా. అంతలోపల బాగా మసాలా యేసి ఈ మూడు కాయల్తో ఘుమఘుమలాడేలా గుత్తొంకాయ కూరొండు. రుచి గనుక బాగా లేదనుకో కిందా మీదా యేసి తంతా చూడు" అని చెప్పెల్లిపోయినాడు.


ఆమె చానా అమాయకురాలు. మొగుడు ఎట్లా చెప్తే అట్లా చేయడం తప్ప ఆమెకు ఏమీ తెలీదు. దాంతో మొగుడు చెప్పినట్లే ఆ మూడు వంకాయలూ తీసుకోని, మాంచి మసాలా చేసి, వంకాయలకు నాలుగువైపులా గాట్లు పెట్టి, లోపలంతా మసాలా కూరి పొయ్యిమీదికి ఎక్కిచ్చింది.

కాసేపున్నాక ఆమెకు వంకాయలు బాగా ఉడికినాయా లేదా అని అనుమానమొచ్చింది. కూర బాగాలేకపోతే మొగుడు తన్నినా తంతాడనుకోని భయపడి "చూద్దామాగు" అని ఒకటి తీసుకోని నోట్లో ఏసుకోని వుడికిందో లేదో చూసింది.

కాసేపున్నాక ఆమెకు మల్లా వంకాయలకు ఉప్పు కారం బాగా పట్టిందా లేదా అని అనుమానమొచ్చింది. కూర బాగా లేదనుకో మొగుడు తన్నినా తంతాడని భయపడి "చూద్దామాగు" అని ఇంగోదాన్ని తీసి నోట్లో ఏసుకోని ఉప్పుకారం పట్టిందో లేదో చూసింది.

అంతలో ఆమె మొగుడు పనులన్నీ పూర్తిచేసుకోని వంకాయకూర తిందామని వురుక్కుంటా ఇంటికొచ్చినాడు. ఇంట్లోకి రావడం, రావడం వానికి మసాలా వాసన ఘుమ్మని తగిలింది. నోట్లో నీళ్ళు సర్రున వూరుతా వుంటే పల్లెం తెచ్చుకోని ముందు పెట్టుకోని "ఏమే! వాసన అదిరిపోతా వుంది! దాదా... తీసుకోనొచ్చి ఏద్దురా" అన్నాడు.

ఉడికిందా, లేదా అని ఒకటి, ఉప్పుకారం పట్టిందా లేదా అని మరొకటి వండేటప్పుడే తినేసింది గదా! ఇంగ అక్కడ మిగిలినేది ఒకే ఒక్కటి. దాంతో ఆమె వాని పళ్ళెంలో ఆ ఒక్క వంకాయనే వేసింది. అది చూసి



వాడదిరిపన్నాడు. "అదేందే! నేను తెచ్చినేది మూడయితే నువ్వు ఒకటే ఏసినావు మిగతా రెండూ ఏమయిపోయినాయి" అన్నాడు కోపంగా.

దానికామె "నువ్వేగదా రుచిగా లేకుంటే కిందా మీదా ఏసి తంతాననింది. అందుకే వంట చేస్తా... చేస్తా ఉడికిందో లేదో చూద్దామని ఒకటి, ఉప్పుకారం పట్టిందో లేదో చూద్దామని మరొకటి తిన్నా" అనింది.

దానికి వాడు "ఏమే! నీకు తెలీదా వంకాయ కూరంటే నాకెంత ఇష్టమో? ఐనా తెలిసి తెలిసీ ఎట్లా తింటివే ఆ రెండూ" అన్నాడు కోపంగా.

ఆమె అమాయకురాలు గదా దాంతో "ఎట్లా తింటివే" అని మొగుడు అడుగుతా వున్నా చూపియ్యకపోతే ఏమంటాడో ఏమో అని బెదపడి వాని పళ్ళెంలో వున్న ఆ ఒక్క వంకాయను గబుక్కున నోట్లో వేసుకోని నములుతా "ఇదిగో ఇట్లా తింటి" అని చూపిచ్చింది.

# 20 పెద్దపాపా - నాగేంద్రుడు

ఒకూర్లో ఒకడుండేటోడు. వానికో కూతురుంది. ఆమె సక్కదనాల సుక్క. అచ్చం రబ్బరు బొమ్మ లెక్కుంటాది. దాంతో మొగుడూ పెండ్లాలు ఆ పాపను బాగా మురిపెంగా చూసుకునేటోళ్ళు. ఏదడిగినా కాదనకుండా తెచ్చిచ్చేటోళ్ళు. ఆ పాపకు మూడేళ్ళ వయసొచ్చేసరికి వాళ్ళమ్మ చచ్చిపోయింది. దాంతో వాడు ఇంట్లో దీపం పెట్టేటోళ్ళు ఎవరూ లేక మళ్ళా పెండ్లి చేసుకున్నాడు. ఆ వచ్చినామె పెద్ద గయ్యాలిది. మొగుని మాట అస్సలు పడనిచ్చేది కాదు. దాంతో వాడు ఆమె నోటికి భయపడి ఆమె ఏమి చెప్పినా నోరు మూసుకోని మట్టసంగా వూకొట్టేటోడు.

కొద్ది రోజులు పోగానే ఆమెకు గూడా ఒక కూతురు పుట్టింది. ఆ పాప గూడా బాగానే వుండేది. కానీ పెద్ద పాపంత అందగత్తె కాదు. దాంతో ఆమెకు పెద్దపాపను చూస్తానే ఒళ్లు మండిపోయేది. ఇంటి పనంతా ఆ పాపతోనే చేపిచ్చేది. పొద్దు పొడిసినప్పట్నించీ పొద్దు గూకేంత వరకూ ఒకటే పని.

పొద్దున్నే లెయ్యాల. కసులూడ్చాల. పెండకల్లు చల్లాల. కన్నెగా బండలు తుడ్చాల. అంట్లు తోమాల. బరగొడ్లను కడగాల. వాటికి కుడితి తాపాల. పాలు పితకాల. నీళ్ళు తావాల. అన్నం సేయాల. ఒక్కటని కాదులే అన్ని పనులూ పెద్దపాపే సేయాల. అట్లా పనులన్నీ సేసినాక బరగొడ్లను వూరి బైటకు తోలుకోని పోయి మేపుకోని రావాల.

పాపం ఇంత పని చేపిస్తా వుంది గదా... కనీసం తిండైనా బాగా పెడ్తాదా అంటే అదీ లేదు. ఉడుకుడుకన్నం తాము తినుకుంటా పాచిపోయిన అన్నం, మిగిలిపోయిన కూరలు మూటగట్టి బరగొడ్లకు పోయేటప్పుడు ఇచ్చేది. పాపమా పెద్దపాప వాటిని తినలేక పస్తులు పడుకుంటా చానా బాధలు పడ్తా వుండేది. సరిగా తిండి లేక ఆ పాప ముఖం పీక్కపోయి కళ తప్పింది.

ఒకరోజు పెద్దపాప ఆ పాచిపోయి కంపు కొడతావున్న అన్నం తినలేక, ఆకలికి తట్టుకోలేక ఏడుస్తా వుంటే అప్పుడే అటువేపుగా వచ్చిన ఒక ముని అది చూసి "పాపా ! ఎందుకట్లా ఏడుస్తా వున్నావు? ఏంది నీ బాధ" అనడిగినాడు. దానికాపాప కళ్ళెమ్మటి నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా జరిగిందంతా చెప్పింది.

దానికా ముని "అయ్యో పాపం! అని జాలిపడి, జోలెలోంచి ఒక లడ్డు తీసిచ్చి దీన్ని ఎవరికీ కనబడకుండా యాడైనా గుంత తీసి బూడ్చి రోజూ నీళ్ళు పోయి. ఆ తర్వాతేమవుతాదో నువ్వే చూడు" అన్నాడు.

ఆ పాప సంబరంగా ఆ లడ్డును తీస్కోని ఒక గుట్ట దాపున నాటి నీళ్ళు పోసింది. తర్వాత రోజొచ్చి చూస్తే ఆడొక మొక్క మోకాలంతెత్తు పెరిగి కనబడింది. "ఇదేం మొక్కబ్బా ఒక్క రోజులోనే ఇంతెత్తు పెరిగింది" అని

ఆశ్చర్యపోతా మళ్ళా బిందెతో నీళ్ళు దెచ్చి పోసింది. తరువాత రోజు పొద్దున్నే "ఈ రోజెంతైందో ఏమో?" అనుకోని వురుక్కుంటా పోయి చూస్తే మొక్క పెరిగి పెద్దగై పూలు గూడా పూసింది. ఆ పాప సంబరంగా వురుక్కుంటా పోయి బిందెలకు బిందెలు నీళ్ళు దెచ్చి బాగా పోసింది.

తర్వాత రోజు పొద్దున్నే చకచకా పనులన్నీ చేసి, బరగొడ్లను తోలుకోని వురుక్కుంటా వచ్చి చూస్తే ఇంకేముంది... చెట్టు నిండా యాడ చూసినా సందు లేకుండా లడ్లేలడ్లు. ఆ పాప బెరబెరా కావాల్సినన్ని లడ్లు తెంపుకోని హాయిగా తినింది. ఆ రోజు నుండీ ఆ పాప బరగొడ్లను తోలుకోని పాసిపోయిన అన్నం కూర పాడేసి కావాల్సినన్ని లడ్లను కోసుకోని కడుపు నిండా తినసాగింది. కడుపు నిండా కమ్మగా తింటా వుంది గదా దాంతో మళ్ళా ఆమె ముఖం కళకళలాడ్డం మొదలుపెట్టింది.

అది చూసిన సవతి తల్లి "ఇదేందబ్బా నా కూతురికి ఎంత పెట్టినా దాని మొఖం పీక్కోనిపోతా వుంటే దీనికి ఏమీ పెట్టకున్నా కళకళలాడతా వుంది. ఏంది కత" అనుకోని కూతుర్ని పిల్చి "ఈ రోజు నువ్వు అక్క వెనకాలనే ఆమెకు తెలీకుండా పో" అని చెప్పింది. దాంతో చిన్నపాప అక్క వెనకాలనే దాచిపెట్టుకోని పోయి లడ్ల చెట్టును చూసి పరుగెత్తుకోని వచ్చి వాళ్ళమ్మకు చూసింది చూసినట్లు చెప్పింది. "ఓహో! అదన్నమాట సంగతి" అనుకోని ఆమె రాత్రికి రాత్రి ఎవరూ చూడకుండా గొడ్డలెత్తుకోని పోయి ఆ లడ్ల చెట్టును ఏళ్ళతో సహా నరికి పాడేసింది.

పెద్దపాప ఎప్పట్లాగా తర్వాత రోజు కూడా బరగొడ్లను తోలుకోని అడవికి పోయింది. అన్నం, కూరలు బరగొడ్ల ముందు పారనూకి ఎగురుకుంటా గుట్టకాడికి పోయింది. ఆడ చెట్టూ లేదు, లడ్లూ లేవు. పాపమా పాప బాధతో కిందామీదా పడి ఏడ్చుసాగింది.

పెద్దపాప అట్లా ఏడుస్తా వుంటే మళ్ళా అదే దారిన తిరిగొస్తా వున్న ముని చూసి "పాపా ! పాపా ... మళ్ళా ఏమొచ్చింది? ఎందుకట్లా ఏడుస్తా వున్నావు? ఏంది నీ బాధ?" అనడిగినాడు. దానికా పాప కండ్లమ్మటి నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా జరిగిందంతా చెప్పింది. దానికా ముని అయ్యో పాపమని జాలిపడి జోలెలోంచి ఒక బంగారు పెట్టె తీసిచ్చి "ఇది తీస్కో... ఇది అట్లాంటిట్లాంటి పెట్టె కాదు. కోరికలు తీర్చే బంగారు పెట్టె. నువ్వేం కోరుకుంటే అవి దీంట్లో నుండి వస్తాయి. నీ పెండ్లయ్యేంతవరకే ఇది పని చేసేది" అని చెప్పినాడు. ఆ పాప ఆ పెట్టె తీసుకోని ఎవరికీ కనబడకుండా మట్టసంగా ఒకచోట దాచిపెట్టుకోని కావాల్సినవన్నీ తినుకుంటా హాయిగుంది.

ఒకరోజు వూర్లో రాకుమారునికి స్వయంవరం ఏర్పాటు చేసినారు. దేశదేశాల నుండి అందమైన ఆడపిల్లలు కిందినుండీ పైవరకూ నగలూ, హారాలు దిగేసుకోని రాసాగినారు. చిన్నపాపను గూడా వాళ్ళమ్మ బాగా అలంకరించి తీస్కోనిపోతా వుంటే పెద్దపాప "అమా, అమా నేనూ వస్తా. నన్నూ తీస్కోని పో" అనడిగింది. దానికామె "అందరమూ ఆడికి పోతే ఇంట్లో పనులెవరు చేస్తారే" అంటూ ఆమె చూడకుండా బియ్యంలో పిడికెడు రాళ్ళు కలిపి "దీన్నిండా రాళ్ళున్నాయి. మేమొచ్చేసరికి అన్నీ మట్టసంగా ఏరి పెట్టు" అని చెప్పి కూతుర్తో స్వయంవరానికి పోయింది.

పెద్దపాపకు గూడా స్వయంవరానికి పోయి రావాలనిపించింది. దాంతో అట్లా వాళ్ళు పోవడం ఆలస్యం గబగబా రాళ్ళన్నీ ఏరిపారేసి, తలస్నానం చేసి, వురుక్కుంటా పోయి పెట్టె తెచ్చుకోనింది. ఆమె కోరుకోవడం



ఆలస్యం పట్టులంగా, పట్టు రైక, పట్టు కోక, గజ్జెలు, కమ్మలు, పాపిడి బిళ్ళ, వడ్డాణం, గాజులు, చెప్పులు... ఇట్లా ఒక్కటనేంది కింది నుండి పై వరకూ కావాల్సినవన్నీ ధగ ధగ మెరుస్తా ప్రత్యక్షమయినాయి. పెద్దపాప అవన్నీ ఏసుకోని ఏడు గుర్రాల రథమెక్కి స్వయంవరానికి ఝూమ్మని పోయింది.

స్వయంవరంలో ధగ ధగా మెరిసి పోతా తిరుగుతున్న పెద్దపాపను చూసి అందరూ నోళ్ళు వెల్ల బెట్టినారు. పెండ్లిగానోళ్ళు చేస్కుంటే ఇట్లాంటి బంగారు బొమ్మనే చేస్కోవాల అనుకుంటే... పెండ్లయినోళ్ళు కంటే ఇట్లాంటి సక్కదనాల సుక్కనే కనాల అనుకోసాగినారు. అట్లా పెద్దపాప కిలకిలకిల నవ్వుకుంటా, తిరుగుతా వుంటే చిన్నపాప చూసి వురుక్కుంటా వాళ్ళమ్మ దగ్గరికి పోయి "అమా! అమా! అక్క గూడా ఈడికొచ్చిందే, అచ్చం దేవకన్య లెక్క, ఎంతందంగుందో తెల్సా" అని చెప్పింది. దాంతో ఆమె "పని చేయమంటే చేయకుండా వచ్చిందా, వుండు దాని సంగతి చెప్తా" అని కోపంగా కట్టె తీసుకోని పెద్దపాప కోసం వెదకడం మొదలుపెట్టింది.

రాకుమారుడు ఒక్కొక్కరినే చూసుకుంటా వస్తా వుంటే కిలకిలకిల నవ్వుతా తిరుగుతా వున్న పెద్దపాప కనబడింది. "ఎంతందంగుందీ పిల్ల... అచ్చం మెరుపు తీగ లెక్క" అని సంబరంగా పోయి ఆమె చేయి పట్టుకున్నాడు. అప్పుడే పెద్దపాపను వెదుక్కుంటా ఆమె సవతి తల్లి అటువేపు వచ్చింది. పెద్దపాప అదిరిపడి ఆమె కంట పడగూడదని చేయి వదిలిచ్చుకోని పరిగెత్తి రథమెక్కి క్షణాల్లో మాయమైపోయింది. ఆమె అట్లా విడిపిచ్చుకొనేటప్పుడు ఆమె వేలికున్న వజ్రపుటుంగరం జారి రాకుమారుని చేతిలోకొచ్చింది.

రాజు భటులను పిల్చి "ఇంటింటికీ పోయి దీన్ని అందరికీ తొడిగి చూడండి. ఎవరికి సరిపోతే వాళ్ళను తీస్కోనిరాండి" అని చెప్పి పంపిచ్చినాడు. వాళ్ళు ఆ వుంగరం ఎవరికి సరిపోతాదా అని వెదుకుతా ఒకొక్క ఇండ్లే తిరుగుతా వీళ్ళింటికొచ్చి "మీ ఇంట్లో పెండ్లి గావాల్సిన ఆడపిల్లలున్నారా" అనడిగినారు. దానికామె "వున్నారు" అంటూ తన సొంత కూతుర్ని పిల్చుకోనొచ్చింది. ఆ పాప దాన్ని తొడుక్కోబోతే అది పట్టలేదు. అప్పుడే గడ్డిమోపు నెత్తిన పెట్టుకోని అటువేపు వచ్చింది పెద్దపాప.

భటులు ఆ పాపను చూసి "ఆమె ఎవరు" అనడిగితే "మా పనిమనిషి" అని చెప్పింది. కానీ వాళ్ళు "అందరికీ తొడిగి చూస్తా వున్నాం గదా. ఈమెకు కూడా తొడిగి చూద్దాం. ఓ పనైపోతాది" అనుకోని ఆ పాపను పిల్చి తొడిగి చూస్తే సరిగ్గా సరిపోయింది. దాంతో వాళ్ళు వురుకులు పరుగుల మీద పోయి రాకుమారునికి విషయం చెప్పినారు.

రాకుమారుడు సంబరంగా రథం మీద ఆడికొచ్చి పెద్దపాపను బంగారు పల్లకీలో కూచోబెట్టుకోని రాజభవనానికి తీస్కోనిపోయినాడు. దాసీలు ఆమెకు బాగా స్నానం చేపిచ్చి, పట్టుబట్టలు కట్టి, నగలు పెట్టేసరికి చూసేవాళ్ళ కళ్ళు జిగేల్‌మన్నాయి. "అబ్బ! అచ్చం అప్సరస లెక్క ఎంత ముచ్చటగుందీ పిల్ల" అనుకున్నారు. రాకుమారుడు వూరందరినీ పిల్చి అంగరంగ వైభోగంగా పెండ్లి చేసుకున్నాడు. పెద్దపాప చానా మంచిది గదా.

అందుకని జరిగిందంతా మరిచిపోయి అమ్మను, చెల్లిని గూడా పెండ్లికి పిలిచి, బాగా మర్యాదలు చేసి మోయలేనన్ని నగలూ, హారాలు కానుకగా ఇచ్చి పంపిచ్చింది.

పెండ్లయిన కొన్ని నెలలకు పెద్దపాపకు కడుపొచ్చింది. ఆ పాపకు ఒకసారి పుట్టింటికి పోయి అమ్మను, చెల్లిని, వూర్లో వాళ్ళందరినీ చూసి రావాలనిపించింది. ఆమె అడిగిందే ఆలస్యం రాకుమారుడు "సరే! పోయి తొందరగా రా" అంటూ పల్లకీలో తీస్కోనిపోయి పుట్టింటిలో దిగబెట్టి వచ్చినాడు. ఆమె వూరందరికీ మంచి మంచి కానుకలు తెచ్చిచ్చింది.

సవతి తల్లి పైకి నవ్వుతూ మాట్లాడ్తా వున్నా లోపల మాత్రం ఈమె వైభోగం చూసి కుతకుతా వుడికిపోసాగింది. "ఎట్లాగైనా దీన్ని చంపేసి, దీని స్థానంలో నా కూతురిని పెడ్తే నా కూతురు రాణైపోతాది గదా" అనుకోని కూతుర్ని పిలిచి ఏం చేయాల్నో చెప్పింది.

ఒకరోజు చిన్నపాప, పెద్దపాప దగ్గరికి పోయి "అకా! అకా! వూరి బైటున్న దేవాలయం చూసొద్దాం ... దా!" అంటూ తీస్కోనిపోయింది.

ఆ దేవాలయం పక్కనే ఒక పెద్ద బావి వుంది. అక్కను ఆ బావి కాడికి తీస్కోనిపోయి "అకా! అకా! నీ నగలన్నీ నేనేసుకుంటా. నావన్నీ నీవేసుకో. అప్పుడు నీవందంగా వుంటావో, నేనందంగా వుంటానో నీళ్ళలో చూసుకుందాం" అనింది. దానికి పెద్దపాప "ఎవరందం వాళ్ళదిలే చెల్లీ... మనలో మనకు పోటీ ఎందుకు?" అనింది. కానీ దానికి చిన్నపాప ఒప్పుకోలేదు. సరేనని పెద్దపాప తన నగలన్నీ చిన్నపాపకిచ్చి, చిన్నపాప నగలన్నీ తానేసుకోనింది. ఇద్దరూ బావిలోకి తొంగి చూసుకున్నారు. పెద్దపాప అలా చూస్తా వుంటే చిన్నపాప మట్టసంగా వెనుక నుండి ఆమె కాళ్ళు పట్టుకోని దభీమని లోపలికి తోసేసింది.

అట్లా తోసేసినాక ఇంటికి పోయి అచ్చం పెద్దపిల్ల లెక్కనే నగలన్నీ ముస్తాబు చేసుకోనింది. వారం రోజులు దాటినాక తీస్కోనిపోవడానికి ఆమె మొగుడొచ్చినాడు. వాడు ఆమెను చూసి "ముఖమంతా పీక్కపోయి నా పెండ్లాం ఇట్లా వుందేందబ్బా..." అనుకున్నాడు. అప్పుడు వాళ్ళమ్మ "నిన్న చెరువుకాడ కాలు జారి మెట్ల మీద నుండి దబదబా కిందపడింది. కడుపు పోయింది. దాంతో ఏడ్చీ ఏడ్చీ ముఖమంతా అట్లా మాడిపోయింది". అని కల్లబొల్లి మాటలు చెప్పి తన కూతురిని రాకుమారునితో పంపించేసింది.

ఈడ పెద్దపాపను బాయిలో తోసేసింది గదా. ఆ బాయిలో ఎన్నాళ్ళ నుండో ఒక ఏడు పడగల నాగేంద్రుడు పెళ్ళాం బిడ్డలతో కాపురమున్నాడు. ఆ నాగేంద్రునికి నాలుగు నెల్ల కిందట పడగ మీద పెద్ద పుండయింది. రోజురోజుకీ నొప్పి ఎక్కువయి పోతా వుందే గానీ తగ్గడం లేదు. ఆ సమయంలో పెద్దపాప, అంత పైనుండి సరిగ్గా పాముకి పుండెక్కడయితే అయిందో అక్కడ దభీమని పడింది. ఆ దెబ్బకు పుండు చిదిగిపోయి, లోపలున్న చెడంతా కారిపోయి, దెబ్బకు నొప్పి తగ్గిపోయింది. పెద్దపాప గూడా పడడం పడడం నాగరాజు మీద పడింది గదా దాంతో ఆమెకు గూడా దెబ్బలేం తగల్లేదు.

నాగరాజు సంబరంగా ఆమెను చూస్తా "ఎవరమ్మా నువ్వు. చూస్తే నిండుమనిషి లెక్కున్నావ్, ఎందుకిట్లా బాయిలో పడినావు. ఏంది నీ బాధ" అనడిగినాడు. అప్పుడామె వెక్కి వెక్కి ఏడుస్తా జరిగిందంతా చెప్పింది. నాగేంద్రుడు అయ్యో పాపమని జాలిపడి "నువ్వేం బాధపడొద్దు. నీ మొగుడొచ్చి తీసుకోనిపోయేదాకా మా నాగలోకంలో మాతోపాటే వుండు" అంటూ ఆమెను ఇంటికి తీసుకోని పోయినాడు.

కొంతకాలానికి ఆమెకు పండులాంటి పిల్లోడు పుట్టినాడు. నాగేంద్రుడు, ఆయన పెండ్లాం బిడ్డలు, వూరోళ్ళు ఆ పిల్లోన్ని ప్రేమగా సొంతబిడ్డ లెక్క పెంచడం మొదలుపెట్టినారు. అట్లా ఆమెకు నాగలోకమే పుట్టినిల్లయింది. పిల్లోడు నెమ్మదిగా పెరిగి పెద్దగయి ఐదేండ్ల వయసుకొచ్చినాడు.

ఒకరోజు ఒక గాజులాయన "గాజులమ్మా ! ... గాజులు !" అని అరుసుకుంటా పోతా వుంటే అది విన్న పెద్దపాప "అనా ! అనా! ఓ గాజులన్నా ... కాస్త ఇట్లావొచ్చి మాకు గాజులేసి పోన్నా" అని బావిలోపల్నుండి పిలిచింది. వాడు చుట్టూ చూసి బావి లోపలికి తొంగి చూస్తే ఆమె కనబడింది.

"లోపలికి ఎట్లా రావాలా" అనడిగినాడు.

ఆమె నాగేంద్రున్ని తల్చుకోగానే పైనుండి లోపలికి మెట్లు ప్రత్యక్షమయినాయి. గాజులోడు లోపలికి దిగినాడు. ఆమె వానికి కనబడకుండా మొఖం మీద ముసుగేసుకోనింది. వాడు గాజులు తొడుగుతా వుంటే ఆమె కొడుకు ఆడుకుంటా ఆడికొచ్చినాడు. ఆ గాజులోనికి ఆ పిల్లోన్ని చూస్తే అచ్చం తమ రాజుని చూసినట్టే అనిపించింది. దాంతో వాడు "అమా ! అమా ! ఎవరు నీవు ... ఈ బాయిలో ఎందుకున్నావు?" అనడిగినాడు. ఆమె జరిగిందంతా చెప్పింది.

ఆ గాజులోడు పైకొచ్చినాక వురుక్కుంటా రాజు దగ్గరికి పోయి జరిగిందంతా చెప్పినాడు. దానికి రాజు ఆచ్చర్యపోయి "అది నా పెండ్లామయితే మరి ఈడ ఇంట్లో వుండేదెవరు? దీని సంగతేందో కనుక్కోవాల్సిందే" అనుకోని గాజులోని వేషమేసుకోని "గాజులమ్మా! గాజులు!" అని అరుసుకుంటూ మరుసటి రోజు బావికాడికి పోయినాడు.

ఆ అరుపులినగానే "ఓ గాజులన్నా ! లోపలికి రా, నాకు మంచి గాజులేసి పోదువు గానీ" అని పిల్చింది. వెంటనే బావిలోనికి మెట్లు ప్రత్యక్షమయినాయి. రాజు లోపలికి పోయినాడు. పిల్లోన్ని చూస్తే అచ్చు గుద్దినట్లు తన లెక్కనే కనబన్నాడు.

ఆమె మొగం వంక చూసినాడు. ఆమె మేలిముసుగు వేసుకోనింది గదా ... దాంతో మొఖం సరిగ్గా కనబల్లేదు. ధైర్యం చేసి ముసుగు పట్టి ఒక్క గుంజు గుంజినాడు. ఇంకేముంది తన పెండ్లామే. ఆచ్చర్యపోయినాడు.

రాజు అట్లా ముసుగు గుంజేసరికి ఆమె అదిరిపడి "ఎవర్రా నువ్వు ? .... నా ఇంటికొచ్చి నా ముసుగే గుంజుతావా? ... వుండు, నీ పని చెబ్తా" అంటూ నాగేంద్రున్ని పిల్చబోయింది. అప్పుడు రాజు "ఆగాగు ! నేనెవరనుకుంటావున్నావ్. గాజులోన్ని కాదు. నీ మొగున్ని" అంటూ వేషం తీసేసినాడు. ఆమె మొగున్ని గుర్తుపట్టి సంబరంగా నాగలోకంలోకి తీసుకోనిపోయింది. నాగలోకమంతా వాళ్ళిద్దరినీ చూసి "ఎంత ముచ్చటైన జంట. చిలకా గోరింకల్లెక్క" అనుకుంటా ఆశీర్వదించి పుట్టింటోళ్ళు పెట్టినట్లు చీరాసారె పెట్టి కండ్లనీళ్ళతో అత్తింటికి సాగనంపినారు.

రాకుమారుడు ఇంటికొచ్చినాక ఇన్ని రోజులూ తనను మోసం చేసినందుకు చిన్నపాపకు గుండు కొట్టించి, గాడిద మీదెక్కించి, వూర్లో నుండి తన్ని తరిమేసినాడు.

# 21 పెళ్ళికాని దోమ

ఒకూరిలో ఒక దోమ వుండేది. దానికి ఒకసారి పెళ్ళి చేసుకోవాలని అనిపించింది. దాంతో మంచివాన్ని చూసి పెళ్ళి చేసుకుందామని బైలుదేరింది. దోమ పోతా వుంటే దారిలో ఒక ఏనుగు ఎదురైంది.

"దోమా... దోమా... యాడికి పోతా వున్నావు" అని అడిగింది.

దోమ సిగ్గుతో వంకర్లు పోతా "మంచివాన్ని చూసి పెళ్ళి చేసుకోడానికి కంచికి పోతా వున్నా" అని చెప్పింది.

అప్పుడా ఏనుగు "నేను గూడా పెళ్ళి చేసుకోవాలని చానా రోజుల నుండి అనుకుంటా వున్నా. ఈ లోకంలో నా అంత బలవంతుడు ఎవరూ వుండరని నీకు తెలుసు గదా... నన్ను చేసుకో... నీకేం కావాలంటే అది ఇట్లా చెప్పడం ఆలస్యం అట్లా తెచ్చి పెడతా. ఏం సరేనా" అని అడిగింది.

ఆ మాటలకు దోమ కిందామీదా పడి నవ్వుతా "ఏందీ... నిన్నా... చాటల్లాంటి చెవులూ, పాములాంటి తొండంతో ఏడుమూర్ల పొడవు, వెయ్యి కేజీల బరువూ వుంటావు. నిన్ను చేసుకోవాల్నా... ఎప్పుడయినా అద్దంలో నీ మొగం చూసుకున్నావా" అనింది. ఆ మాటలకు సిగ్గుపడి ఏనుగు ఆన్నించి వెళ్ళిపోయింది.

దోమ మళ్ళా బైలుదేరింది. అట్లా పోతా వుంటే దానికి ఒకచోట ఒక గుర్రం ఎదురొచ్చింది.

"దోమా... దోమా... యాడికి పోతా వున్నావు" అని అడిగింది.

దోమ సిగ్గుతో వంకర్లు పోతా "మంచివాన్ని చూసి పెళ్ళి చేసుకోడానికి కంచికి పోతా వున్నా" అని చెప్పింది.

అప్పుడా గుర్రం "నేను గూడా పెళ్ళి చేసుకోవాలని చానా రోజుల నుండి అనుకుంటా వున్నా. ఈ లోకంలో నా అంత వేగంగా వురికేటోళ్ళు ఎవరూ వుండరని నీకు తెలుసుగదా... నన్ను చేసుకో... రోజూ నా మీద కూచోబెట్టుకోని యాడికి తీసుకుపొమ్మంటే ఆడికి రయ్యి రయ్యిన తీసుకుపోతా... ఏం సరేనా" అని అడిగింది.

ఆ మాటలకు దోమ కిందామీదా పడి నవ్వుతా "ఏందీ... నిన్ను చేసుకోవాల్నా... తొర్రిపళ్ళతో, కుచ్చుతోకతో వూకె వురుకుతుంటావ్. నీకూ నాకూ పెళ్ళా. ఎప్పుడయినా నీ తొర్రి మొగాన్ని అద్దంలో చూసుకున్నావా" అనింది. ఆ మాటలకు సిగ్గుపడి గుర్రం ఆన్నించి వెళ్ళిపోయింది.

దోమ మళ్ళా బైలుదేరింది. అట్లా పోతా వుంటే దానికి ఈ సారి ఒక కాకి ఎదురొచ్చింది.

"దోమా... దోమా... యాడికి పోతా వున్నావు" అని అడిగింది. దోమ సిగ్గుతో వంకర్లు పోతా "మంచివాన్ని చూసి పెళ్ళి చేసుకోడానికి కంచికి పోతా వున్నా" అని చెప్పింది.



అప్పుడా కాకి "నేను గూడా పెళ్ళి చేసుకోవాలని చానా రోజుల నుండి అనుకుంటా వున్నా... నన్ను చేసుకో... నిన్ను నా రెక్కల మీద కూచోబెట్టుకోని ఆకాశమంతా రయ్యిరయ్యిన తిప్పి చూపిస్తా. రోజూ ఎక్కడెక్కడి తినుబండారాలన్నీ ఏరుకోనొచ్చి కడుపు నిండా బెడతా... ఏం సరేనా" అని అడిగింది.

ఆ మాటలకు దోమ కిందామీదా పడి నవ్వుతా "ఏందీ... నిన్ను చేసుకోవాల్నా... బొగ్గులెక్క కర్రెగా, ఒంటి కంటితో కాకా అని అరుచుకుంటా తిరిగే నీకు నాతో పెళ్ళా. ఎప్పుడయినా నీ కర్రె మొహాన్ని అద్దంలో చూసుకున్నావా" అనింది. ఆ మాటలకు సిగ్గుపడి కాకి అన్నించి వెళ్ళిపోయింది.

దోమ మళ్ళా బైలుదేరింది. అట్లా పోతా వుంటే దానికి ఒకచోట ఒక ఎర్రమూతి కోతి కనబడింది. అది ఆ కొమ్మ మీద నుండి ఈ కొమ్మ మీదకు... ఈ కొమ్మ మీద నుండి ఆ కొమ్మ మీదకు ఎగురుతా దుంకుతా... కిచకిచమని నవ్వుతా తిరుగుతా వుంటే ఆ దోమకు భలే నచ్చేసింది.

దాంతో "కోతిబావా... కోతిబావా... మంచి మొగుడు కావాలని లోకమంతా వెదుకుతా వున్నా. నీ అందమైన ఎర్రమూతి, పొడవైన తోక, కిచకిచమనే నవ్వు నాకు భలే నచ్చినాయి. నన్ను పెళ్ళి చేసుకోవా" అని అడిగింది.

ఆ మాటలకు కోతి కిందామీదా పడి నవ్వుతా "ఏందీ... నిన్ను చేసుకోవాల్నా... ఎప్పుడూ మురికి గుంటల వెంబడి తిరుగుతా, రోగాలను ఒకరి నుండి ఒకరికి అంటించి సంబరపడతా, ఎప్పుడు ఎవరి చేతిలో పుటుక్కున చస్తావో తెలియని నీకూ, నాకూ పెళ్ళా. ఎప్పుడయినా నీ తిక్క మొగాన్ని అద్దంలో చూసుకున్నావా" అనింది. ఆ మాటలకు దోమ సిగ్గుతో తల దించుకోని

"ఏడు మూరల ఏనుగునూ కాదంటీ
తొర్రిపళ్ళ గుర్రాన్నీ కాదంటీ
ఒంటికంటి కాకినీ కాదంటీ
అడిగినోళ్ళందరినీ కాదంటీ
ఇప్పుడు నచ్చినోడు నన్ను కాదంటున్నాడే" అని ఏడ్చుకుంటా ఇంటికి పోయింది.

# 22 అత్తా నలుగురు కోడళ్ళు

ఒకూర్లో ఒక ముసిలామె వుండేది. ఆమె చానా మంచిది. ఆ ముసల్దానికి నలుగురు కోడళ్ళున్నారు. కోడళ్ళకేమో అత్తంటే అస్సలు పడదు. ఇంట్లో ఏమన్నా పిండివంటలు చేసుకుంటే అత్తకు గూడా పెట్టాల గదా... అందుకే ఆమె వున్నప్పుడు ఎవరూ ఏమీ చేసుకునేటోళ్ళు కాదు. ఐతే అత్త ఎప్పుడన్నా ఏదన్నా పనిబడి ఏదైనా వూరికి పోయిందంటే చాలు... ఎవరికిష్టమైనవి వాళ్ళు కొనుక్కొచ్చుకునేటోళ్ళు. రకరకాల పిండివంటలు చేసుకునేటోళ్ళు. అత్తొచ్చేసరికి అన్నీ నున్నగా తినేసి, శుభ్రంగా గిన్నెలు కడిగేసి ఏమీ ఎరుగని నంగనాచుల్లెక్క గమ్మున వుండేటోళ్ళు. అత్తకు మాత్రం కొంచంగూడా పెట్టేటోళ్ళు కాదు. నెమ్మదిగా అత్తకు విషయం అర్థమైంది. ఎట్లాగయినా సరే కోడళ్ళకు బుద్ధి చెప్పాలని ఒక ఉపాయం ఆలోచించింది.

ఒకరోజు పొద్దున్నే అత్త పెట్టె తీసుకోని కోడళ్ళందరినీ పిలిచి "నాక్కొంచెం పనుంది. నేను మా అన్నోళ్ళ వూరికి పోతా వున్నా... మళ్ళా రేపొస్తా" అని చెప్పి పెట్టె తీసుకోని బైలుదేరింది. అట్లా కొంచం దూరం పోయినట్లే పోయి ఎవరూ చూడకుండా మళ్ళా వెనక్కు తిరిగొచ్చి ఇంటి వెనకవైపు నుండి లోపలికి దూరింది. ఎవరి కంటా పడకుండా జాగ్రత్తగా మచ్చు ఎక్కి కూచోని ఇంట్లో ఏం జరుగుతుందో అంతా చూడసాగింది.

ఇదంతా కోడళ్ళకు తెలీదు గదా... దాంతో వాళ్ళకి పట్టపగ్గాలు లేకుండా పోయినాయి. మొదటి కోడలేమో కొత్తకోక కట్టుకోని సంతకు పోయి పెద్దపెద్ద బెల్లం చెరుకులు కొనుక్కొచ్చుకోనింది. రెండో కోడలేమో బాగా బెల్లమేసి తియ్యతియ్యని బచ్చాలు చేట నిండా చేసుకోనింది. మూడో కోడలేమో బాగా ఘుమఘుమలాడేటట్లు నెయ్యేసి గోధుమ పాయసం వండుకోనింది. నాలుగో కోడలేమో వూర్లో నేరేడు పండ్లు అమ్ముతా వుంటే పోయి లావులావువి బాగా మాగినేవి కొనుక్కొచ్చుకోనింది.

అత్త మచ్చు పైనుంది గదా... ఎవరెవరు ఏమేమి కొంటా వున్నారు... ఏమేమి చేసుకుంటా వున్నారు... ఎక్కడెక్కడ పెడతా వున్నారు అన్నీ బాగా చూసింది. నెమ్మదిగా ఎవరి కంటా పడకుండా మచ్చు దిగి వెనుక తలుపు తెరుచుకోని బైటకి పోయింది. కాసేపటికి పెట్టె చేత్తో పట్టుకోని ముందువైపు నుంచి ఇంట్లోకొచ్చింది. అత్తను చూస్తానే అందరూ అదిరిపన్నారు. "ఇదేందబ్బా... రేపటి వరకూ రానని అప్పుడే వచ్చేసిందీ దొంగసచ్చినేది" అని లోపల్లోపల తిట్టుకుంటా... "ఏమత్తా... ఇప్పుడే గదా పోయింది... మళ్ళా అప్పుడే తిరిగొచ్చేసినావ్... ఏమైంది" అనడిగినారు. అత్త అందరి వంకా చూస్తా "ఏం చెయ్యమంటారు చెప్పండి. నేను పోతా వుంటే దారిలో ఒక పెద్ద నాగుబాము పడగిప్పుకోని ఎదురొచ్చింది. దాంతో భయపడి తిరిగొస్తి" అనింది.



పాము కనబడిందని చెప్పగానే మొదటి కోడలు పామెంతుందో కనుక్కుందామని "అత్తా... అత్తా... ఎంత పెద్దగుందత్తా పాము" అనడిగింది. వెంటనే ముసల్ది "నువ్వు బెల్లం చెరుకులు కొనలా... దానంత పొడవుంది" అనింది. అంతే కోడలు అదిరిపడి గమ్మున నోర్మూసుకోనింది. అంతలో రెండో కోడలు "అత్తా... అత్తా... దాని పడగ ఎంతుందత్తా" అనడిగింది. ముసల్ది నవ్వుతా "నువ్వు చేటలో బచ్చాలు చేసి పెట్టినావు గదా... అచ్చం ఆ బచ్చమంతుంది" అనింది. అంతే రెండో కోడలు మారు మాట్లాడక నోరు మూసుకోనింది.

అంతలో మూడో కోడలు "అత్తా... అత్తా... దాని ఒల్లు ఏ రంగులో వుందత్తా" అనడిగింది. వెంటనే ఆ ముసల్ది "నువ్వు గోధుమ పాయసం వండుకోనిండ్లా... అచ్చం ఆ పాయసం రంగుంది" అనింది. "నేను పాయసం చేసుకున్నేది ఈ అత్తకెట్లా తెలిసిందబ్బా" అని ఆశ్చర్యపోతా మూడో కోడలు గమ్మున నోర్మూసుకోనింది. అంతలో నాలుగో కోడలు "అత్తా... అత్తా... దాని కనుగుడ్లు ఎంత లావున్నాయత్తా" అనడిగింది. వెంటనే ఆ ముసల్ది "నువ్వు గూట్లో దాచిపెట్టినావు చూడు... ఆ నేరేడు పండ్లంత లావున్నాయి" అనింది.

దాంతో ఆ నలుగురు కోడళ్ళకు తాము ఏమేం కొనుక్కున్నదీ... ఏమేం చేసుకున్నదీ... ఎక్కడెక్కడ దాచిపెట్టేదీ... అంతా అత్తకు తెలిసిపోయిందని అర్థమయింది. "అత్తేదో అమాయకురాలు అనుకుంటిమి గానీ పెద్ద అసాధ్యురాలు" అనుకోని మట్టసంగా అన్నీ తెచ్చి అత్తకు పెట్టినారు. అప్పటి నుంచీ తాము ఏమి చేసుకున్నా అత్తకు గూడా పెట్టేటోళ్ళు.


# 23 సల సల కాగే సూరీడు సల్లా సల్లని చందమామ

ఒకూర్లో ఒకామె వుండేది. ఆమెకు ఇద్దరు పిల్లలు. పెద్దోని పేరేమో సూర్యుడు. చిన్నోని పేరేమో చంద్రుడు. వాళ్ళు చానా బీదోళ్ళు. ఆమె ఆ ఇంట్లో, ఈ ఇంట్లో పనులు చేసి వచ్చిన డబ్బులతో పిల్లలకు మంచి తిండి పెట్టేది. ఒక రోజు ఆమెకు పెద్ద జ్వరమొచ్చి మంచంలో పడిపోయింది. నెలైనా జ్వరం కొంచెం కూడా తగ్గలేదు. ఇంట్లో వున్న డబ్బులన్నీ అయిపోయినాయి. ఆమె పిల్లలిద్దరికీ ఏదో ఒకటి పెట్టి తాను మాత్రం ఏమీ తినకుండా వుత్త మంచినీళ్ళు తాగి పండుకొనేది. పిల్లల కోసం జ్వరంలోనూ ఆకలితో పస్తులుండేది. అంతలో ఒకరోజు ఆ వూరిలో ఒక పెద్ద పెళ్ళి జరుగుతా వుంటే వీళ్ళను భోజనానికి పిల్చినారు. పెళ్ళి భోజనమంటే వుత్త అన్నం పప్పు పెట్టరు కదా. మంచి మంచి రుచికరమైన వంటకాలు వడ్డిస్తారు. ఆమె చానా రోజుల నుండీ పస్తులుంది కదా. నోరూరింది. పిల్లల్తో సహా పోయి బాగా తిని రావాలనుకోనింది. కానీ చానా రోజుల నుండీ తిండి లేదు కదా. అదీకాక జ్వరం ఇంకా తగ్గలా. అందుకే నీరసమొచ్చి మంచం మీద నుండి లేవలేకపోయింది. దాంతో సూర్యున్ని, చంద్రున్ని పిలిచి “రేయ్! మీరిద్దరూ పెళ్ళికి పోయి బాగా తిని రండి. అట్లాగే వచ్చేటప్పుడు నాక్కూడా ఏమైనా పట్టుకోని రండి. చానా ఆకలిగా వుంది” అని చెప్పింది. సరేనని ఇద్దరూ పెళ్ళికి పోయినారు.

సూర్యుడు భోజనానికి కూర్చోగానే అమ్మకిచ్చిన మాట మరిచిపోయినాడు. బచ్చాలు, లడ్లు, కజ్జికాయలు, పాయసం అన్నీ బాగా మెక్కి వుత్త చేతులు వూపుకుంటా ఇంటికొచ్చినాడు. వాళ్ళమ్మ సూర్యుని చూడగానే తన కోసం అన్నీ తెచ్చింటాడు అనుకోని ఆశతో “ఏరా! నా కోసం ఏమి తెచ్చినావు” అనడిగింది. దానికి సూర్యుడు “అరెరే! నీ సంగతే మర్చిపోయినా, నాకసలు గుర్తే లేదు’ అన్నాడు. తాను రోజూ ఏమీ తినకుండా కడుపు కాల్చుకోని అన్నీ వీళ్ళకే పెడతా వున్నా కనీసం ఒక్కపూట కూడా తనకు తేలేదు కదా అని ఆమె చానా బాధపడింది.

చంద్రుడు మాత్రం అన్నానికి కూర్చోగానే పెట్టినేవి పెట్టినట్లు సూర్యుని మాదిరి బెరబెరా తినకుండా “పాపం అమ్మ రోజూ తానేమీ తినకుండా అన్నీ మాకే పెడతా వుంది. కనీసం ఈ ఒక్కరోజైనా ఇవన్నీ తీస్కోనిపోయి అమ్మకు పెట్టాలి” అనుకోని ఎవరూ చూడకుండా విస్తరాకులో పెట్టినేవి పెట్టినట్టు అంగీలో దాచిపెట్టుకోని ఇంటికి తీసుకొచ్చినాడు.

అమ్మ చంద్రుని చూస్తానే “ఏరా! నువ్వన్నా ఏమన్నా తెచ్చినావా, లేక మీ అన్నమాదిరే బాగా మెక్కి వుత్త చేతులు వూపుకుంటా వచ్చినావా” అనడిగింది. ఆ మాటకు చంద్రుడు నవ్వుతా “ముందు నువ్వు కాళ్ళూ చేతులు కడుక్కోని రాపో! తిందువుగానీ” అంటూ విస్తరి వేసి తెచ్చినవన్నీ ప్రేమగా అమ్మకు పెట్టినాడు. అవన్నీ తిని ఆమె చానా సంబరపడింది.



ఆ తరువాత సూర్యున్ని పిలిచి "చూడ్రా! వీడు నీకన్నా చిన్నోడే అయినా అమ్మ కోసం ఏమీ తినకుండా అన్నీ తెచ్చినాడు. నువ్వు పెద్దోనివై మాత్రం ఏం లాభం?" అంటూ "నేను ఎట్లాగైతే ఆకలితో మలమల మాడిపోయినానో, అట్లాగే నువ్వు కూడా ఇప్పన్నించీ సల సల సల మండిపోవాల" అని శపించింది.

చంద్రున్ని పిల్చి "మలమలలాడిపోతా వున్న నా కడుపు నిండా అన్నంపెట్టి దాన్ని చల్లగా చేసినావు. అందుకని ఇప్పన్నించీ నువ్వు చల్లగా బతకాల" అని దీవించింది.

ఆరోజు నుండీ సూర్యుడు సలసలసల కాగిపోతా సెగలు కక్కుతా వుంటే, చంద్రుడేమో వెన్నెల కురిపిస్తా హాయిగా వున్నాడు.

# 24 అంతా మా మంచికే గదా

ఒకూర్లో ఒక రైతున్నాడు. ఆయన బాగా డబ్బున్నోడు. ఆయనకి ముగ్గురు కూతుళ్ళు. ఆ ముగ్గురిదీ చూడచక్కని అందం. చందమామలెక్క మెరిసిపోతా వుండేటోళ్ళు. నవ్వితే మల్లెపూలు కురిసినట్టుండేది. అది చూసి అందరూ "అబ్బ... ఎంత ముచ్చటగా వున్నారయ్యా నీ కూతుళ్ళు. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. పెండ్లి చేయాలనుకుంటే మాకోసారి చెప్పండి. పైసా డబ్బులు తీసుకోకుండా మాపిల్లోళ్ళకు చేసుకుంటాం" అనేటోళ్ళు. ఆ పిల్లలు గూడా చానాచానా మంచోళ్ళు. అందరికీ సాయం చేస్తా పక్షులకూ, జంతువులకు అన్నం పెడ్తా, ఎంత వున్నా ఏమీ లేనోళ్ళలెక్క అణిగిమణిగి వుండేటోళ్ళు. ఎవ్వరినీ పళ్ళెత్తు మాట గూడా అనేటోళ్ళు గాదు. ఎంతందంగా వున్నా కొంచం గూడా పొగరుగా మాట్లాడేటోళ్ళు కాదు. ఆ రైతు ఆ పిల్లలకి ఏది కావాలంటే అది కొనిస్తా అల్లారుముద్దుగా చూసుకునేటోడు. అట్లా కొద్దిరోజులు గడిచిపోయినాయి. కానీ కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు గదా...

ఒకరోజు ఏమయిందంటే ఆయన పెండ్లానికి పెద్ద రోగమొచ్చి అనుకోకుండా చచ్చిపోయింది. దాంతో పిల్లల్ని చూసుకునేటోళ్ళు లేక, వాళ్ళకు వండి పెట్టేటోళ్ళు లేక చానా బాధ పడసాగినాడు. దాంతో చుట్టుపక్కల వున్నోళ్ళు, బంధువులు అందరూ ఒక్కటై "ఎన్నాళ్ళిలా ఒక్కనివే బాధపడతా వుంటావు. దేవుని దగ్గర దీపం పెట్టేటోళ్ళు, బైట ముగ్గులేసేటోళ్ళు, వంటింట్లో పొయ్యి వెలిగించేటోళ్ళు లేని ఇల్లు వున్నా ఒకటే లేకున్నా ఒకటే. ఇంగో పెండ్లి చేసుకో... నీకూ నీ పిల్లలకూ అందరికీ మేలు" అని ఒకటే పోరు పెట్టినారు. దాంతో ఆయన సరేనని ఇంగో పెండ్లి చేసుకున్నాడు.

ఆ వచ్చినామె మొదట్లో ముగ్గురు పిల్లల్ని బాగానే చూసుకోనింది గానీ ఆమెకు ఒక కూతురు పుట్టినాక ప్రేమ తగ్గిపోయింది. ఆ అమ్మాయిల్తో ఎప్పుడూ పనులు చేయిస్తా, చీటికీ మాటికీ నోటికొచ్చినట్టల్లా తిడ్తా... అన్నం గూడా సరిగా పెట్టేది కాదు. ఎట్లాగయినా సరే ఆ అమ్మాయిల్ని ఇండ్లు వదిలి పారిపోయేలా చేయాలని చానా కష్టమైన పనులన్నీ చెబుతా వుండేది.

ఒకరోజు ఆమె ముగ్గురినీ పిలిచి "పోండి... పోయి అడవిలో కట్టెలు తీసుకోని రాపోండి. కానీ దాండ్లను కట్టడానికి తాడూ వుండగూడదు. మీ నెత్తి మీద గుడ్డా వుండగూడదు. జాగ్రత్త" అని హెచ్చరించింది. ఆ పిల్లలు అట్లా ఎట్లా తేవాల్నో అర్థం గాక అడవిలోనికి పోయి ఏడుస్తా కూచున్నారు.

అంతలో ఒక పాము వాళ్ళ దగ్గరికి వచ్చింది. "ఏం అమ్మాయిలూ... ఏమిట్లా అడవిలో కూచోని అట్లా ఏడుస్తా వున్నారు. ఏమి మీ బాధ" అనడిగింది. దానికా ముగ్గురు పిల్లలు కళ్ళల్లో నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి

వెక్కి ఏడుస్తా "ఏం చెప్పమంటావు నాగరాజా మా బాధ... మా రెండో అమ్మ కట్టడానికి తాడు లేకుండా మోసుకురావడానికి గుడ్డ లేకుండా కట్టెలు తీసుకోని రమ్మనింది. అట్లా ఎట్లా తేవాల్నో అర్థంగాక ఏడుస్తా వున్నాం" అని చెప్పినారు.

దానికా పాము "మీరేం బాధపడకండి. మీరు కట్టెలన్నీ కొట్టుకోండి. నేను పోయి మా స్నేహితులను ఐదుమందిని పిలుచుకోని వస్తాను. ముగ్గురమేమో మోపుకు తాడులాగా వుంటాం. మరో ముగ్గురమేమో చుట్టచుట్టుకోని మీ నెత్తి మీద గుడ్డలాగా వుంటాము" అని చెప్పి వెళ్ళిపోయింది. దాంతో ఆ ముగ్గురు అమ్మాయిలు సంబరంగా కట్టెలన్నీ విరగ్గొట్టి కుప్పలు చేసుకున్నారు. అంతలో ఆ పాము ఇంకో అయిదు పాములతో అక్కడకు చేరుకోనింది. మూడేమో మోపులకు తాడులాగా తయారయితే, మరో మూడేమో నెత్తి మీద గుడ్డలాగా చుట్ట చుట్టుకున్నాయి. ఆ అమ్మాయిలు ఆ పాముల్తో మోపు కట్టుకోని ఇంటికి చేరినారు. ఇంట్లో కట్టెల మోపులు దించగానే పాములు ఎక్కడివక్కడ సరసరసర వెళ్ళిపోయినాయి. సవతి తల్లి వచ్చి చూస్తే ఇంగేముంది కట్టెలన్నీ కుప్పలుగా కనిపించినాయిగానీ తాడుగానీ, బట్టగానీ ఏమీ కన్పించలేదు. దాంతో ఏమీ అనలేక వాళ్ళను లోపలికి రానిచ్చింది.




అట్లా కొంత కాలం గడిచినాక ఒకరోజు ఆ సవతితల్లి మూడు కుండలు తెచ్చి వాళ్ళకిచ్చింది. వాటి కింద పెద్ద పెద్ద కన్నాలున్నాయి. "పొండి... పోయి ఈ కుండల్తో చెరువు కాన్నించి నీళ్ళు తెచ్చి ఇంట్లో గచ్చులన్నీ నింపండి. వేరే కుండలు తెచ్చినా, కన్నాలకు ఏమన్నా అతికిచ్చినా మళ్ళా ఈ ఇంట్లోకి అడుగుపెట్టనీయను. జాగ్రత్త" అని హెచ్చరించింది. దాంతో ఆ అమ్మాయిలు చెరువుకాడికి పోయి నీళ్ళు అట్లా ఎట్లా తావాల్నో అర్థంగాక ఏడుస్తా కూచున్నారు.

అంతలో ఒక కప్ప ఎగురుకుంటా వాళ్ళ దగ్గరికి వచ్చింది. "ఏం అమ్మాయిలూ... ఏమిట్లా చెరువుకాడ కూచోని ఏడుస్తా వున్నారు. ఏమి మీ బాధ" అనడిగింది. దానికా ముగ్గురు పిల్లలు కళ్ళెమ్మట నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా " ఏం చెప్పమంటావు కప్పరాజా మా బాధ... మా రెండో అమ్మ ఈ బొక్కపన్న

కడవలనిచ్చి వేరే కడవలు తీసుకురాకుండా, వీటికి ఏమీ అతికియ్యకుండా నీళ్ళు తెచ్చి గచ్చు నింపమనింది. అట్లా ఎట్లా తేవాల్నో అర్థం గాక ఏడుస్తా వున్నాం" అన్నారు.

దానికా కప్ప "మీరేమీ బాధపడకండి. నేను పోయి మా స్నేహితుల్ని మరో ఇద్దరిని పిలుచుకోనొస్తా... మేం కడవల్లోకి పోయి రంధ్రానికి అడ్డంగా, నీళ్ళు బైటకి పోకుండా కూచుంటాం. మీరు హాయిగా కడవల్తో నీళ్ళు ముంచుకోని గచ్చునంతా నింపెయ్యండి" అనింది. ఆ అమ్మాయిలు సంబరంగా సరే అన్నారు. వెంటనే ఆ కప్ప చెరువులోనికి పోయి మరో రెండు కప్పల్ని పిలుచుకోనొచ్చింది. ఆ మూడూ మూడు కడవల్లో దూరి కన్నాలకడ్డంగా కూచున్నాయి. దాంతో పిల్లలు నీళ్ళు తీసుకోనొచ్చి గచ్చునంతా నింపేసినారు. వెంటనే ఆ మూడు కప్పలూ ఎక్కడివక్కడ ఎగురుకుంటా వెళ్ళిపోయినాయి. సవతితల్లి వచ్చి చూస్తే ఇంగేముంది... గచ్చు నిండా నీళ్ళు కనిపించినాయిగానీ ఆ కడవలకడ్డంగా ఏమీ కనిపించలేదు. దాంతో ఏమీ అనలేక వాళ్ళను లోపలికి రానిచ్చింది.

అట్లా కొంతకాలం గడిచినాక ఒకరోజు ఆ సవతి తల్లి ముగ్గురినీ పొలానికి తీసుకోని పోయి మూడు బస్తాల వడ్లు ఇచ్చి వీటిని తీసుకోని పోయి ఒక్కగింజ గూడా విరగకుండా బియ్యం చేసుకోని రాండి... లేకపోతే ఈ ఇంటి గడప తొక్కొద్దండి" అనింది. ముగ్గురూ ఆ మూడు మూటలు ముందు పెట్టుకోని ఇన్ని గింజలను ముక్క విరగకుండా పొట్టు ఎట్లా తీయాల్నో అర్థంగాక ఏడుస్తా కూచున్నారు.

అంతలో ఒక పిచుక ఎగురుకుంటా వాళ్ళ దగ్గరికి వచ్చింది. "ఏం అమ్మాయిలూ... ఏమిట్లా పొలంలో కూచోని ఏడుస్తా వున్నారు. ఏమి మీ బాధ" అనడిగింది. దానికా ముగ్గురు అమ్మాయిలు కళ్ళెమ్మట నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా "ఏం చెప్పమంటావు చిట్టి పిచుకా మా బాధ... మా రెండో అమ్మ ఈ మూడు బస్తాల వడ్లు ఇచ్చి ముక్క విరగకుండా వీటన్నిటినీ బియ్యంగా చేసుకోని రమ్మనింది. అట్లా ఎట్లా చేయాల్నో అర్థం గాక ఏడుస్తా వున్నాం" అన్నారు.

దానికా పిచుక "మీరేమీ బాధపడకండి. నేను పోయి మా స్నేహితులందర్నీ పిలుచుకోనొస్తా... ఎంతసేపు. కండ్లు మూసి తెరిచేలోగా ఒక్క వడ్లగింజ కూడా మిగలకుండా అన్నిటినీ పొట్టు తీసేస్తాం" అనింది. దాంతో ఆ అమ్మాయిలు సంబరంగా సరేనంటూ శుభ్రంగా కసువుకొట్టి వడ్లన్నీ కింద పరిచినారు. అంతలో యాడి నుంచి వచ్చినాయోగానీ ఒకటిగాదు, రెండుగాదు వందలవందల పిచుకలు కిచకిచకిచమంటా అట్లా వాలినాయి. కండ్లు మూసి తెరిచేలోగా చకచకచక ముక్క విరగకుండా పొట్టంతా వలిచి మూటల్లో వేసి వెళ్ళిపోయినాయి. దాంతో ఆ ముగ్గురు అమ్మాయిలూ మూడు మూటలు తీసుకోని ఇంటికి పోయినారు. సవతితల్లి దాంట్లో చూస్తే ఒక వలవని గింజగానీ, విరిగిన బియ్యం ముక్కగానీ కనబడలేదు. దాంతో ఏమీ అనలేక వాళ్ళను లోపలికి రానిచ్చింది.

ఆ సవతితల్లికి వాళ్ళను ఇంట్లోంచి ఎట్లా బైటకు తరమాల్నో అర్థం గాక ఒకరోజు ఎవరూ లేని సమయంలో మొగునితో కొట్లాట పెట్టుకోనింది. 'నీవు వాళ్ళని అడవిలో వదిలిపెట్టి వస్తావా లేక నేనూ నా పిల్ల విషం తాగి చావమంటావా' అని పట్టుపట్టింది. దాంతో ఆమె మొగుడు ఏమీ చేయలేక తర్వాతరోజు ముగ్గురు పిల్లలతో "అమ్మా... పక్కవూరిలో పెద్ద తిరుణాల జరుగుతావుంది. మీ చిన్నమ్మ, చిన్న చెల్లి రేపొస్తారంట. మనము ఈ రోజే పోదాం. తయారుకాండి" అని చెప్పినాడు. పాపం... ఆ ముగ్గురు అమ్మాయిలూ తిరుణాలనగానే సంబరంగా మంచిబట్టలు కట్టుకోని, మొగానికి బొట్టు పెట్టుకోని, తల్లో పూలు తురుముకోని, కళ్ళకు కాటుక దిద్దుకోని మల్లెపూలలెక్క మెరిసిపోతా బైలుదేరినారు. వాళ్ళనాన్న ఒకపెద్ద అడవిలోనికి వాళ్ళను తీసుకోని పోయి ఒకచోట

కూచోబెట్టి “మీరు ఇంటికాన్నుంచి తెచ్చుకున్న సద్ది తింటా వుండండి. ఈ పక్కనొక మంచి మాగిన మామిడికాయల చెట్టొకటి వుంది. పోయి పండ్లు పట్టుకోనొస్తా” అని పోయినాడు. అట్లా పోయినోడు మరలా వెనక్కి గూడా తిరిగి చూడకుండా “అయ్యో... పాపం... ఆడపిల్లలని” గూడా అనుకోకుండా అదే సందని ఇంటికి వెళ్ళిపోయినాడు.

పాపం... ఆ ముగ్గురు అమ్మాయిలు ఆ అడవిలో నాన్నా... నాన్నా... అంటూ ప్రతి కొమ్మా రెమ్మా వెదికినారు. భయంతో కేకలు వేసినారు. ముగ్గురూ కలసి కిందామీదా పడి ఏడ్చినారు. చీకటి పడతా వుంటే ఎప్పుడు ఏ జంతువులు వచ్చి మీద పడతాయోనని గజగజా వణికిపోసాగినారు.

అదే సమయంలో ఆ పక్కవూరికి చెందిన ముగ్గురు రాకుమారులు అడవి జంతువులను వేటాడి ఇంటికి తిరిగిపోతా వున్నారు. వాళ్ళు ఏడుస్తా వున్న ఆ ముగ్గురు అమ్మాయిల్ని చూసినారు. వాళ్ళ కథంతా విన్నారు. “అబ్బ... ఎంతందంగా వున్నారు ముగ్గురూ ముత్యాల్లెక్క... చేసుకుంటే ఇట్లాంటి చక్కని చుక్కల్నే చేసుకోవాల” అనుకోని ఆ ముగ్గురినీ వాళ్ళింటికి పిలుచుకోని పోయి పెండ్లి చేసుకున్నారు. దాంతో వాళ్ళ దశ తిరిగి హాయిగా కాలు మీద కాలేసుకోని కులాసాగా బతకసాగినారు.

ఈడ వాళ్ళ నాన్న, చిన్నమ్మ వున్నారు గదా... ఆ వూళ్ళో పెద్ద కరువొచ్చింది. ఒక్క వాన చుక్కగూడా భూమి మీదకు రాలలేదు. దానికితోడు ఒకరోజు రాత్రి కొందరు దొంగలు వాళ్ళింటి మీద పడి వున్నదంతా నున్నగా వూడ్చుకోనిపోయినారు. ఒకవైపు డబ్బుల్లేక, మరొక వైపు పంటల్లేక వాళ్ళు వీధిన పడినారు. ఆ వూరిలో బతకలేక వేరే వూర్లలో తినడానికి తిండి లేక అడుక్కోసాగినారు.

అట్లా ఒకొక్క వూళ్ళో అడుక్కుంటా అడుక్కుంటా ఒకరోజు ఈ ముగ్గురూ వున్న వూరొచ్చినారు. వాళ్ళు అట్లా అడుక్కుంటా వుంటే మిద్దె మీది నుంచి ముగ్గురూ చూసి “అయ్యో... మన నాన్నా, చిన్నమ్మా, చిన్న చెల్లెలే గదా” అని వురుక్కుంటా వచ్చి కళ్ళనీళ్ళు బెట్టుకున్నారు. వాళ్ళని చూసిన చిన్నమ్మ “మిమ్మల్ని బాధ పెట్టినందుకేనమ్మా మాకీ కష్టాలు. మంచి వాళ్ళని బాధపెట్టి బాగుపన్నవాళ్ళు ఈ లోకంలో ఎవరూ వుండరు” అంటూ భోరున ఏడ్చింది. “అయ్యయ్యో... అంతమాటనకమ్మా... మీరు ఆ రోజు అట్లా చేయబట్టేగదా... మాకీరోజు ఇన్ని భోగభాగ్యాలు. అంతా మా మంచికే” అంటూ అందర్నీ ఇంటికి పిలుచుకోనొచ్చినారు. వాళ్ళ మొగుళ్ళకు చెప్పి మోయలేనంత బంగారమిచ్చి పసుపూకుంకుమలతో పంపిచ్చినారు.

# 25 చిలక ముక్కు వూడిపాయ

ఒకూర్లో ఒక చీమా, చిలుక కలసిమెలసి వుండేటివి. అవి రెండూ మంచి స్నేహితులు. ఒకరోజు ఆ రెండూ కలసి పాయసం చేసుకున్నాయి. పాయసం ఘుమఘుమలాడతా వాసనొస్తా వుంటే చీమకు నోట్లో నీళ్ళూరినాయి. ఎట్లాగుందో కాస్త రుచి చూద్దామని గిన్నె పైకి ఎక్కి రుచి చూడబోతా వుంటే పాపం కాలు జారి దభీమని పాయసంలో పడిపోయింది.

పాయసం బాగా వేడివేడిగా వుంది గదా, దాంతో పాపమా చీమ "కాపాడండి! కాపాడండి!" అని బాధతో అరవసాగింది. అది చూసిన చిలుక వెంటనే స్నేహితున్ని కాపాడదామని వురుక్కుంటా వచ్చి ముక్కుతో దాన్ని పట్టుకోబోయింది. వేడివేడి పాయసం తగిలి దాని ముక్కు కాస్తా వూడిపోయింది. పాపమా చీమ ఆ పాయసంలోనే చచ్చిపోయింది.

చీమ చచ్చిపోయినందుకు బాధపడతా ఆ చిలుక ఏడుస్తా వుంటే అప్పడే అటువేపుగా వచ్చిన కాకొకటి ఆ చిలుకను చూసి పకపకపక నవ్వుతా "చిలుకా! చిలుకా! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీ ముక్కెట్లా వూడిపాయ" అనడిగింది.

వెంటనే ఆ చిలుక కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ. నన్ను చూసి నవ్వినందుకు నీ కన్ను లొట్టపోవాల" అనింది. వెంటనే కాకి కన్ను లొట్టపోయింది.

ఆ కాకి ఎగురుకుంటా పోయి ఒక చెట్టు మీద వాలి బాధపడతా వుంటే ఆ చెట్టు చూసి పకపకపక నవ్వుతా "కాకీ కాకీ! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీ కన్నెట్లా లొట్టపాయ" అనడిగింది.

వెంటనే ఆ కాకి కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, నా కన్ను లొట్టపాయ. నన్ను చూసి నవ్వినందుకు నీ ఆకులు రాలిపోవాల" అనింది. వెంటనే ఆ చెట్టు ఆకులన్నీ రాలిపోయినాయి.

ఆ చెట్టు ఆకులన్నీ రాలిపోయినందుకు బాధపడతా వుంటే, అప్పడే అటుగా వచ్చిన ఒక జింక చెట్టును చూసి పకపకపక నవ్వుతా "చెట్టూ చెట్టూ! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీ ఆకులెట్లా రాలిపాయ" అనడిగింది.

వెంటనే ఆ చెట్టు కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, నా ఆకులన్నీ రాలిపాయ. నన్ను చూసి నవ్వినందుకు నీ కొమ్ములిరిగిపోవాల" అనింది. వెంటనే జింక కొమ్ములిగిపోయినాయి.

ఆ జింక కొమ్ములిరిగిపోయినందుకు బాధపడ్తా, చెరువుకాడికి పోయి నీళ్ళు తాగతా వుంటే ఆ చెరువు జింకను చూసి పకపకపక నవ్వుతా "జింకా జింకా! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీ కొమ్ములెట్లా విరిగిపాయ" అనడిగింది.

వెంటనే ఆ జింక కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, చెట్టు ఆకులు రాలిపాయ, జింక కొమ్ములిరిగిపాయ. నన్ను చూసి నవ్వినందుకు నీ నీళ్ళు ఎండిపోవాల" అనింది. వెంటనే ఆ చెరువులోని నీళ్ళన్నీ ఎండిపోయినాయి.

చెరువులో నీళ్ళు ముంచుకోడానికి సంకలో బిందె పెట్టుకోనొచ్చిన కోడలుపిల్ల ఆ చెరువును చూసి పకపకపక నవ్వుతా "చెరువా! చెరువా! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీ నీళ్ళెట్లా ఎండిపాయ' అనింది.

వెంటనే ఆ చెరువు కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, చెట్టు ఆకులు రాలిపాయ, జింక కొమ్ములిరిగిపాయ, నా నీళ్ళు ఎండిపాయ... నన్ను చూసి నవ్వినందుకు నీకు బిందె అంటుకుపోవాల" అనింది. వెంటనే ఆమెకు బిందె అంటుకుపోయింది.

కోడలు కిందామీదా పడ్తా ఆ బిందెను పీక్కోలేక బాధపడ్తా వుంటే రోట్లో వడ్లు దంచుతా వున్న అత్త పకపకపక నవ్వుతా "కోడలా కోడలా! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీకు బిందెట్లా అంటుకపాయ" అనడిగింది.

వెంటనే ఆ కోడలు కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, చెట్టు ఆకులు రాలిపాయ, జింక కొమ్ములిరిగిపాయ, చెరువు నీళ్ళు ఎండిపాయ, నాకు బిందె అంటుకుపాయ, నన్ను చూసి నవ్వినందుకు నీకు రోకలి అంటుకపోవాల" అనింది. వెంటనే ఆమె చేతికి రోకలి అంటుకుపోయింది.

ఆమె రోకలిని పీక్కోలేక సస్తా వుంటే పీట మీద కూచోని అది చూస్తా వున్న ఆమె కొడుకు పకపకపక నవ్వుతా "అమ్మా! అమ్మా! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీ చేతికి రోకలెట్లా అంటుకపాయ" అనడిగినాడు.



వెంటనే ఆమె కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, చెట్టు ఆకులు రాలిపాయ, జింక కొమ్ములిరిగిపాయ, చెరువు నీళ్ళు ఎండిపాయ, కోడలికి బిందె అంటుకపాయ, నాకు రోకలి అంటకపాయ. నన్ను చూసి నవ్వినందుకు నీకు పీట అంటకపోవాల" అనింది. వెంటనే వానికి పీట అంటకపోయింది.

వాడు ఆ పీటను విడిపించుకోలేక దాంతోనే పెండ్లికి పోతే ఆడున్నోళ్ళందరూ పకపకపక నవ్వుతా "ఏరా! ఇప్పటివరకూ బాగానే వుంటివే. అంతలోనే నీకు పీటెట్లా అంటకపాయ" అనడిగినారు.

వెంటనే వాడు కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, చెట్టు ఆకులు రాలిపాయ, జింక కొమ్ములిరిగిపాయ, చెరువు నీళ్ళు ఎండిపాయ, నా పెండ్లానికి బిందె అంటకపాయ, మా అమ్మకు రోకలి అంటకపాయ, నాకేమో పీటంటకపాయ... నన్ను చూసి నవ్వినందుకు మీకు కుర్చీలంటకపోవాల' అన్నాడు. అంతే అక్కడున్నోళ్ళందరికీ కుర్చీలంటకపోయినాయి.

వాళ్ళందరూ ఆ కుర్చీలు విడిపించుకోలేక కిందా మీదా పడ్తా అటూ ఇటూ తిరుగుతా వుంటే నెత్తిన కుండలు పెట్టుకోని మజ్జిగ అమ్ముకుంటున్నామె వాళ్ళను చూసి పకపక నవ్వుతా "ఏమైంది! ఇప్పటివరకూ బాగానే వుండిరే. అంతలోనే మీకు కుర్చీలెట్లా అంటకపాయ" అనడిగింది.

వెంటనే వాళ్ళు కోపంగా "చీమ ఏమో చచ్చిపాయ, చిలక ముక్కు వూడిపాయ, కాకి కన్ను లొట్టపాయ, చెట్టు ఆకులు రాలిపాయ, జింక కొమ్ములిరిగిపాయ, చెరువు నీళ్ళు ఎండిపాయ, కోడలికి బిందె అంటుకపాయ, అత్తకి రోకలంటకపాయ, కొడుక్కి పీటంటకపాయ, మాకేమో కుర్చీలంటకపాయ... మమ్మల్ని చూసి నవ్వినందుకు నీకు కుండ అంటక..." వాళ్ళ నోటి నుండి అంటకపోవాలనే మాట ఇంకా పూర్తిగా రాక ముందే ఆమె అదిరిపడి దభీమని నెత్తి మీదున్న కుండలన్నీ కింద పడేసింది.

దాంతో... కుండ ఆమెకు అంటుకోలేదు. వెంటనే పెళ్ళోళ్ళకు కుర్చీలూడిపోయినాయి. కొడుక్కి పీటూడిపోయింది. అత్తకు రోకలూడిపోయింది. కోడలికి బిందూడిపోయింది. చెరువుకి నీళ్ళు వచ్చేసినాయి. జింకకు కొమ్ములు వచ్చేసినాయి. చెట్టుకు ఆకులు వచ్చేసినాయి. కాకికి కన్ను వచ్చేసింది. చిలుకకు ముక్కొచ్చేసింది. చీమ బతికి బైటకొచ్చేసింది.

# 26 మెక్కూ మెక్కూ... ముక్కా మెక్కూ

ఒకూర్లో ఒకడున్నాడు. వాడేమో రోజూ కూర (మాంసం) తీస్కోనొచ్చి పెండ్లానికిచ్చి చేయమని చెప్పి పొలానికి పోయేటోడు. ఆమె చానా టక్కరిది. మొగుడట్లా బైటికి పోవడం ఆలస్యం గబగబా రొట్టె చేసుకోని మెత్త మెత్తని ముక్కలన్నీ ఏరి బాగా కూర చేసుకోని నున్నగా తినేసేది. మొగుడు వచ్చే సమయానికి మిగిలిన ఒట్టి ఎముకలు వేసి చారు చేసి వానికి పెట్టేది.

వాడు చారూ, ఎముకలు చూసి "ఇదేందే... దీంట్లో ఒక్క ముక్క గూడా లేదు" అనడిగితే "ఏమో నాకేం తెల్సు... నువ్వెట్లాంటిది తెస్తే అట్లాంటిది చేసి పెడ్తావున్నా. ముక్కల్లేకపోతే... పోయి..... నీకు కూరమ్మేటోన్ని అడుగుపో" అని గట్టిగా కొట్లాడేది. పాపం వాడు ఆమె నోటికి బెదపడి గమ్మున నోరు మూసుకోని మట్టసంగా పెట్టినేది తినేటోడు. అట్లా ఆమె ముక్కలన్నీ తినుకుంటా తినుకుంటా రోజురోజుకీ దుబ్బగయిపోతా వుంటే పాపం వాడేమో రోజురోజుకీ సన్నగా బక్కచిక్కి పోతా వున్నాడు.

ఒకరోజు వాడు చెల్లెలిని చూసొద్దామని వాళ్ళూరికి పోయినాడు. ఆమె అన్నను చూసి "ఏందన్నా... ఇంతకుముందు పోట్లగిత్తలా ఎట్లా వుండేటోనివి. ఇప్పుడేమి ఇట్లా ఎండుపుల్లలెక్క బాగా సిక్కిపోయినావు" అనడిగింది. దాంతో వాడు జరిగిందంతా చెప్పినాడు.


ఆమె "అట్లనా" అని మూడు లక్కబొమ్మలు తెచ్చిచ్చి "అనా... అనా... ఇవి మామూలు లక్కబొమ్మలకాదు. మంత్రించిన లక్కబొమ్మలు. వీటిని తీస్కోనిపోయి నీ పెండ్లానికి తెలీకుండా ఒకటి నీ గుమ్మం కింద తవ్విపెట్టు. మరొకటి గూట్లో దాచిపెట్టు. ఇంకొకటి గవాక్షిపైన పెట్టు" అని చెప్పింది.

సరేనని వాడు ఆ మూడు లక్కబొమ్మలూ తీస్కోనిపోయి పెండ్లాం నీళ్ళకు పోయినప్పుడు ఒకటి గుమ్మంకింద, మరొకటి గూట్లో, ఇంకొకటి గవాక్షిలో పెట్టేసి ఏమీ తెలీనోనిలెక్క మట్టసంగా వున్నాడు.

తరువాతరోజు పొద్దున్నే వాడు ఎప్పటిలాగానే కూర తీస్కోనొచ్చి పెండ్లానికిచ్చి పొలానికి పోయినాడు. మొగుడట్లా పోయినాడో లేదో... వెంటనే ఆమె మెత్త మెత్తని ముక్కలన్నీ ఏరి పొయ్యి మీదికి కూరగిన్నె ఎక్కిచ్చింది. కూర చేసినాక రొట్టెలు కాల్చుకుందామని పిండి తీసి వేన్నీళ్ళు కలిపి కొడ్తా వుంటే గుమ్మం కిందున్న బొమ్మ

**"కొట్టూ... కొట్టూ... రొట్టే కొట్టూ"** అనరిచింది.

"ఎవరబ్బా అట్లా అంటా వున్నారని" ఆమె అదిరిపడి చుట్టూ చూస్తే ఎవరూ కనబడలేదు. దాంతో "ఏందోలే" అనుకోని రొట్టెలు చేసుకోని, పళ్ళెంలో కూరేసుకోని తిందామని నోట్లో పెట్టుకోబోయింది.



వెంటనే గూట్లో వున్న బొమ్మ **"పెట్టూ... పెట్టూ... నోట్లో పెట్టూ"** అనరిచింది.

అంతే ఆమె "ఎవరబ్బా అట్లా అంటావున్నారని" బెరబెరా బైటికి పోయి అంతా వెదికింది. కానీ యాడా ఎవరూ కనబళ్ళేదు.

దాంతో "ఏందోలే" అనుకోని రొట్టెలోకి కూరద్దుకోని నోట్లో పెట్టుకోని తినడం మొదలుపెట్టింది.

వెంటనే గవాక్షిలోని బొమ్మ **"మెక్కూ... మెక్కూ... ముక్కా మెక్కూ"** అనరిచింది.

దాంతో ఆమె "నేను కూర తింటావున్నేది ఎవరో చూస్తా వున్నట్టున్నారు" అని భయపడి ఆరోజునుండీ ఏమీ తినకుండా చేసినవి చేసినట్టు మట్టసంగా మొగునికి కూడా సమానంగా పెట్టడం మొదలుపెట్టింది.

# 27 నాకు కాబోయే మొగుడు ఎట్లా వుండాలంటే

ఒకూర్లో ఒక రాజు వుండేటోడు. ఆయనకు లేక లేక ఒక ఆడబిడ్డ పుట్టింది. దాంతో ఆ పాపను కాలు కింద పెట్టనీయకుండా అపురూపంగా పెంచుకున్నాడు. ఆ పాపది అప్పుడే విచ్చిన అందమైన గులాబీలా ముచ్చటైన మొగం. అటు అందంలోనూ, ఇటు సదువులోనూ ఆ పాపకు సాటి వచ్చేటోళ్ళు అటు పదహారు దేశాలలోనూ, ఇటు పదహారు దేశాలలోనూ ఎక్కడా ఎవరూ లేరు. దాంతో చుట్టు పక్కలున్న రాజుల పిల్లలంతా ఆ పాపను చేసుకోవాలని తెగ ముచ్చటపడి వాళ్ళ వాళ్ళ బొమ్మలు అందంగా గీపిచ్చి పంపిచ్చినారు. కానీ ఆ పాపకు ఒక్కరంటే ఒక్కరు గూడా నచ్చలేదు. ఒకనికి ముక్కొంకర అంటే, ఇంకొకనికి మూతొంకర అంటూ... ఒకనికి కాలొంకర అంటే, ఇంకొకనికి కన్నొంకర అంటూ... ఇట్లా అందరినీ తీసి పారేసింది.

అది చూసి వాళ్ళ నాయన "చూడు పాపా... మనిషన్నాక అన్నీ మంచిగుణాలే ఒక్కచోట కుప్ప పోసినట్లు వుండవు. నీవిట్లా సంబంధాలు వచ్చినవి వచ్చినట్లు ఎగ్గొట్టేస్తా వుంటే నీకు పెండ్లి సేయడం నా వల్ల కాదు" అని తెగేసి చెప్పినాడు

దానికా పాప "ఎందుకు నాయనా... వూకే అట్లా బాధ పడతావు. నాకు ఈ లోకాన మనుషులెవరూ నచ్చుడం లేదు. చేసుకుంటే అందరి రాతలు రాసే ఆ బ్రహ్మదేవున్నే చేసుకుంటా... లేకుంటే ఇట్లాగే పెండ్లి చేసుకోకుండా వుండిపోతా" అనింది. ఎంత చెప్పినా ఆ పాప పట్టినపట్టు వదలక పోయేసరికి వాళ్ళ నాయన ఏమీ చేయలేక 'సరే... నీ ఇష్టం' అని చెప్పి వెళ్ళిపోయినాడు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి, ఆ గడపా ఈ గడపా దాటి, ఆవూరు ఈ వూరు దాటి చుట్టు పక్కలున్న నూటా అరవయ్యారు వూర్లకూ తెలిసిపోయింది. దాంతో అందరూ "అందంగా వున్నానని ఈ పిల్లకు మరీ టెక్కు ఎక్కువయినట్లుంది. ఇది అయ్యేదా పొయ్యేదా... యాడి మానవులు... యాడి దేవతలు. ఇంగ ఈ పిల్లకు ఈ జన్మలో పెండ్లయినట్లే" అని నవ్వుకున్నారు. కానీ ఆ పాప పట్టినపట్టు ఒక్క మెట్టు గూడా దిగకుండా అట్లే కూచోనింది.

ఆ వూరికి పక్కనున్న ఒకూర్లో ఒక అడుక్కుతినేటోడు వున్నాడు. వానికి తినడానికి పైసా లేకపోయినా ఎచ్చులకు మాత్రం తక్కువ లేదు. ఆడా ఈడా అడుక్కున్న డబ్బుల్తో మాంచి రంగురంగుల బట్టలు వేసుకోని చుట్టు పక్కల వూర్లలో టిప్పుటాపుగా తిరిగేటోడు. వానికి అడవిలో ఒక రోజు ఒక చిన్న నెమలి పిల్ల దొరికింది. దాన్ని తెచ్చుకొని పెంచుతా మొదట దాని మీద ఒక శేరు బరువు పెట్టినాడు. అట్లా ఒక పదిరోజులకు ఒక కేజీ, మళ్ళీ పదిరోజులకు ఐదు కేజీలు, ఇంకో పదిరోజులకు పది కేజీలు... అట్లా నెమ్మదిగా పెంచుతా వచ్చినాడు. దాంతో అది బాగా పెద్దదయ్యేసరికి వాన్ని గూడా మీద కూచోబెట్టుకోని గాల్లోకి ఎగరడం నేర్చుకోనింది. వాడు అర్ధరాత్రి



అందరూ పండుకున్నాక ఎవరికీ కనబడకుండా ఆ నెమలి పైకి ఎక్కి గాల్లో సవారీ చేయడం మొదలు పెట్టినాడు.

ఇక్కడ రాకుమార్తె ఆ బ్రహ్మదేవున్ని తప్ప ఎవర్నీ చేసుకోనని పట్టుబట్టింది గదా... ఆ విషయం వీని వరకు వచ్చింది. దాంతో వానికి "ఎట్లాగయినా సరే ఆ పిల్లను బోల్తా కొట్టించి నేనే బ్రహ్మదేవున్నని చెప్పి పెండ్లి చేసుకుంటే... హాయిగా జీవితాంతం కాలు మీద కాలేసుకోని బతకొచ్చు గదా" అనిపించింది. 'మరి ఎట్లా ఆ పిల్లను నమ్మించడం' అని తెగ ఆలోచించ సాగినాడు. అంతలో ఒకసారి ఆ వూరి గుడికాడ ఒకడు హరికథ చెబుతా వుంటే వినడానికి పోయినాడు. ఆ కథలో ఆయన బ్రహ్మదేవుని వాహనం నెమలి. ఆయన దాని మీద తిరుగుతా వుంటాడు అని చెబుతా వుంటే వీడు విన్నాడు. అంతే వానికి ఒక ఆలోచన తళుక్కున మెరిసింది.

వెంటనే ఒక నాటకాల అంగడికి పోయి రకరకాల నకిలీ నగలు, హారాలు అద్దెకు తెచ్చుకున్నాడు. అర్ధరాత్రి అందరూ పండుకున్నాక అవన్నీ వేసుకోని, నెత్తిన కిరీటం పెట్టుకోని నెమలి మీద పక్కవూరికి బైలుదేరినాడు. రాకుమారి వుండేది అట్లాంటిట్లాంటి అల్లాటప్పా మేడ కాదు. ఏడు అంతస్తుల బంగారు మేడ. సక్కగా దాన్లోకి పోయినాడు. రాకుమారి బంగారు మంచం మీద నిద్రపోతా వుంది. చుట్టూ రకరకాల తినుబండారాలు వున్నాయి. అక్కడ దిగి అన్నీ హాయిగా తిని, తాంబూలం వేసుకోని అద్దం పైన కాటుకతో "ఓ రాకుమారీ... అందరూ నిన్ను మెచ్చుకుంటా వుంటే ఏమో అనుకున్నా గానీ... నువ్వు నిజంగానే చానా ముచ్చటగా సాన పెట్టిన ముత్యం లెక్క వున్నావు" అని రాసి వెళ్ళిపోయినాడు.

పొద్దున్నే యువరాణి లేచి తల దువ్వుకుందామని అద్దం ముందుకు పోతే ఇంకేముంది కాటుకతో నల్లని అక్షరాలు తళతళలాడతా కనబన్నాయి. చుట్టూ చూస్తే రాత్రి వున్న తినుబండారాలన్నీ మాయమై పోయినాయి. ఏమైనా దొంగనా అని చూస్తే గదిలో యాడి నగలు ఆన్నే వున్నాయి. దాంతో ఆమె 'కొంపదీసి ఆ బ్రహ్మదేవుడే నాకోసం రాలేదు కదా' అని ఆలోచనలో పడింది. అట్లా వరుసగా రెండు రోజులు అయింది.

ఇంగ లాభం లేదు... ఈ రోజు ఎట్లాగయినా సరే వాన్ని పట్టుకోవాలని ఆమె చేతివేలు సర్రున కోసుకోని, దానికి నిమ్మకాయ పెట్టింది. అది సురసురసుర మండుతా వుంటే ఆమెకు కంటి మీద రెప్ప పడలేదు. వూరికే మంచం మీద పండుకోని దొంగనిద్ర నటిస్తా ఎప్పుడెప్పుడు వస్తాడా అని ఎదురుచూడసాగింది. ఎప్పటిలాగే వాడు రాత్రి పన్నెండు దాటగానే నెమలి మీద ధగధగలాడే నగలూ, కిరీటంతో లోపలికి దిగినాడు. అది చూసి ఆమె "అరెరే... నేను అనుకున్నది నిజమే. ఆ బ్రహ్మదేవుడే దేవలోకం నుంచి నా కోసం సక్కగా వచ్చినాడు" అని సంబరపడి దిగ్గున లేచి వాని చేయి గట్టిగా పట్టుకోనింది.

" ఎవరు నువ్వు నిజం చెప్పు. నన్ను పెండ్లి చేసుకోడానికి వచ్చిన ఆ బ్రహ్మదేవునివే గదా" అనింది గట్టిగా.

దానికి వాడు తలూపుతా " నీవు అనుకున్నది నిజమే... నేను ఆ బ్రహ్మదేవున్నే. కానీ నీవేమో మానవకన్యవు. నేనేమో దేవున్ని. మనకెట్లా జత కుదురుతాది. ఎవరైనా వింటే నవ్విపోతారు. మీ అమ్మా నాన్నలు ఒప్పుకోరు" అన్నాడు.

దానికా పాప "పెండ్లి చేసుకునేది నేనా... వాళ్ళా. నువ్వు వూ అను చాలు నే చూసుకుంటా" అంటూ పట్టినపట్టు వదల్లేదు. "సరే... అయితే నాదొక్క మాట. నీ అమ్మా నాయనలే స్వయంగా వచ్చి నా కూతురిని పెండ్లి చేసుకోమని నన్ను అడగాల. అప్పుడే చేసుకుంటా లేదంటే లేదు" అని చెప్పి నెమలినెక్కి వెళ్ళిపోయినాడు.

పొద్దున్నే ఆ రాకుమారి పోయి వాళ్ళ అమ్మా నాయనలకు జరిగిందంతా చెప్పింది... అది విని వాళ్ళు "చూడమ్మా.. వచ్చింది నిజంగా ఆ బ్రహ్మదేవుడేనా.. లేక ఏ మంత్రగాడో ఆ వేషంలో తిరుగుతా వున్నాడా... ఈ లోకంలో దేన్నీ అంత తొందరగా నమ్మగూడదు. ఈ రోజు రాత్రి మేము గూడా వచ్చి నీ గదిలో ఎవరికీ కనబడకుండా దాచి పెట్టుకుంటాం. మాకు నమ్మకం కుదిరితేనే పెండ్లి చేసేది" అని చెప్పినారు. దాంతో ఆ పాప సరేనని రాత్రి చీకటి పడగానే వాళ్ళని పిలిచింది. వాళ్ళు ఎవరికీ కనబడకుండా మంచం కిందకి దూరి దాచిపెట్టుకున్నారు.

ఎప్పటిలాగానే వాడు ఆ రోజు రాత్రి గూడా పన్నెండు దాటగానే నెమలి మీద లోపలికి వచ్చినాడు. వాళ్ళు మంచం కింద నుంచే అదంతా చూడసాగినారు. రాకుమారి వాన్ని తీసుకోని పోయి మంచం మీద కూచోబెట్టింది. గదిలో మల్లెపూల వాసన గుప్పున కొడతా వుంది. రాకుమారి పెట్టుకున్నవేమో చామంతిపూలు. దాంతో వాడు గదంతా ఆ మూల నుంచి ఈ మూలకు, ఈ మూల నుంచి ఆ మూలకు అంగుళం అంగుళం చూసినాడు గానీ యాడా ఒక్క మల్లెపువ్వు గూడా కనబడలేదు. దాంతో వానికి ఆ గదిలో ఎవరో దాచిపెట్టుకున్నారని అర్థమై పోయింది.

కాసేపు అవీ ఇవీ జాగ్రత్తగా మాట్లాడి "ఇప్పటికే నేను ఈడికి రాబట్టి వారం దాటిపోయింది. ఇంతవరకు మీ అమ్మగానీ, నాన్నగానీ ఎవరూ రాలేదు. ఆడ దేవలోకంలో పనులన్నీ ఆగిపోతా వున్నాయి. ఎంతో మంది రాతలు రాయాల, వాళ్ళను భూలోకంలో ఎవరెవరి కడుపుల్లోకి ఎవరెవరిని పంపాల్నా అని ఆలోచించాల. ఈడేమో చూస్తాంటే మన పెండ్లి అయ్యేటట్లు లేదు. ఇంగ ఇట్లా వూరికే నీతో గప్పాలు కొట్టుకుంటా కూచోవడం నా వల్ల కాదు. వస్తా" అంటా పైకి లేచినాడు.

మంచం కింద నుంచి ఆ మాటలు వింటా వున్న రాకుమారి తల్లిదండ్రులు అదిరిపడి 'అల్లుడూ కాస్త ఆగు' అంటూ కింద నుంచే గట్టిగా వాని కాళ్ళు పట్టుకోని బైటకు వచ్చినారు. వచ్చి " ఏమనుకోవద్దు అల్లుడూ.. నువ్వు ఎట్లాంటోనివో తెలీదు గదా. అందుకే పరీక్షిద్దామని వచ్చినాం" అన్నారు. ఆ మాటలకు వాడు నవ్వి " తప్పేముందిలే మామా... ఆడపిల్లను కన్నాక ఆ మాత్రం ముందు జాగ్రత్త లేకుంటే ఎట్లా. పెండ్లన్నాక అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలంటారు కదా పెద్దలు" అంటా నవ్వినాడు.

అప్పటికీ అనుమానం తీరని అత్త "ఏమీ అనుకోనంటే ఒకమాట అల్లుడూ... బ్రహ్మదేవుడంటే నాలుగు తలకాయలుంటాయి గదా... మరి నీకేంది ఒక్క తలకాయనే వుంది" అనడిగింది.

ఇలాంటి ప్రశ్నలన్నింటినీ ముందే వూహించి సిద్ధంగా వున్న వాడు పడీ పడీ నవ్వుతా "అత్తా... దేవలోకంలో ఒక్కన్ని కూచోని సృష్టి చేస్తా, జనాల తలరాతలు రాసేటప్పుడు మాత్రమే లోకంలో నాలుగు దిక్కులూ చూస్తా వుండాల గాబట్టి నాలుగు తలకాయలుంటాయి. మిగతా సమయమంతా అందరిలాగే ఒక్క తలకాయనే" అన్నాడు.

ఆ మాటలకు అత్త చిరునవ్వు నవ్వి "అల్లుడూ... మా అమ్మాయి నిన్ను తప్ప ఎవరినీ చేసుకోనని పట్టుపట్టి కూచోనింది. నువ్వు వూ అంటే ఏడేడు పద్నాలుగు లోకాలు అదిరిపోయేటట్లు భూదేవంత అరుగు, ఆకాశమంత పందిరీ యేసి, వీధి వీధీ ముత్యాల తోరణాలు కట్టి, గడప గడపకు చీర, రవిక పంపి, అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు చెప్పుకునేంత ఘనంగా నూటా అరవయ్యారు వంటకాలతో పెండ్లి చేస్తాం. సరేనా" అనింది.

ఆ మాటలకు వాడు "అట్లాగే అత్తా... నీవెలాగంటే నేనలాగే.. కానీ ఒక్కమాట. నేను దేవలోకం నుంచి దిగొచ్చి భూలోకంలో పెండ్లి చేసుకుంటానంటే మా వాళ్ళు ఎవరూ ఒప్పుకోరు. అందుకని వచ్చే పున్నమికి నేనొక్కన్నే ఎవరికీ తెలీకుండా దిగొస్తా. అట్లాగే మా దేవతల ఆచారం ఏమిటంటే పెండ్లికూతురి పక్కన కత్తి పెట్టి పెండ్లి చేయాల్నే గానీ స్వయంగా నేను కూచోగూడదు. కాబట్టి నేను రాగానే నా కత్తి మీకిచ్చి గదిలోకెళతా. మీరు కత్తితో రాకుమారికి పద్ధతి ప్రకారం పెండ్లి చేసేయండి" అని చెప్పి వెళ్ళిపోయినాడు. అట్లయితే పెండ్లికి ఎవరైనా తన వూరోళ్ళు వచ్చినా గుర్తు పట్టరని.

ఈ విషయం ఆ నోటా, ఈ నోటా పాకి నిమిషాల్లో చుట్టు పక్కల వూర్లకంతా పాకిపోయింది. దాంతో జనాలంతా ఆ బ్రహ్మదేవున్ని చూద్దామని పున్నమికి యాడి పనులు ఆడనే వదిలేసి పరుగుపరుగున వచ్చినారు. వాడు కొత్తబట్టలు వేసుకోని నకిలీ నగలు పెట్టుకోని, చేతిలో ధగధగ మెరిసిపోతా వున్న కత్తి పట్టుకోని నెమలి మీద ఆకాశంలో బైలుదేరినాడు.

వాడు ఆకాశంలో వస్తా వుంటే చూసిన జనం అదిగో బ్రహ్మదేవుడంటే... ఇదిగో బ్రహ్మదేవుడంటా జయజయధ్వానాలు చేస్తా అరుపులు, కేకలు, ఈలలతో సందడి సందడి చేయసాగినారు. ఆకాశంలో కత్తి పట్టుకోని వస్తావున్న వానికి ఇదంతా చూసి చెప్పలేని సంబరమేసింది. దాంతో తన ప్రతాపం అందరికీ తెలియాలని నెమలి మీద లేచి నిలబడి కత్తి గిరగిరగిర తిప్ప సాగినాడు. అది చూసిన జనాలంతా మరింత గట్టిగా సంబరంగా కేకలు వేయసాగినారు. దాంతో వాడు రెచ్చిపోయి మరింత వేగంగా కత్తి కిందికీ మీదికీ సరసరసర తిప్పసాగినాడు. అట్లా తిప్పుతా వుంటే అనుకోకుండా అదొచ్చి సర్రున నెమలి మెడకు తగిలింది. అంతే దెబ్బకు దాని తల తెగి అంత ఎత్తు నుంచి వానితో పాటు దభీమని అందరి నడుమ పడింది.

అది చూసి అందరూ "అయ్యయ్యో... బ్రహ్మదేవునికి ఏమయిందో ఏమో" అనుకుంటా వురుక్కుంటా వచ్చినారు. వాడట్లా పడడం పడడం కిరీటం, నగలు అన్నీ చెల్లాచెదురయి పోయినాయి. వురుక్కుంటా వచ్చిన జనాల్లో వాని వూరి వాళ్ళు గూడా వున్నారు. వాళ్ళు వాన్ని చూసి గుర్తుపట్టి "ఓరినీ.. వీడు బ్రహ్మదేవుడేంది. మనూరి అడుక్కుతినేటోడు గానీ... జనాలందరినే గాక రాజూ రాణీలను గూడా భలే బురిడీ కొట్టిచ్చినాడే" అంటా వాన్ని పట్టుకోని మెత్తగా తన్నినారు.

విషయం తెలుసుకోని రాజకుమారి సిగ్గుపడింది. కోరరాని కోరిక కోరుకుంటే ఇట్లాగే అయితాదని బుద్ధి తెచ్చుకోని మట్టసంగా వాళ్ళమ్మా నాన్నలు తెచ్చిన సంబంధం చేసుకోని హాయిగా కలకాలం బతికింది.

# 28 టక్కుపల్లి సుబ్బయ్య

ఒకూర్లో రామయ్య, సోమయ్య అని ఇద్దరు వుండేటోళ్ళు. వాళ్ళిద్దరూ మంచి పరుగు పందెంగాళ్ళు. ఉరకడం మొదలు పెట్టినారంటే ఎవరు గెలుస్తారో ఎవరూ చెప్పలేరు. కానీ వాళ్ళలో రామయ్య చానా అమాయకుడైతే సోమయ్య మాత్రం పెద్ద టక్కరోడు.

రామయ్య దగ్గర ఒక పెద్ద వజ్రం వుండేది. దాన్ని వాళ్ళ నాయన చచ్చిపోతా... చచ్చిపోతా... వాని చేతిలో పెట్టినాడు. అది చానా విలువైనది. సోమయ్య కన్ను ఆ వజ్రం మీద పడింది. ఎట్లాగయినా సరే దాన్ని కొట్టేయాలని అనుకున్నాడు.

సోమయ్య ఒకరోజు రామయ్యతో "రామయ్యా... రామయ్యా... రేపు మనం ఉరికెత్తే పందెం వేసుకుందామా. నువ్వు గెలిస్తే మా ఇంటికొచ్చి మొట్ట మొదట ఏం ముట్టుకుంటే అది నీకిస్తా. అట్లాగాక నేను గెలిచినాననుకో... నేను మీ ఇంటికొచ్చి మొట్టమొదట ఏం ముట్టుకుంటే అది నాకియ్యాల. సరేనా" అనినాడు.

రామయ్య "సరే" అన్నాడు.

తరువాతరోజు సోమయ్య పందెం గురించి చెప్పి ఊరి పెద్దలనంతా పిల్చుకోనొచ్చినాడు. కర్నూలు నుంచి కాల్వబుగ్గ దాకా ముప్పై కిలోమీటర్లు ఎవరు ముందు వురికితే వాళ్ళు గెలిచినట్లు అనుకున్నారు. ఊరి పెద్దలు ఒకటి, రెండు, మూడు అనగానే ఇద్దరూ ఒకేసారి వురకడం మొదలు పెట్టినారు.

ముప్పై కిలోమీటర్లంటే మాటలు కాదు గదా. చానాచానా దూరం. తాండ్రపాడు దాటాల, నన్నూరు దాటాల, పూడిచెర్ల దాటాల, ఓర్వకల్లు దాటాల, హుసేనాపురం దాటాల... ఆ తర్వాత కాల్వబుగ్గ. దాంతో ఊరోళ్ళు మధ్య మధ్యన వాళ్ళు తాగడానికని నీళ్ళు ఏర్పాటు చేసి ఇద్దరు మనుషుల్ని ఆడాడ పెట్టినారు.

సోమయ్య వాళ్ళలో ఒకన్ని మంచి చేసుకోని తాగే నీళ్ళలో మత్తుమందు కలిపినాడు. అది తెలీని రామయ్య వురుక్కుంటా... వురుక్కుంటా... ఆడికొచ్చి దప్పిక తీర్చుకోడానికని ఆ నీళ్ళు తాగినాడు. అంతే కొంచెం దూరం వురికినాడో లేదో చేతగాక కిందపడిపోయినాడు. దాంతో సోమయ్య వానిని దాటుకోని గెలిచేసినాడు.

పందెం ప్రకారం తరువాత రోజు పొద్దున్నే 'మీ ఇంటికి వస్తా' అన్నాడు. రామయ్య సరే అన్నాడు. సోమయ్యకు వజ్రం మీద కన్నుంది గదా... ఆ సంగతి కొందరు పోయి రామయ్యకు చెప్పినారు. దాంతో రామయ్యకు ఏం చేయాల్నో అర్థం కాలేదు. వాడు ఖచ్చితంగా వచ్చి వజ్రాన్ని ముట్టుకుంటాడు. తాత ముత్తాతల కాలం నుంచీ ఒకరి నుండి ఒకరికి వస్తావున్న వజ్రమది. తన కాలంలో పోతుందే అని బాధపడసాగినాడు.



అప్పుడు రామయ్యకు తన స్నేహితుడయిన టక్కుపల్లి సుబ్బయ్య గుర్తుకొచ్చినాడు. టక్కుపల్లి సుబ్బయ్యంటే అందరిలెక్క అట్లాంటిట్లాంటోడు గాదు. చానా తెలివయినోడు. ఎటువంటి చిక్కు సమస్యనయినా చిటికెలో తీర్చేయగలడు. దాంతో గుఱ్ఱమేస్కోని రాత్రికి రాత్రి టక్కుపల్లికి చేరుకోని సుబ్బయ్యకు జరిగిందంతా చెప్పేసినాడు.

సుబ్బయ్య కాసేపాలోచించి "సరే... పోదాం పద" అని వానెంబడే వాళ్ళ ఊరికి వచ్చినాడు. ఇంట్లో వజ్రాన్ని బాగా ఎత్తున్న మచ్చు మీద కనబడేటట్లు పెట్టి, ఒక మూలన నిచ్చన గోడకు ఆనించినాడు. హాయిగా పన్నుకో... రేపు చూద్దువు గానీ. ఏం జరుగుతుందో" అన్నాడు.

తరువాత రోజు పొద్దున్నే సోమయ్య ఊరోళ్ళందరినీ వెంటబెట్టుకోని రామయ్య ఇంటికి వచ్చినాడు. వచ్చి వజ్రం కోసం ఇల్లంతా వెదకసాగినాడు. యాడా కనబళ్ళేదు. ఇదేందబ్బా యాడా కనబడడం లేదు అని ఆలోచిస్తా వుంటే మచ్చు మీద ధగధగధగ మెరిసిపోతా కనబడింది. సంబరంగా పోయి చేయి చాచినాడు. అది అందలేదు. ఎగిరి చూసినాడు. ఐనా అందలేదు. ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే మూలన నిచ్చెన కనబడింది. బెరబెరా పోయి నిచ్చెన తీసుకోని ఏసి మచ్చు మీదికి ఎక్కసాగినాడు.

అంతలో టక్కుపల్లి సుబ్బయ్య "ఆగు మిత్రమా... యాడికి ఎక్కుతా వున్నావు" అన్నాడు. సోమయ్య చిరునవ్వుతో వజ్రాన్ని చూపిస్తా "అది తీసుకోడానికి" అన్నాడు.

టక్కుపల్లి సుబ్బయ్య నవ్వుతా "చూడు సోమయ్యా... ఒకసారి పందెం గుర్తు చేసుకో. ఇంట్లోకొచ్చి మొట్టమొదట ఏం ముట్టుకుంటే అది నీది... అంతే గదా... ఇప్పుడు నువ్వు ఇంట్లో మొట్టమొదట ముట్టుకున్నది ఏది. నిచ్చెన గదా. కాబట్టి నిచ్చెన తీసుకోని ఇంగ నీ ఇంటికి నువ్వు పో" అన్నాడు.

సోమయ్య నోరుమూసుకుని మట్టసంగా కిందకి దిగినాడు.

ఊరి జనాలంతా టక్కుపల్లి సుబ్బయ్య తెలివికి మెచ్చుకోని చప్పట్లు కొట్టినారు.

# 29 కుంటికోతి - మంచికోతి


ఒకూర్లో ఒక కుంటికోతి, ఒక మంచికోతి వున్నాయి. అవి రెండూ కలసి ఒకరోజు అడవిలో పోతా వుంటే దారిలో ఒక పెద్ద మామిడిచెట్టు కనబడింది. చెట్టు నిండా పండ్లే పండ్లు. మంచికోతి గబగబా చెట్టెక్కి బాగా మాగిన కమ్మని మామిడిపండ్లు ఒకొక్కటీ తెంచుకోని సంబరంగా తినసాగింది. కుంటికోతికి కాలు సరిగ్గా లేదు కదా... అందుకే అది చెట్టెక్కలేక కిందే నిలబడిపోయింది.

కుంటికోతికి ఆ మామిడిపండ్లను చూస్తా వుంటే నోరూరసాగింది. కిందే నిలబడి ఆశగా చూస్తా “మంచికోతి... మంచికోతి... నాకో పండియ్యవా” అనడిగింది. మంచికోతి చానా దొంగది. అన్ని పండ్లున్నాయి గదా... ఒకటిస్తే దాని సొమ్మేం పోతాది. ఐనా ఇయ్యకుండా ఆ దొంగసచ్చినేది “అబ్బా ఆశ. ఇవి నాకే సరిపోవు. నీకేంది ఇచ్చేది. ఫో... ఫో...” అని కసురుకోనింది.



కుంటికోతి పట్టు విడవకుండా “పండివ్వకపోతే పోతివిగానీ... కనీసం తొక్కన్నా ఇయ్యవా... నాక్కుంటా” అని బతిమలాడింది. మంచికోతి తొక్కగూడా ఇయ్యకుండా “ఇవి నా పెండ్లానికియ్యాల. నేనివ్వను ఫో” అనింది. పాపం కుంటికోతి చానా బాధపడింది. బాగా మాగిన మామిడిపండ్లు కండ్ల ముందు కనబడతా వుంటే తినాలనే కోరిక మరింత ఎక్కువయింది. అది దీనంగా చూస్తా ‘‘మంచికోతీ... మంచికోతీ... తొక్కియ్యకపోతే పోతివి గానీ... కనీసం టెంకన్నా ఇయ్యవా... చీక్కుంటా” అని బతిమలాడింది.

పండియ్యకపాయ, తొక్కియ్యకపాయ, కనీసం టెంకైనా ఇయ్యొచ్చు గదా... దాని మీద బండపడ... అది టెంక గూడా ఇయ్యకుండా ‘‘ఇవి నా పిల్లలకియ్యాల, నేనియ్యను ఫో” అనింది. పాపమా కుంటికోతి ఎంతసేపు నిలబన్నా... ఎంత అడుక్కున్నా మంచికోతి ఏమీ ఇయ్యలేదు.



కుంటికోతి ఒక్కతే అడవిలో విచారంగా పోతా వుంటే దారిలో ఒకచోట ఒక చిన్నరాయి కనబడింది. దాన్నెత్తితే దానికి ఒక చిన్న రూపాయి దొరికింది. మళ్ళా పోతా వుంటే ఒక పెద్ద రాయి కనబడింది. అదెత్తితే పెద్ద రూపాయి దొరికింది. కుంటికోతి దాండ్లను తీసుకోని సంబరంగా పోతా వుంటే దారిలో ఒక పెద్దపుట్ట కనబడింది. పుట్టలో చేయి పెట్టింది. అంతే పుట్టెడు బంగారం దొరికింది. పక్కనే వున్న కొండెక్కింది. కాడెద్దులు దొరికినాయి. సూర్యునికెళ్ళి చూసింది. సూర్యుడు చర్నాకోలా ఇచ్చినాడు.

కుంటికోతి బండికి ఎద్దులు కట్టి, దాన్నిండా బంగారం వేసుకోని, హుషారుగా వస్తా వుంటే దారిలో మంచికోతి కనబడింది. “ఈ కుంటికోతికి ఇంత బంగారం ఎట్లా వచ్చిందబ్బా” అని ఆచ్చర్యపోయి దాన్నే అడిగింది. కుంటికోతి చానా మంచిది గదా... జరిగిందంతా చెప్పింది.

మంచికోతి తాను గూడా బంగారం సంపాదించుకోని రావాలని అడవిలో కొంత దూరం పోయి చిన్నరాయి ఎత్తింది. చిన్న తేలుపిల్ల కుట్టింది. పెద్దరాయి ఎత్తింది. పెద్దతేలు కుట్టింది. బంగారం కోసం పుట్టలో చేయి పెట్టింది. పూదుపాము కరిచింది. కష్టపడి కొండెక్కింది. జారిపడి కాళ్ళు రెండూ విరిగినాయి. సూర్యుని వంక చూసింది. వెంటనే రెండు కండ్లూ పోయి గుడ్డిదయిపోయింది.

# 30 బంగారు పక్షి

ఒకూర్లో ఒక రైతుంటాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్ళు. వాళ్ళందరికీ పెళ్ళి వయసొచ్చింది. దాంతో ఆ రైతు సంబంధాల కోసం వెదకసాగినాడు. ఒకసారి ఆ ముగ్గురు అమ్మాయిలు కడవలు తీసుకోని నీళ్ళు తేవడానికని చెరువుకాడికని పోయినారు. నీళ్ళు ముంచుకుంటా... ముంచుకుంటా "ఏమే... నాన్న సంబంధాలు చూస్తా వున్నాడు. నువ్వెవరిని చేసుకుంటావే... అంటే... నువ్వెవరిని చేసుకుంటావే" అని ఒకర్నొకరు అడుక్కోసాగినారు.

అదే సమయంలో ఆ వూరి యువరాజు మారువేషంలో అటువైపు వచ్చినాడు. వాళ్ళు ఏం మాట్లాడుకుంటావున్నారో విందామని ఒక పొద దాపున కూర్చున్నాడు.

అందరికంటే పెద్దామె "నేను ఈ రాజ్యాన్ని కాపాడే సేనాధిపతిని చేసుకుంటా... నాకు యుద్ధాలన్నా, పోరాటాలన్నా చానా ఇష్టం" అనింది.

రెండో ఆమె "నేను తన ఎత్తులు జిత్తులతో ఈ రాజ్యాన్ని ప్రశాంతంగా వుంచే మంత్రిని చేసుకుంటా... నాకు సలహాలివ్వడమన్నా, సమస్యల్ని పరిష్కరించడమన్నా చానా ఇష్టం" అనింది.

చిన్నామె "నేను ఈ రాజ్యాన్ని పాలించే యువరాజును చేసుకుంటా... నాకు దాసదాసీలతో సేవలందుకోవడమన్నా, సింహాసనం మీద రాజు పక్కన కూర్చోని ప్రజల్ని పాలించడమన్నా చానా ఇష్టం" అనింది.

అంతలో పెద్దామె "పదపద... ఆలస్యమైపోతా వుంది. మనం ఇలా పొద్దుపోక వుత్తుత్త కలలు కనాల్సిందే గానీ... ఇవన్నీ నిజమవుతాయా... పాడా... మన నాన్న ఏ తలకు మాసినోన్ని తెచ్చినా తలొంచుకోని తాళి కట్టించుకోవడం తప్ప ఏం చేయగలం" అనింది. ముగ్గురూ కడవలు సంకన పెట్టుకోని గమ్మున ఇంటిదారి పట్టినారు.

యువరాజు వాళ్ళ మాటలన్నీ విన్నాడు. ముగ్గురినీ చూసినాడు. ముగ్గురూ చానా చక్కగా అప్పుడే పూసిన రోజాపూవుల్లెక్క వంక బెట్టడానికి లేకుండా వున్నారు. "అరే... పాపం... ఈ అమ్మాయిలెవరో గానీ వీళ్ళ కోర్కెలు తీరుద్దాం. వీళ్ళకేం కన్నొంకరా... కాలొంకరా... చక్కగా పాలమీగడ లెక్కున్నారు" అనుకున్నాడు. వెంటనే అంతఃపురానికి పోయి మంత్రినీ, సేనాధిపతినీ పిలిచి జరిగిందంతా చెప్పి "మనం ముగ్గురమూ వాళ్ళ ముగ్గురినీ పెళ్ళాడదాం" అన్నాడు. రాజే సరే అన్నాక మిగతా వాళ్ళదేముంది... వాళ్ళు గూడా సరే అన్నారు. తర్వాత రోజు ముగ్గురూ కలసి రైతు ఇంటికి పోయినారు. స్వయంగా తమను పాలించే రాజు, మంత్రి, సేనానే తమ ఇంటికి అల్లుళ్ళుగా వస్తామనే సరికి రైతు చానా సంబరపన్నాడు. వాళ్ళు కోరుకున్నట్టే వారికి నచ్చిన వాళ్ళనిచ్చి పెండ్లి చేసినాడు.

పెద్దామె సేనాధిపతి పెండ్లాం అయితే, నడిపామె మంత్రి పెండ్లాం అయితే, చిన్నామె రాజ్యానికి యువరాణి



అయింది. దాంతో చిన్నామెకు అడుగడుగునా దాసీలే. ఆమె భోగమే భోగం. పన్నీటి స్నానాలు, మెత్తని హంసతూలికా తల్పాలు, ఏడువారాల నగలు, లెక్కబెట్టుకోలేనన్ని పట్టు వస్త్రాలు... ఒకటని కాదులే... కనుసైగ చేస్తే చాలు కోరుకున్నవన్నీ కాళ్ళముందుకొచ్చేవి. అదంతా చూసి పెద్దామెకు, నడిపామెకు కన్ను కుట్టింది. "ఛ... ఛ... ఆ రోజు చెరువుకాడ ఆ మాటలంటున్నప్పుడు అవి నిజమవుతాయని కలలో గూడా అనుకోలేదు. లేకుంటే మనం గూడా యువరాజే మొగుడు కావాలని కోరుకుంటుంటిమి. మనందరికన్నా చిన్నదయినా దీనికేమి అదృష్టం పట్టింది. ఎట్లాగయినా సరే వీళ్ళిద్దరినీ విడదీయాల" అనుకోసాగినారు.

చూస్తుండగానే గంటలు రోజులై, రోజులు వారాలై, వారాలు నెలలై... ఆ చిన్నపిల్లకు మిగతా ఇద్దరికన్నా ముందే కడుపు పండింది. అది చూసి యువరాజు చానా సంబరపన్నాడు. కాలు కింద పెట్టనీయకుండా పసిపిల్లలెక్క అల్లారుముద్దుగా చూసుకోసాగినాడు. ఆమె ఏమడిగితే అది... ఎంత ఖరీదయినా సరే తెప్పించసాగినాడు. ఒక పూట తిన్న వంట మరొకపూట తినకుండా దేశదేశాల నుండి పేరు మోసిన వంటగాళ్ళనందరినీ పిలిపించి అమృతం లాంటి వంటకాలన్నీ చేయించి పెట్టసాగినాడు. ఇదంతా చూస్తావున్న కొద్దీ అక్కలిద్దరికీ మరింతగా మండిపోసాగింది. పైకి నవ్వుతా ఇకఇకలాడుతావున్నా... లోపల మాత్రం కుతకుతా వుడికిపోతా వున్నారు. ఎప్పుడెప్పుడు సందు దొరుకుతుందా... ఎప్పుడెప్పుడు దెబ్బ కొడదామా... అని ఎదురు చూడసాగినారు.

అట్లా ఒక్కొక్క నెల గడుస్తా... గడుస్తా... ఆ చిన్నపాపకు తొమ్మిది నెల్లు నిండినాయి. ఈ వారమా వచ్చేవారమా కానుపు అన్నట్టుంది. అంతలో అనుకోకుండా పక్కవూరి నుండి ఒకరాజు ఆ రాజ్యం మీదికి దండయాత్రకొచ్చినాడు. దాంతో యువరాజు తప్పనిసరై, సైన్యాన్ని తీసుకోని పోతా పోతా పెళ్ళాం అక్కలిద్దరినీ

పిలిచి “మీ చెల్లెలు నిండుమనిషి. అక్కలైనా, అమ్మలైనా మీరే. కొంచెం జాగ్రత్తగా చూసుకోండి” అని అప్పజెప్పినాడు. దానికి వాళ్ళు నవ్వుతా “దానిదేముందిలే యువరాజా! నీవు పోయిరా. మేం కంటికి రెప్పలా కాపాడుకుంటాము” అన్నారు. పోయే ముందు యువరాజు పెండ్లాంతో “ఏమే... నాకు ముద్దులు మూటగట్టే కొడుకునిస్తావా... చూడ చక్కనైన కూతుర్నిస్తావా... ఎవరినిస్తావు” అన్నాడు. దానికామె నవ్వుతా “ఏమో... నాకేం తెలుసు. దేవుడు కడుపున ఎవర్ని వేసింటే వాళ్ళనిస్తా” అనింది. దానికి యువరాజు “మరి నేను అంత దూరంలో వుంటాను గదా... నాకెట్లా తెలుస్తాది... ఎవరు పుట్టినారో” అన్నాడు. దానికామె చిరునవ్వు నవ్వుతా “ఏముంది... నేను కనగానే ఆకాశంలోంచి ముత్యాలవాన కురిస్తే కొడుకు పుట్టినట్లు, పగడాల వాన కురిస్తే కూతురు పుట్టినట్లు... ఏం సరేనా” అనింది.

యువరాజు అట్లాగేనంటూ యుద్ధానికి వెళ్ళిపోయినాడు. అట్లా పోయిన వారం రోజులకు ఆమెకు నొప్పులు మొదలయినాయి. అప్పుడు అక్కలిద్దరూ చెరోపక్కన చేరి “ఏం భయపడొద్దు చెల్లీ... మేమున్నాం గదా... కళ్ళు మూసుకోని కాసేపు బాధ బిగబట్టుకో, బోసినవ్వులు నవ్వే పాప పక్కనుంటాది” అంటూ కాన్పుకు తీసుకోని పోయినారు. ఆమెకు కాసేపట్లో ముచ్చటగొలిపే కొడుకు పుట్టినాడు. వెంటనే అక్కలిద్దరూ ఆమె కళ్ళు తెరవక ముందే మత్తుమందు కలిపిన నీళ్ళిచ్చి, ఆమె లేచేలోగా ఆ పిల్లవాన్ని అన్నించి తీసుకోని పోయి ఒక పెట్టెలో పెట్టి నీళ్ళలో వదిలేసి, ఒక చచ్చిపోయిన పిల్లవాన్ని తెచ్చి పక్కన పన్నబెట్టినారు. ఆమెకిదంతా తెలీదు... దాంతో మత్తు దిగినాక కొడుకు చనిపోయి వుండటాన్ని చూసి బాధపడింది.

అక్కడ యువరాజు యుద్ధంలో వుండగానే ఆకాశంలోంచి ముత్యాలవాన కురిసింది. అది చూసి యువరాజు “ఆహా... నాకు ముత్యంలాంటి కొడుకు పుట్టినట్టున్నాడు” అని ఎంతగానో సంబరపన్నాడు. యుద్ధం పూర్తి కాగానే ఎప్పుడెప్పుడు కొడుకును చూద్దామా అని సంబరపడతా బెరబెరా ఇంటికి చేరుకున్నాడు. కానీ అక్కడ పసిపాప నవ్వుల్లేవు. చనిపోయాడని తెలుసుకొని ఎంతగానో బాధపన్నాడు. ఐనా కాసేపటికి తమాయించుకొని “సరే.. జరిగిందేదో జరిగిందిలే... మనకు నుదుటన రాత రాసినట్టు లేదు. ఈసారి మాత్రం చూడచక్కనైన కూతురినివ్వు” అన్నాడు. మళ్ళా ఆమెను ఇంతకు ముందులాగే బాగా చూసుకోసాగినాడు.

ఇంతకు ముందు బాబును పెట్టెలో పెట్టి నీళ్ళలో వదిలినారు గదా... ఆపెట్టె కొట్టుకోని పోయి, కొట్టుకోని పోయి ఒక ముసలి బాపనాయనకు దొరికింది. ఆయనకు పెళ్ళాం, పిల్లలు ఎవరూ లేరు. ఒక్కడే. పిల్లలకు చదువు నేర్పిస్తా వుంటాడు. ఆయన ఆ పసిపిల్లోన్ని చూసి “ఎవరు కన్నబిడ్డో ఏమో... పాపం... ఎంత కష్టమొచ్చిందో... ఇట్లా వదిలేసింది” అనుకోని పెంచుకోడానికి ఇంటికి తీసుకోని పోయినాడు.

అట్లా కొంతకాలం గడిచినాక... ఆ రాజ్యంలో రైతులు వేసిన విత్తనాలు మొలకలై, మొలకలు మొక్కలై, మొక్కలకు పూవులై, పూవులు కాయలై, కాయలు విత్తనాలై పంటలు ఇంటికి చేరుతా వున్న దశలో యువరాణికి మళ్ళా కడుపు పండింది. ఈసారి రాజు ఆమెని కాలు కింద పెట్టనీయకుండా అడుగడుగునా దాసీలని పెట్టి మరింత అపురూపంగా చూసుకోసాగినాడు. అట్లా ఒకొక్క నెలా దాట్తా కాన్పుకు దగ్గర పడింది.

అనుకోకుండా అప్పుడే ఆ రాజ్యాన్ని ఆనుకొని వుండే అడవుల్లో కొన్ని దొంగల ముఠాలు చేరినాయి. వాళ్ళు రోజూ గుంపులు గుంపులుగా వూర్ల మీద పడి దొరికినోన్ని దొరికినట్టు చంపుకుంటా కనబడినదల్లా దోచుకోని పోసాగినారు. జనాలంతా భయపడి రాజు దగ్గరికి పోయి “రాజా! వాళ్ళు మామూలోళ్ళు గాదు. ఒకొక్కడు ఒకొక్క ఏనుగంత బలంగా వున్నాడు. వాళ్ళని ఆపడం మా వల్ల కావడం లేదు. నీవే మమ్మల్ని ఎట్లాగైనా

కాపాడాల. లేకుంటే వూర్లు వదిలిపోవడం తప్ప మాకు వేరే దారి లేదు" అని కాళ్ళ మీద పడినారు. రాజు 'సరే' అని పెండ్లాన్ని పిలిచి "మళ్ళా కానుపప్పుడే పోవలసి వస్తా వుంది. ఈసారి జాగ్రత్త. నేను వచ్చేసరికి బోసినవ్వులతో కిలకిలకిల నవ్వుతా వున్న కొడుకునో కూతురినో నా చేతుల్లో పెట్టాల. ఆరోగ్యం జాగ్రత్త" అని చెప్పి పోయినాడు.

అట్లా పోయిన వారం రోజులకు ఆమెకు నొప్పులు మొదలయినాయి. ఎప్పట్లాగే అక్కలిద్దరూ చెరోపక్కన చేరి "ఏం భయపడొద్దు చెల్లీ. మేమున్నాం గదా... కళ్ళు మూసుకోని కాసేపు బాధ బిగబట్టు. చిరునవ్వులొలికే చిన్నారి నీ పక్కనుంటాది" అంటా కాన్పుకు తీసుకోనిపోయినారు. ఆమెకు కాసేపటికి చందమామ లెక్క చక్కని పాప పుట్టింది. వెంటనే అక్కలిద్దరూ చెల్లెలికి మత్తుమందు కలిపిన నీళ్ళిచ్చి ఆమె లేచేలోగా ఆ పాపను అన్నుంచి తీసుకోని పోయి ఒక పెట్టెలో పెట్టి నీళ్ళలో వదిలేసి, ఒక చచ్చిపోయిన పాపని తెచ్చి పక్కన పన్నబెట్టినారు.

ఆమెకిదంతా తెలీదు గదా... దాంతో మత్తు దిగినాక కూతురు చనిపోయుండటాన్ని చూచి "అరే... అప్పుడు కొడుకు, ఇప్పుడు కూతురు. ఏమి రాత రాసినావురా దేవుడా నుదుటి మీద" అంటా కళ్ళనీళ్ళు పెట్టుకోనింది. అంతలో అక్కలిద్దరూ చెరోపక్కన చేరి "ఏం బతుకే నీది... ఎప్పుడూ చచ్చిపోయిన పిల్లోల్లని కంటా వున్నావు. పాపం ఎన్నో ఆశలతో వురుకులు పరుగుల మీద వచ్చే నీ మొగునికి నీ మొగం ఎట్లా చూపిస్తావే" అంటూ సూటిపోటి మాటలన్నారు. దాంతో ఆమెకు చానా బాధ వేసి రాత్రికి రాత్రి ఎవరికీ చెప్పా పెట్టకుండా ఆ రాజ్యాన్ని వదిలేసి ఎవరికీ కనబడనంత దూరం వెళ్ళిపోయింది. అక్కడ ఒక ఇంట్లో ఎవరూ లేని అనాథనంటూ పనికి చేరి బతకసాగింది. అక్కలిద్దరూ చెల్లెలు వెళ్ళిపోవడంతో చానా సంబరపడినారు.

అక్కడ అడవిలో దొంగలను వేటాడుతా వున్న యువరాజు మీద ఆకాశంలోంచి పగడాల వాన కురిసింది. అది చూసి యువరాజు "ఆహా.. ఈసారి నాకు చూడచక్కని కూతురు పుట్టినట్లుంది" అని సంబరపన్నాడు. కొద్దిరోజుల్లో దొంగలనంతా తరిమేసి పాపను చూద్దం కోసం వురుకులు పరుగుల మీద ఇంటికొచ్చినాడు. కానీ అక్కడ పసిపాప కేరింతలు లేవు. అక్కలిద్దరూ దొంగ ఏడుపు ఏడుస్తా నీ పెళ్ళానికి ఈసారి గూడా చచ్చిపోయినోళ్ళే పుట్టినారు. దాంతో నీకు మొగం చూపించలేక రాత్రికి రాత్రి ఎవరికీ చెప్పా పెట్టకుండా యాడికో వెళ్ళిపోయింది" అంటూ చెప్పినారు. పిల్లనే గాక పెళ్ళాం గూడా పోయినందుకు రాజు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

ఇంతకు ముందు అక్కలిద్దరూ పెట్టెలో పాపను పెట్టి వదిలినారు కదా... అది కొట్టుకోని పోయి కొట్టుకోని పోయి... మళ్ళా అదే ముసలి బాపనాయనకు దొరికింది. ఆయన ఆ పాపను గూడా బైటకు తీసుకొచ్చి సొంత పిల్లలెక్క అల్లారుముద్దుగా పెంచసాగినాడు. అట్లా ఆడ కొంతకాలానికి పిల్లలిద్దరూ పెరిగి పెద్దగయినారు. ఆయన దగ్గర రకరకాల విద్యలు నేర్చుకున్నారు. ఆ బాపనాయన చానా ముసిలోడయిపోయినాడు. చనిపోయే ముందు ఇద్దరినీ పిలిచి "బాబూ... మీకు మీ పుట్టుక గురించి ఒక్క నిజం చెప్పాల. మీరు నా సొంత పిల్లలు కాదు" అంటూ జరిగిందంతా చెప్పి చనిపోయినాడు. పిల్లలకు తమ అమ్మానాన్నా ఎట్లా వుంటారో, యాడుంటారో తెలుసుకోవాలనిపించింది. కానీ చెప్పేవాళ్ళు ఎవరూ లేక బాధపడసాగినారు.

ఆ పిల్లల ఇంటి పక్కన ఒక తోట వుంది. దాంట్లో లోకంలో యాడా దొరకనన్ని రకరకాల పండ్ల చెట్లు వున్నాయి. వాటి కోసం ఒక బంగారు పక్షి ఆడికి వచ్చింది. సూర్యుని కిరణాలు పడి దాని ఒళ్ళంతా ధగధగా మెరవసాగింది. లోకంలో ఎన్నో పక్షులు చూసినాం గానీ ఇంత అందమైన పక్షిని ఎప్పుడూ చూడలేదు. దీన్ని పట్టి ఇంట్లో వుంచుకుంటే ఎంత బాగుంటుంది అనుకున్నారిద్దరూ. దాంతో వాళ్ళు నెమ్మదిగా దాక్కుంటా దాక్కుంటా

దాని దగ్గరికి పోయినారు. లటుక్కున ఆ పక్షిని పట్టుకోబోతే అది అందినట్లే అంది చేయి తాకిన మరుక్షణమే టక్కున మాయమైపోయింది. మళ్ళీ ఎప్పుడూ అటువైపు రాలేదు.

అట్లా కొంతకాలం గడిచినాక ఒక సాధువు వాళ్ళ ఇంటికాడికి వచ్చినాడు. అది అన్నాల సమయం. పిల్లలిద్దరూ ఇంట్లో కూచోని అన్నం పెట్టుకుంటా వున్నారు. ఆ సమయంలో సాధువు "అమ్మా... ఆకలయితా వుంది. ఏమయినా వుంటే పెట్టండమ్మా... పొద్దున్నించీ ఏమీ తినలేదు. నీరసంగా వుంది' అన్నాడు. అన్నా చెల్లెల్లిద్దరూ అన్నం పళ్ళాల కాన్నించి లేచి బైటకొచ్చి సాధువుకు తమ కోసం వండుకున్నదంతా వేడివేడిగా పెట్టినారు. తోటలోంచి మంచి మంచి మాగిన పళ్ళు తెచ్చి ఇచ్చినారు. సాధువు కడుపు నిండా తిన్నాక "పిల్లలూ... మీరు చేస్తున్న మర్యాదలకు చానా సంతోషం కలుగుతా వుంది. నేను దేశమంతా ఒకసారి పోయిన చోటికి మరొకసారి పోకుండా తిరుగుతా వుంటాను. అక్కడి వింతలూ విశేషాలు తెలుసుకుంటా వుంటాను. నాకు మాయలూ మంత్రాలు రావు గానీ అనేక విషయాలు మాత్రం తెలుసు. మీకేమయినా అటువంటివి తెలుసుకోవాలనుకుంటే అడగండి చెబుతాను" అన్నాడు.

అప్పుడా పిల్లలకు ఒకసారి తమ తోటలోకి వచ్చిన బంగారుపక్షి గుర్తుకు వచ్చింది. "సామీ... ఈ నడుమ మా తోటలోనికి ఒక బంగారుపక్షి వచ్చింది. మేము పుట్టి బుద్ధెరిగినప్పటి నుండీ అటువంటి అందమైన పక్షిని ఎప్పుడూ చూడలేదు. వినలేదు. మీకేమయినా దాని గురించి తెలుసా" అని అడిగినారు.

దానికా సాధువు చిరునవ్వు నవ్వి "నాయనా... అది అట్లాంటిట్లాంటి మామూలు పక్షికాదు. ఏడేడు పధ్నాలుగు లోకాల్లోనూ అంత అందమైన పక్షి యాడా కనిపించదు. అంతే కాదు అది చానా మహిమలున్న పక్షి. ఇక్కడికి వుత్తరం వైపున ఏడువందల మైళ్ళ దూరంలో వరుసగా ఏడు కొండలున్నాయి. చివరి కొండ మీద ఏడు మర్రిచెట్లు వున్నాయి. చివరి మర్రిచెట్టుకు ఏడు పెద్ద పెద్ద కొమ్మలున్నాయి. చివరి కొమ్మ మీద ఏడు అందమైన గూళ్ళు వున్నాయి. అందులోని చివరి గూడులో ఈ పక్షి నివసిస్తా వుంటాది. కానీ దాని దగ్గరికి పోయిన వారిని ఎవరినైనా సరే అది ఏడు ప్రశ్నలడుగుతాది. సరియైన సమాధానం చెప్పావా... నీవు ఏ కోరిక కోరినా కాదనకుండా నెరవేరుస్తాది. తప్పు చెప్పినావా వెంటనే నిన్ను అక్కడికక్కడే రాయిగా మార్చి వేస్తుంది" అని చెప్పినాడు.

బాపనాయన దగ్గర చిన్నప్పటి నుంచీ వేదవేదాల్లో శిక్షణ పొందిన ఆ పిల్లోడు ఎట్లాగయినా సరే ఆ పక్షిని చేరుకొని అమ్మానాన్నల గురించి తెలుసుకోవాలి అనుకున్నాడు. తరువాత రోజు పొద్దున్నే దారిలో తినడానికి పళ్ళు, రొట్టెలు మూట కట్టిచ్చుకోని బైలుదేరినాడు. రాత్రనకా, పగలనకా నడిచీ నడిచీ చివరికి ఏడేడు పధ్నాలుగు రోజులకు కొండలను చేరుకున్నాడు. గంటకో కొండను దాటుతా ఏడో గంటకు చివరి కొండను చేరుకున్నాడు. నిమిషానికో మర్రిచెట్టు దాటుతా ఏడో నిమిషానికి చివరి చెట్టు చేరుకున్నాడు. క్షణానికో గూడు దాటుతా ఏడో క్షణానికి చివరి గూడు చేరి తలుపు తట్టినాడు. అప్పుడు ఆ గూట్లో నుంచి ధగధగా మెరిసిపోతా వున్న బంగారు రెక్కలను విదిలించుకుంటా బైటకొచ్చింది. ఈ పిల్లోన్ని చూసి "చూడు... వచ్చిందారినే మర్యాదగా వెనక్కు తిరిగి చూడకుండా ఐనా వెళ్ళిపో... లేదా నేనడిగే ఏడు ప్రశ్నలకు సమాధానం చెప్పి నీకు కావలసినదాన్న తీసుకోని పో" అనింది. అప్పుడా పిల్లోడు ఏ మాత్రం బెదపడకుండా "అడుగు చెబుతాను" అన్నాడు. ఆ పక్షి అడగడం మొదలు పెట్టింది. అదట్లా అడగడం ఆలస్యం ఆ పిల్లోడు క్షణం గూడా ఆలస్యం చేయకుండా టకీమని సమాధానం చెప్పడం మొదలుపెట్టినాడు.

1. లోకంలో అన్నిటికన్నా వేగమైనది ఏది?

జ. మనసు

2. ఎంత దాచినా దాగనిది ఏది?

జ. అబద్ధం

3. పోతే తిరిగిరానిది ఏది?

జ. పరువు

4. ఎంత పంచినా తరగనిది ఏది?

జ. విద్య

5. భార్యాభర్తల మధ్య వుండాల్సినది ఏమిటి?

జ. నమ్మకం

6. మనషులు నాశనం కావడానికి కారణం?

జ. అసూయ

7. మనిషి గొప్పవాడయ్యేది ఎప్పుడు?

జ. ఇతరుల కోసం బతికినప్పుడు.

ఆ పిల్లోడిచ్చిన జవాబులన్నీ విని ఆ పక్షి చానా ముచ్చటపడింది. "ఆహా... ఇన్నాళ్ళ నుండి ఈడికి ఎంతోమంది వస్తా వున్నారు. రాళ్ళుగా మారుతా వున్నారే గానీ... నీ మాదిరి చక్కగా సమాధానం చెప్పినవారు ఎవరూ లేరు. చెప్పు... నీకేం కావాల్నో" అనింది. అప్పుడా పిల్లోడు జరిగిందంతా చెప్పి "మా అమ్మానాన్నలు యాడున్నారు. వాళ్ళని, మమ్మల్ని కలుపు" అన్నాడు.

సరే అని పక్షి ముందు వాళ్ళ చెల్లెలిని ఆడికి పిలుచుకోనొచ్చి ఇద్దరినీ బంగారు రథంపై కూచోబెట్టుకోని వాళ్ళమ్మ దగ్గరికి తీసుకోని పోయింది. జరిగిందంతా తెలుసుకున్న వాళ్ళమ్మ పిల్లలిద్దరినీ దగ్గరికి తీసుకోని ముద్దుల మీద ముద్దులు పెడతా కళ్ళనీళ్ళు పెట్టుకోనింది. ఆ తరువాత అందరూ రథమెక్కి యువరాజు దగ్గరికి చేరుకున్నారు. పెళ్ళాన్ని చూడగానే రాజు చానా సంబరపడినాడు. పక్కనున్న ఇద్దరు పిల్లలూ తమ పిల్లలే అని తెలుసుకోని ఆనందంతో అందరినీ దగ్గరికి తీసుకున్నాడు.

జరిగిందంతా తెలుసుకోని భటులని పిలిచి "పోండి... పోయి యువరాణి అక్కలిద్దరినీ పట్టుకోని గుండు కొట్టించి, సున్నం బొట్లు పెట్టి, ఊరకుక్కల మీద వూరంతా వూరేగించి వురెయ్యండి" అని చెప్పినాడు. దానికి యువరాణి అడ్డంపడి "వద్దు రాజా... ఏది ఏమయినా వాళ్ళిద్దరూ నాతోపాటు రక్తం పంచుకొని పుట్టినోళ్ళు. వాళ్ళ బాధ నాకూ బాధే. ఈ ఒక్కసారికి వదిలేయండి" అనింది. చెల్లెలి మంచితనం తెలుసుకోని అక్కలిద్దరూ కళ్ళనీళ్ళు పెట్టుకొన్నారు. పరుగు పరుగున వచ్చి ఆమె కాళ్ళ మీద పడినారు. ఆమె వాళ్ళని పైకి లేపి "జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటినుండీ అందరం కలసిమెలసి వుందాం హాయిగా" అనింది.

రాజు తన పెండ్లాం పిల్లలు తిరిగి వచ్చినందుకు సంతోషంతో వూరువూరంతా విందు భోజనాలు పెట్టించినాడు. వచ్చిన జనాలంతా "మీరందరూ చల్లగా వుండి మమ్మల్ని చల్లగా పాలించండని" దీవించినారు.

# 31 చెప్పిందొకటి చేసిందొకటి

దేవుడు ఈ భూమి మీద అడవులను, సముద్రాలను, కొండలను, లోయలను, జంతువులను, పక్షులను, చేపలను... అట్లా ఒకొక్కదాన్నే పుట్టిస్తా... పుట్టిస్తా... ఆఖరికి మనుషులను తయారుచేసి... ఇంక తన పని అయిపోయింది గదా అనుకోని హాయిగా పండుకొన్నాడు.

పశువులు, పక్షులు రోజంతా ఎప్పుడుబడితే అప్పుడు, ఏది దొరికితే అది తినుకుంటా... స్నానంగూడా చేయకుండా... గలీజుగా తిరుగుతా వుండేవి. వాటి కంటే ఆలోచించే తెలివి లేదు గానీ మనుషులకు వుంది గదా... దాంతో వాళ్ళందరూ ఒకచోట చేరి "మనం ఎప్పుడు తినాల, ఎప్పుడు స్నానం చేయాల" అని తెగ ఆలోచించినారు. కొందరేమో పొద్దునా సాయంత్రం తిని మధ్యాన్నం స్నానం చేయాలని, మరికొందరేమో మూడు పూటలా తిని మూడు పూటలా స్నానం చేయాలనీ, కొందరేమో ఒక్కపూట మాత్రమే తింటూ ఒక్కపూటనే స్నానం చేయాలనీ, ఇంకొందరేమో జంతువుల్లా పక్షుల్లా ఎప్పుడు ఏది దొరికితే అది తినుకుంటా వారానికోసారి స్నానం చేస్తే చాలనీ... అట్లా తలొకమాట చెప్పసాగినారు. దాంతో ఎవరూ ఎటూ తేల్చుకోలేక మనల్ని పుట్టించిన ఆ దేవున్నే అడుగుదామని... అందరి కంటే సులభంగా ఛటుక్కున ప్రత్యక్షమయ్యే శివున్ని ప్రార్థించినారు. శివుడు ప్రత్యక్షమై వాళ్ళు చెప్పిందంతా విని "సరే! నేను ఈ రోజంతా బాగా ఆలోచించి రేపు నందితో చెప్పి పంపుతానులే" అన్నాడు.

శివుడు బాగా ఆలోచించి నందిని పిలిచినాడు. "మనుషులు మూడుపూటలా స్నానం చేస్తే ఎటువంటి రోగాలూ రాకుండా ఆరోగ్యంగా కళకళలాడుతా వుంటారు. అట్లాగే ఒక్కపూట మాత్రమే తింటే కావలసినంత తిండి అన్నికాలాల్లో దొరుకుతుంది అని, చూడు... నీవు పోయి మనుషులంతా ఇప్పటి నుండి మూడుపూటలా స్నానం చేసి, ఒక్కపూట మాత్రమే అన్నం తినాలని చెప్పు" అని పంపించినాడు.

నంది శివుని మాటలు యాడ మర్చిపోతానో ఏమో అని భయపడి "మూడు పూటల స్నానం, ఒక్కపూట అన్నం", "మూడు పూటల స్నానం, ఒక్కపూట అన్నం" అనుకుంటా బైలుదేరినాడు. అట్లా కైలాసం నుంచి భూమ్మీదకు దిగి మనుషులుండే చోటుకి పోతా వుంటే దారి నడుమ ఒక పెద్దనది అడ్డం వచ్చింది. దాంతో దాన్ని దాటడానికని వెనక్కి పోయి వురుక్కుంటా వచ్చి ఒక్క ఎగురు ఎగిరి అవతలికి దుంకినాడు. అట్లా దుంకడంలో అంతవరకూ తాను అనుకుంటున్న మాటలు మర్చిపోయి "మూడు పూటల అన్నం, ఒక్కపూట స్నానం" "మూడు పూటల అన్నం, ఒక్కపూట స్నానం" అని తిరగమళ్ళ అనుకుంటా మనుషుల దగ్గరికి వచ్చినాడు. వాళ్ళందరినీ పిలిచి "శివుడు మీకు ఇప్పటి నుంచీ రోజూ మూడుపూటలా అన్నం తిని, ఒక్కపూట స్నానం చేయమని చెప్పినాడు" అన్నాడు. దాంతో



ఆరోజు నుంచీ వాళ్ళు మూడు పూటల అన్నం తింటా, ఒక్కపూట మాత్రమే స్నానం చేయసాగినారు.

అట్లా కొద్దిరోజులు అయిపోయేసరికి వాళ్ళకు తినడానికి తిండి దొరకడం కష్టమయిపోయింది. వాళ్ళకి సేద్యం తెలీకపోవడంతో కొత్తగా పంటలు పండించలేకపోయినారు. దాంతో ఎక్కడెక్కడి చెట్లకు కాసిన కాయలన్నీ వెదికి వెదికి తినసాగినారు. చివరికి అవి గూడా దొరక్కపోవడంతో ఆకలికి అల్లాడిపోతా మరలా శివున్నే ప్రార్థించినారు. శివుడు ప్రత్యక్షమై "ఏమి మళ్ళా పిలుస్తా వున్నారు. ఏమైంది" అనడిగినాడు. దానికి వాళ్ళు "ఏముంది సామీ! నీవు చెప్పినట్లే రోజుకి మూడుసార్లు తింటా, ఒక్కపూట స్నానం చేస్తా వున్నాము. కానీ ఇంత మందిమి మూడుపూటలా తినేసరికి ఎక్కడెక్కడి కాయలూ, కూరలూ అన్నీ కొద్దిరోజులకే ఒక్కటి గూడా మిగలకుండా అయిపోయినాయి. ఆకలితో కడుపు నకనకలాడుతా వుంది గానీ తినడానికి చిన్న గింజ గూడా దొరకడంలేదు. నీవు చెప్పినట్లు చేయడం వల్లనేగదా ఈ బాధంతా. అందుకే నిన్నే ఈ గండం గట్టెక్కించమని అడగడానికి పిలిచినాం" అన్నారు.

ఆ మాటలకు శివుడు ఆశ్చర్యపోయి "ఇదేంది... నేను చెప్పిందేంది, వీళ్ళు చేస్తున్నదేంది" అని నందిని పిలిచి "ఏమి చెప్పినావు వీళ్ళకు" అని అడిగినాడు. దానికి నంది "ఏముంది సామీ... నీవు చెప్పినట్టే మూడుపూటలా తిని, ఒక్కపూట స్నానం చేయమని చెప్పినాను" అన్నాడు. దాంతో శివునికి చానా కోపం వచ్చింది.

"ఛ... ఛ... ఎంతపని చేసినావు. నేను చెప్పిందొకటి... నీవు చేసిందొకటి. చూడు వాళ్ళు మూడు పూటలా తినేసరికి యాడా తినడానికి తిండి గూడా దొరకకుండా ఐపోయింది" అని బాగా తిట్టి "ఇంక ఇట్లా అయితే లాభం లేదు. వీళ్ళకు పంటలు పండించడం నేర్పించాల్సిందే" అనుకున్నాడు. దాంతో అందరినీ పిలిచి "చూడండి... ప్రకృతిలో సొంతంగా వాటంతటవే పండే పండ్లు, కాయగూరలు, ధాన్యాలతో మీ ఆకలి ఇంక తీరదు. మీరే సొంతంగా మీకు కావలసినవి పండించుకోవాల" అంటూ వారికి సేద్యం ఎలా చేయాల్నో, కావలసిన పంటలు ఎట్లా పండించాల్నో వివరంగా చెప్పినాడు. ఈ గొడవకంతా కారణమైన నందిని పిలిచి "మానవులకు ఇంత పెద్ద సమస్య రావడానికి కారణం నీవే గనుక... పో... పోయి... వాళ్ళకు పంటలు పండించడానికి సాయపడుపో... ఇదే నీకు తగిన శిక్ష" అన్నాడు.

దాంతో అప్పటినుంచి నంది భూమి మీదకు ఎద్దు రూపంలో వచ్చి సేద్యం చేయడానికి సాయపడుతా మనుషుల ఆకలి తీర్చడానికి కష్టపడసాగింది.

# 32 పేను.... నల్లి.... చీమల కథ


ఒకూర్లో ఒక రైతున్నాడు. ఆయన చానా పేదోడు. ఆయనకు ముగ్గురు నెమలీకల్లాంటి అందమైన ఆడపిల్లలున్నారు. వాళ్ళు ఎంతటి అందగత్తెలంటే ఆ చుట్టుపక్కల రాజ్యాలలో యాడ కూడా అంతటి అందమైన ఆడపిల్లల్లేరు. వాళ్ళ నాయన చానా పేదోడు గదా... అందుకే వాళ్ళు చిన్నప్పట్నించీ ఎండనకా, వాననకా ఒళ్ళొంచి పొలం పనులైనా, ఇంటిపనులైనా బాగా కష్టపడి చేసేటోళ్ళు. ఒకరోజు ముగ్గురు రాజులు ఆ రాజ్యానికొచ్చి వాళ్ళ అందాన్ని చూసి "చేస్కుంటే ఇట్లాంటోళ్ళనే చేసుకోవాల" అనుకోని వాళ్ళు పేదోళ్ళైనా సరే పెండ్లి చేసుకోని వాళ్ళ రాజ్యాలకు తీసుకోనిపోయినారు.

ఆ రాజులు ముగ్గురు చానా మంచోళ్ళు. పెండ్లాలను బాగా ప్రేమగా కాలు కింద పెట్టనీయకుండా చూసుకొనేటోళ్ళు. ఏదడిగినా కాదనకుండా తెచ్చిచ్చేటోళ్ళు. వాళ్ళకు సేవలు చేయటానికని పదిమంది దాసీలను పెట్టినారు. అట్లా కొన్నేళ్ళు తిరిగేసరికి వాళ్ళు బాగా తినీ తినీ సుఖం మరిగినారు. పెళ్ళైన నాటి నుండీ చిన్నపని కూడా చేసి ఎరుగరు కదా దాంతో నెమ్మదిగా వాళ్ళకు బాగా పొగరు బట్టింది.

ఒకరోజు పెద్దామెకు పొద్దుపోకుండా వుంటే సరదాగా పాలు పిండుదామని కుండ తీసుకోని బరగొడ్డు దగ్గర కూచోని పాలు పిండడం మొదలుపెట్టింది. పనిచేసే అలవాటు తప్పిపోయింది గదా.. దాంతో పాలధార వచ్చి ఆమె కాలు మీద పడింది. అంతే... ఆ కాసింత దానికే ఆమె కాలు సుర్రుమనింది. అదే సమయంలో అటువేపుగా వచ్చిన ఆమె మొగుడు అది చూసి కూడా చూడనట్లుగా వెళ్ళిపోయినాడు.

దాంతో ఆమెకు తెగ కోపమొచ్చేసింది. "అరెరే... వీడేం మొగుడు. పాలధార వచ్చి నా కాలు మీద పడి నొప్పితో విలవిలలాడుతా వుంటే... చూసి కూడా... అయ్యో! పాలధార పడి నీకాలెంత నొచ్చిందో... ఏమో... అని ఒక్కమాట కూడా అనకపాయనే. ఇట్లాంటి మొగున్తో కాపురం చేస్తేనేమి.... చెయ్యకుంటేనేమి" అని అలిగి మొగున్నొదిలేసి పుట్టింటికి బైలుదేరింది.

అదేరోజు నడిపామె దాసీలను పిలిచి "చానా రోజుల నుండి నాకు బొళ్ళపాయసం తినాలనుంది. నెయ్యి, జీడిపప్పు వేసి ఘుమఘుమలాడేలా బాగా చెయ్యండి" అనింది. సరేనని వాళ్ళు బొళ్ళపాయసం చేసి ఒక పెద్దచెంబు నిండా పోసుకోనొచ్చినారు. ఆమె ఒక్కసారిగా చెంబెత్తి పాయసం మొత్తం గటగటా తాగేసరికి గొంతు నొచ్చింది. అదే సమయంలో అటువేపుగా వచ్చిన ఆమె మొగుడు అది చూసి కూడా చూడనట్లుగా వెళ్ళిపోయినాడు.దాంతో ఆమెకు తెగ కోపమొచ్చేసింది. "అరెరే... వీడేం మొగుడు. చెంబుడు పాయసం కష్టపడి తాగేసరికి నా గొంతు నొప్పి పెడితే... చూసి కూడా... అయ్యో ఇంత పాయసం తాగేసరికి నీ గొంతు ఎంత



నొచ్చిందో... ఏమో... అని ఒక్కమాట గూడా అనకపాయనే. ఇట్లాంటి మొగున్తో కాపురం చేస్తేనేమి... చెయ్యకుంటే నేమి" అని అలిగి మొగున్నొదిలేసి ఆమె కూడా పుట్టింటికి బైలుదేరింది.

అదేరోజు చిన్నామె "ఎప్పుడూ దూది పరుపు మీదనే పన్నుకుంటే ఏం సుఖముంటాది... ఒక్క రోజన్నా మల్లెపూల మంచం మీద పన్నుకోని సూడాల" అనుకోని దాసీలతో గంపలు గంపలు మల్లెపూలు మంచంపైన పరిపిచ్చుకోని పన్నుకోనింది. ఆ మల్లెపూలు ఆమెకు గుచ్చుకోని ఆ కాసింత దానికే ఆమె నడుం ఎర్రగా కందిపోయింది. అదే సమయంలో అటువేపుగా వచ్చిన ఆమె మొగుడు అది చూసి కూడా చూడనట్టుగా వెళ్ళిపోయినాడు.

దాంతో... ఆమెకు తెగకోపమొచ్చేసింది. "అరెరే... వీడేంమొగుడు. మల్లెపూలు గుచ్చుకోని నా నడుం కందిపోతే... చూసి కూడా... అయ్యో... మల్లెపూలు గుచ్చుకోని నీ నడుం ఎంత కందిపోయిందో... ఏమో.... అని ఒక్కమాట కూడా అనకపాయనే... ఇట్లాంటి మొగున్తో కాపురం చేస్తేనేమి... చేయకుంటే నేమి" అని అలిగి ఆమె కూడా మొగున్నొదిలేసి పుట్టింటికి బైలుదేరింది.

అట్లా వాళ్ళు ముగ్గురూ మొగుళ్ళనొదిలేసి పుట్టింటికి వస్తా వస్తా దారి మధ్యలో కలుసుకున్నారు. "ఏంది నీ కత అంటే ఏంది నీ కత' అంటూ జరిగిందంతా ఒకరికొకరు చెప్పుకున్నారు.

అట్లా ముగ్గురూ ఏడ్చుకుంటా... అడవిలో పోతా వుంటే దారిలో ఒక ముని కనబడి "ఏందమ్మా మీ బాధ.... ఏమట్లా ఏడుస్తా వున్నారు" అనడిగినాడు.

దానికి వాళ్ళు కళ్ళెమ్మట నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా "ఏం చేద్దాం సామీ! అంతా మా కర్మ. మా నాయన మాంచి సంబంధాలని చెప్పి ఆ మాయదారి సచ్చినోళ్ళకిచ్చి పెండ్లి చేసినాడు. వాళ్ళ కసలు పెండ్లాలను ఎట్లా ప్రేమగా చూసుకోవాల్నో గూడా తెలీదు. అందుకే అట్లాంటోళ్ళతో కాపురం చేయలేక వదిలేసొస్తిమి" అంటూ జరిగిందంతా చెప్పినారు.

వాళ్ళు చెప్పిందంతా వినేసరికి ఆ మునికి చానా కోపమొచ్చేసింది. "ఓరినీ... ఏమో... అనుకుంటిని గానీ... మీ ముగ్గురికీ పనీపాటా లేక... బాగా ఒళ్ళు కొవ్వుపట్టినట్టుంది. అందుకే ఇంత సిన్న సిన్న దాన్లక్కూడా ఓ అని మొగుళ్ళనొదిలేసి వస్తా వున్నారు. వుండు మీ పని చెబుతా" అని పెద్దామెను పేను కమ్మని, నడిపామెని నల్లి కమ్మని, చిన్నామెను చీమ కమ్మని శపించినాడు. అంతే... ముని శాపం తగిలి పెద్దామె పేనైపోయింది. నడిపామె నల్లయిపోయింది. చిన్నామె చీమైపోయింది.

# 33 నక్కబావ - పిల్లిబావ

ఒకూర్లో ఒక పిల్లి ఉండేది. అది ఒకరోజు పక్కనే వున్న అడవిలో పోతా వుంటే దానికి ఒక నక్క కనబడింది. నక్కను చూస్తానే పిల్లికి దాన్తో స్నేహం చేయాలనిపించింది. దాంతో అది దాని దగ్గరకు పోయి "నక్కబావా! నక్కబావా! నాతో స్నేహం చేస్తావా" అని అడిగింది. దానికా నక్క "చూడు పిల్లిబావా నువ్వుండేదా అడవి బైట, నేనుండేదా అడవి లోపల. మనకు స్నేహమెట్లా కుదుర్తాది" అనింది. అపుడా పిల్లి "దానిదేముందిలే నక్కబావా... నేనే రోజూ అడవిలోనికి వస్తా సరేనా" అనింది. నక్క 'సరే' అనింది. అప్పటినుంచీ పిల్లి రోజూ అడవిలోకొచ్చేది. అట్లా కొన్ని రోజులకు అవి రెండూ మంచి స్నేహితులైపోయినాయి.

అడవిలోని మిగతా జంతువులు అది చూసి "చూడు...... నక్కబావా! చేయకూడని స్నేహం చేయడం మంచిది కాదు. అడవిలో ఇన్ని జంతువులను వదిలేసి అట్లా బైటున్న దానితో స్నేహం చేయడం ఏం బాగాలేదు. మా మాటిని దాన్తో స్నేహం చేయడం మానేయ్. లేకుంటే అనవసరంగా ఆపదల్లో పడతావ్" అని చెప్పినాయి. కానీ నక్క ఎవరి మాటలూ పట్టించుకోలేదు.

ఒకరోజు అడవిలో పెద్ద పండగ జరిగింది. దాంతో నక్క పిల్లిని "ఈ రోజు మా యింటికి రా" అని పిల్చుకోని పోయి మంచి మంచి పిండివంటలు కడుపు నిండా పెట్టింది. ఒకరోజు పిల్లి నక్కతో "ఎప్పుడూ నేనే అడవిలోనికి వస్తావున్నా గానీ నువ్వు ఒక్కసారి గూడా నా కోసం వూర్లోకి రాలేదు. రేపు మా వూర్లో పెద్ద పండగ జరుగుతా వుంది. నువ్వురా. కజ్జికాయలు, బచ్చాలు బాగా తినొచ్చు" అనింది.

నక్క బావకు ఆ మాటింటూనే నోట్లో నీళ్లూరినాయి. కానీ వూర్లోకి రావాలంటే భయమేసి "నన్ను చూస్తే మనుషులు వూకుంటారా? వెంటబడి తరిమితరిమి కొడతారు గదా, మరెట్లా రావడం" అనడిగింది. అప్పుడా పిల్లి "అర్ధరాత్రి అందరూ పండుకుంటారు గదా.. అప్పుడురా. మట్టసంగా మనకు కావాల్సినవన్నీ బాగా తినొచ్చు" అనింది. నక్క "సరే" అనింది. తరువాత రోజు రాత్రి నక్క పిల్లితో బాటు వూర్లోకి వచ్చింది. ఒకొక్క ఇండ్లే దాటుకుంటా పోతా వుంటే ఒకచోట ఘుమఘుమఘుమ వాసనొచ్చింది. వెంటనే పిల్లి "నక్క బావా! నక్కబావా! ఈ ఇంట్లో పండుగ బాగా చేసుకున్నట్టున్నారు. మట్టసంగా లోపలికి పోయి కడుపు నిండా తినొద్దాంరా" అంటూ ఎగిరి కిటికీలో దూరింది. అది చూసి నక్క "పిల్లిబావా! నేను నీ మాదిరి ఎగిరి దుంకలేను గదా. మరెట్లా రావడం" అనింది. అప్పుడా పిల్లి నక్కను తీస్కోని పోయి జాలాడి చూపించి "నేను పైనుంచొస్తా... నువ్వు దీంట్లోంచి దూరి లోపలికిరా" అనింది. సరేనని నక్క ఆ కన్నంలోంచి కష్టపడి దూరి లోపలికొచ్చేసింది. రెండూ సంబరంగా దొరికినవన్నీ లొట్టలేసుకుంటా హాయిగా కడుపు నిండా తిన్నాయి.



అంతలో పిల్లికి అటక మీద ఒక ఎలుక పోతా కనబడింది. దాన్ని పట్టుకుందామని పిల్లి ఎగిరి అటక మీదకు ఒక్క దుంకు దుంకింది. ఎలక దొరకలేదు గానీ పిల్లి తగిలేసరికి అక్కడున్న గిన్నెలన్నీ ధనధనధన చప్పుడు చేస్తా కిందబన్నాయి. ఆ చప్పుడికి ఇంట్లో పండుకున్నోళ్ళంతా అదిరిపడి లేచినారు.వెంటనే పిల్లి "నక్క బావా ! నక్కబావా! తొందరగా పారిపో... ఇంట్లో వాళ్ళొచ్చేస్తా వున్నారు" అని చెప్పి కిటికీలోంచి బైటికి దూకి పారిపోయింది. నక్కగూడా వురుక్కుంటా పోయి జాలాడి బొర్రలో దూరింది... కానీ అప్పటికే అది కడుపు నిండా మెక్కింది గదా. దాంతో అది పట్టలేదు.ఇరక్కపోయి ముందుకీ పోలేకా, వెనక్కీ రాలేక గింజుకోసాగింది.

అంతలో లోపలికొచ్చినోళ్ళకి జాలాడి బొర్రలో తనకలాడతా వున్న నక్క కనబడింది. "ఇంట్లోకి ఈ నక్కెట్లా వచ్చిందబ్బా" అని ఆశ్చర్యపోతా దాని తోక పట్టుకోని బైటకు లాగి కట్టెలు తీసుకోని కొట్టిన చోట కొట్టకుండా దభీదభీమని కొట్టడం మొదలుపెట్టినారు. ఇట్లాగే కాసేపుంటే చావడం ఖాయమనుకున్న నక్కకు హఠాత్తుగా ఒక ఉపాయం తోచింది.

వెంటనే అది నాలిక బైటికి పెట్టి కదలకుండా చచ్చినదాని మాదిరి పడిపోయింది. దాంతో వాళ్ళు అది చచ్చిందనుకోని తోక పట్టుకోని లాక్కొనొచ్చి ఇసిరి ఇంటిబైట పాడేసి పోయినారు. వాళ్ళట్లా లోపలికి పోగానే నక్క లేచి కుంటుకుంటా తిరిగి అడవికి పోతా పోతా.

"చేయరాని స్నేహం చేయరాదు.
ఒకవేళ చేస్తిననుకో
పోగూడని చోటికి పోరాదు.
ఒకవేళ పోతిననుకో
తినగూడని చోట తినరాదు.
ఒకవేళ తింటిననుకో
దొరకగూడని వారికి దొరకరాదు.
ఒకవేళ దొరికితిననుకో
తన్నులు తిని సావకుండా
చచ్చినట్లు పడి వుండటం వుత్తమమైన పని" అనుకోనింది.

# 34 ఎవడూ తక్కువోడు కాదు

ఒకూర్లో ఒక దుబ్బోడు, ఒక బక్కోడు వుండేటోళ్ళు. వాళ్ళు మంచి స్నేహితులు. ఎప్పుడూ ఒకరి భుజమ్మీద ఇంకొకరు చెయ్యేసుకోని కిలకిలకిల నవ్వుకుంటా పొద్దున లేసినప్పటి నుంచి రాత్రి పండుకునే దాకా ఒకరినొదిలి ఒకరు వుండేటోళ్లు కాదు. "రేయ్... నేను ముందు సస్తే నువ్వు ఎత్తుకోని పోయి కాల్చాల.. నువ్వు ముందు సస్తే నేను ఎత్తుకోని పోయి కాల్చాల.. అంతే తప్ప అమ్మా నాయన, పెండ్లాం బిడ్డలు ఎవరూ మనల్ని ముట్టుకోగూడదు" అనుకునేటోళ్ళు. కానీ వాళ్ళు ఏ పనీ చేసేటోళ్ళు గాదు. ఎప్పుడూ సొల్లు కబుర్లు చెప్పుకుంటా బేవార్సుగా తిరిగేటోళ్ళు. దాంతో వాళ్ళమ్మ నాయనలు "వీళ్ళని ఇట్లాగే వదిలేస్తే లాభం లేదని" ఇద్దరికీ పెండ్లి చేసినారు. కానీ వాళ్ళు పెండ్లయి పిల్లలు పుట్టినా... కొంచం గూడా మారలేదు. దాంతో ఇంట్లో వాళ్ళు "రేయ్... మిమ్మల్ని చూసుకోవడమే కష్టమనుకుంటా వుంటే మళ్ళా మీ పెండ్లాం బిడ్డల్ని గూడా చూసుకోవడం మావల్ల కాదు. ఏదో ఒక పని చేయనన్నా చేయండి. లేదా పెండ్లాం బిడ్డల్తో యాడికన్నా పోయి మీ బదుకు మీరన్నా బతకండి." అంటా తెగేసి చెప్పినారు.

దాంతో దుబ్బోడు బక్కోనితో "రేయ్.. ఇట్లా అందరితో మాటలు పడతా ఇంకా ఎంతకాలం బతకాల. నెత్తి మీదికి నలభైయేళ్ళు వస్తా వున్నాయి. ఇద్దరమూ చెరీ ఒక యాపారం చేద్దాం. మా ఇంటి పక్కనే కంసలోళ్ళు వున్నారు గదా... సిన్నప్పటి నుంచీ ఆడ తిరిగీ తిరిగీ ఆ పనెట్లా సేస్తారో సూసీ సూసీ నాక్కూడా శానావరకు వచ్చేసింది. మిగతాది గూడా నేర్చేసుకోని బంగారు నగలు చేసేపని మొదలు పెడతా.. ఏమంటావు" అన్నాడు.

దానికి బక్కోడు "రేయ్... నువ్వెట్లా అంటే నేనట్లానే. నేను గూడా నెయ్యి యాపారం మొదలు పెడతా. బొంబాయి నుంచి డబ్బాలు తెప్పించి చుట్టుపక్కల వూర్లకు పోయి అమ్మొస్తా... నూటికి నూరు లాభమొస్తాది" అన్నాడు.

ఆ తరువాత రోజు నుంచీ ఇద్దరూ పనిలో బన్నారు. చేతిలో డబ్బులు పడడం మొదలయ్యేసరికి వాళ్ళకి నెమ్మదిగా మరింత సంపాదించాలనే యావ బాగా పెరిగిపోయింది. పొద్దస్తమానం దుబ్బోడు నగలు చేస్తా వుంటే, బక్కోడు వూర్లు పట్టుకోని తిరగసాగినాడు. అట్లా ఇద్దరూ సంపాదనలో మునిగిపోయినారు. బక్కోడు ఎప్పుడు వూరికి వచ్చినా దుబ్బోనింటికి పోయి కాసేపన్నా కూచోని వచ్చేటోడు. వాడు ఒకసారి ఒక తులం బంగారం కొనుక్కోనొచ్చి "రేయ్... దీంతో ధగధగలాడి పోయేలా మంచి వుంగరం చేసియ్యి. దాన్ని చూసినప్పుడల్లా నువ్వే గుర్తుకు రావాల. అట్లాగన్నా నీకు దూరంగా వున్నానన్న బాధ కొంచమన్నా పోతాది" అన్నాడు.

దుబ్బోడు సరే అని దాన్ని కరిగిచ్చినాడు. అంతలో వానికి ఒక చెడ్డ ఆలోచన వచ్చింది. బక్కోడే గదా...

ఏం అనుమానమొస్తాదిలే అనుకోని, బంగారాన్ని మట్టసంగా దాచిపెట్టేసి, ఒక రాగి వుంగరం మీద బంగారు పూతేసి ఇచ్చినాడు. అది తెలీని బక్కోడు దాన్ని వేలికి పెట్టుకోని వూరూరా తిరగసాగినాడు. వాడెప్పుడూ ఎండకు ఎండుతా, వానకు తడుస్తా తిరుగుతా వుంటాడు గదా... దాంతో తొందర్లోనే బంగారు పూతంతా పోయి రాగి రంగుకి మారిపోయింది. కానీ వానికి దుబ్బోని మీద కొంచం గూడా అనుమానం రాలేదు. 'వుంగరం బాగా సాగడానికి కొంచం రాగి ఎక్కువగా కలిపింటాడులే... అందుకే ఎర్రగైంటాది' అనుకున్నాడు.

వాడట్లా నెయ్యి అమ్ముకుంటా,ఒకొక్క వూరే తిరుగుతా తిరుగుతా ఒకరోజు ఒక కంసలాయన ఇంటికి చేరుకున్నాడు. ఆయన వుంగరం చూసి "అదేంది సామీ.. ఇంత సంపాదిస్తా వుండి గూడా అట్లా రాగి వుంగరం పెట్టుకోని తిరుగుతా వున్నావు. బంగారంది పెట్టుకోవచ్చుగదా" అన్నాడు. ఆ మాటలకు బక్కోడు "అదేంది కంసలాయనా అట్లంటావు. ఇది బంగారానిదే" అన్నాడు. దానికి వాడు నవ్వి " నలభైయేళ్ళ నుంచీ చేస్తున్నా సామీ నగలు... ఏది బంగారమో ఏది రాగో ఆ మాత్రం కనిపెట్టలేనా... ఎవడో గానీ నీకు సక్కగా పంగనామాలు పెట్టేసినాడు" అంటా గీటురాయి తీసుకోనొచ్చి గీసి చూపించినాడు. దాంతో బక్కోనికి నోటమాట రాలేదు.

తరువాతరోజు సక్కగా దుబ్బోనింటికి పోయి "ఏందనా...బంగారు వుంగరం చేసియ్యమంటే ఇట్లా సత్తుంగరం చేసిచ్చినావు. అందరూ నవ్వుతా వున్నారు దీన్ని చూసి" అన్నాడు కోపంగా. దానికి దుబ్బోడు "ఏంరా... బక్కోడా... నువ్వు నన్నే అనుమానిస్తా వున్నావా.. ఇన్నినాళ్ళలో ఎవరూ ఎప్పుడూ ఒక్కమాట అనలా... నువ్వు ఒక వూరు గాదు, ఒక దేశం గాదు. యాడాడో తిరుగుతా వుంటావు గదా... ఎవని కన్నో ఆ వుంగరం మీద పడుంటాది. నువ్వు నీళ్ళోసుకునేటప్పుడు వుంగరం తీసి పెడతా వుంటావు గదా.. అట్లాంటప్పుడు అచ్చం అట్లాంటిదే ఇంగోటి పెట్టి మార్చేసింటాడు" అన్నాడు. బక్కోడు కోపాన్ని లోపల్లోపలే అణిచేసుకోని మట్టసంగా వచ్చేసినాడు.

దుబ్బోనికి ఇద్దరు బావమరుదులు వున్నారు. వాళ్ళలో పెద్దోనికి పెండ్లి నిశ్చయమైంది. దాంతో వాళ్ళు బావ దగ్గరికి వచ్చి " బావా.. పెండ్లికి వచ్చినోళ్ళందరికీ ఘుమఘుమలాడేలా కమ్మని నెయ్యి కావలసినంత పోపిద్దామనుకుంటా వున్నాం. మీ బక్కోని దగ్గర దొరుకుతాదా మాంచిది" అని అడిగినారు. దానికి వాడు నవ్వి " అదెంతసేపు... నేను కనుక్కుంటానులే" అని బక్కోన్ని పిలిపిచ్చినాడు. వాడు సంగతంతా తెలుసుకోని "సరే... తప్పకుండా తెప్పిస్తా.. కాకపోతే దుడ్లు ముందే పంపాల. అప్పుడే బొంబాయి నుంచి మంచి నెయ్యి వచ్చేది" అన్నాడు. దాంతో వాళ్ళు సరేనని నాలుగు డబ్బాలకు డబ్బులిచ్చి పోయినారు. వాడు పెండ్లికి వారం రోజుల ముందు ఏం చేసినాడంటే నాలుగు ఖాళీ డబ్బాలు తీసుకోని, దాండ్లను బాగా చిక్కని పెండనీళ్ళతో నింపి, మూత గట్టిగా బిగించి, పైన కొంచం నెయ్యి పూసి బొంబాయి నుంచి వచ్చినాయంటా పంపిచ్చినాడు. వాళ్ళు వాటిని తీసుకోని పోయి భద్రంగా అటక మీద దాచిపెట్టినారు.

పెండ్లిరోజు బంధువులంతా వచ్చినాక అన్నంలో నెయ్యేద్దామని దించి చూస్తే ఇంకేముంది... దేంట్లో చూసినా ఒకటే కంపు. వాసనకే వాంతులు వచ్చేటట్లుంది. దాంతో ఏమీ చెయ్యలేక నెయ్యి లేకుండానే అన్నాలు పెట్టినారు. పెండ్లికొచ్చినోళ్ళంతా "పెండ్లి ఇంత బాగా చేసినారు గానీ ఏం లాభం... వచ్చినోళ్ళకు ఒక్క నెయ్యి చుక్క గూడా విదల్చలేదు" అంటా నానాక మాటలన్నారు. దాంతో అందరి ముందూ దుబ్బోని తల కొట్టేసినట్లయింది. 'ఎంత మోసం చేసినాడురా బక్కోడు అని కోపంగా తరువాత రోజు సక్కగా వానింటికి పోయి "ఏంరా బక్కోడా... నిన్ను నమ్మి ముందే అడిగినన్ని డబ్బులు చేతిలో పెడ్తే.. మంచి నెయ్యని చెప్పి అంత కంపు కొట్టేది ఇస్తావా... ఇదేమన్నా మర్యాదేనా" అన్నాడు.

దానికి వాడు "అదేందనా అంతమాటంటావు. ఇన్ని నాళ్ళలో ఎవరూ ఎప్పుడూ ఎక్కడా ఒక్క మాటనలా. నా బంగారు వుంగరం మీద కన్నేసినట్లే... ఎవరో నీ బొంబాయి నెయ్యి మీద కన్నేసి మార్చేసి వుంటారు" అన్నాడు. దాంతో దుబ్బోనికి నోట్లో వెలక్కాయ పన్నట్లయింది. కక్కలేక మింగలేక తేలు కుట్టిన దొంగలా గమ్మున ఇంటికొచ్చేసినాడు.

అట్లా కొన్నాళ్ళు గడిచిపోయినాయి. అనుకోకుండా ఆ వూళ్ళో పెద్ద కరువు వచ్చింది. వానల్లేవు. పంటల్లేవు. దాంతో వున్న బంగారం కుదువ పెట్టేటోళ్ళు, అమ్మేటోళ్ళే గానీ చేపిచ్చుకునేటోళ్ళు లేకపోయిరి. అట్లాగే నోట్లోకి అన్నం ముద్దకే తనకలాడుతా వున్న జనాలు నెయ్యిని కొనడం మానేసినారు. దాంతో వాళ్ళిద్దరి యాపారాలు దెబ్బతిన్నాయి. ఒకసారి ఇద్దరూ కూచోని "రేయ్.. మనమిట్లా ఈన్నే వుంటే లాభం లేదు. పెద్ద నగరానికి పోదాం. ఆడ ఏఏ సరుకులు తక్కువకి దొరుకుతాయో కొనుక్కోని, అవి దొరకని చోట్లకు పోయి అమ్ముదాం. ఇట్లాగే ఏ పనీ చేయకుండా వూరికే కూచుంటే తిండికి లేక అందరం మలమల మాడిపోతాం" అనుకున్నారు. దాంతో ఇద్దరూ ఇండ్లు కుదువపెట్టి తలా పదివేల వరహాలు అప్పు తీసుకోని నగరానికి బైలుదేరినారు.

అట్లా వాళ్ళు మూడు పగళ్ళూ, మూడు రాత్రులూ నడుచుకుంటా నడుచుకుంటా చివరికి ఒక పెద్ద అడవిలోనికి వచ్చినారు. ఆ అడవిలో దొంగలు చానా ఎక్కువ. వాళ్ళకీ విషయం తెలీక అట్లాగే పోతా వుంటే ఒక దొంగల గుంపు అడ్డం వచ్చింది. వాళ్ళు ఇద్దరి గొంతుల మీద కత్తి పెట్టి మర్యాదగా ఎక్కడివక్కడ దాచిపెట్టుకున్నవన్నీ తీసిస్తారా, చంపి అవతల పాడేయాల్నా" అంటా బెదపడిచ్చినారు. దాంతో వాళ్ళు వణికిపోతా తమ దగ్గరున్న డబ్బులన్నీ తీసి ఇచ్చేసినారు.

దొంగలు పోయినాక ఒకరిని పట్టుకోని ఒకరు కండ్లనీళ్ళు పెట్టుకోని "ఒరేయ్... ఇట్లా ఇద్దరం వూపుకుంటా వుత్త చేతులతో వూరికి పోతే అందరూ వూస్తారు. ఏమి చేసయినా సరే సంపాదించుకొనే పోవాల" అనుకోని అట్లాగే కాళ్ళీడ్చుకుంటా తరువాత రోజు చీకటిపడే సమయానికంతా ఆ నగరం దగ్గరికి చేరుకున్నారు.

ఆ నగరానికి ముందు ఒక పెద్ద శ్మశానం వుంది. అందులో ఎవరినో బూడ్సి పెడతా వున్నారు. ఆయన ఎవరా అని ఆరా తీస్తే ఆ వూరిలో పెద్ద వ్యాపారనీ, పది తరాలు పడుకొని తిన్నా తరగనంత ఆస్తి సంపాదించినాడనీ, కానీ ఆయనకు పిల్లాజెల్లా ఎవరూ లేరని, వున్నది ఒక్క పెండ్లామే అనీ తెలిసింది. దాంతో దుబ్బోడు బక్కోన్ని పిల్చి "రేయ్... నాకో ఉపాయం తట్టింది.. వీళ్ళు పోగానే ఆ గుంత తవ్వి శవాన్ని ఇంకొక చోట బూడ్చేద్దాం. నువ్వు గుంతలో కూర్చో. పైన బండ పెట్టి గాలి ఆడడానికి ఏర్పాటు చేసి మన్నుతో కప్పేస్తా... ఆ తరువాత సక్కగా వాళ్ళింటికి పోయి నీ మొగుడు నాకు లక్ష బంగారు వరహాలు బాకీ వున్నాడని చెప్పి కిందామీదా పడి ఏడుస్తా... ఆ తరువాత..." అంటా వానికి ఏం చేయాల్నో చెప్పి బక్కోన్ని లోపల కూచోబెట్టి, ఎప్పటిలాగే సమాధి తయారు చేసినాడు.

ఆ తరువాత ఆ వ్యాపారి ఇల్లు యాడో కనుక్కోని సక్కగా వాళ్ళింటికి పోయినాడు. పోవడం పోవడం అందరి ముందూ నెత్తీ నోరూ కొట్టుకుంటా "అయ్యో ... సామీ ఎంత ఘోరం చేసినావురా దేవుడా... తినీ తినక దాచిపెట్టుకున్న నా లక్ష వరహాలు నాకు ఇయ్యకుండానే సచ్చిపోయినావా... ఇప్పుడు నేను నా పెండ్లాం బిడ్డలు వీధిలో పడితే నాకు దిక్కెవర్రా నాయనా" అంటా కిందామీదా పడి పొర్లిపొర్లి ఏడ్చసాగినాడు.

అది చూసి ఆ వ్యాపారి పెండ్లాం "నా మొగుడు బంగారం లాంటోడు. బతికినంత కాలం పదిమంది చేత వందరకాలుగా పొగిడిచ్చుకున్నాడే గానీ, ఒక్కనితో ఒక్కమాటా అనిపిచ్చుకున్నోడు గాదు. ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాల్నో పైసా పైసా లెక్కేసి ఇస్తావున్నా... పో... పోయి రాసిచ్చిన కాగితం తీసుకోని రాపో. ఇచ్చేస్తా" అనింది.

దానికి వాడు లబలబమని నెత్తీనోరూ కొట్టుకుంటా "ఆ కాగితమే వుంటే ఇంత ఏడుపెందుకు తల్లీ నాకు. కాలు మీద కాలేసుకోని కూర్చోని ఇస్తారా సస్తారా అని గొంతు మీద కూసోని దర్జాగా వసూలు చేసుకుంటా వుంటి. ఎప్పుడూ ఓడ మీద సరుకులు తీసుకోని రావడానికి పోయేముందు కావలసినన్ని వరహాలు తీసుకోనిపోయి, తిరిగి రాగానే సరుకులన్నీ అమ్మి సక్కగా ఇంటికొచ్చి పైసా పైసా వడ్డీకట్టి పోయేటోడు. సిన్నప్పటి నుంచీ సూస్తావున్నా గదా.. బంగారంలాంటి మనిషి. దాంతో మాట మీదే నమ్మకం. మొన్ననే సరుకుల కోసం పోతా వున్నానంటూ లక్ష వరహాలు తీసుకున్నాడు. కానీ ఇంత హఠాత్తుగా గుండెనొప్పొచ్చి మనిషి మనలో లేకుండా పోతాడని కలలో గూడా అనుకోలేదు" అన్నాడు.

దానికి ఆ ఇంట్లో వున్న బంధువులు "ఇట్లా ఎవరంటే వాళ్ళు వచ్చి మాకియ్యాల మాకియ్యాల అంటే మేమెట్లా ఇస్తాం. అదీగాక ఏమోలే అనుకోడానికి పదీ ఇరవై గాదు. ఏకంగా లక్ష వరహాలు. ఏదో ఒక సాక్ష్యం వుండాల్సిందే" అన్నారు.

దాంతో వాడు "నాయనా... ఆ సచ్చిపోయినాయన అందరిలాగా అల్లాటప్పా మనిషిగాదు. నిలువెత్తు బంగారం. ఆడినమాట తప్పనోడు. సచ్చి ఇంకా ఇరవై నాలుగు గంటలు కూడా కాలేదు. ఆత్మ ఇంకా ఎక్కడో ఇక్కడే తచ్చట్లాడుతా వుంటాది. సక్కగా సమాధి దగ్గరికే పోదాం. దాన్నే అడుగుతా, అదే చెబుతాది నాకు ఇవ్వాల్నో వద్దో" అన్నాడు.

ఆ మాటలకు వాళ్ళు "సరే... పోదాం పద. నిజంగా నీకియ్యాలని ఆ సమాధే చెబితే లక్షేం ఖర్మ ఏకంగా రెండు లక్షలే ఇస్తాం" అంటా అందరూ వాన్తో బాటు సమాధి దగ్గరికి వచ్చినారు.

దుబ్బోడు సమాధి చుట్టూ మూడుసార్లు తిరిగి, వూదికడ్డీలు అంటించి "సామీ... నాకు తెలుసు. నీ ఆత్మ ఇంగా ఇక్కన్నే ఎక్కన్నో తిరుగుతా వుంటాదని. బతికినంతకాలం నిప్పులాగా ఒక్కమాటా పడకుండా బతికినావు. ఇప్పుడు ఈ మచ్చెందుకు? చెప్పు సామీ... మీ వాళ్ళకంతా వినబడేటట్లు చెప్పు. చావడానికి మూడు రోజుల ముందు నీకు లక్ష వరహాలు ఇచ్చినానో లేదో" అన్నాడు గట్టిగా.

వెంటనే లోపలున్న బక్కోడు " నా ఆత్మ పైకి పోలేక కింద వుండలేక తనకలాడుతా వుంది. ఈ ఋణబంధం ఒక్కటి తెంపేస్తే సక్కగా స్వర్గానికి ఎళ్ళిపోతా... వాని లక్ష వరహాలు వానికి ఇచ్చేయండి" అన్నాడు గట్టిగా.

దాంతో వాని పెండ్లాం దుబ్బోన్ని ఇంటికి తీసుకోనిపోయి "సచ్చిన నా మొగునితో మళ్ళా మాట్లాడిచ్చినావు. నీ మేలు జన్మలో మరిచిపోను. ఇంతకు ముందే మాటిచ్చినట్లు లక్షకు లక్ష వరహాలు ఇస్తా తీసుకోని పో" అంటా రెండు లక్షల వరహాలు నాలుగు సంచీల నిండా నింపి ఇచ్చింది. వాడవన్నీ గాడిదల మీద వేసుకోని, తిరిగి శ్మశానానికి రాకుండా మట్టసంగా వేరేదారి పట్టుకోని వూరికి బైలుదేరినాడు.

ఇక్కడ బక్కోడు గుంతలో కూచోని ఇంగొస్తాడు... ఇంగొస్తాడు... అనుకుంటా ఎంత సేపు కూచున్నా దుబ్బోడు రాలేదు. దాంతో వానికి ఏందో జరిగింటాదని అనుమానమొచ్చి నానాక తిప్పలు పడి ఆ సమాధిపైనున్న మట్టి రాళ్ళు తొలగించుకోని బైటపన్నాడు. ఆ వ్యాపారి ఇండ్లు యాడుందో కనుక్కోని సక్కగా వాళ్ళింటికి పోయి

"అమ్మా... మా అన్నగానీ ఏమైనా వచ్చినాడా లక్ష వరహాల కోసం"  అనడిగినాడు. దానికామె "రావడమూ తీసుకోని పోవడమూ రెండూ ఎప్పుడో అయిపోయినాయి" అని చెప్పింది. దాంతో వానికి దుబ్బోడు మోసం చేసినాడని అర్థమైపోయింది.

దాంతో వాడు కాసేపు ఆలోచించి సక్కగా ఒక చెప్పుల అంగడికి పోయి బాగా తళతళలాడిపోయేలా ఒక మాంచి చెప్పుల జత కొన్నాడు. చూస్తే ముచ్చటేస్తాది. ఒక్కసారన్నా కాళ్ళకేసి తొడుక్కోవాలనిపిస్తాది. అంత అందంగా వున్నాయవి. వాటిని సంకన పెట్టుకోని దుబ్బోన్ని వెదుక్కుంటా వురకసాగినాడు. వాడు ఖచ్చితంగా వేరే దారిలోనే పోయింటాడని వూహించి వీడు అట్లాగే పోసాగినాడు. అట్లా చానాదూరం పోయినాక దూరంగా దుబ్బోడు గాడిదలను తోలుకోని పోతా కనబన్నాడు. " అమ్మదొంగా... వుండు నీ పని చెబుతా' అనుకోని వానికి కనబడకుండా చెట్లమాటునా పుట్టల మాటునా దాచిపెట్టుకుంటా దాచిపెట్టుకుంటా వాని కంటే ముందుకు పోయి దారిలో ఒక చెప్పు పడేసినాడు.

దుబ్బోడు వస్తా వస్తా ఆ చెప్పు చూసినాడు. "అబ్బ... ఎంత ముచ్చటగుందీ చెప్పు.. వేసుకుంటే ఇట్లాంటిదే వేసుకోవాల" అనుకోని చుట్టూ చూసినాడు. దాని జత ఇంగొకటి యాడన్నా పడుందేమోనని.. యాడా కనబళ్ళేదు. దాంతో ఒక చెప్పు ఏం చేసుకుంటాంలే అనుకోని బాధగా దాన్ని ఆన్నే పడేసి మళ్ళా బైలుదేరినాడు. వాడట్లా పోవడం ఆలస్యం బక్కోడు ఆ చెప్పు ఒక పొదలో దాచి పెట్టేసి మళ్ళా వానికన్నా ముందే పోయి దారికడ్డంగా రెండో చెప్పు పాడేసి ఆన్నే వున్న ఒక చెట్టు పైకెక్కి కూచున్నాడు మట్టసంగా. దుబ్బోడు వస్తా వస్తా ఆ రెండో చెప్పు చూసినాడు.

" అరెరే... ఈడ పడిందా ఇది. ఆ మొదటిది గూడా తెచ్చుకోనుంటే బాగుండెనే. అయినా ఎంత దూరంలే అరగంటలో పోయి తెచ్చుకోవచ్చు" అనుకోని గాడిదలను ఒక చెట్టుకు కట్టేసి వెనక్కి బైలుదేరినాడు. వాడట్లా కనుచూపుమేర దాటడం ఆలస్యం బక్కోడు బెరబెరబెర కిందికి దిగొచ్చి గాడిదలను తోలుకోని బెరబెరా వురికిస్తా వురికిస్తా వూరికి చేరుకున్నాడు.

ఈడ దుబ్బోడు మొదటి చెప్పు కోసం పోయినాడు గదా... వానికి అది యాడా కనబళ్ళేదు. 'ఎక్కడబ్బా చూసినాను' అని వాడట్లా ఇట్లా వెదుకుతా వుంటే... ఈడ బక్కోడు ఇంటికొచ్చేసి మూటలన్నీ దించి గాడిదలను తన్ని తరిమేసినాడు. ఇంటివెనుకనున్న పెరట్లో గుంత తవ్వి అన్నీ అందులో దాచిపెట్టేసి పెండ్లాన్ని పిల్చి "దుబ్బోడొచ్చి నేను వచ్చినానా అని అడుగుతాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నా మొగం గూడా చూల్లేదని చెప్పు. నేను పోయి వూరిబైట బావి లోపల దాచిపెట్టుకుంటా. నాకు రోజూ మద్యాన్నం ఒక వారంరోజులు అన్నం తీసుకోనిరా" అని చెప్పి చేతికి పదివరహాలు ఇచ్చినాడు.

దుబ్బోడు ఆ చెప్పు కోసం వెదికీ వెదికీ నీరసంగా తిరిగొచ్చి చూస్తే ఇంగేముంది... ఈడ గాడిదలూ లేవు. దాండ్ల మీద మూటలూ లేవు. దాంతో వానికి ఇదంతా బక్కోని పనే అని అర్థమైంది. దాంతో సక్కగా వానింటికి వచ్చి "ఏమ్మా... నీ మొగుడు వచ్చినాడా" అని అడిగినాడు. దానికామె "అన్నా... అప్పుడు నీతో బాటు ఇంట్లోదిలి పోయిందే... మళ్ళా ఇప్పటివరకు ఈ గడప తొక్కలేదు" అనింది అమాయకంగా మొగం పెట్టి. దాంతో దుబ్బోడు వూరిబైటి చెరకుతోటలో వెదికినాడు. వూరి పక్కనున్న జొన్న చేనులో వెదికినాడు. కొండమీదున్న శివుని గుడిలో వెదికినాడు. ఇంటింటికీ పోయి అడిగినాడు. కానీ వాడు యాడా కనబల్లేదు. దాంతో వాడు ఇట్లా లాభం లేదనుకోని బక్కోని పెండ్లాం రోజూ యాడికి పోతోంది, యాన్నించి వస్తోంది అని దాచిపెట్టుకోని గమనించ

సాగినాడు. ఆమె రోజూ వూరిబైటున్న బావికాడికి మద్యాన్నం పోవడం గమనించినాడు. దాంతో ఇందులో ఏదో రహస్యం వుందని మట్టసంగా చప్పుడు చేయకుండా తరువాత రోజు వెంబడించినాడు.

ఆమె బాయికాడికి పోయి "ఓయ్... యాడున్నావు. బెరీతరా. అన్నం తిని పోదువుగానీ" అని పిలవడం ఆలస్యం వాడు బావిలోంచి బైటకొచ్చినాడు. వాడు అన్నం తింటా వుంటే ఆమె "ఇంట్లో నూకలు నిండుకున్నాయి. చేతిలో దుడ్లు లేవు. రేపటికి నేనేమి తినేది. నీకేమి తెచ్చేది. ఇంగా ఎన్ని రోజులు ఇట్లా దాచిపెట్టుకుంటావు" అనింది. దానికి వాడు నవ్వి "ఇంకో నాలుగు రోజులు ఆగు వచ్చేస్తా. ఐనా డబ్బులకు మనకు తక్కువేంది. ఇంటి వెనుక పెరట్లో పొయ్యికాడ ఒక పాత బన్న పెద్ద కాగు వుంది గదా... దానికింద లెక్కలేనన్ని బంగారు వరహాలు వున్నాయి. మట్టసంగా పొయ్యి కావలసినన్ని తీసుకో" అన్నాడు.

ఆ మాటలు విన్న దుబ్బోడు వెంటనే రయ్యిన బాణం లెక్క బక్కోని ఇంటికి దూసుకోని పోయినాడు. బక్కోని పెండ్లాం తిరిగి వచ్చే లోపల బాన కింద తవ్వి మూటలన్నీ తీసేసి వున్నదున్నట్లు బూడ్చి పెట్టేసి ఆన్నించి జారుకున్నాడు. ఆమెకిదంతా తెలీదు గదా... దాంతో తిరిగి వచ్చి చూస్తే ఇంగేముంది ఒక్క పైసా లేదు. దాంతో ఆమె వురుక్కుంటా పోయి జరిగిందంతా మొగునికి చెప్పింది.

"మూటలు మాయమైనాక ఇంగ బావిలో వుండి ఏం లాభం" అనుకోని వాడు బైటకొచ్చి సక్కగా పోయి చూస్తే ఇంగేముంది... పెండ్లాం చెప్పింది నిజమే... ఒక్క వరహా గూడా లేదు. దాంతో వానికి ఇదంతా దుబ్బోని పనే అని అర్థమై పోయింది. దాంతో సక్కగా దుబ్బోని ఇంటికి పోయినాడు. చూస్తే ఇంగేముంది మంచమ్మీద నీలుక్కోని పడి వున్నాడు. "ఏమైంది" అని అడిగితే దుబ్బోని పెండ్లాం ఇప్పటికే పది రోజులైంది. ఒక్క అచ్చటా లేదు, ముచ్చటా లేదు. మంచం దిగి నడవడం గూడా లేదు. ఇట్లాగే పడివున్నాడు" అంటా ముందే మొగుడు చెప్పింది చెప్పినట్లుగా అప్పచెప్పింది. వాడు ఇంట్లోకి పోయి చూసినాడు. వాన్ని చూడగానే దుబ్బోడు కదలకుండా, మెదలకుండా అచ్చం చచ్చినోని లెక్క అట్లాగే నీలుక్కోని పండుకున్నాడు.

దాంతో బక్కోడు "అయ్యయ్యో జ్వరం అనుకుంటిమి గానీ దుబ్బోడు అసలు ఈ లోకాన్నే వదిలేసి పోయినాడు" అంటా లబలబలబ నెత్తీనోరూ కొట్టుకుంటా వాన్ని ఎత్తి భుజమ్మీద వేసుకోని పోసాగినాడు. అది చూసి వూరోళ్ళందరూ "ఏందిరా... అట్లా ఒక్కనివే ఎత్తుకోని పోతా వున్నావు. దించు తలా ఒక చేయి వేస్తాం" అన్నారు. దానికి వాడు "వద్దు... మా దగ్గరికి ఎవరూ రావద్దు. చిన్నప్పటి నుంచీ మాది ఒకటే మాట. ఒకటే బాట. నేను సస్తే వాడు ఎత్తుకోని పోయి కాల్చాల. వాడు సస్తే నేను ఎత్తుకోని పోయి కాల్చాల. సొంత అమ్మానాయనలైనా, పెండ్లాం బిడ్డలైనా ఎవరూ మధ్యలో ఏలు పెట్టగూడదు. అట్లా ఒట్టేసుకున్నాం" అన్నాడు. ఆ సంగతి వూళ్ళో పసిపిల్లల నుంచి పండుముసలోళ్ళ వరకూ అందరికీ తెలిసిందే గదా... దాంతో వానికి ఎవరూ అడ్డు పెట్టలేదు. దాంతో బక్కోడు వాన్ని సక్కగా శ్మశానానికి తీసుకోని పోయి కిందంతా కట్టెలు పేర్చి అంటిచ్చినాడు.

అంతే... ఒళ్ళంతా సుర్రుమనే సరికి వాడు అదిరిపడి అమ్మా... అబ్బా... అని అరుచుకుంటా పైకి లేచినాడు. "రేయ్.. బక్కోడా అయిపోయిందేదో అయిపోయింది. చెరీ సగం పంచుకోని ఇకపై ఎవని బదుకు వాళ్ళు బదుకుదాం. నీ ఇంటికి నేను రాను. నా ఇంటికి నువ్వు రావద్దు. ఇంక ఈ దొంగాట ఆపుదాం. సరేనా" అన్నాడు. ఆ మాటలకు బక్కోడు సరేనని తనకు రావలసిన లక్ష వరహాలు తాను తీసుకోని సంబరంగా వెళ్ళిపోయినాడు.

# 35 వంకర టింకర పండ్లు

ఒకూర్లో ఎల్లమ్మ, పుల్లమ్మ అని ఇద్దరు వుండేటోళ్ళు. వాళ్ళవి ఎదురెదురు ఇండ్లు. ఎల్లమ్మ, పుల్లమ్మ ఇద్దరూ చానా అందంగా వుండేటోళ్ళు. పుల్లమ్మ చానా మంచిది. కానీ ఆమె పండ్లు పచ్చగా వంకరటింకరగా వుండేవి. ఎల్లమ్మ పండ్లు మాత్రం చూడముచ్చటగా వుండేవి.

ఎల్లమ్మకు పండ్లు అందంగా వుంటాయి గదా అందుకని దానికి బలే టెక్కు. ఎప్పుడూ పుల్లమ్మని నీవి వంకర టింకర పండ్లని ఏడిపించేది. దాంతో పుల్లమ్మ నలుగురిలో నోరు తెరచి మాట్లాడాలన్నా, నవ్వాలన్నా సిగ్గుపడేది. పాపం... ఎప్పుడూ నోరుమూసుకోని పండ్లు కనబడకుండా మట్టసంగా వుండేది.

వాళ్ళిండ్లల్లో ఒక ఎలుక తిరుగుతా వుండేది. దానివి చూడచక్కనైన పండ్లు. తెల్లగా, అందంగా, ధగధగా మెరిసిపోతా వుండేవి. ఒకసారి దానికి నాలుగు రోజులైనా అన్నం దొరకలేదు. ఆకలితో నకనకలాడిపోయింది.

అది నీరసంగా నడవలేక నడవలేక నడుస్తా ఎల్లమ్మ దగ్గరికొచ్చి "ఎల్లమ్మా... ఎల్లమ్మా... నాకు చానా ఆకలిగా వుంది. నాలుగు రోజులుగా ఏమీ తినలేదు. ఏమైనా వుంటే పెట్టవా" అనడిగింది. ఆ మాటలకు ఎల్లమ్మ "నాకే తినడానికి లేకుంటే నీకేందే పెట్టేది. పోతావా లేదా ఈన్నించి" అంటూ చీపురు కట్ట తీసుకోనొచ్చి రపరపరప నాలుగు పెరికింది.

పాపమా ఎలుక ఏడ్చుకుంటా... ఏడ్చుకుంటా.. పుల్లమ్మ దగ్గరకు పోయి "పుల్లమ్మా... పుల్లమ్మా... చానా ఆకలిగా వుంది. నాలుగు రోజులుగా ఏమీ తినలేదు. ఏమైనా వుంటే పెట్టవా" అనడిగింది. ఆ మాటలకు పుల్లమ్మ "అయ్యయ్యో... అట్లాగా... వుండు. ఏమైనా వున్నాయేమో చూస్తా" అంటూ డబ్బాలన్నీ వెదకి ఒక దాంట్లో పప్పులుంటే తీసుకోనొచ్చి దానికి పెట్టింది. ఎలుక సంబరంగా అవన్నీ తిని వెళ్ళిపోయింది.

ఆ రోజు రాత్రి పుల్లమ్మ పండుకోని నిద్రపోయిన కాసేపటికి ఎలుక కన్నంలోంచి బైటకొచ్చింది. తనకు కడుపు నిండా పప్పులు పెట్టినందుకు పుల్లమ్మకు ఏదైనా సాయం చేయాలని ఆలోచించి... చివరకు నొప్పి లేకుండా ఆమె పండ్లన్నీ పీకేసి తన అందమైన పండ్లు వరుసగా పెట్టేసి వెళ్ళిపోయింది. పుల్లమ్మ పొద్దున్నే లేసి ముఖం కడుక్కోని అద్దంలో చూసుకుంటే ఇంగేముంది పండ్లన్నీ వరుసగా తళతళలాడుతా కనబడినాయి. ఆమెకు చెప్పలేనంత సంతోషం కలిగింది.



వూర్లో ఆమె పండ్లు చూసిన ప్రతి ఒక్కరూ "అబ్బ... ఎంతందంగా వున్నాయి. అచ్చం దానిమ్మ గింజలెక్క" అని పొగడసాగినారు. ఆ విషయం ఎల్లమ్మకు తెలిసింది. రాత్రికి రాత్రి పుల్లమ్మ పండ్లు అంత అందంగా ఎలా మారాయబ్బా... అనాలోచించి పుల్లమ్మ దగ్గరకుపోయి "ఏంది విషయం" అనడిగింది. పుల్లమ్మ జరిగిందంతా చెప్పింది.

అలాగా అని ఆ రోజు రాత్రి ఎల్లమ్మ ఒక పడి పప్పులు తెచ్చి ఎలుక కన్నం దగ్గర పోసి నిద్రపోయింది. ఆమె అట్లా నిద్రపోగానే ఎలుక బైటకొచ్చి ఆ పప్పులన్నీ మట్టసంగా తినేసింది. అంతకు ముందురోజే తన అందమైన పండ్లన్నీ పుల్లమ్మకు పెట్టి, ఆమె వంకర టింకర పండ్లన్నీ తాను పెట్టుకుంది గదా... అందుకని అది ఏం చేసిందంటే ఎల్లమ్మ పండ్లన్నీ పీకేసి తన వంకర టింకర పండ్లన్నీ ఆమెకు పెట్టేసి నవ్వుకుంటా వెళ్ళిపోయింది.

పొద్దున్నే ఎల్లమ్మ లేసి వురుక్కుంటా పోయి అద్దంలో చూసుకుంటే... ఇంగేముంది. పండ్లన్నీ పచ్చగా, వంకర టింకరగా కనబడినాయి. ఆ పండ్లని చూసి వూరు వూరంతా కిందామీదా పడి నవ్వుతా వుంటే ఎల్లమ్మ మొగం ఎవరికీ చూపించలేక గమ్మున నోరు మూసుకోని ఇంట్లోనే వుండిపోయింది.

# 36 వూకూకె

ఒకూర్లో ఒక పిల్లోడుండేటోడు. వానికి ఆటలంటే చానా ఇష్టం. పొద్దస్తమానం షికార్లు కొడతా... తోటి పిల్లలతో బొంగరాలాట, గోలీలాట, లేస్తేలాత్, చిల్లంగోడె, కబడీ, వంగుడు దుంకుడు, కోతికొమ్మచ్చి... అట్లా ఎన్నెన్నో ఆటలు ఆడుకుంటా, వూరి పక్కనే వున్న చెరువులో ఈత కొట్టుకుంటా తిరిగేటోడు. కొంచం గూడా పని చేసేటోడు కాదు.

కొంతకాలానికి వాడు పెరిగి పెద్దోడయినాడు గానీ బుద్ధి మాత్రం మారలేదు. దాంతో వాళ్ళమ్మ ఒకరోజు వాన్ని పిలిచి "రేయ్... దున్నపోతులాగా అడ్డంగా పెరిగినావ్. ఇంకా ఎంత కాలమిట్లా పనీపాటా లేకుండా తిరుగుతావ్. ఇట్లాగే వుంటే రేప్పొద్దున నీకు పిల్లనెవరిస్తార్రా... పెండ్లి చేసుకోడానికి" అంటా బాగా తిట్టింది. దాంతో వాడు "నీకెందుకుమా... బెంగ... నేను పోయి పెండ్లి చేసుకోనొస్తా చూడు" అని ఇంట్లో నుండి బైలుదేరినాడు.

వాడు దారిలో పోతాపోతా వుంటే ఒకచోట ఒక అంగడి కనబడింది. ఆ అంగట్లో ఒక చిన్నపాప కూచోనింది. వాళ్ళమ్మ లోపల స్నానం చేస్తా వుంది. వీడు అంగడి దగ్గరికి పోయి మురుకులు కొన్ని పొట్లం కట్టిచ్చుకొన్నాడు. ఆ పాప డబ్బులడుగుతే వాడు నవ్వుతా "మీ అమ్మకు నేను బాగా తెలుసులే... ఈసారి వచ్చినప్పుడు ఇస్తా" అన్నాడు. ఆ పాప "ఏం పేరు నీది" అనడిగింది. దానికి వాడు "వూకూకె" అన్నాడు. అట్లాగా అని పాప గట్టిగా "అమా... ఈయనెవరో మురుకులు తీసుకోని డబ్బులు మళ్ళా ఇస్తానంటా వున్నాడే" అని గట్టిగా అరిచింది. వాళ్ళమ్మ లోపల్నించే "ఎవరే... ఏం పేరే" అనడిగింది. దానికాపాప "వూకూకెమా" అనింది. దాంతో వాళ్ళమ్మ వూకూకెనా అని వూరుకోనింది.



వాడు మురుకుల పొట్లం తీసుకోని చాకిరేవు కాడికి పోయినాడు. ఆడ చాకలోళ్ళు బట్టలన్నీ శుభ్రంగా వుతికి, ఆరేసి పిల్లల్ని కాపలా పెట్టి వూళ్ళోకి పోయినారు. వీడు ఒక పాప దగ్గరికి పోయి "పాపా... పాపా... నాకు ఆ బట్టలియ్యి. మళ్ళా సాయంత్రానికంతా తిరిగిస్తా. నాకు ఆ

బట్టలిచ్చినావనుకో నీకు ఇదిగో ఈ మురుకులిస్తా" అని ఆశ చూపినాడు. ఆ పాప సరేనని మురుకులు తీసుకోని "తొందరగా రావాల చూడు" అంటూ బట్టలిచ్చి "నీపేరేమి" అనడిగింది. దానికి వాడు "సుడిగాలి" అని చెప్పి కొత్తబట్టలేసుకోని పోయినాడు. సాయంకాలమయినా రాలేదు. పాప తల్లి వచ్చి "కొత్త బట్టలు యాడికి పోయినాయే" అనడిగింది. ఆ పాప ఏడుస్తా "సుడిగాలి వచ్చి ఎత్తుకుపోయినాడుమా" అని చెప్పింది. దానికి వాళ్ళమ్మ "సుడిగాలొచ్చి ఎత్తుకపోతే ఎవరు మాత్రం ఏం చేస్తార్లే... అంతా మన ఖర్మ... నువ్వు ఏడ్చొద్దు" అని మిగతా బట్టలన్నీ మూటగట్టి గాడిద మీద వేసుకోని వెళ్ళిపోయింది.

వాడు కొత్తబట్టలేసుకోని ఒక చెరువు కాడ పోతా వుంటే దారిలో ఒకడు అప్పుడే కొనుక్కొచ్చిన కొత్తగుర్రంతో ఎదురొచ్చినాడు. వాడు వీన్ని చూసి "బాబూ... బాబూ... కాస్త ఈ గుర్రాన్ని చూస్తుంటావా... చెరువులో స్నానం చేసొస్తా" అన్నాడు. వీడు సరేనన్నాడు. వాడు స్నానానికి పోతా పోతా "నీ పేరేమి" అని అడిగితే "యజమాని" అని చెప్పినాడు. వాడు స్నానానికి అట్లా పోయినాడో లేదో వీడిట్లా గుర్రమేసుకోని మట్టసంగా పారిపోయినాడు.

వాడు స్నానం చేసొచ్చి చూస్తే ఇంగేముంది... గుర్రం లేదు. వాడు లబోదిబోమని ఏడుస్తా వుంటే దారిలో పోతున్నోళ్ళందరూ గుంపయినారు. "ఏమయింది... ఎందుకట్లా ఏడుస్తా వున్నావ్... ఏంది నీ బాధ" అనడిగినారు. దానికి వాడు వెక్కి వెక్కి ఏడుస్తా "నా కొత్త గుర్రాన్ని ఎత్తుకుపోయినాడు" అని చెప్పినాడు. దానికి వాళ్ళు "ఎవరెత్తుకోని పోయినారు" అనడిగితే "యజమాని" అన్నాడు. అంతే... వెంటనే జనాలంతా కోపంగా యజమాని గుర్రాన్ని తీస్కోనిపోతే మధ్యలో నీకెందుకు బాధ... పోతావా లేదా ఈన్నించి" అని వాన్నే బాగా తిట్టినారు.

వీడు మంచి బట్టల్తో కొత్త గుర్రమ్మీద పోతా వుంటే దారిలో ఒక ఏరు అడ్డమొచ్చింది. ఏటి ఒడ్డున ఒక ముసిలామె అందమైన మనుమరాలితో నిలబడి వుంది. వీన్ని చూస్తానే "నాయనా... నాయనా... మమ్మల్ని కాస్త ఏరు దాటించి పుణ్యం కట్టుకో" అనడిగింది. వాడు సరేనని తలూపుతా "మీ ఇద్దరూ ఒకేసారి ఎక్కుతే నా గుర్రం మొయ్యలేదు. ఒకరి తర్వాత ఒకరిని దాటిస్తా" అని ముందు ఆ అందమయిన అమ్మాయిని ఎక్కించుకున్నాడు. ముసల్ది "నాయనా ఇంతకీ నీ పేరేమి" అనడిగింది. దానికి వాడు "దాని మొగుడు" అని చెప్పినాడు. ఏరు దాటింతర్వాత తిరిగి రాకుండా ఆ పిల్లతో అదే పత్తా లేకుండా పారిపోయినాడు.

ముసల్ది ఏడుస్తా రాజు దగ్గరికి పోయి "రాజా... రాజా... నా మనుమరాలిని ఎత్తుకోని పోయినాడు. నువ్వే కాపాడాల" అనింది. రాజు "ఎవరెత్తుకోని పోయినారు" అనడిగినాడు. దానికామె "దాని మొగుడు" అని చెప్పింది. ఆ మాటింటానే రాజుకు కోపమొచ్చి "దాని మొగుడు దాన్నెత్తుకోని పోక... నిన్నెత్తుకోని పోతాడా... ఫో... ఫో... ఈన్నించి" అంటూ ఆమెను కసురుకోని పంపిచ్చేసినాడు.

వాడు గుర్రమ్మీద ఆ పిల్లని తీసుకోని ఇంటికిపోయి "అమా... అమా... కాస్త బైటికొచ్చి చూడమా... ఎంత చూడచక్కనైన పిల్లను తెచ్చినానో... వెంటనే మాకు పెండ్లి చేద్దువురా" అన్నాడు. ఆమె సంబరంగా వూరందరినీ పిల్చి బ్రమ్మాండంగా కొడుకు పెండ్లి జరిపించింది.

# 37 ఢాం... ఢాం... ఢాం...

ఒకూర్లో ఒక అమాయకుడున్నాడు. అమాయకుడంటే ఏమీ తెలీనోడు అన్నమాట. ఒకరోజు వాళ్ళమ్మ వాన్ని పిల్చి "రేయ్... సంతకు పోయి ఒక మాంచి గుర్రాన్ని కొనుక్కోని రాపో" అని దబ్బిచ్చి పంపిచ్చింది. వాడు అట్లాగేనంటూ సంతకు పోయి బేరమాడకుండానే ఒక గుర్రాన్ని కొనుక్కోని ఇంటికి బైలుదేరినాడు.

వాడు గుర్రాన్ని తాడు పట్టుకోని పోతా వుంటే ఎదురుగా ఒకడు గుర్రం మీద పోతా కనబన్నాడు. అది చూసి వానికి కూడా గుర్రాన్ని ఎక్కాలనిపించింది. కానీ ఎట్లా ఎక్కాల్నో అర్థం కాలేదు. దాంతో వెనుకవైపు నుండి తోక పట్టుకోని పైకి ఎక్కినాడు. ఎక్కినాడు గానీ దాన్ని ఎట్లా తోలాల్నో అర్థం కాక "థాయ్.. థాయ్..." అంటూ గట్టిగా ఒక్కేటు కొట్టినాడు. అంతే... దానికి కోపమొచ్చి ఎగిరి వాన్ని కింద పడేసింది. వాడు పైకి లేచి "ఇదేందిరా నాయనా! మంచి గుర్రమియ్యమంటే కింద పడేసే గుర్రమిచ్చినాడు... దీన్ని ఎట్లా వదిలించుకోవాలబ్బా" అని ఆలోచిస్తా... ఆలోచిస్తా... పోతా వుంటే దారిలో ఒకడు పొట్టేలు తీసుకోని వస్తా కనబన్నాడు. వెంటనే వీడు వాని దగ్గరికి పోయి "అనా... అనా... నా గుర్రాన్ని తీస్కోని నీ పొట్టేల్ని ఇస్తావా" అని అడిగినాడు.

పొట్టేలు కన్నా గుర్రం విలువైందిగదా... దాంతో వాడు "వీడెవడో తిక్కోనిలెక్కున్నాడే" అని నవ్వుకుంటా పొట్టేలునిచ్చి గుర్రాన్ని తీసుకోని పోయినాడు.

వాడు పొట్టేలుని తీసుకోని పోతా వుంటే మధ్యలో "ఈ పొట్టేలుకి కాళ్ళూ చేతులు అన్నీ సక్కగా వున్నాయా లేదా" అని అనుమానమొచ్చింది. దాంతో వాడు కాళ్ళూ, చేతులు, చెవులు అన్నీ చూస్తా... చూస్తా... ముందుకొచ్చి దాని కండ్లలోకి సూటిగా చూసినాడు. వాడట్లా చూస్తా వుంటే భయపన్న ఆ పొట్టేలు నాలుగడుగులు వెనక్కేసి వేగంగా ముందుకొచ్చి తన తలతో వాని తలకు ఎగిరి ధామ్మని ఒక డిచ్చీ కొట్టింది. అంతే... ఆ దెబ్బకు వానికి దిమ్మ తిరిగి దభీమని పడిపోయినాడు.

"ఇదేందిరా నాయనా... మంచి పొట్టేలియ్యమంటే... తన్నే పొట్టేలు ఇచ్చినాడు. దీన్ని ఎట్లా వదిలించుకోవాల" అని వాడు ఆలోచించుకుంటా పోతా వుంటే ఎదురుగా ఒకడు సంకలో కోడిపెట్ట పెట్టుకోని వస్తా కనబన్నాడు.

వెంటనే వాడు వురుక్కుంటా వాని దగ్గరకు పోయి "అనా... అనా... నా పొట్టేలు తీసుకోని నీ కోడిపెట్ట ఇస్తావా" అని అడిగినాడు.

కోడిపెట్ట కన్నా పొట్టేలు చానా విలువయినది గదా... దాంతో వాడు "వీడెవడో తిక్కోని లెక్కున్నాడు" అని నవ్వుకుంటా కోడిపెట్టనిచ్చి పొట్టేలుని తీసుకోని పోయినాడు.



వాడు కోడిపెట్టెను తీసుకోని పోతా వుంటే మధ్యలో చానా దప్పికయింది. ఒకచోట బావి కనబడితే కోడిపెట్టెను పక్కన పెట్టి నీళ్ళు తోడుకోసాగినాడు. కోడిపెట్టెను అట్లా వదలడం ఆలస్యం అది అదే సందనుకోని వురకడం మొదలుపెట్టింది. వాడు అదిరిపడి దాని వెనుక పడినాడు. అది వాన్ని ముళ్ళకంచలల్లో, దిబ్బలల్లో బాగా ఉరికిచ్చింది. ఆఖరికి వాడు కిందామీదా పడి దాన్ని పట్టుకున్నాడు. పట్టుకోని "ఇదేందిరా నాయనా! మంచి కోడిపెట్టె కావాలనుకుంటే... వురికిచ్చే కోడిపెట్ట వచ్చింది. దీన్ని ఎట్లాగయినా వదిలిచ్చుకోవాల అనుకున్నాడు. వాడు పోతా వుంటే దారిలో ఒకడు సంచిలో ఉల్లిగడ్డలు వేసుకోని వస్తా కనబన్నాడు. వెంటనే వాడు వురుక్కుంటా వాని దగ్గరకు పోయి "అనా... అనా... నా కోడిపెట్ట తీసుకోని నీ ఉల్లిగడ్డలు ఇస్తావా" అని అడిగినాడు.

ఉల్లిగడ్డలకన్నా కోడిపెట్టె చానా విలువయినది గదా... దాంతో వాడు "వీడెవడో తిక్కోని లెక్కున్నాడే" అని నవ్వుకుంటా ఉల్లిగడ్డలనిచ్చి కోడిపెట్టె తీసుకోని పోయినాడు.

వాడు ఉల్లిగడ్డలు తీసుకోని పోతా వుంటే మధ్యన ఈ ఉల్లిపాయలు బాగున్నాయా... లేదా... అని అనుమానమొచ్చింది. దాంతో వాడు ఒక ఉల్లిపాయ తీసుకోని కొరికినాడు. అంతే... దాని ఘాటుకు వాని కళ్ళలోంచి సర్రున నీళ్ళు కారినాయి. వాడదిరిపడి "ఇదేందిరా నాయనా... మంచి ఉల్లిపాయలు కావాలనుకొంటే... ఏడిపిచ్చే ఉల్లిపాయలు వచ్చినాయి. ఎట్లాగయినా వీటిని వదిలిచ్చుకోవాల" అనుకుంటూ పోతా వుంటే దారిలో ఒకడు సంబరంగా బైటికి చప్పుడు వినబడకుండా నోట్లోనే పాట పాడుకుంటా చిటికెలేస్తా వస్తూ కనబన్నాడు. వానికి ఆ చిటికెల చప్పుడు బాగా నచ్చింది.

వెంటనే వాడు వురుక్కుంటా వాని దగ్గరకు పోయి "అనా... అనా... నా ఉల్లిగడ్డలనిస్తా... అట్లా చిటికెలెట్లా వేయాల్నో నేర్పిస్తావా" అని అడిగినాడు.

దాంతో వాడు "వీడెవడో తిక్కోని లెక్కున్నాడే" అని నవ్వుకొన్నాడు. ఉల్లిగడ్డలు తీసుకోని బొటనవేలు, నడుమవేలు కలిపి చిటికెలెట్లా వేయాల్నో నేర్పించి వెళ్ళిపోయినాడు.

వాడు సంబరంగా చిటికెలేసుకుంటా పోతా వుంటే దారిలో ఒకచోట ఒక చెరువు కనబడింది. దాహం తీర్చుకుందామని చెరువులోనికి దిగి దోసిళ్ళనిండా నీళ్ళు తీసుకోని బాగా తాగినాడు. తాగినాక మళ్ళా మామూలుగానే చిటికె వేసినాడు.

కానీ చేయి తడయింది గదా... దాంతో ఎటువంటి చప్పుడు రాలేదు. వాడు అదిరిపడి "అరెరే... నా చిటికె నీళ్ళలో జారిపడిపోయిందిరా నాయనో... ఎవరయినా వచ్చి దాన్ని తెచ్చియ్యండ్రా దేముడో" అని గుండెలు బాదుకుంటా ఏడ్వసాగినాడు.

అది చూసి జనాలంతా గుంపుగా చేరి "ఏమయిందిరా" అనడిగితే వాడు "ఏం చెప్పమంటారన్నా... నీళ్ళు తాగుతా వుంటే వేళ్ళ మధ్య నుంచి జారిపోయింది. యాడ పోయిందో... ఏమో" అన్నాడు ఏడుస్తా.

వాళ్ళు వేళ్ళ మధ్య నుంచి జారిపోయిందంటే బంగారు ఉంగరమేమో అనుకోని గబగబా నీళ్ళలోకి దిగి వెదకడం మొదలుపెట్టినారు.

కాసేపటికి వాని చేతి తడంతా ఆరిపోయింది. దాంతో మరలా చిటికె చప్పుడు వచ్చింది. దాంతో వాడు "ఏయ్... దొరికింది.. దొరికింది" అని ఎగురుకుంటా చిటికెలు ఏయసాగినాడు.

అదిచూసి అందరూ "అరెరే... అనవసరంగా ఈ తిక్కలోని మాటలు నమ్మి నీళ్ళలో దుంకినామే" అని గొణుక్కుంటా వెళ్ళి పోయినారు.

వాడు సంబరంగా చిటికెలేసుకుంటా

గుర్రం పోయీ పొట్టేలొచ్చా ధాం... ధాం... ధాం...

పొట్టేలు పోయీ కోడీ వచ్చా ధాం... ధాం... ధాం...

కోడీపోయీ ఉల్లిగడ్డొచ్చా ధాం... ధాం... ధాం...

ఉల్లిగడ్డపోయీ చిటికా వచ్చా ధాం... ధాం... ధాం...

అని పాడుకుంటా ఇంటికి పోయినాడు.

ఉత్తచేతులతో ఇంటికొచ్చిన కొడుకుని చూసి వాళ్ళమ్మ "వీనికి డబ్బిచ్చి పంపడం నాదే బుద్ధితక్కువ" అనుకోని మట్టసంగా నోరుమూసుకోనింది.

# 38 నవాబు - దర్జీ

ఒకూర్లో ఒక నవాబుండేటోడు. రంజాన్ పండుగ దగ్గర పడడంతో వానికి ఇంట్లో అందరికీ బంగారు బట్టలు కుట్టియ్యాలని అనిపించింది. నవాబు తలచుకుంటే కానిదంటూ ఏముంటుంది. దాంతో వెంటనే నేతవాళ్ళని పిలిపించి సన్నని తీగల్తో చూడముచ్చటగా బంగారు బట్టని నేయమన్నాడు. సరే అని వాళ్ళు రాత్రనకా... పగలనకా... కిందామీదాపడి నవాబింట్లో వున్నవాళ్ళందరికీ సరిపడేంత బంగారు బట్టను నేసిచ్చి బహుమానాలు అందుకోని వెళ్ళిపోయినారు.

బట్ట తయారయిపోయింది గదా... ఇంకదాన్ని ఎవరితో కుట్టియ్యాలా అని నవాబు ఆలోచనలో పడినాడు. ఆ వూర్లో రజాక్‌భాయ్ అని ఒక దర్జీ వున్నాడు. వానంత పనిమంతుడు ఆ చుట్టుపక్కల వూళ్ళలో యాడాలేడని పేరు. కానీ... వానికో చిన్న చెడ్డలవాటు వుంది. అదేమంటే.. వాడు నవాబుదయినా... ఫకీరుదయినా... గరీబుదయినా... అమీరుదయినా... బట్టలు కుట్టా కుట్టా అందులోంచి కొంచమైనా మట్టసంగా కాజేసేటోడు. తరువాత అట్లాంటి ముక్కలన్నీ కలిపి రంగురంగుల బట్టలు అందంగా తయారు చేసి కొడుకుకి ఇచ్చేటోడు.

రజాక్ చేతి వాటం గురించి నవాబుకు బాగా తెలుసు. ఏదో పోనీలే అని చూస్తా వూరుకోడానికి ఇది మామూలు బట్ట కాదు గదా... బంగారుది గదా... దాంతో బాగా ఆలోచించి... బట్టను రజాక్ దగ్గరికి పంపకుండా... రజాక్‌నే దివాన్‌కు పిలిపించి "చూడు... రేపటి నుండి నీవు నీ కుట్టు యంత్రం ఎత్తుకోనొచ్చి ఈడ పెట్టుకోని... మా బట్టలన్నీ ఈన్నే కుట్టు" అని ఆజ్ఞాపించినాడు. నవాబు చెప్పినాక తప్పదు గదా... దాంతో తరువాత రోజు రజాక్ కుట్టు యంత్రం తీసుకోనొచ్చి నవాబు గారింట్లోనే పని మొదలు పెట్టినాడు.

ఆ నవాబు పనీపాటా మానేసి రజాక్ చిన్నముక్క గూడా ఎత్తుకోని పోకుండా స్వయంగా ఆయనే కాపలా కాయడం మొదలు పెట్టినాడు. రజాక్ పొద్దునొస్తే మళ్ళా చీకటి పడేంతవరకూ ఆన్నే వుండేటోడు. మధ్యాన్నం చిన్నకొడుకు రజాక్ కోసం అన్నం కూరలు తెచ్చిచ్చేటోడు. పనంతా అయిపోగానే సాయంత్రం సైనికులు నవాబు ఎదుటనే పైనుండి కింది వరకూ అంగుళం కూడా వదలకుండా వెదకి పంపించేటోళ్ళు. దాంతో ఎంత ప్రయత్నించినా రజాక్ చిన్నముక్క కూడా కాజేయలేక పోయినాడు.

ఎట్లా నా కన్నుగప్పి కొట్టేస్తాడో చూద్దామని నవాబూ... కొంచమన్నా కొట్టేయకపోతే ఈ బతుకెందుకని రజాకూ... పంతం బట్టి కూచున్నారు. ఒకొక్క రోజు గడుస్తా వున్న కొద్దీ రజాక్‌కి అన్నం గూడా తినబుద్ధి కావడంలేదు. రాత్రి ఎంత పన్నుకున్నా నిద్ర వచ్చేది కాదు. రోజురోజుకీ చిక్కిపోసాగినాడు. అది చూసి వాని పెండ్లాం విషయం కనుక్కోని ఆలోచిస్తా వుంటే ఆఖరికి ఆమెకో వుపాయం తట్టింది. దాంతో వెంటనే

మొగుని దగ్గరికి పోయి ఏం చేయాల్నో చెప్పింది. ఆ మాటింటానే దర్జీ మొగం ఆనందంతో వెలిగిపోయింది. కొడుకును పిలిచి చేయాల్సిందంతా చెప్పినాడు. ఆరోజు కడుపు నిండా తిని కంటి నిండా నిద్రపోయినాడు.

తరువాత రోజు ఎప్పట్లాగే నవాబు గారి దివాన్లో బట్టలన్నీ ముందువేసుకోని కుట్టసాగినాడు. అట్లా కుడ్తా కుడ్తా, నవాబు తన పెండ్లాంతో మాట్లాడ్తా వున్నప్పుడు... బెరబెరా... బెరబెరా... ఒక పెద్ద బట్టముక్కను మట్టసంగా మడత మీద మడత... మడత మీద మడత పెట్టి కనబడకుండా కాలికేసుకునే జోడులోనికి బాగా లోపలికి తోసేసినాడు.

మధ్యాన్నం అన్నంతినే సమయమయింది. రోజూ మధ్యాన్నం మసీదుకు పోయి నమాజు పూర్తి కాగానే అన్నం తీసుకోని పరిగెత్తుకోనొచ్చే కొడుకు ఆ రోజు ఎంతసేపయినా రాలేదు. అది చూసి నవాబు "ఏరా... నీ కొడుకింకా రాలేదు" అన్నాడు. దానికి వాడు "యాడ తిరుగుతున్నాడో... ఏమో... వస్తానే వంగబెట్టి నాలుగు గుద్దులు గుద్దితే రేపట్నించి యాదున్నా సమయానికి సరిగ్గా వస్తాదు" అంటా కొడుకును పని చేస్తూనే తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టడం మొదలు పెట్టినాడు.

పన్నెండు దాటే వచ్చే కొడుకు ఒకటయినా రాలేదు... రెండయినా రాలేదు... మూడయినా రాలేదు... అది చూసి నవాబు "రేయ్... ఇంగ నీ కొడుకు రాడుగానీ... లోపలికి పోయి... బేగాన్ని అడిగి ఒకముద్ద పెట్టిచ్చుకోని తినిరాపో" అన్నాడు.

దానికి రజాక్ "ఇంతసేపు ఆగినా గదా... ఇంకో అరగంట చూస్తా... అప్పటికీ రాకుంటే నీవు చెప్పినట్టే చేస్తా... అయినా ఈ నాకొడుకు మట్టసంగా ఇచ్చినేది ఇచ్చినట్టు తీసుకొని సక్కగా రాకుండా మధ్యలో ఆడా ఈడా గప్పాలు కొడ్తా వుంటాడు. ఈ నడుమ చెడు సావాసాలు కూడా బాగా ఎక్కువయినాయి... రానీ.. వస్తానే జోడు తీసుకొని కొట్టినచోట కొట్టకుండా కిందామీదా ఏసి కొడ్తే అప్పుడొస్తాది బుద్ధి నా కొడుక్కి" అన్నాడు కోపంగా.

సరిగ్గా... అట్లా రజాక్ కోపంతో వూగిపోతా వున్నప్పుడు వాని కొడుకు అన్నంమూట వూపుకుంటా లోపలికి వచ్చినాడు. వాన్ని చూస్తానే రజాక్ కోపంగా పైకిలేచి "దొంగనాకొడకా! యాడుంటివిరా ఇంతసేపు... ఈడ ఆకల్తో సస్తావుంటే బాతఖానీలు చేస్తున్నావా దారిమీద" అంటూ జోడు తీసుకోని వాన్ని రపారపా రెండేట్లు పెరికినాడు.

ఆ దెబ్బలకు వాడు ఏడుస్తా "అమ్మ... వంట చేయడం ఆలస్యమయితే.. అమ్మను తిట్టాలగానీ.. నన్ను కొడ్తావా... వుండు నీపని చెబ్తా" అని ఠక్కున వాని చేతిలోని జోడు గుంజుకోని "దీంతోనే గదా కొట్టింది... ఇప్పుడిది తీస్కోని పోతా.. ఉత్త కాళ్ళతో వీధుల్లో నడుచుకుంటా రా... అప్పుడు బుద్ధొస్తాది" అని "రేయ్... రేయ్... ఆగరా.. నాజోడు నాకియ్యిరా" అని వాళ్ళ నాయన అరుస్తున్నా వినకుండా ఆన్నించి పారిపోయినాడు.

అది చూసి నవాబు కిందామీదా పడి నవ్వుతా "ఒరే రజాకూ.. భలే కొడుకుని కన్నావురా... అయినా మంచీ చెడూ తెలుసుకోకుండా అంత తొందరేందిరా నీకు.. ఇప్పుడు చూడు ఏమయిందో" అన్నాడు.

రజాక్ విచారంగా మొగం పెట్టి "ఏం చేద్దాం నవాబ్‌జీ.... అంతా నా ఖర్మ" అన్నాడు తన పాచిక పారినందుకు లోపల్లోపల నవ్వుకుంటా....

# 39 ముద్దుంగరం

ఒకూర్లో ఒక పిల్లోడున్నాడు. వాడు చిన్నోడైనా చానా చానా మంచోడు. ఒకరోజు వాళ్ళమ్మ వానికో వందరూపాయలిచ్చి "బియ్యం తాపోరా" అని బజారుకి పంపిచ్చింది. "సరే" అని వాడు సంచీ తీసుకోని పోతా వుంటే దారిలో ఒకచోట ఒక పాములోడు ఒక చిన్న పాముపిల్లను పట్టుకోని కొడ్తా కనబన్నాడు.

అది చూసి ఆ పిల్లోడు అయ్యో పాపమని జాలిపడి వురుక్కుంటా వాని దగ్గరికి పోయి "ఎందుకట్లా చిన్నపిల్లని పట్టుకోని కొడ్తా వున్నావ్" అనడిగినాడు. దానికి వాడు కోపంగా "ఏం చేయమంటావ్? నాగస్వరమెంతూదినా ఇది ఆట ఆడ్డం లేదు. నాకు డబ్బులు రావడం లేదు. అందుకే కొడ్తా వున్నా" అని చెప్పినాడు.

దాన్ని ఎట్లా తప్పించాలబ్బా అని ఆలోచిస్తా వుంటే ఆ పిల్లోనికి వాళ్ళమ్మ ఇచ్చిన పది రూపాయలు గుర్తు కొచ్చినాయి. దాంతో "నాకాడ వంద రూపాయలున్నాయి. అవి తీసుకోని దీన్ని విడిచిపెడతావా" అనడిగినాడు. వాడు, "సరే" అన్నాడు. వెంటనే ఆ పిల్లోడు వానికి వందరూపాయలిచ్చేసి ఆ పాముపిల్లను తీసుకోని సంబరంగా ఎగురుకుంటా ఇంటికి వచ్చేసినాడు.

బియ్యానికని పోయి పాముపిల్లని తెచ్చేసరికి వాళ్ళమ్మకు చానా కోపమొచ్చింది. దాంతో బాగా తిట్టి "ఈసారి అటూఇటూ చూడకుండా సక్కగ పోయి సక్కగ రా" అంటా మల్లా వందరూపాయలిచ్చి బియ్యానికి పంపిచ్చింది. వాడు "సరే" అని పోతా వుంటే దారిలో ఒకచోట ఒకడు ఒక చిన్న పిల్లిపిల్లను పట్టుకోని కొడ్తా కనబన్నాడు. అది చూసి ఆ పిల్లోడు అయ్యో పాపమని జాలిపడి వురుక్కుంటా వాని దగ్గరకు పోయి "ఎందుకట్లా చిన్నపిల్లని పట్టుకోని కొడ్తా వున్నావ్" అనడిగినాడు.

దానికి వాడు కోపంగా "ఈ దొంగసచ్చినేది మా ఇంట్లోకి జొరబడి గిన్నెలోని పాలన్నీ నున్నగా తాగేసింది. అందుకే కొడ్తా వున్నా" అని చెప్పినాడు.


దాన్ని ఎట్లా తప్పించాలబ్బా అని ఆలోచిస్తా వుంటే ఆ పిల్లోనికి వాళ్ళమ్మ ఇచ్చిన వంద రూపాయలు గుర్తుకొచ్చినాయి. దాంతో "నాకాడ వంద రూపాయలున్నాయి. అవి తీసుకోని దాన్ని విడిచిపెడతావా" అనడిగినాడు. వాడు 'సరే' అన్నాడు. ఆ పిల్లోడు వానికి వందరూపాయలిచ్చేసి ఆ పిల్లిపిల్లను తీసుకోని సంబరంగా ఎగురుకుంటా ఇంటికి వచ్చేసినాడు. బియ్యానికనిపోయి ఈసారి పిల్లిపిల్లను తెచ్చేసరికి వాళ్ళమ్మకు చానా కోపమొచ్చేసింది. దాంతో వాన్ని బాగా తిట్టి "ఇంగ నాకాడ డబ్బుల్లేవు. ఇవే ఆఖరి వంద రూపాయలు. బియ్యం తేకపోతే తినడానికి తిండి గూడా వుండదు. జాగ్రత్త" అని ఎచ్చరించి మరలా వంద రూపాయలు ఇచ్చి పంపిచ్చింది. వాడు "సరే" అని పోతా వుంటే దారిలో ఒకచోట ఒకడు ఒక చిన్న కుక్కపిల్లని పట్టుకోని కొడ్తా కనబన్నాడు.

అది చూసి ఆ పిల్లోడు అయ్యోపాపమని జాలిపడి వురుక్కుంటా వాని దగ్గరికి పోయి "ఎందుకట్లా చిన్నపిల్లని పట్టుకోని కొడ్తా వున్నావ్" అనడిగినాడు. దానికి వాడు కోపంగా "ఈ దొంగసచ్చినేది మా ఇంట్లో జొరబడి మా కోసం వండుకున్న అన్నమంతా నున్నగా తినేసింది. అందుకే కొడ్తా వున్నా" అని చెప్పినాడు.

దాన్ని ఎట్లా తప్పించాలబ్బా అని ఆలోచిస్తా వుంటే ఆ పిల్లోనికి వాళ్ళమ్మ ఇచ్చిన వంద రూపాయలు గుర్తుకొచ్చినాయి. దాంతో "నాకాడా వంద రూపాయలున్నాయి. అవి తీసుకోని దాన్ని విడిచిపెడతావా" అనడిగినాడు. వాడు సరే అన్నాడు. వెంటనే ఆపి ల్లోడు వానికి వంద రూపాయలిచ్చేసి ఆ కుక్కపిల్లని తీసుకోని సంబరంగా ఇంటికి పోయినాడు.

ఈసారి గూడా బియ్యం తెమ్మంటే తేకుండా కుక్కపిల్లని తెచ్చేసరికి వాళ్ళమ్మకు తెగ కోపమొచ్చేసింది. ఆమె దగ్గర ఇంగ డబ్బుల్లేవు గదా, దాంతో ఏడుస్తా "ఇంగ నేను బియ్యమెక్కన్నించి తేవాల, అన్నమెట్లా వండాల" అని వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ఇంట్లో నుండి బైటకు దొబ్బేసింది.

అది చూసిన ఆ పాముపిల్ల నెమ్మదిగా వాని దగ్గరకు పోయి "మావల్లనే గదా నీకిన్ని కష్టాలు. నీ కష్టాలన్నీ తీరే వుపాయం చెబ్తా, మా నాయన నాగరాజు. ఈ అడవిలో ఒక పాడుబన్న గుడుంది. దాని పక్కనే మా ఇండ్లు. నేను బైటకొచ్చి ఆడుకుంటా వుంటే యాన్నుంచొచ్చినాడో గానీ వాడు లటుక్కున నన్ను పట్టేసుకున్నాడు. నా కోసం మా అమ్మా నాయనా ఎంత వెదుకుతా వున్నారో ఏమో... నాకు ఆ గుడి దగ్గరికి ఎట్లా పోవాలో తెలీదు. నువ్వు గనుక ఎట్లాగైనా నన్ను ఆడికి తీసుకోనిపోతే మా నాయనకు చెప్పి నీకు కావాల్సినంత బంగారం ఇప్పిస్తా" అనింది.



కానీ వానికి గూడా అడవిలో ఏది యాడుందో తెలీదు. దాంతో ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే కుక్కపిల్ల తోకూపుకుంటా వాని దగ్గరకొచ్చి “నాకు ఆ అడవంతా బాగా తెలుసు. నా ఎంబడొస్తే ఆ పాడుబన్న గుడి యాడుందో నేను చూపిస్తా” అనింది. దాంతో సరే అని కుక్క ముందు దారి చూపిస్తా వుంటే పాముా, పిల్లీ, వాడు దాని వెనకాలనే పోయినారు. అట్లా ఒక ఐదారు గంటలు అడవిలో బాగా నడిచినాక ఆ గుడి కనబడింది.

పాముపిల్ల సంబరంగా పాక్కుంటా గుడి పక్కనే వున్న వాళ్ళ పుట్ట కాడికి పోయి “నాయనా! నాయనా! బైటకు రా” అంటా గట్టిగా పిలిచింది. ఆ పిలుపింటానే నాగరాజు వురుక్కుంటా వచ్చి జరిగినదంతా తెలుసుకోని సంబరంగా వాళ్ళందరినీ నాగలోకానికి తీసుకోనిపోయినాడు. చాలుచాలన్నా వినకుండా పెట్టినేటివి పెట్టకుండా రకరకాల తినుబండారాలు పెట్టినాడు. తిరిగి పోయేటపుడు వానికి ఒక వుంగరమిచ్చి “ఇది మామూలు వుంగరం కాదు. చానా మహిమ గల వుంగరం, నువ్వేమయినా కోరుకోని దీన్ని ముద్దు పెట్టుకోడం ఆలస్యం అడిగినవన్నీ అరక్షణంలో నీ ముందుంటాయి” అని చెప్పినాడు. వాళ్ళు ఆనందంగా ఇంటికి బైలుదేరినారు.

అట్లా తిరిగి వస్తా వుంటే దారిలో ఒకచోట ఒక చిన్న చెరువు కనబడింది. దాన్ని చూస్తానే వానికి దాంట్లో ఈత కొట్టాలనిపించింది. వెంటనే వాడూ, కుక్కా, పిల్లీ నీళ్ళలో దిగి ఒకరి మీద ఒకరు నీళ్ళు చల్లుకుంటా బాగా ఆడుకున్నారు. అట్లా ఆడుకుంటా వుంటే అనుకోకుండా వాని ఏలికున్న వుంగరం కాస్తా నీళ్ళలో జారి పడిపోయింది. ఎంత వెదికినా దొరకలేదు. దాంతో వాడు ఏడుస్తా వుంటే పిల్లి “నీ వుంగరం యాడికీ పోదులే. నేను వెదికి తెస్తా” అని చెప్పి చెరువు లోనికి దూకి దొరికిన చేపను దొరికినట్టు కొరికి కొరికి పెట్టడం మొదలుపెట్టింది. పిల్లిని చూసి కుక్క కూడా అట్లాగే చేయసాగింది.

దాంతో ఆ చెరువులోని చేపలన్నీ వాటి దగ్గరకొచ్చి “మేం ఏం పాపం చేసినామని మమ్మల్నిట్లా కొరికి కొరికి పెడ్తా వున్నారు” అనడిగినాయి. అప్పుడా పిల్లి “ఈ చెరువులో మేం ఆడుకుంటా వుంటే మా వుంగరమొకటి యాన్నో పడిపోయింది. దాన్ని వెదికి తెచ్చిస్తే మిమ్మల్ని ఏమీ చేయం” అనింది. సరేనని ఆ చేపలు ఆ మూల నుండి ఈ మూల వరకు చెరువునంతా అంగుళం గూడా వదలకుండా కిందికీ, మీదికీ వెదికి ఆఖరికి వుంగరాన్ని దొరికిచ్చుకోని తెచ్చిచ్చినాయి.

వాడు ఆనందంగా వుంగరాన్ని వేలికి తొడుక్కోని పిల్లినీ, కుక్కనీ తీసుకోని వురుక్కుంటా వాళ్ళమ్మ దగ్గరికి పోయి జరిగిందంతా చెప్పి వుంగరమిచ్చినాడు. అప్పట్నించీ వాళ్ళు ఆ ముద్దుంగరంతో కావల్సినవన్నీ తెచ్చుకుంటా హాయిగా వున్నారు.

# 40 సముద్రంలో నీళ్ళు ఉప్పగా ఎందుకుంటాయంటే?

ఒక ఊరిలో ఇద్దరు అన్నదమ్ములు వుండేటోళ్ళు. వాళ్ళవి పక్కపక్క ఇళ్ళు. అయినా వాళ్ళ నడుమ పలకరింపులు వుండేటివి కాదు. తమ్ముడేమో చానా పేదోడు. తినడానికి తిండి గూడా వుండేది కాదు. కానీ అన్న చానా ధనవంతుడు. పెద్ద బంగళా కట్టుకోని హాయిగా కాలుమీద కాలేసుకోని బతుకుతా వుండేటోడు. తమ్ముడు తినడానికి తిండి లేక బాధపడతా వున్నా ఒక్కపైసా గూడా విదిలిచ్చేటోడు కాదు.

ఆ ఊరి పక్కన ఒక పెద్ద సముద్రం వుండేది. ఆ సముద్రంలోని నీళ్ళు బాగా చప్పగా వుండేవి. చుట్టుపక్కల వూళ్ళలోని జనాలంతా ఆ నీళ్ళను తాగుతా, స్నానం చేస్తా, ఆ నీళ్ళలోని చేపలు పట్టుకుంటా, పంటలు పండించుకుంటా హాయిగా వుండేటోళ్ళు.

ఒకసారి తమ్ముడు తినడానికి తిండి లేక చేపలన్నా పట్టుకోనొద్దామని పడవ తీసుకోని సముద్రంలోనికి పోయినాడు. పొద్దున్నుంచీ సాయంత్రం వరకూ వేటాడినాడు గానీ వలలో ఒక్క చేప గూడా పల్లేదు. ఇంటికి పోతే పెండ్లాం పిల్లలకు ఏమని చెప్పాల్నో అర్థం కాలేదు. దాంతో ఏమైనా సరే చేపలు పట్టే ఇంటికి పోవాలని రాత్రవుతున్నా సరే అలాగే చీకటిలో వల వేయసాగినాడు.

అలా వేటాడుతా వుంటే అర్ధరాత్రప్పుడు వలలో ఒక బంగారు రంగు చేప పడింది. "అబ్బ.. ఎంత ముచ్చటగా వుంది ఈ చేప. దీన్ని ఎవరైనా సరే మంచి ధర ఇచ్చి కొంటారు. హాయిగా వారం రోజులు గడిచిపోతాయి" అనుకున్నాడు సంబరంగా. అంతలో ఆ చేప "బాబూ... నన్ను వదులు. నేను నీవనుకుంటున్నట్లు చేపను కాదు. గంధర్వున్ని. హాయిగా సముద్రంలో ఈదుదామని చేపలాగా తయారయి వచ్చినాను" అనింది. పడక పడక ఒక్కచేప పడ్తే అది ఇలాగయిందే అని వాని కళ్ళల్లో నీళ్ళు వచ్చినాయి. అయినా బాధను మనసులోనే దాచుకోని 'అరెరే... పాపం' అంటూ ఆ చేపను వలలోంచి తీసి వదిలేసినాడు.

వెంటనే ఆ చేప గంధర్వునిలా మారిపోయి "బాబూ! నువ్వేం బాధపడకు. ఇకపైన నువ్వెప్పుడూ సంతోషంగా వుండేలా నీకో మంచి బహుమతి ఇస్తా" అంటూ మాయమై మరుక్షణంలో చేతిలో ఒక తిరగలితో ప్రత్యక్షమైనాడు. "చూడు బాబూ... ఇది విసుర్రాయి. దీన్నే కొందరు తిరగలి అని కూడా అంటారు. నువ్వు దీన్ని ముందు పెట్టుకోని

తిరగవే తిరగవే తిరగలీ
నా కోరిక తీరేదాకా తిరగవే"

అంటూ నీకేం కావాలో కోరుకో. మరుక్షణమే తిరగలి తిరగడం మొదలుపెడుతుంది. నీకు కావాల్సినవన్నీ రావడం మొదలవుతాయి. మరలా నీవు

"ఆగవే ఆగవే తిరగలీ

ఇచ్చింది చాలింక ఆగవే"

అనేంత వరకూ తిరగలి తిరుగుతానే వుంటుంది. కానీ జాగ్రత్త. దీని గురించి ఎవరికీ చెప్పొద్దు. నీకు అవసరమయినప్పుడు వాడుకో" అని చెప్పినాడు.

తమ్ముడు సంబరంగా దానిని తీసుకోని ఒడ్డుకు చేరినాడు. ఎవరికీ కనబడకుండా పడవ చాటున కూర్చోని

"తిరగవే తిరగవే తిరగలీ

నా కోరిక తీరేదాకా తిరగవే"

అంటూ బచ్చాలు, కజ్జికాయలు, లడ్లూ... అన్నీ కోరుకున్నాడు. అవన్నీ రాగానే సంబరంగా మూటగట్టుకోని ఇంటికి తీసుకోని పోయినాడు. అందరికీ కడుపు నిండా కావలసినంత పెట్టినాడు.

తరువాతరోజు తమ్ముడు తిరగలి నుంచి కావలసినంత బంగారం, వజ్రాలు తీసుకోని పెద్ద మేడ కట్టించుకొన్నాడు. హాయిగా కాలు మీద కాలేసుకోని బ్రతుకుతా వూరిలోని పేదజనాలను ఆపదలో ఆదుకుంటా ఆనందంగా గడపసాగినాడు.

పక్కనే వున్న అన్న ఇదంతా చూసినాడు. "అరే... వీడు నిన్న మొన్నటి వరకూ తినడానికి తిండి గూడా లేకుండా కడుపు చేతబట్టుకోని తిరుగుతా వుండె. అంతలోనే పదిమందికి పెడతా వున్నాడు. ఇందులో ఏదో రహస్యం వుంది. ఎట్లాగయినా సరే కనుక్కోవాలి" అనుకున్నాడు.

తరువాత రోజు పొద్దున్నే కళ్ళనీళ్ళతో తమ్ముని ఇంటికి చేరి "తమ్ముడూ... తమ్ముడూ... మీ వదినకు ఆరోగ్యం బాగాలేదు. ప్రాణం మీదకు వచ్చింది. పదివేల వరహాలు కావాలి. నువ్వు ఇంతకు ముందున్నవేమీ మనసులో పెట్టుకోవద్దు. ఎట్లాగయినా సర్దు. డబ్బులు చేతికి రాగానే మళ్ళా నీవి నీకు పువ్వుల్లో పెట్టి అప్పగిస్తా" అన్నాడు.



"అయ్యయ్యో... అన్నవై వుండి మరీ ఇంతలా అడగాల్నా... ఇప్పటికిప్పుడు అంటే లేవు. కాసేపున్నాక నేనే మీ ఇంటికొచ్చి ఇస్తాలే" అన్నాడు.

అన్న సరేనని ఆన్నించి పోయినట్టే పోయి ఎవరికీ కనబడకుండా వెనుక నుంచి మరలా లోపలకు వచ్చి దాక్కున్నాడు. ఇదేమీ తెలీని తమ్ముడు గదిలోనికి పోయి తలుపు వేసుకున్నాడు. వెంటనే అన్న కిటికీ కొంచం తెరచి లోపలికి తొంగి చూడసాగినాడు.

తమ్ముడు పెట్టెలో భద్రంగా దాచిపెట్టిన తిరగలి తీసి

"తిరగవే తిరగవే తిరగలీ
నా కోరిక తీరేదాకా తిరగవే"

అంటూ పదివేల వరహాలు కోరుకున్నాడు. అంతే అది తిరుగుతా వుంటే జలజలజల వరహాలు రాలసాగినాయి. అన్న అది చూసి ఆశ్చర్యపోయినాడు. "ఓహో ఇదా సంగతి" అనుకున్నాడు. అక్కడే దాక్కోని తమ్ముడు వరహాలు తీసుకోని బైటకు పోగానే మట్టసంగా లోపలికి దూరి గుట్టుచప్పుడు కాకుండా తిరగలి ఎత్తుకోని పోయినాడు.

ఎవరూ చూడకుండా సముద్రం దగ్గరకి చేరుకున్నాడు. తినడానికి అన్నం పప్పు పెరుగు మూటగట్టుకోని తిరగలి పడవలో పెట్టుకోని నీళ్ళలోకి పోయినాడు. సముద్రం మధ్యకు చేరుకున్నాక "హమ్మయ్య... ఈడయితే ఎవరూ చూడరు. కావలసినవన్నీ కోరుకోని దీన్ని ఈన్నే పారేసి వెళ్ళిపోదాం. ఎవరికీ తెలీకుండా" అనుకున్నాడు.

అంతలో బాగా ఆకలి వేయసాగింది. "సరే" తిన్నాక కోరుకుందాంలే అనుకోని అన్నంలోకి పప్పేసుకోని బాగా తిన్నాడు. తర్వాత పెరుగేసుకున్నాడు. కానీ ఉప్పు లేక చప్పగా అనిపించింది. ఎలాగూ తిరగలి పక్కనే వుంది గదా... ఉప్పుకెంతసేపు అనుకోని

"తిరగవే తిరగవే తిరగలీ
నా కోరిక తీరేదాకా తిరగవే"

అంటూ వుప్పు కావాలని అనుకున్నాడు. అంతే వెంటనే తిరగలి తిరుగసాగింది. ఉప్పు రాసాగింది. కొంచం రాగానే "చాలు చాలు ఇంక చాలు" అన్నాడు. తిరగలి తిరుగుతానే వుంది. ఉప్పు వస్తానే వుంది. "అరెరే... ఇదేంది. ఇలా వస్తా వుంది" అనుకుంటా దాన్ని గట్టిగా పట్టుకొన్నాడు. ఎంత గట్టిగా పట్టుకున్నా అది ఆగకుండా తిరుగుతానే వుంది. ఉప్పు వస్తానే వుంది.

వానికి ఏం చేయాల్నో అర్థం కాలేదు. ఎలా ఆపాల్నో అర్థం కాలేదు. "ఓరినాయనోయ్... దీన్ని ఎలా ఆపాల్రా దేముడా" అని నెత్తీ నోరూ కొట్టుకోసాగినాడు. ఉప్పు గుట్టలు గుట్టలుగా వస్తానే వుంది. నెమ్మదిగా బరువు పెరుగుతున్న కొద్దీ పడవ, పడవతోబాటు వాడూ సముద్రంలో మునిగిపోయినారు. తిరగలి కూడా సముద్రంలో మునిగిపోయింది. ఐనా అది తిరుగుతానే వుంది. ఉప్పు వస్తానే వుంది.

నెమ్మదిగా సముద్రంలోని నీళ్ళన్నీ ఉప్పగా మారడం మొదలు పెట్టినాయి. కొన్ని రోజులకు ఉప్పెక్కువయి ఉప్పుకశంగా మారిపోయినాయి. దానిలో ఎన్ని నదుల నీళ్ళు కలిసినా ఆ ఉప్పుకశం కొంచంగూడా తగ్గడం లేదు. ఇప్పటికీ తిరగలి తిరుగుతానే వుంది. ఉప్పు పెరుగుతానే వుంది.

# 41

# నీలాంటోడు ఊరికొక్కడుంటే చాలు

ఒకూర్లో రామయ్య అని ఒక రైతున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. వాళ్ళలో పెద్దోడు చానా తెలివైనోడు. ఒకసారి రామయ్య పెండ్లాం పిల్లలతో కలసి పక్కూరికి బంధువుల పెళ్ళికి పోవాలనుకున్నాడు. చుట్టుపక్కలోళ్ళు చానామంది ఆ పెండ్లికి పోతావుండడంతో దారిలో అలసట లేకుండా వాళ్ళతో ఆ ముచ్చటా ఈ ముచ్చటా చెప్పుకుంటా పోవచ్చునని రామయ్య కూడా ఆ గుంపులో కలసినాడు. అప్పట్లో రైళ్ళు, బస్సులూ వుండేటివి కాదు గదా... దాంతో అందరూ పొద్దున్నే లేచి కాలినడకన బైలుదేరినారు.

ఆ వూరికి ఈ వూరికి నడుమ ఒక అడవి వుంది. ఆ అడవిలో పోతా వుంటే రామయ్య పిల్లలకు ఒకచోట ఒక మాంచి మాగిన మామిడిపళ్ళ చెట్టు కనబడింది. దాంతో వాళ్ళు ఎవరికీ చెప్పకుండా ఆ చెట్టుకాడికి పోయినారు. గుంపులో పోతావున్న వాళ్ళు అది గమనించలేదు. అట్లాగే పోతా వున్నారు. ఆ పిల్లలు చెట్టెక్కి మంచి మంచి పళ్ళు కోసుకుంటా... కోసుకుంటా... అమ్మనాయనలు ఎంత దూరం పోయినారో చూసుకోలేదు. పండ్లు మూట గట్టినాక దిగి చూస్తే ఇంకేముంది... కనుచూపుమేరలో యాడా ఎవరూ కనబడలేదు. దాంతో చిన్నోడు భయపడి ఏడవడం మొదలుపెట్టినాడు. కానీ పెద్దోడు భయపడకుండా వానికి ధైర్యం చెప్పి వాళ్ళమ్మా నాన్నలను వెదుక్కుంటా బైలుదేరినాడు.

అట్లా పోతా వుంటే వాళ్ళకు ఒకచోట ఒక గాడిద మేత మేస్తా కనబడింది. పెద్దోడు అది చూసి "ఒరేయ్... తమ్ముడూ... పోరా... పోయి మట్టసంగా దాన్ని పట్టుకోని రాపో" అన్నాడు. దానికి తమ్ముడు "అదెందుకన్నా... ఏం పనికొస్తాదది" అన్నాడు. పెద్దోడు నవ్వుతా "రేయ్ మనం ఎంత దూరం నడవాల్నో తెలీదు. ఎటుపక్క పోవాల్నో తెలీదు. ఈ గాడిదన్నా వుంటే నడిచీ నడిచీ అలసట రాకుండా నువ్వు కాసేపు, నేను కాసేపు దాని మీదెక్కి పోవచ్చు" అన్నాడు. తమ్ముడు అలాగేనని వెనుక నుండి పోయి దాన్ని పట్టేసుకున్నాడు.

వాళ్ళు గాడిదను తీసుకోని కొంచం దూరం పోయినాక ఒకచోట ఒక లావు తాడు కనిపించింది. వెంటనే పెద్దోడు "ఒరేయ్ తమ్ముడూ... పో... పోయి ఆ తాడు పట్టుకోని రాపో" అన్నాడు. దానికి తమ్ముడు "అదెందుకన్నా.. ఏం పనికొస్తాదది" అన్నాడు. దానికి పెద్దోడు నవ్వుతా "రేయ్... ఈ లోకంలో పనికిరానిదంటూ ఏదీ వుండదురా... దేని అవసరం దానిదే... అయినా నువ్వు మోసేదుందా, నేను మోసేదుందా... తీసుకోనొచ్చి గాడిద మీద వెయ్... పడుంటాది" అన్నాడు. తమ్ముడు సరేనని ఆ తాడును తీసుకోనొచ్చి గాడిద మీద వేసినాడు.

మళ్ళా వాళ్ళు అట్లా పోతా వుంటే దారిలో ఒకచోట ఒక గడ్డపార పడి వుండడం కనిపించింది. వెంటనే పెద్దోడు "రేయ్... తమ్ముడూ... పోరా... పోయి ఆ గడ్డపార పట్టుకోని రాపో" అన్నాడు. దానికి తమ్ముడు "అదెందుకన్నా... అనవసరమైన బరువు. మనమేమన్నా తవ్వేదుందా... పగలగొట్టేదుందా... ఏం పనికొస్తాదది" అన్నాడు. దానికి పెద్దోడు నవ్వుతా "ఒరేయ్... ఈ అడవిలో ఎప్పుడు దేని అవసరం పడతాదో ఎవరికి తెలుసు.

ఇది వూరు గాదు. పని పడగానే పక్కింటికో ఎదురింటికో పరుగెత్తుకోని పోయి తెచ్చుకోడానికి" అన్నాడు. తమ్ముడు సరేనని దానిని తీసుకోనొచ్చి గాడిద మీద వేసి జారిపోకుండా తాడుతో గట్టిగా కట్టేసినాడు.



అట్లా వాళ్ళు పోతా వుంటే కాసేపటికి చీకటి పడింది. అడవిలో చీకటిలో పోవడం మంచిది కాదుగదా... దాంతో ఎక్కడైనా రాత్రి గడపడానికి మంచి చోటు దొరుకుతుందేమోనని వెదకసాగినారు. వారికి ఒకచోట ఒక పెద్దగుహ కనిపించింది. పెద్దోడు దాన్ని చూసి "ఒరేయ్... మనం ఈ రాత్రికి ఈన్నే పండుకోని రేప్పొద్దున పోదాం" అన్నాడు. సరేనని ఇద్దరూ గుహ లోపలికి పోయినారు. ఒకచోట బాగా శుభ్రం చేసుకోని, పురుగూ పుట్రా రాకుండా మంటేసుకోని, గాడిదను ఒక పక్కగా కట్టేసి పండుకున్నారు.

కానీ... వాళ్ళు పండుకున్న గుహ ఒక పెద్ద రాక్షసునిది. వాడు అన్నానికని బైటకు పోయినాడు. అడవిలో దొరికే పెద్ద పెద్ద జంతువులను పట్టుకోని తిని అర్ధరాత్రప్పుడు తిరిగి వచ్చినాడు. గుహ లోపల వెలుగు చూసి లోపల ఎవరో వున్నారని గ్రహించి "రేయ్... ఎవర్రా లోపల... బైటకు రండి... ఎంత ధైర్యంరా మీకు నా గుహ లోపలికి పోడానికి" అంటూ గట్టిగా కేకలు పెట్టినాడు. ఆ అరుపులకు అన్నదమ్ములిద్దరూ అదిరిపడి లేచినారు. చిన్నోడు భయంతో గజగజా వణికిపోసాగినాడు.

పెద్దోడు వానికి ధైర్యం చెప్పి "అసలు నువ్వెవర్రా... మాంచి నిద్రలో వుంటే పిచ్చి పట్టినట్లు అట్లా అరుస్తా వున్నావ్... నేను గనుక బైటకు వచ్చినాననుకో... కాలి కిందేసి కసకసకస తొక్కుతా చూడు" అని అరిచినాడు లోపలి నుంచే.

ఆ మాటలకు రాక్షసుడు కోపంగా బుసలు కొడతా 'రేయ్... నేను రాకాసిని. నిన్ను నలుచుకోని తింటా" అంటూ మరింత గట్టిగా అరిచినాడు.

ఆ మాటలకు పెద్దోడు ఏ మాత్రం బెదపడకుండా "ఒరేయ్... నువ్వు మనుషులను తినే రాకాసివైతే... నేను రాకాసులనే తినే గీకాసినిరా. ఇప్పుడే ఇద్దరిని తిని అలసిపోయి పడుకున్నా. నేను ఆకలయితే గానీ ఎవరినీ చంపను. కానీ నువ్వు ఇట్లాగే అల్లరి చేస్తే మాత్రం జాగ్రత్త. కరకరకర అప్పడం కదా నమిలి మింగినట్టు మింగుతా చూడు" అని అరిచినాడు.

ఆ మాటలకు రాక్షసుడు అదిరిపన్నాడు. "రాకాసి అంటే తను. మరి గీకాసంటే ఎవరు? అదెట్లాగుంటుంది?? తనకన్నా పెద్దగా భయంకరంగా వుంటుందా??? అసలు గీకాసి అనే మాట తానెప్పుడూ వినలేదు. ఇది నిజమా... అబద్ధమా..." అని ఆలోచించి "సరే... అయితే... నేను నా తల వెంట్రుకను లోపలికి వేస్తా... నీవు నీ వెంట్రుక వేయ్... చూద్దాం ఎవరిది ఎంత పొడుగుంటుందో" అని రాక్షసుడు తల మీద నుంచి ఒక వెంట్రుక పీకి లోపలికి విసిరినాడు.

దానికి పెద్దోడు "ఒరేయ్... నీ తల వెంట్రుక నా మూతి మీది మీసమంత గూడా లేదు. చూడు నా వెంట్రుక" అంటూ తాడు తీసుకోని బైటకు విసిరినాడు.

రాక్షసుడు చీకట్లో ఆ తాడు పట్టుకోని అదిరిపన్నాడు. "ఓరి నాయనోయ్ వీని వెంట్రుకే ఇంత లావు, ఇంత పొడుగు వుందంటే, వీడు మరింకెంత పెద్దగా వుంటాడో ఏమో" అనుకున్నాడు. ఐనా అనుమానం తీరక "సరే... ఐతే నేను నా కోరపన్ను ఒకటి పీకి లోపలికేస్తున్నా. నీవు గూడా నీ కోరపన్ను ఒకటి వేయ్... చూద్దాం... ఎవరిది ఎంత పెద్దగుందో" అంటూ ఆ రాక్షసుడు ఒక కోరపన్ను పీకి లోపలికి విసిరినాడు.

దానికి పెద్దోడు "ఒరేయ్... నీ కోరపన్ను నా చిటికెన వేలు మీది గోరంత కూడా లేదు. చూడు నా కోరపన్ను" అంటూ ఈసారి గడ్డపార బైటకు విసిరినాడు.

రాక్షసుడు చీకటిలో ఆ గడ్డపార పట్టుకొని అదిరిపన్నాడు. "ఓరినాయనోయ్... ఒక పన్నే ఇంత పొడవుండి, ఇంత గట్టిగా వుందంటే మరి వాని నోరు ఇంకెంత పెద్దగా వుంటాదో ఏమో" అనుకున్నాడు. ఐనా అనుమానం తీరక "సరే... ఇంకొక పందెం. నేను గట్టిగా నా బలమంతా వుపయోగించి అరుస్తా... తరువాత నువ్వు అరువు. ఎవరు గట్టిగా అరుస్తారో చూద్దాం" అంటూ నోరంతా తెరిచి గుండెలదిరిపోయేటట్లు గట్టిగా కేకలు పెట్టినాడు.

ఆ అరుపులు వినగానే చిన్నోడు భయంతో పెద్దోనికి అతుక్కోనిపోయినాడు. కానీ పెద్దోడు మాత్రం కొంచం గూడా భయపడకుండా "ఒరేయ్... నేను హాయిగా నిద్రపోతా వుంటే... లేపడమే గాక సారికో పందెం అంటూ విసిగిస్తావా... లాభం లేదు.. వస్తావున్నా కాసుకో... నిన్ను ఒక్క దెబ్బతో చంపి కరకరకరకర నమలకపోతే నా పేరు గీకాసే కాదు" అంటూ గట్టిగా అరుస్తా పక్కనే వున్న గాడిద ముఖమ్మీద ఈడ్చి ఒక్కటి పెరికినాడు.

అంతే... ఆ దెబ్బకు దిమ్మ తిరిగిన గాడిద నొప్పి తట్టుకోలేక గట్టిగా గుహ మారుమ్రోగేలా అరవసాగింది. ఆ అరుపులు విన్న రాక్షసుడు అదిరిపన్నాడు. "ఓరినాయనోయ్... ఇవేం అరుపులురా దేవుడోయ్... చెవులు బద్దలవుతా వున్నాయి. ఈ గీకాసిగానికి దొరికినానంటే అంతే... ఇదే నాకు ఆఖరిరోజు అవుతాది" అనుకోని వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయినాడు.

చిన్నోడు, పెద్దోడు హమ్మయ్య అనుకోని పొద్దున్నే మళ్ళా గాడిద మీదెక్కి వాళ్ళమ్మా నాన్నలను వెదుక్కుంటా బైలుదేరినారు. కొంచం దూరం పోయినారో లేదో వాళ్ళమ్మా నాన్న కళ్ళనీళ్ళు బెట్టుకోని వీళ్ళను వెదుక్కుంటా ఎదురుగా వస్తా వున్నారు. చిన్నోడు, పెద్దోడు వురుక్కుంటా పోయి వాళ్ళను కరుచుకున్నారు. "ఇంగెప్పుడూ మీకు చెప్పకుండా ఎక్కడికీ పోము... తప్పయింది" అంటూ ఆ రాత్రి జరిగిందంతా వాళ్ళకు చెప్పినారు. అందరూ పెద్దోని తెలివితేటలకు, ధైర్యానికి సంబరపడి "శభాష్‌రా పెద్దోడా... నీలాంటోడు వూరికొక్కడున్నా చాలు... అందరూ హాయిగా బతికిపోతారు" అని మెచ్చుకున్నారు.

# 42

# ఒకటి తిందునా... రెండు తిందునా...

ఒకూర్లో రామయ్యని ఒకడుండేటోడు. వాడు చానా అమాయకుడు. అంతేగాదు. చానా బీదోడు కూడా. చానాసార్లు తినడానికి తిండి గూడా లేక వుత్తనీళ్ళు తాగి పస్తులు పండుకునేటోడు. భార్యాపిల్లలకు కనీసం ఒక్క పూటైనా తిండి పెట్టలేక పోయేటోడు. దాంతో బాగా విసిగిపోయి ఎలాగైనా సరే డబ్బు సంపాదిచ్చుకోని రావాలని ఒకరోజు పెండ్లాంతో మూడు రొట్టెలు చేపిచ్చుకోని, దాన్లను మూటగట్టుకోని బైలుదేరినాడు.

అట్లా పోతా పోతా పక్కూరికి చేరుకున్నాడు. ఆడ వానికి సోమయ్యని చిన్ననాటి స్నేహితుడొకడు వున్నాడు. సోమయ్య చూడ్డానికి మంచిగా కనపడ్తాడు గానీ పెద్ద టక్కరోడు. వాడు స్నేహితున్ని చూడగానే “ఏరా... యాడికి బైలుదేరినావు” అనడిగినాడు. దానికి వాడు కళ్ళనీళ్ళు బెట్టుకోని ఇంటి సంగతంతా చెప్పి “ఎట్లాగైనా సరే... డబ్బు సంపాదిచ్చుకోని రావాలని పోతావున్నా” అన్నాడు. దానికి సోమయ్య “అట్లాగా... సరే ఈ పూట మాయింట్లోనే పండుకోని రేప్పొద్దున్నే పో” అన్నాడు.

రామయ్య ఆరోజు రాత్రి ఆన్నే పండుకోని తర్వాత రోజు పొద్దున్నే మళ్ళా బైలుదేరినాడు. కొండలు, వాగులు, గుట్టలు, అడవులు ఒకొక్కటే దాటుకుంటా అర్ధరాత్రి వరకు నడిచినాడు. బాగా నడిచినాడు కదా దాంతో కడుపులో వున్నదంతా అరిగిపోయి బాగా ఆకలేయసాగింది. దారిలో ఒక పెద్ద మర్రిచెట్టు కనబడ్తే తిని పండుకుందామని దాని కిందికి చేరుకున్నాడు.

ఆ మర్రిచెట్టుపైన మూడు దయ్యం పిల్లలున్నాయి. అవి ఒట్టి పిరికివి. వూకె భయపడ్తాయి. రామయ్యని చూసి “ఎవడబ్బా... వీడింత అర్ధరాత్రి పూట ఒక్కడే వచ్చి మన చెట్టు కింద కూర్చున్నాడు. కొంపదీసి మంత్ర తంత్రాలు బాగా తెలిసిన మాంత్రికుడు కాదు గదా” అని అనుమానంగా చూడసాగినాయి. అంతలో రామయ్య మూట విప్పి మూడు రొట్టెలు ముందు పెట్టుకోని వాటినే చూస్తా “ఒకటి తిందునా... రెండు తిందునా... మూడు తిందునా... లేక మొత్తం ఒకేసారి దిగమింగుదునా” అంటూ గట్టిగా ఒక్కరుపు అరిచినాడు.

అంతే... ఆ అరుపు వినేసరికి పైనున్న మూడుదయ్యాలూ అదిరిపడినాయి. అవి ఒట్టి పిరికివి కదా. దాంతో భయపడి “వీడు మామూలు మనిషి కాదు. పెద్ద మంత్రగానిలెక్కున్నాడు. అందుకే ఇంత అర్ధరాత్రి పూట మనల్ని చంపడానికి ఒక్కడే వచ్చినాడు” అనుకోని గజగజా వణికిపోతా దభీమని వాని కాళ్ళ మీద పడి “మమ్మల్నేం చేయొద్దు. నువ్వేం కావాలంటే అదిస్తాం. మమ్మల్ని విడిచిపెట్టు” అని ఏడ్చసాగినాయి. దయ్యాలను చూసేసరికి రామయ్యక్కూడా భయమేసి గజగజా వణికిపోయినాడు. కానీ.. అవి కాళ్ళు పట్టుకోని ఏడుస్తా వున్నాయి గదా.

దాంతో లేని ధైర్యం తెచ్చుకోని వాటిని కోపంగా చూస్తా "నాకు బాగా డబ్బు కావాలి. వెంటనే తెచ్చియ్యండి. లేకపోతే మీ ముగ్గుర్నీ ఇక్కడికిక్కడే గుటుక్కున మింగేస్తా" అన్నాడు.

అవి సరేనని వెంటనే ఆన్నించి మాయమై క్షణాల్లో ఒక ఆవుతో తిరిగి ప్రత్యక్షమైనాయి. ఆ ఆవును వానికిస్తా "ఇది మామూలు ఆవు కాదు. ఇది పెండేస్తే దాని లోపల వజ్రాలు, రత్నాలు, బంగారు వరహాలు వుంటాయి. దీన్ని తీస్కోని మమ్మల్ని విడిచిపెట్టు" అన్నాయి. వాడు సరేనని ఆవును తీసుకోని తిరిగి వూరికి బయలుదేరినాడు. అలా మళ్ళా కొండలు, గుట్టలు, వాగులు, వంకలు ఒకొక్కటే దాటుకుంటూ... దాటుకుంటూ.. రాత్రయ్యేసరికి వాని స్నేహితుని వూరు చేరుకున్నాడు. సోమయ్య రామయ్యని చూస్తూనే "రా... రా... నీ కోసమే ఎదురుచూస్తా వున్నా... నువ్వు పోయిన పనేమైంది" అనడిగినాడు. వాడు సంబరంగా జరిగిందంతా చెప్పినాడు. "అలాగా! ఐతే ఇన్నాళ్ళకు నీ కష్టాలు తీరిపోయినాయన్న మాట. సరే ఇంత రాత్రిపూట మీ వూరికి ఏం పోతావుగానీ ఈ రోజు ఈన్నే పండుకోని రేప్పొద్దున్నే పో" అంటూ వానికి బాగా మంచి మంచి పిండివంటలు చేపిచ్చి పెట్టినాడు. వాడవన్నీ బాగా తిని హాయిగా నిద్రపోయినాడు.

రామయ్య అట్లా నిద్రపోయినాడో లేదో దాని కోసమే కాసుకోనున్న సోమయ్య వెంటనే పెరట్లోకి పోయినాడు. అప్పటికే ఆ ఆవు బాగా పేడేసింది. చూస్తే ఇంగేముంది దాన్నిండా బంగారం, వరహాలు, వజ్రాలు, రత్నాలు ధగధగా మెరిసిపోతా కనబన్నాయి. వెంటనే సోమయ్య దాన్ని తోల్కోనిపోయి ఎవరికీ కనబడకుండా దాచిపెట్టి, అచ్చం అట్లాగే వున్న మరొక ఆవును తీస్కోనొచ్చి ఆడ కట్టేసి ఏమీ ఎరుగని అమాయకుని లెక్క మట్టసంగా నిద్రపోయినాడు.

పొద్దున్నే రామయ్య నిద్ర లేచి పోయొస్తానని స్నేహితునికి చెప్పి ఆవును తోల్కోని ఇంటికి పోయినాడు. పెళ్ళాన్ని పిలిచి "ఒసేవ్.. ఇది మామూలు ఆవుగాదు. పెండేస్తే దాన్నిండా రత్నాలు, వజ్రాలు, మణులు, మాణిక్యాలు వుంటాయి. దీనికి బాగా మేతేసి మేపు. ఇక మన కష్టాలన్నీ తీరినట్లే" అన్నాడు. "అట్లాగే" అని ఆమె దానికి బాగా మేతేసింది. తర్వాత రోజు పొద్దున్నే ఆవు గంప నిండా పెండేసింది. రామయ్య సంబరంగా బెరబెరా పెండంతా వెదికినాడు. అది అసలావు కాదు గదా. అందుకే వానికి ఎంత వెదికినా ఏమీ దొరకలేదు. దాన్తో వాడు దయ్యాలే తనని మోసం చేసినాయనుకోని కోపంగా మళ్ళా మూడురొట్టెలు మూట కట్టిచ్చుకోని నడుస్తా నడుస్తా కొండలు, గుట్టలు, వాగులు, వంకలు ఒకొక్కటే దాటుకుంటా.. దాటుకుంటా.. అర్ధరాత్రయ్యేసరికి ఆ మర్రిచెట్టు కిందికి చేరుకున్నాడు. దయ్యాలు వాన్ని పైనుండి చూసి "ఇదేందబ్బా.. వీడు మళ్ళా వచ్చినాడు" అనుకోని భయపడతా వుంటే అంతలో వాడు గట్టిగా "ఒకటి తిందునా.... రెండు తిందునా... మూడు తిందునా... లేక మూడింటినీ ఒకేసారి దిగమింగుదునా" అంటూ గట్టిగా ఒక్కరుపు అరిచినాడు. అంతే.. అవి మూడు గజగజా వణికిపోతా కిందికి వచ్చి "నువ్వు కోరుకున్నట్టే నీకు ఆవిస్తిమి గదా. ఎందుకు మళ్ళా వచ్చినావ్" అనడిగినాయి. దానికి వాడు కోపంగా "నన్నే మోసం చేస్తారా... ఆ ఆవు పేడలో ఒక్క వరహా కూడా లేదు" అన్నాడు. దాంతో ఆ మూడు దయ్యాలూ "యాడనో... ఏదో... పొరపాటు జరిగినట్లుంది. ఈ ఒక్కసారికి మన్నించు" అంటూ ఆన్నించి మాయమై క్షణాల్లో ఒక విసుర్రాయితో తిరిగి ప్రత్యక్షమై "ఇది మామూలు విసుర్రాయి కాదు. దీన్ని తిప్పుతా వుంటే నువ్వేమి కోరుకుంటే అవి దీన్లోంచి బైటకొస్తాయి. ఇది తీస్కోని మమ్మల్ని వదిలెయ్"

అని ప్రాధేయపన్నాయి. వాడు సరేనని దాన్ని తీసుకోని కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, ఒకొక్కటే... దాటుకుంటా రాత్రయ్యేసరికి వాని స్నేహితుని వూరికి చేరుకున్నాడు.

రామయ్యను చూస్తానే సోమయ్య "దా... దా... ఏమి ఇట్లా వచ్చినావు" అనడిగినాడు. వాడమాయకంగా జరిగిందంతా చెప్పినాడు. "అట్లాగా... ఐతే ఆ దయ్యాలు నిన్ను మోసం చేసినాయన్నమాట... సరేలే ఏమైతేనేం ఇప్పటికన్నా నీ కష్టాలు తీరినాయి. అదే చాలు. ఈరోజు ఈన్నే పండుకోని రేప్పొద్దున్నే పో" అంటూ వానికి బాగా మంచి మంచి పిండివంటలు చేపిచ్చి పెట్టినాడు. వాడవన్నీ బాగా తిన్నాడు. సోమయ్యే అసలు దొంగ అని వానికి తెలీదు కదా... అందుకని హాయిగా నిద్రపోయినాడు.

వాడట్లా నిద్రపోయినాడో లేదో... దాని కోసమే కాసుకోనున్న సోమయ్య వెంటనే లేచి ఆ విసుర్రాయి దగ్గరకు పోయి నాకు బంగారం కావాల అంటూ తిప్పసాగినాడు. అంతే కుప్పలు కుప్పలు బంగారం దాంట్లోంచి రాసాగింది. ఎట్లాగైనా సరే దాన్ని కొట్టేయాలనుకోని ఎవరికీ కనబడకుండా దాన్ని దాచిపెట్టి అచ్చం అట్లాగే వున్న మరొక విసుర్రాయిని తీసుకోనొచ్చి ఆడపెట్టి, ఏమీ ఎరుగని అమాయకునిలెక్క మట్టసంగా నిద్రపోయినాడు.

పొద్దున్నే రామయ్య నిద్ర లేచి పోయొస్తానని స్నేహితునికి చెప్పి విసుర్రాయిని తీసుకోని ఇంటికి పోయినాడు. పెళ్ళాన్ని పిల్చి "ఒసేవ్... ఇది మామూలు విసుర్రాయి కాదు. దీన్ని తిప్పుతా మనం ఏం కోరుకుంటే అవి వస్తాయి" అంటూ ఆమెను కూచోబెట్టుకోని "నాకు వజ్రాలు కావాల... రత్నాలు కావాల" అంటూ తిప్పసాగినాడు. అది దయ్యాలిచ్చిన విసుర్రాయి కాదు కదా... దాంతో తిప్పీ తిప్పీ చేతులు నొప్పి పెట్టినాయే గానీ దాంట్లోంచి ఏమీ రాలేదు. దాంతో వాడు మళ్ళా దయ్యాలు మోసం చేసినాయనుకోని "ఈసారి దాన్ల అంతు చూసొస్తా" అంటూ కోపంగా మూడు రొట్టెలు మూటగట్టించుకోని నడుస్తా నడుస్తా అర్ధరాత్రికంతా మళ్ళా ఆ మర్రిచెట్టు కిందికి చేరుకున్నాడు.

చెట్టు మీదున్న దయ్యం పిల్లలు వాడు మళ్ళా వచ్చేసరికి అదిరిపడినాయి. "ఇదేందిరా వీడిట్లా మళ్ళా మళ్ళా వస్తా వున్నాడు. మనల్ని హాయిగా బతకనిచ్చేటట్లు లేడే" అనుకొన్నాయి. అంతలో వాడు చెట్టు కింద కూచోని "ఒకటి తిందునా... రెండు తిందునా... మూడు తిందునా... లేక మూడింటినీ ఒకేసారి దిగమింగుదునా" అంటూ గట్టిగా ఒక్కరుపు అరిచినాడు. అంతే ఆ మూడూ భయంతో గజగజా వణుకుతా కిందికి దిగొచ్చి "నీవు అడిగిందల్లా ఇచ్చినాము గదా.. మళ్ళా ఎందుకొచ్చినావు" అనడిగినాయి. దానికి వాడు కోపంగా "మీకు నేను ఏమీ తెలీని ఎర్రోనిలెక్క కనబడ్తా వున్నానా... మాటిమాటికీ మోసం చేస్తావున్నారు. ఆ పనికిమాలిన విసుర్రాయి ఎంత తిప్పినా ఏమీ రావడం లేదు. ఈసారి గనుక మోసం చేసినారనుకో మిమ్మల్ని చంపకుండా వదలను" అన్నాడు.

అప్పుడా మూడు దయ్యాలు బాగా ఆలోచించి "ఎక్కడో ఏదో మోసం జరుగుతా వుంది" అనుకోని ఈసారి ఒక మంచి దుడ్డుకర్ర తెచ్చి "ఇది నీ మాట తప్ప ఎవరి మాటా వినదు. నువ్వేం కోరుకుంటే అది తెచ్చిస్తాది. దీన్ని తీస్కోనిపో" అనిచ్చినాయి.

వాడు ఆ దుడ్డుకర్ర తీసుకోని కొండలు, గుట్టలు, వాగులు, వంకలు ఒకొక్కటే దాటుకుంటా... దాటుకుంటా... రాత్రయ్యేసరికి వాని స్నేహితుని వూరికి చేరుకున్నాడు.



రామయ్యను చూస్తానే సోమయ్య "దా... దా... ఏమి మళ్ళా ఇట్లా వచ్చినావు" అనడిగినాడు. దానికి రామయ్య "ఆ దొంగసచ్చినేవి మళ్ళా మోసం చేసినాయి" అంటూ జరిగిందంతా చెప్పినాడు. అంతా విన్న సోమయ్య "సర్లే... ఐపోయిందేదో ఐపోయింది. ఇప్పట్నించన్నా నీ కష్టాలు గట్టెక్కుతే అదే చాలు. ఇంత రాత్రి ఏం పోతావు గానీ ఈన్నే పండుకోని రేప్పొద్దున పో" అన్నాడు. సోమయ్య మోసగాడని వానికి తెలీదు గదా అందుకే సరేనని వాడు పెట్టినవన్నీ బాగా తిని హాయిగా నిద్రపోయినాడు.

వాడట్లా నిద్రపోయినాడో లేదో... దాని కోసమే కాసుకోనున్న సోమయ్య వెంటనే లేచి ఆ దుడ్డుకర్ర తీసుకోని "నాకు వజ్రాలు కావాల.... రత్నాలు కావాల" అంటూ గాల్లో తిప్పసాగినాడు. అంతే... అది రామయ్య మాట తప్ప ఎవరి మాటా వినదు గదా... అందుకే వెంటనే ఒక్కసారిగా గాల్లోకెగిరి వాన్ని కిందా మీదా పడేసి దభీదభీమని తన్నసాగింది. ఆ దెబ్బలకు తట్టుకోలేక వాడు "అమ్మో... నాయనో..." అని అరుస్తా వుంటే రామయ్య ఆ అరుపులకు అదిరిపడి నిద్రలేసినాడు. చూస్తే ఇంగేముంది... దుడ్డుకర్ర సోమయ్యను తన్నినచోట తన్నకుండా పొర్లిచ్చి పొర్లిచ్చి తంతా వుంది.

సోమయ్య కిందా మీదా పడతా వచ్చి రామయ్య కాళ్ళు పట్టుకోని ఏడుస్తా "మిత్రమా... నన్ను మన్నించు. నీ ఆవు, విసుర్రాయి నేనే కొట్టేసినా. తప్పయిపోయింది. దీన్ని ఆగమని చెప్పు. నా ప్రాణాలు పోయేటట్లున్నాయి" అన్నాడు. అప్పుడు రామయ్య "ఆగు" అంటూనే దుడ్డుకర్ర ఆగిపోయింది. సోమయ్య కుంటుకుంటా పోయి ఆవు, విసుర్రాయి మట్టసంగా తెచ్చిచ్చినాడు. రామయ్య అవన్నీ తీస్కోని సంబరంగా ఇంటికి చేరుకున్నాడు.

# 43 పిట్టపిల్లా సముద్రుడు

ఒకూరి పక్కన ఒక పెద్ద సముద్రముండేది. ఆ సముద్రం ఒడ్డునే ఒక పెద్ద కొబ్బరిచెట్టు వుండేది. దాని మీద ఒక బుల్లిపిట్ట గూడు కట్టుకోనింది. అది రోజూ అక్కడుండే చిన్నచిన్న పురుగులనూ, గింజలనూ తింటా సంతోషంగా దారిలో కనపన్న అందరినీ కిచకిచమని పలకరిస్తా హాయిగా వుండేది.

కానీ అనుకోకుండా దానికి ఒక పెద్ద కష్టమొచ్చి పడింది. అదుండేది సముద్రం పక్కనే గదా. ఆ సముద్రానికి ఒక రాజున్నాడు. వానికి నన్నెవడూ ఏమీ చేయలేడని భలే పొగరు. పిట్టపిల్ల సంబరంగా వుంటే చూల్లేక, ఎట్లాగైనా సరే దాన్ని ఏడిపియ్యాలనుకున్నాడు.

బుల్లిపిట్ట ఒకరోజు నాలుగు గుడ్లు పెట్టింది. ఆ గుడ్లు పగిలిపోకుండా దాన్ల కింద మెత్తని ఆకులు పరచింది. ఎప్పుడెప్పుడు గుడ్లు పగులుతాయా ఎప్పుడెప్పుడు పిల్లల్ని చూద్దామా అని ఎదురు చూడసాగింది.

ఒకరోజు అది ఆహారం కోసం బైటకి పోయింది. పిట్టపిల్ల అట్లా బైటకి పోవడం ఆలస్యం... దాని కోసమే ఎదురు చూస్తా వున్న సముద్రుడు రక్కున బైటకొచ్చి ఆ నాలుగు గుడ్లు మట్టసంగా ఎత్తుకోనిపోయినాడు. పిట్టపిల్ల తిరిగొచ్చి చూస్తే ఇంకేముంది... గుడ్లు లేవు. పాపమా పిట్ట బాధతో విలవిలలాడిపోయింది. గుడ్లు ఎవరెత్తుకుపోయినారో తెలీక కళ్ళనీళ్ళు బెట్టుకోనింది.

ఆ రోజు నుండీ పిట్టపిల్ల ఎన్నిసార్లు గుడ్లు పెట్టినా ప్రతిసారీ సముద్రుడు దొంగచాటుగా వచ్చి వాటిని ఎత్తుకోని పోవడం మొదలుపెట్టినాడు. పిట్టపిల్ల ఆలోచించీ, ఆలోచించీ... ఇట్లాగైతే లాభం లేదు... ఎవరెత్తుకుపోతున్నారో కనుక్కోవాలనుకోని ఒకరోజు మేతకు పోయినట్లే పోయి ఒక చిన్న బండరాయి చాటున దాక్కోని చూడసాగింది. పిట్టపిల్ల లేదనుకొన్న సముద్రుడు బైటకొచ్చి మట్టసంగా అన్నీ తీస్కోని వెళ్ళిపోయినాడు.

పిట్టపిల్లకు సముద్రుని మీద చానా కోపమొచ్చింది. ఎట్లాగైనా సరే సముద్రునికి బుద్ధి చెప్పాలనుకోని ఒకొక్క చుక్కా నీటిని ముక్కుతో తీసుకోనొచ్చి బైట పోయసాగింది. సముద్రమంటే మాటలా... చానా చానా పెద్దగుంటాది కదా. దానికేమైతాది. అందుకే అది చూసి సముద్రుడు పకపకపక నవ్వుకోసాగినాడు.

పిట్టపిల్ల మాత్రం పట్టువదల్లేదు. రోజులు పోయి, నెలలు పోయి, సంవత్సరం దాటింది. ఐనా పిట్టపిల్ల ఏ మాత్రం అలసిపోకుండా రాత్రీ పగలూ ఒక్కొక్క చుక్కా తీసుకోనొచ్చి బైటపోయసాగింది.

ఒకరోజు ఒక ముసిలోడు సముద్రం ఒడ్డు మీద పోతా పోతా పిట్టపిల్ల పడతావున్న కష్టం చూసి అయ్యో పాపం అని జాలిపడి "ఏమే... పిట్టపిల్లా ఎందుకట్లా కష్టపడతా వున్నావ్. ఏంది నీ బాధ" అనడిగినాడు. పిట్టపిల్ల కళ్ళ నిండా నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా జరిగిందంతా చెప్పింది.



అప్పుడా ముసిలోడు "సముద్రమంటే మాటలు గాదు. నువ్వెన్ని సంవత్సరాలయినా వాన్నేమీ చేయలేవు. అందుకే వాడు గూడా నిన్ను లెక్కపెట్టడం లేదు. ఈ వూరిని పాలించే రాజు దగ్గరకుపో. ఆయన చానా మంచోడు. తప్పకుండా నీకు సాయం చేస్తాడు" అని చెప్పినాడు.

పిట్టపిల్ల ఎగురుకుంటా... ఎగురుకుంటా.... రాజు దగ్గరకు పోయి జరిగిందంతా చెప్పింది. అది విన్న రాజు జాలిపడి "నీవు చిన్నదానివని ఏమీ చేయలేవనే గదా వానికంత పొగరు. నువ్వేమీ బాధపడొద్దు. నేను నీకు సాయం చేస్తా. వాని అంతు చూద్దువు గానీ" అని మాటిచ్చినాడు.

తర్వాత రోజు పొద్దున్నే వడ్రంగులందర్నీ పిలిపించి పెద్దపెద్ద రెక్కలున్న చెక్క పక్షుల్ని చేసి, అవి గాలిలో ఎగురుతా వేగంగా రెక్కలూపేటట్లు యంత్రాలు అమర్చమన్నాడు. వాళ్ళు సరేనని రాత్రింబగళ్ళు కష్టపడి ఓ నెలరోజుల్లో లెక్కలేనన్ని చెక్క పక్షుల్ని చేసిచ్చినారు. రాజు అవన్నీ పిట్టపిల్లకు ఇచ్చినాడు.

పిట్టపిల్ల అవన్నీ తీస్కోని పోయి సముద్రం మీద వదిలింది. అవి రాత్రనకా పగలనకా సముద్రం మీద చేరి వేగంగా రెక్కలూపడం మొదలుపెట్టినాయి. అంతే ఆ దెబ్బకు నీళ్ళు ఆవిరి కాసాగినాయి. అది చూసి సముద్రుడు "ఎంతలే... రెండ్రోజులు వూపీ.... వూపీ... అలసిపోయి అవే వెళ్ళిపోతాయి" అనుకున్నాడు. కానీ అలసిపోవడానికి అవి మామూలు పక్షులు కాదు గదా. యంత్రాలు. అదీగాక ఒకటిగాదు. రెండు కాదు... లెక్కలేనన్ని వున్నాయి. దాంతో చూస్తుండగానే సముద్రంలో నీళ్ళు సగానికి సగం తగ్గిపోయినాయి.

దాంతో సముద్రుడు అదిరిపన్నాడు. ఇట్లాగే చూస్తా వుంటే కొన్ని రోజులకు ఒక్క చుక్క నీళ్ళు గూడా మిగలవని అర్థమైంది. దాంతో వురుకులు పరుగుల మీద గసబెట్టుకుంటా బైటకొచ్చి పిట్టపిల్ల కాళ్ళ మీద పడినాడు. "ఇంకెప్పుడూ ఎవరి జోలికీ వెళ్ళననీ, బుద్ధిగా వుంటాననీ, ఈ ఒక్కసారీ క్షమించమని" వేడుకొన్నాడు. అంతవరకూ తానెత్తుకుపోయిన గుడ్లన్నీ మట్టసంగా గంపలో పెట్టి తీసుకోనొచ్చి ఇచ్చినాడు. అప్పుడా పిట్టపిల్ల చెక్కపక్షులన్నింటినీ పంపిచ్చేసి, తన గుడ్లతో సంతోషంగా గూడు చేరుకోనింది.

# 44 కిర్రు కిర్రు లొడ్డప్పా

ఒకూర్లో ఒకడుండేటోడు. వానికి చిన్నప్పన్నించీ అన్ని పనులూ లొడ్డచేత్తో చేయడం అలవాటు. దాంతో అందరూ వాన్ని లొడ్డప్పా... లొడ్డప్పా... అని అడ్డపేరు పెట్టి ఎగతాళి చేసేటోళ్ళు. కానీ ఎవరన్నా తనను అట్లా ఎగతాళి చేస్తే చాలు వాడు కోపంతో కుతకుతలాడి పోయేటోడు. పోట్లాటకు దిగేటోడు.

ఒకరోజు వాడు చేనుకి పోతాపోతా పెండ్లాన్ని పిల్చి "ఒసేవ్... అంబలిపొద్దుకంతా చద్ది కట్టుకోని చేనుకాడికి రా!" అని చెప్పి పోయినాడు. సరేనని ఆమె మాంచి మసాలా వేసి ఘుమఘుమలాడేలా కోడికూర వండి మొగుని కోసం పొలానికి తీసుకోని వెళ్ళింది. మొగుడు పొలంలో దూరంగా దున్నుతా కనబన్నాడు. పెండ్లాం వచ్చింది చూల్లేదు. ఆమె 'ఓయ్' అని పిలిచింది. దూరంగా వున్నాడు గదా... వానికి వినబల్లేదు. అలాగే దున్నసాగినాడు. ఆమె మళ్ళా గట్టిగా 'ఓ... ఓ... య్....' అని పిలిచింది. వూహు... వాడు వులకలేదు, పలకలేదు.

ఎన్నిసార్లు పిల్చినా పలకకపోయేసరికి ఆమె కోపంగా "ఏయ్... లొడ్డప్పా" అని గట్టిగా ఒక్కరుపు అరిచింది. 'లొడ్డప్పా' అనే మాట వినబడగానే వాడదిరిపడి "ఎవరబ్బా! తననలా పిల్చింది" అని కోపంగా తిరిగి చూసినాడు. చూస్తే ఇంగేముంది గట్టు మీద పెండ్లాం కనబడింది. వాడు కోపంతో కుతకుతలాడిపోతా "నా పెండ్లానివి. నన్నే లొడ్డప్పా అని పిలుస్తావా వుండు నీ పని చెబ్తా" అంటూ కట్టె తీసుకోనొచ్చి ఆమె నెత్తిన ఒక్కటేసినాడు. అంతే... ఆ దెబ్బకు ఆమె తల పగిలి అక్కడికక్కడే చచ్చిపోయింది. వాడు బెదపడిపోయి చుట్టూ చూసినాడు. ఎవరూ కనబల్లేదు. "హమ్మయ్య! నేను చంపింది ఎవరూ చూల్లేదులే" అనుకుంటా బెరబెరా గుంత తీసి శవాన్ని బూడ్చేసి ఏమీ ఎరుగని అమాయకునిలెక్క ఇంటికొచ్చేసినాడు.

నాలుగైదు రోజులు గడిచిపోయినాయి. వాని పెండ్లాం కనబడకపోవడంతో ఎదురింటోళ్ళు, పక్కింటోళ్ళు "ఏరా...నీపెండ్లాం కనబడ్డం లేదు. యాడికి పోయింది" అనడగసాగినారు. దానికి వాడు "వాళ్ళ వూరిలో తిర్నాలంట. అది చూద్దానికి వాళ్ళ పుట్టింటికి పోయింది. ఒక నెలదాకా తిరిగిరాదు" అని చెప్పసాగినాడు.

నెమ్మదిగా నెల ఐపోయింది. రెండు నెలలు ఐపోయినాయి. ఐనా ఆమె తిరిగిరాలా. దాంతో జనాలకు అనుమానమొచ్చింది. కనబడినోడల్లా "ఏరా నెలకు వస్తాదంటివి. రెండు నెలలు దాటి పోయినా ఇంకా నీ పెండ్లాం రాలేదేమి" అనడగసాగినారు. దానికి వాడు "ఏం చెయ్యమంటారన్నా అది ఈ వూరికి రానేరాదంట. నన్నే ఇళ్ళూ, పొలాలు అన్నీ అమ్ముకోని వాళ్ళ వూరికి వచ్చేయమంటోంది. దానికేమి పోయేకాలమొచ్చిందో ఏమో" అని చెప్పసాగినాడు. ఒకరోజు వాడు పనుండి చేనుకాడికి పోయినాడు. పెండ్లాం శవం యాడైతే

బూడ్చిపెట్టినాడో, సరిగ్గా ఆన్నే తోటకూర చెట్లు బాగా ఏపుగా పెరిగినాయి. అవి వీన్ని చూడగానే గాలి వీచినప్పుడల్లా అటూయిటూ వూగుతా

"సుయ్ ... సుయ్ ... లొడ్డప్పా

సుయ్ ... సుయ్ ... లొడ్డప్పా" అనసాగినాయి. ఆమాటింటానే వాడు కోపంతో వూగిపోతా వాటిని ఫటఫటమని తెంచి, ఇంటికి తీసుకోనిపోయి కూరగిన్నెలో పడేసి హమ్మయ్య అనుకున్నాడు.

పొయ్యి అంటించిన కాసేపటికి గిన్నెలో కూర కుతకుతకుత ఉడకసాగింది. అందులోంచి బుడగలు

"ఠప్... ఠప్... లొడ్డప్పా

ఠప్... ఠప్... లొడ్డప్పా" అంటూ పగిలిపోసాగినాయి. దాంతో వాడు కోపంతో వూగిపోతా ఆ కూరంతా తీస్కోనిపోయి గాట్లో బరగొడ్డు దగ్గర విసిరి పాడేసి హమ్మయ్య అనుకున్నాడు. బరగొడ్డు ఆ కూరంతా నున్నగా తినేసింది. అప్పన్నించీ అది వాడు కనపడ్డం ఆలస్యం

"అంబా... అంబా... లొడ్డప్పా

అంబా... అంబా... లొడ్డప్పా" అని అరవసాగింది. దాంతో వాడు కోపంతో వూగిపోతా ఇంట్లోంచి కత్తి తీసుకోనొచ్చి దాన్ని ఒక్కటేసినాడు. అంతే అది చచ్చూరుకోనింది.

వాడు దాని చర్మం వలిచి చెప్పులు కుట్టేటోనికి ఇచ్చినాడు. వాడు ఆ బరగొడ్డు చర్మంతో మాంచి అందమైన చెప్పులు కుట్టి ఇచ్చినాడు. అవేసుకోని వాడు రోడ్డు మీద నడవడం ఆలస్యం అవి వెంటనే

"కిర్రు ... కిర్రు ... లొడ్డప్పా

కిర్రు ... కిర్రు ... లొడ్డప్పా" అనడం మొదలుపెట్టినాయి. దాంతో వాడు కోపంతో వూగిపోతా ఆ చెప్పులను ఇంటి దగ్గరున్న కుక్క ముందుకు విసిరిపాడేసినాడు.

కుక్క ఆ చెప్పులను బాగా పీక్కోని... పీక్కోని తినేసింది. అంతే అప్పన్నించీ అది వాడు కనబడ్డం ఆలస్యం "భౌ ... భౌ ... లొడ్డప్పా

భౌ... భౌ ... లొడ్డప్పా " అని మొరగసాగింది. దాంతో వాడు కోపంతో వూగిపోతా కట్టె తీస్కోని దాని నెత్తిన ఒక్కటేసినాడు. అంతే దెబ్బకు తల పగిలి అది అక్కడికక్కడే చచ్చూరుకోనింది. వాడు దాన్ని తీసుకోనిపోయి చెరువులోకి విసిరి పడేసి 'హమ్మయ్య పీడ విరగడైంది' అనుకున్నాడు.

కానీ అప్పన్నించీ ఆ చెరువులో ఎవరన్నా నీళ్ళ కోసం బిందె ముంచితే చాలు

"బుడ... బుడ... లొడ్డప్పా

బుడ... బుడ... లొడ్డప్పా" అని చప్పుడు రాసాగింది. వానికి ఆ చెరువును ఏం చెయ్యాల్నో అర్థం కాలేదు. దాన్ని కొట్టలేడు. చంపలేడు. ఏమీ చేయలేడు. అందుకే అది "లొడ్డప్పా... లొడ్డప్పా" అని అరుస్తా వున్నా ఏమీ చేయలేక నోరు మూసుకోని మట్టసంగా వుండిపోయినాడు.

# 45 సూది - వైద్యుడు

ఒకూర్లో ఒక సూదుండేది. పాపం దానికో రోజు జ్వరమొచ్చింది. ఎన్ని రోజులైనా కొంచం గూడా తగ్గలేదు. దాంతో అది నీరసంగా కిందామీదా పడతా వైద్యుని దగ్గరికి పోయింది. వైద్యుడు సూది పడతావున్న బాధను ఏమాత్రం పట్టిచ్చుకోకుండా "నువ్వే సూదివి. మళ్ళా నీకు యాడ సూదెయ్యాల... ఫో... ఫో... ఈన్నించి" అని కసురుకున్నాడు. పాపం... ఆ సూది ఎంత బతిమలాన్నా డాక్టరు దానికి మందియ్యలేదు.

సూది ఏడుస్తా... ఏడుస్తా... తిరిగి ఇంటికి పోతా వుంటే దారిలో ఒక అరటితొక్క ఎదురయి "సూదిబావా... సూదిబావా... ఎందుకే అట్లా ఏడుస్తా వున్నావ్. ఏంది నీ బాధ" అనడిగింది. సూది జరిగిందంతా పూసగుచ్చినట్టు వివరించింది. అది విని అరటితొక్క బాధపడతా "అయ్యో పాపం... జ్వరమొచ్చి నువ్వింత బాధపడ్తా వున్నా సూదెయ్యనన్నాడా... దా పోదాం... పోయి వాని సంగతి చూసుకుందాం" అనింది కోపంగా.

"సరే" అని సూది అరటితొక్కతో కలిసి తిరిగి వైద్యునింటికి పోతా వుంటే దారిలో పెంద అడ్డమొచ్చి "సూదిబావా... సూదిబావా... యాడికి నువ్వూ, అరటితొక్కా పోతా వున్నారు... ఏంది సంగతి" అనడిగింది. అప్పుడా సూది దానికి జరిగిందంతా చెప్పింది. అది విని ఆ పెంద "వానికి బాగా కొవ్వెక్కినట్లుంది. నేను గూడా మీ వెంబడొస్తా... పద... వాని అంతు చూద్దాం" అని అది గూడా వాటితో పాటే బైలుదేరింది.

అట్లా సూదీ, అరటితొక్కా, పెందా పోతాపోతా వుంటే దారిలో ఒక చిన్న తేలుపిల్ల ఎదురొచ్చి "సూదిబావా.. సూదిబావా... యాడికి నువ్వూ, అరటితొక్కా, పెందా పోతా వున్నారు. ఏంది సంగతి" అనడిగింది. అప్పుడా సూది దానికి జరిగిందంతా చెప్పింది. అది విని ఆ తేలు "నీకు ముందూ వెనుకా ఎవరూ లేరనే గదా వానికంత ధైర్యం. ఆ వాడేమన్నా పెద్ద పాలెగాడిననుకుంటున్నాడేమో... నేనూ వస్తా... చూసుకుందాంపా వాని సంగతి" అని అదిగూడా దాండ్లతో పాటే బైలుదేరింది. అట్లా ఆ నాలుగూ కలిసి ఆసుపత్రికి చేరుకొనేసరికి... అక్కడ వైద్యుడు లేడు. ఏదో పనుందని బైటకి పోయినాడు. సరేనని నాలుగూ నెమ్మదిగా లోపలికెళ్ళినాయి.

అరటితొక్కేమో గుమ్మం ముందు కూచోనింది. తేలేమో గూట్లో మందుల పక్కకు చేరింది. సూదేమో కుర్చీ మీద చక్కగా నిటారుగా నిలబడింది. పెందేమో సరిగ్గా కుర్చీపైన సీలింగుకు అతుక్కోనింది.

కాసేపటికి వైద్యుడు కులుక్కుంటా... కులుక్కుంటా.... టకటకటక నడుచుకుంటా లోపలికొచ్చినాడు. గుమ్మం ముందు అరటితొక్క సిద్ధంగా వుంది గదా... చూసుకోక కాలేసినాడు. అంతే... సర్రుమని జారి దభీమని కిందపన్నాడు. దెబ్బకు కాలిరిగింది.



వాడు కుయ్యో మొర్రో అని మొత్తుకుంటా లేచి కుంటుకుంటా... కుంటుకుంటా... నొప్పి తగ్గడానికి మందేసుకుందామని గూట్లో చేయి పెట్టినాడు. ఎప్పుడెప్పుడు గూట్లో చెయ్యి పెడ్తాడా... ఎప్పుడెప్పుడు వాని సంగతి చూసుకుందామా అని ఎదురు చూస్తా వున్న తేలుపిల్ల వెంటనే వాని చేతి మీద లటుక్కున కొండితో ఒక్కటేసింది.

అంతే... ఆ దెబ్బకు వాడు గిలగిలలాడతా కుర్చీ దగ్గరికి చేరుకున్నాడు. అప్పటికే సూది నిటారుగా దాని మీద నిలబడి ఎదురుచూస్తా వుంది గదా... వాడు దాన్ని చూసుకోక అలాగే కూచున్నాడు. అంతే... అది కస్సున లోపలికి దిగబడిపోయింది. అంతే.... వాడు బాధతో విలవిలలాడతా "అబ్బా" అని అరుస్తా నోరు తెరిచినాడు. అంతే పైనున్న పెండ దభీమని వాని నోట్లో పడింది.

# 46 ముగ్గురూ ముగ్గురే

ఒక ఊరిలో ఒక చెవిటాయన వుండేటోడు. వాడు ఒకసారి ఒక కుంటిమేకను పట్టుకోని పక్కవూరికి పోతా వున్నాడు. నడిచీ నడిచీ బాగా అలసిపోయినాడు. దాహం కాసాగింది. యాడయినా నీళ్ళు వున్నాయేమోనని వెదుకుతా వుంటే ఒక చెట్టు కింద ఒకడు కూచోని కనబన్నాడు. వానికి గూడా చెవుడే.

మొదటోడు కుంటిమేకతో వాని దగ్గరకు పోయి "అనా... ఈడ తాగడానికి నీళ్ళు యాడ వున్నాయి" అని అడిగినాడు. చెట్టు కింద వున్నోనికి ఆ మాటలు వినబడలేదు. ఎదురుగా వున్న కుంటిమేకను చూసి "దాని కాలు నీవు విరగ్గొట్టినావా" అని అడుగుతున్నాడేమో అనుకోని "లేదు... లేదు... నేను విరగ్గొట్టలేదు, నాకేమీ తెలీదు" అంటూ ఆ మేకని పక్కకి దొబ్బేసినాడు.

అది చూసి వాడు "నీళ్ళు యాడున్నాయి అనడిగితే నా మేకను దొబ్బుతావా, వుండు నీపని చెబుతా" అంటా వాన్ని రపీమని ఒక్కేటు కొట్టినాడు. దాంతో వాడు కోపంగా "నీ మేక కాళ్ళు నేను విరగ్గొట్టలేదన్నా నన్నే కొడతావా... ఎంత పొగరు నీకు" అంటూ తిరిగి వాన్ని రపరపరప నాలుగు పెరికినాడు. ఇద్దరూ అట్లా జుట్టూ జుట్టూ పట్టుకోని కిందామీదాపడి కొట్టుకున్నారు. కాసేపటికి ఇద్దరూ అలసిపోయి ఎవరన్నా కనబడితే ఎవరిది తప్పో చెప్పమని అడుగుదామనుకున్నారు.

అంతలో ఒకడు అటువైపు కోపంగా బెరబెరా నడుచుకుంటా రావడం కనబడింది. వాడు అంతకుముందే ఇంట్లో పెండ్లాంతో బాగా గొడవపడి ఇంటినీ, పెండ్లాన్నీ వదిలేసి యాడికో పోతా వున్నాడు. వానికి గూడా చెవుడే.

వాన్ని ఆపిన ఇద్దరు చెవిటోళ్ళలో ఒకడు "అయ్యా... నేను ఈ మేక కాలు విరగ్గొట్టలేదు. అయినా వీడు నేనే విరగ్గొట్టానని అంటున్నాడు. ఇదేమయినా మంచి పద్ధతేనా" అన్నాడు. అంతలో రెండవ వాడు "అయ్యా... ఈడ యాడయినా నీళ్ళున్నాయా అని అడిగాను. వుంటే వున్నాయనాలి, లేకుంటే లేవనాలి. అంతేగానీ నా మేకను తోసెయ్యొచ్చా.... నీవే చెప్పు ఎవరిది తప్పో" అన్నాడు.

అప్పుడు ఆ మూడోవాడు కోపంగా "మీరు వంద చెప్పండి... లక్ష చెప్పండి.... ఇంక నేను నా పెండ్లాంతో కాపురం చేయనంటే చేయను. ఏం చేసుకుంటారో చేసుకోపోండి" అంటూ ఆన్నించి విసవిసవిస వెళ్ళిపోయినాడు.

# 47 అవ్వా-పొట్టేలు

ఒకూర్లో ఒక ముసల్దుండేది. ఆ ముసల్దానికి నా అనేవాళ్ళు ఎవరూ లేరు. ఒక్కతే వండుకుంటా తింటా తిరుగుతా వుండేది. వాళ్ళింటి పక్కనే ఒక చెరువుంది. ఒకరోజు పక్కింటోళ్ళు ఆ చెరువులో చేపలు పడ్తా వుంటే చూసి ఆ ముసల్ది కూడా చేపలు పట్టుకుందామని ఒక చిన్న వల తీసుకోని పోయింది. పొద్దున్నించీ సాయంత్రం వరకూ వల ఇసుర్తా వుందిగానీ ఒక్క చేప గూడా పల్లేదు.

"ఎప్పుడూ నాలుగో ఐదో పడ్తా వుండేవి. ఈ రోజేమి ఒక్కటి గూడా పల్లేదు" అనుకుంటా ఆఖరిసారి చూద్దామని వల ఇసిరింది. లింగులిటుకుమని సరిగ్గా మన చిటికెన వేలంత చిన్న చేప ఒకటి పడింది.

ఏదో ఒకటి దొరికింది చాలనుకోని ఆ ముసల్ది దాన్నే తీసుకోని ఇంటికొచ్చింది. చూసి చూసి అంత చిన్నదానిని కూర చేసుకోని తినబుద్ధి కాలేదు. దాంతో "ఎట్లాగూ నాకెవరూ లేరు. ఈ చేపపిల్లనన్నా పెంచుకుందాం" అనుకోని దాన్ని తీస్కోనిపోయి ఒక చెంబులో ఏసింది. రోజూ దానికి మూడుపూటలా బాగా అన్నం, కూరలు, పండ్లు ఎంత తింటే అంత ఏయడం మొదలుపెట్టింది.

అట్లా ఆ చేపపిల్ల రోజూ బాగా తినీతినీ వారంరోజులు తిరిగేసరికి చిటికెన వేలంత వుండేది కాస్తా చెంబంత లావయింది. దాంతో ఆ ముసల్ది దాన్ని తీస్కోనిపోయి ఒక పెద్ద బిందెలో ఏసింది. ముసల్ది మూడుపూటలా బాగా తిండి పెడ్తా వుంది గదా. దాంతో అది బాగా మెక్కీమెక్కీ మరోవారం తిరిగేసరికి చెంబంత వున్నది కాస్తా బిందెంతయింది. అప్పుడా ముసల్ది దాన్ని తీస్కోనిపోయి జాలాడిలోనున్న పెద్ద గచ్చులో ఏసింది. కానీ వారం తిరిగేసరికల్లా అది బాగా తినీతినీ బిందెంత వున్నది కాస్తా గచ్చంతయింది. దాంతో ఆ ముసల్ది ఇంగ లాభం లేదనుకోని దాన్ని తీస్కోనిపోయి ఇంటి పక్కనే వున్న చెరువులో వదిలింది.

ఆ ముసల్ది యాడ తిరుగుతా వున్నా అన్నం సమయానికి మాత్రం చెరువు కాడికొచ్చి "ష్... ష్..." అని పిల్చేది. అట్లా ఆ ముసల్ది, "ష్... ష్..." అనడం ఆలస్యం ఆ చేప యాడున్నా సరే రయ్యిమని ఈదుకుంటా ఆమె దగ్గరకొచ్చేది. ఆ ముసల్ది తాను తెచ్చినేటివన్నీ దానికి ప్రేమగా ఒకొక్కటే తినిపిస్తా కబుర్లాడేది.

ఒకరోజు ఆ ముసల్దానికి ఏదో పనిబడి పక్కూరికి పోయింది. సాయంకాలానికి గానీ రాలేకపోయింది. ఆరోజు మధ్యాన్నం ఏం జరిగిందంటే కొందరు గొర్రెలోల్లు గొర్రెల్ని తోలుకుంటా ఆ చెరువు కాడికి వచ్చినారు. గొర్రెలు నీళ్ళు తాగినాక వాటిని అదిలిస్తా "ష్... ష్..." అన్నారు. అవ్వే వచ్చిందనుకోని ఆ చేపపిల్ల సంబరంగా బైటికొచ్చింది. దాన్ని చూసి వాళ్ళు "అబ్బ! ఎంత లావుగుందీ చేప. దీన్నెట్లాగైనా పట్టుకుంటే బాగా కూరొండుకోని కడుపు నిండా తినొచ్చు" అనుకోని మట్టసంగా చుట్టూ చుట్టుకోని పట్టేసుకున్నారు. దాన్ని ఇంటికి తీస్కోనిపోయి చంపి పులుసు చేసుకున్నారు.

అవ్వ సాయంత్రం ఇంటికి రాగానే "పాపం! మధ్యాన్నం నించీ ఎంత ఆకలి గొనిందో ఏమో" అనుకుంటా బెరబెరా ఒక పెద్ద గిన్నె నిండా అన్నం చేసుకోని చెరువు కాడికొచ్చి ఎప్పట్లాగే "ష్... ష్..." అని పిల్చింది. అది లోపలుంటే గదా వచ్చేది. ఎంతసేపు పిల్చినా రాలేదు.

"ఇదేందిరా బగమంతుడా! రోజూ పిలుస్తానే రయ్యిమని ఎగుర్లాడుకుంటా వచ్చేది. ఈరోజేమి ఎంత పిల్చినా రావడం లేదు. ఏం జరిగిందో ఏమో" అనుకుంటా చుట్టూ చూస్తా వుంటే చెరువు కాడ మేకల, గొర్రెల కాలిగిట్టల గుర్తులు కనబన్నాయి. "కొంపదీసి ఈ మేకలోల్లుగానీ దాన్ని పట్టుకోలేదు గదా" అనుకోని నెత్తిన గొంగళి కప్పుకోని, చేతిలో చిప్ప పట్టుకోని, అడుక్కునేదాని మాదిరి ఆ మేకలోల్ల ఇంటికాడికి పోయి "అమ్మా! అన్నం తినక నాలుగు రోజులైంది తల్లీ! కొంచం ఏమన్నా వుంటే పెట్టండమ్మా" అంటూ అరిచింది. ఆ మేకలోల్లు ఎవరో అడుక్కుతినేది అనుకోని చేపల పులుసు తెచ్చి ఆమె తట్టలో పోసినారు. దాంతో వాళ్ళే చేప పట్టుకోని తిన్నారని ఆ ముసల్ది గుర్తుపట్టేసింది. వెంటనే వురుక్కుంటా పోయి వూరోల్లందరినీ పిల్చుకోనొచ్చి నా చేప నాకియ్యండంటా మేకలోల్లతో పెద్ద గొడవ పెట్టుకోనింది.

చచ్చిపోయినాక ఏదీ తిరిగిరాదు గదా. దాంతో వూరోల్లందరూ "అయిపోయిందేదో అయిపోయింది. అదిగాకుండా వేరేది నీకేదిష్టమైతే అది కోరుకో. మేమిప్పిస్తాం" అన్నారు. ఆ ముసల్ది ఏం కోరుకోవాలబ్బా అని ఆలోచిస్తా వుంటే వాళ్ళ దగ్గర ఒక మాంచి పొట్టేలుపిల్ల కనబడింది. దాంతో అది కావాలనింది. సరేనని వూరోళ్ళు ఆ పొట్టేలుపిల్లను ముసల్దానికి ఇప్పించినారు.

అవ్వ ఆ పొట్టేలుపిల్లని చానా ప్రేమగా చూసుకొనేది. మంచి మంచి పండ్లు, కూరగాయలూ తీసుకోనొచ్చి పెట్టేది. అట్లా కొంతకాలానికి అది పెరిగి పెద్దగయింది. అవ్వ రోజూ తన కోసం అడవికి పోయి కష్టపడి అన్నీ తీసుకొస్తా వుంటే చూసి, ఒకరోజు పొట్టేలు "అవ్వా అవ్వా... రోజూ నా మేత కోసం ఎందుకంత కష్టపడతావ్. నేనిప్పుడు పెద్దదాన్నయినాను గదా, నేనే పోయి తినొస్తాలే" అనింది. ఆ ముసల్ది సరే అనింది.

ఒకరోజు ఆ పొట్టేలు అడవిలో పోతా వుంటే దారిలో దానికి ఇద్దరు దొంగలు ఒక గుహలో నుంచి బైటికి



వస్తా కనబన్నారు. వాళ్ళట్లా బైటికి పోవడమాలస్యం ఇది మట్టసంగా లోపలికి దూరింది. వాళ్ళు యాడాడి నుంచో ఎత్తుకోనొచ్చిన వజ్రాలు, రత్నాలు, మణులూ, మాణిక్యాలు, బంగారం, హారాలు... ఒకటీగాదూ రెండూ గాదు... కుప్పలు కుప్పలు కనబన్నాయి. వెంటనే ఆ పొట్టేలు అట్లాఇట్లా ఒకసారి చూసి కనబన్నవి కనబన్నట్లు కుప్పలు కుప్పలు నున్నగా మింగేసి ఇంటికి చేరుకోనింది.

అవన్నీ కడుపులోనికి పోయినాయిగానీ అరగవు గదా. దాంతో ఇంటికి చేరగానే "అవ్వా అవ్వా! కడుపులో ఒకటే నొస్తావుందే. కాస్త రోకలిబండ తీసుకోనొచ్చి ఒకొక్క పక్క, ఒకొక్క పోటు పొడుచే" అనింది. దాంతో అవ్వ "దార్లో అడ్డమైనవన్నీ తింటే కడుపు నొయ్యక ఏం నొస్తాది" అంటూ కోపంగా రోకలిబండతో ఎడమపక్క ఒక్క పోటు పొడిచింది. అంతే... ఆ పొట్టేలు నోట్లోంచి మణులూ, మాణిక్యాలూ దభీమని కిందపడినాయి. ఆ ముసల్ది ఆచ్చర్యపోతా ఈసారి కుడిపక్కన ఒక పోటు పొడిచింది. ఈసారి వజ్రాలూ, వైఢూర్యాలూ పడినాయి. అట్లా ఒకొక్క పోటుకు ఒకొక్కటి చొప్పున కడుపులో వున్నవన్నీ ఒక్కటిగూడా మిగలకుండా అన్నీ బైటికొచ్చేసినాయి.

ఆ ముసల్ది అవన్నీ చూసి చానా సంబరపడింది. వాటిని అమ్మి పెద్ద మేడ కట్టుకోనింది. అది చూసిన పక్కింటామె "నిన్న మొన్నటి వరకూ మామూలుగానే వుండెనే. ఒక్కసారిగా యాన్నించి వచ్చిందబ్బా ఇంత డబ్బు" అని ఆచ్చర్యపోయి ముసల్దాని దగ్గరికి పోయి "ఏంది కత" అనడిగింది. ఆ ముసల్ది జరిగినేదంతా చెప్పింది.

ఆ పక్కింటామె దగ్గర ఒక కుక్కుంది. ఆమె ఇంటికి పోగానే "నువ్వూ వున్నావు ఎందుకు? మూడుపూటలా తిని కూచోడానికి తప్ప ఎందుకూ పనికిరావు. పో... పోయి ఆ పొట్టేలు మాదిరి యాడన్నా ఏమన్నా దొరికితే తిని రా పో" అంటూ దాన్ని తన్ని తరిమేసింది. పాపమా కుక్క అడవిలో ఎంత దూరం పోయినా దానికి ఏమీ కనబల్లేదు. దాంతో ఎముకలూ, చెత్తా, చెదారమూ తిని మట్టసంగా ఇంటికొచ్చింది.

కుక్క ఇంటికి రాగానే ఆమె సంబరంగా చాప పరచి కుక్కను దాని మీద పన్నబెట్టి రోకలిబండతో ఎడమ పక్కన ఒక పోటు పొడిచింది. అది ఎముకలు కక్కింది. "ఇదేందిరా నాయనా" అని కుడిపక్క పొడిస్తే నానా గబ్బూ కక్కింది. దాన్తో ఆమె "ఛీ! దరిద్రం దానా! ఇండ్లంతా కంపు కంపు చేసినావు గదా" అని దాన్ని తన్ని తరిమేసింది.

# 48 మా మల్లన్న సచ్చిపాయ

ఒకూర్లో ఒక రాణి వుండేది. ఆమె చానా మంచిది. ఎవరైనా బాధ పడుతా వుంటే చూసి తట్టుకునేది కాదు. ఆ రాణి దగ్గర ఒక సాకలామె వుండేది. ఆ సాకలామె ఎప్పటికప్పుడు వూళ్ళో జరిగిన సంగతులన్నీ రాణికి పూసగుచ్చినట్టు వివరించేది. బాగా పాటలు పాడేది. ఎప్పుడూ నవ్వుతా అందరినీ నవ్విస్తా వుండేది. దాంతో సాకలామంటే రాణికెంతో ఇష్టం. ఆమెకు కావల్సినవన్నీ ఇస్తూ ప్రేమగా చూసుకొనేది.


ఒకరోజు ఎప్పట్లాగే సాకలామె బట్టలన్నీ శుభ్రంగా వుతుక్కోనొచ్చి రాణి ముందు వేసింది. రాణి బట్టలు లెక్కబెట్టుకుంటా వుంటే వెక్కి వెక్కి ఏడ్వసాగింది. అది చూసి రాణి "అయ్యో పాపం! మా సాకలామెకు ఎంత కష్టమొచ్చిందో ఏమో. ఎప్పుడూ ఏడ్చనిది ఈరోజు ఏడుస్తా వుంది" అనుకోని "ఏమే! ఎందుకట్లా ఏడుస్తా వున్నావు?" అనడిగింది. దానికా సాకలామె ఏడుస్తానే "ఏం చెప్పమంటావమ్మా! నిన్ననే మా మల్లన్న సచ్చిపోయినాడు. అది గుర్తుకొచ్చి ఏడుస్తా వున్నా" అనింది. సాకలామె బాధ చూసి రాణికి కూడా బాధేసింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి. మల్లన్నంటే ఆమెకు ఎంత కావాల్సినోడో ఏమో అనుకోని రాణి కూడా ఏడ్చడం మొదలుపెట్టింది.

రాణి ఏడుస్తా వుంటే చూసిన రాజు "అయ్యోపాపం! నా రాణికి ఎంత కష్టమొచ్చిందో ఏమో, ఎప్పుడూ ఏడ్చనిది ఈరోజు ఏడుస్తావుంది' అనుకోని రాజు కూడా ఏడ్చసాగినాడు.

రాజు ఏడుస్తా వుంటే చూసిన మంత్రులు, సేనాధిపతులు "అయ్యో పాపం! మా రాజుకు ఎంత కష్టమొచ్చిందో ఏమో, ఎప్పుడూ ఏడ్చనిది ఈరోజు ఏడుస్తా వున్నాడు' అనుకోని వాళ్ళు కూడా ఏడ్చసాగినారు.

మంత్రులు, సేనాధిపతులు ఏడుస్తా వుంటే చూసిన భటులు, దాసీలు "అయ్యో పాపం! మా మంత్రులకు, సేనాధిపతులకు ఎంత కష్టమొచ్చిందో ఏమో, ఎప్పుడూ ఏడ్చనిది ఈరోజు ఏడుస్తా వున్నారు" అనుకోని వాళ్ళు కూడా ఏడ్చసాగినారు.భటులు, దాసీలు ఏడుస్తా వుంటే చూసిన జనాలు "అయ్యో పాపం! మా భటులకు, దాసీలకు ఎంత కష్టమొచ్చిందో ఏమో, ఎప్పుడూ ఏడ్చనిది ఈరోజు ఏడుస్తా వున్నారు' అనుకోని వాళ్ళు కూడా ఏడ్చసాగినారు.

అట్లా రాజ్యంలో ఏ వీధి చూసినా, ఏ ఇండ్లు చూసినా ఏడుపులే ఏడుపులు. ఒకరిని చూసి మరొకరు కిందా మీదా పడి ఏడ్చసాగినారు. ఆ సమయంలో పక్క వూరి నుండి ఒక వ్యాపారి సరుకులు అమ్ముదామని ఆ రాజ్యానికొచ్చినాడు. చూస్తే ఇంగేముంది. వూరువూరంతా ఏడుస్తా వున్నారు. వాడు ఆచ్చర్యపోయి "ఇదేందబ్బా... అందరూ ఇట్లా ఏడుస్తా వున్నారు" అనుకోని ఒకని దగ్గరకు పోయి "ఏం జరిగింది? ఎందుకట్లా ఏడుస్తా



వున్నావు" అనడిగినాడు. దానికి వాడు "ఏమోబ్బా, నాకూ తెలీదు. మా భటులు, దాసీలు ఏడుస్తా వుంటే నేనూ ఏడుస్తా వున్నా" అన్నాడు. వాడు భటులు, దాసీల దగ్గరకు పోయి 'ఏం జరిగింది? ఎందుకట్లా ఏడుస్తా వున్నారు' అనడిగినాడు. దానికి వాళ్ళు 'ఏమోబ్బా మాకూ తెలీదు. మా మంత్రులూ, సేనాధిపతులూ ఏడుస్తా వుంటే మేమూ ఏడుస్తా వున్నాం" అన్నారు.

వాడు మంత్రులు, సేనాధిపతుల దగ్గరికి పోయి 'ఏం జరిగింది? ఎందుకట్లా ఏడుస్తా వున్నారు' అనడిగినాడు. దానికి వాళ్ళు "ఏమోబ్బా మాకూ తెలీదు. మారాజు ఏడుస్తా వుంటే మేమూ ఏడుస్తా వున్నాం" అన్నారు.

వాడు రాజు దగ్గరికి పోయి "ఏం జరిగింది? ఎందుకట్లా ఏడుస్తా వున్నావు మహారాజా?" అనడిగినాడు. దానికి రాజు "ఏమోబ్బా, నాకూ తెలీదు. మా రాణి ఏడుస్తా వుంటే నేనూ ఏడుస్తా వున్నా" అన్నాడు.

వాడు రాణి దగ్గరకు పోయి "ఏం జరిగింది మహారాజా? ఎందుకట్లా ఏడుస్తా వున్నావు?' అనడిగినాడు. దానికి రాణి "ఏమోబ్బా, నాకూ తెలీదు. మా సాకలామె ఏడుస్తా వుంటే నేనూ ఏడుస్తా వున్నా" అనింది.

వాడు సాకలామె దగ్గరకు పోయి "ఏం జరిగింది? ఎందుకట్లా ఏడుస్తా వున్నావు?" అనడిగినాడు. దానికి సాకలామె ముక్కు చీదుకుంటా 'మా మల్లన్న సచ్చిపోయినాడు. అందుకే ఏడుస్తా వున్నా' అనింది. మల్లన్నంటే ఎవరో అర్థంగాక వాడు సాకలామెను 'మల్లన్నంటే ఎవరు' అనడిగినాడు.

దానికా సాకలామె వెక్కి వెక్కి ఏడుస్తా "మల్లన్నంటే కూడా తెలీదా, చిన్నప్పున్నుండీ నేనెంతో ప్రేమగా అల్లారుముద్దుగా పెంచుకున్న మా గాడిద" అనింది.

అది విని వాడు "ఓరినీ! గాడిద చచ్చిపోయినందుకు ఇంత మంది పనీపాటా మానేసి ఏడుస్తా వున్నారా" అనుకోని కిందా మీదా పడి నవ్వుకుంటా వెళ్ళిపోయినాడు. విషయం తెలిసిన రాణి, రాజు, మంత్రులు, సేనాధిపతులు, భటులు, దాసీలు, ప్రజలు అందరూ సిగ్గుతో తలదించు కొన్నారు.

# 49 నవ్వితే నవరత్నాలు

ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు అన్ని కోరికలు తీరినాయి గానీ పిల్లలు కావాలనే కోరిక మాత్రం తీరలేదు. ఎన్నో పూజలు చేసినాడు, వ్రతాలు చేసినాడు, అడిగిన వారికల్లా కాదనకుండా దానం చేసినాడు. ఐనా పిల్లలు మాత్రం పుట్టలేదు. దాంతో ఒకరోజు పోలేరమ్మ గుడికి పోయి "తల్లీ! పిల్లలు లేని బతుకూ ఒక బతుకేనా... నేనేం పాపం చేసినాను. ఈ బతుకు బతికితేనేమి సస్తేనేమి' అంటూ కత్తి తీసుకోని కసుక్కున పొడుచుకోబోయినాడు. అంతలో దేవత ప్రత్యక్షమయి "ఆగాగు?! నీకు కావల్సింది పిల్లలే గదా. ఇస్తా. కానీ ఒక షరతు. నీ పెండ్లాం కడుపు పండిన వెంటనే నీ రాజ్యం పోతాది. రాజ్యమా... పిల్లలా..... ఏది కావాల్నో చెప్పు" అనడిగింది. దానికా రాజు వెంటనే "తల్లీ! రాజ్యం పోయినా పరవాలేదు. నాకు పిల్లలు పుడ్తే చాలు" అన్నాడు. సరే అని దేవత రెండు పండ్లిచ్చింది. "ఇవి తీస్కోనిపోయి నీ పెండ్లానికియ్యి" అని చెప్పి మాయమైపోయింది.

రాజు సంబరంగా ఆ పండ్లు తీసుకోని పోయి పెండ్లానికిచ్చినాడు. కొన్నాళ్ళకు ఆమె కడుపు పండింది. పోలేరమ్మ ముందే చెప్పినట్టు కొద్ది రోజులకే పక్కూరి రాజు వీళ్ళ మీదకి దండయాత్రకొచ్చినాడు. యుద్ధంలో రాజు ఓడిపోవడంతో శత్రువులకు చిక్కకుండా పెండ్లాన్ని తీసుకోని పారిపోయినాడు. తన గురించి ఎవరికీ తెలీని ఒక చిన్న గ్రామానికి చేరుకోని అక్కడ ఒక చిన్న గుడిసేసుకోని కూలీ నాలీ చేసుకుంటా బతక సాగినాడు. తొమ్మిది నెల్లు దాటినాక ఆమెకు ఒకరోజు చందమామలాంటి చక్కని కొడుకు పుట్టినాడు. పుట్టిన గంటకే మరలా ఇంకొకడు పుట్టినాడు. అట్లా ఒక్క కాన్పుకే ఇద్దరు పుట్టినారు. వాళ్ళను చూసి రాజుకీ రాణికీ సంబరం సంబరం గాదు.

వాళ్ళు ఆడతా పాడతా నెమ్మదిగా పెరిగి పెద్దగయినారు. ఒకరోజు వాళ్ళ నాయన దగ్గరికి పోయి "నాయనా! నాయనా! మేం పెరిగి పెద్దగయినాం గదా. ఈన్నే ఎన్ని రోజులున్నా ఏం లాభం. కొంచం గూడా జ్ఞానం పెరగదు. అందుకే దేశదేశాలు పోయి అక్కడి వింతలూ వినోదాలూ చూసి వస్తాం. మమ్మల్ని ఆశీర్వదించు" అన్నారు. సరేనని వాళ్ళమ్మా నాయనా వాళ్ళని ఆశీర్వదించి పంపించినారు. వాళ్ళిద్దరూ అట్లా ఒక్కొక్క వూరు దాటుకుంటా అనేక కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటా ఒక రోజు ఒక పెద్ద అడవిలోనికి పోయినారు.

ఆ అడవి మధ్యన వాళ్ళకు ఒకచోట ఒక పెద్ద మామిడిచెట్టు కనబడింది. దానికి ఒకే ఒక కాయ వుంది. అది బంగారు రంగులో ధగ ధగ ధగ మెరుస్తా కనబడింది. ఇదేందబ్బా ఇట్లా మెరుస్తా వుంది అని వాళ్ళు ఆచ్చర్యంగా చూస్తా వున్నంతలోనే అది పై నుండి కిందికి రాలింది. వాళ్ళు వురుక్కుంటా పోయి దాన్ని కింద పడక ముందే గాల్లోనే పట్టుకోని మళ్ళా తిందాంలే అనుకోని సంచిలో పెట్టుకున్నారు. అది చానా మహిమ గల మామిడి పండు. వంద సమ్మచ్చరాలకు ఒకే ఒకసారి కాస్తాది. దాని సంగతి వాళ్ళిద్దరికీ తెలీదు. వాళ్ళు అది మామూలు మామిడి పండే అనుకున్నారు.

వాళ్ళిద్దరూ అట్లా పోతా పోతా కాసేపటికి అలసిపోయి ఒక చెట్టు కింద పన్నుకున్నారు. చిన్నోనికి వెంటనే నిద్రపట్టింది. కానీ పెద్దోనికి మాత్రం నిద్ర రాలేదు. వూరికే కండ్లు మూసుకోని పన్నుకున్నాడు. కాసేపటికి ఆ చెట్టు మీదికి రెండు చిలకలొచ్చి వాలినాయి. దాండ్లకు మాటలొచ్చు. అందులో ఒక చిలక వాళ్ళ దగ్గరున్న పండును చూసి ఇంకో చిలకతో "ఏయ్! వాళ్ళ దగ్గరున్న పండు చూసినావా... అది మామూలు పండుగాదు. వంద సమ్మచ్చరాలకు ఒకే ఒకసారి కాసే మహిమ గల మామిడి పండు. ఎవడైతే దాని కండ తింటాడో వాడు రాజైపోతాడు. ఎవడు దాని టెంక మింగుతాడో వాడు నవ్వితే నవరత్నాలు పడతాయి" అని చెప్పింది. పెద్దోడు నిద్రపోలేదు గదా ఆ మాటలన్నీ విన్నాడు.

వెంటనే తమ్ముని లేపి విషయం చెప్పి తాను కండ తిని తమ్మునికి టెంక మింగిచ్చినాడు. మరలా ఇద్దరూ నడవడం మొదలుపెట్టినారు. అట్లా నడిచీ నడిచీ బాగా అలసిపోయినారు. ఇద్దరికీ బాగా ఆకలేయసాగింది. తిందామంటే చుట్టు పక్కల యాడా ఏమీ దొరకలేదు. దాంతో చిన్నోడు ఒక చెట్టు కింద కూలబడి "అన్నా!అన్నా! ఇంక నడవడం నా చేత గాదు. యాడైనా ఏదైనా దొరికితే తీసుకోనిరా" అన్నాడు. అన్న 'సరే' అని ఏదైనా తినడానికి దొరుకుతుందేమోనని వెదుకుతా బైలుదేరినాడు. కాసేపటికి ఒక వూరొచ్చింది.

ఆ వూరికి ఒక రాజున్నాడు. ఆయనకు పిల్లల్లేరు. పిల్లల కోసం చూస్తా చూస్తానే ముసిలోడయిపోయి మంచం పట్టినాడు. ఈ రోజో రేపో అనేటట్టున్నాడు. వారసులెవరూ లేరు గదా. నేను రాజునంటే నేను రాజునంటూ బంధువులంతా కొట్టుకోవడం మొదలుపెట్టినారు. రాజు పెద్దలందరినీ పిలిపిచ్చి "మన పట్టపుటేనుగుకి ఒక పూలదండ ఇచ్చి పంపించండి. అది ఎవరి మెడలో వేస్తే వాడే నా తరువాత రాజు. వాడు ధనవంతుడు గానీ, బిచ్చగాడు గానీ, యువకుడు గానీ, ముసిలోడు గానీ ఎవ్వరూ మాట్లాడగూడదు. ఇది నా ఆజ్ఞ" అన్నాడు. అందరూ "సరే" అన్నారు.

ఏనుగును బాగా అలంకరించి దానికి దండిచ్చి వూరిలో వదిలినారు. వూరు వూరంతా ఎవరి మెడలో దండేస్తాదా అని చూడ్డానికి వచ్చినారు. రాజసైనికులు వెనకాల నడుస్తా వుండగా ఏనుగు ఒక్కొక్కన్నే దాటుకుంటా అప్పుడే వూర్లోకొచ్చిన పెద్దోన్ని చూసింది. వాని దగ్గరకు పోయి మెళ్ళో దండేసింది. వెంటనే అందరూ వాన్ని ఎత్తి ఏనుగు మీద కూచోబెట్టి తప్పెట్లు కొట్టుకుంటా సంబరంగా ఈలలు వేసుకుంటా రాజు దగ్గరకు తీసుకోని పోయినారు. రాజు సంతోషించి తన కిరీటాన్ని వాని నెత్తిన పెట్టి రాజును చేసినాడు.

తమ్ముడు అడవిలో వున్నాడు గదా. వానికిదంతా తెలీదు, అన్న కోసం చూసీ చూసీ "ఏమబ్బా ఇంకా రాలేదు! ఏమయిపోయినాడో ఏమో" అనుకుంటా అన్నను వెదుకుతా పోయినాడు. అక్కడ అన్నేమో రాజు కాగానే సైనికులను పిల్చి" అడవిలో మా తమ్ముడుంటాడు. పోయి పిల్చుకోని రాపోండి" అంటూ గుర్తులు చెప్పి పంపిచ్చినాడు. కానీ వాళ్ళు వచ్చేటప్పటికే చిన్నోడు ఆన్నించి వెళ్ళిపోయినాడు. అట్లా అన్నాదమ్ములిద్దరూ విడిపోయినారు.

చిన్నోడు అన్న కోసం వెదుకుతా ఒక వూరికి చేరుకున్నాడు. ఆ వూర్లో ఒక పెద్ద మేడ వుంది. దాంట్లో ఒక ముసిల్ది దాని కూతురు వున్నారు. వాళ్ళిద్దరూ చానా చెడ్డోల్లు. ఎవరైనా వేరే వూరి నుండి ఆడికి వస్తే చాలు ఎలాగో ఒకలాగా వాళ్ళని మోసం చేసి వాళ్ళ దగ్గరున్నదంతా కాజేసేటోళ్ళు. చిన్నోన్ని చూసి "వీడెవడో బాగా డబ్బున్నోడున్నట్టున్నాడు. ఏమైనా వుంటే దోచుకోని పంపుదాం" అనుకోని దాసిని పిల్చి వాన్ని పిల్చుకోని రమ్మని పంపినారు. ఆ దాసీ పోయి వాన్ని పిలుచుకోనొచ్చింది.

ఆ తల్లీ కూతుళ్ళు వినయంగా "అయ్యా! మీరెవరో మాకు తెలీదు గానీ చానా దూర ప్రాంతం నుండి అలసిపోయి వస్తున్నట్టున్నారు. అతిథులకు సేవ చేయడం మా ఆచారం. దయచేసి ఈ రోజు ఈన్నే వుండి మా ఆతిథ్యం స్వీకరించండి"అంటూ తియ్య తియ్యగా మాట్లాన్నారు. వాళ్ళ గురించి వానికి తెలీదు గదా. దాంతో 'సరే' అన్నాడు. వాళ్ళు వానికి బాగా మర్యాదలు చేసి ఆ మాటా ఈ మాటా మాట్లాడ్తా వుంటే వానికి నవ్వొచ్చి పకపకా నవ్వినాడు. వాడట్లా నవ్వుతా వుంటే నోట్లోంచి గలగలగలమని నవరత్నాలు జారిపన్నాయి. అది చూసి వాళ్ళు ఆశ్చర్యపోయినారు. విషయమేందో కనుక్కోవాలని బాగా తాపిచ్చినారు. వాడు బాగా తాగినాక "నువ్వు నవ్వితే నవరత్నాలు పడ్తా వున్నాయి గదా, ఏంది సంగతి" అనడిగినారు. వాడు ఆ మత్తులో జరిగిందంతా చెప్పేసినాడు.

అప్పుడు వాళ్ళు "ఓహో అదా సంగతి" అనుకోని ఒక వైద్యుని దగ్గరకు పోయి వాంతులయ్యే మందు తీస్కోనొచ్చి పాలలో కలిపి వానికి తాపిచ్చినారు. అంతే వానికి వాంతులు వాంతులు కాదు. అట్లా ఆఖరికి కడుపులో వున్న మామిడి టెంక గూడా బైటకొచ్చేసింది. వాళ్ళు దాన్ని తీస్కోని సేవకులను పిలిచి "వీన్ని ఎత్తుకోని పోయి అడవి మధ్యలో వదిలేసి రాపోండి" అన్నారు. వాళ్ళు సరేనని వాన్ని ఎత్తుకోని పోయి అడవి మధ్యలో పాడేసినారు.

తరువాతరోజు పొద్దున్నే లేసి చూస్తే అడవి మధ్యలో పడున్నాడు. జరిగిందంతా గుర్తుకొచ్చింది. రాత్రంతా వాంతులు వాంతులు గదా. కడుపు ఖాళీయై నకనకలాడసాగింది. ఆకలికి తట్టుకోలేక యాడన్నా ఏమన్నా



దొరుకుతాయేమోనని వెదుక్కుంటా బైలుదేరినాడు. అట్లా పోతా వుంటే ఒకచోట ఒక పెద్ద చెట్టు కనబడింది. అది చానా వింతగా వుంది. దానికి మూడే మూడు కొమ్మలున్నాయి. ఒక్కొక్క కొమ్మకు ఒక్కొక్క రంగు కాయలున్నాయి.

"ఇదేందబ్బా విచిత్రంగా వున్నాయి" అనుకుంటా ఆకలికి తట్టుకోలేక ఒక ఎర్రకాయ తిన్నాడు. అంతే అట్లా తినడం ఆలస్యం ఇట్లా కోతయిపోయినాడు. ఇదేందబ్బా కోతయిపోతినని అనుకుంటా పక్కనున్న తెల్లకాయ తిన్నాడు. అంతే వెంటనే గాడిదయి పోయినాడు. ఇదేం మాయరా దేముడా అనుకుంటా పక్కనున్న పచ్చపండు తిన్నాడు. అంతే మళ్ళా మామూలు మనిషయి పోయినాడు. ఓహో...ఇదా సంగతనుకోని వాటిని తెంపుకోని మూటగట్టుకోని బైలుదేరి మళ్ళా ఇంతకు ముందు పోయిన వూరికే పోయినాడు.

వాళ్ళు చూస్తే గుర్తు పడతారనుకొని గడ్డం మీసాలు తగిలిచ్చుకోని మారు వేషమేసుకోని వాళ్ళింటికి పోయి తలుపు కొట్టినాడు. వాళ్ళు తలుపులు తీసి "ఎవరు నీవు. ఏం కావాల" అనడిగినారు. దానికి వాడు "నేను పెద్ద నగల వర్తకున్ని. మాది పక్క దేశం. రాత్రయింది కదా ఎవరయినా దొంగలొస్తే ప్రమాదం. ఈ రోజుకి ఈన్నే పండుకోనిస్తే రేప్పొద్దున్నే లేచి వెళ్ళిపోతా" అన్నాడు. వెంటనే తల్లీ కూతుళ్ళు వాని నుంచి రాత్రి నగలమూట కొట్టేయొచ్చనుకోని లోపలికి రమ్మన్నారు. వానికి బాగా సేవలు చేసి పిండివంటలు పెట్టినారు.

వాడవన్నీ బాగా తిన్నాక సంచీలోంచి పండ్లు తీసి "మీరెక్కడయినా ఇట్లా ఎర్రకాయలు, తెల్లకాయలు చూసినారా.....ఇవి మా దేశంలో తప్ప యాడా పండవు. దీని రుచి ప్రపంచంలో ఇంక ఏ పండుకూ వుండదు" అని నోరూరేటట్లు చెప్పి తల్లికి ఎర్రది, కూతురికి తెల్లది ఇచ్చినాడు. వాని మాటలతో వాళ్ళ నోట్లో నీళ్ళూరుతా వున్నాయి. ఇవ్వడమాలస్యం ఆ రుచి ఎట్లా వుంటాదో ఏమో! అనుకోని లొట్టలేసుకుంటా బెరబెరా తిన్నారు. అంతే! అట్లా తినడమాలస్యం క్షణంలో ఎర్రపండు తిన్న తల్లి కోతయితే, తెల్లపండు తిన్న కూతురు గాడిదయిపోయింది. వాడు ఇండ్లంతా వెదికి మామిడి టెంక తీసుకోని మళ్ళా మింగి బైలుదేరినాడు.

అట్లా పోతా పోతా ఒకరోజు వాళ్ళన్న వున్న రాజ్యానికి చేరుకున్నాడు. వాడు వీధిలో పోతా వుంటే ఒక చోట ఒకడు కోతులు ఆడిపిస్తా వుండడం కనబడింది. కోతులెగురుతా, పల్టీలు కొడతా, దండాలు పెడతా వుంటే వీనికి నవ్వొచ్చి గలగలగల నవ్వినాడు. అంతే నవరత్నాలు కుప్పలు కుప్పలు కిందపడినాయి.

అది చూసి రాజసైనికులు ఆచ్చర్యపోయి వురుక్కుంటా రాజు దగ్గరికి పోయి విషయం చెప్పినారు. వెంటనే రాజుకి వాడు తన తమ్ముడే అని అర్థమయిపోయి వురుకులు పరుగుల మీద ఆడికి వచ్చినాడు.

అట్లా అన్నాదమ్ములిద్దరూ మళ్ళా కలుసుకున్నారు.ఆ తర్వాత ఇద్దరూ పోయి వాళ్ళమ్మా నాన్నలను పిల్చుకోనొచ్చి అందరూ కలసి హాయిగా వున్నారు.

# 50 దొర్లుదొర్లు పుచ్చకాయ్ దొర్లకుంటె దోసకాయ్

ఒకూర్లో ఒక పొట్టేలుండేది. అది రోజూ వూరి బైటకు పోయి మేత మేసి వస్తా వుండేది. ఒక సంవత్సరం ఆ వూర్లో పెద్ద కరువొచ్చింది. కరువంటే తెల్సుగదా. అస్సలు వానలు పడవు. వానలు పడకపోతే ఏమౌతాది పంటలు పండవు. చెట్లూ మొలకెత్తవు. దాంతో మనుషులకే గాదు, పశువులక్కూడా తిండి దొరకడం కష్టమైపోతాది. పాపమా పొట్టేలుకు పొద్దున్నించీ సాయంత్రం వరకూ ఎంత వెదికినా సగం కడుపు కూడా నిండేది గాదు. అట్లా కొన్ని రోజులుపోయే సరికి తిండి సరిగా లేక అది సన్నగా బక్కచిక్కి పోయింది.

ఆ వూరికి కొంచం దూరంలోనే పెద్ద అడవి వుంది. అడవన్నాక రకరకాల మొక్కలు, చెట్లు వుంటాయి గదా. వాటిని తిని కడుపు నింపుకోవచ్చని పొట్టేలు ఆ అడవికి బైలుదేరింది.

అడవిలో తిండి వెతుక్కుంటా అట్లా పోతా వుంటే దారిలో ఒక నక్క ఎదురైంది. నక్కకు పొట్టేలును చూస్తానే నోట్లో నీళ్ళూరినాయి. వెంటనే ఎగిరి పొట్టేలును పట్టుకొని "పొట్టేలు బావా... పొట్టేలు బావా... నిన్ను తినాలనిపిస్తోంది" అనింది.

దానికా పొట్టేలు బాగా ఆలోచించి "నక్క బావా... నక్కబావా... ఇప్పుడు నాలో ఎముకలు తప్ప కండ అస్సల్లేదు. చానా రోజుల్నుండి తిండి లేక సగానికి సగం బక్కచిక్కిపోయినాను. నన్నొదిలేస్తే నల్లకొండకు పోయి నాలుగాకులు, ఎర్రకొండకు పోయి ఏడాకులు, పచ్చకొండకు పోయి పదాకులు మేసి బాగా బలిసి, కొవ్వుపట్టి వస్తా... అప్పుడు తిందువుగానీలే" అనింది. "అట్లాగా... ఐతే తొందరగా పోయి బాగా బలిసిరాపో" అని నక్క దాన్ని విడిచిపెట్టింది.

పొట్టేలు 'బతుకు జీవుడా' అని కొంచం దూరం పోగానే ఒక పులి ఎదురొచ్చింది. అది ఎగిరి పొట్టేలును పట్టుకోని "పొట్టేలు బావా... పొట్టేలు బావా... నిన్ను తినాలనిపిస్తోంది" అనింది.

దానికా పొట్టేలు "పులి బావా... పులి బావా... ఇప్పుడు నాలో ఎముకలు తప్ప కొవ్వు అస్సల్లేదు. నన్నొదిలేస్తే నల్లకొండకు పోయి నాలుగాకులు, ఎర్రకొండకు పోయి ఏడాకులు, పచ్చకొండకు పోయి పదాకులు మేసి బాగా బలిసి, కొవ్వుపట్టి వస్తా. అప్పుడు తిందువుగానీలే" అనింది. పులి "అలాగా... ఐతే తొందరగా పోయి బాగా బలిసి రాపో.." అని పులి దాన్ని విడిచిపెట్టింది.

పొట్టేలు హమ్మయ్య అనుకుంటా బెరబెరా కొంచం దూరం పోయిందో లేదో అంతలోనే ఒక సింహం ఎదురొచ్చింది. అది వెంటనే ఎగిరి పొట్టేలును పట్టుకోని "పొట్టేలు బావా... పొట్టేలు బావా... నిన్ను తినాలనిపిస్తోంది" అనింది.

దానికా పొట్టేలు బాగా ఆలోచించి "సింహం బావా... సింహం బావా... ఇప్పుడు నాలో ఎముకలు తప్ప కొవ్వు అస్సల్లేదు. నన్నొదిలేస్తే నల్లకొండకు పోయి నాలుగాకులు, ఎర్రకొండకు పోయి ఏడాకులు, పచ్చకొండకు పోయి పదాకులు మేసి బాగా బలిసి కొవ్వుపట్టి వస్తా... అప్పుడు తిందువుగానీలే" అనింది. "అట్లాగా... ఐతే తొందరగా పోయి బాగా బలిసి రాపో" అని సింహం దాన్ని విడిచిపెట్టింది.

అట్లా పొట్టేలు నక్క, పులి, సింహాలను తప్పించుకోని నల్లకొండకు పోయి నాలుగాకులు, ఎర్రకొండకు పోయి ఏడాకులు, పచ్చకొండకు పోయి పదాకులు మేసి బాగా బలిసింది. కొన్ని రోజుల తర్వాత వానలు బాగా పడినాయి. దాంతో అది తిరిగి ఇంటికి పోవాలనుకోనింది.

కానీ... దార్లో నక్క, పులి, సింహం ఎదురు చూస్తా వుంటాయి గదా. వాటినెలా తప్పించుకోవాలబ్బా అనాలోచించి ఒక పెద్ద పుచ్చకాయలో దూరింది. పుచ్చకాయంటే తెలుసు గదా. కొందరు దాన్ని కలింగడి కాయ అని కూడా అంటారు. పొట్టేలు ఆ పుచ్చకాయలో దూరి

"దొర్లు... దొర్లు... పుచ్చకాయ్

దొర్లకుంటె దోసకాయ్..." అనుకుంటా గునగునగునమని దొర్లుకుంటా పోసాగింది.

అట్లా దొర్లుకుంటూ పోతా వుంటే దారిలో సింహం ఎదురై "ఏందబ్బా ఇట్లా దొర్లుకుంటా పోతా వుంది" అని చూసి "ఏందోలే" అనుకోని కాలితో ఒక తన్ను తన్నింది. దాంతో అదింకా వేగంగా గునగునగునమని దొర్లుకుంటా పోసాగింది.



అట్లా మరి కొంచం దూరం దొర్లుకుంటా పోగానే పులి ఎదురై "ఏందబ్బా ఇట్లా దొర్లుకుంటా పోతా వుంది" అని చూసి "ఏందోలే" అనుకోని అది గూడా ఈడ్చి కాల్తో ఒక్క తన్ను తన్నింది. దాంతో అది మరింత వేగంగా గునగునగునమని దొర్లుకుంటా పోసాగింది.

అలా ఇంకొంచెం దూరం పోగానే నక్క ఎదురైంది. పులిలాగా, సింహంలాగా నక్క తెలివి తక్కువది కాదుగదా. దాంతో అది "ఇదేందబ్బా... పుచ్చకాయేంది... ఇట్లా దొర్లుకుంటా పోవడవేంది. దీని సంగతేవో కనుక్కోవాల"ని దానెంబడే వురకడం మొదలు పెట్టింది.

పుచ్చకాయలో వున్న పొట్టేలు తన వెనకాలే నక్క వురుక్కుంటా రావడం చూసి దానికి దొరగ్గూడదని

"దొర్లు... దొర్లు... పుచ్చకాయ్
దొర్లకుంటె దోసకాయ్..."

అనుకుంటా మరింత వేగంగా దొర్లడం మొదలుపెట్టింది. అట్లా కొంచం దూరం పోగానే దారిలో ఒక పెద్దరాయి దానికి అడ్డమొచ్చింది. అది చూసుకోలా... వేగంగా పోయి దభీమని దానికి కొట్టుకోనింది. అంతే ఆ దెబ్బకు అది ఫక్కున పగిలి రెండు ముక్కలై పొట్టేలు బైటపడింది.



పొట్టేలును చూసిన నక్క "అమ్మదొంగా... నువ్వా లోపలుంది. నన్నే తప్పించుకోని పోదామనుకుంటా వున్నావా'' అని ఎగిరి దాన్ని పట్టుకోనింది. అప్పుడా పొట్టేలు "అదికాదు నక్కబావా.. నీకు బాగా బలిసి మళ్ళా వస్తానని చెప్పి పోతా వుంటే దారిలో పులి, సింహం కూడా అడ్డం పడినాయి. కానీ ముందు నీకే మాటిచ్చా గదా. అందుకని వాటికి దొరగ్గూడదని దీన్లో దూరి నీ దగ్గరకే వస్తావున్నా. కానీ ఒక్కమాట. పులి, సింహం నా కోసం వెదుకుతా వెనకాల్నే వస్తా వున్నాయి. అవిగానీ ఈడ మనల్ని చూసినాయనుకో... నన్నే గాదు, నిన్ను కూడా కమ్మగా కూరొండుకోని తింటాయి. నా వెంబడే మా ఇంటికి రా. ఆడైతే ఎవరూ వుండరు. నువ్వొక్క దానివే హాయిగా నన్ను తినొచ్చు. ఏమంటావ్" అనింది. నక్క సరేనని దానెంబడే వూరికి బైలుదేరింది.

అడవి దాటి కొంచం దూరం పోగానే పొట్టేలు ఇండ్లొచ్చింది. అది నక్కతో "నువ్వు రొంతసేపు ఈన్నే వుండు. నేను పోయి ఇంట్లో ఎవరన్నా వున్నారేమో చూసొస్తా" అనింది. నక్క సరేననింది.

పొట్టేలు ఇంట్లోకి పోయింది. వాళ్ళింట్లో ఒక పెద్దకుక్క వుంది. పొట్టేలు దాన్ని పిల్చి "కుక్కబావా... కుక్కబావా... నన్ను తినడానికి నక్క వెంటబడింది. నువ్వే ఎట్లాగైనా నన్ను కాపాడాల" అనింది.

కుక్క "అట్లాగా ఆగు దాని సంగతి చెప్తా" అని మొరుగుతా బైటికి వచ్చింది. అంతే... కుక్కను చూడగానే నక్క పైప్రాణాలు పైన్నే పోయినాయి. దానికి దొరికితే అంతే సంగతనుకోని తిరిగి చూడకుండా అడవి వైపు పారిపోయింది.

# 51 అద్దిరబన్నా

ఒకూర్లో ఒకడుండేటోడు... వాడొకరోజు వాళ్ళ అత్తోళ్ళ వూరికి పోయినాడు. రాక రాక అల్లుడొచ్చినాడు గదా అని వాళ్ళత్త బాగా పూర్ణమేసి కుడుములు చేసి పెట్టింది. అంతవరకూ వాడెప్పుడూ వాని జన్మలో కుడుములు చూడలేదు. తినలేదు. అదే మొదటిసారి. దాంతో వాటి రుచి చూసి "అబ్బ... ఎంత బాగున్నాయివి" అని లొట్టలేసుకోని తినుకుంటా "అత్తా... అత్తా... దీండ్ల పేరేమి" అనడిగినాడు. దానికి వాళ్ళత్త "కుడుములు" అని చెప్పింది. వాడు పళ్ళెంలో వున్నవన్నీ నున్నగా తినేసి మరో నాలుగు యేపిచ్చుకోని "వీటిని ఎట్లా చేస్తారత్తా" అనడిగినాడు. దానికి వాళ్ళత్త "అరెరే నీవింతవరకూ ఎప్పుడూ కుడుములు తినలేదా... నీ పెండ్లానికి వీటిని చేయడం బాగా వచ్చులే... పోయి అడుగు.... చేసి పెడతాది" అని చెప్పింది.

సరేనని సాయంత్రం వాడు మళ్ళా ఒక నాలుగు తిని ఇంటికి బైలుదేరినాడు. దాండ్ల పేరు యాడ మర్చిపోతానో ఏమో అనుకోని "కుడుములు... కుడుములు... కుడుములు... కుడుములు..." అనుకుంటా పోవడం మొదలుపెట్టినాడు. అట్లా "కుడుములు... కుడుములు..." అనుకుంటా పోతా వుంటే దారిలో ఒక చిన్న నీటికాలువ అడ్డమొచ్చింది. దాంట్లో దిగితే తడిసిపోతానేమోనని వాడు వెనక్కి నాలుగడుగులేసి వురుక్కుంటా వచ్చి "అద్దిరబన్నా" అని ఎగిరి అవతలికి ఒక్క దుంకు దుంకినాడు. అట్లా "అద్దిరబన్నా" అని ఎగిరి అవతలికి దుంకినాడు కదా... అట్లా దుంకడం... దుంకడం... వాడు "కుడుములు" అనే మాట మర్చిపోయి "అద్దిరబన్నా... అద్దిరబన్నా..." అనుకుంటా పోవడం మొదలుపెట్టినాడు.

వాడు ఇంటికి పోవడం ఆలస్యం పెండ్లాన్ని పిల్చి "ఏమే... మీ ఇంట్లో మీ అమ్మ అద్దిరబన్నలు చేసి పెట్టింది. అబ్బ... అంత రుచికరమైనవి నా జన్మలో ఎప్పుడూ తినలా. నువ్వుగూడా చెయ్యే" అన్నాడు. ఆమెకు కుడుములంటే తెల్సుగానీ... అద్దిరబన్నలంటే తెలీదు గదా... దాంతో "ఏమోనండీ.... అద్దిరబన్నలంటే ఏంటివో నాకు తెలీదు. అస్సలాపేరే ఎప్పుడూ వినలేదు" అనింది.

ఆ మాటింటూనే వానికి తెగ కోపమొచ్చేసింది. "ఓసి... దొంగదానా... ఎప్పుడూ ఏమీ అడగనోన్ని నోరు తెరిచి చెయ్యే అంటే... తెలిసి గూడా తెలీదంటావా. మీ అమ్మ నీకు అద్దిరబన్నలు చేయడం బాగా వచ్చని వచ్చేముందు చెప్పింది. మర్యాదగా నోర్మూసుకోని చేసిపెట్టు" అన్నాడు.

పాపం... ఆమెకు ఎంత ఆలోచించినా అవేంటివో అర్థం కాలేదు. దాంతో "నిజం చెబ్తావున్నా... ఆ దేవుని మీదొట్టు అద్దిరబన్నలంటే ఏంటివో నాకస్సలు తెలీదు. నన్నొదిలెయ్యి" అనింది.

దాంతో వాడు కోపంగా వూగిపోతా మూలనున్న దుడ్డుకర్ర తీసుకోనొచ్చి "ఏమే... మర్యాదగా అడుగుతా వుంటే చేయనంటావా... వుండు నీ పని చెబుతా" అంటూ పావం ఆమెను కొట్టడం మొదలుపెట్టినాడు. ఆమె ఆ దెబ్బలకు తట్టుకోలేక "అమ్మో... నాయనో... నా మొగుడు నన్ను చంపేస్తున్నాడ్రో దేవుడో..." అంటూ గట్టిగా ఏడుస్తా అరవడం మొదలుపెట్టింది.



ఆ అరుపులు విని చుట్టుపక్కన వున్నోళ్ళందరూ వురుక్కుంటా వచ్చి ఆమెను ఇడిపిచ్చి "ఏందిరా... ఏం పాపం చేసిందని నీ పెండ్లాన్ని అట్లా కొడ్తా వున్నావు" అనడిగినారు.

దానికి వాడు కోపంతో చిందులు తొక్కుతా "ఏందా... ఈ దొంగసచ్చినేది పని తప్పిచ్చుకోవాలని అద్దిరబన్నలు చేయమంటే తెలిసి గూడా తెలీదంటుంది. అందుకే తంతావున్నా" అన్నాడు. ఆడున్నోళ్ళగ్గూడా ఈ అద్దిరబన్నలంటే ఏంటివో అర్థం కాలేదు.

అంతలో ఒక ముసిలామె ఆమె ఒళ్ళంతా దెబ్బలతో కందిపోయింటే చూస్తూ "ఒరే... నీకేం పోయే కాలమొచ్చిందిరా... అద్దిరబన్నలంటే తెలీదని చెప్తా వున్నా వినకుండా గొడ్డును బాదినట్లు అట్లా బాదినావు. ఒళ్ళు చూడు... పాపం... కుడుములు కట్టినట్లు ఎట్లా కందిపోయిందో" అనింది.

"కుడుములు" అనే మాటినేసరికి వాడదిరిపడి "ఆ... ఆ... అవే... అవే... అద్దిరబన్నలు కాదు... కుడుములు... కుడుములు..." అన్నాడు.

ఆమాటినేసరికి అందరూ "ఓరినీ... నీ మతిమరుపు మీద బండపడ. కుడుములని ముందే చెప్పింటే చేసిపెట్టుండె గదా. పాపం వుత్త పుణ్యానికే అద్దిరబన్నలు... అద్దిరబన్నలు... అంటా సావగొట్టినావు" అంటూ వాన్ని బాగా తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టి వెళ్ళిపోయినారు.

# 52 చేసిన మేలు మరవకు

ఒకూర్లో ఒక రైతు వుండేటోడు. ఆయన చానా పేదోడు. కానీ చానా మంచోడు. ఎవరైనా సరే ఆపదలో వుంటే చేతనైన సాయం చేసేటోడే గానీ కాదు లేదు అనేటోడు కాదు. ఒకసారి ఆ వూర్లో పెద్ద కరువు వచ్చింది. వానలు అస్సలు పడలేదు. దాంతో పంటలు లేక, పైసలు రాక ఆ రైతు ఏదయినా పని దొరుకుతుందేమోనని దూరంగా వున్న వాళ్ళ అత్తోళ్ళ వూరికి బైలుదేరినాడు. దారిలో పెద్ద అడవి వుంది. ఆ అడవిలో పోతా వుంటే ఒకచోట ఒక పాడుబన్న బావిలోంచి "కాపాడండి... కాపాడండి" అంటూ అరుపులు వినబన్నాయి. "ఎవరబ్బా లోపల" అనుకుంటా ఆ రైతు వచ్చి తొంగి చూసినాడు. దానిలో ఒక నాగుపాము, పులి, మనిషి కనబన్నారు. బావిలో నీళ్ళు మరీ ఎక్కువగా లేవు. తక్కువగా లేవు. నడుముల దాకా వున్నాయి. కానీ పైకి రావడం చానా కష్టం. చుట్టూ గోడలు నున్నగా ఎత్తుగా పాచిబట్టి చేయి పెడ్తే జారిపోయేటట్లుగా వున్నాయి.

అంతలో పులి "ఓ మనిషి మామా... మనిషి మామా... నన్ను కాపాడవా... ఇప్పటికి పదిరోజులైంది లోపల పడి. తినడానికి తిండి లేక ఇంకో గంటకో అరగంటకో చచ్చేటట్టున్నా" అనింది.

దానికా రైతు "అబ్బా... నిన్నా... నువ్వసలే అడవి జంతువువి. దానికితోడు మాంచి ఆకలి మీద వున్నావు. పైకి రాగానే నన్ను చంపేస్తే" అన్నాడు భయం భయంగా.

దానికా పులి "ఏంది మామా... అంత మాటంటావు. మాట తప్పడానికి మేమేమైనా మనుషులమా... కన్నతల్లిని, వున్న వూరిని, చిన్ననాటి స్నేహితున్ని, ప్రాణాలు కాపాడిన జీవిని ఎవరైనా మరచిపోతారా" అనింది. సరేనని ఆ రైతు అక్కడ వున్న ఒక పెద్ద మర్రిచెట్టు వూడలు ఒకదానితో ఒకటి తాడులెక్క పేని లోపలికి ఇడిచినాడు. పులి దాన్ని గట్టిగా పట్టుకోగానే బలమంతా వుపయోగించి పైకి లాగినాడు. పులి బైటకు వచ్చి సంబరంగా "మనిషిమామా... నీ మేలు ఎన్నటికీ మరిచిపోను. నీవు ఆపదలో వున్నప్పుడు నన్ను తలచుకో. నా చేతనైన సాయం చేస్తాను. కానీ ఒక్కమాట. ఆ మనిషిని మాత్రం కాపాడొద్దు. వాడు అంత మంచోడు కాదు" అని చెప్పి వెళ్ళిపోయింది.

అంతలో బావిలో నుంచి పాము "ఓ మనిషి బావా... మనిషి బావా... నన్ను కాపాడవా... ఇప్పటికి వారం రోజులైంది లోపలపడి. నన్ను తీయడం గూడా చాలా సులభం. ఏం పెద్ద బరువుండను" అనింది.

దానికా రైతు "అమ్మో... నిన్నా... నువ్వసలే విషపు జీవివి. బైటకు రాగానే నన్ను కాటేస్తే" అన్నాడు భయంభయంగా. దానికాపాము "ఏంది బావా... అంత మాటంటావు. ఏదో చావు భయంతో మమ్మల్ని మేము కాపాడుకోడానికి కాటేస్తాం గానీ వూకూకెనే కారణం లేకుండా చంపడానికి మేమేమన్నా మనుషులమా" అనింది.

ఆ మాటలకు రైతు సరేనని మరలా తాడు లోపలికి ఇడిచినాడు. పాము దానికి చుట్టుకోని పైకి వచ్చింది. అది సంబరంగా "నీ మేలు ఎన్నటికీ మరచిపోను. నీవు ఆపదలో వున్నప్పుడు నన్ను తలచుకో. చేతనైన సాయం చేస్తాను. కానీ ఒక్కమాట. ఆ మనిషిని మాత్రం కాపాడొద్దు. మాకు కోరల్లోనే విషం వుంటాది. కానీ వానికి నిలువెల్లా విషమే... జాగ్రత్త" అని చెప్పి వెళ్ళిపోయింది.

దాంతో రైతు వాన్ని కాపాడాలా వద్దా అని ఆలోచనలో పడినాడు. అంతలో ఆ మనిషి "అనా... అనా... అడవి జంతువును, విషపు జీవిని కాపాడి సాటి మనిషిని కాపాడడానికి ఏం అంతగా ఆలోచిస్తా వున్నావు. ఇప్పటికే లోపల పడి నాలుగు రోజులైంది. నోరు తెరిచి అడిగితే పగవాడికైనా సరే చేయందించాలే తప్ప వెన్ను చూపగూడదు అంటారు పెద్దలు. అటువంటిది నీకూ నాకూ మధ్య అసలు ఎటువంటి గొడవలూ లేవు గదా" అన్నాడు.

దానికా రైతు "అయ్యయ్యో... నేనందుకు ఆలోచించడం లేదు. కాస్త లావుగా వున్నావు గదా... ఈ వూడలు సరిపోతాయా... ఇంకొంచం లావుది పేనాలా అని ఆలోచిస్తా వున్నా... అంతే... ఐనా ఆపదలో వున్న సాటి మనిషికి సాయం చేయలేని బదుకూ ఒక బదుకేనా" అంటూ మరికొన్ని వూడలు పట్టుకోనొచ్చి లావుగా పేని దానిని బావిలోనికి వదిలినాడు. దాంతో అతను తాడు పట్టుకొని నెమ్మదిగా బైటకి వచ్చినాడు.

ఆ మనిషి సంతోషంతో "నీ మేలు ఎన్నటికీ మరచిపోలేను. నీళ్ళు దాహమేస్తా వుంటే చెంబుకు తాడుకట్టి లోపలికి వదుల్తా కాలు జారి లోపల పడినా. మూడు రోజుల నుండీ ఇటువైపు వచ్చినోడే లేడు. బతుకుపైన ఆశలు వదిలేసుకున్నా. దేవుడే నిన్ను పంపించినాడు. నేను ఈ పక్కనే వున్న గ్రామానికి అధికారిని. నీకేమయినా సాయం కావాలంటే తప్పకుండా రా" అని చెప్పి వెళ్ళిపోయినాడు.

రైతు తిరిగి నడవడం మొదలుపెట్టినాడు. తరువాత రోజుకల్లా వాళ్ళ అత్తోళ్ళ వూరికి చేరుకున్నాడు. ఆడ గూడా పనులు పెద్దగా లేవు. ఒకరోజు తింటే మరొకరోజు పస్తే. అట్లా ఒక నాలుగు నెల్లు గడిచిపోయినాయి. ఇక లాభం లేదు అనుకోని తిరిగి వూరికి బైలుదేరినాడు. అట్లా పోతా వుంటే అడవిలో తాను కాపాడిన పులి గుర్తుకు వచ్చింది. అది ఎట్లా వుందో చూద్దామని దాన్ని పిలిచినాడు గట్టిగా. ఆ పిలుపుకు అడవిలో యాడనో వున్న పులి పరుగు పరుగున వచ్చింది. రైతును ఇంటికి తీసుకోని పోయి కడుపు నిండా కావాల్సినవన్నీ పెట్టింది. తిరిగి పోయేటప్పుడు ఒక విలువైన వజ్రాల హారం తీసుకోనొచ్చి "అడవిలో ఆహారం కోసం ఒక దొంగను చంపినప్పుడు వాని దగ్గర దొరికింది. దీన్ని అమ్ముకోని ఆనందంగా బతుకు" అంటూ చేతిలో పెట్టింది.

రైతు సంబరంగా దాన్ని తీసుకోని బైలుదేరినాడు. అంత విలువైన హారాన్ని ఎక్కడ అమ్మాలో, ఎవరికి అమ్మాలో తెలీలేదు. అంతలో తాను కాపాడిన మనిషి గుర్తుకు వచ్చినాడు. దాంతో అతని దగ్గరికి పోయినాడు. అతను ఆ గ్రామానికి అధికారి. రైతును చూడగానే సంబరంగా ఇంటికి పిలుచుకోని పోయి మంచిగా మర్యాదలు చేసినాడు. రైతు ఆ రోజు రాత్రి ఎవరూ లేని సమయంలో తన జేబులోని హారాన్ని తీసి గ్రామాధికారికిచ్చి జరిగిందంతా చెప్పి అమ్మి పెట్టమన్నాడు.

గ్రామాధికారి ఆ హారాన్ని చూడగానే అదిరిపన్నాడు. అది మామూలు హారం కాదు. ఆ రాజ్యాన్ని పాలించే మహారాజుకు తరతరాల నుంచీ వస్తావున్న ఎంతో విలువైన హారమది. అదంటే రాజుకు ప్రాణం. తాను పూజించే దేవత మెడలో అలంకరించి రోజూ పూజలు చేసేవాడు. అలాంటి హారం పోవడంతో మహారాజు "ఎవరైతే ఆ

దొంగను పట్టి, హారాన్ని తిరిగి అప్పగిస్తారో వారికి నిలువెత్తు బంగారం, కోరిన పదవి ఇస్తానని" దండోరా వేయించినాడు.

గ్రామాధికారికి ఆ హారాన్ని చూడగానే బంగారం మీద, పదవి మీద మోజు పుట్టింది. దాంతో జరిగిందేమీ ఆ రైతుకు చెప్పకుండా "సరే... ఈ హారం నీ వద్దనే వుంచుకో. మా రాజుకు ఇలాంటివంటే చానా ఇష్టం. ఇంత విలువైనవి ఆయన తప్ప ఎవరూ కొనలేరు. రేపు రాజు దగ్గరికి తీసుకోని పోతా. ఆయన అడిగితే "ఇది నాదే. మాతాత ముత్తాతల నుంచీ వస్తా వుంది. కాలం బాగాలేక అమ్ముతా వున్నా" అని చెప్పు అన్నాడు.

గ్రామాధికారి తరువాత రోజు పొద్దున్నే రాజు దగ్గరికి పోయి "రాజా... నీ హారాన్ని దొంగిలించిన దొంగ దొరికినాడు. నిన్న నావద్దకు వచ్చి దాన్ని అమ్మజూపినాడు. వానికి మాయమాటలు చెప్పి రేపు నీ వద్దకు తీసుకోనొస్తా" అన్నాడు. రాజు 'సరే' అన్నాడు.

తరువాత రోజు గ్రామాధికారి రైతును రాజు దగ్గరికి తీసుకపోయినాడు. రాజు ఆ హారం చూసి "ఇది ఎవరిది, నీకు యాన్నుంచి వచ్చింది" అనడిగినాడు. దానికా రైతు "రాజా! ఇది నాదే. మాతాత ముత్తాతల నుంచీ తరతరాలుగా వస్తా వుంది. కాలం బాగాలేక అమ్ముతా వున్నా" అన్నాడు. వెంటనే రాజు కోపంగా "ఏరా... నా హారం ఎత్తుకోని పోయింది గాక మళ్ళా నాకే అబద్దాలు చెప్పి అమ్మజూపుతున్నావా... నేనంత తిక్కలోని మాదిరి కనిపిస్తా వున్నానా" అంటూ సైనికులను పిలిపించి "రేయ్... వీన్ని తీసుకోని పోయి చెరశాలలో బంధించి రేపు సాయంకాలం వూరందరి ముందు వురి వేయండి" అన్నాడు. ఆ మాటలకు రైతు లబోదిబోమన్నాడు. "రాజా... నన్ను వదిలేయండి. నేను దొంగను కాను" అంటూ జరిగిందంతా చెప్పినాడు. కానీ రాజు వాని మాటలు నమ్మలేదు. సైనికులు రైతును తీసుకోని పోయినారు. రాజు గ్రామాధికారికి నిలువెత్తు బంగారమిచ్చి, ఒక సామంత రాజ్యానికి రాజును చేసినాడు.

రైతుకు కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి. ఇంకొక్క రోజు దాటితే చావడం ఖాయం. ఎట్లాగబ్బా తప్పించుకోవడం అని ఆలోచిస్తా వుంటే పాము గుర్తుకు వచ్చింది. దానిని తలచుకున్నాడు. అంతే... అది నిమిషాల్లో వాని ముందుకు వచ్చింది. జరిగిందంతా విని "అందుకే నేను ముందే చెప్పాను. వాడు అంత మంచోడు కాదని. సరే జరిగిందేదో జరిగింది. బైట పడే ఉపాయం చెబ్తా విను" అంటూ ఏం చేయాల్నో చెప్పింది. రైతు సరేనంటూ అదిచ్చిన మూలిక తీసుకోని జాగ్రత్తగా దాచిపెట్టుకున్నాడు.

ఆ నాగుపాము నెమ్మదిగా ఎవరికీ కనబడకుండా రాణి వుండే గదిలోనికి పోయింది. పన్నుకున్న రాణి కాలి మీద పూర్తిగా లోనికి దిగకుండా ఒక్కేటు వేసింది. అంతే ఆ నొప్పికి రాణి అదిరిపడి లేచి "పాము... పాము..." అంటూ గట్టిగా అరవసాగింది. భటులు లోపలికి వచ్చేసరికి పాము కనబడకుండా పారిపోయింది.

పాము కాటేసిన కాసేపటికే రాణి నురగలు కక్కుకుంటా పడిపోయింది. నొప్పితో విలవిలలాడసాగింది. రాజు రాజ్యంలోని వైద్యులందరినీ పిలిపించినాడు. ఎవరు ఎన్ని మందులు వాడినా ఆమె నొప్పి కొంచంగూడా తగ్గలేదు. ఏం చేయాలబ్బా అని ఆలోచిస్తా వుంటే రైతు భటులతో "నాకు రాణికి విషం ఎట్లా దించాల్నో తెలుసు. ఒక అవకాశం ఇవ్వమని రాజుకు చెప్పండి" అన్నాడు. వాళ్లు సరే అని విషయం రాజుకు చెప్పినారు. "సరే... ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు" అనుకుంటా రాజు రైతును పిలిపించినాడు. రైతు పాము ఇచ్చిన మూలిక తీసుకోనొచ్చి దాన్ని అరగదీసి కాటు వేసిన చోట పూసి కట్టుకట్టినాడు. కాసేపటికి నొప్పి తగ్గిపోయి రాణి

మామూలుగైపోయింది. అది చూసి రాజు చానా సంబరపన్నాడు.



అప్పుడా రైతు "రాజా! నేను అబద్ధం చెప్పడం లేదు. అంతా నిజమే చెబుతా వున్నాను. నాకా హారం ఇచ్చింది పులే. కాకపోతే గ్రామాధికారి ఆ విషయం చెప్పొద్దు అనడంతో అలా చెప్పాను" అన్నాడు. దానికి రాజు "నీవు చెబుతా వున్నది నిజమే అని నేను ఎలా నమ్మాలి" అన్నాడు. అంతలో రాజ్యమంతా పులుల గర్జనలతో దద్దరిల్లి పోసాగింది. జనాలంతా భయపడి ఇళ్ళూ వాకిళ్ళూ ఎక్కడివక్కడ వదిలేసి పారిపోసాగినారు. అంతలో సైనికులు వురుక్కుంటా వచ్చి "రాజా! ఎక్కడెక్కడి పులులన్నీ గుంపులు గుంపులుగా వచ్చి రాజ్యం మీద పడినాయి. మా జన్మలో ఎప్పుడూ అన్ని పులులను చూడలేదు. వాటిని ఏం చేయాలో తోచడం లేదు" అని చెప్పినారు.

రాజు ఆ మాటలకు ఆచ్చర్యపోయినాడు. అంతలో ఆడికి రైతు కాపాడిన పులి వచ్చింది. రైతును చూసి "నువ్వేం భయపడొద్దు. నేనిచ్చిన హారం వల్లనే కదా నువ్వు చిక్కుల్లో పడింది. అందుకే నిన్ను కాపాడ్డానికి మా వాళ్ళందరినీ తీసుకోనొచ్చా" అని చెప్పింది.

రాజు పులి ద్వారా జరిగిందంతా మరొక్కసారి తెలుసుకొని రైతును విడిచిపెట్టినాడు. రాజు తానిచ్చిన మాట ప్రకారం రైతుకు నిలువెత్తు బంగారం ఇచ్చి, వాళ్ళ గ్రామానికి అధికారిని చేసినాడు. పులి వాన్ని తన మీద ఎక్కించుకోని తిరిగి వాళ్ల వూరిలో విడిచి పెట్టడానికి మిగతా పులలతో సంబరంగా బైలుదేరింది. నమ్మించి మోసం చేసినందుకు ఆ గ్రామాధికారిని పిలిపించి అందరి ముందు వంద కొరడా దెబ్బలు కొట్టించి, "ఇంకెప్పుడూ నా రాజ్యంలో కనబడొద్దు" అంటూ కట్టుబట్టలతో వూరి పొలిమేరల వరకు తరిమి తరిమి కొట్టించినాడు.

# 53 చందమామ కథ

చందమామ మీకు తెలుసు గదా... రాత్రివేళ చల్లని వెన్నెల కురిపిస్తా వుంటాడు. ఔను... ఇంతకీ చంద్రుడు మనకి మామ ఎట్లవుతాడో మీకెవరికైనా తెలుసా... తెలీదా... సరే ఈ రోజు మనం ఆ కథని చెప్పుకుందాం.

పాలసముద్రం లోపల అమృతముందంట. సముద్రమంటే మాటలా... చానా చానా పెద్దగుంటాది. ఒకరోజు దేవతలు, రాక్షసులు అమృతం కోసం దాన్ని చిలకాలనుకున్నారు. చిలకాలంటే కవ్వం కావాలి కదా... మనింట్లో మాదిరి మామూలు కవ్వమయితే లాభం లేదు. అందుకని వాళ్ళు ఎత్తయిన మంధర పర్వతాన్ని తెచ్చినారు. సరే పర్వతమయితే తెచ్చినారు కానీ చిలకడానికి అంత పెద్ద తాడెక్కడ దొరుకుతాది. అందుకని పాముల రాజయిన వాసుకి అనే పాముని ఒప్పించి దానిని తాడు మాదిరి కట్టినారు. ఇక చిలకడానికి రాక్షసులొకపక్క, దేవతలొకపక్క చేరినారు. అంతలో ఒక సమస్యొచ్చి పడింది.

మంధర పర్వతం చానా బరువుంటుంది గదా... ఆధారం లేకపోతే అది పాలసముద్రంలో లటుక్కున మునిగిపోతుంది... మరి ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే విష్ణువు పెద్ద రాక్షస తాబేలు అవతారం ఎత్తినాడు. అందరూ కలిసి దాని డొప్ప మీద పర్వతాన్ని వుంచినారు.

ఇక దేవతలు, రాక్షసులు కష్టపడి చిలకడం మొదలుపెట్టినారు. సముద్రం లోపల ఎన్నెన్నో విలువయిన వస్తువులు వున్నాయంట. అవన్నీ ఒకొక్కటే పైకి రాసాగినాయి. కామధేనువు, కల్పవృక్షం, ఐరావతం... ఇట్లా ఎన్నెన్నో వచ్చినాయి. మనం పూజించే లక్ష్మీదేవి పుట్టింతర్వాత చంద్రుడు పుట్టినాడంట.

అంతలో హాలాహలం పుట్టింది. హాలాహలమంటే భయంకరమయిన కాళకూటవిషం. దాని దెబ్బకి అందరూ మిడతల్లా మాడిపోతా వున్నారంట. అంతలో శివుడొచ్చి దాన్ని తన కంఠంలో అంటే గొంతులో బంధించినాడు. శివుని కడుపులో పధ్నాలుగు లోకాలు వుంటాయంట. మింగితే అవన్నీ భస్మం అయిపోతాయని గొంతులో బంధించినాడంట. ఆ విషం వేడికి శివుని కంఠం నల్లగా కమిలిపోవడంతో... శివున్ని నీలకంఠుడనీ, విషాన్ని గొంతులో వుంచుకొన్నందుకు గరళకంఠుడనీ పిలుస్తా వుంటారు. హాలాహలం పుట్టిన కాసేపటికి అమృతం పుట్టిందంట.

రాక్షసులు వెంటనే అమృతం తీసుకోని పారిపోవాలని చూసినారు. కానీ విష్ణువు మోహినీ అవతారమెత్తి రాక్షసులకు అడ్డం పడి దాన్ని దేవతలకు మాత్రమే దక్కేలా చేసినాడు.



ఇదీ కథ.

ఇంతకీ మీకు చంద్రుడు మామెట్లా అవుతాడో చెప్పలేదు గదా... ఇప్పుడు చెబ్తా వినండి.

పాలసముద్రాన్ని చిలుకుతా వున్నప్పుడు లక్ష్మీదేవి పుట్టింది గదా... లక్ష్మీదేవి జగన్మాత అంటే మనకందరికీ తల్లిలాంటిదన్నమాట. లక్ష్మీదేవి తర్వాత పుట్టిందెవరు? చంద్రుడే గదా... అంటే లక్ష్మీదేవికి చంద్రుడేమవుతాడు. తమ్ముడౌతాడు... ఇక ఇప్పుడు చెప్పండి. మన అమ్మ తమ్ముడు మనకు ఏమవుతాడు? మామే గదా... అర్థమయ్యిందా... అందుకే చంద్రుడు మన అమ్మకు తమ్ముడై... మనకు మామై... చందమామ అయినాడు.

# 54 మోసం చేయాలనుకోకు మోసపోతావు

ఒకూర్లో ఒక పేదోడు, ఒక ధనవంతుడు వుండేటోళ్ళు. పేదోడు చానా మంచోడు అంతేగాక చానా తెలివైనోడు. ధనవంతుడు చానా చెడ్డోడు. అంతేగాక బుద్ధిలేనోడు. అంతేకాక పక్కనోళ్ళు హాయిగా వుంటే అస్సలు ఓర్చుకొనేటోడు కాదు. వాళ్ళ ఇద్దరివీ పక్కపక్క ఇండ్లే.

ధనవంతునికి పేదోడంటే చానా కోపం. ఎందుకంటే పేదోడు వున్నదాంట్లో తాను తింటా, నలుగురికీ పెడతా, ఎప్పుడూ అందరితో గలగలా మాట్లాడతా, కిలకిలమని నవ్వుతా సంబరంగా వుండేటోడు. ధనవంతుడు అట్లా కాదు. ఎప్పుడు చూసినా ఎవన్ని ఎట్లా ముంచాల్నా... ఎట్లా మరింత సంపాదించాల్నా అని ఆలోచిస్తా చిరాకుగా వుండేటోడు. రాత్రి పండుకున్నా వానికి నిద్ర సరిగా వచ్చేది కాదు. వాడు పక్కింట్లో వున్న పేదోన్ని చూసి "వీనికి తినడానికి పైసా గూడా లేకున్నా. పట్టుపరుపుల మీద పన్నుకునే నాకన్నా సంతోషంగా వుంటాడే" అని కోపం వచ్చేది. 'ఎట్లాగైనా సరే వీన్ని బాధపెట్టి వాని కళ్ళలో నీళ్ళు సూడాల' అనుకునేటోడు.

పేదోని దగ్గర ఒక మంచి బరగొడ్డు వుంది. రోజూ దాని పాలు పిండుకోని కావలసినంత తాగి తోడు పెట్టుకునేటోడు. తినడానికి ఏమీ లేకపోతే హాయిగా ఆ పెరుగునే మజ్జిగ చేసుకోని, ఇంత వుప్పేసుకోని కడుపు నిండా కమ్మగా తాగి, కళ్ళు మూసుకోని హాయిగా నిదురపోయేటోడు. ధనవంతుని కన్ను ఆ బరగొడ్డు మీద పడింది. ఒకరోజు ఎవరూ లేనిది చూసి మట్టసంగా ఆ బరగొడ్డును తీసుకోని పోయి చంపేసినాడు.

పేదోడు పొద్దున్నే లేసి చూస్తే ఇంకేముంది. బరగొడ్డు యాడా కనబళ్ళేదు. బైటికి యాడికయినా పోయిందేమోనని వీధి వీధి వెదికినాడు. యాడా కనబళ్ళేదు. ఆఖరికి ధనవంతుని ఇంటి వెనకాల దిబ్బలో దాని చర్మం కనబడింది. వాడు ఒక్కమాట కూడా అనకుండా ఆ చర్మాన్ని తీసుకోని ఇంటికి వచ్చినాడు. దాన్ని శుభ్రంగా కడిగి పక్కవూరిలో ఎంతకో ఒకంతకు అమ్ముదామని తోళ్ళ వ్యాపారి దగ్గరికి బైలుదేరినాడు.

కానీ అప్పటికే సాయంకాలమైంది. వూరు దాటి కొంచం దూరం పోయినాడో లేదో చీకటి పడింది. చీకట్లో పోవడానికి భయపడి ఎందుకయినా మంచిదని ఒక పెద్దచెట్టు ఎక్కి పైన కొమ్మల నడుమ కనబడకుండా కూర్చున్నాడు. కాసేపటికి కొంతమంది దొంగలు ఆడికి వచ్చినారు. చెట్టు కింద కూచోని ఎక్కడెక్కడి నుంచో దోచుకొని వచ్చిన సొమ్మంతా ముందు కుప్పేసుకోని పంచుకోసాగినారు. ఇదంతా పైనుంచి చూస్తోన్న పేదోడు "ఓ" అని గట్టిగా అరుస్తా "రేయ్... ఎవర్రా నా చెట్టు కిందకే వచ్చినారు. మిమ్మల్ని నలుచుకోని తింటా" అంటూ చేతిలోనున్న బరగొడ్డు చర్మం దభీమని వాళ్ళ మధ్య పడేసినాడు. దాన్ని చూస్తానే వాళ్ళు అదిరిపడి "ఓరినాయనోయ్... పైన ఏ రాక్షసుడో కూర్చోనున్నట్లున్నాడు. బరగొడ్డును తిని చర్మం పాడేసినాడు. కిందికి గనుక వచ్చినాడంటే మన

పని అంతే" అని బెదపడి ఎక్కడివక్కడ వదిలేసి తలా ఒక దిక్కు చించుకోని పారిపోయినారు. వాళ్ళట్లా ఉరకడం ఆలస్యం పేదోడు టకటకటక చెట్టు దిగి ఆడున్న బంగారమంతా బెరబెరబెర మూట గట్టుకోని చక్కగా ఇంటికి చెక్కేసినాడు.



ధనవంతుడు పొద్దున్నే లేసి చూస్తే ఇంకేముంది.. పేదోడు ఇంతకుముందు కన్నా సంబరంగా ఇంటి ముందు కూర్చోని పంచభక్ష పరమాన్నాలు తింటా కనబన్నాడు. అది చూసి ధనవంతుడు "ఏమిరా... అంత సంబరంగా కులుకుతా వున్నావు. ఏమైంది" అన్నాడు. దానికి వాడు కిలకిలకిలమని నవ్వుతా "ఏం లేదనా... ఈ మధ్యనే రోగాలొచ్చి చుట్టు పక్కల వూళ్ళలో పశువులన్నీ ఒక్కటి గూడా మిగలకుండా చచ్చిపోయినాయంట. దాంతో పట్నంలో పశువుల చర్మాలకు ఎక్కడ లేని గిరాకీ వచ్చింది. నాకు కావాలంటే నాకు కావాలంటూ ఎగబడి వేయి బంగారు వరహాలిచ్చి కొనుక్కోని పోయినారు. అబ్బ... నాకు ఇంకొన్ని పశువులు గనుక వున్నింటే దెబ్బకు పెద్ద జమీందారుని అయిపోయేటోన్ని" అన్నాడు.

ఆ మాటలింటానే ధనవంతునికి యాడలేని ఆశ పుట్టుకోనొచ్చింది. వాని దగ్గర వంద బరగొడ్లున్నాయి. వెంటనే అన్నిటినీ చంపించి చర్మాలన్నీ బండి మీదేసుకోని సంబరంగా పట్నానికి పోయినాడు. పోయి చూస్తే ఇంగేముంది అక్కడ ఒక్కడు గూడా పలకరించేటోడు లేడు. వూకిస్తామన్నా తీసుకునేటోడు లేడు. దాంతో వానికి పేదోడు దెబ్బకు దెబ్బ తీసినాడని అర్థమైంది. కోపంగా బుసలు కొడతా ఇంటికి వచ్చినాడు.

ఒకరోజు ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఆ పేదోని ఇంటిని మొత్తం తగలబెట్టేసినాడు. పేదోడు వచ్చి చూసేసరికి ఇంకేముంది మొత్తం బూడిదయిపోయింది. అట్లా చేసింది ధనవంతుడే అని తెలిసినా వాడు ఒక్కమాటా అనలేదు. గమ్మున ఆ బూడిదనంతా సంచులకెత్తుకోని బండిలో వేసుకోని వూరిబైట యాడయినా పారేద్దామని బైలుదేరినాడు.

అట్లా పోతా వుంటే దారిలో ఒక వ్యాపారి బండి మీద మూటలేసుకోని ఎదురుగా వచ్చినాడు. వాడు పేదోన్ని చూసి "ఏమున్నాయి ఆ సంచుల్లో" అన్నాడు. పేదోడు నవ్వుతా "రత్నాలు, వజ్రాలు" అన్నాడు. దానికా వ్యాపారి "అలాగా నా మూటల్లో బంగారం వుంది. నువ్వు నాకు రత్నాలు, వజ్రాలు ఇస్తావా... నేను నీకు బంగారం ఇస్తా" అన్నాడు. పేదోడు సరే అన్నాడు. దాంతో ఆ వ్యాపారి "అయితే బండ్లు మార్చుకుందాం రా" అంటూ తన బండి పేదోనికిచ్చి, పేదోని బండి తాను తీసుకోని పోయినాడు.

తరువాతరోజు పొద్దున్నే ధనవంతుడు లేసి చూస్తే ఇంకేముంది.. పేదోడు పట్టుబట్టలు కట్టుకోని వందమంది పనోళ్ళతో కొత్త ఇంటి కోసం పునాదులు తవ్విస్తా కనబన్నాడు. అది చూసి వాడు ఆచ్చర్యపడతా "ఇదేందిరా... ఇంత పెద్ద ఇంటి కోసం ఇంత మందితో పని చేయిస్తా వున్నావు. అంత దబ్బెక్కడిది" అన్నాడు. దానికి వాడు కిలకిలకిల నవ్వుతా "ఏం లేదనా... పక్కూర్లో ఒక వ్యాపారికి బూడిదతో చానా పని బడిందంట. దాంతో సంచి బూడిదకు సంచి బంగారం ఇస్తానని బంగారం మూటలు బండి మీదేసుకోని తిరుగుతా వున్నాడు. నా బూడిదంతా వానికి అమ్మి వస్తా వున్నా" అన్నాడు.

అట్లాగా అని ఆ ధనవంతుడు వాని బంగళా మొత్తం తగులబెట్టుకోని బూడిదను ఏడు బండ్లకు ఎత్తుకోని పక్కూరికి బైలుదేరినాడు. అడవిలో వ్యాపారస్తుడు బంగారు మూటల్తో పోతా వున్నాడు. వాన్ని చూసిన ధనవంతుడు "ఏం వ్యాపారీ... నీ బంగారు మూటల్తో నా బూడిద మూటలు మార్చు కుందామా" అన్నాడు. దాంతో వాడు ఇంతకు ముందు మోసం చేసింది వీడే అనుకోని ...

"దొంగనాయాలా... మాటిమాటికీ మోసపోవడానికి నేనేమన్నా వెర్రోన్ని అనుకుంటున్నావా" అంటూ వాన్ని పట్టుకోని తన్నినచోట తన్నకుండా మెత్తగా తన్ని పంపించినాడు.

దాంతో ధనవంతునికి కోపం బాగా పెరిగిపోయింది. ఈసారి వీని సంగతి అటో ఇటో తేల్చి పారేయాలనుకున్నాడు. ఆరోజు రాత్రి బాగా చీకటి పడినాక, అందరూ పండుకున్నాక చప్పుడు కాకుండా అడుగులో అడుగు వేసుకుంటా పోయి, వాని ముక్కుకు మత్తుమందు చూపి, కాళ్ళూ చేతులూ కట్టేసి, వూరవతల వున్న ఒక పెద్ద బావిలో పాడేసినాడు. కానీ పేదోని అదృష్టం కొద్దీ అందులో నీళ్ళు లేవు. మెత్తని గడ్డిమీద పడినాడు. మత్తు తగ్గగానే పేదోడు లేచి నోటితో తాళ్ళు ఇప్పుకొన్నాడు. పైకి లేస్తా వుంటే కాళ్ళకు ఏవో తట్టుకున్నాయి. ఏమబ్బా అని చూస్తే ఇంకేముంది... ఎప్పుడో ఎవరో దాచిపెట్టిన లంకెబిందెలు కనబన్నాయి. అవన్నీ మూటగట్టుకోని 'కాపాడండి కాపాడండి...' అంటూ గట్టిగా కేకలు పెట్టసాగినాడు. ఆ దారిలో పోతా వున్న కొందరు ఆ అరుపులు విని లోపలికి తాడేసి వాన్ని కాపాడినారు.

ధనవంతుడు తరువాత రోజు పొద్దున్నే లేసి చూస్తే ఇంకేముంది... పేదోడు ఇంటి ముందు కూచోని లంకెబిందెల్లోని వరహాలు లెక్కబెడతా కనబన్నాడు. అది చూసి ఆచ్చర్యపోయిన ధనవంతుడు "ఈ వరహాలు యాడివిరా" అన్నాడు. దానికి వాడు కిలకిలకిలమని నవ్వుతా "నిన్న ఎవరో నన్ను ఎత్తుకోని పోయి వూరి బైట వున్న బావిలో పాడేసినారు. ఆ బావి అట్లాంటిట్లాంటి మామూలు బావి కాదు. స్వర్గానికి దారి వున్న బావి. నేను లోపల పడగానే చచ్చిపోయిన మా తాత ముత్తాతలంతా వచ్చి స్వర్గానికి తీసుకపోయినారు. పొద్దున తిరిగి వచ్చే ముందు ఇదిగో ఈ లంకెబిందెలు ఇచ్చినారు" అన్నాడు సంబరంగా.

దాంతో ఆ ధనవంతునికి ఆశ పుట్టింది. ఆ రోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా పది గోనెసంచులు తీసుకోని పోయి ఎగిరి బావిలో దుంకినాడు. కానీ పాపం... వాని దురదృష్టం కొద్దీ పోయి ఒక పెద్ద బండ మీద పడినాడు. అంతే... తల పగిలి అక్కడికక్కడే చచ్చిపోయినాడు.

# 55 వానదేవుడు...గాలిదేవుడు... అగ్నిదేవుడు

ఒకూర్లో రంగయ్యని ఒకడుండేటోడు. వానికి చిన్నప్పుడే వాళ్ళ నాయన చచ్చిపోయినాడు. వాళ్ళమ్మ చానా మంచిది. తాను తిన్నా తినకపోయినా కొడుక్కి మాత్రం కడుపు నిండా పెట్టేది. ప్రేమగా చూసుకొనేది. ఆ ఇంట్లో ఈ ఇంట్లో కష్టం చేసి సంపాదించిన సొమ్ముతో కొడుకుని పెంచి పెద్ద చేసింది.

పెద్దగైనాక పెండ్లి సేయాల గదా... వెదికీ వెదికీ ఆఖరికి ఒక వూర్లో ఒక అందమైన పిల్లుంటే తెచ్చి చేసింది. ఆమె చూడ్డానికి పైకి అందంగుంటాదే గానీ లోపల మాత్రం విషం. చానా చెడ్డది. పెండ్లయిన నాలుగు నెల్లకే అత్త మీద మొగునికి వున్నవీ లేనివీ చెప్పి మనసు విరిచేసింది. దాంతో వాడు రోజూ వాళ్ళమ్మను తిట్టేటోడు, కొట్టేటోడు. పాపం... ఆమె ఏమీ చేయలేక లోపల్లోపల బాధపడ్తా వుండేది.

ఒకరోజు రాత్రి ఆ పెండ్లాం, మొగుడూ ఇద్దరూ ఆమెను తీస్కోనిపోయి మట్టసంగా అడవిలో వదిలేసి రావాలని అనుకున్నారు. వాడు పొద్దుగాలనే లేచి పెండ్లాం చేసిచ్చిన రొట్టె, పప్పు మూటగట్టుకోని వాళ్ళమ్మ దగ్గరికి పోయి "అమా! అమా! పక్కూర్లో పేద్ద తిరణాల జరుగుతా వుందంట. చూసొద్దాం పా" అన్నాడు. "అబ్బ నా కొడుకు మారిపోయినట్టున్నాడు' అనుకోని ఆమె సంబరంగా కొడుకెంట బయలుదేరింది. అట్లా వాళ్ళిద్దరూ పోతాపోతా ఒక పెద్ద అడవి మధ్యకి చేరుకున్నారు.

వాడు వాళ్ళమ్మతో "అమా! అమా! నడిచీ నడిచీ కాళ్ళు నొప్పి పెడ్తా వున్నాయి. కాసేపు కూచో ఇక్కడెక్కడైనా నీళ్ళుంటే పట్టుకోనొస్తా. తిని మళ్ళా పోదాం" అన్నాడు. ఆమె సరేనని ఒక చెట్టు కింద కూచోనింది. వాడు మట్టసంగా ఆమెనక్కడే వదిలేసి వెనుదిరిగి చూడకుండా ఎల్లిపోయినాడు.

ఆమెకు కొడుకు విడిచిపెట్టి పోయినేది తెలీదుగదా. దాంతో "అయ్యో పాపం! నా కొడుకు అడవిలో యాడ దారి తప్పిపోయినాడో ఏమో" అని అంతా వెదకసాగింది. కాసేపటికి చీకటి పడింది. ఆమె చెట్టు కింద కూచోని కొడుకు జాడ తెలీక వెక్కివెక్కి ఏడవసాగింది.

ఆకాశంలో పోతా వున్న అగ్నిదేవుడు, వానదేవుడు, గాలిదేవుడు ఆమెను చూసి, "అరెరే పాపం! ఆ ముసల్దానికెంత కష్టమొచ్చిందో ఏమో, కనుక్కుందాం పా" అని మనుషుల రూపంలో కిందికి దిగి ఆమె దగ్గరికొచ్చి, "అవ్వా అవ్వా ఎందుకే అట్లా ఏడుస్తా వున్నావ్ ఏంది నీ బాధ" అనడిగినారు. దానికా ముసల్ది కళ్ళెమ్మట నీళ్ళు కారిపోతా వుంటే వెక్కివెక్కి ఏడుస్తా "ఏముంది నాయనా, నా బిడ్డ నన్నిక్కడ పెట్టి నీళ్ళు తెస్తానని పోయినాడు. ఇంత రాత్రయినా ఇంకా రాలేదు. పాపం బిడ్డ దారి తెలీక ఎంత విలవిలలాడుతున్నాడో ఏమో" అనింది ఏడుస్తా.

దానికి వాళ్ళు "అట్లాగా, మేము మూడు ప్రశ్నలడుగుతాం. దాండ్లకుగాని సమాధానం చెప్పినావనుకో. నిన్ను నీ కొడుకు దగ్గరికి చేరుస్తాం" అన్నారు. ముసల్ది "సరే" అనింది.

మొదట అగ్నిదేవుడు "అవ్వా! అవ్వా! అగ్నిదేవుని గురించి నీవేమనుకుంటా వున్నావ్' అనడిగినాడు. దానికామె "అయ్యో నాయనా! అగ్నిదేవుడే లేకపోతే ఎట్లా చెప్పు, ఆ దేవుని దయ వల్లనే గదా మేమింత వంట చేసుకోని తింటా వున్నాం. రాత్రిపూట చీకట్లో ఇంత దీపం పెట్టుకోని చూడగలుగుతా వున్నాం" అనింది.

అంతలో వానదేవుడు ముందుకొచ్చి "సరేగానీ, మరి వానదేవుని గురించి ఏమనుకుంటా వున్నావ్' అనడిగినాడు. దానికామె "అయ్యో నాయనా! వానదేవుడు లేకపోతే పంటలెట్లా పండుతాయి. మా నోటికాడికి కూడెట్లా వస్తాది. ఆ దేవుని దయ వల్లనే గదా కడుపు నిండా ఇంత తిండి తింటా వున్నేది" అనింది.

అప్పుడు గాలిదేవుడు ముందుకొచ్చి "సరేగానీ. మరి గాలిదేవుని గురించి ఏమనుకుంటా వున్నావ్' అనడిగినాడు. దానికామె "అయ్యో నాయనా! గాలిదేవుడే లేకపోతే అసలు మనుషులు, పశువులు ఏమి పీల్చి బదుకుతారు. ఆ దేవుని దయ వల్లనే గదా మేమంతా హాయిగా, ఆనందంగా చల్లని గాలిలో సేద తీరుతా వుండేది" అనింది.

వాళ్ళు ముగ్గురూ ఆ మాటలకు బాగా ముచ్చటపడి ఆమెను పదహారేళ్ళ పడుచుపిల్లని చేసి, ఒంటి నిండా బంగారునగలు తొడిగి, మోయలేనంత బంగారమిచ్చి "పోమ్మా... పోయి హాయిగా ఎవరి మీదా ఆధారపడకుండా నీ బదుకు నీవు బదుకుపో... నీ కొడుకూ, కోడలూ నీవనుకున్నట్లు మంచోళ్ళు గాదు" అంటూ జరిగిందంతా చెప్పి పంపిచ్చినారు. ఆమె సంబరంగా అవన్నీ తెచ్చుకోని ఒక పెద్దమేడ కట్టుకోని హాయిగా బదకసాగింది.

అత్త వైభోగం చూసిన కోడలు ఒకరోజు అత్త దగ్గరికి పోయి "అత్తా! అత్తా! ఏదో బుద్ధి గడ్డి తిని పొరపాటు చేసినాను. నన్ను క్షమించు" అంటూ దొంగేడుపు ఏడ్చి "అవ్ అత్తా! అసలిదంతా నీకెట్లా వచ్చింది" అనడిగింది. అత్త జరిగిందంతా చెప్పింది. అట్లాగా అని ఆమె వురుక్కుంటా మొగుని దగ్గరికి పోయి, అంతా చెప్పి "రేపు నన్ను గూడా తీస్కోని పోయి మీ అమ్మను యాడైతే విడిచిపెట్టినావో ఆన్నే విడిచిపెట్టు" అనింది. వాడు సరేనన్నాడు.

తరువాత రోజు ఆమె పప్పు, రొట్టె మూటగట్టుకోని అడవికి పోయింది. వాడు వాళ్ళమ్మను విడిచిపెట్టిన చోటు చూపించినాడు. ఆమె సరేనని ఆడ కూచోని రొట్టె పప్పు బాగా తిని "సరే వాళ్ళు రాకముందే నువ్వు పోయి యాడైనా దాచి పెట్టుకోపో" అనింది. వాడు పోయి దూరంగా వున్న ఒక పెద్ద రాయి వెనుక దాచిపెట్టుకున్నాడు.

కాసేపటికి చీకటి పడింది. వెంటనే ఆమె "అయ్యయ్యో! నా మొగుడు నన్నిడిచి పెట్టి యాడ తప్పిపోయినాడో, ఏమో" అంటూ గుండెలు బాదుకుంటా కిందా మీదా పడి దొంగేడుపు ఏడ్చసాగింది.

ఆకాశంలో పోతా వున్న గాలిదేవుడు, అగ్నిదేవుడు, వానదేవుడు ఆమెను చూసి "అరెరే పాపం! ఆమెకు ఎంత కష్టమొచ్చిందో ఏమో... కనుక్కుందాం పా" అని మనుషుల రూపంలో కిందకు దిగి, ఆమె దగ్గరకొచ్చి "అమా! అమా! ఎందుకట్లా పొర్లి పొర్లి ఏడుస్తా వున్నావ్. ఏంది నీ బాధ" అనడిగినారు. దానికామె కళ్ళెమ్మట సరసరసర నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా "ఏముంది సామీ! నా మొగుడు నన్నిక్కడ విడిచిపెట్టి నీళ్ళు తెస్తానని పోయినాడు. ఇంత రాత్రయినా ఇంకా రాలేదు. పాపం! దారి తెలీక ఎంత విలవిలలాడుతున్నాడో ఏమో" అనింది.

దానికి వాళ్ళు "సరేగానీ మేము మూడు ప్రశ్నలడుగుతాం. దాండ్లకుగాని సమాధానం చెప్పినావనుకో... నిన్ను నీ మొగుని దగ్గరికి చేరుస్తాం సరేనా" అన్నారు. ఆమె 'సరే' అనింది.



మొదట అగ్నిదేవుడు ముందుకొచ్చి"అమా! అమా! నీకు అగ్నిదేవుని గురించి తెలుసుగదా. ఆయన గురించి ఏమనుకుంటా వున్నావ్" అనడిగినాడు. దానికామె "ఎవడూ... అగ్నిదేవుడా! వాని మీద బండ పడ.. రొట్టెలు చేస్తా వున్నప్పుడు, అన్నం దించేటప్పుడు సుర్రుమని చేతికి తగుల్తా ఒకటే సతాయిస్తా వుంటాడు. దొంగసచ్చినోడు" అనింది మెటికలిరుస్తా. అగ్నిదేవునికి ఆ మాటలింటానే సర్రుమని ఒళ్ళు మండిపోయింది.

అంతలో వానదేవుడు ముందుకొచ్చి "అది సరే గానీ, మరి వానదేవుని గురించి ఏమనుకుంటా వున్నావ్" అనడిగినాడు. దానికామె కోపంగా "ఎవడూ... వానదేవుడా! వాని మీద బండపడ... రాత్రి మిద్దె మీద హాయిగా పన్నుకోనుంటే చెప్పాపెట్టకుండా వచ్చి కొట్టికొట్టి లేపుతాడు. రోడ్డు మీదంతా బురద బురద చేస్తాడు. దొంగసచ్చినోడు" అనింది. ఆ మాటలింటానే వానదేవునికి ఒళ్ళు సలసలసల మండిపోయింది.

అంతలో గాలిదేవుడు ముందుకొచ్చి "సరే! సరే! అగ్నిదేవుడు, వానదేవుడు సంగతొదిలెయ్! ఇంతకూ గాలిదేవుని గురించి ఏమనుకుంటా వున్నావో చెప్పు" అనడిగినాడు. దానికామె కోపంగా "ఎవడూ... గాలిదేవుడా! వాని మీద బండపడ... వూర్లో యాడాడి దుమ్మునంతా ఎత్తుకోనొచ్చి ఇండ్లంతా సల్లుతా వుంటాడు. మాటిమాటికీ కసువు నూకలేక సస్తా వున్నా" అనింది.అంతే... ముగ్గురూ భగభగ మండిపోయినారు. దీనికి బాగా ఒళ్ళు కొవ్వెక్కినట్టుంది. అందుకే కన్నుమిన్ను గానక మనల్నిట్లా తిడ్తా వుంది. దీనికి బాగా బుద్ధి చెప్పాల' అనుకోని ఆమెను గాడిదని చేసి ఆన్నించి తన్ని తరిమేసినారు.

# 56 పిసినారి అవ్వ - టక్కరి పిల్లోళ్ళు

ఒకూర్లో ఒక అవ్వ వుండేది. ఆమె చానా పిసినారిది. ఆమెకు ఐదుమంది మనవళ్ళు వుండేటోళ్ళు. వాళ్ళు చానా టక్కరోళ్ళు.

ఒకరోజు అవ్వకు బచ్చాలు చేసుకోని తినాలనిపించింది. కానీ పిల్లలందరికీ చేస్తే చానా ఖర్చవుతుంది గదా... దాంతో ఎవరికీ తెలీకుండా మట్టసంగా రాత్రి అందరూ పండుకున్నాక చేసుకోవాలనుకోనింది. బచ్చాలకు కావలసిన బెల్లం, బ్యాళ్ళు కొనుక్కోనొచ్చి వుడకేసి పూర్ణం రుబ్బి మచ్చుపైన పెట్టింది. కానీ ఇదంతా పెద్ద పిల్లోడు చూసినాడు.

ఆరోజు రాత్రి అందరూ పండుకున్నాక ఆ ముసల్ది లేచి వంటింట్లోకి పోయింది చప్పుడు గాకుండా మట్టసంగా బచ్చాలు చేయడం మొదలుపెట్టింది.

పెద్దోడు మొదట్నించీ ఇదంతా గమనిస్తా వున్నాడు గదా! దాంతో నెమ్మదిగా లేచి వాకిలి కాన్నించి లోపలికి తొంగి చూసినాడు. అవ్వ లోపల బచ్చాలు చేస్తా కనబడింది.

"ఓహో... ఇదా సంగతి" అనుకోని మట్టసంగా పండుకోని "అవ్వా ... నీళ్ళు దప్పిక అవుతున్నాయే" అని గట్టిగా అరిచినాడు. ఆ అరుపులకు ముసల్ది వులిక్కిపడింది "వాని అరుపులకు మిగతా పిల్లలు యాడ లేస్తారో... ఏమో..." అని భయపడతా నీళ్ళు బెరబెరా తీసుకోని పోయి వానికి ఇచ్చింది.

వాడు నీళ్ళు తాగి "అవ్వా... ఏందే బచ్చాల వాసన వస్తావుంది. ఏం చేస్తావున్నావు" అంటూ వంటింట్లోకి దూరినాడు. పొయ్యి పక్కన బచ్చాలు చూసి "నాకు పెట్టే" అని ఏడవసాగినాడు. ఆ ఏడుపుకు మిగతా పిల్లలు లేస్తారేమోనని భయపన్న ముసల్ది "ఎవరికీ చెప్పొద్దు" అంటూ వానికి రెండు బచ్చాలు పెట్టింది. వాడు అవి తిని పోయి పండుకున్నాడు.

అవ్వ మళ్ళా బచ్చాలు చేసుకోసాగింది. పెద్ద పిల్లోడు కాసేపటికి పక్కనున్నోన్ని నెమ్మదిగా లేపి "రేయ్... అవ్వ ఒక్కతే బచ్చాలు చేసుకుంటా వుంది. పో...పోయి తినిరాపో" అని చెప్పినాడు.

వాడు సరేనని తలూపి "అవ్వా...ఒంటికొస్తుందే" అంటూ గట్టిగా ఏడవడం మొదలు పెట్టినాడు "ఓరినీ... సచ్చినోడా... నీకూ ఇప్పుడే రావాల్నా? అనుకుంటా అవ్వ వురుక్కుంటా వచ్చి వాన్ని బైటకు తీసుకోని పోయింది.

వాడు ఒంటికి పోసి పోతాపోతా "అవ్వా... ఏందే బచ్చాల వాసన వస్తావుంది" అంటూ వంటింట్లోకి దూరినాడు. పెనం మీద కాలుతా వున్న బచ్చం చూసి "అవ్వా... నాకూ పెట్టే" అని ఏడవడం మొదలు



పెట్టినాడు. ఆ ఏడుపుకు మిగతా పిల్లలు లేస్తారేమోనని భయపన్న ముసల్ది, “ఎవరికీ చెప్పొద్దు” అంటూ వానికి గూడా రెండు బచ్చాలు పెట్టింది. వాడు అవి తిని పోయి పండుకున్నాడు. కాసేపటికి వాళ్ళు మిగతా ముగ్గురినీ లేపి జరిగిందంతా చెప్పినారు. సరే అని కాసేపటికి మూడోవాడు “అవ్వా ... వీడు సూడే! మాటిమాటికీ గిచ్చుతా వున్నాడు.” అంటూ ఏడుస్తా పైకి లేచినాడు. అవ్వ ఉరుక్కుంటా బైటికొచ్చి “లేదులే ... లేదులే ... ఏడవమాకు. నువ్వు ఈపక్క పండుకుందువురా” అంటూ వాన్ని లేపింది. వాడు లేసి పోతాపోతా “నన్ను గిచ్చుతావురా నువ్వు” అంటూ నాలుగోవాన్ని ఈడ్చి తన్నినాడు.

“అంతే... నాలుగోవాడు పైకి లేచి “ఏరా... నిద్ర పోతా వుంటే నన్ను కొడ్తావా” అంటూ ఎగిరి వాన్ని దొబ్బినాడు. అంతే వాడు పోయి ఐదోవాని మీద పడినాడు. అంతే “అవ్వా... చూడే” అంటూ వాడు కూడా లేచి వాళ్ళ మీద కలబన్నాడు. అట్లా ఒకరి మీద ఒకరు పడ్తా ఐదుమందీ లేచి తన్నుకోసాగినారు.

అంతలో చిన్నోడు “రేయ్ ... వంటింట్లోంచి బచ్చాల వాసన వస్తావుంది రోయ్” అంటూ గట్టిగా అరిచినాడు.

అంతే ... మిగతావాళ్ళు కొట్లాట ఆపేసి ముక్కులు ఎగబీలుస్తా “అవున్రోయ్ ... అవ్వ రేపొద్దున్నే మనకి పెట్టడం కోసం చేస్తున్నట్లుంది రోయ్” అంటూ గట్టిగా అరిచినారు. అవ్వ అదిరిపడింది.

పిల్లలందరూ ఒక్కసారిగా వంటింట్లోకి జొరబన్నారు. గిన్నె తీసి తలా కొన్ని బచ్చాలు ఏసుకోని నున్నగా అన్నీ తిని హాయిగా నవ్వుకుంటా నిద్రపోయినారు.

ఎవ్వరికీ పెట్టకుండా అన్నీ తానే తినాలకున్న ఆ ముసల్దానికి ఆఖరికి ఒక్క బచ్చం గూడా మిగలలేదు.

# 57 ఒక వెంట్రుక రాణి కథ

ఒకూర్లో ఒక రాజుండేటోడు. ఆయనకు ఇద్దరు పెండ్లాలు. మొదటి పెండ్లానికేమో ఒక వెంట్రుక... రెండో పెండ్లానికేమో రెండు వెంట్రుకలు వున్నాయి. రెండో పెండ్లానికి రెండు వెంట్రుకలు వున్నాయి గదా... అందుకని రెండో దానికి భలే టెక్కు. ఒకరోజు మొగునితో "బావా... బా... నాకు అక్క కన్నా ఒక వెంట్రుక ఎక్కువుంది గదా... ఆమెను ఇంట్లో నుండి గెంటేయండి" అనింది. సరేనని రాజు మొదటి పెండ్లాన్ని ఇంట్లో నుండి గెంటేసినాడు.

ఆమె ఏడ్చుకుంటా... ఏడ్చుకుంటా... అడవిలో పోతా వుంటే దారిలో ఒక చీమలపుట్ట కనబడింది. చీమలు ఆమెని చూడగానే "అమా... అమా... కొంచం మా పుట్టను బాగు చేసి చక్కెర పోసి పోమ్మా... నీకు పుణ్యముంటాది" అని బ్రతిమలాడినాయి. ఆమె చానా మంచిది గదా... దాంతో సరేనని పుట్టంతా బాగు చేసి చీమలకు చక్కెర పోసి పోయింది.

మళ్ళా ఆమె పోతా వుంటే దారిలో ఒక ఎండిపోతున్న మల్లెచెట్టు కనబడి "అమా.. అమా... నీళ్ళు లేక ఎండిపోతా వున్నాను. దయచేసి కొంచం నీళ్ళు పోసి పోమ్మా... నీకు పుణ్యముంటాది" అనడిగింది. ఆమె సరేనని దగ్గరలో వున్న ఒక చెరువుకాడికి పోయి నీళ్ళు తెచ్చి దానికి పోసింది.

మళ్ళా ఆమె పోతా వుంటే దారిలో ఒక గుర్రం కుంటుకుంటా... కుంటుకుంటా.. ఎదురొచ్చి "అమా... అమా... నా కాలిలో ముల్లిరిగింది. కొంచం తీసిపోమ్మా... నీకు పుణ్యముంటాది" అనడిగింది. ఆమె సరేనని దాని కాలు ఒళ్ళో పెట్టుకోని నెమ్మదిగా నొప్పి తెలీకుండా ముల్లు బయటికి తీసింది.

మళ్ళా ఆమె పోతా వుంటే దారిలో ఒక గుడిసె కనబడింది. గుడిసెలో ఎవరున్నారబ్బా అని లోపలికి తొంగి చూస్తే ఒక ముసలవ్వ కనబడింది. అవ్వ ఆమెని చూడగానే "అమా... అమా... ముసలిదాన్ని... ఏ పనీ చేసుకోలేను. చానా ఆకలిగా వుంది. కొంచం అన్నం వండిపెట్టి పోమ్మా" అనడిగింది. ఆమె సరేనని అన్నం వండి అవ్వకి పెట్టింది.

అవ్వ అన్నం తింటా వుంటే "అవా... అవా... నెత్తి మీద నిండుగా వెంట్రుకలు రావాలంటే ఏం చేయాల" అనడిగింది. దానికా అవ్వ కాసేపు ఆలోచించి "ఈడికి దగ్గర్లోనే ఉప్పు సముద్రం, పాల సముద్రం వున్నాయి. ముందు ఉప్పు సముద్రంలో మునిగి ఆ తరువాత పాల సముద్రంలో మునుగు" అని చెప్పింది.

ఆమె అలాగేనని కొంతదూరం పోయేసరికి రెండు సముద్రాలూ పక్కపక్కనే కనబన్నాయి. అవ్వ చెప్పినట్లే ముందు ఉప్పు సముద్రంలో మునిగింది. అంతే వున్న ఒక్క వెంట్రుక కూడా వూడిపోయింది. మళ్ళా పోయి

పాల సముద్రంలో మునిగింది. వెంటనే నెత్తి నిండా నిగనిగలాడతా నల్లని వెంట్రుకలు చూడముచ్చటగా వచ్చేసినాయి.

ఆమె సంబరంగా తిరిగి అవ్వ దగ్గరికి వచ్చింది. అవ్వ ఆమెను చాప మీద కూచోబెట్టి "నీకు సద్దన్నం కావాల్నా... వేడన్నం కావాల్నా" అనడిగింది. ఆమె సద్దన్నమే పెట్టమనింది. అవ్వ వేడివేడి అన్నం, పప్పు పెట్టింది. ఆమె అన్నం తిని ఇక నేను పోయొస్తానని చెప్పి పోతా వుంటే అవ్వ "ఒక్క నిమిషం ఆగమ్మా" అని "నీకు పాత చీర కావాల్నా... కొత్త చీర కావాల్నా" అనడిగింది. ఆమె పాత చీరే ఇవ్వమనింది. అవ్వ ఇంట్లోకి పోయి కొత్త చీర, కొత్త నగలు తెచ్చిచ్చింది. ఆమె ఆ కోత్తచీర కట్టుకోని... కొత్త నగలు వేసుకోని ఇంటికి బైలుదేరింది.

అడవిలో నడుస్తా వుంటే దారిలో గుర్రం ఎదురొచ్చి "అమా... అమా... నా కాలులోని ముల్లు తీసి నా బాధను పోగొట్టినావు. నా మీదకు ఎక్కు, నిన్ను యాడికి కావాలంటే ఆడికి తీసుకోని పోతాను" అనింది. ఆమె సరేనని గుర్రమెక్కింది.

గుర్రం మీద ఇంటికి పోతా వుంటే దారిలో మల్లెపూల చెట్టు కనబడి "అమా... అమా... నీవు నీళ్ళు పోసి నన్ను బతికించినావు. నా పూలు తీసుకో" అనింది. ఆమె జడ నిండా పూలు పెట్టుకోని పోతా వుంటే చీమలపుట్ట కనబడింది. ఆమెను చూసి చీమలన్నీ బయటకు వచ్చి "నువ్వు చల్లగా పిల్లా పాపలతో నూరేండ్లు బతకాల" అని దీవించినాయి.

రాజు నల్లని వెంట్రుకలతో జడ నిండా పూలు పెట్టుకోని కొత్తచీర... నగలతో... గుర్రమ్మీదొచ్చిన మొదటి పెండ్లాన్ని చూసి సంబరపడి ఆమెను ఇంట్లోకి పిలుచుకోనిపోయి రెండో పెండ్లాన్ని "పో... పోయి... నువ్వు గూడా ఇట్లాగే తయారై రాపో" అని బైటకి గెంటేసినాడు.

ఆమె ఏడ్చుకుంటా... ఏడ్చుకుంటా... అడవిలో పోతా వుంటే దారిలో ఒక చీమలపుట్ట కనబడింది. చీమలు ఆమెని చూడగానే "అమా... అమా... కొంచం మా పుట్టను బాగు చేసి చక్కెర పోసి పోమ్మా... నీకు పుణ్యముంటాది" అని బతిమలాడినాయి. దానికామె కోపంగా "నా మొగుడు నన్ను బైటకు దొబ్బేసినాడని నేనేడుస్తా వుంటే మధ్యలో మీకు చక్కెర పోయాల్నా... వుండు మీ పని చెబ్తా" అంటూ పుట్టనంతా కాళ్ళతో చిందరవందర చేసేసింది.

మళ్ళా ఆమె పోతా వుంటే దారిలో ఒక ఎండిపోతావున్న మల్లెచెట్టు కనబడి "అమా... అమా... నీళ్ళు లేక ఎండిపోతా వున్నా... దయచేసి కొంచం నీళ్ళు పోసి పోమ్మా... నీకు పుణ్యముంటాది" అనడిగింది. దానికామె "నాకు వెంట్రుకలు లేక నేనేడుస్తా వుంటే... మధ్యలో నీకు నీళ్ళు కావాల్నా... వుండు నీ పని చెబ్తా" అంటూ చెట్టు కొమ్మలన్నీ ఇష్టమొచ్చినట్టుగా తుంచి పాడేసింది.

మళ్ళా పోతా వుంటే దారిలో ఒక గుర్రం కుంటుకుంటా... కుంటుకుంటా... ఎదురొచ్చి "అమా... అమా... నా కాలిలో ముల్లిరిగింది. కొంచం తీసిపోమ్మా... నీకు పుణ్యముంటాది" అనడిగింది. దానికామె కోపంగా "నేనెవరనుకుంటా వున్నావు. రాజు పెండ్లాన్ని. నేను నీ కాళ్ళు పట్టుకోవాల్నా... పోతావా లేదా ఈన్నించి" అంటూ కట్టె తీసుకోని దాన్ని కొట్టింది.

మళ్ళా ఆమె పోతా వుంటే దారిలో ఒక గుడిసె కనబడింది. గుడిసెలో ఎవరున్నారబ్బా... అని తొంగి చూస్తే లోపల ఒక ముసలవ్వ కనబడింది. అవ్వ ఆమెను చూస్తానే "అమా... అమా... ముసలిదాన్ని. చానా



ఆకలిగా వుంది. కొంచం అన్నం వండిపెట్టి పోమ్మా. నీకు పుణ్యముంటాది" అనింది. దానికామె కోపంగా "నేనేమైనా నీ దాసీననుకుంటా వున్నావా... సేవలు చేయడానికి... అన్నం లేదు గిన్నం లేదు" అని కసురుకోని "నాకు వెంట్రుకలు రావాలంటే ఏం చేయాల్నో చెప్పు" అని గద్దించి అడిగింది.

దానికా అవ్వ ఇక్కడికి దగ్గర్లోనే ఉప్పుసముద్రం, పాలసముద్రం ఉన్నాయి. ముందు ఉప్పుసముద్రంలో మునిగి ఆ తర్వాత పాలసముద్రంలో మునుగు అని చెప్పింది. ఆమె కొంచెం దూరం పోయేసరికి రెండు సముద్రాలు కనబన్నాయి. కానీ అవ్వ చెప్పినట్టు కాకుండా ముందు పాల సముద్రంలో మునిగింది. వెంట్రుకలన్నీ నిజంగా వచ్చినాయి. ఆ తరువాత పోయి ఉప్పు సముద్రంలో మునిగింది. అంతే... వచ్చినవన్నీ వూడిపోయి నున్నగా గుండైంది. తర్వాత ఆమె ఎన్ని సార్లు ఏ సముద్రంలో మునిగినా ఒక్కటంటే ఒక్క వెంట్రుక గూడా రాలేదు.

ఆమె తిరిగి పోతా వుంటే అవ్వ కనబడి ఆమెని పిల్చి "నీకు సద్దన్నం కావాల్నా... వేడన్నం కావాల్నా" అనడిగింది. ఆమె వేడివేడి అన్నం కావాలనింది. దాంతో అవ్వ ఆమెకు సద్దన్నం... సద్దిపప్పు పెట్టింది. అన్నం తిని పోయొస్తానని అవ్వకు చెప్పకుండానే పోతా వుంటే అవ్వ "ఒక్క నిమిషం ఆగమ్మా..." అని "నీకు పాత చీర కావాల్నా... కొత్త చీర కావాల్నా" అనడిగింది. ఆమె కొత్తచీర కావాలనింది. అవ్వ ఇంట్లోకి పోయి పాత చీర, పాత నగలు తెచ్చిచ్చింది. ఆమె పాత చీర కట్టుకోని... పాత నగలు వేసుకోని... ఇంటికి బైలుదేరింది.

పోతా వుంటే దారిలో గుర్రం ఎదురొచ్చింది. ఆమె దాన్ని చూసి "నడిచీ... నడిచీ... కాళ్ళు నొప్పి పెడ్తా వున్నాయి. కాస్త నన్నెక్కిచ్చుకోని పోవా" అనడిగింది. దానికి గుర్రం "నా కాల్లో ముల్లు గుచ్చుకోని నేనేడుస్తా వుంటే... నువ్వేమయినా తీసినావా... నిన్నెక్కించుకోడానికి... ఫో... ఫో..." అని కసురుకోనింది.

మళ్ళా ఆమె పోతా వుంటే దారిలో మల్లెపూల చెట్టు కనబడింది. ఆమె దాన్ని "నాకు కొన్ని పూలియ్యవా" అనడిగింది. దానికా మల్లెచెట్టు "నాకు నీళ్ళు పొయ్యమంటే పొయ్యలేదు గదా... మరి నేనెందుకు పూలియ్యాల... ఫో... ఫో..." అని కసురుకోనింది.

ఆమె మళ్ళా పోతా వుంటే దారిలో చీమలపుట్ట కనబడింది. ఆమె పుట్ట దగ్గరికి పోయి "నన్ను దీవించండి" అనడిగింది. కానీ, ఆ చీమలు "నువ్వు మా పుట్ట బాగు చేసి... చక్కెర పోసి పొమ్మంటే... పొయ్యలేదు గదా.... మరి మేమెందుకు నిన్ను దీవించాల... దీవించం ఫో" అని కసురుకున్నాయి.

చినిగిపోయిన పాత చీరతో... గుండుతో... ఏడుస్తా ఇంటికొచ్చిన పెండ్లాన్ని చూసి రాజు అసహ్యించుకోని "ఫో... దరిద్రందానా" అని మళ్ళా బైటకు దొబ్బేసినాడు. అది చూసిన మొదటి పెండ్లాం పరుగు పరుగున ఆడికొచ్చి మా చెల్లెలిని రానీయండి" అని బతిమలాడింది. రాజు మొదటి పెండ్లాం మంచితనాన్ని మెచ్చుకోని ఆమెను ఏడంతస్తుల మేడలో పెట్టి, రెండో పెండ్లాన్ని పశువుల కొట్టంలో పెట్టినాడు.

# 58 ఉల్లిగడ్డ కథ

ఒకూర్లో ఒక ఐస్క్రీమూ, మిరపకాయా, టమోటా, ఉల్లిగడ్డా వుండేవి. అవి నాలుగూ మంచి స్నేహితులు. ఎక్కడికెళ్ళినా కల్సే వెళ్ళేవి. కలిసే తిరిగేవి. హాయిగా ఆడతా, పాడతా, ఎగురుతా, దుంకుతా ఆనందంగా వుండేవి.ఒకరోజు నాలుగూ కల్సి స్నానం చేసొద్దామని మధ్యాన్నం తుంగభద్రా నదికి వెళ్ళినాయి. నాలుగూ నీళ్ళలో దూకి సరదాగా ఈత కొట్టసాగినాయి. కానీ పాపం నీళ్ళు తగిలీ తగిలీ ఐస్క్రీము నీళ్ళలోనే కరిగిపోయింది. మిగతా మూడూ బైటకొచ్చి చూస్తే ఇంకేముంది. ఐస్క్రీం లేదు. తమ మిత్రుడు చచ్చిపోయినందుకు బాధతో మిరపకాయా, టమోటా, ఉల్లిగడ్డ వెక్కి వెక్కి ఏడ్చినాయి.

ఒకరోజు మిగతా మూడు కొండారెడ్డి బురుజు చూసొద్దామని సరదాగా సాయంకాలం చల్లగాలిలో హుషారుగా షికారుకు బైలుదేరినాయి. అట్లా పోతా వుంటే దారిలో బజ్జీలు వేసేటోడు మిరపకాయను చూసి ఠక్కున చేతిలోకి తీసుకోని, శెనగపిండిలో ముంచి సలసలకాగే వేడివేడి నూనెలో వేసేసినాడు. పాపం ఆ మిరపకాయ వేడికి తట్టుకోలేక అక్కడికక్కడే చచ్చిపోయింది. తమ మిత్రుడు చచ్చిపోయినందుకు బాధతో టమోటా, ఉల్లిగడ్డా వెక్కి వెక్కి ఏడ్చినాయి.

ఒకరోజు టమోటా, ఉల్లిగడ్డా సినిమా చూసొద్దామని ఆనంద్ టాకీసుకు వెళ్ళినాయి. రెండు టికెట్లు కొనుక్కోని సీట్లలో కూర్చోని సంబరంగా సినిమా చూడసాగినాయి. అంతలో ఒకడు చీకట్లో చూసుకోక సరిగ్గా టమోటా మీద కూర్చున్నాడు. అంతే పాపం టమోటా కడుపు పగిలి అక్కడికక్కడే చచ్చిపోయింది. తనకు మిగిలిన ఒక్క మిత్రుడూ చచ్చిపోయినందుకు బాధతో ఉల్లిగడ్డ వెక్కి వెక్కి ఏడ్చింది.

అలా ఉల్లిగడ్డ ఏడ్చుకుంటా, ఏడ్చుకుంటా పోతా 'ఐస్క్రీం చచ్చిపోతే నేనూ, టమోటా, మిరపకాయా ఏడ్చినాం. మిరపకాయ చచ్చిపోతే నేనూ, టమోటా ఏడ్చినాం. టమోటా చచ్చిపోతే నేనొక్కన్నే ఏడ్చినా, మరి రేప్పొద్దున నేను చచ్చిపోతే నాకోసం ఎవరు ఏడుస్తారు" అని ఒకచోట కూచోని దిగులుగా బాధపడసాగింది. ఆకాశంలో పోతా వున్న పార్వతీ పరమేశ్వరులు అది చూసి "ఏమబ్బా! పాపం ఉల్లిగడ్డ అంత బాధపడతావుంది. దానికేం కష్టమొచ్చిందో, ఏమో" అని రివ్వున కిందకు దిగినారు. "ఉల్లిగడ్డా! ఉల్లిగడ్డా! ఎందుకే అట్లా ఏడుస్తా వున్నావ్, ఏంది నీ బాధ" అన్నారు. దానికి ఉల్లిగడ్డ కళ్ళెమ్మట నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా "ఏముంది సామీ! ఐస్క్రీం చచ్చిపోతే నేనూ, టమోటా, మిరపకాయ ఏడ్చినాం. మిరపకాయ చచ్చిపోతే నేనూ, టమోటా ఏడ్చినాం. టమోటా చచ్చిపోతే నేనొక్కన్నే ఏడ్చినా మరి రేప్పొద్దున నేను చచ్చిపోతే నాకోసం ఎవరు ఏడుస్తారు. నాకెవరూ లేరే" అనింది బాధగా. అది విన్న పరమేశ్వరుడు "అయ్యో పాపం!" అని జాలిపడి, "నువ్వేమీ బాధపడకు. ఇప్పన్నుంచీ ఎవరైతే నిన్ను చంపుతారో వాళ్ళే నీ కోసం ఏడ్చేలా వరం ఇస్తున్నా పో" అన్నాడు. అంతే... ఆరోజు నుండీ ఉల్లిగడ్డను ఎవరు కోసినా వాళ్ళ కళ్ళ నుండే బాధతో నీళ్ళు కారుతావున్నాయి.

# 59

# కుందేలు దెబ్బ

ఒకూర్లో ఒక కుందేలు, ఎలుగుబంటి పక్కపక్క ఇండ్లల్లో ఉండేవి. కుందేలు ఇంటి ముందు ఒక పెద్దతోట వుండేది. అది రకరకాల కాయలు, పండ్లు, దుంపలతో నిండి వుండేది. కుందేలు సమయానికి నీటిని తెచ్చిపోస్తా, అవసరమైనప్పుడల్లా ఎరువులు వేస్తా, పురుగుమందులు చల్లుతా ఆ మొక్కలని సొంత పిల్లలెక్క చూసుకునేది. దాంతో ఎప్పుడు చూసినా ఆ తోటలో ఏదో ఒక చెట్టుకు పండ్లు, కాయలు నిండుగా కనిపిస్తా వుండేవి. ఆ కుందేలు ఎంత మంచిదో అంత అమాయకురాలు. ఆ కుందేలు ఇంటి పక్కనే ఒక ఎలుగుబంటి వుంది కదా. అది పెద్ద టక్కరిది. ఎప్పుడూ ఎవరినో ఒకరిని మోసం చేస్తా వుండేది.

ఒకరోజు కుందేలు, ఎలుగుబంట్ల పెండ్లాలు పనుండి పక్కూరికి పోయినాయి. దాంతో వంట చేసుకోవలసిన పని వాటికే పడింది. కుందేలు ఇంటి ముందే తోట వుందిగదా... దాంతో అది ఆకలేసినప్పుడల్లా నాలుగు కాయలు తెంపుకునో, నాలుగు దుంపలు తవ్వుకునో తిని కడుపు నింపుకొనేది. దాని చిన్నపొట్టకు అవి సరిపోయేవి.

ఎలుగుబంటి కడుపు పెద్దదిగదా. దాంతో అది కడుపు నిండా తిండి సంపాదించుకోడానికి నానా తిప్పలూ పడేది. అదీగాక అది చానా సోమరిది. ఎప్పుడూ పెండ్లాం తెచ్చి పెడతా వుంటే హాయిగా కాలు మీద కాలేసుకోని తినడానికి అలవాటు పడ్డది. ఇప్పుడు పని చేయాలంటే దానికి చాతగావడంలేదు. దాంతో అది ఒక ఉపాయాన్ని పన్నింది.

కుందేలు దగ్గరికి పోయి "కుందేలు అల్లుడూ.. కుందేలు అల్లుడూ... మనం ఈరోజు విందు చేసుకొందామా. ఈ రోజు నేను నీకు మంచి మంచివి కడుపు నిండా కమ్మగా పెడతాను. రేపు నీవు నాకు పెట్టాల. సరేనా" అనింది. కుందేలు అమాయకురాలుగదా దాంతో 'సరే' అనింది.

ఎలుగుబంటి వెంటనే అడవికి పోయి తాను తెచ్చుకునే వాటితోపాటు ఒక నాలుగుపండ్లు ఎక్కువ తెంపుకోనొచ్చి కుందేలును విందుకు పిలిచింది. కుందేలు కడుపు చిన్నది కావడంతో తొందరగా నిండిపోయింది.

తరువాతరోజు కుందేలు వంతు వచ్చింది. కుందేలు గూడా నాలుగుపండ్లు తెంపుకోనొచ్చి ఎలుగుబంటిని విందుకు పిలిచింది. ఆ పండ్లు దానికి ఒక్క పంటి కిందికి గూడా చాలలేదు. "ఇంకా... ఇంకా... ఆకలి... ఆకలి... అని అరిచింది. కుందేలు తన కోసం తెచ్చుకున్నవి గూడా దానికే పెట్టింది. ఎలుగుబంటి వాటిని ఒక్క క్షణంలో గుటుక్కుమనిపించి "ఇంకా... ఇంకా... ఆకలి... ఆకలి అనింది. కుందేలు పోయి తోటలోని చెట్లకున్న పండ్లూ, కాయలూ, అన్నీ తెంపుకోనొచ్చి దాని ముందు గుట్టగా పోసింది. ఎలుగుబంటి వాటన్నింటినీ కసకసకస

నిమిషాల్లో తినేసి “ఇంకా... ఇంకా... ఆకలి... ఆకలి” అనింది. కుందేలుకు ఏం చెయ్యాల్నో తోచలేదు.

“నిన్ను ఇంటికి పిలిచి కడుపు నిండా పెడితే నువ్వు నన్ను సగం ఆకలితో సంపుతావా. కొంచమన్నా సిగ్గుందా నీకు. చేతగానిదానివి చేతగానిదాని మాదిరి మట్టసంగా వుండాలగానీ ఎందుకు ఒప్పుకున్నావు. పో. పోయి దుంపలన్నీ తవ్వుకోని రాపో, లేకుంటే నిన్ను కిందామీదా యేసి మెత్తగా తంతా చూడు” అంటూ ఎలుగుబంటి భయపడిచ్చింది. పాపం కుందేలు దానిని ఏమీ చెయ్యలేక గమ్మున తోటలోని దుంపలన్నీ తవ్వుకోనొచ్చి దాని ముందు గుట్టగా పోసింది. ఎలుగుబంటి అవన్నీ హాయిగా మెక్కి నవ్వుకుంటా వెళ్ళిపోయింది.

కుందేలుకు ఎలుగుబంటి ఉపాయం అప్పటికి గానీ అర్థం కాలేదు. పిచ్చికోపం వచ్చింది. ఎట్లాగయినా సరే దానికి బుద్ధి చెప్పాలనుకోనింది. దాని ఇంటి ముందు ఒక పెద్ద గొట్టం వుంది. దాని మీద కూచోని ఆలోచిస్తా వుంటే దానికి ఒక ఉపాయం తోచింది. ఎలుగుబంటి దగ్గరికి పోయి “ఎలుగుబంటిమామా... ఎలుగుబంటిమామా... పొద్దు పోవడం లేదు. ఒకాట ఆడుకుందామా” అనింది. ఎలుగుబంటి తినీతినీ లావయిన తన పొట్టను హాయిగా నిమురుకుంటా “చెప్పు అల్లుడూ ఏమాట” అనింది.

“మనం ముట్టేసుకునే ఆట ఆడదాం మామా నేను నిన్ను ముట్టుకుంటే నువ్వు నాకొక పండు ఇవ్వాలి. నువ్వు నన్ను ముట్టుకుంటే నేను వంద పండ్లిస్తా” అనింది. వందపండ్లు అనేసరికి ఎలుగుబంటికి బాగా ఆశ పుట్టింది. వెంటనే సరే అనింది. ముందు కుందేలు ఎలుగుబంటి వెంట పడింది. ఎలుగుబంటి అటూ యిటూ వురికిందిగానీ ఆయాసమొచ్చి కుందేలుకు దొరికిపోయింది. దాంతో ఒక మామిడి పండు తెచ్చి కుందేలుకు ఇచ్చింది.

ఈసారి ఎలుగుబంటి వంతు వచ్చింది. కుందేలు అటూ ఇటూ వురకసాగింది. దొరికినట్టే దొరుకుతా.. అంతలోనే వురుకుతా వూరించసాగింది. వందపండ్ల మీద ఆశతో ఎలుగుబంటి వెంటపడతానే వుంది. కుందేలు వురుకుతా వురుకుతా వేగంగా వచ్చి సర్రున ఇంటిముందున్న పెద్ద గొట్టంలోనికి దూరింది. దాని వెనకాల్నే అంతే వేగంతో దూసుకొస్తావున్న ఎలుగుబంటి కూడా సర్రున ఆ గొట్టంలోనికి దూరింది. అంతే ఆ గొట్టం కుందేలు కంటే లావుగానూ, ఎలుగుబంటి కన్నా సన్నగానూ వుంది. దాంతో అది సగం దూరం పోయేసరికి ఇరుక్కోని పోయింది. అట్లా ముందుకూ పోలేక ఇట్లా వెనకకూ రాలేక నడుం వరకూ గొట్టంలో ఇరుక్కోనిపోయి లబోదిబోమని అరవసాగింది.

అల్లుడూ... అల్లుడూ... కొంచెం లాగు అల్లుడూ... వూపిరాడక సస్తా వున్నా అంటూ బతిమలాడింది. కుందేలు నవ్వుకుంటా దాని చిన్ని తోక రెండు చేతులతో గట్టిగా పట్టుకోని బలమంతా ఉపయోగించి లాగింది. ఎలుగుబంటయితే బయటికి రాలేదు గానీ దాని తోక మాత్రం కొద్దిగా వున్నది కాస్తా వూడి చేతికొచ్చింది. ఎలుగుబంటి ఆ మంటకు తట్టుకోలేక లబలబలాడసాగింది. అప్పుడా కుందేలు “మామా... నిన్ను లాగడం ఇంక నావల్ల కాదు గానీ తిన్నదంతా అరిగిపోయి పొట్ట తగ్గేంతవరకూ నువ్వు బైటకు రాలేవు. నాలుగురోజులు ఇట్లాగే అన్నం నీళ్ళు లేకుండా వుండు. అప్పుడు నీ అంతట నీవే బైటపడతావు” అనింది.

ఎలుగుబంటి ఏమీ చేయలేక రోజులు లెక్కబెట్టుకుంటా అట్లాగే వుండిపోయింది.

# 60 అంటగాకు... ముట్టగాకు... ఓయత్తా...

ఒకూర్లో ఒక అత్త, ఒక కోడలు వుండేటోళ్ళు. కోడలు చానా మంచిది. కానీ అత్తకు కోడలంటే అస్సలు పడేదికాదు. చీటికీ మాటికీ ఏదో ఒక వంక దొరికిచ్చుకోని నానా తిట్లు తిట్టేది.

ఒకసారేమో ఇద్దరూ ఏట్లో చేపలు పట్టడానికని పోయినారు. "నీవెక్కువ పడతావా... నేనెక్కువ పడతానా" అంటూ పందెం వేసుకున్నారు. సాయంత్రమైంది. అత్తకేమో ఒక్క చేప కూడా పళ్ళేదు. కాని కోడలికేమో బుట్ట నిండా పడినాయి. వూర్లో వాళ్ళందరూ వాళ్ళ బుట్టలు చూసి వాళ్ళత్తతో "ఏమమ్మా... ఒక్క చేప కూడా పట్టలేకపోయినావా... నీకన్నా నీ కోడలే నయమే" అంటూ నవ్వసాగినారు. అందరూ తన కోడలిని తెగ మెచ్చేసుకుంటా వుంటే అత్త కోపంతో లోపల్లోపల కుతకుతా వుడికిపోయింది.

ఇంటికొచ్చినాక కోడలితో "నువ్వు పోయి బావిలో నీళ్ళు తాపో... నేను చేపలకూర వండుతా" అని చెప్పింది. 'సరే'నంటూ కోడలు కడవ తీసుకోని నీళ్ళకు పోయింది. కోడలు అట్లా పోయిందో లేదో అత్త బెరబెరా ఇంటి వెనక్కు వచ్చింది. ఆడ ఒక పెద్ద నాగుపాము పుట్ట వుంటే కట్టె తీస్కోనొచ్చి దాన్ని పగులగొట్టడం మొదలుపెట్టింది. దాంట్లో వున్న నాగుపాము బుస్సుమంటూ బైటకొచ్చింది. వెంటనే అత్త పామును పట్టి చేపల బుట్టలో వేసి మూత పెట్టింది. కోడలు వచ్చీ రాగానే చేపలు తోమమని అత్త కోడలిని పురమాయించింది. కోడలుకిదంతా తెలియదు కదా. తోముదామని ఆమె చేపలబుట్ట తీసింది. అంతే కోడలిని పాము కాటు వేసింది. ఒళ్ళంతా విషమెక్కి గిలగిలా కొట్టుకుంటా అక్కడికక్కడే చచ్చిపోయింది. వెంటనే అత్త ఇంటి వెనుక గుంత తీసి కోడలిని బూడ్చిపెట్టి ఏమీ ఎరుగని నంగనాచిలా మట్టసంగా కూచోనింది.

సాయంత్రం పొలం నుండి కొడుకు ఇంటికొచ్చినాడు. చూస్తే పెండ్లాం యాడా కనబళ్ళేదు. వాళ్ళమ్మను పిలిచి "అమా... అమా... నా పెండ్లాం యాడా కనబడ్డం లేదు. యాడికి పోయింది" అనడిగినాడు. దానికి వాళ్ళమ్మ అమాయకంగా మొగం పెట్టి "ఏమోరా.. నాకూ తెలీదు. పొద్దున్నే కట్టెలు తెస్తా అని అడవికి పోయింది. అంతే ఇంతవరకూ రాలేదు" అని చెప్పింది. వానికి వాళ్ళమ్మ చంపేసినేది తెలీదు గదా. అందుకని పెండ్లాం కోసం అడవంతా వెదికీ వెదికీ అలసిపోయినాడు. ఏమైందో తెలీక ఏడ్చి వూకున్నాడు.

కొన్నిరోజుల తర్వాత ఒకరోజు కోడలి అమ్మ చిన్న కూతుర్తో కలిసి తన కూతురెట్లా వుందో చూసొద్దామని ఆ వూరికి వచ్చింది. చూస్తే కూతురు లేదు. దాంతో వాళ్ళమ్మ "మా కూతురెక్కడా కనబడ్డం లేదే.. యాడికి పోయింది" అనడిగింది. దానికామె దొంగేడుపు ఏడుస్తా "ఏమోనమ్మా... నాలుగు నెలల కిందట కట్టెలు తీసుకోనొస్తా అని అడవికి పోయింది. అంతే... ఆరోజు నుండీ ఈరోజు వరకు అజా పజా లేదు. ఏమైందో... ఏమో..." అనింది.

కూతురు ఏమైపోయిందబ్బా అని వాళ్ళు ఆలోచించుకుంటా పోతా వుంటే చిన్న చెల్లెలికి ఇంటి వెనక వున్న మందార పూలచెట్టు కనబడింది. ఆ చెట్టు సరిగ్గా కోడలిని దీలిడైతే బూడ్చి పెట్నారో సరిగా ఆన్నే పెరిగింది. ఆ పాప చెట్టు వంక చూస్తా "అమా... అమా... అక్కకు మందారపూలంటే ఎంతో ఇష్టంగదా... అందుకే పెంచుకున్నట్టుంది. నేను పోయి ఒక పూవు కోసుకోనొచ్చుకుంటా" అని వురుక్కుంటా పోయి కోసుకుందామని పూవు ముట్టుకోబోయింది. అంతే... వెంటనే ఆ పూవు

"అంటగాకు... ముట్టగాకు...

ఓ చెల్లెలా అంటూ ముట్టూ తగులుతాది.

పాము పెట్టి చంపె పాపిష్టి అత్త" అనింది.

ఆ మాటలింటానే పాప అదిరిపడింది. వెంటనే వురుక్కుంటా వాళ్ళమ్మ దగ్గరికి పోయి "అమా... అమా..." అంటూ జరిగిందంతా చెప్పింది. ఆమె అట్లాగా అని ఆచ్చర్యపోయి వచ్చి ఆ పువ్వును ముట్టుకోబోయింది. అంతే వెంటనే ఆ పూవు మళ్ళా

"అంటగాకు... ముట్టగాకు.. ఓయమ్మా

అంటూ ముట్టూ తగులుతాది

పాము పెట్టి చంపె పాపిష్టి అత్త" అనింది.

దాంతో వాళ్ళు మళ్ళా ఇంట్లోకి పోయి అత్తను పిల్చి "నిజం చెప్పు... నా కూతురినేం చేసినావు" అనడిగినారు. దానికామె అమాయకంగా "ఏమోబ్బా... నీ కూతురేమైందో నాకేం తెల్సు. అడవిలో పులే చంపిందో... సింహమే చంపిందో" అనింది.

"అట్లాగా... ఐతే బైటకి రా..." అంటూ ఆమె వూరందర్నీ పోగు చేసి "పోయి ఆ పూవును ముట్టుకోపో" అనింది. అత్త "అట్లాగే... నాకేం భయమా" అంటా ముట్టుకోబోయింది. వెంటనే ఆ పూవు

"అంటగాకు... ముట్టగాకు... ఓయత్తా

అంటూ ముట్టూ తగులుతాది

పాము బెట్టి చంపినావు పాపిష్టిదానా" అనింది.

ఆ మాటలిన్న అత్త తాను కోడలిని చంపిన విషయం వూరందరికీ తెలిసిపోయిందని భయపడి ఆన్నించి పారిపోడానికి వురికింది.

వెంటనే అందరూ ఆమెను పట్టుకోని మెత్తగా తన్ని గుండు కొట్టించి, సున్నం బొట్లు పెట్టి, గాడిద నెక్కించి, మెళ్ళో చెప్పుల దండేసి పూరంతా తిప్పి... "నీలాంటోళ్ళుంటే వూరికే చెడ్డపేరు... ఫో మా వూర్నించి" అంటూ వెళ్ళగొట్టేసినారు.

# 61 నల్లకుక్క

ఒకూర్లో ఒకామె వుండేది. ఆమెకు లేకలేక ఒక కొడుకు పుట్టినాడు. వానికి పదేండ్ల వయసొచ్చినా ఆమెకు ఇంకెవరూ పుట్టలేదు. ఒక్కడుంటే ఏం బాగుంటుంది. ఆడుకోవడానికి, పాడుకోవడానికి ఇంకొకడన్నా వుండాలగదా. అందుకని ఆమె గుడికి పోయి సుంకులమ్మకు మొక్కుకోని "అమా... అమా... వుండేది ఒక్కడే కొడుకు. వానికేమన్నా అయితే నా వంశమెట్లా... ఇంకొకన్నివ్వమ్మా" అని కండ్లనీళ్ళుపెట్టుకోనింది. అప్పుడు సుంకులమ్మ ప్రత్యక్షమై "సరే ఇస్తా... కానీ కొడుకు పుడ్తానే నువ్ చచ్చిపోతావ్... సరేనా..." అనింది. ఆమె సరేననింది. దేవత చెప్పినట్టుగానే కొంతకాలానికి ఆమెకు ఒక కొడుకు పుట్నాడు. పురిట్లోనే ఆమె చచ్చిపోయింది.

పిల్లలిద్దర్నీ ఆమె మొగుడే పెంచసాగినాడు. అట్లా ఆ పిల్లోనికి ఐదేండ్ల వయసొచ్చేసరికి వాళ్ళ నాయన గూడా జబ్బుపడి చచ్చిపోతా... చచ్చిపోతా... పెద్దకొడుకుని పిలిచి "రేయ్... చిన్నోడు జాగ్రత్తరా... బాగా చూసుకో. నువ్వే వానికి దిక్కు" అని చెప్పి చచ్చిపోయినాడు.

పెద్దోడు నాయన చచ్చిపోయినాక ఇంట్లో దీపం పెట్టేటోళ్ళు ఎవ్వరూ లేక పెండ్లి చేసుకున్నాడు. కొంతకాలానికి వాళ్ళకిద్దరు పిల్లలు పుట్టినా పెద్దోడి పెండ్లాం తన పిల్లలతోబాటు మరిదిని కూడా కన్నకొడుకులా బాగా చూసుకునేది. వాళ్ళ పక్కింట్లోనే ఒక ముసల్ది వుండేది. ఆమె రోజూ ఎవరూ లేనప్పుడు వాళ్ళింటికొచ్చి "సూడు... నువ్విట్లాగే వాన్ని గారాబంగా నెత్తిన పెట్టుకోని చూసుకుంటుంటే రేప్పొద్దున కష్టం. వాడు పెరిగి పెద్దగయినాక ఆస్తిలో వాటా అడుగుతాడు. నీకు నీ పిల్లలకు చిప్ప తప్ప ఏమీ మిగలదు. జాగ్రత్త" అంటూ బాగా ఎక్కియ్యసాగింది.

ఎంత మంచోళ్ళైనా పదేపదే చెప్పుడు మాటలు వింటే వాళ్ళకు నెమ్మదిగా ఆవి తలకెక్కుతాయి గదా. అట్లాగే ఆమెకూ ఆ మాటలు ఎక్కినాయి. దాంతో ఒకరోజు ముసల్దానితో "మరెట్లా వాని పీడ తొలగిచ్చుకోవడం" అనడిగింది. దానికా ముసల్ది "నాకు తెలిసిన ఒక మంత్రగాడున్నాడు. వానికి మాయలూ, మంత్రాలు బాగా వచ్చు. వాన్నడిగొస్తా" అని మంత్రగాని దగ్గరికి పోయి... ఓ సీల తెచ్చిచ్చి "ఇది వాని నెత్తిన కొట్టు" అని చెప్పింది.

ఆమె సరేనని తరువాత రోజు వాని తల దువ్వుతున్నట్టే దువ్వుతా ఠక్కున సీల వాని నెత్తిన గుచ్చేసింది. అంతే.. పాపం వాడు నల్లకుక్కగా మారిపోయినాడు. కుక్కైపోయినాక మాట్లాల్లేడు గదా... అందుకనే ఇంటి చుట్టూ భౌభౌమని తిరుగసాగినాడు. కాసేపటికి అన్నొచ్చినాడు. అన్నను చూస్తానే అది తోకూపుకుంటా భౌభౌమని మొరుగుతా మీదపడి నాకసాగింది. వానికి అది తన తమ్ముడని తెలీదు గదా... దాంతో "ఛీ... ఛీ... వెధవ కుక్క. వూకె మీద పడుతోంది" అనుకుంటా కట్టె తీస్కోనొచ్చి దానిని బాగా తన్ని తరిమేసినాడు.

పాపమా నల్లకుక్క ఏడుస్తా... ఏడుస్తా... పక్కూరికి వెళ్ళిపోయింది. అక్కడొక పొలం దగ్గర రైతులు పెద్దచెట్టు కింద చద్దన్నం మూటలు పెట్టుకోని పొలం దున్నుకోసాగినారు. ఇది ఆ అన్నం మూటల పక్కనే కూచోనింది. ఎంత ఆకలైనా ముట్టుకోలేదు. వాళ్ళు మధ్యాహ్నం వచ్చి చూసి "పాడుకుక్క అన్నం తినిందో ఏమో"

అనుకోని చూస్తే ఎట్లావున్న సద్దన్నం మూటలు అట్లానే వున్నాయి. "అరే పాపం ఇది చెడ్డకుక్కనుకున్నాం. కానీ చానా మంచికుక్కనే" అనుకోని దానికింత అన్నం పెట్టినారు. అప్పటి నుండీ అది రోజూ వాళ్ళెంబడే పొలానికి పోయి అన్నం మూటలకు కాపలా కూచునేది. వాళ్ళు ఏమన్నా పెడ్తే తినేది. లేదంటే గమ్మునుండేది.

వాళ్లొకరోజు రాజు దగ్గరికి పోతా పోతా వెంబడి నల్లకుక్కను గూడా తీస్కోని పోయి "రాజా... రాజా... ఇది చానా మంచిది. ఇట్లాంటి కుక్కను మేం ఇంతవరకూ ఎప్పుడూ చూల్లేదు. దీన్ని నీ దగ్గరుంచుకోండి" అని ఇచ్చేసినారు. అప్పట్నించి అది రాజభవనంలోనే వుండేది.

ఆ రాజుకు ఒక కూతురు వుంది. ఆమెది సూడసక్కని అందం. రాజు ఆమెకు పెండ్లి చేయాలనుకున్నాడు. ఎవరినిచ్చి చేయాలబ్బా అని ఆలోచిస్తా వుంటే రాత్రి సుంకులమ్మ కలలో కనిపించి "మీ ఇంట్లో నల్లకుక్కుందిగదా... దాన్నిచ్చి చేయ్" అని చెప్పి మాయమైంది. దేవత చెప్పినట్టు చేయకపోతే ఆమెకు కోపమొస్తాది గదా... అందుకని రాజు తన కూతురిని నల్లకుక్కకిచ్చి ఘనంగా పెండ్లి చేసినాడు.

నల్లకుక్క ఆరోజు నుండీ యువరాణితో పాటే వుండేది. ఆమె యాడికి పోతే ఆడికి పోయేది. ఏమి తింటే అది తినేది. ఒకరోజు యువరాణి దీనికి స్నానం చేపియ్యక ఎన్నిరోజులైందో ఏమో అనుకోని వేడినీళ్ళు పెట్టి , సబ్బేసి బాగా తలస్నానం చేపిచ్చింది. తల రుద్దుతా వుంటే చేతికి గరుకుగా అనిపిచ్చింది. ఏందబ్బా ఇట్లా చేతికి తగులుతా వుంది" అని వెంట్రుకలు జరిపి బాగా చూస్తే... ఇంకేముంది నడినెత్తిన సీల కనపడింది.

అయ్యో పాపమని ఆమె నెమ్మదిగా సీల పట్టుకుని పీకింది. అంతే నల్లకుక్క కాస్తా పదహారేండ్ల పడుచు పిల్లోనిగా మారిపోయినాడు. అది చూసి ఆమె... "అబ్బ! నా మొగుడు ఎంత బాగున్నాడు. అచ్చం బంగినపల్లి మామిడిపండు లెక్క" అని సంబరపడిపోయింది. యువరాణి మొగున్తో బైటకొచ్చేసరికి చూసినోళ్ళందరూ "ఇదేందబ్బా కుక్కనిచ్చి పెండ్లి చేస్తే ఎవరితోనో తిరుగుతా వుంది. నల్లకుక్క ఏమైందో ఏమో అనుకోని వురుక్కుంటా పోయి రాజుకు చెప్పినారు. రాజు వురుకులు పరుగుల మీద ఆడికొచ్చి కూతురితో "నల్లకుక్క యాడుంది" అనడిగినాడు. అప్పుడామె అందరి ముందూ మొగుని నెత్తి మీద సీల గుచ్చింది. అంతే నల్లకుక్క అయిపోయినాడు. తీస్తేనే మళ్ళా మామూలు మనిషైనాడు. అప్పుడు వాడు అందరికీ జరిగిందంతా చెప్పినాడు. అది విన్న రాజు ఏది ఏమైతేనేం... నా కూతురికి చందమామలాంటి అందగాడు మొగుడైనాడు కదాని సంబర పడినాడు.

వాళ్ళిద్దరూ ఒకరోజు మిద్దెపైన కూచోని ముచ్చట్లాడుకుంటా వుంటే దూరంగా వీధి ముందు అన్నావదిన, పిల్లలు కనబన్నారు. వాళ్ళ బట్టలన్నీ చినిగి, దుమ్ముపట్టి వున్నాయి. నెత్తిన కట్టెల మోపు పెట్టుకోని వీధిలో అమ్ముకుంటా వున్నారు. వాడు వెంటనే భటులను పంపించి వాళ్ళను పిలిపిచ్చినాడు.

వాళ్ళు రాజ భవనంలోకి రాగానే దాసీలొచ్చి వేడివేడి నీళ్ళతో వాళ్ళకు తలస్నానం చేపిచ్చి కట్టుకోవడానికి కొత్త పట్టుబట్టలు ఇచ్చినారు. బంగారు తూగుటుయ్యాల మీద కూచోబెట్టి వూపుతా... కడుపు నిండా కమ్మని భోజనం పెట్టినారు. వాళ్ళు వూగుతా... వూగుతా... "ఎవరబ్బా.. ఈ రాజు చానా మంచోని లెక్కున్నాడే" అనుకుంటా వుంటే వాడు లోపలికొచ్చినాడు.

అన్నావదినలకెళ్లి చూస్తా "వదినా... నన్ను గుర్తుపట్టినావా" అనడిగినాడు. ఆమె మరిదిని గుర్తుపట్టి "నన్ను మన్నించు నాయనా... ఆ ముసల్దాని మాటలు విని నిన్ను బాధపెట్టినా. అందుకే దేవుడు మాకు తగిన శాస్తి చేసినాడు. ఆస్తంతా పోయి వీధిన పడినాం" అంటూ కండ్లనీళ్ళు పెట్టుకోనింది.

అప్పుడు మరిది "అయిపోయిందేదో అయిపోయిందిలే. ఇప్పన్నించీ మనమంతా కలిసే వుందాం. మీరు కూడా ఈన్నే వుండండి" అంటూ వాళ్ళను గూడా తనతోబాటే రాజభవనంలో వుంచుకున్నాడు.

# 62 మొగుడెవరు

ఒకూర్లో  ఒకడున్నాడు. వానికో చెల్లెలుంది. వాళ్ళకి చిన్నప్పుడే అమ్మానాన్న చచ్చిపోయినారు. దాంతో వాడు చెల్లెల్ని అమ్మానాన్నా లేరనే బాధ తెలీకుండా జాగ్రత్తగా పెంచినాడు. పదిమంది దాసీలని పనుల కోసం పెట్టి, చిన్నపని గూడా చెప్పకుండా, ఆమె ఏది కావాలంటే అది తెచ్చిస్తా అల్లారుముద్దుగా చూసుకున్నాడు. అట్లా కొన్నినాళ్ళయ్యేసరికి ఆమెకి బాగా మజ్జుపట్టి పెద్ద సోమరిపోతయిపోయింది. అన్నీ మంచం దగ్గరికి రావాల్సిందే. ఆడ పుల్ల తీసి ఈడ... ఈడ పుల్ల తీసి ఆడ పెట్టేది కాదు. కనీసం రోజూ సరిగ్గా స్నానం గూడా చేసేది కాదు. తినడం... పన్నుకోవడం అంతే...

అట్లా కొన్ని సమ్మచ్చరాలు దాటేసరికి నెమ్మదిగా ఆ పిల్ల పెరిగి పెద్దగయి పెండ్లీడుకొచ్చింది. పెద్దగయినాక ఆడపిల్లకు పెండ్లి చేసి అత్తారింటికి పంపాలగదా... దాంతో వాళ్ళన్న ఒకరోజు చెల్లెలి దగ్గరికి వచ్చి "చెల్లెమ్మా... చెల్లెమ్మా... నీకు పెండ్లి ఈడు వచ్చేసింది. ఇప్పుడు గనుక నీకు పెండ్లి చేయకపోతే ఒక్కగానొక్క చెల్లెలికి  పెండ్లి గూడా చేయలేకుంటున్నాడు అంటూ జనాల చేత మాట పడాల్సొస్తాది. నీకెవరు కావాలంటే వాళ్ళనిచ్చి చేస్తా... చెప్పు ఎవరు కావాల్నో" అన్నాడు.

దానికామె " అన్నా... నీ మాటనే నా మాట. లోకం తెల్సినోనివి. పెద్దోనివి. నువ్వెట్లా చెప్తే అట్లా" అనింది. దానికి అన్న "చూడమ్మా... పెండ్లయినాక కాపురం చేయాల్సింది నువ్వేగానీ నేను కాదు కదా... నీకు నచ్చినోళ్ళకే నిన్నిచ్చి చేస్తా... చెప్పు... ఎవరికిచ్చి చేయమంటావ్.. బాపనోళ్ళకిచ్చి చేద్దునా" అన్నాడు.

దానికామె కాసేపాలోచించి "వద్దనా... వాళ్ళిండ్లలో గనుక పెండ్లి జేసుకుంటే మాటిమాటికీ మడిమడంటా స్నానాల మీద స్నానాలు చేస్తా... ఎప్పుడూ పూజలూ, వ్రతాలూ చేస్తా వుండాలి. అవన్నీ నే చేయలేను గానీ వేరే సంబంధం ఏదన్నా వుంటే చూడు" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి "సరే ఐతే... బాపనోళ్ళు వద్దుగానీ కాపోళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి "వద్దనా... కాపోళ్ళకు పొలాలూ... పశువులు కుప్పలు కుప్పలుంటాయి. వాళ్ళతోబాటు ఆ యవసాయం పనులు చేస్తా, పశువులను చూసుకుంటా, పనివాళ్ళను అజమాయిషీ చేస్తా నేనుండలేనుగానీ వేరే సంబంధం ఏదన్నా వుంటే చెప్పు, చేస్కుంటా" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి "సరే ఐతే... కాపోళ్ళొద్దుగానీ కోమటోళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి "వద్దనా... వాళ్ళు పెద్ద పిసినారోళ్ళు... పైసా పైసా తినకుండా దాచిపెట్టి...

నోరు కట్టుకోని బతుకుతా వుంటారు. దాన్తో పాటు పొద్దస్తమానం అంగట్లోనే కూచోని సావాల. అవన్నీ నా చేతగాదు గానీ వేరే సంబంధం ఏదన్నా వుంటే చెప్పు. చేసుకుంటా" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి "సరే ఐతే... కోమటోళ్ళు వద్దుగానీ... బోయోళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి " వద్దనా.. వాళ్ళు అస్తమానం అడవికి పోయి జంతువులను వేటాడి తెస్తా వుంటే ఆ మాంసాన్ని వండిపెట్టలేక సావాల. అది నా చేతగాదు గానీ వేరే సంబంధం ఏదన్నా వుంటే చెప్పు. చేసుకుంటా" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి "సరే ఐతే... బోయోళ్ళు వద్దుగానీ... గొల్లోల్లకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి "వద్దనా... వాళ్ళు నెలల తరబడి గొర్రెలను, మేకలను మేపుకుంటా రాత్రింబవళ్ళు బరకల్లో, అడవుల్లో ఇండ్లు విడిచిపెట్టి తిరుగుతా వుంటారు. ఇంట్లో భయంభయంగా ఒక్కదాన్నే గడపాల. అది నా చేతగాదు గానీ వేరే సంబంధం ఏదన్నా వుంటే చెప్పు. చేసుకుంటా" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి "సరే ఐతే... గొల్లోల్లు వద్దుగానీ... చాకలోళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి "వద్దనా... రోజూ వూరోళ్ళ మైలబట్టలన్నీ సాకిరేవుకు తీసకోనిపోయి... దాండ్లను శుభ్రంగా వుదికి, ఆరేసి, ఇస్త్రీ చేసి ఇంటింటికీ పోయి ఇచ్చి రావాల. అంతపని నా చేతగాదు గానీ ఇంకో సంబంధం ఏదన్నా వుంటే చెప్పు. చేసుకుంటా" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి "సరే ఐతే... చాకలోల్లు వద్దుగానీ... మాదిగోళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి "వద్దనా... వాళ్ళిండ్లల్లో పొద్దున లేసినప్పటి నుండి రాత్రి పడుకునే దాకా కూలిపనులు చేస్తా... కడుపుకు సరిగా కూడు గూడా లేకుండా... అందరితో అవమానాలు పడ్తా బతకాల. అంతపని నా చేతగాదు గానీ ఇంకో సంబంధం ఏదన్నా వుంటే చెప్పు. చేసుకుంటా" అనింది.

దానికి వాళ్ళన్న కాసేపాలోచించి " ఇంగ ఇట్ల అందరినీ కాదంటే ఎట్లాగమ్మా. సరే తురకోళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు. దానికామె కాసేపాలోచించి "వద్దనా... వాళ్ళిండ్లల్లో ఆడోళ్ళంతా ఎప్పుడూ బురఖాలు ఏసుకోని తిరుగుతా వుండాల. ఇంట్లో నుండి బైటకి రాగూడదు. ఏదో ఒక పని చేస్తా వుండాల. అది నా చేతగాదు గానీ వేరే సంబంధం ఏదన్నా వుంటే చెప్పు. చేసుకుంటా" అనింది.

ఏ సంబంధం చెప్పినా ఏదో ఒక వంక పెడ్తా వుంటే ఇంక ఎవరికిచ్చి చేయాల్నో అర్థం గాక వాళ్ళన్న విసుగ్గా "ఇంక మిగిలినేది అడుక్కుతినేటోళ్ళే.. వాళ్ళకిచ్చి చేస్తా... చేసుకుంటావా" అన్నాడు కోపంగా.

వెంటనే ఆ సోమరిపోతుది "ఆ... ఆ... సరిగ్గా చెప్పినావ్. ఆడయితే హాయిగా వుంటాది. స్నానం చేయాల్సిన పని లేదు. బండలు తుడచాల్సిన పని లేదు. వంట చేయాల్సిన పని లేదు. బట్టలుతకాల్సిన పని లేదు. కూలీకి పోవాల్సిన పని లేదు. హాయిగా చిప్ప తీసుకోని వీధిలో అట్లా ఇట్లా ఒక అరగంట తిరిగొస్తే చాలు రకరకాల వంటలు దొరికిపోతాయి. కడుపు నిండా తిని, కంటి నిండా నిద్రపోవచ్చు. అనా అనా నాకు ఈ సంబంధమే ఖాయం చెయ్" అనింది.

# 63 పెద్దోళ్ళ మాట సద్దన్నం మూట

ఒకూర్లో ఒకడుండేటోడు. వాడు చానా మంచోడు. కానీ చానా పేదోడు. రోజూ కూలిపనికి పోతే తప్ప ఇండ్లు గడవదు. ఒకరోజు వాని పెండ్లాం "ఇట్లా ఎంత కాలమని కష్టపడతాం. ఒక్కరోజు కూలీకి పోకపోయినా కడుపుకింత అన్నంలేక కష్టమయిపోతా వుంది. నా దగ్గర నాలుగు వరహాలున్నాయి. వాటిని తీసుకోని నగరానికి పోయి ఏదైనా వ్యాపారం చెయ్. అదృష్టం బాగుంటే బాగా సంపాదించుకోవచ్చు" అని చెప్పి వాని చేతిలో నాలుగు వరహాలు పెట్టింది.

వాడు పొద్దున్నే ఇంకా తెలవారక ముందే లేచి తలస్నానం చేసి, దేమునికి మొక్కుకోని, పెండ్లాం కట్టిచ్చిన సద్దిమూట సంకన బెట్టుకోని బైలుదేరినాడు. అట్లా అడవిలో నడిచీ నడిచీ కాళ్ళు పీకసాగినాయి. అంతలో దూరంగా ఒక ముసిలోడు పోతా కనబన్నాడు. మాట్లాడ్తా పోతే కష్టం కనబడదు గదా అందుకని వాడు "ఓ తాతా... ఓ తాతా..." అని గట్టిగా పిల్చినాడు. కానీ ఆ ముసిలోడు ఆ అరుపు వినబన్నా వినబడనట్టే తన మానాన తాను అట్లాగే పోసాగినాడు. ఇనబల్లేదేమో అని వీడు మరొక్కసారి గట్టిగా కేకేసినాడు. వూహూ! ఆ ముసిలోడు కొంచం గూడా తల తిప్పి చూడలేదు.

దాంతో వాడు వురుక్కుంటా ఆ ముసిలోని దగ్గరికి పోయి "ఏం తాతా! పిలిస్తే కూడా పలకకుండా పోతా వున్నావ్" అన్నాడు. దానికా ముసిలోడు "చూడు నాయనా! నేనందరి మాదిరి పనీపాటా లేకుండా వూరికే మాట్లాడే రకం కాదు. నా మాట బంగారు మూట. ఒక్కో వరహాకి ఒక్కో మంచి మాట మాట్లాడ్తా. నీకిష్టమైతే మాట్లాడు. లేదంటే లేదు" అన్నాడు.

'పెద్దోళ్ళ మాట సద్దన్నం మూట' అన్నారు గదా. అందుకని వాడు సరేనని ఒక వరహా ఇచ్చినాడు. అప్పుడా ముసిలోడు "ఆపదల్లో వున్నవారిని ఆదుకోవడం మరవొద్దు" అన్నాడు. సరేనని వాడు ఇంకో వరహా ఇచ్చినాడు. "కొత్త స్థలానికి పోతే ఏమరుపాటుగా వుండొద్దు" అన్నాడు. "సరే ఇంగో మాట చెప్పు" అని వాడు మూడో వరహా కూడా ఇచ్చినాడు. అప్పుడా ముసిలోడు దాన్ని తీసుకోని "ఎంత ఎదిగినా మొదట చేసిన పని మరవొద్దు" అన్నాడు. ఇంగ వాని దగ్గర ఒకే ఒక వరహా మిగిలింది. ఏమైతే అదే కానియ్యని ఆఖరికి దాన్ని గూడా ఇచ్చినాడు. అప్పుడా ముసిలోడు "తొలి కోపం మంచిది గాదు. దాన్ని విడిచిపెట్టాల" అని చెప్పినాడు. అట్లా నాలుగు వరహాలు తీసుకోని నాలుగు మంచి మాటలు చెప్పి ఆ ముసిలోడు ఎల్లిపోయినాడు.

అట్లా పోతా పోతా చీకటి పడే సమయానికి ఒక రాజ్యానికి చేరుకున్నాడు. నడిచీ నడిచీ పొద్దున తిన్నదంతా అరిగిపోవడంతో ఒక ఇంటి ముందు కూచోని పెండ్లాం కట్టిచ్చిన సద్దిమూట ఇప్పుకోని తినడం



మొదలుపెట్టినాడు. అట్లా తింటా తింటా వుంటే ఆ ఇంట్లో నుండి ఘొల్లుమని ఏడుపు వినబడింది. 'ఏందబ్బా అందరూ అట్లా ఏడుస్తా వున్నారు' అనుకోని లోపలికి పోయి "ఎందుకమ్మా అట్లా ఏడుస్తా వున్నారు? ఏంది నీ బాధ" అనడిగినాడు. దానికా యింట్లో వాళ్ళు వెక్కి వెక్కి ఏడుస్తా "ఏం చేయమంటావు నాయనా! ఈ వూరి రాజుకొక కూతురుంది. ఆమె పక్కన ఎవరు పడుకున్నా పొద్దునకల్లా నురగలు కక్కుకోని చస్తా వున్నారు. ఎవరైతే అట్లా సావకుండా బతుకుతారో వానికి ఆమెనిచ్చి పెండ్లి చేయడమే గాక, ఈ రాజ్యానికి రాజుని కూడా చేస్తారంట. మొదట్లో కొంతమంది పోయినారుగానీ పోయిన ప్రతొక్కరూ చస్తా వుంటే ఇప్పుడు ఎవరూ పోవడం లేదు. దాంతో మారాజు రోజుకొక ఇంటి నుంచి ఒకడు పోవాలి. పోకపోతే ఆ ఇంట్లో అందరినీ చంపేస్తానని ఆజ్ఞాపించినాడు. ఈరోజు మా వంతు వచ్చింది. నాకున్నది వీడొక్కడే కొడుకు. అదీ నా బాధ" అని చెప్పింది.

అప్పుడు వానికి "ఆపదల్లో వున్నవారిని ఆదుకోవడం మరవొద్దు" అని ముసిలోడు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది. వెంటనే "అమ్మా! నువ్వేం బాధపడొద్దు. నీ కొడుకు బదులు నేను పోతా. నాకెవరూ లేరు" అని చెప్పి వాళ్ళు వద్దు వద్దన్నా వినకుండా పోయినాడు. భటులు వాన్ని తీస్కోనిపోయి యువరాణి గదిలో వదిలినారు.

వాడు యువరాణి పెట్టినేటివన్నీ బాగా తిన్నాడు. నెమ్మదిగా నిద్ర ముంచుకోని రాసాగింది. మంచమ్మీద పండుకున్నాడు. కండ్లు మూసుకుపోతున్నంతలో "కొత్త స్థలానికి పోతే ఏమరుపాటుగా వుండొద్దు" అని ముసిలోడు చెప్పిన మాట గుర్తుకొచ్చి టక్కున లేసి కూచున్నాడు. నిద్రపోగూడదని కత్తి తీసుకోని వేలు కోసుకోని నిమ్మకాయ పెట్టుకున్నాడు. ఆ మంటకు ఇంక నిద్రేమి వస్తాది. దాంతో వాడు నిద్ర రాకపోయినా కదలకుండా మెదలకుండా మట్టసంగా మంచమ్మీద పండుకోని నిద్రపోతున్నట్టు నటించసాగినాడు.

అర్ధరాత్రి దాటగానే వానికి బుస్సుమని చప్పుడు వినబడింది. అదిరిపడి లేసి చూస్తే వాడు పండుకున్న మంచం కోళ్ళలోంచి రెండు పాములు సర్రున బైటకొస్తా కనబన్నాయి. "ఇదా సంగతి" అనుకోని చటుక్కున కత్తి తీసి దాండ్లను కసుక్కున నరికి పారేసినాడు. అవి గిలగిలగిల కొట్టుకుంటా చచ్చిపోయినాయి.

పొద్దున్నే భటులు తలుపు తెరచి చూస్తే మంచమ్మీద కూచోని చిరునవ్వులు నవ్వుతా కనబన్నాడు. వాళ్ళు ఆచ్చర్యపోయి వురుక్కుంటా పోయి రాజుకు చెప్పినారు. రాజు వెంటనే వాని దగ్గరకొచ్చి విషయమంతా కనుక్కోని సంబరపడి చెప్పిన మాట ప్రకారమే కూతురిని వానికి ఇచ్చి పెండ్లి చేసి రాజ్యానికి రాజును చేసినాడు.

'ఎంత ఎదిగినా మొదట చేసిన పని మరువగూడదు' అని ముసిలోడు చెప్పినాడు గదా. అందుకని వాడు రాజయినా సరే రోజూ కొంతసేపు పలుగూ పారా పట్టుకోని, పాత పంచ కట్టుకోని పొలానికి పోయి కష్టపడి పని చేసేటోడు. జనాలందరినీ ప్రేమగా పలకరించేటోడు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా కన్నబిడ్డల్లా ఆదుకునేటోడు. ఇది చూసి ఆ వూరి జనాలు "అబ్బ మా రాజు ఎంత మంచోడు. ఇట్లాంటి రాజు ప్రపంచంలో యాడా వుండడు" అని చెప్పుకోని మురిసిపోయేటోళ్ళు. ఆ రాజ్యానికి ఒక సేనాధిపతి వున్నాడు. వాడు చానా దుర్మార్గుడు. ఎట్లాగైనా సరే రాజు కావాలని వాని కోరిక. అందుకని వాడు కొంతమంది సైనికులకు బాగా డబ్బులిచ్చి లొంగదీసుకోని ఒకరోజు రాత్రి రాజునూ, రాణినీ బంధించి చెరశాలలో వేసి తానే ఇప్పటి నుంచీ ఈ రాజ్యానికి రాజునని ప్రకటించేసుకున్నాడు. కానీ ఆ వూరి జనాలు "అంత మంచి రాజును అన్యాయంగా బంధిస్తావా, మాకు ఆ రాజే కావాలి. నువ్వొద్దు" అంటా కత్తులు, కటార్లు తీసుకోని తిరగబడి దొరికినోన్ని దొరికినట్టు చంపడం మొదలుపెట్టినారు. ఆ దెబ్బకు భయపడి సేనాధిపతి రాజ్యాన్ని వదిలి పారిపోయినాడు. దాంతో వాడు తిరిగి రాజయినాడు.

పెండ్లయి ఎన్ని సమ్మచ్చరాలు దాటినా వానికి పిల్లలు పుట్టలేదు. అంతలో వానికి మొదటి పెండ్లాం గుర్తుకొచ్చింది. దాంతో ఒకరోజు చిన్నపెండ్లానికి జరిగినేదంతా చెప్పి మొదటి పెండ్లాన్ని పిల్చుకోనొస్తానని పోయినాడు. పోతే ఇంటి ముందు ఎవరో చిన్నపిల్లోడు "అమ్మా! అమ్మా!" అంటా తన పెండ్లాం చుట్టే తిరుగుతా కనబన్నాడు. అది చూసి వానికి విపరీతమైన కోపమొచ్చింది. 'నేను లేనప్పుడు ఇది ఎవరినో పెండ్లి చేసుకోని పిల్లోన్ని కూడా కన్నట్లుంది' అనుకోని వురుక్కుంటా పోయి ఇద్దరినీ పట్టుకోని చంపడానికి కత్తి లేపినాడు. అంతలో "తొలి కోపం మంచిది కాదు. విడిచిపెట్టాలి" అని ముసిలోడు చెప్పిన మాట గుర్తుకొచ్చింది. దాంతో కోపాన్ని తగ్గిచ్చుకోని "ఎవడే వీడు, నిజం చెప్పు" అన్నాడు పెళ్ళాంతో...

అప్పుడామె "వీడెవడో కాదు. మన కొడుకే. నీవు పోయిన ఆరు నెల్లకు పుట్టినాడు. నీవు నన్ను విడిచిపోయేటప్పటికే నాకు నెల తప్పింది. కావాలంటే చుట్టుపక్కలోల్లని అడుగు' అనింది. చుట్టుపక్కల జనాలు గూడా "ఆమె చెప్పింది నిజమే. ఆరోజు నుండీ రాత్రింబగలూ నీ కోసమే ఎదురుచూస్తా వుంది" అని చెప్పినారు.

దాంతో వాడు "తొందరపడి అన్యాయంగా నా పెండ్లాంబిడ్డలను చంపుకొంటా వుంటినే" అని బాధపడి, వాళ్ళకు జరిగిన విషయమంతా చెప్పి తనతోబాటు రాజ్యానికి తీసుకోనిపోయినాడు. ఆడ అందరూ కలసిమెలసి హాయిగా బతికినారు.

# 64 ఇదేం సావురా దేవుడా

ఒకూర్లో వీరయ్య అని ఒకడుండేటోడు. ఆయన ఎంత మెతకో ఆయన పెండ్లాం అంత గయ్యాళి. చీటికీ మాటికీ గొడవ పడతా కప్పెగిరిపోయేలా అరుస్తా వుండేది. ప్రతిదానికీ నోటికొచ్చినట్టల్లా తిడతా వుండేది. ఇట్లా చానాకాలం సాగింది. రోజూ చిన్న చిన్న దాండ్లకే గొడవలవుతా వుండడంతో విసిగిపోయిన వీరయ్య ఈ సంసారం కన్నా సన్యాసం మేలని నిశ్చయించుకున్నాడు.

దాంతో ఒకరోజు ఎవరికీ చెప్పా పెట్టకుండా దూరంగా వున్న ఒక నగరానికి పోయి సాధువుల గుంపులో చేరిపోయినాడు. వాళ్ళతోబాటు నున్నగా గుండు కొట్టిచ్చుకోని, కాషాయం బట్టలు వేసుకోని, తంబూర మీటుతా, చిరుతలు వాయిస్తా శ్రీరాముని గురించి వాళ్ళు పాడే పాటలన్నీ తానూ నేర్చుకున్నాడు. నెమ్మదిగా చేతిలో వున్న డబ్బులన్నీ అయిపోయినాయి. సన్యాసన్నాక డబ్బులెందుకు. ఒక నాలుగిండ్ల ముందు నిలబడితే చాలు. ఎవరో ఒకరు ఏదో ఒకటి వేస్తారు. అది తింటా దేవున్ని తలచుకుంటా గుళ్ళుగోపురాలు తిరగడమే గదా... అనుకోని ఆరోజు నుంచి భిక్షాటన మొదలు పెట్టాల అనుకున్నాడు.

కొంచం చీకటి పడినాక ఒక ఇంటి ముందు నిలబడి "చేరుకొంటివా శ్రీరామచంద్రా... జనకుని ఇండ్లు చేరుకొంటివా" అని సంబరంగా పాట పాడడం మొదలుపెట్టినాడు.

ఆ ఇంటి ముందు ఒక ఇరవైయేండ్ల యువకుడు పండుకోని వున్నాడు. వారం కిందట వాళ్ళ అమ్మా నాయనలతో కొట్లాడి ఇండ్లు వదిలి వెళ్ళిపోయినాడు. వాళ్ళు గూడా పోతే పోనీలే... బుద్ధి వస్తాది వెధవకి... సంపాదించి పెడ్తా వుంటే తిని అరగక మనకే ఎదురు తిరుగుతా వున్నాడని ఏ మాత్రం పట్టించుకోలేదు. వాడు ఆడా ఈడా తిరిగి తినడానికి తిండిలేక, పండుకోడానికి ఇండ్లు లేక, చేతిలో దుడ్లు లేక నానా అవస్థలు పడి అప్పుడే ఇంటికి తిరిగి వచ్చినాడు. కానీ అమ్మానాయనలకు మొగం చూపించడానికి సిగ్గేసి ఇంటి ముందే అరుగు మీద పండుకున్నాడు. ఆ పిల్లోని పేరు రామచంద్రుడు.

వీరయ్య సరిగ్గా వాని ఇంటి ముందే నిలబడి "చేరుకొంటివా శ్రీరామచంద్రా... జనకుని ఇండ్లూ చేరుకొంటివా" అని నవ్వుతా పాట పాడతా వుంటే అది విని వానికి ఒళ్ళు మండిపోయింది. ఈ సాధువు నన్ను చూసే ఎగతాళి చేస్తా వున్నాడనుకోని "ఏంరా.... ఒళ్ళుగాని కొవ్వెక్కిందా... నా జనకుని ఇల్లు. నా ఇష్టం. చేరుకుంటే చేరుకుంటా, లేకపోతే వదిలేసి పోతా... నడుమ నీకెందుకు. అడుక్కునేటోనివి అడుక్కోని మట్టసంగా పోకుండా" అంటా కోపంతో పక్కనే వున్న కట్టె తీసుకొని రపరపరప నాలుగు పెరికినాడు. ఆ దెబ్బలకు కుయ్యో మొర్రో అనుకుంటా

వీరయ్య ఆన్నించి పారిపోయి సత్రానికి చేరుకున్నాడు. రాత్రంతా ఆ దెబ్బలనే తలచుకుంటా ఆకలితో అట్లాగే పండుకొన్నాడు.

పొద్దున్నే ఆకలికి తట్టుకోలేక తంబూర మీటుకుంటా ఇంకో వీధిలోకి పోయినాడు. ఒక ఇంటి ముందు నిలబడి “కనుగొంటినే సీతమ్మ తల్లీ... నిన్నూ కనుగొంటినే” అంటా పాట పాడడం మొదలు పెట్టినాడు.



ఆ ఇంటి కోడలు ఇంటి బైట దాపుగానున్న చోట కూచోని తియ్యని గారెలు తింటా వుంది. వాళ్ళ అత్త పెద్ద గయ్యాళిది. కొసరి కొసరి పెట్టాల్సిన కొత్తకోడలికి గూడా ఏ మాత్రం దయ లేకుండా గీచిగీచి పెట్టేది. ఆమె నోటికి భయపడి ఎంత ఇష్టమైనా ఏదీ నోరు తెరచి అడిగేది కాదు. అట్లాంటిది ముందురోజు తనకెంతో ఇష్టమైన గారెలు చేస్తా వుంటే అత్తకు తెలీకుండా ఒక నాలుగు కొంగుచాటున దాచిపెట్టుకోని బైట దాచిపెట్టుకోనింది. పొద్దున్నే కోడలు ఐదింటికి లేసి పనులన్నీ చేసినాక అత్త తీరిగ్గా ఏడింటికి లేస్తాది. దాంతో కోడలు పొద్దున్నే లేసి, బెరబెరా ఇంటి ముందంతా కసువు నూకి, ఒక వారగా కూచోని రాత్రి కొట్టేసిన గారెలు సంబరంగా తింటా వుంది. ఆమె పేరు సీతమ్మ.

వీరయ్య సరిగ్గా ఆ సమయానికే ఆ ఇంటి ముందు నిలబడి “కనుగొంటినే సీతమ్మ తల్లీ... నిన్నూ కనుగొంటినే” అంటా పాట పాడతా వుంటే ఆమె అదిరిపడింది. ఎవ్వరికీ తెలీకుండా ఇంత పొద్దున్నే దాచిపెట్టుకోని తింటా వుంటే కనుక్కోడమే గాక, మళ్ళా అందరికీ వినబడేలా గట్టిగా పాట పాడతా వున్నాడు. మా అత్త గనక వింటే ఇంగేమన్నా వుందా... అనుకుంటా కోపంతో చీపురు తీసుకోని “ఏంరా... ఏదో నోరు కట్టుకోలేక... తినక తినక నాలుగు గారెలు తింటా వుంటే... అది గూడా ఓర్చుకోలేవా... చూసినా చూడనట్లు గమ్మునుండాలగానీ మా అత్తతో తన్నించడానికి మా ఇంటి ముందే నిలబడి గట్టిగా పాట పాడతావా... వుండు నీ పని చెబుతా” అంటా చీపురు తిరగేసి రపరపరప నాలుగు పెరికింది. ఆ దెబ్బలకు తట్టుకోలేక వీరయ్య కుయ్యోమొర్రో అనుకుంటా ఆన్నించి పారిపోయి సత్రానికి చేరుకున్నాడు.

ఇదేందిరా నిన్న రాత్రి అట్లా జరిగింది. ఈ పొద్దు ఇట్లా జరిగింది అనుకున్నాడు. ఒకపక్క ఆకలి దంచేస్తా వుంది. మరొక పక్క ఒళ్ళు వాతలు పడినాయి. ఆకలికి తట్టుకోలేక అట్లాగే లేచి తంబూరా తీసుకోని ఇంకో

వీధిలోనికి పోయినాడు. ఒక ఇంటి ముందు నిలబడి "నమ్మిన వానిని మోసము చేయుట... న్యాయము గాదురా రఘునాథా..." అని పాట పాడటం మొదలుపెట్టినాడు.

ఆ ఇంటాయన పెద్ద జమీందారు. చానా మంచోడు. అవసరానికి అందరికీ ధర్మవడ్డీ కంటే తక్కువకే అప్పులిస్తా వుంటాడు. ఆరోజు ఒకడు తాను తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడానికి డబ్బులు తీసుకోని ఆడికి వచ్చినాడు. జమీందారు ఆ అప్పుకి వడ్డీ లెక్క వేస్తా వున్నాడు. ఆయన పేరు రఘునాథుడు. సరిగ్గా ఆ సమయానికి వీరయ్య ఆడికి పోయి "నమ్మిన వారిని మోసము చేయుట న్యాయము గాదురా రఘునాథా" అని పాట పాడటం మొదలుపెట్టినాడు.

ఆ పాట వినేసరికి రఘునాథునికి మండిపోయింది. "నా అంత మంచోడు ఎవడూ లేడని చుట్టుపక్కల ఏడేడు పధ్నాలుగు వూర్లలో ఎవన్నడిగినా చెబుతారు. అట్లాంటిది నా ఇంటి ముందు నిలబడి నన్నే నమ్మిన వారిని మోసం చేస్తున్నానని తిడతావా... ఎంత కొవ్వురా నీకు..." అంటా పక్కనే వున్న కట్టె తీసుకోని రపరపరప నాలుగు పెరికినాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక వీరయ్య కుయ్యోమొర్రో అనుకుంటా ఆన్నించి పారిపోయి సత్రానికి చేరుకున్నాడు.

"ఇదేం సావురా దేవుడా... ఎవడు చూసినా ఇట్లా యెంటబడి తంతా వున్నారు. మందితో ఇట్లా తన్నులు తినడం కన్నా, పెండ్లాంతో తిట్లు తినడమే మేలు" అనుకుంటా తంబురా, చిడతలు ఆన్నే పారనూకి మట్టసంగా ఇంటికి పోయినాడు.

నెల నుంచీ మొగుడు కనబడకపోయేసరికి పాపం వీరయ్య పెండ్లాం నెత్తీనోరు కొట్టుకుంటా.... అనవసరంగా బంగారంలాంటి మనిషిని నా నోటి దురుసుతో దూరం చేసుకొంటి... పాపం... యాడున్నాడో... ఏం చేస్తున్నాడో... చీమకు కూడా హాని చెయ్యని మనిషి... అనుకుంటా తిండి గూడా తినకుండా బాధపడతా వుంది. సరిగ్గా ఆ సమయానికి వీరయ్య నున్నని గుండుతో ఇంటికి వచ్చినాడు. మొగున్ని చూడగానే ఆమె సంబరంగా వురుక్కుంటా పోయి "మళ్ళా ఎప్పుడూ నిన్ను ఇట్లా బాధపెట్టను. ఇంగ నన్నెప్పుడూ వదిలిపోకు" అంటా గట్టిగా పట్టుకోని ఆగకుండా కండ్లనీళ్ళు పెట్టుకోనింది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ ఎటువంటి గొడవలు పడకుండా హాయిగా చిలకా గోరింకల్లెక్క జీవితమంతా గడిపినారు.

# 65 సోమరిపోతు మహావీరునికీ జై

ఒకూర్లో ఒక పెద్ద సోమరిపోతు వుండేటోడు. వాడు చిన్నప్పట్నించీ చిన్న పనిగూడా చేసేటోడు కాదు. ఎప్పుడు చూడు తినడం పన్నుకోవడం అంతే... పెండ్లయినా కొంచం గూడా మారలేదు. పెండ్లామే గొణుక్కుంటా అన్ని పనులు చేసుకొనేది.

ఒకసారి పెండ్లాం బైటకు పోతా "ఇదిగో... పొయ్యి మీదికి అన్నంగిన్నె ఎక్కిచ్చినాను. ఐదునిమిషాలాగి దించండి. నేను సంతకు పోయి సరుకులు తీసుకోనొస్తా" అని చెప్పి పోయింది. వీడు సరేలే అని తలూపినాడుగానీ అట్లాగే నిద్రపోయినాడు. పెండ్లాం సరుకులు తీసుకోనొచ్చి అలసిపోయి అన్నం తిందామని చూస్తే ఇంగేముంది ఒక్క మెతుకుగూడా లేదు. అంతా నల్లగా మాడిపోయి బొగ్గులెక్క అయిపోయింది. దాంతో ఆమె కోపంగా "ఇట్లాగయితే సంసారం సాగినట్లే. ఏం మొగోనివయ్యా నువ్వు. పొద్దున లేసినప్పటి నుంచీ కాళ్ళూచేతులు లేనోని లెక్క వూకే కూచుంటావు గానీ ఒక్కపని గూడా చేయవు. చుట్టుపక్కల చూడుపో... అందరిండ్లలో మొగోళ్ళు ఎట్లా పని చేస్తా వున్నారో" అనింది.

దానికి వాడు "ఏందీ... నేనేం పని చెయ్యడం లేదా... పొద్దున్నుంచీ వంద ఈగలు చంపినాను తెలుసా... ఏమనుకుంటావున్నావో" అన్నాడు కోపంగా. "ఏందీ... ఎన్ని చంపినావు" అనింది పెండ్లాము. "వంద... వంద... చంపినానే వుత్త చేతుల్తో.... అదీ ఒక్కరోజులోనే" అన్నాడు మరింత గట్టిగా. సరిగ్గా అదే సమయానికి ఆ ఇంటిముందు పక్కింటి పుల్లమ్మ పోతా వుంది. ఆమె ఆ మాటలు వినింది. "అబ్బా... ఏమో అనుకుంటిగానీ వీడు పెద్ద వీరుడే. ఒక్క రోజులోనే వంద మందిని వుత్త చేతుల్తో చంపడమంటే మాటలా" అనుకోని వెనకింటామెకు చెప్పింది. ఆమె ముందింటామెకు చెప్పింది. ఆమె పక్క వీధామెకు చెప్పింది. ఆమె వాళ్ళ బంధువులకు చెప్పింది. అట్లా ఒక్క రోజులోనే గడ్డివాములుగదా ఒకటంటుకుంటే గాలికి పక్కనున్నవన్నీ సరసరసర అంటుకున్నట్లు వూరువూరంతా తెలిసిపోయింది. ఆ మాటలు ఒక సైనికుడు విన్నాడు. "అబ్బా... ఒక్కరోజులోనే వందమందిని వుత్త చేతుల్తో చంపినాడంటే వీడెవడో సామాన్యుడు గాదు. రాజుగారికీ సంగతి చేరవేయాల్సిందే" అనుకోని వురుక్కుంటా పోయి విషయం చెప్పినాడు. రాజు ఆ మాటలు విని ఆశ్చర్యపోయినాడు.

"పొండి... పోయి... ఆ వీరున్ని తీసుకోని రాపోండి. అటువంటోడు మన వూరిలో వుంటే మన రాజ్యానికెంతో మంచిది" అని సైనికులను పంపిచ్చినాడు.

ఆ సోమరిపోతు ఇంట్లో హాయిగా మంచమ్మీద కాలు మీద కాలేసుకోని కూర్చోని వేడివేడి పకోడీలు తింటా వున్నాడు. దూరంగా ఏవో గుర్రాలు వస్తా వున్న చప్పుడు వినబడింది. పక్కనే వున్న కిటికీ తెరచి చూసినాడు. దూరంగా గుర్రాలు, సైనికులు కనబన్నారు. "యాడికో పోతావున్నట్టున్నారు. మనకెందుకులే" అనుకున్నాడు. కాసేపటికి చప్పుడు మరింత దగ్గరగా వినిపించింది. కిటికీ తెరచి చూసినాడు. ఇంటి ముందు గుర్రాలు దిగుతా కనబన్నారు. పక్కింటికేమోలే అనుకోని మళ్ళా కిటికీ మూసేసినాడు. అంతలో తలుపు తట్టిన చప్పుడయింది. "ఏమే... ఎవరో వచ్చినట్టున్నారు. కొంచం పోయి చూడు" అన్నాడు మంచమ్మీద నుంచి లేయకుండానే. ఆమె పోయి తలుపు తెరిచింది. ఎదురుగా సైనికులు కనబన్నారు. వాళ్ళు లోపలికి వచ్చి ఆ సోమరిపోతుకి వంగి నమస్కారం చేసి "అయ్యా... మిమ్మల్ని తీసుకోని రమ్మని రాజుగారు పంపిచ్చినారు. ఒక్కసారి వచ్చిపోండి" అన్నారు. "నేనా.... ఎందుకు... ఏం చేసినాను" అన్నాడు వాడు భయపడుతూ. "అయ్యా... మీరు ఒక్కరోజులోనే వుత్త చేతుల్తో వందమందిని చంపినారంట గదా... ఆ మాట ఆనోటా ఈనోటా పడి రాజుగారికి తెలిసింది. అందుకే మిమ్మల్ని పిలుచుకోని రమ్మన్నాడు" అని చెప్పినారు. దానికి వాడు "నేనా నేనెవ్వరినీ చంపలేదే... మీరు ఎవరో అనుకోని ఇక్కడికి వచ్చినట్టున్నారు" అన్నాడు. ఆ మాటలకా సైనికులు "అయ్యా... మీకు గమ్మత్తులు ఆడడానికి మేమే దొరికినామా... మీరెంత దాచిపెట్టుకున్నా ఇప్పుడు మీ గురించి తెలియనోళ్ళు ఈ వూరిలో ఒక్కరు గూడా లేరు. తొందరగా రండి. రాజుగారు మీ కోసం ఎదురు చూస్తా వున్నారు" అన్నారు. ఆ మాటలినగానే సోమరిపోతు గుండె దడదడలాడింది. వెళితే ఏమవుతుందో తెలీదు. వెళ్ళకుంటే వదలరు. ఏదయితే అదయిందని "సరే... నాకో గుర్రాన్ని వదిలి మీరు పోండి. నేనొస్తా" అన్నాడు. వాళ్ళు సరేనని గుర్రాన్ని వదిలి పోయినారు.

సోమరిపోతు పెండ్లాన్ని పిలిచి "ఏమే... నాకెందుకో భయంగా వుంది. ఎందుకయినా మంచిది నే పోగానే పెట్టె సర్దుకోని పుట్టింటికి పో... నాకేమన్నా అయితే పిల్లలు జాగ్రత్త" అని చెప్పినాడు. వానికి గుర్రమెక్కడం గానీ, దాన్ని తోలడంగానీ రాదు. దాంతో నిచ్చెన తెప్పించుకోని గుర్రం ఎక్కినాడు. దాన్ని ఎట్లా తోలాల్నో అర్థంగాక మొలతాడుకు కట్టుకున్న పిన్నీసు తీసి గుర్రం మెడ మీద గట్టిగా ఒక్క గుచ్చు గుచ్చినాడు. అంతే... ఆ నొప్పికి తట్టుకోలేక అది రాజభవనం వైపు మెరుపు వేగంతో దూసుకు పోసాగింది. వాడు భయంతో గట్టిగా దాని మెడ కరుచుకున్నాడు. అది నిమిషాల్లో సైనికులందరినీ దాటిపోయింది.

అదే సమయంలో రాజు అంతఃపురం పైన తిరుగుతా వున్నాడు. ఆయనకు గుర్రమ్మీద దూసుకోని వస్తా వున్న సోమరిపోతు కనబన్నాడు. "ఆహా... ఏమి వేగం... మెరుపులెక్క వస్తా వున్నాడు. రాజ్యంలో ఇంతమంది సైనికులుండి ఏం లాభం... ఏ రోజూ ఎవడూ ఇంత వేగంగా పోవడం చూడలేదు" అనుకున్నాడు. రాజు ఆ సోమరిపోతు సభలోకి రాగానే పెద్ద యెత్తున సన్మానించి నగలూ, వజ్రాలు బహుమానంగా ఇచ్చి "నీలాంటోడు మాకెంతో అవసరం. ఎప్పుడయినా ఏదయినా ఆపద వస్తే కబురు పంపుతాను. వచ్చి సాయం చేయండి" అని చెప్పి పంపిచ్చినాడు. వాడు నగలతో, వజ్రాల హారాలతో తిరిగి ఇంటికి రాగానే చూసి వాని పెండ్లాం సంబరపడింది. ఒకొక్కటే అమ్ముకుంటా హాయిగా కాలం గడపసాగినారు.

ఒకసారి రాజ్యంలో కొంతమంది దొంగలు పడినారు. చీకటి పడితే చాలు ఎప్పుడు ఎక్కడి నుంచి ఎవరింటి మీద పడతారో తెలీదు. క్షణంలో రావడం వున్నదంతా దోచుకోవడం మరుక్షణంలో మాయమై పోవడం చేసేవాళ్ళు. సైనికులు వీధివీధినా కాపలా కాస్తా వున్నా వాళ్ళని పట్టుకోలేక పోతావున్నారు. ప్రజలందరూ

రాత్రయితే చాలు భయంతో గజగజా వణికిపోతా తలుపులేసుకోని బిక్కుబిక్కుమంటా గడపసాగినారు. దాంతో రాజు లాభం లేదనుకోని సోమరిపోతుని పిలిపించినాడు.

"ఒక్క రోజులోనే వందమందిని వుత్త చేతుల్తో చంపిన మహా వీరుడా... నీకు తెలియనిదేముంది. వూర్లో దొంగలు పడి నెలరోజుల నుంచీ ముప్పుతిప్పలు పెడతా వున్నారు. నీకు ఎంతమంది సైనికులు కావలసి వస్తే అంతమందిని తీసుకోని పో. వాళ్ళని మాత్రం దొరికితే పట్టుకో.... దొరక్కుంటే చంపెయ్యి" అన్నాడు. ఆ మాటలింటానే సోమరిపోతు గజగజా వణికిపోయినాడు. అయినా దాన్ని బైటకు కనబడనీయకుండా "రాజా! ఈ మాత్రం పనికి మళ్ళా నాకు తోడు సైనికులెందుకు. నేనొక్కన్నే పోయి వాళ్ళని పట్టుకోనొస్తాలే" అని చెప్పి ఇంటికి పోయినాడు. పెండ్లాంతో "ఏమే... ఈ రోజుతో ఇంక నా పని అయిపోయినట్లే. ఎందుకయినా మంచిది నే పోగానే పెట్టె సర్దుకోని పుట్టింటికి పో... నాకేమన్నా అయితే పిల్లలు జాగ్రత్త" అని చెప్పి రాత్రికి ఘుమఘుమలాడేలా మాంచి బిర్యానీ చేయించుకోని మూటగట్టుకోని బైలుదేరినాడు.

కొంచెం దూరం పోయినాక ఒక పెద్దతోట కనబడింది. దాంట్లోకి పోయి అంగీలో దాచి పెట్టుకున్న విషం తీసి బిర్యానీలో కలిపినాడు. ఇంక ఇది తిని చచ్చిపోతే సరి. లేకుంటే రేపు అందరి ముందూ పరువు పోతుంది అనుకున్నాడు. అంతలో వానికి బాగా నిద్ర వచ్చింది. "సర్లే ఎట్లాగూ చచ్చిపోయేదే గదా... కాసేపు హాయిగా నిద్రపోయి ఆ తర్వాత చచ్చిపోదాం" అనుకోని మూట పక్కనే పెట్టుకోని అట్లాగే నిద్రపోయినాడు.

ఆరోజు రాత్రి దొంగలు ఎవరింట్లో దొంగతనం చేయాల్నో ఆలోచించుకోవడానికని ఆ తోటలో సమావేశమయినారు. వాళ్ళకి ఘుమఘుమలాడి పోతా బిర్యానీ వాసన వచ్చింది. యాడుందబ్బా అని వెదుక్కుంటా వస్తే వీడు నిద్రపోతా కనబన్నాడు. వాళ్ళు నెమ్మదిగా వాని పక్కనున్న మూట తీసుకోని పోయి విప్పినారు. బిర్యానీ కొంచెమే వుంది. దాంతో "సర్లే... ఎంతుంటే ఏమిలే... వాసనే ఇంత కమ్మగా వుంటే... తింటే ఇంకెంత రుచిగా వుంటుందో" అని ఆ ముప్పయి మంది తలా ఒక ముద్ద తిన్నారు. అంతే... కాసేపటికి అందరూ విషమెక్కి ఎక్కడోళ్ళక్కడ పడి చచ్చిపోయినారు.

పొద్దున్నే ఆ సోమరిపోతు లేసి చూస్తే ఇంగేముంది. పక్కనే దొంగలు ఒకరుగాదు ఇద్దరుగాదు ముప్పైమంది ఒకరి పక్కనొకరు చచ్చిపడున్నారు. పక్కన మూట లేకపోవడంతో వానికి విషయమంతా అర్థమైంది. వెంటనే వురుక్కుంటా పోయి ఒక ఎద్దులబండి తీసుకోనొచ్చి ఆ శవాలన్నీ అందులో యేసుకోని రాజభవనానికి బైలుదేరినాడు. అట్లా పోతా వుంటే దారిలో చూసినోళ్ళంతా "ఉత్త చేతుల్తో వందమందిని చంపిన మహావీరునికి జై" "ఒక్క రాత్రిలో ముప్పయి మంది దొంగల్ని మట్టి కరిపించిన మహా వీరునికి జై" అంటూ గుంపులు గుంపులుగా అరుచుకుంటా బండి వెనకాల్నే రాసాగినారు. ఆ అరుపులు విని రాజు బైటకు వచ్చినాడు. చూస్తే ఇంగేముంది బండి మీద ముప్పైమంది దొంగల్ని వేసుకోని వస్తా వున్న సోమరిపోతు కనబన్నాడు. వెంటనే రాజు మేడ దిగి వానికి ఎదురొచ్చి "భళా... వీరా... భళా... ఇంతమంది సైనికులుండి ఇన్ని రోజులుగా చేయలేని పని ఒక్కరోజులోనే ఒక్కనివే చేసి చూపించినావు" అని మెచ్చుకోని పెద్ద ఎత్తున బండి నిండా నగలు, వజ్రాలూ ఇచ్చి పంపిచ్చినాడు.

అట్లా కొద్దిరోజులు గడచిపోయినాయి. అంతలో యాన్నుంచొచ్చిందో ఏమోగానీ ఒక పెద్దపులి వూరి మీదకొచ్చి పడింది. రాత్రయితేచాలు దొరికినోన్ని దొరికినట్టు చంపి తినేయసాగింది. సైనికులు దాన్ని పట్టుకోవాలని ఎంతగానో ప్రయత్నించినారు గానీ అది ఎవరికీ దొరకక పోగా వాళ్ళనే ఒక పదిమంది దాకా చంపేసింది.

దాంతో పులి పేరు చెబ్తే చాలు అందరూ భయంతో గజగజా వణికిపోసాగినారు. చీకటి పడితే చాలు ఎంత పనున్నా సరే ఎక్కడోళ్ళక్కడ పరుగుపరుగున ఇళ్ళకు చేరుకోని తలుపులు బిగించుకోని లోపలనే కూచోసాగినారు.

దాంతో రాజు ఇట్లాగయితే లాభం లేదనుకోని సోమరిపోతుని పిలిపించినాడు. "ఉత్త చేతుల్తో వందమందిని, ఒక్క రాత్రిలో ముప్పైమంది దొంగల్ని మట్టి కరిపించిన మహావీరుడా... నీకు తెలియనిదేముంది. వూర్లోకి ఒక పెద్దపులి వస్తూ జనాలని ముప్పుతిప్పలు పెడతా వుంది. నీకు ఎంతమంది సైనికులు కావలిస్తే అంత మందిని తీసుకోని పో. దాన్ని మాత్రం వదలొద్దు. దొరికితే పట్టుకో... దొరక్కుంటే చంపెయ్యి" అన్నాడు. ఆ మాటలకా సోమరిపోతు భయంతో గజగజా వణికిపోయినాడు. అయినా దాన్ని బైటకు కనబడనీయకుండా పెద్ద మొనగాని లెక్క "ఈ మాత్రం దానికి మళ్ళా సైనికులెందుకు రాజా. నేనొక్కన్నే పోయి దాన్ని పట్టుకోనొస్తాలే" అని చెప్పి ఇంటికి వెళ్ళిపోయినాడు. పెండ్లాంతో "ఏమే... ఈ రోజుతో ఇంక నా పని అయిపోయినట్లే, ఎందుకయినా మంచిది నేపోగానే పెట్టె సర్దుకోని పుట్టింటికి పో. నాకేమన్నా అయితే పిల్లలు జాగ్రత్త" అని చెప్పి నిచ్చెనేసుకోని గుర్రమెక్కి వూర్లోకి బైలుదేరినాడు.

అది అమావాస్య. చుట్టూ చీకటి. దారిలో ఒక్కరు గూడా కనబల్లేదు. అందరూ తలుపులేసుకోని ఎవరిండ్లలో వాళ్ళు దాచిపెట్టుకున్నారు. సోమరిపోతుకు భయంతో ఒళ్ళంతా గజగజా వణికిపోసాగింది. గుర్రాన్ని తీసుకోని పోయి ఎవరూ లేని ఒక చోట కట్టేసి ఆ చెట్టు కిందే నిండుగా కంబలి కప్పుకోని పన్నుకున్నాడు.

అర్ధరాత్రయింది. పెద్దపులి వూరంతా తిరిగీ తిరిగీ అలసిపోయింది. యాడా దానికి తినడానికి ఏమీ దొరకలేదు. అప్పటికే నాలుగు రోజుల నుంచి దానికి అదే పరిస్థితి. అన్ని ఇండ్లు మూసేసున్నాయి. కోళ్ళు, మేకల్తో సహా అన్నీ లోపల పెట్టి తాళాలేసుకుంటాన్నారు. తినడానికి తిండి లేక అది నీరసంగా అయిపోయింది. అడుగు తీసి అడుగు వేయలేక నెమ్మదిగా సోమరిపోతు పన్నుకున్న చెట్టు దగ్గరకు వచ్చింది. పెద్దపులిని చూడగానే గుర్రం భయపడి తాడు తెంపుకోని వురకసాగింది. కానీ పెద్దపులికి దాని వెంటపడి వేటాడే ఓపిక లేదు. దాంతో అట్లాగే నెమ్మదిగా వాని దగ్గరకు రాసాగింది. అంతలో ఆ అలికిడికి ఆ సోమరిపోతు కప్పుకున్న కంబలితో సహా లేచినాడు. పెద్దపులికి చీకట్లో అదేందో అర్థం కాలేదు. "ఇదేం జంతువబ్బా... నల్లగా ఇంత పెద్దగా వుంది. ఈ అడవిలో నేనెప్పుడూ చూడలేదే" అని భయంతో వణికిపోసాగింది. అంతలో ఆ సోమరిపోతు నిద్రమబ్బులో ఎదురుగా వున్నది వాని గుర్రమే అనుకోని దాన్ని పట్టుకోని తాడుతో చెట్టుకు కట్టేసి మళ్ళా నిద్రపోయినాడు. దాంతో పెద్దపులికి ఆ రాత్రిగూడా తిండి లేక ఆకలికి తట్టుకోలేక ఆఖరికి అది అట్లాగే చచ్చిపోయింది.

ఆ సోమరిపోతు పొద్దున్నే లేసి చూస్తే ఇంగేముంది... పెద్దపులి చచ్చిపోయి కనబడింది. వెంటనే వాడు వురుక్కుంటా పోయి ఒక ఎద్దులబండి తీసుకోనొచ్చి ఆ శవాన్ని అందులో యేసుకోని రాజభవనానికి బైలుదేరినాడు. అట్లా పోతా వుంటే దారిలో చూచినోళ్ళంతా "ఉత్త చేతుల్తో వందమందిని చంపిన మహావీరునికి జై" "ఒక్క నిమిషంలోనే పెద్దపులిని మట్టి కరిపించిన మహావీరునికి జై" అంటూ గుంపులు గుంపులుగా అరుచుకుంటా బండి వెనకాల్నే రాసాగినారు. ఆ అరుపులు విని రాజు బైటకు వచ్చినాడు. చూస్తే ఇంగేముంది బండి మీద పెద్దపులి శవాన్ని వేసుకోని వస్తా వున్న సోమరిపోతు కనబన్నాడు. వెంటనే రాజు మేడ దిగి వానికి ఎదురొచ్చి "భళా వీరా... భళా... ఇంతమంది సైనికులుండి ఇన్ని రోజులుగా చేయలేని పని ఒక్కరోజులోనే ఒక్కనివి చేసి

చూపించినావు. నీలాంటి వీరుడు మూల్లోకాల్లో యాడా వుండడు" అని మెచ్చుకోని పెద్ద ఎత్తున గౌరవించి బండి నిండా బంగారం, వజ్రాలూ, నగలూ ఇచ్చి పంపిచ్చినాడు.

అట్లా కొద్దిరోజులు గడిచిపోయినాయి. మొగుడూ పెండ్లాలు హాయిగా రాజిచ్చిన బంగారం, నగలూ అవసరానికి అమ్ముకుంటా కాలు మీద కాలేసుకోని కాలం గడపసాగినారు. అంతలో పక్కవూరి రాజు ఈ రాజ్యంపైకి దండయాత్రకి బైలుదేరినాడు. వూరి పొలిమేరల్లో సైన్యాన్ని ఆపి "మర్యాదగా వచ్చి లొంగిపోయి కప్పం కట్టి నాకు సామంతునిగా వుంటావా... లేక దాడి చేసి రాజ్యం మొత్తం ఆక్రమించుకోమంటావా ఏదో ఒకటి చెప్పు" అని కబురు పంపించినాడు. రాజుకు ఏం చేయాల్నో పాలుపోలేదు. అవతల సైన్యం చానా పెద్దది. గెలవడం చానా కష్టం. అట్లాగని లొంగిపోదామా అంటే ఆ అవమానం కన్నా చావడం మేలు అనిపించింది. ఆ సమయంలో రాజుకి సోమరిపోతు గుర్తుకొచ్చినాడు. వెంటనే సైనికులను పంపి పిలిపించినాడు.

"ఉత్త చేతుల్తో వందమందిని, ఒక్కరాత్రిలో ముప్పైమంది దొంగల్ని, ఒక్క నిమిషంలోనే పెద్దపులిని మట్టికరిపించిన మహావీరుడా... నీకు తెలియనిదేముంది. పక్కవూరి రాజు మన మీదకు దండయాత్రకొచ్చినాడు. ఇది మనవూరి పరువు మర్యాదలకు సంబంధించిన విషయం. నీకు ఎంతమంది సైనికులు కావాలంటే అంతమందిని తీసుకోనిపో. ఇంకెప్పుడూ నిన్ను ఏ కోరికా కోరి ఇబ్బంది పెట్టను. ఈ ఒక్కసారికి సాయం చేయి చాలు" అన్నాడు.

యుద్ధం అనేమాట వినగానే సోమరిపోతు గజగజా వణికిపోయినాడు. అయినా దాన్ని బైటకి కనబడనీయకుండా "రాజా... ఇదే ఆఖరిసారి అంటా వున్నావు గదా... అట్లాగే చేద్దాం. ముందు నేను పోతా... వెనుక సైన్యాన్నంతా రమ్మను" అని చెప్పి ఇంటికి పోయినాడు. పెండ్లాంతో "ఏమే... ఇన్ని రోజులూ ఏదో అదృష్టం బాగుండి తప్పించుకున్నాగానీ... ఇంగ ఈ రోజుతో నా పని అయిపోయినట్లే... ఎందుకయినా మంచిది. నే పోగానే పెట్టె సర్దుకోని పుట్టింటికి పో. నాకేమన్నా అయితే పిల్లలు జాగ్రత్త" అని చెప్పి బైలుదేరినాడు.

ఆ సోమరిపోతు పోయేసరికి సైనికులంతా సిద్ధంగా వున్నారు. ఒక మంచి నల్లని మేలు జాతి గుర్రాన్ని సోమరిపోతు కోసం సిద్ధంగా వుంచినారు. రాగానే అందరూ "మహావీరునికి జై" "మహా వీరునికి జై" అని అరుస్తా భుజాల మీదకు ఎత్తుకోని పోయి గుర్రమ్మీద కూచోబెట్టినారు. "మహావీరా... ఇది అట్లాంటిట్లాంటి మామూలు అల్లాటప్పా గుర్రం కాదు. దీనంత వేగంగా వురికే గుర్రం ఈ చుట్టుపక్కల ఏడేడు లోకాల్లో యాడా లేదు. నీ కోసమే ప్రత్యేకంగా తెప్పించినాం" అన్నారు. ఆ గుర్రాన్ని చూడగానే సోమరిపోతు భయంతో గజగజా వణికిపోయినాడు. యాడ కిందపడిపోతానో ఏమో అనే భయంతో "రేయ్... నన్ను గుర్రానికి గట్టిగా తాళ్ళతో కట్టెయ్యండ్రా" అన్నాడు. అది విని రాజు "మహావీరా ఏందిది" అన్నాడు ఆచ్చర్యంగా. దానికి సోమరిపోతు వెంటనే "రాజా... యుద్ధరంగంలోంచి నేనన్నా వెనక్కి రావాలి. నా శవమన్నా వెనక్కి రావాలి. అంతేగానీ పొరపాటున గూడా శత్రువులకు వెన్ను చూపగూడదు. కత్తి గుండెల్లో దూసుకుపోయినా సరే చివరి రక్తం బొట్టు వరకూ పోరాడాలి. అందుకే ఇలా కట్టేసుకుంటున్నా" అన్నాడు. ఆ మాటలినగానే సైనికులందరూ "మహావీరునికి జై" "మహావీరునికి జై" అని అరుస్తా తాము గూడా గుర్రాలకు కట్టించుకోసాగినారు.

సోమరిపోతు సైనికులతో "ముందు నేనొక్కన్నే పోతా... నేను పోయిన అర్ధగంటకు మీరు బైలుదేరండి" అని చెప్పి బైలుదేరినాడు. కొంచం దూరం పోగానే బతికుంటే సాలు బలుసాకైనా తిని బతకొచ్చు... సైనికులు

వచ్చేసరికి ఈడి నుంచి ఎవరికీ తెలియని వేరే వూరికి పారిపోవాలి" అనుకోని పిన్నీసు తీసి గుర్రం మెడ మీద గట్టిగా ఒక్క గుచ్చు గుచ్చినాడు. అంతే ఆ గుర్రం అదిరిపడి సర్రుమని ఉరకడం మొదలుపెట్టింది.

ఆ గుర్రం అట్లాంటిట్లాంటి మామూలు గుర్రం కాదు. అప్పటికే ఎన్నో యుద్ధాల్లో పాల్గొన్న గుర్రం. దాంతో శత్రువులు వున్న వైపే వురకడం మొదలుపెట్టింది. అది చూసి భయపడిన సోమరిపోతు దాన్ని ఆపాలని ఎంత చూసినా అది ఆగకుండా మరింత వేగంగా మెరుపులెక్క దూసుకుపోసాగింది. ఆ వేగానికి సోమరిపోతుకి కళ్ళు తిరగసాగినాయి. భయంతో ఒళ్ళంతా చెమట పట్టసాగింది. ఎట్లాగయినా సరే దాన్ని ఆపాలనుకున్నాడు.

అంతలో ఎదురుగా రెండు పెద్ద తాటి చెట్లు పక్కపక్కనే కనబన్నాయి. గుర్రాన్ని వాటి మధ్యలో వురికించినాడు. తాటి చెట్లు దగ్గరికి రాగానే వాటిని గట్టిగా పట్టుకుంటే గుర్రం ఆగిపోతుందిలే అనుకున్నాడు. కానీ ఆ తాటిచెట్లకు మొదలు దగ్గర అప్పటికే బాగా చెదలు పట్టేసినాయి. లోపలంతా డొల్లడొల్ల అయిపోయి తేలికగా అయిపోయినాయి. ఈ రోజో రేపో కూలిపోవడానికి సిద్ధంగా వున్నాయి. అది వానికి తెలీదు. గుర్రం వాటి మధ్యలోంచి పోతుండగానే చేతుల్తో రెండుచెట్లు గట్టిగా పట్టేసుకున్నాడు. కానీ గుర్రం మెరుపులెక్క దూసుకోని పోతా వుంది గదా... ఆ వేగానికి ఆ రెండు చెట్లు వేళ్ళతో సహా లేచి పైకి వచ్చేసినాయి.

గుర్రమ్మీద రెండు చేతుల్లో రెండు తాటి చెట్లను పట్టుకోని దూసుకొస్తావున్న వాన్ని చూడగానే శత్రు సైన్యాలు అదిరిపడినాయి. "రేయ్... వుత్త చేతుల్తో వందమందిని ఒక్కరోజులో చంపిన మహావీరుడు తాటి చెట్లు ఎత్తుకోని చిరుతపులిలెక్క వస్తా వున్నాడు. వానికి దొరికినామంటే మనపని అయిపోయినట్లే. సున్నంలోకి ఎముకలు గూడా మిగలవు. పారిపోయి ప్రాణాలు కాపాడుకోండ్రోయ్" అంటూ గట్టిగా అరుస్తా అందరూ తలా ఒక దిక్కు కిందామీదా పడి వురకసాగినారు. సోమరిపోతు ఆడికొచ్చేసరికి ఒక్కడుగూడా మిగలలేదు.

వాని వెనుక అర్ధగంటకు బైలు దేరిన సైనికులు ఆడికి చేరుకునేసరికి సోమరిపోతు ఒక్కడే నవ్వుతా కనబన్నాడు. వెంటనే వాళ్ళు "ఉత్తచేతుల్తో వందమందిని చంపిన మహావీరునికి జై" "ఒక్క నిమిషంలోనే శత్రు సైన్యాలనంతా పారద్రోలిన మహావీరునికి జై" అంటూ వాన్ని గుర్రమ్మీద నుంచి దించి భుజాల మీదకు ఎత్తుకోని తప్పట్లు కొట్టుకుంటా, చిందులు తొక్కుకుంటా, బాణాలు కాల్చుకుంటా రాజు దగ్గరికి తీసుకోనొచ్చినారు. రాజు వురుక్కుంటా మేడ దిగొచ్చి "శభాష్ వీరా... శభాష్... వీరునివంటే నువ్వే. ఒక్క రక్తం చుక్క గూడా చిందకుండా విజయం సాధించినావ్... నీలాంటోడు ఒక్కడుంటే చాలు... ఈ ప్రపంచాన్నే జయించొచ్చు" అంటూ మెచ్చుకోని వాళ్ళ రాజ్యానికి సైన్యాధ్యక్షునిగా చేసినాడు. అప్పటికే సోమరిపోతు వీరత్వం గురించి చుట్టుపక్కల రాజ్యాలకంతా తెలిసిపోవడంతో ఆ రాజ్యంవైపు కన్నెత్తి చూడడానికి గూడా అందరూ భయపడిపోయినారు. దాంతో ఆ సోమరిపోతు హాయిగా కాలుమీద కాలేసుకోని కులాసాగా జీవితమంతా గడిపినాడు.

# 66 బోడి రూపాయ

ఒకూర్లో ఒక ముసల్ది వుండేది. ఆ ముసల్ది చానా పిసినారిది. పైసాగూడా ఎవరికీ ఇచ్చేది కాదు. ఆ ముసల్దాని దగ్గర ఒక ఇనప్పెట్టె వుండేది. అందులో వంద రూపాయలు వుండేవి. ప్రతిరోజూ సాయంత్రం మచ్చుపై నుండి పెట్టె కిందకు దించి డబ్బులన్నీ లెక్క బెట్టుకోని మళ్ళా జాగ్రత్తగా పైన పెట్టేది.

ఆ ముసల్దానికి ఒక కోడలుంది. ఆమె ఇదేందబ్బా మా అత్త రోజూ పెట్టె దించి ఏందో ఎంచుతా వుందని ఒకరోజు అత్త బైటకు పోగానే పెట్టె దించి చూస్తే రూపాయ బిళ్ళలు కనబడినాయి. ఓహో! ఇదా సంగతని మట్టసంగా ఒక రూపాయ బిళ్ళ తీసుకోని బొడ్లో దాచిపెట్టుకోనింది.

సాయంత్రం అత్తొచ్చి ఎప్పట్లాగే పెట్టె దించి రూపాయలన్నీ ఎంచేసరికి ఒకటి తక్కువొచ్చింది. ఆమె అదిరిపడి ఇదేందబ్బా ఒకటి తక్కువొచ్చిందని మళ్ళా ఎంచింది. ఎన్నిసార్లు ఎంచినా ఒకటి తక్కువే వచ్చింది. అంతే... ఆ ముసల్ది "అమ్మో... నా రూపాయ పోయిందిరో నాయనో..." అని గట్టిగా అరచి దభీమని కిందపడిపోయింది.

కాసేపటికి ముసల్దాని కొడుకు పొలం నుంచి ఇంటికి వచ్చినాడు. ఇంటిబైట కూచున్న పెండ్లాంతో "మా అమ్మ యాడుందే" అనడిగినాడు. దానికామె "లోపలుంది. చూడుపో" అనింది. వాడు లోపలికి పోయి చూస్తే ఇంగేముంది... ముసల్ది చచ్చిందాని లెక్క నోరు తెరచి పడుంది. ఎంత కదిపినా కదల్లేదు. దాంతో వాడు వాళ్ళమ్మ చచ్చిపోయిందనుకోని గట్టిగా ఏడ్చడం మొదలుపెట్టినాడు. వాని పెండ్లాం మాత్రం ఏమీ పట్టిచ్చుకోకుండా హాయిగా అరుగు మీద కూచోనింది.

వాడది చూసి "ఏమే! అత్త చచ్చిపోయిందనే బాధ కొంచెం గూడా లేదు నీకు. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు. కొంచం ఏడ్చే" అన్నాడు.

దానికామె "అప్పుడే ఏం ఏడ్చాల్లే. మీ బంధువులంతా వస్తారు గదా... అప్పుడు ఏడుస్తా" అనింది.

సాయంకాలనికి బంధువులంతా వచ్చినారు. అప్పుడు వాడు పెండ్లాంతో "ఏమే మన బంధువులంతా వచ్చినారు. ఇప్పుడన్నా ఏడ్చే" అన్నాడు.

దానికామె "అప్పుడే ఏం ఏడ్చాల్లే. మీ వూరోళ్ళంతా వస్తారు గదా... అప్పుడు ఏడుస్తా" అనింది.

కాసేపటికి వూరోళ్ళందరూ వచ్చినారు. అప్పుడు వాడు పెండ్లాంతో "ఏమే! వూరోళ్ళంతా వచ్చినారు. ఇప్పుడన్నా ఏడ్చే" అన్నాడు.




దానికామె "అప్పుడే ఏం ఏడ్చాల్లే. శవాన్ని ఎత్తుతారు గదా... అప్పుడు ఏడుస్తా" అనింది.

కాసేపటికి ముసల్దాన్ని పాడె మీద కట్టి పైకి లేపినారు. అప్పుడు వాడు పెండ్లాంతో "ఏమే! శవాన్ని కాటికి తీసుకుపోతా వున్నారు. ఇప్పుడన్నా ఏడ్చే" అన్నాడు.

దానికామె "అప్పుడే ఏం ఏడ్చాల్లే. శవాన్ని శ్మశానం కాడ దించుతారు గదా... అప్పుడు ఏడుస్తా" అనింది.

కాసేపటికి ముసల్దాన్ని శ్మశానం కాడ దించినారు. అప్పుడు వాడు పెండ్లాంతో "ఏమే శవాన్ని శ్మశానం కాడికి గూడా తెచ్చినారు. ఇప్పుడన్నా ఏడ్చే" అన్నాడు.

దానికామె "అప్పుడే ఏం ఏడ్చాల్లే. శవాన్ని గుంతలోకి దించుతారు గదా... అప్పుడు ఏడుస్తా" అనింది.

కాసేపటికి శవాన్ని గుంతలో దించినారు. అప్పుడు వాడు పెండ్లాంతో "ఏమే! శవాన్ని గుంతలోనికి గూడా దించినారు. కనీసం ఇప్పుడన్నా ఏడ్చే" అన్నాడు.

అప్పుడామె గుంత దగ్గరికి పోయి ముసల్దాన్ని చూస్తా "ఓ అత్తా! ఇదిగో నీ రూపాయ పట్టు. ఎవరిక్కావాల నీ బోడి రూపాయ తీసుకో" అని గట్టిగా అరిచి మీదికి విసిరికొట్టింది. అంతే... ముసల్ది "ఆ... నా రూపాయ దొరికిందా" అంటూ ఠక్కున పైకి లేచి కూచోనింది.

# 67

# ఒక పూవు కథ

ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు బంగారుబొమ్మలాంటి ఒక కూతురుంది. ఆ పాపంటే ఆయనకు చానా ఇష్టం. చిన్నప్పట్నించీ ప్రేమగా ఏదడిగితే అది కొనిస్తా పెంచి పెద్ద చేసినాడు. పెద్దగైనాక పెండ్లి చేయాల గదా. దాంతో మంచి మంచి సంబంధాలు తేవడం మొదలుపెట్టినాడు. కానీ ఎన్ని సంబంధాలు తెచ్చినా ఆమె నాకు నచ్చలేదంటే నాకు నచ్చలేదంటా ఎగరగొట్టడం మొదలుపెట్టింది. దాంతో ఆయన బాగా విసిగిపోయినాడు.


ఒకరోజు కూతుర్ని పిలిచి "ఏందమ్మా... నేనే సంబంధం తెచ్చినా నచ్చడం లేదంటున్నావ్. అసలు నీకు ఎట్లాంటోడు కావాల్నో చెప్పు... తెచ్చి చేస్తా" అన్నాడు. అప్పుడామె నెమ్మదిగా "నాన్నా... నాన్నా... నాకు సూరీడంటే చానా చానా ఇష్టం. నన్ను ఎట్లాగైనా ఆయనకిచ్చి పెండ్లి చేయవా" అనడిగింది.

అప్పుడు వాళ్ళ నాయన "చూడమ్మా... సూర్యునితో పెండ్లంటే మాటలు గాదు. ఆయనెక్కడో ఆకాశంలో తిరుగుతా వుంటాడు. మనముండేదా భూమ్మీద. మనకూ ఆయనకూ సంబంధం కుదిరే పని కాదుగానీ వేరేవాన్ని చేస్కో" అన్నాడు.

కానీ... ఆమె వాళ్ళ నాయన మాట వినిపిచ్చుకోకుండా... "పెండ్లంటూ చేస్కుంటే సూర్యున్నే చేసుకుంటా... లేదంటే లేదు" అని మొండిపట్టు పట్టి కూర్చోనింది. ఎంత నచ్చచెప్పినా వినకపోయేసరికి వాళ్ళ నాయనకు తెగ కోపమొచ్చేసి "నామాట విననప్పుడు... ఈడెందుకున్నావ్. ఫో... నా ఇంట్లోంచి" అని ఆమెను ఇంట్లోనుంచి దొబ్బేసినాడు..

ఆమె "సూర్యున్ని ఎట్లా పెండ్లి చేసుకోవాలబ్బా" అని ఆలోచిస్తా... ఆలోచిస్తా... పడమటి దిక్కున బయలుదేరి అడవులు, గుట్టలు, వాగులు, వంకలు, ఒకొక్కటే దాటుకుంటా దాటుకుంటా ఒక పెద్ద కొండపైకి ఎక్కింది. ఆ కొండపైన ఒక ఇల్లుంది. ఆ ఇంట్లో ఒక ముసలామె వుంది. ఆమె ఆ రాకుమారిని చూసి "ఏందమ్మా పాపం... ఒక్కదానివే అట్లా తిరుగుతా వున్నావ్. ఏం కావాల నీకు" అనడిగింది. అప్పుడా రాకుమారి కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే జరిగిందంతా చెప్పింది.

అప్పుడా ముసిలామె చీరకొంగుతో ఆమె కండ్లనీళ్ళు తుడుస్తా "నువ్వేమీ బాధపడొద్దు. నువ్వు వెతికే సూరీడు ఎవరోగాదు. నా కొడుకే. ఆకాశంలో పగలంతా తిరిగీ తిరిగీ అలసిపోయి రాత్రి కాగానే ఇంటికొస్తాడు. నువ్వు నాకెంతగానో నచ్చినావు. నే చెప్తాలే. నా కొడుకుని చేసుకుందువు గానీ" అనింది. దానికామె చానా సంబరపడింది.





సూరీడు ఆకాశంలో పగలంతా తిరిగీ తిరిగీ అలసిపోయి రాత్రి కాగానే ఇంటికి తిరిగి వచ్చినాడు. ఇంట్లో రాకుమారిని చూసి "ఎవరబ్బా... ఈ అమ్మాయి. మా ఇంట్లో వుంది" అనుకున్నాడు. అంతలో ఆ రాకుమారి సూర్యునితో "నువ్వంటే నాకెంతో ఇష్టం. నీకోసం అందర్నీ వదిలి వచ్చేసినా. ఇప్పుడు నువ్వు తప్ప నాకింకెవరూ లేరు. నన్ను పెండ్లి చేసుకోవా" అనడిగింది. దానికి సూర్యుడు "చూడు పాపా... నేను మీ లెక్క మామూలు మనిషిని కాదు. ఎప్పుడూ భగభగా మండిపోతా సెగలు కక్కుతా వుంటాను. నన్ను కండ్లు తెరిచి సూటిగా చూస్తే సాలు... ఎవరి కండ్లకైనా మబ్బులు కమ్ముతాయి. నన్ను ముట్టుకుంటే చాలు కాలి బూడిదైపోతారు. అట్లాంటిది నువ్వు నన్నెట్లా పెండ్లి చేసుకోగలవ్. పో... పోయి మీ అమ్మా నాన్న చూపిచ్చిన సంబంధం చేసుకోని హాయిగా వుండుపో" అన్నాడు.

ఆమె ఆ మాటలేమీ పట్టిచ్చుకోకుండా "లేదు... నేను నిన్ను తప్ప ఎవ్వరినీ పెండ్లి చేసుకోను. నన్ను చేసుకుంటావా... చేసుకోవా..." అని పట్టుపట్టి కూచోనింది.

ఎంత చెప్పినా వినకపోయేసరికి సూర్యునికి కోపమొచ్చేసి "పెండ్లీలేదూ... గిండ్లీ లేదూ... ఫో... నా ఇంట్లోంచి" అని ఆమెని దొబ్బేసినాడు. పాపం ఆమె ఏడ్చుకుంటా... ఏడ్చుకుంటా ఆకాశంలో తిరిగే సూర్యున్నే చూస్తా చూస్తా ఏమీ తినకుండా కొద్ది రోజులకు చచ్చిపోయింది.

ఆమె యాడైతే చచ్చిపోయిందో సరిగ్గా అన్నే కొంత కాలానికి మళ్ళా ఆమె ఒక మొక్కై పుట్టింది. అది కొంతకాలానికి పెరిగి పెద్దగై ఒక పూవు పూసింది. ఆ పూవు ఎట్లుందంటే అరచేయంత పెద్దగా చందమామ లెక్క గుండ్రంగా పసుప్పచ్చని రేకులతో చూడముచ్చటగా వుంది.

ఆరోజు నుండీ ఆ పూవు ఏనాటికైనా సూర్యుడు మళ్ళా రాకపోతాడా... నన్ను పెండ్లి చేసుకోకపోతాడా అని పొద్దున్నే సూర్యుడు ఆకాశంలో కనబడ్డం మొదలు మరలా సాయంత్రం మాయమయ్యేవరకూ సూర్యునికెళ్ళే ఆశగా చూస్తా సూర్యుడు ఎటువైపు తిరిగితే అటువైపు తిరుగుతా వుంది. ఆ పువ్వునే మనం పొద్దుతిరుగుడు పువ్వనీ, సూర్యకాంతమనీ పిలుస్తావుంటే ఆంగ్లభాషలో 'సన్ ఫ్లవర్' అంటుంటారు.

# 68 నక్క - సింహం

ఒక పెద్ద అడవిలో ఒక సింహముండేది. అది చానా ఎత్తుగా, బలంగా వుండేది. దాని గోళ్ళు చానా వాడిగా వుండేవి. అది ఒకరోజు దారిలో పోతా వున్న నక్కను పిల్చి 'నువ్వు నా దగ్గర పనిచెయ్. అడవిలో నీకు యాడైనా సరే ఏనుగు కనబడగానే నాకొచ్చి చెప్పు. నేను పోయి దాని తల పగలగొట్టి మెదడు మాత్రం తింటాను. మిగతా శరీరం నువ్వు తిందువు గానీ" అనింది. నక్క సరేనని సంబరంగా ఒప్పుకోనింది.

సింహం రెండు పెద్ద పెద్ద గుండ్లను తెచ్చి పక్కపక్కన పెట్టి ఆ గుండు మీద నుండి ఈ గుండు మీదకు, ఈ గుండు మీద నుండి ఆ గుండు మీదకు దుంకి "నా కళ్ళు ఎర్రగైనాయా" అనడిగింది. నక్క కాలేదనింది. సింహం మళ్ళా ఆ గుండు మీద నుండి ఈ గుండు మీదకు, ఈ గుండు మీద నుండి ఆ గుండు మీదకు దుంకి "ఇప్పుడు ఎర్రగైనాయా" అనడిగింది. నక్క ఎర్రగైనాయనింది.

"ఐతే నువ్వు పోయి యాడైనా ఏనుగు వుందేమో చూసి రాపో" అనింది. నక్క అడవంతా వెతికి ఒకచోట ఏనుగు కనబడగానే పరుగు పరుగున వచ్చి సింహానికి చెప్పింది. వెంటనే సింహం నక్క వెంబడి పోయి ఏనుగు కనబడగానే దాని మీదకు దుంకింది. తన వాడైన పంజాతో ఏనుగు తల మీద ఒక దెబ్బ బలంగా కొట్టేసరికి దాని తల పగిలి మెదడు బైటికొచ్చింది.

సింహం నక్కకు ఇచ్చిన మాట ప్రకారం మెదడు తిని శరీరం అంతా నక్కకు ఇచ్చేసింది. ఇట్లా కొద్దిరోజులు పోగానే నక్క ఏనుగుల శరీరాలు తినీ తినీ బాగా కొవ్వెక్కింది. నెమ్మదిగా దానికి కళ్ళు నెత్తి మీదికి ఎక్కినాయి.

ఒకరోజు నక్క "నేనేంది! సింహం దగ్గర పని చేయడమేంది. నేనే ఏనుగులను వేటాడి దాని మెదళ్ళు తింటాను" అనుకోని దారిలో ఓ కుక్క పోతా వుంటే పిల్చి "నువ్వు నా దగ్గర పనిచెయ్. అడవిలో యాడైనా నీకు ఏనుగు కనబడగానే నాకొచ్చి చెప్పు. నేను వెళ్ళి దాని తల పగలగొట్టి మెదడు మాత్రం తింటాను. శరీరం నువ్వు తిందువుగానీ" అనింది. కుక్క సరేనని ఒప్పుకోనింది.

నక్క కూడా సింహం లాగానే రెండు పెద్ద పెద్ద గుండ్లను తెచ్చి పక్కపక్కన పెట్టి ఆ గుండు మీద నుండి ఈ గుండు మీదకు, ఈ గుండు మీద నుండి ఆ గుండు మీదకు దుంకి "నా కళ్ళు ఎర్రగైనాయా?" అనడిగింది. కుక్క కాలేదనింది. నక్క మళ్ళా ఆ గుండు మీద నుండి ఈ గుండు మీదకు, ఈ గుండు మీద నుండి ఆ గుండు మీదకు దుంకి "ఇప్పుడు ఎర్రగైనాయా" అనడిగింది. కుక్క మళ్ళా కాలేదనింది. అప్పుడు నక్క 'అలా కాదు ఐనాయని చెప్పు' అనింది. సరే అని నక్క కళ్ళు ఎర్రగా కాకపోయినా కుక్క ఐనాయి అనింది. "ఐతే నువ్వు పోయి యాడైనా ఏనుగు వుందేమో చూసి రాపో" అని పంపిచ్చింది. కుక్క అడవంతా వెతికి ఒకచోట ఏనుగు కనబడగానే పరుగు



పరుగున వచ్చి నక్కకు చెప్పింది. వెంటనే నక్క కుక్క వెంబడిపోయి ఏనుగు కనబడగానే ఎగిరి దాని మీదకు దుంకి ఏనుగు తల పగలగొట్టాలని కాలితో బలంగా బాదసాగింది.

ఎంతైనా నక్క నక్కే... సింహం సింహమే. సింహంలాగా నక్కకు పదునైన గోళ్ళు వుండవు కదా. దాంతో ఏనుగుకేమీ కాలేదు. దానికి తన తల మీద కూర్చోని కొడతా వున్న నక్కను చూడగానే పిచ్చ కోపమొచ్చింది. వెంటనే తొండంతో దాన్ని పట్టుకోని గిరగిరగిర తిప్పి ఆన్నే వున్న ఒక గుండుకేసి దభీమని కొట్టింది.

అంతే... ఆ దెబ్బకు నక్క తల పగిలి అక్కడికక్కడే చచ్చిపోయింది. కుక్క 'కుయ్యో మొర్రో' అనుకుంటా అడవిలోకి పారిపోయింది.

# 69 ఎలుకగాడు

ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు ఏడుమంది పెండ్లాలు. కానీ ఎన్ని సమ్మచ్చరాలైనా ఒక్కరికి గూడా పిల్లలు పుట్టలేదు. దాంతో కనపన్న ప్రతి గుడికీ పోయి మొక్కుకున్నాడు. పిలిచి పిలిచి పేదోళ్ళందరికీ ఎంత కావాలంటే అంత దానాలు చేసినాడు. తీర్థయాత్రలు తిరిగినాడు. యజ్ఞాలు చేసినాడు. బావులూ, చెరువులూ తవ్విచ్చినాడు. సత్రాలు కట్టిచ్చినాడు. రోడ్లకిరువైపులా చెట్లు నాటిచ్చినాడు. ఐనా పిల్లలు మాత్రం పుట్టలేదు.

ఎట్లాగబ్బా అని బాధపడతా వుంటే ఒకరోజు ఒక ముని హిమాలయ పర్వతాలకు పోతా పోతా ఆ వూరికి వచ్చినాడు. ఆయన చానా గొప్పోడు. మంచోడు. అంతేగాదు మస్తుగ మహిమలున్నోడు. విషయం తెల్సుకున్న రాజు పరుగు పరుగున ఆ ముని దగ్గరికి పోయి ఆయన కాళ్ళ మీద పడి కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే వెక్కివెక్కి ఏడుస్తా "సామీ! సామీ! ఇప్పటికి పెండ్లయి పదేండ్లయింది. ఒక్క పిల్లోడు కూడా పుట్టలేదు. ఎట్లాగైనా కనికరించి పిల్లలు పుట్టే మార్గం చెప్పండి" అంటా వేడుకున్నాడు.

ఆ ముని అయ్యో పాపమని జాలిపడి ఏడు మంత్రించిన మామిడిపండ్లిచ్చి "ఇవి తీసుకోని పోయి నీ పెళ్ళాలకియ్యి తొమ్మిదినెల్లు తిరిగేసరికల్లా పండంటి పిల్లలు బోసినవ్వులు నవ్వుతా నీ కండ్ల ముందుంటారు" అన్నాడు. రాజు సంబరంగా తీసుకోని పోయి పెళ్ళాలకిచ్చినాడు. అందరూ వాటిని దేముని దగ్గర పెట్టి పూజ చేసి తిన్నారు.

చిన్నపెండ్లాం కూడా అందరి మాదిరే దేముని ముందర పెట్టి పూజ చేస్తా వుంటే యాన్నుంచొచ్చిందో ఏమోగానీ ఒక మాయదారి ఎలుక వచ్చి ఆమె కండ్లు తెరిచేసరికి సగానికి సగం పండు నున్నగా తినేసింది. రాణికి దానిని తినాల్నో పాడెయ్యాల్నో అర్థం కాలేదు. ఏమైతే అదే ఐతుందనుకోని భయపడతానే మిగిలిన ఆ సగం పండు తినేసింది.

అవి తిన్న నెలకల్లా ఏడుమంది రాణులూ నెల తప్పినారు. తొమ్మిదినెల్లు దాటినాక ఆరుమందికీ పండు లాంటి కొడుకులు పుట్టినారుగానీ చిన్నరాణికి మాత్రం ఎలుకెంతుంటాదో అంత చిన్న కొడుకు పుట్టినాడు. పాపం రాణి చానా బాధపడింది. కానీ బిడ్డ బిడ్డనే గదా! కడుపున పుట్టినాక ప్రేముంటాది గదా. వాడు ఎలుకంతున్నా ఎవరు ఎంత ఎగతాళి చేసినా ఏమీ పట్టిచ్చుకోకుండా ప్రేమగా పెంచి పెద్ద చేసింది. మిగతా ఆరుమంది మాత్రం వీన్ని వాళ్ళతోపాటు ఆడిపిచ్చుకొనేటోళ్ళు గాదు. యాడికీ రానిచ్చేటోళ్ళు గాదు. పైగా "ఎలుకగాడు ఎలుకగాడు" అని మాటిమాటికీ ఎగతాళి చేసేటోళ్ళు.



ఒకరోజు ఆరుమంది అన్నదమ్ములు వేటకు బయలుదేరినారు. ఎలుకగాడు కూడా వురుక్కుంటా అన్నల దగ్గరికి పోయి "అన్నలారా! అన్నలారా! నేనూ మీ ఎంబడొస్తా. నన్ను గూడా తీస్కోని పోండి" అన్నాడు. దానికి వాళ్ళు కిందా మీదా పడి నవ్వుతా "మేం పోతా వున్నది గోలీలాట ఆడ్డానికి కాదు. వేటకి... అడవిలో ఏనుగులుంటాయ్, పులులుంటాయ్, సింహాలుంటాయ్... వాటిని బాణంతో కొట్టాల, చంపాల, పట్టుకోవాల. నువ్వుండేదే అరటిపండంత. ఇంగ దాండ్లను చంపడం నీ చేతనేమయితాది. మట్టసంగా ఇంటికాడ పడుండు" అన్నారు.

కానీ ఎలుకగానికి మాత్రం ఎట్లాగయినా సరే వాళ్ళతోబాటు అడవికి పోవాలని, వేటాడ్డం చూడాలని అనిపించింది. దాంతో మట్టసంగా ఒక చెట్టు మీదకెక్కి వాళ్ళన్నోళ్ళు పోతా వున్నప్పుడు వాళ్ళకు తెలీకుండా ఎగిరి ఒకని గుర్రం తోకను కరుచుకున్నాడు. అడవిలోనికి పోయినాకగానీ వాళ్ళు వీన్ని చూసుకోలేదు. ఇంగ ఏం చేస్తారు. ఎంతయినా తమ్ముడు. మధ్యలో వదిలెయ్యలేరు గదా, సరేలే అనుకోని ఎంబడే తీసుకోని పోయినారు.

వాళ్ళు జంతువుల్ని వేటాడుతా వేటాడుతా అనుకోకుండా దారి తప్పిపోయినారు. తిరిగి ఎట్లా పోవాల్నో అర్థంగాక కిందామీదా పడతా వుంటే ఒకచోట ఒక పెద్ద మేడ కనబడింది. 'ఈ అడవిలో ఎవరున్నారబ్బా' అని ఆచ్చర్యపోయి... పోయి చూస్తే ఒక ముసల్ది పదిమంది పిల్లల్తో కనబడింది. వీళ్ళు ఆమెని చూసి "అవ్వా... మేము ఈ రాజ్యాన్నేలే రాజుగారి కొడుకులం. దారి తప్పిపోయినాం. చీకటి పడింది. ఈ రోజుకు ఈన్నే వుండి రేప్పొద్దున పోతాం" అన్నారు. దానికామె సరే అని అందరికీ మంచి మంచి పిండివంటలు చేసి పెట్టింది. అందరూ బాగా తిని, గుర్రాలన్నీ బయట కట్టేసి, ఒక గదిలో మంచాల మీద పడి హాయిగా గురకలు పెడ్తా నిద్రపోయినారు.

ఎలుకగానికి అర్ధరాత్రి గుర్రాలరుస్తావుంటే మెలకువొచ్చింది. "ఎందుకబ్బా అవి అట్లా అరుస్తా వున్నాయి. ఏమయిందో ఏమో చూసొద్దామాగు" అని పోయి తలుపులు తెర్చదానికి చూస్తే ఎంత లాగినా ఒకటి గూడా తెరచుకోలేదు. ఎట్లాగబ్బా బైటికి పోవడం అని ఆలోచిస్తా వుంటే పక్కనే ఒక కిటికీ కనబడింది. వాడుండేది ఎలుకంతనే గదా దాంతో దాంట్లోంచి దూరి బైటికొచ్చి చూస్తే గదికి తాటికాయంత తాళమేసి కనబడింది. ఇదేందిరా నాయనా... ఇట్లా తాళమేసినారు" అని మట్టసంగా చప్పుడు కాకుండా అడుగులో అడుగేసుకుంటా ఒక్కొక్క గదే దాటుకుంటా ఆఖరికి గుర్రాలను కట్టేసిన చోటికి చేరుకున్నాడు.

ఆడ చూస్తే గుర్రాలన్నీ చచ్చిపడున్నాయి. ఒక రాచ్చసి పదిమంది పిల్లల్తో కల్సి ఒక్కొక్క గుర్రాన్నే పెరుక్కోని, పెరుక్కోని తింటా వుంది. ఎలుకగాడు అదిరిపడినాడు. 'ఓరి నాయనో! ఇది ముసల్ది కాదన్నమాట. పెద్ద

రాచ్చసన్నమాట' అని కనుక్కోని వురుక్కుంటా అన్నల దగ్గరికి పోయి వాళ్ళను లేపి జరిగిందంతా చెప్పి, "ఇంకాసేపుంటే అది గుర్రాలన్నీ తినేసి ఈడికి వచ్చేస్తాది" అని చెప్పినాడు.

తలుపుకు తాళం వేసినారుగదా ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే ఎలుకగానికి మెరుపు లాంటి ఉపాయం వచ్చింది. వెంటనే ఎగిరి కిటికీలోంచి బైటకు దుంకి ఆ రాచ్చసి దగ్గరికి పోయినాడు. ఆమె పక్కనే తాళం చెవులు కనబన్నాయి. చీకట్లో వీడు దాచిపెట్టుకుంటా దాని దగ్గరికి పోయి మట్టసంగా తాళాలు తీసుకోని వచ్చేసినాడు. వాడు వురుక్కుంటా పోయి తాళాలు తీసి అన్నలను ఇడిపిచ్చినాడు. వెంటనే అందరూ వురుక్కుంటా పోయి ఆడికి కొంచం దూరంలో వున్న ఒక పెద్ద తాటిచెట్టు ఎక్కి పైన దాచిపెట్టుకున్నారు. ఎలుకగాడు పైకెక్కలేక... వాడు మాత్రం క్రిందనే ఒక పొదలోనికి దూరినాడు.

గుర్రాలన్నింటినీ బాగా మెక్కిన ఆ రాచ్చసి ఇంగ వీళ్ళని గూడా తిందామని పిల్లలని వెంటేసుకోని గది దగ్గరికి పోయి చూస్తే గదిలో ఎవరూ లేరు. ఎట్లా తప్పించుకున్నారబ్బా అని వురుక్కుంటా బైటికొచ్చి చూసింది. యాడా కనబల్లేదు. కుక్క లెక్కనే ఆ రాచ్చసి గూడా మనిషి యాదున్నా వాసన పసిగట్టేస్తాది. అది వాసన చూసుకుంటా, చూసుకుంటా తాటిచెట్టు దగ్గరకొచ్చింది. వచ్చి పైకి చూస్తే ఆరుమంది బిక్కుబిక్కుమంటా గట్టిగా కరుచుకోని కనబన్నారు.

రాచ్చసీ, దాని పిల్లలూ ఆ చెట్టును తలోపక్కా పట్టుకోని కిందికీ మీదికీ వూపసాగినారు. చెట్టు వూగుతా వుంది గానీ వాళ్ళు మాత్రం కింద పల్లేదు. ఒకొక్కడు కోతుల్లెక్క గట్టిగా కరుచుకున్నారు. దాంతో ఇంక లాభం లేదనుకోని ఆ రాచ్చసి పిల్లల్తో "రేయ్! నేను కింద నిలబడ్తా, మీరు నా మీద ఒకని మీదొకడు, ఒకని మీదొకడు ఎక్కి వాళ్ళను పట్టుకోండి" అనింది. సరేనని వాళ్ళు ఒకని మీదొకడు, ఒకని మీదొకడు ఎక్కినారు. కానీ వాళ్ళను అందుకోడానికి కొంచెం దూరం తక్కువయింది. ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే కింద వున్న రాచ్చసి ఒక పెద్ద దుడ్డుకర్ర ఇచ్చి "దీంతో కొట్టండి కింద పడ్తారు" అని చెప్పింది.

ఎలుకగాడు అది చూసి ఇట్లాగే ఇంకొంత సేపుంటే వాళ్ళన్నోళ్ళు చావడం ఖాయమనుకోని ఒక పెద్దముల్లు తీసుకోని చెట్టెక్కినాడు. అట్లా ఎక్కుతా ఎక్కుతా దాని మొగం దగ్గరకొచ్చినాడు. వీడుండేది చిన్నగ ఎలుకంతనే గదా, దాంతో ఆ రాచ్చసికి కనబడలేదు. వాడు ముల్లు తీసుకోని బలమంతా వుపయోగించి దాని కంట్లో ఒక్క పోటు పొడిచినాడు. అంతే... అది గిలగిలగిల కొట్టుకుంటా దభీమని కింద పడిపోయింది. అదట్లా పడిపోవడం ఆలస్యం పిల్లలంతా గూడా దభీమని అంత పైనుంచి ఒకదాని మీదొకటి పడి తలలు పగిలి చచ్చిపోయినారు.

అప్పుడు చెట్టుపై నున్న ఆరుమందీ కిందకు దిగి "నిన్ను ఇన్ని రోజులూ ఎలుకగాడు ఎలుకగాడు అని ఎగతాళి చేసినాముగానీ, ఈరోజు నువ్వు లేకుంటే మేం బతికేటోళ్ళమే గాదు. ఇప్పటి నుంచీ మనమంతా ఒకటే" అంటూ సంబరంగా వాన్ని ముద్దు పెట్టుకున్నారు.

# 70 ముత్యాలహారం

ఒకూర్లో ఒక బాపనాయన వుండేటోడు. ఆయనకి పెండ్లయి పన్నెండేళ్ళయినా పిల్లలు పుట్టలేదు. దాంతో ఒకరోజు గుడికి పోయి... గుడంతా శుభ్రంగా తుడిచి... దీపం పెట్టి... "సామీ... సామీ... చిన్నప్పటి నుండీ ప్రతిరోజూ నీకు పూజలు చేస్తా... దీపం పెడ్తా వున్నాను. అందరికీ మంచే చేస్తా మాట మీద నిలబడతా వున్నాను. తిన్నా తినకపోయినా వుత్త చేతులతో ఎవరిని పంపడం లేదు. ఐనా నాకు ఒక్కరంటే ఒక్కరిని గూడా ఇయ్యలేదు. ఇంక ఎందుకు నేను బతకడం" అని కత్తి తీసుకోని కసుక్కున పొడుచుకోబోయినాడు.

అది చూసి దేవుడు టక్కున ప్రత్యక్షమయి "అరెరే... ఎందుకట్లా ప్రాణాలు తీసుకుంటా వున్నావ్. ఇదిగో ఈ పండు తీస్కోని నీ పెండ్లానికియ్యి... నీ కోరిక తీరుతుంది" అని చెప్పినాడు.

ఆ బాపనాయన సంతోషంగా ఆ పండును తీస్కోనిపోయి పెండ్లానికిచ్చినాడు. దేవుడు చెప్పినట్లే తొమ్మిది నెలలు దాటగానే ఆమెకో అందమయిన ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్ల నెమ్మదిగా ఆడతా పాడతా పెరిగి పెద్దకాసాగింది. ఆ పిల్లది అట్లాంటిట్లాంటి అందంగాదు. ఆకాశంలో మెరిసే నక్షత్రం లెక్క వుంటాది. అప్పుడే పూచిన గులాబీ మొగ్గలాగుంటాది. ఆకాశం నుంచి భూమికి దిగొచ్చిన అప్సరసలెక్క వుంటాది. వూర్లో ఎవరి నోట విన్నా ఆ పిల్ల అందం గురించిన మాటలే...

ఆ వూరికో రాజున్నాడు. ఆయన చానా మంచోడు. ప్రజలని అవసరానికి ఆదుకుంటా చక్కగా చూసుకునేటోడు. ఒకరోజు మారువేషమేసుకోని వూర్లో తిరుగుతా వుంటే ఈ పిల్ల కనబడింది. ఆమెది చందమామలాంటి అందం గదా... దాంతో "అబ్బ... ఎంత ముచ్చటగుందీ పిల్ల... చేసుకుంటే ఇట్లాంటి పిల్లనే చేసుకోవాల" అనుకున్నాడు. దాంతో రోజూ మారువేషమేసుకోనొచ్చి వాళ్ళింటికాడ కూచోని ఆమాటా ఈమాటా మాట్లాడ్తా... మాట్లాడ్తా... నెమ్మదిగా ఆపిల్లతో పరిచయం పెంచుకున్నాడు.

ఆ రాజుకు అంతకు ముందే పెండ్లయింది. ఆమె చానా చెడ్డది. అది కావాల... ఇది కావాల... అని రాజును ఎప్పుడూ సతాయిస్తా... బాధ పెడతా వుండేది. రోజూ రాజు బైటకి పోతా వుంటే చూసి "యాడికబ్బా నా మొగుడు ఒక్కరోజు గూడా వదలకుండా రోజూ పొద్దునబోయి మళ్ళా రాత్రికి వస్తా వున్నాడు. ఏంది కత" అనుకోని చెలికత్తెను విషయం కనుక్కోని రమ్మని పంపిచ్చింది. ఆమె రాజెంబడే కనబడకుండా దాచిపెట్టుకోని... దాచిపెట్టుకోని పోయి ఈ పిల్లతో ముచ్చటలాడతా వుంటే చూసి వురుక్కుంటా... వురుక్కుంటా వచ్చి రాణికి చూసిందంతా చెప్పింది.



ఓహో... అదా సంగతనుకోని ఆమె రాత్రికి రాత్రి కొంతమంది సైనికులకు అడిగినంత బంగారమిచ్చి ఆ పిల్లను ఎత్తుకోని రమ్మనింది. వాళ్ళు సరేనని రాణి చెప్పినట్లే మట్టసంగా పడుకున్నదాన్ని పడుకున్నట్లు మత్తు మందిచ్చి ఎత్తుకోనొచ్చినారు.

రాణి ఒక పెద్ద గుంత తవ్విచ్చి ఆ పిల్లను దాంట్లో పూడ్చిపెట్టి వారం రోజుల తర్వాత తీసి చూస్తే ఇంగేముంది... ఆ పిల్ల ఎట్లాగున్నది అట్లాగే వుంది గానీ సావలేదు. దాంతో రాణి "ఇదేందబ్బా ఇది సావలేదు" అని ఆచ్చర్యపోయి ఆపిల్ల మెడకు ఒక పెద్ద బండ కట్టి చెరువులోకి దొబ్బేసింది. వారం రోజుల తర్వాత పోయి చూస్తే ఇంగేముంది.... ఆ పిల్ల ఎట్లాగున్నది అట్లాగే వుంది గానీ సావలేదు. దాంతో రాణి ఇదేందబ్బా ఇదింకా సావలేదు అని ఆచ్చర్యపోయి కట్టెల మీద కట్టెలు ఒక పెద్దకుప్ప చేసి అంటిచ్చి ఆ పిల్లను ఆ మంటల్లోకి దొబ్బేసింది. కట్టెలన్నీ అంటుకోని బూడిదయి పోయినాక చూస్తే ఇంగేముంది. ఆ పిల్ల ఎట్లాగున్నది అట్లాగే వుంది గానీ సావలేదు. దాంతో రాణి "దీని ప్రాణాలు దీని దగ్గర లేనట్టున్నాయి. అందుకే ఇది సావడం లేదు. దీన్నిట్లా చంపడం కష్టమ"నుకోని వదిలేసింది.

ఆ పిల్ల అట్లా పోవడం ఆలస్యం చెలికత్తెను పిలిచి "నువ్వు ఎట్లాగయినా సరే ఆ పిల్లతో బాగా స్నేహం చేసి దాని ప్రాణాలు యాడున్నాయో కనుక్కోని రాపో" అని పంపించింది. ఆ చెలికత్తె అట్లాగేనని నెమ్మదిగా ఆ బాపనోళ్ళపిల్లతో స్నేహం మొదలుపెట్టింది. అట్లా కొన్నిరోజులు పోయేసరికి వాళ్ళ మధ్య స్నేహం బాగా పెరిగింది.

ఒకరోజు ఆ చెలికత్తె ఆ మాటా ఈ మాటా మాట్లాడ్తా... మాట్లాడ్తా "నా ప్రాణాలు ఈ వూరవతలి మర్రిచెట్టు తొర్రలోని చిలకలో వున్నాయి. మరి నీవెక్కడ వున్నాయి" అనడిగింది. దానివన్నీ దొంగమాటలని తెలీని ఆ పిల్ల "ఏమోబ్బా... నాకు తెలీదు యాడున్నాయో" అనింది. దానికా చెలికత్తె "నువ్వు కావాలనే అబద్ధం చెబుతావున్నావ్. ఇదేనా స్నేహమంటే... ఒకరి రహస్యాలు ఒకరు చెప్పుకోవాల గానీ దాచిపెడ్తే ఎట్లా" అనింది. దాంతో ఆ పిల్ల "లేదు... లేదు... నాకు నిజంగానే తెలీదు... నాకో వారం రోజులు సమయమివ్వు... మా నాయన్నడిగి కనుక్కుంటా" అనింది.

ఆపిల్ల ఇంటికి పోతానే వాళ్ళ నాయనతో "నాయనా... నాయనా... నా ప్రాణాలు ఎక్కడున్నాయి" అనడిగింది. దానికా బాపనాయన "నీ ప్రాణాలతో నీకేమి ఇప్పుడంత అవసరం" అంటూ ఏమీ చెప్పలేదు. స్నేహితురాలితో ఒక వారం లోపల కనుక్కోని వస్తానని చెప్పింది గదా... దాంతో... చెప్తావా... చెప్పవా... అంటా అన్నం నీళ్ళు మానేసి మొండికెత్తింది. రోజు రోజుకీ తిండి లేక ఆ పిల్ల చిక్కిపోతా వుంటే చూసి తట్టుకోలేక

ఆఖరికి వాళ్ళ నాయన "మనూరికి అవతల ఏడు మైళ్ళ దూరంలో తూర్పుదిక్కున ఒక పెద్ద చెరువుంది. దాని మధ్యలో ఎప్పటికీ వాడిపోని ఒక పెద్ద తామరపువ్వుంది. ఆ పువ్వు మధ్యలో ఒక ముత్యాలహారముంది. దాంట్లో నీ ప్రాణముంది" అని చెప్పినాడు. దాంతో ఆ పిల్ల తర్వాతరోజు సంబరంగా వురుక్కుంటా.. వురుక్కుంటా... పోయి ఆ చెలికత్తెకు అంతా చెప్పేసింది. వెంటనే ఆ దొంగసచ్చినేది రాణికి అంతా చెప్పేసింది. రాణి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రాత్రికి రాత్రి ఎవరికీ తెలీకుండా మట్టసంగా వూరిబైటి చెరువుకాడికి పోయి తామర పువ్వులోని ముత్యాలహారం తీసుకోని మెడలో వేసుకోనింది.

అంతే... ఆమె మెడలో హారం వేసుకోవడం ఆలస్యం. ఇక్కడ ఆ బాపనోళ్ళ పిల్ల వెంటనే వున్నదున్నట్టుగా దభీమని విరుచుకపడిపోయింది. చూస్తే మొగంలో జీవకళ కనబడ్తా వుంది గానీ వూపిరి తీయడం లేదు. అచ్చం శవం లెక్కనే కదలకుండా మెదలకుండా వుండిపోయింది. దాంతో వాళ్ళమ్మా నాయనా చచ్చిపోయిందనుకోని... చూస్తా... చూస్తా.. ఆపిల్లను బూడ్చి పెట్టలేక అడవి మధ్యలో ఒక పెద్ద మేడ కట్టిచ్చి... దాంట్లో ఒక పరుపుపైన పన్నబెట్టి... ఆమెకు కావాల్సినవన్నీ ఇంట్లో పెట్టి తిరిగి వచ్చేసినారు. వాళ్ళకుండేది ఒక్కగానొక్క కూతురు గదా... దాంతో ఆ పిల్లనే తలచుకుంటా... తలచుకుంటా.... అన్నం గూడా తినకుండా కొంతకాలానికి వాళ్ళిద్దరూ చనిపోయినారు.

ఈడిట్లా వుంటే... ఆడ రాణి రోజూ పగలంతా దండ మెడలో వేసుకొనేది గానీ... రాత్రయితే చాలు పండుకునేటప్పుడు ఒంటికి గుచ్చుకుంటాందని... తీసి గోడకు తగిలిచ్చేది. ఆమె అట్లా మెడలోంచి తీసి తగిలియ్యడమాలస్యం ఆడ ఆ పిల్ల మంచం మీద నుండి టకీమని లేసి కూచునేది. బైటంతా అడవి గదా... అదీ రాత్రిపూట గదా... దాంతో ఇంట్లోనే అవీ ఇవీ వండుకోని తినేది. పొద్దున్నే ఆ రాణి మళ్ళా హారం వేసుకుంటాది గదా... అట్లా ఆడ హారం వేసుకోవడమాలస్యం... ఈడ ఈమె కదలకుండా మెదలకుండా అచ్చం శవంలెక్క పడిపోయేది. అట్లా పగలంతా పన్నుకోడం... రాత్రంతా మేల్కోవడం.

ఒకరోజు ఆ వూరి రాజు వేటకని అడవికి వచ్చినాడు. జంతువులను వేటాడుతా... వేటాడుతా... దారి తప్పిపోయినాడు. నెమ్మదిగా చీకటి పడింది. "ఎట్లాగబ్బా ఈ చీకటిలో పోవడం" అని వెదుక్కుంటా... వెదుక్కుంటా... పోతా వుంటే అడవి మధ్యలో ఈ పిల్ల వుండే మేడ కనబడింది. "ఎవరున్నారబ్బా... ఈడ" అని పోయి తలుపుకొడ్తే ఇంగేముంది.... ఈ పిల్ల వచ్చి తలుపు తీసింది. రాజు ఆమెని చూసి ఆచ్చర్యపోయినాడు.

రాజుకు ఆమెంటే ఎప్పన్నుంచో ఇష్టం గదా... దాంతో "నన్ను పెండ్లి చేసుకోవా" అనడిగినాడు. ఆమెకు గూడా రాజంటే ఇష్టమే... దాంతో "సరే చేసుకుందాం... కానీ నేను ఈన్నే వుంటా గానీ యాడికీ రాను. అట్లాగే నువ్వు రాత్రిపూట మాత్రమే ఈడుండాలగానీ పగటిపూట వుండగూడదు. సరేనా" అనింది. రాజు సరే అని మాటిచ్చినాడు. అప్పటినుంచీ రాజు పొద్దునంతా రాజ్యంలో వుండి రాత్రి కాగానే ఎవరికీ తెలీకుండా మట్టసంగా అడవిలోకి వచ్చేసేటోడు.

అట్లా కొన్ని నెలలకు వాళ్ళకు ఒక బిడ్డ పుట్టినాడు. రాత్రంతా ఆమె చూసుకునేది. పగలు మాత్రం రాజు తనతో తీస్కోని పోయేటోడు. ఎవరీబిడ్డ అని మొదటి పెండ్లాం అడిగితే అడవిలో దొరికినాడని చెప్పినాడు. ఆ పిల్లోడు నెమ్మదిగా పెరిగి పెద్దకాసాగినాడు. ఒకరోజు వాడు "ఇదేందబ్బా... మా అమ్మ రాత్రంతా దగ్గరుండనిస్తాది

గానీ... పగలు మాత్రం ఎవరినీ ఆడ వుండనియ్యదు" అనుకోని ఒకరోజు ఎవరికీ చెప్పకుండా పగలు ఇంట్లోకి దూరినాడు. దూరి చూస్తే ఇంగేముంది వాళ్ళమ్మ మంచమ్మీద అచ్చం శవం లెక్క పడి వుంది. "ఓహో... ఇదా రహస్యం" అని వాళ్ళమ్మ పక్కనే చీకటి పడేదాకా కూచోని, ఆమె లెయ్యగానే "అమా.... అమా... ఏమిటే ఇదంతా" అనడిగినాడు. అప్పుడామె కళ్ళలో నీరు కారిపోతా వుంటే జరిగిందంతా చెప్పి "ఆ దండ... వుంటే రాణి దగ్గరనే వుంటాది. నువ్వెట్లాగయినా సరే దాన్ని గనుక తెస్తే... నాకీ బాధ వుండదు" అని చెప్పింది. దానికా పిల్లోడు సరే అన్నాడు.



తరువాతరోజు ఆ పిల్లోడు వాళ్ళ నాయన వెంబడి ఇంటికి పోగానే రాణి మెడ వైపు చూసినాడు. అమ్మ చెప్పిన ముత్యాలహారం కనబడింది. వెంటనే వాడు "పెద్దమ్మా... పెద్దమ్మా... నీ మెడలో దండ చానా చానా బాగుంది. నాకియ్యవా... నేను వేసుకుంటా" అని వెంటబన్నాడు. దానికామె "నాయనా... నీకు ఏది కావాలన్నా ఇస్తాగానీ ఈ దండ మాత్రం అడగొద్దు" అనింది. కానీ ఆ పిల్లోడు మాత్రం నాకు ఆ దండే కావాలంటూ ఏడ్చడం మొదలుపెట్టినాడు.

అది చూసి రాజు "ఏందే... పిల్లోడు అంతగా ముచ్చట పడతా వుంటే ఇవ్వకుండా అట్లా ఏడిపిస్తా వున్నావ్. ఇయ్యి" అన్నాడు. దాంతో ఆమెకేం చేయాల్నో అర్థం గాక ఏమయితే అదిగానీ అనుకోని టక్కున మెడలోని హారాన్ని తీసి విసిరి మూలనున్న పొయ్యిలోకి ఏసింది. అది గనుక కాల్తే వాళ్ళమ్మగూడా అట్లాగే కాలి చస్తాది గదా... అందుకని ఆ పిల్లోడు వెంటనే పక్కనున్న రాయి తీసుకోని పొయ్యి మీదున్న నీళ్ళ కాగును ఈడ్చి ఒక్క పెరుకు పెరికినాడు. అంతే... ఆ దెబ్బకు కాగు ఫక్కున పగిలిపోయి నీళ్ళన్నీ పొయ్యిలో పడి వెంటనే మంటంతా ఆరిపోయింది. వాడు వురుక్కుంటా పోయి ఆ దండ తీసుకోని పోయి అడవిలోని వాళ్ళమ్మ మెడలో వేసినాడు. దాంతో ఆమె పట్టపగలే లేచి కూచోనింది. రాజు జరిగిందంతా తెలుసుకోని "ఛీ... ఛీ... ఇంత మోసం చేస్తావా" అని పెద్ద పెండ్లాన్ని ఇంట్లో నుండి వెళ్ళగొట్టి, చిన్న పెండ్లాన్ని ఇంటికి తీసుకోనొచ్చి రాణిని చేసినాడు.

# 71 మూడు టెంకాయలు

ఒకూర్లో ఒక రైతు వుండేటోడు. వాడు పేదోడైనా చానా మంచోడు. నిజాయితీపరుడు. నిరంతరం దేవున్ని భక్తితో కొలిచేటోడు. వున్న నాలుగెకరాలని కష్టపడి పండించి, వచ్చిన డబ్బుల్లో తనకు కావాల్సినంత వుంచుకోని మిగిలినదంతా దానధర్మాలు చేసేటోడు. వూరికొచ్చిన సాధువులను, పేదలను ప్రతిరోజూ తన చిన్న పాడుబన్న ఇంటికి అన్నానికి పిలుచుకోనొచ్చేటోడు. పంచభక్షపరమాన్నాలు పెట్టకపోయినా పప్పుచారులతో కడుపు నిండా ప్రేమతో పెట్టి అందరినీ ఆనందపరిచేటోడు. రైతు భార్య గూడా చానా మంచిది. ఏ మాత్రం విసుక్కోకుండా సంబరంగా అందరికీ సేవ చేసేది. వాళ్ళ భక్తి చూసి ఆ పరమశివుడు పరవశించిపోయి ఒకసారి వాళ్ళు గుడికి వచ్చినప్పుడు అడక్కుండానే ప్రత్యక్షమయినాడు.

“మీ భక్తి, పేదల పట్ల ప్రేమ మూమూలువి కావు. మీలాంటోళ్ళు వుండడం వల్లనే లోకంలో ఇంకా ధర్మం ఒక్క కాలి మీదన్నా నిలబడతా వుంది. అందుకే మీకు మూడు టెంకాయలు ఇస్తా వున్నా... అవి మామూలు అట్లాంటిట్లాంటి అల్లాటప్పా టెంకాయలు కాదు. కోరుకున్న కోరికలు కండ్లు మూసి తెరిచేలోగా నెరవేర్చే మహిమగల టెంకాయలు. మీరు బాగా ఆలోచించుకోని ఏవైనా కోరుకోని టెంకాయ కొట్టండి. మీ కోరిక రెప్పపాటులో నెరవేరుతుంది. ఇట్లాగే హాయిగా పదిమందికి సేవ చేస్తా, ధర్మాన్ని కాపాడతా, కలకాలం చిలకాగోరింకల్లెక్క కిలకిలకిల నవ్వుకుంటా సంబరంగా బతకండి” అంటా దీవించినాడు.

శివుడు వెళ్ళిపోయినాక వాళ్ళు ఇంటికి వచ్చి తలస్నానం చేసి, భక్తితో దేవున్ని పూజించి, “సామీ.... ఎంత ధనమొచ్చినా పేదల మీద ప్రేమగానీ, నీ మీద భక్తిగానీ చీమంత గూడా తగ్గకుండా, పొగరు తలకెక్కకుండా చూడు సామీ” అంటా ఒక టెంకాయ కొట్టినారు.

“సామీ... నిరంతరం దానధర్మాలు చేస్తా భక్తులను, పేదలను ఆదుకోవడం కోసం ఈ జన్మకు తరగనంత సంపద ఇవ్వు సామీ” అంటా రెండవ టెంకాయ కొట్టినారు.

“సామీ... నీ భక్తులకు ఆశ్రయం ఇవ్వడానికి ఈ చిన్న పాడుబన్న ఇండ్లు సరిపోవడంలేదు. కాబట్టి నిరంతరం వందలమందికి అన్నదానం చేసేలా ఒక మంచి ఇండ్లు ఇవ్వు సామీ” అంటా మూడవదాన్ని పగలగొట్టినారు. శివుడు వరమిచ్చినట్లే ఆ మరుక్షణమే వాళ్ళకు పెద్ద ఇల్లు, కావలసినంత సంపద సమకూరినాయి.

ఆ ఇంటి పక్కనే ఒక పెద్ద మేడ వుంది. వాళ్ళకు పదితరాలు పని చేయకుండా కిందామీదా పడి దున్నపోతుల్లా తిని తిరిగినా తరగనంత సంపదుంది. కానీ... అంత డబ్బున్నా వాళ్ళకు డబ్బు మీద ఆశ చావలేదు. యాడ పైసా దొరుకుతుందన్నా అందరికన్నా ముందే గద్దల్లా వాలిపోతారు. పక్కనోడు సంబరంగా వుంటే కుళ్ళుకోని చస్తారు. వాళ్ళు రాత్రికి రాత్రి తమ పక్కనే వున్న పాడుబన్న ఇల్లు కళ్ళు తిరిగేలా పెద్దమేడగా మారిపోయేసరికి కండ్లల్లో నిప్పులు పోసుకున్నారు. ఎట్లాగైనా సరే ఆ రహస్యమేదో కనుక్కోవాలని పొద్దున్నే

పళ్ళుగూడా తోముకోకుండా పాచినోటితోనే పరుగుపరుగున వాళ్ళింటికి చేరుకున్నారు. రైతు వాళ్ళకు అడిగిన వెంటనే ఏ మాత్రం దాచుకోకుండా అంతా పూసగుచ్చినట్టు వివరించినాడు.

ఆరోజు నుంచీ ఆ ధనవంతులు గూడా దేవునికి దొంగమొక్కులు మొక్కుతా, పూజలు చేస్తా, పేదవాళ్ళకి అన్నం పెట్టసాగినారు. అట్లా కొంతకాలం గడిచినాక వాళ్ళు గూడా గుడికి పోయి "సామీ! మేం గూడా పదిమందికి సాయం చేస్తా, నిన్నే కొలుస్తా వున్నాం గదా... మాకు కూడా మా పక్కింటి రైతుకు ఇచ్చినట్లే కోరికలు తీర్చే టెంకాయలు ఇవ్వు సామీ" అంటా మొక్కుకున్నారు. శివుడు అదంతా చూసి చిరునవ్వు నవ్వుకుంటా వాళ్ళ ముందు ప్రత్యక్షమయి మూడు టెంకాయలు ఇచ్చినాడు. వాళ్ళు వాటిని తీసుకోని ఎవరికీ తెలీకుండా పరుగుపరుగున ఇంటికి చేరుకున్నారు.

చేరుకున్నాక ఇద్దరూ ఏమి వరం కోరుకావాల్నా అని ఆలోచించసాగినారు. ఆమె చెప్పేది వానికి నచ్చదు. వాడు చెప్పేది ఆమెకి నచ్చదు. చివరికి ఆమె 'ఇప్పటికే మనకు సంపదలు లెక్కలేనంత వున్నాయి. కాబట్టి మళ్ళా మనకు సంపదలు కోరుకునే బదులు మా అమ్మావాళ్ళకు ఇవ్వమని కోరదామా' అనడిగింది.

ఆ మాటలకు ధనవంతుడు "ఏమీ లేకున్నా మీ పుట్టింటోళ్ళు అయినదానికీ కాని దానికీ వూరికే ఎగిరెగిరి పడతా వుంటారు. దానికి తోడు సంపదలు గూడా వచ్చినాయనుకో నన్ను అసలు లెక్క గూడా పెట్టరు" అన్నాడు.

ఆ మాటలకు ఆమెకు కోపం ముంచుకొచ్చింది. "ఏం... ఏం తక్కువచేసినారని ఎప్పుడూ మా అమ్మానాన్నల్ని మాటిమాటికీ ఎత్తిపొడుస్తావు. లచ్చలకు లచ్చలు పెండ్లప్పుడు కట్నం కింద గుంజినావు. పెండ్లయినాక చెరువు కింద పదెకరాలూ గుంజినావు. ఏం ఇంక సాలవా... ఐనా నీలాంటోళ్ళకి ఎన్ని మర్యాదలు చేసినా చేయలేదనే నోళ్ళు నొక్కుకుంటా వుంటారు" అంది మెటికలు విరుస్తా.

"అబ్బో.... భలే చేసినారులే మర్యాదలు... బోడి మర్యాదలు" అన్నాడు మొగుడు ఎకసెక్కంగా.

"అవ్... మావి బోడి మర్యాదలయితే.... మీవి బొచ్చు మర్యాదలు" అంది ఆమె మరింత కోపంతో చిందులు తొక్కుతా.

ఆ మాటలకు అతను మరింతగా రెచ్చిపోతా "మాది బొచ్చులో మరియాదంటావా.... ఎంత ధైర్యమే నీకు. మీది బొచ్చు మర్యాద, మీ అమ్మది బొచ్చు మర్యాద, మీ నాన్నది బొచ్చు మర్యాద.... అసలు మీ వంశం వంశానిదే బొచ్చు మర్యాద" అన్నాడు కప్పెగిరి పోయేటట్లు అరుస్తా.

ఆమె కోపంగా "అట్లాగా... అయితే... ఆ బొచ్చే వస్తాదిపో మనకు" అంటూ చేతిలోని టెంకాయ విసిరికొట్టింది. అంతే.... అది సక్కగా పోయి గోడకి తగిలి టప్పుమని రెండు ముక్కలైంది. దాన్ని పగలగొట్టేముందు ఏం కోరుకుంటే అది జరుగుతుంది గదా... దాంతో మరుక్షణంలో ఇద్దరికీ ఒంటి మీద కొంచం గూడా స్థలం మిగలకుండా ఎలుగుబంట్లలెక్క నల్లగా బొచ్చు వచ్చేసింది. దాంతో ఇద్దరూ ఒకరిని చూసి మరొకరు అదిరిపడినారు. 'అరెరే... అనవసరంగా గొడవ పడి కోరుకోగూడనిది కోరుకున్నామే.... ఈ మొహాల్తో వీధుల్లోకి పోతే జనాలు కిందామీదాపడి నవ్వుతారు" అని బాధపడి "సామీ మా ఒంటిమీదున్న బొచ్చంతా పోవాలి" అనుకుంటా రెండో టెంకాయ కొట్టినారు.

అంతే.... ఇద్దరికీ కొత్తగా వచ్చిన బొచ్చేగాక వున్న బొచ్చు కూడా పోయి తళతళలాడే గుండ్లతో, పేడిమూతితో మిగిలినారు. అది చూసి "అరెరే... ఇదేంది ఇట్లా అయింది" అనుకుంటా "సామీ... మొదట మాకు బొచ్చు ఎట్లుండెనో అట్లాగే మళ్ళా రావాలి" అనుకుంటా మూడో టెంకాయ కొట్టినారు. అంతే... తిరిగి ఇద్దరికీ ఎప్పట్లాగే తల మీద జుట్టంతా వచ్చేసింది. అది చూసి పరమశివుడు పడీపడీ నవ్వుకున్నాడు.

# 72 మోసం చేసినోని కాలే గుంతలోకి

ఒక ఊరిని ఒక రాజు పాలిస్తా వుండేటోడు. ఆయన చానా మంచోడు. ఒకసారి ఆ రాజ్యానికి ఒక సాధువు వచ్చినాడు. రాజు సాధువుకు ఆదున్నన్నాళ్ళూ దగ్గరుండి సేవలు చేసినాడు. సాధువు ఆడ వారం రోజులున్నాడు గానీ ఒక్కమాట గూడా మాట్లాల్లేదు. దాంతో రాజు సాధువు తిరిగిపోయే ముందు "సామీ... ఇన్ని రోజులున్నారు. కానీ ఒక్కమాట గూడా పలకలేదు. పోయేముందన్నా ఒక మంచి మాట చెప్పిపోండి సామీ" అన్నాడు. దానికా సాధువు చిరునవ్వు నవ్వి "రాజా! మోసం చేసినోని కాలే గుంతలోకి" అని చెప్పి వెళ్ళిపోయినాడు.

రాజుకు ఆ మాట ఏమీ అర్థం కాలేదు. పెద్దపెద్ద పండితులని పిలిపించి అడిగినాడు. లోకజ్ఞానం తెలిసినోళ్ళని అడిగినాడు. న్యాయాధికారులను అడిగినాడు. ఆఖరికి దారినపోయే దానయ్యలను గూడా అడిగినాడు. ఎవరూ ఏమీ చెప్పలేకపోయినారు. దాంతో రాజుకు మనోవ్యాధి పట్టుకోనింది. రోజురోజుకీ చిక్కిపోసాగినాడు. అన్నం తినబుద్ధి కావడం లేదు. నీళ్ళు తాగబుద్ధి కావడం లేదు. ఎప్పుడూ అదే ఆలోచన.

ఆఖరికి లాభం లేదనుకోని ఎవరైతే ఆ మాటకు అర్థం చెబుతారో వాళ్ళకి తన రాజ్యంలో సగభాగం ఇస్తానని దండోరా వేయించినాడు. ఎవరెవరో వచ్చినారు గానీ రాజుకు సంతృప్తి కలిగేలా ఎవరూ ఏమీ చెప్పలేకపోయినారు. దాంతో రాజు ఇక లాభం లేదనుకోని మంత్రిని పిలిచి 'ఓ మంత్రీ... నీకు నెలరోజుల సమయమిస్తా వున్నా... యాడికి తిరుగుతావో, ఎంతమందిని అడుగుతావో నాకు తెలీదు. ఎంత డబ్బు కావాలంటే అంత డబ్బు తీసుకో... ఎంతమంది మనుషులు కావాలంటే అంతమందిని ఉపయోగించుకో. కానీ నెల తిరిగేసరికల్లా నాకు దానర్థం తెలియాల. లేదంటే ఆ తరువాత రోజు సూర్యోదయాన్ని నువ్వు చూడలేవు" అని ఎచ్చరించినాడు.

మంత్రికి ఏం చేయాల్నో అర్థం కాలేదు. రాజు మాటంటే మాటే... చావు ఖాయం. దాంతో అనేక మంది పండితులను పిలిచి తలా ఒక దిక్కు పంపించినాడు. తాను కూడా ఒక గుర్రమెక్కి బైలుదేరినాడు. అట్లా ఒక పదిరోజులు గడిచిపోయినాయి. పదకొండో రోజు మంత్రి పోతా వుంటే ఒకచోట ఒక పిల్లోడు దారి మధ్యన గుంత తవ్వుతా కనబన్నాడు.

అది చూసి మంత్రి "రేయ్.. ఏందిరా అది... దారి మధ్యన అట్లా తవ్వుతా వున్నావు. ఎవరైనా పడితే" అన్నాడు. దానికి వాడు "ఎందుకు పడతారు సామీ... మోసం చేసినోని కాలే గుంతలోకి" అన్నాడు. ఆ మాటలకు మంత్రి అదిరిపడినాడు. గుర్రమ్మీద నుంచి ఒక్కుదుటున కిందకి దుంకి "ఒరేయ్... ఇంతకు ముందు ఒక మాటంటివి గదా... దాని అర్థం తెలుసా" అన్నాడు. దానికి వాడు "తెలుసు" అన్నాడు. "అయితే చెప్పురా" అన్నాడు. వాడు కాసేపాలోచించి "నాకేంటి లాభం" అన్నాడు. దానికి మంత్రి "నువ్వు కోరుకున్నంత డబ్బు

ఇస్తాలేరా" అన్నాడు. వాడు ఆలోచనలో పడినాడు. "ఈ మాటకు అర్థం కోసం ఇంతగా తనకలాడుతా వున్నాడంటే దీని వెనుక ఏదో పెద్ద కథే వుండాల. అది తెలుసుకొనేంత వరకూ పొరపాటున గూడా నోరిప్పగూడదు" అనుకోని "తెలుసు గానీ... ఎప్పుడో చానా చిన్నప్పుడు వినింటి. గుర్తుకు రావడం లేదు" అన్నాడు. మంత్రి వానితో మంచిగా మాట్లాడతా "రేయ్... నువ్వు నాతోపాటే మా ఇంటికి రా... ఎప్పుడు గుర్తుకొస్తే అప్పుడు చెప్పు. నిన్ను నా కన్న కొడుకులెక్క చూసుకుంటాలే" అని తీసుకోనిపోయినాడు.

మంత్రి వాడు ఏమడిగితే అది కొనిస్తా, ఇంట్లో తన కొడుకుతో సమానంగా చూడసాగినాడు. అట్లా ఒక పదిరోజులు పోయినాక వానికి మంత్రి మీద మంచి నమ్మకం కుదిరింది. ఒకరోజు రాత్రి మంచమ్మీద కూర్చోని ఆ మాటా ఈ మాటా మాట్లాడ్తా "రేయ్... ఇదే ఆఖర్రోజు. నాకు గనుక నువ్వు అర్థం చెప్పకపోతే రేపు నేనుండను. రాజు నా తల తీసి కోట గుమ్మానికి వేలాడదీయడం ఖాయం" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అది చూసి వాడు "లేదు లేదు నాకు గుర్తుకొస్తా వుంది" అంటూ అర్థం వివరించినాడు.

అంతా తెలుసుకున్న మంత్రికి నెమ్మదిగా ఆశ మొదలైంది. రాజు "ఎవరైతే దానికి అర్థం వివరిస్తారో వాళ్ళకి అర్ధరాజ్యమిస్తా అని దండోరా వేయించినాడు గదా... తన కొడుకుకు ఆ అర్థం చెప్పి పంపిస్తే సరి" అనుకున్నాడు. వీనితో ఇక పని అయిపోయింది. ఎప్పటికీ వీని విషయం బైటపడగూడదంటే ఈ రోజే వీనిని చంపేయాలి" అనుకున్నాడు.

మంత్రికి ఒక పొలముంది. దాని మధ్యలో ఒక బావి తవ్విస్తా వున్నాడు. మంత్రి తాను ఏమి చెప్తే అది ఎదురు చెప్పకుండా చేసే ఇద్దరు మనుషులను పిలిచి "రేయ్... రాత్రి బాయికాడ కాపు కాయండి. ఒకన్ని బాయిలోకి పంపుతాను. వాడు ఎవరు? ఎందుకొచ్చినాడు? నాకేమవుతాడు? అనేది మీకనవసరం. వాడు బాయిలోకి దిగడం ఆలస్యం పైనుండి ధనధనధన రాళ్ళు లోపలకేయండి. వాడు ఈ భూమ్మీద వుండగూడదు" అంటూ చెరో వంద బంగారు వరహాలు వాళ్ళ చేతిలో పెట్టినాడు. వాళ్ళు ఆనందంగా 'సరే' అన్నారు.

చీకటి పడగానే మంత్రి ఆ పిల్లోన్ని పిలిచి "ఒరేయ్... మనం పొలంలో బాయి తవ్విస్తా వున్నాం గదా... దాని కూలీలు డబ్బు కోసమని వచ్చినారు. చీకటి పడింది గదా... రేపిస్తానంటున్నా వినకుండా మొండికి కూచున్నారు. వాళ్ళెంత లోతు, ఎంత వెడల్పు తవ్వినారో కొంచం పోయి కొలతలేసుకుని రాపో... చీకటిలో జాగ్రత్త... దీపం తీసుకోని పో'' అన్నాడు. వాడు 'సరే' అని దీపం తీసుకోని బైలుదేరినాడు. అట్లా ఒక రెండు సందులు దాటినాడో లేదో మంత్రి కొడుకు ఎదురొచ్చినాడు. వాడు "ఒరేయ్... ఇంత రాత్రప్పుడు యాడికి పోతా వున్నావురా... దీపం పట్టుకోని" అని అడిగినాడు. దానికి ఆ పిల్లోడు "అన్నా... మీ నాన్న బాయి కొలతలేసుకుని రమ్మన్నాడు. అందుకని పొలం కాడికి పోతావున్నా" అన్నాడు. అప్పుడు మంత్రి కొడుకు "ఒరేయ్...



నీకేం తెలుసులే ఆ లెక్కలన్నీ... రెండు బదులు నాలుగు అని రాసుకొస్తావ్. ఇదిగో ఈ సంచీ తీసుకోని ఇంటికి పో. నేను పోయి కొలతలేసుకోని వస్తా" అని దీపం తీసుకోని బైలుదేరినాడు.

ఆ పిల్లోడు సంచీ తీసుకోని ఇంటికి వచ్చినాడు. మంత్రి వాన్ని చూసి "అదేందిరా... నేను చెప్పిన పని ఏమి, నువ్వు చేస్తున్న పని ఏమి" అనడిగినాడు. దానికి వాడు "నేను పోతా వుంటే అన్న ఎదురొచ్చినాడు" అంటూ జరిగిందంతా చెప్పినాడు. అది విని మంత్రి అదిరిపడినాడు. "ఓరి నాయనోయ్... నా కొడుకు" అనుకుంటా పొలంకేసి వురికినాడు. దారిలో యాడా కొడుకు కనిపించలేదు. మంత్రి వురుక్కుంటా... వురుక్కుంటా... పొలం కాడికి పోయినాడు. కొడుకు పొలంలో గూడా కనబడలేదు. "కొంపదీసి చంపి బాయిలో ఏసేయలేదు గదా" అని బెరబెరా లోపలికి దిగినాడు.

దూరంగా చెట్టుచాటు నుండి ఇదంతా చూస్తున్నారు మంత్రి మనుషులు. వాళ్ళకు చీకట్లో ఆకారమే గాని మనిషి రూపం కనబడలేదు "ఎవరైతేనేం... లోపలికి దిగడం ఆలస్యం పైనుండి రాళ్ళు ఏయమని మంత్రి చెప్పినాడు గదా..." అనుకోని వాళ్ళు ధనధనా పెద్దపెద్ద బండరాళ్ళు ఎత్తి లోపలికి వేసినారు. అంతే... ఒక బండ నెత్తిన పడి మంత్రి అక్కడికక్కడే తల పగిలి సచ్చినాడు.

అప్పుడే నెమ్మదిగా వస్తా వున్న మంత్రి కొడుకు పొలంలోకి వచ్చినాడు. బండలెత్తి బావిలోకి వేస్తావున్న వాళ్ళని చూసి "ఎవర్రా మీరు... మా బావిలోకి బండలేస్తా వున్నారు" అని గట్టిగా అరిచినాడు. ఆ అరుపుకు వాళ్ళు వులిక్కిపడి చెరోపక్క వురికినారు. మంత్రికొడుకు ఏ మాత్రం బెదపడకుండా ఒకని వెంట పన్నాడు. ఆఖరికి వానిని ఒకచోట పట్టుకోని కాళ్ళు చేతులు కట్టేసి బావి దగ్గరికి తీసుకు వచ్చినాడు. లోపల చూస్తే తండ్రి తల పగిలి చచ్చిపడి వున్నాడు. మంత్రి కొడుకు కళ్ళనీళ్ళు పెట్టుకోని వాన్ని రాజు దగ్గరికి తీసుకోనిపోయినాడు.

రాజు వాన్ని భటుల చేత కిందామీదా యేసి తన్నించి "చెప్పురా... ఎందుకు మంత్రిని చంపినావు" అనడిగినాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక "రాజా... నేను చంపింది మంత్రినని నాకు తెలీదు, అసలు మంత్రే మమ్మల్ని పిలిపించి రాత్రి ఒకన్ని బావి దగ్గరికి పంపిస్తాను. వచ్చినోడు ఎవరని చూడకుండా వాని నెత్తిన బండలేసి చంపండి అన్నాడు" అంటూ జరిగిందంతా చెప్పినాడు.

మంత్రి కొడుక్కి జరిగిందంతా అర్థమైంది. "ఐతే ఆ పిల్లోన్ని చంపించబోయి మా నాయనే బాయిలో పడ్డాడన్న మాట" అన్నాడు ఆచ్చర్యంగా. ఆ మాట విన్న రాజు "ఏ పిల్లోడు... ఏంది కత" అంటూ ఆ పిల్లోన్ని పిలిపించినాడు. పిల్లోడు జరిగిందంతా విని "మహారాజా! నేను ముందే చెప్పా మంత్రికి... మోసం చేసినోని కాలే గుంతలోకి అని. ఐనా వినిపించుకోలేదు ఏం చేద్దాం" అన్నాడు.

ఆ మాట వింటూనే రాజు అదిరిపడినాడు. "ఏమన్నావు. మళ్ళీ చెప్పు" అంటూ దగ్గరికి జరిగి "దానర్థం ఏమి" అన్నాడు. పిల్లోడు నవ్వి "ఏముంది మహారాజా! మంత్రి కథంతా మళ్ళీ వింటే ఎవరూ చెప్పకుండానే మీకే అర్థమవుతుంది ఆ మాటకు అర్థమేమిటో" అంటూ ఆన్నుంచి వెళ్ళిపోయినాడు.

# 73

# దెబ్బకి దెబ్బ

ఒకూర్లో ఎల్లన్నని ఒక ముసిలోడు వుండేటోడు. ఆయనకు ఇద్దరు కొడుకులు. పెద్దోడేమో పెద్ద టక్కరోడు. చిన్నోడేమో ఏమీ తెలీని అమాయకుడు. వాళ్ళ దగ్గర ఒక మంచి కంబళి, బాగా పాలిచ్చే ఆవు, విరగబడి కాసే మామిడి చెట్టూ వుండేటివి. ఎల్లన్న వయసు పైబడ్డంతో ఒకరోజు చనిపోయినాడు.

ఎల్లన్న చనిపోయినాక పెద్దోనికి ఆస్తి మీద కన్నుబడింది. ఎట్లాగైనా అంతా తానే కొట్టేయాలనుకున్నాడు. ఒకరోజు తమ్ముణ్ని పిల్చి "ఒరే... నాన్న మనకు పోతాపోతా ఒక కంబళి, ఒక మామిడి చెట్టు , ఒక ఆవు ఆస్తిగా మిగిలిచ్చి పోయినాడు. వీటిని ఇద్దరమూ సమానంగా పంచుకుందాం" అన్నాడు. తమ్ముడు అమాయకంగా "సరే అన్నా... నువ్వెట్లా చెప్తే అట్లాగే" అన్నాడు.

పెద్దోడు పెద్ద మాయగాడు గదా. దాంతో "రేయ్... కంబళి పొద్దునంతా నువ్వు తీసుకో, రాత్రి నేను తీసుకుంటా. అట్లాగే మామిడిచెట్టు కిందభాగం నువ్వు తీసుకో, పైభాగం నేను తీసుకుంటా. అట్లాగే ఆవు ముందుభాగం నువ్వు తీసుకో, వెనుక భాగం నేను తీసుకుంటా. సరేనా" అన్నాడు. తమ్ముడు చానా అమాయకుడు గదా.. దాంతో సరేనంటూ సంబరంగా ఒప్పుకున్నాడు.

ఆరోజు నుండీ చిన్నోడు రోజూ పొద్దునా, సాయంత్రం వూరిబైటకు పోయి గడ్డి కోసుకోనొచ్చి ఆవుకేస్తా వుంటే పెద్దోడేమో హాయిగా పాలు పితుక్కోసాగినాడు. చిన్నోడు రోజూ మామిడిచెట్టుకు నీళ్ళు పోసి, ఎరువులు వేస్తా వుంటే పెద్దోడు కాసిన కాయలు కాసినట్టు తమ్మునికి ఒక్కటిగూడా ఇవ్వకుండా అన్నీ తానే తెంపుకోసాగినాడు. చిన్నోడు పొద్దునపూట కంబళిని ఏం చేయాలో తెలీక మడిచి మట్టసంగా గూట్లో పెడతా వుంటే, పెద్దోడు రాత్రి కాగానే దాన్ని తీసుకోనిపోయి హాయిగా కప్పుకొని పడుకొనేటోడు.

కొంతకాలానికి చిన్నోనికి పెళ్ళయ్యింది. చిన్నోని పెండ్లాం చిన్నోని లెక్క అమాయకురాలు కాదు. మంచి తెలివైనది. కొద్దిరోజుల్లోనే పెద్దోడు చేస్తావున్న మోసం గమనించింది. ఒకరోజు మొగున్ని కూచోబెట్టుకోని "సగం సగం అంటే కాచేకాయల్లో సగం, పితికే పాలల్లో సగం అంతేగానీ కష్టమొకరికీ, సుఖమొకరికీ కాదు. మీ అన్న నిన్ను అమాయకున్ని చేసి అంతా మోసం చేస్తా వున్నాడు" అంటూ జరుగుతున్నదంతా అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్లు చెప్పింది. దాంతో వానికి అన్న చేస్తావున్న మోసం బాగా అర్థమయ్యింది. దెబ్బకు దెబ్బ ఎలా తీయాల్నో పెళ్ళాన్నడిగి తెల్సుకున్నాడు.

తరువాతరోజు పొద్దున్నే కంబళి నీళ్ళలో బాగా తడిపి పెట్టినాడు. రాత్రి ఎప్పట్లాగానే పెద్దోడు దాన్ని తీసుకోని పోయి కప్పుకుంటే ఇంగేముంది... ఒళ్ళంతా తడిచిపోయి చలిచలిగాదు. 'ఇదేందిరా ఇట్లా తడిపినావు'



అంటే "నా యిష్టం. నేనేమన్నా రాత్రి తడిపినానా. పొద్దున తడిపినా గానీ" అంటూ అడ్డం తిరిగినాడు. దాంతో పెద్దోడు కిక్కురుమనలేదు.

తరువాత రోజు పొద్దున్నే పెద్దోడు పాలు పిండుకుందామని చెంబు తీసుకోనొచ్చి కూర్చున్నాడు. వాడు పాలు పిండడానికి చేయ్యెయ్యడం ఆలస్యం చిన్నోడు వెంటనే ఆడికి వచ్చి ఆవు మొగమ్మీద కట్టెతో ఈడ్చి ఒకటి పెరికినాడు. అంతే దానికి సుర్రుమనడంతో అది ఎగిరి పెద్దోని మొగమ్మీద ఈడ్చి ఒక్కటి పెరికింది. ఆ దెబ్బకి వాడు అమ్మా... అబ్బా... అని మూలుగుతా "అదేందిరా తమ్ముడూ అట్లా కొట్టినావు" అన్నాడు. దానికి వాడు "నాయిష్టం... నేనేమన్నా వెనుకవైపు కొట్టినానా. నావైపు కొట్టినాగానీ" అంటూ అడ్డం తిరిగినాడు. దాంతో పెద్దోడు పాలు పిండుకోలేక మట్టసంగా వెనక్కి పోయినాడు.

కాసేపటికి చిన్నోడు ఒక గొడ్డలి తెచ్చి ఇంటి ముందున్న మామిడి చెట్టును రపరపరప నరక సాగినాడు. అది చూసి పెద్దోడు అదిరిపడి వురుక్కుంటా వచ్చి "అదేందిరా తమ్ముడూ... బంగారంలాంటి చెట్టును అట్లా నరుకుతా వున్నావు" అన్నాడు. దానికి వాడు "నాయిష్టం... నేనేమన్నా నీభాగం నరుకుతా వున్నానా. నాభాగం నరుక్కుంటావున్నా గానీ" అంటూ అడ్డం తిరిగినాడు.

దాంతో పెద్దోడు తప్పయిందంటూ లెంపలేసుకోని "ఇప్పట్నించీ ఇద్దరం అన్నింటినీ సమానంగా పంచుకుందాం" అంటూ దారికొచ్చినాడు. ఆరోజు నుండి పాలూ, పండ్లూ అమ్మగా వచ్చిన డబ్బును సగం సగం పంచుకుంటా, కంబళిని పెద్దోడొక నెలరోజులు, చిన్నోడొక నెలరోజులు తీసుకోసాగినారు.

# 74 చిచ్చర పిడుగు

ఒకూర్లో ఒక రాజుండేటోడు. ఆయనకు ఒక కొడుకు పుట్టినాక పురిట్లోనే పెండ్లాం చచ్చిపోయింది. దాంతో పసిపిల్లోన్ని చూసుకోడానికి ఎవరూ లేక ఇంకో ఆమెని పెండ్లి చేసుకున్నాడు. ఎంతయినా కన్నతల్లి కన్నతల్లే... సవతితల్లి సవతితల్లే గదా... ఆమెకు ఈ పిల్లోడంటే కొంచంగూడా ఇష్టం లేదు. ఎందుకంటే రేప్పొద్దున రాజ్యానికి రాజయ్యేది పెద్దపెండ్లాం కొడుకే గదా...

వీడే లేకుంటే నాకు పుట్టే పిల్లోడే ముందు ముందు రాజవుతాడని ఒకరోజు అర్ధరాత్రి అందరూ పండుకున్నాక కొందరు సైనికులని పిలిచి కావాల్సినంత ధనమిచ్చి, "ఈ పిల్లోన్ని తీస్కోనిపోయి చంపి కనుగుడ్లు గుర్తుగా తీసుకోని రాండి" అని పంపిచ్చింది.

వాళ్ళు సరేనని ఆ పిల్లోన్ని తీస్కోని పోయినారు గానీ చూసి చూసి ఆ పసిపిల్లోన్ని చంపలేకపోయినారు. దాంతో ఏమయితే అదే అయితుందనుకోని ఆ పిల్లోన్ని జాగ్రత్తగా ఒక చీమలపుట్టకాడ వదిలిపెట్టి... ఒక మేకను చంపి దాని కండ్లను తీసుకోనొచ్చి రాణికి చూపిచ్చినారు. రాజు పొద్దున్నే వచ్చి పిల్లోడు కనబడక అంతా వెదుకుతా వుంటే రాత్రి ఎవరో దొంగలొచ్చినారు. వాళ్ళు గానీ ఎత్తుకపోయినారేమో అనింది. చిన్నపెండ్లాం ముందరనే సేవకులందరికీ అడిగినోళ్ళకి అడిగినంత ధనమివ్వడంతో వాళ్ళు గూడా అదే మాట చెప్పినారు. దాంతో రాజు గూడా అదే నిజమనుకోని చానా చానా బాధపడినాడు.

ఆ పసిపిల్లోన్ని సైనికులు పుట్టకాడ వదిలేసి వచ్చినారు గదా... అందులోని చీమలు పిల్లోన్ని జాగ్రత్తగా చూసుకోసాగినాయి. ఎవరి కంటా పడకుండా లోన దాచిపెట్టి... కన్నతల్లి లెక్క వేళకింత పెడతా... ఆడిస్తా... లాలిస్తా... జాగ్రత్తగా పెంచసాగినాయి. ఒకరోజు ఆ పుట్ట వున్న చోటికి ఆ పొలమాయన కూలీలతో వచ్చి "రేయ్! ఇది దారికి అడ్డమయిపోతా వుంది. రేపొచ్చి దీన్ని తవ్వేయండి" అన్నాడు.

దాంతో ఆ చీమలు ఈ పిల్లోన్ని కాపాడ్డం ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే పక్కనే వున్న మామిడి చెట్టు కనబడింది. వెంటనే అవి ఆ పిల్లోన్ని మామిడిచెట్టు దగ్గరికి తీసుకోనొచ్చి "వీనికెవరూ లేరు. మా పుట్ట గూడా రేపు తీసేస్తా వున్నారు. కాస్త నువ్వు చూసుకుంటావా?" అనడిగినాయి. అప్పుడా మామిడిచెట్టు సరేనని ఆ పిల్లోన్ని ఎవరికీ కనబడకుండా కొమ్మల నడుమన దాచి, ఆ మాటా ఈ మాటా నేర్పుతా... తియ్యతియ్యని కాయలు తినడానికి అందిస్తా జాగ్రత్తగా పెంచసాగింది. ఒకరోజు ఆ మామిడిచెట్టు యజమాని సేవకులను పిలచి "రేయ్! మనమిక్కడ ఇండ్లు కట్టుకోడానికి ఈ చెట్టు అడ్డమొస్తా వుంది. కూలీలని పిలంపి రేపు దీన్ని కొట్టేయండి" అని చెప్పినాడు.

దాంతో ఆ మామిడిచెట్టు ఈ పిల్లోన్ని కాపాడ్డం ఎట్లాగబ్బా అని బాధపడతా వుంటే అప్పుడే రాజు తోటమాలి బండిగట్టుకోని చేనుకి పోతా కనబన్నాడు. వానికి పెండ్లయి పదేళ్ళయినా పిల్లల్లేరు. దాంతో ఆ మామిడిచెట్టు వాన్ని పిలిచి "నీకెట్లాగూ ఎవ్వరూ లేరు గదా. ఇదిగో వీన్ని తీసుకోని పెంచుకో. వీనికి గూడా ఎవ్వరూ లేరు" అంటా పిల్లోన్ని అందించింది. ఆ తోటమాలి పిల్లోన్ని చూసి సంబరపడి బెరబెరా ఇంటికి పోయి పెండ్లాం చేతిలో పెట్టినాడు. అప్పటి నుండీ వాళ్ళిద్దరూ ఆ పిల్లోన్ని చానా ప్రేమగా, ముద్దుగా అపురూపంగా పెంచుకోసాగినారు.

అట్లా ఒకొక్క సమ్మచ్చరమే దాట్తా యుద్ధ విద్యలన్నీ నేర్చుకుంటా నెమ్మదిగా ఆ పిల్లోడు పెరిగి పెద్దగయినాడు. వాడు రాజు కొడుకే గదా! దాంతో ఆయన నోట్లోంచి వూడిపన్నాడా అన్నట్లు అచ్చం రాజు మాదిరే తయారయినాడు.

ఒకరోజు రాణి చెలికత్తెలతో సాయంకాలపు పూట చల్లగాలికి అట్లా తిరిగొద్దామని చెప్పి తోటలోనికి వచ్చింది. ఆమెకు ఒకచోట చెట్లకి నీళ్ళు పోస్తా ఈ పిల్లోడు కనబన్నాడు. వాన్ని చూసి ఆమె ఆచ్చర్యపోయింది.

"ఇదేందబ్బా వీడు అచ్చం నా మొగుని మాదిరే వున్నాడు. కొంపదీసి మొదటి పెండ్లాం కొడుకు కాదు కదా" అని అనుమానపడి చక్కగా ఇంటికి తిరిగి వచ్చి అప్పట్లో పిల్లోన్ని అడవిలో చంపి రమ్మని పంపిచ్చిన సైనికులను పిలిపించి, మెడ మీద కత్తి పెట్టి "నిజం చెప్తారా, చస్తారా!" అనింది. దాంతో వాళ్ళు భయంతో గజగజా వణికిపోతా జరిగినేదంతా చెప్పినారు.

"వాడు గనుక అట్లాగే తిరుగుతా వున్నాడంటే ఎప్పుడో ఒకసారి నాకు ముప్పే, రాజు వాన్ని చూడకముందే ఎట్లాగయినా సరే చంపేయా"లని అనుకోనింది. రాజుకి తెలీకుండా సైనికులను పంపించి తోటమాలిని బంధించి తీసుకోని రమ్మనింది. తోటమాలి చెరశాలలో పడడంతో ఆ పిల్లోడు వురుక్కుంటా రాణి దగ్గరకొచ్చి "మా నాయన్ని చెరశాలలో ఎందుకట్లా ఏసినారు" అనడిగినాడు.

దానికామె తలపట్టుకోని "నెలరోజుల నుండీ ఒకటే తలనొప్పి. ఎన్ని మందులేసినా తగ్గడం లేదు. అడవిలోకి పోయి ఏనుగుపాలు తెచ్చి తలంతా పట్టిస్తే తప్ప ఇది తగ్గదని రాజవైద్యులు చెప్పినారు. నీవంటి వీరుడు ఈ మూడు లోకాలలోను యాడా లేడంట గదా! కాబట్టి నీవు పోయి ఏనుగు పాలు తీసుకోనొస్తే మీ నాయన్ని విడిచిపెడతా. లేదంటే లేదు" అనింది.

ఏనుగుపాలంటే మాటలు కాదుగదా! అయినా వాడు సరేనని అడవిలోనికి పోయినాడు. అడివిలో అట్లా పోతా వుంటే ఒకచోట ఒక ఏనుగుల మంద కనబడింది. వీడు ఒక చెట్టు ఎక్కి పైన దాచిపెట్టుకున్నాడు. కాసేపటికి ఏనుగులన్నీ స్నానం చేసొద్దామని పక్కనే వున్న చెరువుకు పోయినాయి. అవి అట్లా పోగానే వీడు బెరబెరా కిందికి దిగినాడు.

ఆడంతా ఏనుగులు ఇష్టమొచ్చినట్టు తొక్కి, తిని, పెండేయడంతో అంతా కంపు కంపు కొడతా వుంది. దాంతో అప్పటికప్పుడు కట్టెపుల్లలతో ఒక పొరకను తయారు చేసి, ఆ స్థలమంతా నున్నగా కసువు కొట్టి, చెత్తంతా కన్నెగా ఎత్తి దూరంగా పారనూకి, అలికి ముగ్గులు పెట్టి చూడముచ్చటగా తయారుచేసి మళ్ళా చెట్టెక్కి కూచున్నాడు.

కాసేపటికి ఏనుగులన్నీ తిరిగి వచ్చినాయి. వచ్చి చూస్తే ఆ స్థలమంతా అద్దం లెక్క తళతళలాడతా కనబడింది. ఈ అడవిలో మన కోసం ఇంత కష్టపడింది ఎవరబ్బా అని అవి కిందా మీదా చూస్తా వుంటే చెట్టుపైన



వీడు కనబన్నాడు. "ఏం కావాల నీకు? ఎందుకట్లా అడగకుండానే మాకు సాయం చేసినావు" అన్నాయి. వాడు జరిగినేదంతా చెప్పి "కొంచం మీ పాలిస్తే తీసుకోని పోయి మా నాయనను ఇడిపిచ్చుకుంటా" అన్నాడు.

"దానిదేముంది ఎన్ని కావాలంటే అన్ని తీసుకో" అంటా ఆ ఏనుగులు ఒక బిందె పాలు ఇచ్చి "దా నిన్ను తీస్కోని పోయి మీ రాజ్యం కాడ దించొస్తాం" అని చెప్పి వాడు వద్దు వద్దంటున్నా వినకుండా పెండ్లాం పిల్లలు అందరూ వెంట నడుస్తా వుంటే... ఒక ఏనుగు వాన్ని ఎత్తి మీద కూచోబెట్టుకోని బైలుదేరింది.

ఏనుగులన్నీ అట్లా గుంపులు గుంపులుగా వస్తా వుంటే దూరం నుండే చూసిన సైనికులు పరుగుపరుగున రాణి దగ్గరకు పోయి "మహారాణీ! మహారాణీ! వాడు సామాన్యుడు గాదు. ఏనుగుపాలు తెమ్మంటే ఏకంగా ఏనుగుల మందనే తెస్తా వున్నాడు" అని చెప్పినారు. వాడు రాజ్యం దగ్గరికి రాగానే ఏనుగులకి పోయొస్తానని చెప్పి పాలు తీసుకోనొచ్చి రాణి చేతిలో పెట్టినాడు. రాణి అవన్నీ తీసుకోని నెత్తికి పూసుకునిందే గానీ వాళ్ళ నాయనను విడిచిపెట్టలేదు.

"నువ్వు చెప్పినట్లే ఏనుగుపాలు తెచ్చిచ్చినానుగదా! అయినా మా నాయనను ఎందుకు విడిచిపెట్టడం లేదు" అన్నాడు వాడు. దానికామె "అమ్మా! అబ్బా!" అని దొంగ మూలుగులు మూలుగుతా "ఈ తలనొప్పి ఏనుగుపాలు పట్టిచ్చినా కొంచంగూడా తగ్గనే తగ్గడంలేదు. అదే గనుక పులిపాలు పట్టిస్తే ఇట్ల పట్టియ్యడం ఆలస్యం అట్ల తగ్గిపోతాదంట. కాబట్టి నీవు పోయి పులిపాలు తీసుకోనొస్తే మీ నాయనను విడిచిపెడతా. లేదంటే లేదు" అనింది.

పులిపాలంటే మాటలు కాదుగదా! అయినా వాడు సరేనని అడవికి పోయినాడు. అట్లా అడవిలో పోతా పోతా వుంటే ఒకచోట పులి గాండ్రింపు వినబడింది. వీడు అదిరిపడి ఎందుకయినా మంచిదనుకోని ఒక చెట్టు ఎక్కి కూచున్నాడు. కాసేపటికి ఒక ఆడపులి మూడుకాళ్ళ మీద కుంటుకుంటా నెమ్మదిగా ఆడికొచ్చి, మనిషి వాసన గుర్తుపట్టి పైకి చూసింది. చూస్తే చెట్టుపైన వీడు దాచిపెట్టుకోని కనబన్నాడు.

అప్పుడా పులి వానితో "నా కాల్లో ముల్లు గుచ్చుకోని నెలనాళ్ళ నుండీ అడుగు తీసి అడుగేయలేకపోతా వున్నా. కొంచం ముల్లు తీసి పుణ్యం కట్టుకో. నీకే సాయం కావాలన్నా చేస్తాను" అనింది. సరేనని వాడు కిందకి దిగొచ్చి జాగ్రత్తగా దాని కాలు ఒళ్ళో పెట్టుకోని ఆ మాటా ఈ మాటా మాట్లాడతా నొప్పి తెలీకుండా ముల్లును ఒక్కసారిగా పెరికి పారేసినాడు.

దాంతో ఆ పులి సంబరంగా "చెప్పు... నీకేం సాయం కావాల" అని అడిగింది. వాడు జరిగినేదంతా చెప్పి "కాస్త నీ పాలిస్తే తీసుకోని పోయి మా నాయనను ఇడిపిచ్చుకుంటా" అన్నాడు.

"దానిదేముంది! ఎన్ని కావాలంటే అన్ని తీసుకో" అంటా ఒక చెంబెడు పాలిచ్చి "దా! నిన్ను తీస్కోని పోయి మీ రాజ్యం కాడ దింపొస్తా" అని చెప్పి వాడు వద్దు వద్దంటున్నా వినకుండా... స్నేహితులు, పిల్లలు వెంట నడుస్తా వుంటే... వాన్ని మీద కూచోబెట్టుకోని బైలుదేరింది.

పులులన్నీ ఇట్లా గుంపులు గుంపులుగా వస్తా వుంటే దూరం నుండే చూసిన సైనికులు పరుగు పరుగున రాణి దగ్గరకు పోయి "మహారాణీ! మహారాణీ! వాడు సామాన్యుడు గాదు. పులిపాలు తెమ్మంటే ఏకంగా పులుల మందనే తెస్తా వున్నాడు" అని చెప్పినారు. వాడు రాజ్యం దగ్గరకి రాగానే పులులకు పోయొస్తానని చెప్పి పాలు తీసుకోనొచ్చి రాణి చేతిలో పెట్టినాడు. రాణి అవన్నీ తీసుకోని నెత్తికి పూసుకునిందే గానీ వాళ్ళ నాయనను మాత్రం విడిచిపెట్టలేదు.

"నువ్వు చెప్పినట్లే పులిపాలు తెచ్చిచ్చినానుగదా, అయినా మా నాయనను ఎందుకు విడిచిపెట్టడం లేదు" అన్నాడు వాడు. దానికామె "అమ్మా! అబ్బా!" అని దొంగ మూలుగులు మూలుగుతా "ఎట్లాగబ్బా వీన్ని చంపడం" అనాలోచించి వాళ్ళ అన్న గుర్తుకొచ్చి "నాయనా! ఈడికి ఆరువందల మైళ్ళ దూరంలో అవంతీ నగరముంది. దానికి రాజు మా అన్ననే. ఆయన దగ్గర ఈ నొప్పి తగ్గడానికి మాంచి మందుంది. నిన్ను గుర్తుపట్టడానికి ఒక చీటీ రాసిస్తా. దాన్ని తీస్కోని పోయి మా అన్నకియ్యి. నువ్వు మా అన్న ఇచ్చిన మందును తీసుకరావడం ఆలస్యం మీ నాయన మీ ఇంట్లో వుంటాడు" అనింది.

"సరే" అని వాడు ఆమె ఇచ్చిన చీటీ తీసుకోని పోతా ఒకసారి వాళ్ళమ్మను చూసిపోదామని ఇంటికి వచ్చినాడు. వాడు స్నానం చేస్తా వుంటే వాళ్ళమ్మ వాని బట్టలుతుకుదామని దాండ్లను తీస్తా వుంటే జేబులోంచి జారి చీటీ కింద పడింది. "ఏముందబ్బా దీంట్లో" అని తెరచి చూస్తే ఇంగేముంది "వీడు నా సవతి కొడుకు. విషాన్ని పెట్టి చంపు" అని వుంది. "ఓహో! ఇదా సంగతి! ఇందుకా ఈమె వీన్నిట్లా బాధపెడ్తా వుంది" అనుకోని మరొక చీటీలో "వీడు నా కొడుకు. వీనికి నీ కూతురినిచ్చి పెండ్లి చేయి" అని రాసి గమ్మున జేబులో పెట్టేసింది.

వీడు స్నానం చేసి, అమ్మ పెట్టిన అన్నం తిని బైలుదేరినాడు. అట్లా ఒకొక్క వూరే దాటుకుంటా, దాటుకుంటా ఏడు రాత్రులూ, ఏడు పగల్లూ ప్రయాణించి ఆఖరికి అవంతీ నగరం చేరుకోని పోయి రాజుకు ఆ చీటీ ఇచ్చినాడు.

వాడు అచ్చం రాజు లెక్కనే వుంటాడు గదా! "వీడు నా చెల్లెలి కొడుకా, ఎంతందంగున్నాడు! అచ్చం మా బావ లెక్కనే" అని మురిసిపోయి "దా... బాబూ...దా!" అంటా తీస్కోని పోయి రాచమర్యాదలు చేసి వూరు వూరంతా చూస్తుండగా తన ఒక్కగానొక్క కూతురినిచ్చి బ్రమ్మాండంగా పెండ్లి జేసినాడు. ఆయనకు ఆ ఒక్క ఆడపిల్ల తప్ప మొగపిల్లల్లేరు. దాంతో వాన్నే ఆ రాజ్యానికి రాజుని చేసినాడు.

ఈడ ఇట్లా జరుగుతా వుంటే ఆడ తోటమాలి పెండ్లాం రాజు దగ్గరికి పోయి పిల్లోన్ని మామిడిచెట్టు తనకియ్యడం దగ్గర నుండి రాణి వాన్ని చంపమని వుత్తరం రాసిపెట్టడం దాకా జరిగింది జరిగినట్టు వివరించి ఆ వుత్తరం ముక్క చేతిలో పెట్టింది. దాంతో రాజు రాణిని చెరశాలలో యేసి తోటమాలిని విడిపించినాడు. అందరూ కలిసి అవంతీ నగరానికి పోయి కొడుకునూ కోడలినీ చూసి "పచ్చగా పిల్లా పాపలతో హాయిగా నూరేండ్లు బతకమని" ఆనందంగా ఆశీర్వదించినారు.

# 75 పండితుడు - వంటవాడు

ఒకూర్లో ఒక పండితుడున్నాడు. వానికి రాని విద్యంటూ ఏదీ లేదు. వేద వేదాంగాలూ, సకల శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలూ అన్నీ నేర్చేసుకున్నాడు. విద్య ఎక్కువయితే వినయం పెరగాల కదా. కానీ వీనికి మాత్రం పొగరు బాగా పెరిగిపోయింది. నా అంత మొనగాడు ఈ ముల్లోకాల్లో యాడా వుండదని విర్రవీగుతా నెలకొక రాజ్యానికి పోయి "మీ రాజ్యంలో ఏ విద్యలోనైనా సరే నాతో పోటీపడే పండితుడుంటే రమ్మనండి. గెలిస్తే నేను గుండు చేపిచ్చుకుంటా, ఓడిపోతే వాళ్ళు గుండు చేపిచ్చుకోవాల" అని పందెం కట్టేటోడు. మొదట్లో చానామంది పండితులు వానితో పోటీపన్నారు గానీ ఎవరూ గెలవలేదు. నెమ్మదిగా వాని పేరు అన్ని రాజ్యాలకూ పాకిపోయింది. వాన్తో పోటీ అంటే చాలు ఎవరు చూసినా 'మేం రామంటే మేం రాం' అని పారిపోయేటోళ్ళు. దాంతో వానికి ఇంకా పొగరు పెరిగిపోయింది.

అట్లా వాడు ఒక్కొక్క రాజ్యమే పోతా ఆడి పండితుల్ని ఓడిస్తా ఒకరోజు కందనవోలుకి చేరుకున్నాడు. దానికి రాజు విక్రమసింహభూపతి. ఆయన చానా పరాక్రమవంతుడు. యుద్ధంలో గెలచడమే తప్ప ఓడడం తెలీనివాడు. చానా మంచోడు కూడా. అడిగినవాడికల్లా లేదనకుండా దానం చేసేటోడు. అటువంటి ఆ మహారాజు ఆస్థానానికి పోయి ఈ పండితుడు సవాల్ చేసినాడు.

అప్పటికే ఆ పండితుని గొప్పతనం గురించి అన్ని రాజ్యాలలోని వాళ్ళకు బాగా తెలిసిపోయింది. దాంతో పోటీ పడడమెందుకు, గుండు కొట్టిచ్చుకోవడమెందుకు అని ఒక్కరు గూడా ముందుకు రాలేదు.

పోటీలో పాల్గొని ఓడిపోయినా పరవాలేదు గానీ అసలు పోటీలోనే పాల్గొనకుండా చేతులెత్తేస్తే ఏం మర్యాద. దాంతో రాజు పోటీపన్నోనికి అడిగినంత ధనమిస్తా అని ప్రకటించినాడు గానీ ఒక్కరు గూడా ముందుకి రాలేదు. రాజు బాగా ఆలోచించి ఆఖరికి అంతఃపురంలో వంటలు చేసేటోన్ని పిలిపించినాడు. వానికి వుండేది ఒకే ఒక కన్ను. అంతేగాదు అచ్చరం ముక్క గూడా రాదు.

వాన్తో రాజు "రేయ్... రేపు ఆ పండితునితో పోటీకి నిన్ను పంపుతా వున్నా. నువ్వు మట్టసంగా మాట్లాడకుండా కూచో, సైగల్లో పోటీ అని చెబ్తా, నీ ఇష్టమొచ్చినట్లు సైగలు చెయ్. నీకేం భయం లేదు" అన్నాడు. వాడు సరేనన్నాడు.

తరువాత రాజు వంటోనికి గొప్ప పండితుని లెక్క వేషం వేపిచ్చి పోటీకి నిలబెట్టినాడు. వాని డాబూ దర్పం చూసి పండితుడు అబ్బో అనుకున్నాడు. అంతలో రాజు "మా రాజ్యంలో వున్న పండితులందరి కన్నా ఈయనే

గొప్పోడు. కానీ ఇప్పుడు మౌనవ్రతంలో వున్నాడు. కాబట్టి సైగలే తప్ప నోరు విప్పి ఒక్కమాటా మాట్లాడడు. నీవు అన్ని విద్యలలోనూ పండితునివి గదా, చేతనయితే సైగల్లో పోటీ చేయి" అన్నాడు. పండితుడు "దానిదేముంది. సరే" అన్నాడు.

రాజు పండితున్ని మొదలుపెట్టమన్నాడు. పండితుడు వంటోనికెల్లి చూసి చిరునవ్వు నవ్వి చెయ్యెత్తి ఒక వేలు చూపించినాడు. అది చూస్తానే వంటోనికి చానా కోపమొచ్చేసి రెండు వేళ్ళు ఎత్తి చూపించినాడు. పండితుడు కాసేపాలోచించి ఈసారి మూడువేళ్ళు ఎత్తి చూపించినాడు. వెంటనే వంటోడు పల్లు పటపటపట కొరుకుతా కోపంగా వూగిపోతా పిడికిలి బిగించి వూపినాడు. దానికి ఆ పండితుడు వురుక్కుంటా వచ్చి వాని కాళ్ళు పట్టుకోని "మహానుభావా ఏమో అనుకుంటి గానీ మీ అంత గొప్ప విద్వాంసుడు యాడా వుండడు. నేను ఓడిపోయాను" అని అందరి ముందూ గుండు కొట్టిచ్చుకోని వెళ్ళిపోయినాడు.

ఇదంతా చూసి ఆ రాజుకు ఏమీ అర్థం కాలేదు. "ఈ వంటోడేంది, ఆ పండితున్ని ఓడించడమేంది" అనుకుంటా పండితున్ని పక్కకు పిల్చుకోని పోయి 'మహానుభావా! మీరిద్దరు ఏమి సైగలు చేసుకున్నారో, దానికర్థం ఏమిటో నాకు ఒక్క ముక్కా అర్థం కాలేదు. దయచేసి కొంచం వివరించి చెప్పండి" అన్నాడు.

అప్పుడా పండితుడు "ఏం లేదు మహారాజా! ఈ లోకాన్ని పరిపాలించే దేముడొక్కడే గదా, అందుకే నేను మొదట ఒక వేలు ఎత్తి చూపించినాను. కానీ వాడు దాన్ని ఒప్పుకోకుండా శివకేశవులు ఇద్దరు గదా అని రెండువేళ్ళు చూపించినాడు. దానికి సమాధానంగా నేను అట్లాగయితే బ్రహ్మను కూడా కలుపుకోని సృష్టిస్థితిలయకారులైన త్రిమూర్తులకు గుర్తుగా మూడు వేళ్ళు చూపించినాను. కానీ వెంటనే అతను దేవుల్లెంతమంది వున్నా అందరూ కలిసే ఈ ప్రపంచాన్ని నడిపిస్తారు అని పిడికిలి బిగించి చూపించినాడు. దాంతో ఇంగ ఏమి సమాధానం చెప్పాల్నో అర్థంగాక నేను ఓటమి ఒప్పుకున్నాను. నిజంగా అంత గొప్ప పండితున్ని నేనింతవరకూ చూల్లేదు" అని వివరించి చెప్పినాడు.

ఆ మాటలకు రాజు ఆచ్చర్యపోయినాడు. వంటోనికి అచ్చరం ముక్క గూడా రాదు గదా, మరి ఇన్ని విషయాలు ఎట్లా తెలిసినాయో కనుక్కోవాలని పండితున్ని పంపిచ్చి వంటోన్ని పిలిపిచ్చి "మీరిద్దరూ ఏమి సైగలు చేసుకున్నారో, దానికర్థం ఏమిటో నాకు ఒక్క ముక్కా అర్థం కాలేదు. అసలేం జరిగిందో కాస్త వివరించి చెప్పు" అన్నాడు.

అప్పుడా వంటోడు "మహారాజా! ఏమో అనుకుంటిగానీ వానికి తాను పెద్ద పండితున్నని చానా కొవ్వు అందుకే నన్ను ఎగతాళి చేయడానికని నాకుండేది ఒకటే కన్ను గదా... ఎక్కిరిస్తా ఒక వేలు చూపించినాడు. దాంతో నాకు కోపమొచ్చి నీకు రెండు కండ్లున్నా అవి నా ఒక్క కన్నుతో సమానంగావు అని వానికి రెండేళ్ళు చూపించినాను. అంతటితో వాడు వూరుకోవచ్చు గదా... నన్ను మరింత ఎగతాళి చేస్తా, 'నీ ఒక కన్నూ, నా రెండు కండ్లూ కలిపితే మూడవుతాయి గదా' అంటా మూడేళ్ళు చూపిచ్చి నవ్వినాడు. దాంతో నాకు ఒళ్ళు మండిపోయి 'రేయ్... ఇంకొక్క మాటగానీ మాట్లాన్నావనుకో వంగబెట్టి గుద్దుతా చూడు" అని పిడికిలి బిగించి చూపించినాను. ఆ దెబ్బకు వాడు బెదపడి నేను యాడ తంతానో ఏమో అని మట్టసంగా ఓడిపోయానని ఒప్పుకున్నాడు" అని చెప్పినాడు.

# 76 గుడ్డోడు - గూనోడు

ఒకూర్లో ఒక గుడ్డోడున్నాడు. వాన్ని ఒకరోజు వాళ్ళమ్మ పిల్చి "రేయ్! ఇంటి ముందు కసువు కొట్రా" అనింది. వాడు గుడ్డోడు కదా. కళ్ళేడ కనబడ్తాయ్. చీపురు తీస్కోని వాళ్ళిల్లే అనుకోని పక్కింటి ముందు నున్నగా కసువు నూకి చెత్తంతా ఎత్తుకోనొచ్చి వాళ్ళింటి ముందు పోసినాడు. కొంచెం సేపున్నాక వాళ్ళమ్మ బయటికొచ్చి చూస్తే ఇంటి ముందంతా చెత్త కుప్పలే. దాంతో వాళ్ళమ్మకు కోపం ముంచుకొచ్చి "గుడ్డి నాయాలా! ఫో నా ఇంట్లోంచి" అని వాన్ని తన్ని తరిమేసింది. పాపం వాడు ఏడ్చుకుంటా పోసాగినాడు.

అదే వూర్లో ఒక గూనోడుండేటోడు. వాళ్ళమ్మ వాన్ని పిల్చి "ఒరే! కడవతో నీళ్ళెత్తుకోని రాపో" అని పంపిచ్చింది. పాపం వాడు గూనోడు కదా. ఐనా ఎట్లాగో కష్టపడి కడవ వీపు మీద పెట్టుకోని వస్తా వుంటే దారిలో ఒక పెద్ద బోటురాయి కాలికి తగిలింది. అంతే... వాడు దభీమని బోర్లాబొక్కల పడిపోయినాడు. కడవ ముక్కలు ముక్కలైపోయింది. అది చూసి వాళ్ళమ్మ "ఓరి గూనినాయాలా! బంగారం లాంటి కడవ పగలగొట్టినావు గదరా, ఫో నా ఇంట్లోంచి" అని వాన్ని దొబ్బేసింది. వాడు ఏడుస్తా పోతా వుంటే దారిలో గుడ్డోడు ఎదురైనాడు. ఇద్దరూ జరిగిందంతా ఒకరికొకరు చెప్పుకోని బాధపడినారు.

గుడ్డోడు, గూనోడు ఊరు దాటి అడవిలో పోతా వుంటే దారిలో వాళ్ళకి ఒక సలాకి దొరికింది. అది తీసుకోని పోతా పోతా వుంటే అడవిలో ఒక చోటొక గాడిద మేత మేస్తా కనబడింది. గూనోడు నెమ్మదిగా చప్పుడు గాకుండా వెనుక నుంచి వెళ్ళి దాన్ని పట్టుకున్నాడు. ఇద్దరూ దాని మీదెక్కి పోసాగినారు. దారి మధ్యలో ఆకలైంది. అడవి గదా మంచి మంచి పండ్లుంటాయి. వాటిని కోసుకోని కడుపు నిండా తిని, కొన్ని పళ్ళు మూటగట్టుకోని గాడిద మీద వేసుకోని పోసాగినారు. కొంతదూరం పోయేసరికి చీకటి పడింది. వాళ్ళకు భయమేసింది. అడవంటే మాటలు కాదు గదా..., రాత్రయితే పులులు, సింహాలు తిరుగుతుంటాయి. కనబన్నామనుకో కసుక్కున చంపి తినేస్తాయి. ఎట్లాగబ్బా అనుకుంటా వుంటే దూరంగా ఒక గుహ కనబడింది. ఇద్దరూ దాంట్లోకి పోయి పండ్లు తిని, చిన్న చలిమంటేసుకోని గాడిదను ఒక మూల కట్టేసి హాయిగా నిద్రపోయినారు.

అర్ధరాత్రి ఏవో చప్పుళ్ళు వినబడుతోంటే గుడ్డోడు నిద్రలేచినాడు. నెమ్మదిగా గూనోన్ని నిద్ర లేపి 'రేయ్! ఏవో మాటలు దూరంగా వినబడ్తావున్నాయ్. జాగ్రత్తగా పోయి చూడ్రా' అన్నాడు. సరేనని గూనోడు చప్పుడు చెయ్యకుండా పోయి చూస్తే గుహ ముందు నలుగురు దొంగలు కూచున్నారు. ఒకొక్కడు నల్లగా కండలు తిరిగి, పెద్ద పెద్ద మీసాలతో చిన్న చిన్న రాక్షసుల్లా వున్నారు. నలుగురూ మధ్యలో దీపం పెట్టుకోని తాము దోచుకొచ్చిన

బంగారమంతా ముందేసుకోని పంచుకుంటా వున్నారు. గూనోడు నెమ్మదిగా వెనక్కొచ్చి గుడ్డోనికి చూసిందంతా చెప్పినాడు. గుడ్డోనికి కళ్ళు కనబడవు గానీ తెలివి మాత్రం చానా ఎక్కువ. వాడు ఒక ఉపాయం ఆలోచించినాడు.

గాడిద అరవకుండా దాని మూతిని గట్టిగా తాడుతో కట్టేసినాడు. సలాకి తీసి నిప్పుల మీద ఎర్రగా కాల్చి "రేయ్ నువ్వు పోయి వాళ్ళకు కనబడకుండా రాయి తీసుకోని దీపం మీదకు విసురు. దీపం పడిపోగానే ఓ అని దయ్యం మాదిరి అరువు" అన్నాడు. వాడు సరేనని పోయి రాయి తీసుకోని దీపాన్ని ఒక్కేటు కొట్నాడు. దీపం ఎగిరి కింద పడి ఆరిపోయింది. దీపం కింద పడడంతో ఒక్కసారిగా అంతా చీకటైపోయింది. "ఎవర్రా దీపాన్ని రాయితో కొట్టింది" అన్నాడు ఒక దొంగ. అంతలో గుహ లోపల్నించి సన్నగా ఓ ఓ ఓ అని అరుపు వినబడింది. ఇంకో దొంగ గజగజా వణుకుతా కొంపదీసి లోపల దయ్యాలున్నాయేమో" అన్నాడు.

గుడ్డోడు లోపల గాడిద కట్లిప్పి వేడి వేడి సలాకీతో దానికి వాత పెట్నాడు. అంతే అది నొప్పికి గిలగిలలాడతా బైటికురికింది. గుహకడ్డంగా దొంగలు కూచున్నారు గదా. దాంతో గాడిద అడ్డమొచ్చిన దొంగల్ని ముందుకాళ్ళతో ఇద్దర్నీ వెనకకాళ్ళతో ఫెడేల్ ఫెడేల్మని ఎగిరి తన్నింది. ఆ దెబ్బలకు నలుగురు దొంగలు నాలుగు వైపులా ఎగిరి దభీమని పన్నారు. వెంటనే గుడ్డోడు లోపల్నించి ఓ అంటూ దయ్యమ్మాదిరి గట్టిగా గుహ అదిరిపోయేలా అరవసాగినాడు. అంతే దొంగలు అదిరిపడి దయ్యాలే తమని తన్నినాయనుకోని భయపడి ప్రాణాలరచేతిలో పెట్టుకోని తలోదిక్కూ పారిపోయినారు.

దొంగలు పారిపోయిన కాసేపటికి గుడ్డోడు, గూనోడు ఆడికి చేరుకున్నారు. చూస్తే ఇంకేముంది. వజ్రాలు, రత్నాలు, హారాలు, బంగారం కుప్పలు, కుప్పలున్నాయి. ఇద్దరూ చెరి సగం పంచుకోవాలనుకున్నారు. గూనోడు ఒక పడి తీసుకోనొచ్చి నీకో పడి, నాకో పడి అంటూ పంచసాగినాడు. మధ్యలో గూనోనికి ఆశ పుట్టింది. గుడ్డోనికెట్లాగూ కళ్ళు కనబడవుగదా... వాడేం చూస్తాళ్ళే అనుకోని తానేమో పడి నిండుగా పోసుకుంటా, గుడ్డోనికి మాత్రం సగం పడే పోయసాగినాడు. గుడ్డోనికి కళ్ళు కనబడకపోయినా వినికిడి శక్తి ఎక్కువ. గూనోడు పోసుకుంటా వున్నప్పుడు గలగలమనే చప్పుడు ఎక్కువసేపు, తనకు పోసేటప్పుడు తక్కువ సేపు వస్తోందని గ్రహించినాడు.

దాంతో అనుమానమొచ్చి వాని కుప్ప, వీని కుప్ప తడిమి చూసినాడు. గూనోని కుప్పేమో పెద్దగుంది. తన కుప్పేమో చిన్నగుంది. దాంతో వానికి కోపమొచ్చి "ఏరా... నన్నే మోసం చేస్తావురా గూనినాయాలా?" అని ఎగిరి వాని నడ్డి మీద ఒక్క తన్ను తన్నినాడు. అంతే గూనోడు ఎగిరి దభీమని కిందపన్నాడు. గుడ్డోడు కొట్టిన దెబ్బకి వాని గూని పోయి నడుం సక్కగా ఐపోయింది. కోపమ్మీదున్నాడు గదా గూనోడు అది చూసుకోలా, వెంటనే లేచి "నన్నే తంతావురా గుడ్డినాయాలా? అని పక్కనే పడి వున్న ముళ్ళకంప తీసుకోని గుడ్డోని మొగమ్మీద ఒక్కటి పెరికినాడు. అంతే ముళ్ళకంపలోని ముళ్ళు కళ్ళ మీద తగిలేసరికి ఒక్కసారిగా వానికి కళ్ళొచ్చేసినాయి. వెంటనే గుడ్డోడు "ఏయ్! నాకు కళ్ళొచ్చేసినాయ్" అంటూ సంబరంగా ఎగిరి గంతులేయసాగినాడు. అంతలో సక్కగా నిలబడి నోరెళ్ళబెట్టుకోని చూస్తా వున్న గూనోన్ని చూస్తూ "రేయ్! నీ గూనేదిరా" అన్నాడు. అప్పుడు వాడు వెనక్కు చూసుకున్నాడు. ఇంకెక్కడి గూని, గుడ్డోని దెబ్బకు అది ఎప్పుడో పోయింది గదా. గూనోడు కూడా గూని పోయినందుకు సంబరంతో ఎగిరి గంతులేసినాడు. ఇద్దరూ ఆ తర్వాత బంగారం చెరి సగం పంచుకోని సంబరంగా ఇంటికి బైలుదేరినారు.

# 77 అక్కా చెల్లెలు

ఒకూర్లో ఒక రైతు వుండేటోడు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరికీ పెండ్లి చేసినాడు. పెద్దపిల్ల మొగుడేమో పెద్ద షావుకారు. చిన్నపిల్ల మొగుడేమో చిన్నరైతు. కొంతకాలానికి పెద్దపిల్లకు పదిమంది పిల్లలు పుట్టినారు. చిన్నపిల్లకేమో ఇద్దరు పుట్టినారు.

చిన్నపిల్ల ఆ ఇద్దరినే సాకలేక, వాళ్ళకు కడుపు నిండా అన్నం పెట్టలేక నానా అవస్థలు పడేది. ఆ యింట్లో, ఈ యింట్లో పనులు చేసి, సంపాదిస్తా వుండేది. పెద్దపిల్లకు బాగా డబ్బుంది గదా. అందుకని దానికి చానా పొగరెక్కువ. చెల్లెల్ని చూడ్డానికి అస్సలు వచ్చేది గాదు. ఎప్పుడన్నా యాడన్నా దార్లో కనబన్నా అస్సలు పలకరించేది కాదు.

కొంతకాలానికి పిల్లలు పెద్దగైనారు. పెద్దపిల్ల తన కొడుక్కి ఒక పెద్దింటి సంబంధం చూసింది. పెండ్లికి వూర్లో అందర్నీ పిలిచింది గానీ చెల్లెల్ని మాత్రం పిలవలేదు. వూర్లో అందరూ పెండ్లికి పోతా వుంటే చిన్నపిల్ల వాళ్ళను "యాడికి పోతా వున్నారు" అనడిగింది. దానికి వాళ్ళు "అదిగూడా తెలీదా. మీ అక్క కొడుకు పెండ్లి. చానా గొప్పగా జరుగుతా వుంది. మేమంతా ఆడికే పోతా వున్నాం" అన్నారు.

అక్క పిలవకపోయినా చెల్లెలికి గూడా పెండ్లికి పోవాలనిపించింది. పిల్లల్ని పిల్చి "రేయ్... నేను మా అక్క కొడుకు పెండ్లికి పోతా వున్నా. వచ్చేటప్పుడు మాంచి మాంచి పిండి వంటలు తెస్తాలే" అని చెప్పి... వున్న చీరల్లో మంచిది, బాగా వుతికినేది కట్టుకోని పెండ్లికి పోయింది.

పెండ్లిలో అక్క వచ్చినోళ్ళందర్నీ పలకరిస్తా వుంది గానీ చెల్లెల్ని మాత్రం పలకరియ్యలేదు. చూసీ చూడనట్టుగా వుంది. చెల్లెలు బాధపడి అక్క దగ్గరకు పోయి "ఏందక్కా... నేనొచ్చి ఎంతసేపైంది. అందర్నీ పలకరిస్తా వున్నావు గానీ... సొంత చెల్లెల్ని నన్ను పలకరియ్యడం లేదు" అనింది.

దానికా పెద్దపిల్ల కోపంగా "అసలు నిన్నెవరు పిల్చినారే పెండ్లికి! నువ్వు నా చెల్లెలివని చెబ్తే అందరూ కిందామీదా పడి నవ్వుతారు. మా పనిమనుషులు కూడా నీకంటే బాగుంటారు. సరే ఎట్లాగూ వచ్చినావు గదా... అంట్లు తోమే మనిషి రాలేదు. పో... పోయి... ఆ పళ్ళాలన్నీ తోముపో" అనింది. చెల్లెలు కళ్ళ నిండా నీళ్ళు బెట్టుకోని అందరూ తిని పారేసిన ఎంగిలి పళ్ళాలన్నీ నున్నగా కడగసాగింది. పెండ్లికొచ్చినోళ్ళందరూ తినిపోయినారు గానీ... అక్క చెల్లెల్ని అన్నానికి కూడా పిలవలేదు. చిన్నపిల్ల అన్నీ నున్నగా తోమి మిగిలిపోయిన అన్నం, కూరలు పిల్లల కోసం మూటగట్టుకోని ఇంటికి బైలుదేరింది.

అంతలో అక్కొచ్చి ఏందే మూటగట్టుకోని పోతా వున్నావు అంటూ మూట విప్పి చూసి "ఇదంతా నీకెందుకే మా బరగొడ్లకు పనికొస్తాది" అంటూ అంతా తీస్కోని పోయి బరగొడ్ల ముందు గాట్లో పాడేసింది. పాపం... చిన్నపిల్లకు చానా బాధేసింది. ఏమీ మాట్లాడకుండా కళ్ళనీళ్ళు బెట్టుకోని గమ్మున ఇంటికి బైలుదేరింది. దారిలో వస్తా వుంటే ఒక పెద్దగుడి కనబడింది. లోపలున్న దేవతకు మొక్కుకోని కిందా మీదా పడి ఏడ్చింది. అది చూసి దేవత "పాపం ఈమెకు ఎంత కష్టమొచ్చిందో... ఏమో ఇట్లా బాధపడతా వుంది" అనుకోనింది. చిన్నపిల్ల గుడిబైట ఒక చచ్చిన పాము పడింటే దాన్ని ముక్కలు ముక్కలుగా కోసుకోని ఇంటికి తీస్కోని పోయింది. అది చూసి దేవత గూడా ఆమెంబడే బైలుదేరింది.

ఆమె ఇంటికి పోగానే పిల్లలందరూ చుట్టూ మూగి "అమా... అమా... మీ అక్క మా కోసం ఏం పంపిచ్చిందే" అనడిగినారు. దానికామె కండ్లనీళ్ళు లోన దాచిపెట్టుకోని నవ్వుతా "రేయ్... మీ కోసం మా అక్క మంచి మంచి చాప ముక్కలు ఇచ్చింది. కొంచమాగండి తిందురుగానీ" అంటూ పాము ముక్కలు గిన్నెలో ఏసి కూర చేసింది.

దేవత ఆమెంబడే ఇంటికొచ్చింది గదా... ఇదంతా పైనుంచి చూసింది. ఆమెకు చానా జాలేసింది. వెంటనే గిన్నెలోని పాము ముక్కలన్నీ వజ్రాలు, రత్నాలు, మణులు, మాణిక్యాలుగా మార్చేసింది. చిన్నపిల్లకు ఇదంతా తెలీదు గదా.. ఆమె పిల్లలందర్నీ వరుసగా కూచోబెట్టి కళ్ళనీళ్ళు వత్తుకుంటా గిన్నెలో నుండి గంటెతో కూర అందరి పళ్ళాల్లోనూ వేసింది. చూస్తే ఇంగేముంది. పాము ముక్కలు లేవు. వజ్రాలు, రత్నాలు, మణులు, మాణిక్యాలు పడినాయి. అందరూ ఆచ్చర్యపోయినారు.

చిన్నపిల్ల ఆనందంతో అవన్నీ అమ్ముకోని ఏడంతస్తుల మేడ కట్టుకోని, పదిమంది దాసీలను పెట్టుకోని హాయిగా వుండసాగింది. ఒకరోజు ఆమె కొడుక్కి పెండ్లి చేయాలని బంగారు పట్టుచీర కట్టుకోని వూర్లో అందర్నీ పిలుస్తా అక్కను గూడా పిల్చింది. ఆమె కట్టుకున్న చీర చూసి దీనికి ఇంత డబ్బెక్కన్నించి వచ్చిందబ్బా అని పెద్దపిల్ల ఆచ్చర్యపోయింది.

పెండ్లికి పోయింది. ఏడంతస్తుల భవనం, దాసదాసీలు అన్నీ చూసి ఆచ్చర్యపోయింది. అక్కను చూస్తానే చెల్లెలు వురుక్కుంటా వచ్చి అక్కను ఇంట్లోకి పిల్చుకోనొచ్చింది. బంగారు తూగుటుయ్యాల మీద కూచోబెట్టి వూపుతా ప్రేమగా తినుబండారాలన్నీ పెట్టింది. అవి తింటూ అక్క "ఇదంతా నీకెలా వచ్చిందే" అనడిగింది. చెల్లెలు జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించింది.

అట్లాగా అని పెద్దపిల్ల అడవికి పోయింది. ఆడ గుడి కనబడింది. దేవతకు మొక్కుకోని యాడైనా చచ్చిన పాము కనబడుతుందేమోనని వెదికింది. యాడా కనబల్లేదు. ఆఖరికి ఒక పెద్దపుట్టలో ఒక నాగుపాము కనబడింది. కట్టె తీస్కోనొచ్చి దాన్ని చంపి ముక్కలు ముక్కలు కోసుకోని ఇంటికి తీస్కోని పోయింది. దాన్ని బాగా కూరొండి పిల్లలందరికీ పెట్టి తానూ తినింది. అంతే... విషమెక్కి అందరూ అక్కడికక్కడే నురగలు కక్కుకోని చచ్చిపోయినారు.

# 78 శ్రీ మద్రమారమణ గోవిందా హరీ!

ఒకూర్లో ఒక హరిదాసు వుండేటోడు. ఆయన కథ చెబుతున్నాడంటే చాలు జనాలు ఎంత పనున్నా సరే... ఎక్కడివక్కడ వదిలేసి పరిగెత్తుకోని వచ్చేటోళ్ళు. చుట్టుపక్కల వూళ్ళలో అంత బాగా చెప్పేటోళ్ళు ఎవరూ లేరు. అతను హరికథ చెబుతా చెబుతా మధ్యలో చిన్న చిన్న పిట్టకథలతో జనాలను పడీపడీ నవ్వించేటోడు. ఇక పాటలైతే.... వద్దులే... అమృతం తాగినంత మధురంగా వుండి జనాలు ఆనందంతో వూగిపోయేటోళ్ళు. అందరూ ఆయన్ని 'పెద్దసామి' అని పిలుచుకొనేటోళ్ళు.

ఆ హరిదాసుకి ఒక కొడుకు వున్నాడు. తండ్రి ఎంత గొప్పోడో వాడు అంత పనికిమాలినోడు. పొట్టకోస్తే అక్షరం ముక్క రాదు. కానీ ఒట్టి మాటలపుట్ట. నోరు తెరిస్తే చాలు అన్నీ అబద్దాలే. అందరి ముందూ తాను గూడా నాన్నలాగే గొప్ప పండితున్నని గొప్పలు చెప్పుకుంటా తిరుగుతుండేటోడు. జనాలకు వాని సంగతి తెలీక అది నిజమేనని అనుకునేటోళ్ళు.

ఆ వూరికి దగ్గర్లోనే కందనవోలు అని ఒక వూరుంది. వాళ్ళు ప్రతి దసరాపండుగకు నవరాత్రులప్పుడు చివరి నాలుగురోజులు పెద్దసామితో కథలు చెప్పించుకోని రోజుకో వెయ్యి ఇచ్చేటోళ్ళు. కానీ ఆ సంవత్సరం అనుకోకుండా పెద్దసామికి జ్వరమొచ్చి మంచం మీద నుండి లేవలేకపోయినాడు. దాంతో జనాలు ఆయన కొడుకు దగ్గరకు పోయి "చిన్నసామీ... చిన్నసామీ... ఇప్పటికిప్పుడు ఇంకొకరిని వెదుక్కోడం చానా కష్టం.... పండగనాడు కథలు చెప్పించడం మా తాతముత్తాతల నుంచీ వస్తావున్న ఆచారం. ఈసారి చెప్పించలేకపోతే మా మర్యాద పోతాది... ఎట్లాగైనా సరే మీ నాయన బదులు నీవే వొచ్చి హరికథలు చెప్పి గండం గట్టెక్కించాల. అదీగాక నీవు మీ నాయనకన్నా గొప్ప పండితునివంటగదా... వూరు వూరంతా చెప్పుకుంటా వున్నారు" అన్నారు. ఆ మాటలకు చిన్నసామి గొంతులో వెలక్కాయ పన్నట్టయింది. వాళ్ళ నుంచి తప్పించుకోలేక చివరికి 'సరే' అన్నాడు.

నవరాత్రులు మొదలయినాయి. చిన్నసామి హరికథలు చెప్పడం ఎట్లా ఎగ్గొట్టాల్నా అని ఆలోచిస్తా ఆ వూరికి పోయినాడు. చిన్నసామి కథ చెబుతున్నాడంట గదా... ఎట్లుంటాదో ఏమో... అదీగాక తండ్రిని మించిన కొడుకంటగదా... అని ఆ వూరోళ్ళే గాక చుట్టుపక్కల వూరోళ్ళు గూడా ఎక్కడి పనులక్కడ వదిలేసి సంబరంగా గుంపులుగుంపులుగా వచ్చి కూచున్నారు. చిన్నసామి పెద్ద మాటల మాయగాడు గదా... దాంతో వాళ్ళందరినీ చూసినా ఏ మాత్రం బెదపడకుండా.... రామాలయం కట్టమీదికెక్కి అందరినీ ఒక్కసారి చూసి "శ్రీ మద్రమారమణ

గోవిందా... హరీ... భక్తులారా ఈ రోజు నేను వృత్తాసుర వధ అనే కథ చెప్పబోతా వున్నా... మీకెవరికైనా ఆ కథ తెలుసా" అంటా గట్టిగా అడిగినాడు.

వృత్తాసురుదెవరో తెలీక జనాలంతా "మాకు తెలీదు సామీ" అంటా గట్టిగా అరిచినారు.

దానికి చిన్నసామి కోపంగా "ఛ... ఛ... ఇంతకాలమైనా మీరు ఆ కథ తెలుసుకోలేదంటే ఇప్పుడు మాత్రం చెప్పి ఏం లాభం... అనవసరంగా మీ సమయం వృథా... నా సమయం వృథా... పోయొస్తా" అంటా వాళ్ళ దగ్గర వేయి రూపాయలు తీసుకొని సక్కగా పోయినాడు.

ఆ మాటలకు ఏం చేయాల్నో తెలీక జనాలంతా నోళ్ళు వెల్లబెట్టినారు.

తరువాత రోజు మరలా చిన్నసామి హరికథ చెప్పడానికి తయారై వచ్చినాడు. జనాలంతా ముందురోజులాగే ఈ రోజు ఏం జరుగుతాదో చూద్దామని గుంపులుగుంపులుగా వచ్చినారు. చిన్నసామి వాళ్ళందరినీ ఒకసారి అటూ యిటూ కిందికీ మీదికీ చూసి "శ్రీమద్రమారమణ గోవిందా... హరీ... భక్తులారా... ఈరోజు నేను నరకాసుర వధ అనే కథ చెప్పబోతా వున్నా... మీకెవరికైనా ఆ కథ తెలుసా" అంటా గట్టిగా అడిగినాడు.

ముందురోజు తెలీదని చెబితే చెప్పకుండా పోయినాడు గదా... దాంతో జనాలంతా మూకుమ్మడిగా "తెలుసు సామీ" అంటా గట్టిగా ఒక్కరుపు అరిచినారు.

దానికి చిన్నసామి చిరునవ్వు నవ్వి "భక్తులారా... తెలిసిన కథనే మరలా చెప్పడం ఎందుకు. అనవసరంగా మీ సమయం వృథా... నా సమయం వృథా... పోయొస్తా" అంటా వెయ్యి రూపాయలు తీసుకొని సక్కగా వెళ్ళిపోయినాడు.

ఆ మాటలకు ఏం చేయాల్నో తెలీక జనాలంతా మళ్ళీ నోళ్ళు వెల్లబెట్టినారు.



ముచ్చటగా మూడో రోజు చిన్నసామి మరలా హరికథ చెప్పడానికి బాగా తయారై వచ్చినాడు. జనాలంతా ఈరోజు ఏం జరుగుతాదో చూద్దామని మరలా గుంపులుగుంపులుగా వచ్చినారు. చిన్నసామి అందరి వంకా చూస్తా "శ్రీమద్రమారమణ గోవిందా.. హరీ... భక్తులారా ఈ రోజు నేను రావణవధ అనే కథ చెప్పబోతా వున్నా... మీకెవరికైనా ఆ కథ తెలుసా" అంటా గట్టిగా అడిగినాడు.

మొదటిరోజు తెలీదని చెబితే చెప్పకుండా వెళ్ళిపోయినాడు. రెండవరోజు తెలుసని చెప్పినా చెప్పకుండా వెళ్ళిపోయినాడు. ఎట్లాగబ్బా వీనితో అని జనమంతా ముందే మాట్లాడుకోని సగం మంది "మాకు తెలుసు సామీ" అని అరిస్తే మిగతా సగం మంది "మాకు తెలీదు సామీ" అని అరిచినారు.

చిన్నసామి చిరునవ్వు నవ్వి "భక్తులారా... హాయిగా తెలిసినవాళ్ళు తెలియనివాళ్ళకు చెప్పండి. అట్లాగే తెలియనివాళ్ళు తెలిసినవాళ్ళతో చెప్పించుకోండి. ఆ మాత్రం దానికి నేనెందుకు. అనవసరంగా మీ సమయం వృథా... నా సమయం వృథా... పోయొస్తా..." అంటా వేయిరూపాయలు తీసుకోని సక్కగా వెళ్ళిపోయినాడు.

దాంతో వూరోళ్ళందరికీ చిన్నసామి గురించి అర్థమైపోయింది. "రేయ్... మనం చిన్నసామంటే ఏమో అనుకున్నాంగానీ వీడు వుత్త మాటల మాయగాడు. ఏలికేస్తే కాలికి, కాలికేస్తే ఏలికి ఏసి తప్పించుకోని తిరుగుతా వున్నాడు. ఇప్పటికే ఏమీ చెప్పకుండా వుత్తపుణ్యానికి మూడువేలు నున్నగా నూకేసినాడు. వీని సంగతి చూసుకోవలసిందే" అనుకున్నారు.

తరువాతరోజు ఎప్పటిలాగే చిన్నసామి సంబరంగా వూగులాడతా వచ్చినాడు. జనాలంతా గుంపులుగుంపులుగా వచ్చి కూచున్నారు. అంతలో ఆ వూరి పెద్ద ఇంత లావు కట్టె ఒకటి చేతిలో పట్టుకోని చిన్నసామి దగ్గరికి వచ్చి "శ్రీమద్రమారమణ గోవిందా... హరీ... సామీ మీరెప్పుడయినా హరిదాసు వధ అనే కథ విన్నారా" అని అడిగినాడు గట్టిగా.

ఆ మాటలకు చిన్నసామి అదిరిపడి "హరిదాసు వధా... ఆ కథ ఎప్పుడూ వినలేదే" అన్నాడు కంగారుగా.

దానికి ఆ వూరిపెద్ద "సామీ... మరియాదగా మా దగ్గర నూకేసిన మూడువేలు మాకిస్తివా సరి... లేకపోతే ఆ కథ చెప్పం. ఏకంగా ఇక్కడే ఇప్పుడే అందరి ముందు నాటకం ఏసి చూపిస్తాం" అన్నాడు కట్టె పైకెత్తి.

అంతే... చిన్నసామి అదిరిపడి గజగజగజ వణికిపోతా "ఓరినాయనోయ్... ఈ వూరోళ్ళు అమాయకులని అనుకుంటిని గానీ... నన్ను మించిపోయినట్టున్నారు" అనుకుంటా బెరబెరా డబ్బులు తీసి వాళ్ళ చేతిలో పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయినాడు.

# 79 పాపిష్టి సొమ్ము

ఒకూర్లో ఒక శెట్టి ఉండేటోడు. వాడు చానా పిసినారి. అంతేగాదు పెద్ద మోసగాడు కూడా. వానికో అంగడుంది. వూర్లో జనాలు ఏమైనా కొనుక్కోవడానికి అంగడికొస్తారు గదా.. అప్పుడు వాడేం చేసేటోడంటే వాళ్ళతో ఒకపక్క తియ్యతియ్యగా మాట్లాడ్తూనే మరోపక్క తక్కువ తూకాలు తూచేటోడు. కల్తీ సరుకులు అమ్మేటోడు. అట్లా జనాలను మోసం చేసి సంపాదించిన సొమ్ముతో బంగారం, వజ్రాలు కొని పెండ్లాం బిడ్డలకు కూడా తెలియకుండా ఒక పాతకుండలో వేసి దాచిపెట్టినాడు.


ఒకరోజు రాత్రి వాడు పక్కూరి నుండి సామాన్లు కొనుక్కోని వస్తా... వస్తా... దారిలో చూసుకోక ఒక నాగుబాము మీద కాలేసినాడు. అంతే అది సర్రున లేచి కసుక్కున కాటేసింది. ఆ దెబ్బకు వాడు గిలగిలా కొట్టుకుంటా, నురగలు కక్కుకోని చచ్చిపోయినాడు.

శెట్టి చచ్చిపోయినాక వాని పెండ్లాం ఆ వూర్లో బతకలేక ఇంట్లో వున్న సామానంతా బండి మీదేస్కోని, పిల్లల్ని తీసుకోని పుట్టింటికి చేరుకోనింది. ఆమెకు పాత కుండలో బంగారం, వజ్రాలు ఆమె మొగుడు దాచిపెట్టిన సంగతి తెలీదు గదా...అందుకే దాన్ని అక్కన్నే వదిలేసి పోయింది.

ఒకరోజు రాత్రి నలుగురు దొంగలు దొంగతనం చేయడానికని శెట్టింట్లోకి దూరినారు. లోపలికి పోయి చూస్తే ఏముంది...పగిలిన కుండలు, విరిగిన మంచాలు తప్ప ఏమీ కనబడలేదు. “సరే ఏం చేద్దాం పక్కింట్లోకన్నా దూకుదాం” అనుకున్నారు. కానీ ఆ పక్కింటి గోడ చానా ఎత్తుగా వుంది. “ఎట్లెక్కాలబ్బా” అని చూస్తా వుంటే దూరంగా మూలకు ఆ పాతకుండ కనబడింది. పోయి దాని మీద కాలుబెట్టి ఎక్కబోతా వుంటే ఆ కుండ పాతది గదా... ఫటుక్కున పగిలిపోయింది. చూస్తే ఇంకేముంది...బంగారం బంగారం కాదు. దొంగలంతా మట్టసంగా ఆ బంగారం, వజ్రాలూ అన్నీ మూట కట్టుకోని ఒక గుళ్ళోకి చేరుకున్నారు.

వాళ్ళు పొద్దున్నుంచీ ఏమీ తినలేదు. దాంతో నలుగురికీ ఆకలి దంచికొట్టసాగింది. దాంతో ఒకడు “రేయ్...కడుపు కాలిపోతా వుంది. ఓ ఇద్దరు పోయి మాంచి బిర్యానీ కట్టించుకోని రాపోండి. వస్తానే బాగా తిని ఈ సొమ్మంతా సమానంగా పంచుకుందాం” అన్నాడు. సరేనని ఇద్దరు బిర్యానీ తేవడానికి బైలు దేరినారు.

వాళ్ళిద్దరూ అట్లా పోతా వుంటే వాళ్ళలో ఒకడు “రేయ్...మనకు ఇంత వరకు ఎప్పుడూ దొరకనంత బంగారమూ, వజ్రాలూ దొరికినాయి గదా... దీన్ని అనవసరంగా వాళ్ళిద్దరికీ ఎందుకు పంచాల. మనమే ఆ మొత్తం కొట్టేసి సగం సగం పంచుకుందాం. ఇక జీవితంలో మళ్ళా దొంగతనం చేయాల్సిన అవసరమే వుండదు. హాయిగా కాలు మీద కాలేసుకోని బతకొచ్చు” అన్నాడు. ఆ మాటలింటూనే రెండోవానిక్కూడా ఆశ పుట్టి “సరే”



అన్నాడు.  దాంతో వాళ్ళిద్దరూ హాయిగా బిర్యానీ తిని, మిగతా దాంట్లో విషం కలుపుకోని ఏమీ ఎరుగని నంగనాచుల్లెక్క బైలుదేరినారు.

ఆడ ఇంకో ఇద్దరు దొంగలు గుళ్ళో వున్నారు గదా...వాళ్ళలో ఒకడు వీళ్ళిట్లా బిర్యానీ కోసమని బైటికి పోగానే పక్కనున్నోనితో "రేయ్...మనకు ఇంతవరకు ఎప్పుడూ దొరకనంత బంగారమూ, వజ్రాలూ దొరికినాయి గదా...దీన్ని అనవసరంగా వాళ్ళిద్దరికీ ఎందుకు పంచాల.  మనమే ఆ మొత్తం కొట్టేసి సగం సగం పంచుకుంటే ఎట్లా వుంటుంది" అన్నాడు.  ఆ మాటలింటూనే రెండోవానిక్కూడా ఆశ పుట్టి "సరే" అన్నాడు. దాంతో వాళ్ళిద్దరూ చెరో కత్తీ తీసుకొని గుడి తలుపుకు రెండు వైపులా దాచిపెట్టుకోని బైటికి పోయినోళ్ళు ఎప్పుడొస్తారా అని ఎదురు చూడసాగినారు.

బైటికి పోయిన దొంగలకిది తెలీదు గదా...దాంతో వాళ్ళిద్దరూ "బంగారమంతా మాదే" అనుకుంటా సంతోషంగా బిర్యానీ తీసుకోని తలుపు తెరచి లోపలికొచ్చినారు.  అంతే... రెండువైపులా దాచిపెట్టుకున్న దొంగలు ఒక్కసారిగా వాళ్ళ మీద పడి కసుక్కున పొడిచేసినారు.  ఆ దెబ్బకు పాపం వాళ్ళిద్దరూ అక్కడికక్కడే కిందా మీదా పడి గిల గిల గిల కొట్టుకుంటా చచ్చిపోయినారు.

వాళ్ళిద్దరూ చచ్చిపోగానే మిగతా ఇద్దరూ సంతోషంగా కింద పన్న బిర్యానీ పొట్లాలు తీసుకున్నారు. వాళ్ళకు బాగా ఆకలవుతోంది గదా...అందుకని ముందుగా బిర్యానీ తిని ఆ తరువాత బంగారు, వజ్రాలు పంచుకుందామనుకున్నారు.  వాళ్ళిద్దరికీ అందులో విషం కలిపినేది తెలీదు గదా.  దాంతో లొట్టలేసుకుంటా ఆవురావురుమని తిన్నారు.  అలా తిన్న కాసేపటికే ఒళ్ళంతా విషమెక్కి గిల గిలా కొట్టుకుంటా వాళ్ళు కూడా ఆన్నే చచ్చిపోయినారు.

తరువాత రోజు పొద్దున దేవునికి పూజ చేద్దామని ఆ గుడి పూజారి వచ్చి తలుపు తెరిచినాడు. తెరిచి చూస్తే ఇంకేముంది... నలుగురు దొంగలు ఎక్కడికక్కడ చచ్చి పడున్నారు. మధ్యలో ధగధగలాడతా బంగారం మెరిసి పోతా వుంది. దాన్ని చూస్తానే ఆ వూరి పూజారికి ఆశ పుట్టింది. ఎవరికీ చెప్పకుండా మట్టసంగా ఆ నలుగురు దొంగల్ని గుంత తీసి పూడ్చి పెట్టేసి, ఆ సొమ్మంతా మూటగట్టుకోని ఇంటికి తీసుకోని పోయినాడు.

పూజారి కొన్ని వజ్రాలు అమ్మి వచ్చిన సొమ్ముతో ఆ వూరి చెరువు పక్కనే పెద్ద అందమైన మేడ కట్టించుకున్నాడు. పెండ్లాం బిడ్డలకేమో ఒంటి నిండా మోయలేనన్ని నగలు చేపిచ్చినాడు. ఒక రోజు రాత్రి అనుకోకుండా పెద్ద వాన కుండపోతగా విరుచుకు పడింది. వానంటే అట్లాంటిట్లాంటి వాన గాదు. దెబ్బకు చెరువు నిండిపోయి గండి పడింది. చెరువు పక్కనే గదా పూజారి మేడ వుండేది. ఆ నీళ్ళ దెబ్బకు మేడంతా పడిపోయింది. నగలు దాచిపెట్టిన ఇనప్పెట్టె నీళ్ళలో కొట్టుకోనిపోయింది. అది అట్లా అట్లా కొట్టుకోనిపోయి...కొట్టుకోనిపోయి...ఒక అడవిలో పొదల నడుమ చిక్కుకోనింది.

ఒక జమీందారు ఒకరోజు వేటకని అడవికి పోయినాడు. జంతువులను వేటాడుతా..వేటాడుతా పోతా వుంటే ఒక పొదలో ఇనప్పెట్టె కనపడింది. "ఏముందబ్బా దీంట్లో" అని పగలగొట్టి చూస్తే ఇంకేముంది కండ్లు జిగేల్మన్నాయి.

ఆ జమీందారు అవన్నీ తీస్కోనిపోయి పెండ్లాం, బిడ్డలకు ఇచ్చినాడు. వాళ్ళు సంబరంగా అవి మెళ్ళో వేసుకోని టింగు రంగా అని తిరగసాగినారు. కానీ..వాళ్ళు అవి వేసుకున్న కొన్నినాళ్ళకే ఇంట్లో అందరికీ రోగాలు పట్టుకున్నాయి. ఎంత మంది వైద్యులొచ్చినా...ఎన్ని మందులేసినా...కొంచెం గూడా తగ్గకపోగా రోజురోజుకీ మరింతగా పెరగసాగినాయి.

ఇదేందిరా నాయనా...ఈ రోగాలు ఇట్లా పట్టుకున్నాయని ఆవూరి బైటున్న ఒక ముని దగ్గరికి పోయి జరిగిందంతా చెప్పినాడు. ఆ మునికి దివ్యదృష్టి ఉంది. దాంతో జరిగిందంతా చూసినాడు. చూసి "నాయనా...నీకీనడుమ అడవిలో బంగారం, వజ్రాలు దొరికినాయి గదా...అది మామూలు సొమ్ము గాదు. జనాలను మోసం చేసి సంపాదించిన సొమ్ము. అందుకే అది ఎవరి దగ్గరున్నా కష్టాలు నష్టాలే తప్ప సుఖాల్లేవు. వెంటనే ఆ పాపిష్టి సొమ్ము తీస్కోని పోయి పేదోళ్ళకు పంచు. అప్పుడు మీ రోగాలు తగ్గిపోతాయి" అని చెప్పినాడు.

అప్పుడు ఆ జమీందారు ముని చెప్పినట్లుగానే ఆ సొమ్మంతా పేదోళ్ళకు పంచి పెట్టినాడు. జనాలను మోసం చేసి సంపాదించిన సొమ్ము తిరిగి వాళ్ళనే చేరుకునే సరికి వాళ్ళందరి రోగాలు తగ్గిపోయినాయి.

# 80 రాయి... బండ... మావూరి కొండ

ఒకూర్లో ఒకడున్నాడు. వాడు చానాచానా అమాయకుడు. ఎప్పుడు ఎవరితో ఎట్లా మాట్లాడాల... ఎక్కడ ఎట్లా ప్రవర్తించాల... ఇలాంటివేమీ తెలీదు. వాళ్ళమ్మానాన్నా ఏది చెబితే అది మారు మాట్లాడకుండా మట్టసంగా చేయడం లేదా గమ్మునుండటం చేసేటోడు. వాడు నెమ్మదిగా పెరిగి పెద్దోడయినాడు గానీ అమాయకత్వం మాత్రం కొంచం గూడా తగ్గలేదు.

నెమ్మదిగా వానికి పెండ్లి వయసొచ్చింది. పెండ్లి వయసొచ్చినాక పెండ్లి చేయాల గదా... దాంతో వాళ్ళమ్మానాన్నా వాని గురించి ఎవరికీ ఏమీ చెప్పకుండా దూరప్రాంతం నుండి ఒక సంబంధం తెచ్చి పెండ్లి చేసినారు. పెండ్లయిన కొన్నినాళ్ళకే వాని గురించి వాని పెండ్లానికి తెలిసిపోయింది. కానీ ఏం లాభం. అప్పటికే అంతా అయిపోయింది గదా... దాంతో 'అంతా నా ఖర్మ' అని మట్టసంగా వుండిపోయింది. ఒకరోజు వాని అత్తామామా వచ్చి "అల్లుడూ... అల్లుడూ... తొందర్లోనే వుగాది పండుగ వస్తా వుంది. నీవు నీ పెండ్లాం తప్పకుండా మా వూరికి రావాల" అని పిలిచినారు. వాడు సరే అన్నాడు.

ఒకవారం దాటేసరికి పండుగ దగ్గర పడింది. వాడు పెండ్లాన్ని తీసుకోని వాళ్ళత్తోళ్ళ వూరికి బైలు దేరినాడు. పోయేముందు వాళ్ళ నాయన వాన్ని పక్కకు పిలిచి "రేయ్... నీకు ఎవరితో ఎట్లా మాట్లాడాల్నో తెలీదు. ఆడికిపోయి తిక్కతిక్కగా మాట్లాన్నావనుకో మరియాద పోతాది. నే చెప్పినేది బాగా గుర్తు పెట్టుకో. బావమరుదులతో గట్టి మాటలు మాట్లాడాల... అత్తతో మెత్తని మాటలు మాట్లాడాల... మామతో చక్కని మాటలు మాట్లాడాల... ఏం సరేనా" అన్నాడు. వాడు వాళ్ళనాయన చెప్పినవన్నీ బాగా గుర్తుపెట్టుకోని బైలుదేరినాడు.

అత్తోళ్ళ వూరికి చేరుకోని ఇంట్లోకి అడుగు పెడ్తా వుంటే బావమరుదులు ఎదురొచ్చి "ఏంబావా... బాగున్నావా... ఇంటికాడ అందరూ బాగున్నారా" అని పలకరిచ్చినారు. వాళ్ళనాయన బావమరుదులతో గట్టిమాటలు మాట్లాడమన్నాడు గదా... అందుకని వాడు వెంటనే

"రాయి...

బండ...

మావూరి కొండ" అన్నాడు. అవన్నీ గట్టివి గదా అందుకని.

"ఇదేందిరా వీడు... బాగున్నావా అంటే... రాయీ... బండ... మావూరి కొండ అంటాడు. వీనికేమయినా పిచ్చా" అనుకుంటా బావమరుదులు మట్టసంగా ఆన్నించి వెళ్ళిపోయినారు.

వాడు ఇంట్లోకి రాగానే వాళ్ళత్త ఎదురొచ్చి "ఏం నాయనా... బాగున్నావా... ప్రయాణమంతా సుఖంగా

జరిగిందా'' అని పలకరించింది. వాళ్ళనాయన అత్త పలకరిస్తే మెత్తని మాటలు మాట్లాడమన్నాడు గదా... అందుకని వాడు వెంటనే...

"దూది

వెన్న

దున్నపోతు పెండ" అన్నాడు. అవన్నీ మెత్తగా వుంటాయి గదా... అందుకని.

''ఇదేందిరా వీడు... బాగున్నావా అంటే.... దూది... వెన్న... దున్నపోతు పెండ అంటాడు. వీనికేమయినా పిచ్చా" అనుకుంటా అత్త మట్టసంగా ఆన్నించి వెళ్ళిపోయింది.



అంతలో మామ ఎదురొచ్చి ''ఏం అల్లుడూ... బాగున్నావా... మీ అమ్మానాయనా అంతా ఎట్లా వున్నారు" అని పలకరించినాడు. వాళ్ళనాయన మామ పలకరిస్తే చక్కని మాటలు మాట్లాడమ న్నాడు గదా... అందుకని వాడు వెంటనే

"బొంగు

కవ్వం

మావూరి స్తంభం" అన్నాడు. అవన్నీ చక్కగా వుంటాయి గదా... అందుకని.

"ఇదేందిరా వీడు... బాగున్నావా అంటే బొంగు... కవ్వం... మావూరి స్తంభం అంటాడు. వీనికేమయినా పిచ్చా" అనుకుంటా కూతురి దగ్గరికి పోయి "ఏందే నీ మొగుడు... మేమొకటి అడుగుతా వుంటే... వాడొకటి మాట్లాడ్తా వున్నాడు. ఏమయిందే వానికి" అని అడిగినాడు. అప్పుడామె జరిగిందంతా చెప్పింది.

మామ వాని అమాయకత్వానికి జాలిపడి వాన్ని పిలిచి "ఒరే... మెత్తని మాటలు మాట్లాడడమంటే మంచిగా మాట్లాడడం... చక్కని మాటలు మాట్లాడడమంటే ఇంపుగా మరలా మరలా వినాలనేటట్లుగా మాట్లాడడం... గట్టిమాటలంటే మాటకు మాట జవాబివ్వడం... అంతే గానీ... రాయీ, దిండు, బొంగూ, కవ్వం కాదు" అని చెప్పినాడు.

# 81 పులికి గురువు పిల్లే గురూ

ఒక అడవిలో ఒక పులి వుండేది. అది చానా బలంగా వుండేది. పెద్దపెద్ద గోర్లు, కొశ్శని పళ్ళు వుండేవి. అది గాండ్రిస్తే చాలు జంతువులన్నీ భయంతో వణికిపోయేవి. కానీ ఆ పులికి వేగంగా పరిగెత్తడం రాదు. నేర్పుగా వేటాడడం రాదు. కొండలు గుట్టలు ఛటుక్కున ఎక్కడం రాదు. చలాగ్గా తిరగడం రాదు. బరువైన ఒంటితో నెమ్మదిగా కదిలేది. జంతువులు అది కనబడితే చాలు అందకుండా పారిపోయేవి. దాన్ని వెక్కిరించేవి. దాంతో దానికి సరియైన ఆహారం దొరికేది కాదు. చానాసార్లు ఆకలితో నకనకలాడిపోయేది. దాంతో పులికి తాను కూడా మెరుపువేగంతో కదలడం, వేటాడడం నేర్చుకోవాల అనుకోనింది.

అప్పట్లో పిల్లులు ఊర్లల్లో వుండేవి కాదు. అడవుల్లోనే వుండేవి. ఇవి చిన్నగా అచ్చం పులుల లెక్కనే వుండేవి. మెరుపువేగంతో కదులుతా, కళ్ళు మూసి తెరిచేలోగా ఆహారాన్ని వేటాడేవి. చెట్లు, పుట్టలు, కొండలు, గుట్టలు ఏమైనాసరే క్షణాల్లో ఎక్కేసేవి. దాంతో పులి ఒక పిల్లి దగ్గరికి చేరి "పిల్లి మామా... పిల్లి మామా... నాకు గూడా నీలా వేగంగా వేటాడే విద్యలు నేర్పవా" అని అడిగింది.

దానికి పిల్లి భయపడతా "అమ్మో... నీకు నేర్పాల్నా... నేర్పిన తర్వాత నువ్వు నన్ను గూడా తినేస్తే" అనింది.

"ఛ... ఛ... గురువును ఎవరైనా మోసం చేస్తారా... పువ్వుల్లో పెట్టి పూజించుకుంటారు గానీ... నన్ను నమ్ము" అంటూ బతిమలాడతా ఏవేవో ఒట్లు పెట్టుకోనింది.

పులి మాటలకు కరిగిపోయిన పిల్లి "సరే నేర్పుతాలే" అనింది.

ఆరోజు నుంచీ రోజూ పొద్దున్నే పులి వచ్చి పిల్లి దగ్గర వినయంగా నిలబడేది. అది కూచోమంటే కూచునేది. లెయ్యమంటే లేచేది. ఎగరమంటే ఎగిరేది. దుంకమంటే దుంకేది. ఏది చెబితే అది... ఎలా చేయమంటే అట్లా చెప్పిన పని చెప్పినట్లు చేసేది. దాంతో పిల్లి తనకొచ్చిన విద్యలన్నీ నేర్పసాగింది.

అట్లా కొద్దిరోజులు గడిచేసరికి పులికి అన్ని విద్యలూ వచ్చేసినాయి. చప్పుడు గాకుండా నడవడం, వెనుక నుంచి ఎగిరి మీదకు దుంకడం, మెరుపు వేగంతో జంతువులను వేటాడడం, కొండలు గుట్టలు ఎక్కేయడం నేర్చేసుకోనింది. ఆఖరికి పిల్లి కన్నా వేగంగా పరిగెత్తడం కూడా నేర్చేసుకోనింది.

పులికి అన్ని విద్యలూ వచ్చేయగానే ఒకరోజు పిల్లి "అల్లుడూ... నీకు ఇంక నేను నేర్పాల్సినవి ఏవీ లేవు. ఈ భూమ్మీద నీకన్నా వేగంగా, చురుగ్గా కదిలే జంతువు ఏదీ లేకుండా రోజూ సాధన చేయి. ఇక వెళ్ళిరా" అనింది.

పులి చిరునవ్వుతో పిల్లి వంక చూసింది. పిల్లి నిండుగా, నున్నగా, బలంగా కొవ్వుపట్టి కనిపించింది. దానికి నోరూరింది. ఇంతవరకూ అడవిలో వుండే అన్ని జంతువుల రుచి చూసినాను గానీ, పిల్లి మాంసం మాత్రం ఎప్పుడూ రుచి చూడలేదు. ఇక దీనితో పనిలేదు కాబట్టి ఈ రోజుతో ఈ కోరిక గూడా తీర్చేసుకోవాల" అనుకోనింది. అంతే... ఒక్కసారిగా ఎగిరి పిల్లి మీదకు దుంకింది.



మొదటి నుంచీ పులి మీద అనుమానంతోనే వున్న పిల్లి దాని చూపుల్ని పసిగట్టింది. అంతే... ఛటుక్కున ఎగిరి పక్కకు దుంకింది. పులి దగ్గరకు వచ్చేసరికి మెరుపులా ఆడే వున్న ఒక చెట్టుపైకి సరసరసర ఎక్కేసింది. పులిగూడా వేగంగా చెట్టు దగ్గరికి వచ్చేసింది గానీ పైకి ఎక్కలేక ఆన్నే నిలబడిపోయింది.

పిల్లి నవ్వుతా "నీగురించి నాకు ముందు నుంచీ అనుమానంగానే వుంది. నువ్వు నాకన్నా బలవంతురాలివి. అందుకే అన్నీ నేర్పానుగానీ చెట్లు ఎక్కడం మాత్రం నేర్పలేదు. గురువులకే పంగనామాలు పెట్టే నీలాంటి శిష్యుల పట్ల ఆ మాత్రం జాగ్రత్త లేకుంటే ఎట్లా" అనింది.

పులి కోపంతో చెట్టును వాడిగోళ్ళతో రపారపా కొట్టింది. గాండ్రు గాండ్రుమని గాండ్రించింది. "సరే ఎంతకాలం అట్లా పైపైన తప్పించుకోని తిరుగుతావో నేనూ చూస్తా... ఏదో ఒకరోజు కిందకు దిగకపోతావా... నా పంజాకు చిక్కకపోతావా" అంటూ వెనుదిరిగింది.

దాంతో పిల్లికి చెట్టు దిగాలంటేనే భయమేసింది. ఏమూల నుంచి ఎప్పుడు పులి వచ్చి మీద పడతాదో తెలీదు. దాంతో ఇక ఆ అడవిలో వుంటే ప్రమాదమే అనుకోనింది. రాత్రికి రాత్రే చెట్టు మీద నుండి చెట్టు మీదకు దుంకుతా పక్కనే వున్న గ్రామానికి చేరుకోనింది. ఇక నుంచీ ఈ మనుషులతోనే నా బతుకు అనుకోనింది. అంతే... ఆరోజు నుంచీ పులులు అడవుల్లో, పిల్లులు ఊర్లలో స్థిరపడిపోయినాయి.

# 82 దోసకాయల దొంగ నక్క

ఒకూర్లో ఒక రైతున్నాడు. ఆయన పొలంలో దోసకాయ విత్తనాలు వేసినాడు. వానలు బాగా పడడంతో కొన్ని రోజుల్లోనే తోటలో దోసకాయలు బాగా కాసినాయి. అది చూసి రైతు ఎంతో సంబరపన్నాడు. కానీ ఆ ఆనందం ఎక్కువ కాలం నిలబల్లేదు.

ఆ వూరిని ఆనుకుని ఒక పెద్ద అడవి వుంది. ఆ అడవిలో ఒక నక్కుంది. దానికి దోసకాయలంటే చానా ఇష్టం. రోజూ రాత్రి చీకటి పడగానే దొంగచాటుగా తోటలోనికి పోయి మంచి మంచి దోసకాయల్ని కడుపు నిండా తిని, తన పెండ్లాం, బిడ్డల కోసం మిగతావన్నీ కోసుకోని ఒక సంచి నిండా వేసుకోని వెళ్ళిపోయేది.

పొద్దున్నే రైతొచ్చి చూస్తే ఇంకేముంది. తోటలో ఒక్క దోసకాయ గూడా కనబడేది కాదు. ప్రతిరోజూ అంతే... కాసిన కాయలు కాసినట్టు నక్క ఎత్తుకోని పోయేది. దాంతో రైతు కట్టె తీసుకోని రాత్రిపూట చేనుకి కాపలా కాయడం మొదలుపెట్టినాడు. కానీ పాపం ఎంతసేపని మేలుకోగలడు. ఏదో ఒక సమయంలో నిద్రొచ్చి కళ్ళు మూసుకోని పోతాయి గదా. అంతే...అందుకోసమే ఎదురుచూస్తా వున్న ఆ దొంగనక్క ఠక్కున లోపలికి దూకి రైతు మళ్ళా కళ్ళు తెరిచేసరికి కాయలన్నీ మాయం చేసేది.

ఇక ఇట్లాగైతే లాభం లేదనుకున్న రైతు బాగా ఆలోచించి చివరకు చిన్న చిన్న కత్తులు తీసుకోనొచ్చి, దోసకాయల చుట్టూ పెట్టి అవి కనబడకుండా ఎండుగడ్డి కప్పినాడు. మామూలుగానే ఆరోజు రాత్రిగూడా నక్క హుషారుగా ఈల వేసుకుంటా తోటకాడికి వచ్చింది. చూస్తే రైతు యాడా కనబడలేదు. ఈరోజు రైతు ఇంకా రాలేదేమో...వచ్చేలోగా అన్నీ తినేయాలనుకోని ఎగిరి తోటలోనికి దుంకింది. అంతే..కత్తులు సర్రున లోపలికి దిగబడినాయి. పాపం నక్క బాధతో విలవిలలాడిపోతా కుయ్యో... మొర్రో...అని ఏడుస్తా బెరబెరా తోట దాటి అడవిలోనికి వురికింది. దానికి కత్తులు గుచ్చుకున్నాయి గదా..ఒళ్ళంతా ఒగటే రక్తం కారిపోసాగింది. నడవలేక... నడవలేక నడవసాగింది. అట్లా కొంతదూరం పోగానే దానికి బాగా నీరసమొచ్చి ఒక బండ మీద కూలబడి అట్లాగే నిద్రపోయింది.

రక్తం ఎట్లుంటాది. ఎర్రగా...బంక బంకగా వుంటాది గదా. నక్క బండ మీద పడుకున్న కాసేపటికి రక్తం బాగా ఎండిపోయి దాని కడుపు బండకు అట్లనే అతుక్కోనిపోయింది. పొద్దున్నే నక్కకు మెలకువ వచ్చి లేద్దామంటే... ఇంకేముంది... అతుక్కోనిపోయింది గదా. లేవలేక పోయింది. ఎంత గింజుకులాడినా లాభం లేకపోయింది.



దాంతో ఇక లాభం లేదనుకోని ఆ నక్క కళ్ళనీళ్ళు పెట్టుకోని వానదేవున్ని తలచుకుంటా "భగవంతుడా... బుద్ధి గడ్డి తిని మంది సొమ్ముకు ఆశ పడినాను. ఇంకెప్పుడూ దొంగతనం చేయను. ఈ ఒక్కసారికి నన్ను కాపాడినావంటే ఏడు రాత్రులు మేలుకొని నీకు భజన చేస్తాను" అని మొక్కుకోనింది. అది విన్న వానదేవుడు సరేనని పెద్ద వాన కురిపించినాడు. నీళ్ళు బాగా తగిలీ తగిలీ రక్తమంతా కరిగిపోయింది. దాంతో ఆ నక్క బైటపడి బతుకుజీవుడా అనుకుంటా పరుగెత్తుకోని ఇంటికి చేరుకోనింది.

పెండ్లాం బిడ్డలకు జరిగిందంతా చెప్పి మొక్కు తీర్చుకోకుంటే దేవునికి కోపమొస్తాది. ఎట్లాగైనా మొక్కు తీర్చుకోవాల అనింది. పెండ్లాం బిడ్డలు కూడా సరే అన్నాయి. కానీ భజన చేయాలంటే తాళాలు కావాలి గదా. తాళాలంటే ఇంటికి వేసేవి కాదు. దేవుని దగ్గర ఒకడు పాడుతావుంటే పక్కనే కూర్చోని ఇంకొకడు పాటకు తగ్గట్లు రెండు చేతుల్తోనూ పట్టుకొని ఠప్..ఠప్.. అని కొడతావుంటాడు చూడు అవి. ఆ తాళాలు దాన్ల దగ్గర లేవు. చుట్టుపక్కల ఎవరిని అడిగినా మా దగ్గర లేవంటే మా దగ్గర లేవన్నారు. మరి ఎట్లాగబ్బా అని ఆలోచించీ... ఆలోచించీ... చివరకు ఒక ఉపాయం పన్నినాయి.

అడవిలో నక్క, నక్క పెండ్లాం దారి పక్కన ఒక పొదలమాటున కూచోని వచ్చే పోయే జనాలను బాగా గమనించసాగినాయి. కాసేపటికి ఒకడు పక్క వూరిలో భజన చేసి తాళాలు పట్టుకోని వస్తా కనబన్నాడు. వెంటనే ఒక నక్క దారిలో వానికి కనబడేటట్లుగా ఒకచోట చచ్చిందాని మాదిరి పడిపోయింది. వాడు వస్తా వస్తా ఆ నక్కను చూచి "ఇదేదో ఇప్పుడే చచ్చినట్లుంది. వెంటనే తీస్కోని పోయి నేనూ, నా పెండ్లాం బిడ్డలు బాగా కూర వండుకోని తినొచ్చు" అనుకోని లొట్టలేసుకుంటా తాళాలు కిందపెట్టి దాని దగ్గరకు పోయినాడు.

వాడు తాళాలు కింద పెట్టి అట్లా వెళ్ళడం ఆలస్యం నక్క పెండ్లాం వెనుకనుండి ఎగిరి దుంకి దాన్లను నోట కరచుకోని "వూ" అంటూ ఈల వేస్తా పారిపోయింది. ఆ అరుపు వినబడగానే అంతవరకూ చచ్చిందానిలెక్క గమ్మున పడున్న నక్క ఛటుక్కున పైకి లేచి పారిపోయింది. వాడు ఆచ్చర్యపోయి తిరిగి చూస్తే ఇంగేముంది. తాళాలు గూడా లేవు. దాంతో వాడు లబోదిబోమని ఏడుస్తా ఇంటికి వెళ్ళిపోయినాడు.

నక్క, నక్క పెండ్లాం దేవునికి మొక్కుకున్నట్లుగా గుడికి పోయి వరుసగా ఏడు రాత్రులు భజన చేసి, తమ మొక్కును చెల్లించుకున్నాయి.

# 83 మంత్రాల మర్రిచెట్టు

ఒకూర్లో ఎల్లన్నని ఒకడుండేటోడు. వాడు ఏ పనీ చేసేటోడు గాదు. ఎప్పుడు చూడు అల్లరిచిల్లరగా తిరుగుతా, వాళ్ళతో వీళ్ళతో గొడవలు పడతా, దొంగతనాలు చేస్తా బతికేటోడు.

వాళ్ళూరికి ఒకరోజు ఒక ముని వచ్చినాడు. ఆ మునికి చానా మహిమలున్నాయని వూరంతా గొప్పగా చెప్పుకొనేటోళ్ళు. అందుకే జనాలంతా కుప్పలు తెప్పలుగా వచ్చి ఆయన ఆశీర్వాదం తీసుకోని పోయేటోళ్ళు.

ఎల్లన్నగాడు అదంతా చూసి "ఈ ముని దగ్గర నిజంగానే మంచి మహిమలున్నట్టున్నాయి. ఎట్లాగైనా సరే ఏ పనీ చేయకుండా కావాల్సినవన్నీ క్షణాల్లో చేతికందే మంత్రం ఏదైనా వుంటే కనుక్కోవాల" అనుకున్నాడు.

ఆరోజు రాత్రి వూరంతా నిద్రపోయినాక మట్టసంగా ముని వున్న ఇంట్లోకి దూరినాడు. నిద్రపోతా వున్న మునిని లేపి, కత్తి మెడ మీద పెట్టి "చూడు సామీ! నేనంత మంచోన్ని కాను. చానా చానా దుర్మార్గున్ని. నేనేం కోరుకుంటే అది క్షణాల్లో నా దగ్గరికి చేరే మంత్రం మర్యాదగా చెప్పు. లేకుంటే నిన్ను ఈన్నే పొడిచి చంపేస్తా" అని భయపడిచ్చినాడు.

దానికా ముని చిరునవ్వు నవ్వి "చూడు నాయనా! మనిషి పుట్టుక పుట్టినాక సొంతంగా సంపాదిచ్చుకోని బతకాలగానీ ఇట్లా తేరగా వచ్చేదాండ్ల గురించి ఆలోచించకూడదు. దురాశ మంచిదిగాదు. నా మాటిని ఈ దొంగతనాలు మాని హాయిగా ఏదయినా పని చేసుకోని బతుకుపో" అన్నాడు.

దానికి వాడు కోపంగా "ఏంది సామీ! మర్యాదగా అడుగుతా వున్నా కదాని నాకే నీతులు చెబ్తా వున్నావా, వెంటనే మంత్రం చెబ్తావా, కసుక్కున పొడిచేయమంటావా" అన్నాడు కత్తి పైకెత్తి.

అప్పుడా ముని కాస్త ఆలోచించి "నీ కర్మ. చెబ్తా విను. ఈడికి పక్కనే ఒక అడవుంది గదా... దాంట్లో చక్కగా మూడుమైళ్ళు పో, ఆడ ఒక చిన్న గుడుంటాది, అన్నుండి తూర్పుదిక్కుకు తిరిగి చక్కగ మరో మూడుమైళ్ళు పో, ఆడ ఒక పెద్ద మర్రిచెట్టు కనబడ్తాది. అది మామూలు మర్రిచెట్టు కాదు. కోరికలు తీర్చే కామధేనువు లాంటి మంత్రాల మర్రిచెట్టు. నువ్వు మంచి కోరుకుంటే మంచి జరుగుతాది. చెడు కోరుకుంటే చెడు జరుగుతాది. జాగ్రత్త" అని చెప్పినాడు. దానికి ఎల్లన్న "నువ్వు చెప్పినట్టే పోతావున్నా కానీ నువ్వు చెప్పినేది అబద్ధమనుకో, మళ్ళా వచ్చి నీ అంతు తేలుస్తా" అని బెదిరిచ్చి బైలుదేరినాడు. దొంగోడు పొద్దున్నే అడవికి చేరుకోని చక్కగా ఒక మూడుమైళ్ళు పోగానే ముని చెప్పినట్టుగానే ఒక చిన్నగుడి కనబడింది. అన్నించి వుత్తరం దిక్కుకు తిరిగి మళ్ళా కిందా మీదా పడతా మూడుమైళ్ళు నడవగానే ఒక మర్రిచెట్టు కనబడింది.

వాడా చెట్టు కింద నిలబడి "నడిచీ నడిచీ ఒళ్ళంతా చెమటలు పట్టినాయి, ఈడ గనుక ఒక చెరువుంటే ఎంత బాగుండు. హాయిగా స్నానం చేస్తా వుంటి" అనుకున్నాడు. వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం, ఠక్కున ఎదురుగా ఒక పెద్ద చెరువు ప్రత్యక్షమయ్యింది.



ఎల్లన్న ఆ చెరువును చూసి ఆశ్చర్యపోయి "ఐతే ఇదేనన్నమాట ఆ ముని చెప్పిన మంత్రాల మర్రిచెట్టు" అనుకోని సంబరంగా చెరువులో దూకి బాగా ఈత కొట్టి, స్నానం చేసి ఆ చెట్టు కిందికి వచ్చినాడు. వచ్చి "వేసుకోడానికి మాంచి ఖరీదైన బట్టలుంటే ఎంత బాగుండు" అనుకున్నాడు. వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం ఠక్కున మంచి మంచి పట్టుబట్టలు ఆడ ప్రత్యక్షమయినాయి. వాడు సంబరంగా అవి వేసుకున్నాడు.

వాడు చానా దూరం నుంచి నడిచి వచ్చినాడు గదా... దాంతో బాగా ఆకలేయసాగింది. "కడుపు నకనకలాడిపోతా వుంది. మాంచి విందు భోజనం దొరికితే ఎంత బాగుండు" అనుకున్నాడు. వాడట్లా అనుకోవడం ఆలస్యం పండ్లు, తినుబండారాలు, తాంబూలాలు... ఒక్కటేమిటి లోకంలో యాడాడ వున్నవన్నీ క్షణంలో వాని ముందు ప్రత్యక్షమైనాయి. వాడు ఆనందంగా వానికిష్టమైనవన్నీ బాగా తిన్నాడు. అప్పటికే సాయంకాలమైపోయింది.

దాంతో వాడు "నాకు మోయలేనంత బంగారం, వజ్రాలు దొరికితే ఎంత బాగుండు. హాయిగా జీవితమంతా కాలు మీద కాలేసుకోని బతుకుతుతా వుంటి గదా" అనుకున్నాడు. వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం వాని ముందు కుప్పలు కుప్పలుగా బంగారం, వజ్రాలు, వైఢూర్యాలు, మణులు, మాణిక్యాలు ధగధగా మెరిసిపోతా ప్రత్యక్షమయినాయి. వాడు ఆనందంతో ఏవి తీసుకుపోవాల్నో అర్థంగాక అన్నీ సంచులు, సంచులు నింపుకోసాగినాడు. అట్లా అన్నీ నింపుకొనేసరికి బాగా చీకటి పడింది. చీకట్లో అడవిలో పోవడం అంత మంచిది కాదు గదా, దాంతో ఆన్నే పండుకోని పొద్దున్నే పోదామనుకోని 'హాయిగా పండుకోడానికి ఒక మెత్తని పరుపు, మంచం వుంటే ఎంత బాగుండు' అనుకున్నాడు. వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం ఠక్కున మెత్తని హంసతూలికా తల్పం ప్రత్యక్షమయింది. వాడు ఎగిరి దాని మీదికి దుంకి హాయిగా పడుకున్నాడు.

అది అడవి గదా, దూరం నుండి జంతువుల అరుపులు వానికి వినబడసాగినాయి. దాంతో వానికి భయమేసి 'కొంపదీసి నిద్రపోతా వున్నప్పుడు ఏ పులో వచ్చి మీద పడి నన్ను తినదు గదా" అనుకున్నాడు. వాడట్లా మనసులో అనుకోవడం ఆలస్యం, ఠక్కున ఒక పులి ప్రత్యక్షమై ఎగిరి వాని మీదికి దుంకి చంపి తినేసింది.

# 84 చిటికెల పందిరి

ఒకూర్లో ఒక పరమ పిసినారి వుండేటోడు. వాడు ఎంగిలి చేత్తో కాకిని గూడా తరమని రకం. ప్రతిపైసాను పదిసార్లు ముందుకూ వెనక్కూ ఆలోచించి ఖర్చు పెడతాడు. ఎదుటివాడు చస్తా వున్నా ఒక్కపైసా గూడా దానం చేసేటోడు కాదు.

ఆ పిసినారి ఒకసారి జొన్నచేను వేసినాడు. వూరంతా మొక్కలు మోకాలంత ఎత్తు పెరిగినాయి. అది చూసి జనాలంతా ఈసారి పంటలు విరగబడి కాస్తాయని సంబరపన్నారు. కానీ ఆ తరువాత ఒక్కవాన గూడా పల్లేదు. రైతులు విలవిలలాడిపోయినారు. కనబన్న దేవునికల్లా మొక్కులు మొక్కుతా వున్నారు. ఆ వూరిబైట ఒక ఆంజనేయ సామి గుడుంది. ఆ సామికి చానా మహత్తులున్నాయని జనాలంతా అనుకుంటా వుంటారు. పిసినారి ఆ గుడికి పోయి అందరూ చూస్తా వుండగానే "సామీ... సామీ... నా చేను గనుక పండితే ఇంతవరకూ ఈ భూమ్మీద ఎవరూ వేయని విధంగా నీకు చిటికెల పందిరి వేయిస్తా... ఎట్లాగైనా సరే నా పంటను కాపాడు సామీ" అని మొక్కుకున్నాడు.

ఆంజనేయసామి ఆలోచనలో పడినాడు. తమలపాకుల పందిరి తెలుసు, అరిటాకుల పందిరి తెలుసు, మామిడాకుల పందిరి తెలుసు, మల్లెపూల పందిరి తెలుసు... కానీ ఈ చిటికెల పందిరంటే ఏమి.... ఎప్పుడూ వినలేదు. కనలేదు. ఇదేందో చూసి తీరాల్సిందే అనుకోని వెంటనే నింగినేలా ఏకమయ్యేటట్లు, భూమమ్మ తడిసి ముద్దయ్యేటట్లు, వాగులు వంకలు వురుకులాడేటట్లు, ఇండ్లపై దోనెలు ఎక్కి కారేటట్లు... బ్రమ్మాండమైన వాన కురిపించినాడు. ఆ దెబ్బకు భూమి బాగా పదునెక్కింది. పడుకున్న మొక్కలు కాస్తా పైకి లేసి నిటారుగా నిలబన్నాయి. దాంతో అందరూ ఆ పిసినారి దగ్గరకు పోయి "నీవు మొక్కుకున్నట్లే వానలు కురిసినాయి. మొక్కలు బతికినాయి. సామికి వెంటనే మొక్కు తీర్చు. లేకుంటే కోపమొస్తాది" అన్నారు.

ఆ మాటలకు పిసినారి "ఆ... ఏం... నా ఒక్క చేను మీదే కురిపించినాడా వాన. అందరి చేల మీదా ఎంత పడిందో నా చేను మీదా అంతే పడింది. అట్లాంటప్పుడు నేను మొక్కినందుకే వాన కురిసిందని ఎట్లా నమ్మడం. మీరు గూడా రకరకాల మొక్కులు మొక్కినారు గదా.... దాండ్లకి కురిసి వుండొచ్చు గదా.... ఇదిగో... వూళ్ళో ఎవరికీ పండనంత పంట నాకు పండితే అప్పుడు నమ్ముతా ఆంజనేయసామి మహత్తు. ఆరోజు పోయి మొక్కుకున్నట్లే చిటికెల పందిరి వేస్తా" అన్నాడు.

ఆంజనేయసామికి ఆ పిసినారి చెప్పింది గూడా నిజమే గదా అనిపించింది. దాంతో చిటికెల పందిరి ఎట్లా వుంటాదో అనే ఆశతో ఆ వూర్లోనే గాదు ఏడేడు పధ్నాలుగు లోకాల్లో యాడా పండనంత పంటను ఆ చేలో పండించినాడు. అందరూ విరగ కాసిన ఆ చేనుని చూసి "ఆహా.... ఏమి ఆంజనేయసామి మహిమ" అంటా ఆచ్చర్యపోయినారు. పిసినారికి పంట అమ్మితే అందరి కన్నా పదింతలు లాభం వచ్చింది.

దాంతో వూరోళ్ళందరూ ఆయన దగ్గరికి పోయి "ఏమయ్యా నీవు మొక్కుకున్నట్లే ఆంజనేయసామి నీ చేలో బంగారంలాంటి పంట పండించినాడు. కాబట్టి మొక్కు తీర్చు. మాకు గూడా ఆ చిటికెల పందిరి ఎట్లా వుంటాదో చూడాలని ఒకటే ఇదిగా వుంది" అన్నారు.

"సరే.... ఐతే ఈ అమాసకు మొక్కు చెల్లిస్తాలే" అన్నాడు పిసినారి.

అమాస రానే వచ్చింది. వూరు వూరంతా ఈ చిటికెల పందిరి ఎట్లా వుంటాదో చూద్దామని యాడి పనులు ఆడే వదిలేసి పరుగుపరుగున గుడికాడికి వచ్చినారు. ఆంజనేయసామి గూడా ఆ పిసినారి ఎప్పుడు వస్తాడా... పందిరి ఎట్లా వేస్తాడా అని ఎదురుచూడసాగినాడు. పిసినారి పొద్దున్నే లేచి బాగా తలస్నానం చేసి, నుదుటన కుంకుమబొట్టు పెట్టుకోని, వుతికిన బట్టలు వేసుకోని, వుత్త చేతులూపుకుంటా గుడికి బైలుదేరినాడు. జనాలంతా అది చూసి "ఇదేందిరా వీడు ఏమీ లేకుండా వూపుకుంటా వస్తా వున్నాడు. ఎట్లా వేస్తాడు పందిరి" అని గొణుక్కోసాగినారు.

ఆ పిసినారి సక్కగా పోయి ఆంజనేయసామి బొమ్మ ముందు నిలబడి "సామీ.... నేను కోరుకున్నట్లే ఎవరికీ పండనంత పంట పండించినావు. అందుకే నేను మొక్కుకున్నట్టే చిటికెల పందిరి వేస్తా వున్నా చూడు" అన్నాడు. ఆంజనేయసామితో బాటు జనాలంతా వూపిరి బిగపట్టి చూడసాగినారు. వాడేం చేస్తాడా అని.

పిసినారి ఒక మూల నిలబడి "సామీ... ఇదిగో ఇది దక్షిణం వైపు పందిరి గుంజ అంటూ కింది నుంచి పైవరకూ వరుసగా చిటికెలు వేస్తా చేయి పైకి లేపినాడు. ఇదిగో ఇది తూర్పు, ఇది పడమర, ఇది ఉత్తరం అంటూ నాలుగువైపులా కింది నుంచి పైవరకూ చిటికెలు వేసినాడు. వేసి, సామీ... చిటికెలతో నాలుగువైపులా పందిరి గుంజలు వేసినాను. ఇక వాటిని ఒకదాన్ని మరొకదానితో కలుపుతా పందిరేస్తా వున్నా చూడు అంటూ ఒక గుంజ నుండి మరొక గుంజకు, మరొక గుంజ నుండి ఇంకొక గుంజకు పైన చిటికెలు వేస్తా కలుపుకుంటా పోయినాడు. అట్లా అన్నివైపులా చిటికెలు వేసి ఇదిగో సామీ... బాగా చూడు.... ఇదే చిటికెల పందిరి. ఇంతవరకూ ఈ భూమ్మీద ఎవ్వరూ వేయని పందిరి వేసి, నా మొక్కు చెల్లించా... వస్తా...." అంటూ దండం పెట్టుకోని వెనక్కి తిరిగి వెళ్ళిపోయినాడు. అది చూసి జనాలంతా నోళ్ళు వెల్లబెట్టినారు.

ఆ దెబ్బకు ఆంజనేయసామి మొగం నల్లగా మాడిపోయింది. "అరెరే... చిటికెల పందిరంటే ఎట్లా వుంటాదో ఏమో అనుకుంటిగానీ ఇదా.... ఐనా వీడు పెద్ద పిసినారని తెలిసీ వాని మాటలు నమ్మినందుకు బాగానే శాస్తి జరిగింది. దేవునికే పంగనామాలు పెట్టడమంటే ఇదే కాబోలు" అనుకుంటా మట్టసంగా వుండిపోయినాడు.

# 85 నువ్వు చెప్పిందే నే చేస్తా

ఒకూర్లో ఒక పిల్లోడుండేటోడు. వాడు చానా అమాయకుడు. చెప్పింది చెప్పినట్టు చేయడమే తప్ప కొంచంగూడా సొంతంగా ఆలోచించేటోడు కాదు. ఒకరోజు వాళ్ళమ్మ వానికి డబ్బులిచ్చి "రేయ్... సంతకు పోయి బఠానీలు తేపోరా" అని పంపించింది. వాడు చేతుల నిండా బఠానీలు పోపిచ్చుకోని వస్తా వుంటే దారిలోనే సగానికి సగం పడిపోయినాయి. అది చూసి వాళ్ళ నాయన "ఒరే... ఏవయినా ఇస్తే అట్లా చేతిలో పట్టుకోని రాగూడదురా, జేబులో పోసుకోని రావాల" అని చెప్పినాడు. ఒకరోజు వాళ్ళమ్మ వాన్ని పిల్చి "రేయ్... అంగడికి పోయి పాలు తేపోరా" అని పంపిచ్చింది. ఏవయినా ఇస్తే జేబులో వేసుకొని రావాల అని వాళ్ళ నాయన చెప్పినాడు గదా. దాంతో వాడు అంగడోడు ఎంత చెప్పినా వినకుండా పాలన్నీ జేబులో పోపిచ్చుకోని వచ్చినాడు. దాంతో దార్లోనే అన్నీ కారిపోయినాయి. అది చూసి వాళ్ళ నాయన "ఒరే... ఏవయినా ఇస్తే అట్లా జేబులో పోసుకోని రాగూడదురా. గిన్నెలో వేసుకోని పడిపోకుండా మూతబెట్టుకోని రావాల" అని చెప్పినాడు.

ఒకరోజు వాళ్ళమ్మ వాన్ని పిలిచి "రేయ్... సంతకు పోయి కోడిని కొనుక్కోని రాపోరా" అని పంపిచ్చింది. ఏవయినా తెచ్చేటప్పుడు గిన్నెలో వేసుకోని రావాల అని వాళ్ళ నాయన చెప్పినాడు గదా. దాంతో వాడు కోడిని గిన్నెలో వేసుకోని పైన మూత పెట్టుకోని వచ్చినాడు. దాంతో ఇంకేముంది పాపం అది వూపిరాడక లోపల్నే చచ్చిపోయింది. అది చూసి వాళ్ళ నాయన "ఒరే... ఏవయినా తెచ్చేటప్పుడు అట్లా గిన్నెలో వేసి మూత పెట్టుకోని రాగూడదురా, మెడకు తాడుకట్టి గుంజుకోని రావాల" అని చెప్పినాడు.

ఒకరోజు వాళ్ళమ్మ వాన్ని పిలిచి "రేయ్... పక్క సందులో వుండే మీ అవ్వని పిలుచుకోని రాపో. కొంచెం పనుంది" అని పంపిచ్చింది. ఏవయినా తెచ్చేటప్పుడు మెడకు తాడు కట్టుకోని గుంజుకోని రావాలని వాళ్ళ నాయన చెప్పినాడు గదా. దాంతో వాడు ఒక తాడు తీసుకోని వాళ్ళవ్వ 'నేనొస్తాలేరా' అని మొత్తుకుంటావున్నా వినకుండా, మెడకు తాడు కట్టి బరబరబర ఈడ్చుకోని వచ్చినాడు. అది చూసి వాళ్ళ నాయన "ఒరే..ఎవరయినా మనుషులు కనబడితే అట్లా ఈడ్చుకోని రాగూడదురా... రండి రండి దయచేయండి అంటూ వాళ్ళని లోపలికి పిలిచి మర్యాదలు చేయాల" అని చెప్పినాడు.

ఒకరోజు వాళ్ళమ్మా నాయనా పనుండి బైటకు పోతా "ఒరే మేమొచ్చేసరికి బాగా చీకటి పడతాది. నువ్వు ఇంట్లోనే హాయిగా ఆడుకుంటా ఆకలైతే అన్నం తిని పండుకో. మేము బైట తాళమేసుకోని పోతాము" అని చెప్పి వాళ్ళు తాళమేసుకోని పోయినారు. వాళ్ళట్లా పోయిన కాసేపటికే కొందరు దొంగలు ధనాధనా తాళం పగులగొట్టి లోపలికి వచ్చినారు. వాళ్ళ నాయన ఎవరయినా మనుషులు కనబడితే "రండి... రండి... దయచేయండి అంటూ

పిలిచి మర్యాదలు చేయమన్నాడుగదా'' దాంతో వాడు ఆ దొంగలను చూస్తానే "రండి... రండి..." అంటూ లోపలికి పిలిచి, కూర్చోవడానికి కుర్చీలు వేసినాడు. వీడెవడో తిక్కలోనిలెక్క వున్నాడే అనుకుంటా దొంగలు వానికి ఆమాటా ఈమాటా చెబుతా ఇంట్లో వున్న విలువయిన వసువులన్నీ మూటగట్టి మొత్తం ఎత్తుకపోయినారు. అది తెలిసి వాళ్ళ నాయన నెత్తీనోరు కొట్టుకుంటా "ఒరే... ఎవరయినా అట్లా తాళం పగులగొడతా వుంటే లోపలికి రమ్మనగూడదురా... తలుపు వెనకాల దాచిపెట్టుకోని రోకలి బండతో వాళ్ళ నెత్తులు పగులగొట్టాల'' అని చెప్పినాడు.



ఇంకొకరోజు వాళ్లమ్మా నాయన పనిబడి పక్కూరికి పోతా వాన్ని ఇంట్లోనే వుండమని చెప్పి బైట తాళమేసుకోని పోయినారు. పనయిపోయి తిరిగి వచ్చేసరికి బాగా చీకటి పడింది. తాళం తీద్దామని చూస్తే తాళం చెవి కనబడలేదు. ఎంత వెదికినా దొరకలేదు. దాంతో లాభం లేదనుకోని పెద్దరాయి తీసుకోనొచ్చి వాళ్ళ నాయన ధనాధనామని తాళం పగులగొట్టసాగినాడు. ఆ చప్పుడుకి వాడు అదిరిపడి లేచినాడు. వాళ్ళ నాయన ఎవరయినా తాళం పగులగొడతా వుంటే వూరికే వుండగూడదు. తలుపు చాటున దాచిపెట్టుకోని రోకలిబండతో వచ్చినోన్ని వచ్చినట్టు తల పగిలేలా కొట్టాల అని చెప్పినాడు గదా. దాంతో బెరబెరా వంటింట్లోకి పోయి పెద్ద రోకలిబండ తీసుకోని తలుపు చాటున నిలబడినాడు. ఆ సంగతి తెలీని వాళ్ళ నాయన తాళం పగలగొట్టి లోపలికి వచ్చినాడు.

అంతే... వాడు ధనధనధనమని తలుపుచాటు నుండి రోకలి బండతో నాలుగు పెరికినాడు. ఆ దెబ్బకు వాళ్ళ నాయన 'అబ్బా... అమ్మా' అంటూ కుప్పకూలిపోయినాడు.

# 86 పిచికకథ

ఒకూర్లో ఒక పిచిక వుండేది. అది ఒకరోజు వూరిబైటున్న చేనులో గింజలు బెరబెరా తింటా వుంటే... అనుకోకుండా దాని ముక్కుకి ఒక ముల్లు గుచ్చుకోనింది. మన మాదిరి దానికి చేతులుండవు గదా... దాంతో ఆ పిచిక ముల్లును పీక్కోలేక బాధతో విలవిలలాడతా ఒక మంగలాయన దగ్గరికి పోయి...


"మంగలాయనా.... మంగలాయనా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. కొంచం తీయవా" అనడిగింది. దానికా మంగలాయన "నీకు ముల్లు పీకడం తప్ప నాకింకేం పని లేదనుకుంటున్నావా... ఫోఫో... ఈన్నించి" అని కసురుకున్నాడు.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... ఆవూరి రాజుకాడికి పోయి "రాజా.. రాజా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. నువ్వా మంగలాయన్ని మక్కెలిరగ తన్ను" అనింది. దానికా రాజు "మా మంగలాయన్ని నేనెందుకు తంతాను. తన్నను ఫో" అన్నాడు.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... అడవిలోని జింకలకాడికి పోయి "జింకలారా... జింకలారా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజుకాడికిపోయి ఆ మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. మీరు పోయి రాజు వేసిన పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేసేయండి" అనింది. అప్పుడా జింకలు "మారాజు వేసిన పూలతోటల్ని మేమెందుకు నాశనం చేస్తాం. చేయం ఫో" అన్నాయి.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా.. వేటగానికాడికి పోయి "వేటగాడా... వేటగాడా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజుకాడికి పోయి మంగలోన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజు వేసిన పూలతోటలన్నీ నాశనం చేయమంటే చేయలేదు. నువ్వు పోయి ఆ జింకల్ని బాణంతో ఒక కొట్టు కొట్టూ" అనింది. అపుడా వేటగాడు "మా జింకల్ని నేనెందుకు బాణంతో కొడ్తాను. కొట్టను ఫో" అన్నాడు.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా ఎలుకకాడికి పోయి "ఎలకా... ఎలకా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజుకాడికి పోయి మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజు వేసిన పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేయమంటే చేయలేదు. వేటగానికాడికి పోయి బాణంతో జింకల్ని ఒక్కదెబ్బ కొట్టమంటే



కొట్టలేదు. నువ్వు పోయి ఆ వేటగాని వలలన్నీ కొరికి కొరికి పాడేయి" అనింది. అప్పుడా ఎలుక "మా వేటగాని వలల్ని నేనెందుకు నాశనం చేస్తాను. చేయను ఫో" అనింది.

అప్పుడు ఆ పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... పిల్లికాడికి పోయి "పిల్లీ... పిల్లీ.... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజుకాడికి పోయి మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజు వేసిన పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేయమంటే చేయలేదు. వేటగానికాడికి పోయి బాణంతో జింకల్ని ఒక్కదెబ్బ కొట్టమంటే కొట్టలేదు. ఎలుకకాడికి పోయి వేటగాని వలల్ని నాశనం చేయమంటే చేయలేదు. నువ్వు పోయి ఆ ఎలుకను ఒక్క కొరుకు కొరుకు" అనింది. అప్పుడా పిల్లి "మా ఎలుకను నేనెందుకు కొరుకుతాను. కొరకను ఫో" అనింది.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... అవ్వకాడికి పోయి "అవ్వా... అవ్వా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజు దగ్గరికి పోయి మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజు వేసిన పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేయమంటే చేయలేదు. వేటగానికాడికి పోయి బాణంతో జింకల్ని ఒక్కదెబ్బ కొట్టమంటే కొట్టలేదు. ఎలుకకాడికి పోయి వేటగాని వలల్ని నాశనం చేయమంటే చేయలేదు. పిల్లికాడికి పోయి ఆ ఎలుకను ఒక్క కొరుకు కొరకమంటే కొరకలేదు. నువ్వు పోయి ఆ పిల్లిని ఒక్క పెరుకు పెరుకు" అనింది. అప్పుడా అవ్వ "మా పిల్లిని నేనెందుకు పెరుకుతాను. పెరకను ఫో" అనింది.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... ఆవుకాడికి పోయి "ఆవూ... ఆవూ... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజు దగ్గరికి పోయి మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజువేసిన పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేయమంటే చేయలేదు. వేటగానికాడికి పోయి బాణంతో జింకల్ని ఒక్కదెబ్బ కొట్టమంటే కొట్టలేదు. ఎలుకకాడికి పోయి వేటగాని వలల్ని నాశనం చేయమంటే చేయలేదు. పిల్లికాడికి పోయి ఎలుకను ఒక్క కొరుకు కొరకమంటే కొరకలేదు. ముసల్దానికాడికి పోయి పిల్లిని ఒక్క పెరుకు పెరకమంటే పెరకలేదు. నువ్వు నీ పాలు పిండడానికి వచ్చినపుడు ఆ ముసల్దాని మూతి మీద ఒక్క తన్ను తన్ను" అనింది. అపుడా ఆవు "మా ముసల్దాన్ని నేనెందుకు తంతాను. తన్నను ఫో" అనింది.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... దూడ దగ్గరికి పోయి "దూడా... దూడా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజు దగ్గరికి పోయి మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజుగారి పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేయమంటే చేయలేదు. వేటగానికాడికి పోయి బాణంతో జింకల్ని ఒక్కదెబ్బ కొట్టమంటే కొట్టలేదు. ఎలుకకాడికి పోయి వేటగాని వలల్ని నాశనం చేయమంటే చేయలేదు. పిల్లికాడికి పోయి ఆ ఎలుకను ఒక్క కొరుకు కొరకమంటే కొరకలేదు. ముసల్దానికాడికి పోయి పిల్లిని ఒక్క పెరుకు పెరకమంటే పెరకలేదు. ఆవుకాడికి పోయి పాలు పిండుతా వున్నప్పుడు ముసల్దాని మూతి మీద ఒక్క తన్ను తన్నమంటే తన్నలేదు. నువ్వు పోయి పాలు తాగుతా వున్నప్పుడు మీ అమ్మ పొదుగును ఒక్క కొరుకు కొరుకు" అనింది. అప్పుడా దూడ "మా అమ్మ పొదుగును నేనెందుకు కొరుకుతాను. కొరకను ఫో" అనింది.

అపుడా పిచిక ఎగురుకుంటా... ఎగురుకుంటా... ఒక కందిరీగకాడికి పోయి "కందిరీగా... కందిరీగా... బెరబెరా తింటా వుంటే ముక్కులో ముల్లిరుక్కోనింది. మంగలాయనకాడికి పోయి తియ్యమంటే తియ్యలేదు. రాజుకాడికి పోయి మంగలాయన్ని మక్కెలిరగ తన్నమంటే తన్నలేదు. జింకలకాడికి పోయి రాజుగారి పూలతోటలన్నీ పూర్తిగా నాశనం చేయమంటే చేయలేదు. వేటగానికాడికి పోయి బాణంతో జింకల్ని ఒక్కదెబ్బ కొట్టమంటే కొట్టలేదు. ఎలుకకాడికి పోయి వేటగాని వలల్ని నాశనం చేయమంటే చేయలేదు. పిల్లికాడికి పోయి ఆ ఎలుకను ఒక్క కొరుకు కొరకమంటే కొరకలేదు. ముసల్దానికాడికి పోయి పిల్లిని ఒక్క పెరుకు పెరకమంటే పెరకలేదు. ఆవుకాడికి పోయి పాలు పిండుతా వున్నప్పుడు ముసల్దాని మూతి మీద ఒక్క తన్ను తన్నమంటే తన్నలేదు. దూడ కాడికి పోయి పాలు తాగుతా వున్నప్పుడు మీ అమ్మ పొదుగును ఒక్క కొరుకు కొరకమంటే కొరకలేదు. నువ్వు పోయి ఆ దూడను గట్టిగా ఒక్క కుట్టు కుట్టూ" అనింది.

అపుడా కందిరీగ... "అరెరే... ముక్కులో ముల్లిరుక్కోని అప్పన్నించీ నువ్వింత బాధపడతా వున్నా... ఒక్కరు గూడా పట్టించుకోడం లేదా. వుండు వీళ్ళ పని చెబ్తా" అని ఎగురుకుంటా పోయి దూడ మూతి మీద వాలి గట్టిగా ఒక్క కుట్టు కుట్టింది.

అంతే... అది ఆ బాధకి విలవిలలాడతా వాళ్ళమ్మ పొదుగు కొరికేసింది. పొదుగు నొప్పి పెట్టి విలవిలలాడతా వుంటే పాలు పిండడానికి ముసల్దొచ్చేసరికి దానికి కోపమొచ్చి ఆమె మూతి మీద ఒక్క తన్ను తన్నింది. మూతి పళ్ళు రాలిపోయి బాధతో విలవిలలాడతా వున్న అవ్వ పాల కోసం వచ్చిన పిల్లిని చూసి కోపంతో ఒక్క పెరుకు పెరికింది. ఆ దెబ్బకి బాధతో విలవిలలాడతావున్న పిల్లి ఎలుక కనబడేసరికి దాన్ని ఒక్క కొరుకు కొరికింది. అంతే ఆ ఎలుక బాధతో విలవిలలాడతా పోయి వేటగాని వలలన్నీ సర్వనాశనం చేసేసింది. వలలన్నీ సర్వనాశనం కావడంతో కోపమొచ్చిన వేటగాడు బాణంతో జింకల్ని దబాదబా కొట్టినాడు. బాణాల దెబ్బకి విలవిలలాడిన జింకలు బాధతో పోయి రాజు వేసిన పూలతోటలన్నీ తొక్కి తొక్కి పెట్టినాయి. పూలతోటలన్నీ నాశనమయ్యేసరికి రాజుకు కోపమొచ్చి "ఏరా... పిచిక ముల్లు తీయమంటే తీయవా" అంటా మంగలాయన్ని ఒక్క తన్ను తన్నినాడు. అంతే.. ఆ దెబ్బకు వాడు వురుక్కుంటా వచ్చి పిచ్చిక ముక్కులో ముల్లు తీసేసినాడు.

# 87 పిరికి దయ్యం

ఒకూర్లో ఇద్దరు అన్నదమ్ములు వుండేటోళ్ళు. ఇద్దరూ చిన్నప్పటి నుంచీ కలసిమెలసి వుండేటోళ్ళు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయినాయి. పిల్లలూ పుట్నారు. చిన్నోడి పెండ్లాం బిడ్డలేమో చానా మంచోళ్ళు. ఎప్పుడూ పన్నెత్తి ప్రశ్నించేటోళ్ళు కాదు. కన్నెత్తి చూసేటోళ్ళు గాదు. ఏది చెబితే అది... ఇట్లా చెప్పడం ఆలస్యం అట్లా వురుక్కుంటా చేసేటోళ్ళు. కానీ పెద్దోని పెండ్లాం మాత్రం పెద్ద గయ్యాళిది. ఎప్పుడూ మొగునితోనూ, మరిదితోనూ, తోడికోడలితోనూ ఏదో ఒకదానికి వూకూకెనే కొట్లాట పెట్టుకొనేది. నోటికొచ్చినట్లల్లా తిట్టేది. దాంతో చిన్నోడు లాభం లేదనుకోని పెండ్లాం బిడ్డలతో కలసి వేరు కాపురం పెట్టాలనుకున్నాడు. కానీ అట్లా పోయేటప్పుడు ఇంట్లోంచి ఒక్క సామాను గూడా తీసుకోని పోకుండా పెద్దోని పెండ్లాం అడ్డం పడింది. దాని నోటికి భయపడి పెద్దోడు గూడా కిమ్మనకుండా కుక్కిన పేను లెక్క వుండిపోయినాడు. దాంతో చిన్నోడు కట్టుబట్టలతో చేతిలో పైసా గూడా లేకుండా బైటపడినాడు.

బతకాలంటే ఏదో ఒక పని చేసి పైసలు సంపాదించాలగదా. దాంతో పెండ్లాం బిడ్డలను తీసుకోని పక్కనే వున్న పెద్ద అడవిలోనికి బైలుదేరినాడు. అడవిలో పోతా వుంటే ఒకచోట ఒక పెద్ద మర్రిచెట్టు కనబడింది. దాని కింద వాళ్ళని కూచోబెట్టి పెండ్లాంతో "నేను పోయి చుట్టుపక్కల ఏవయినా మంచి చెట్లేమన్నా వున్నాయేమో చూసొస్తా. అంతలో నువ్వు అన్నం వండు" అన్నాడు. ఆమె సరేనని వెంటనే మూడు రాళ్ళు తీసుకోనొచ్చి పైన మూకుడు పెట్టి కింద మంట వెలిగించింది. చిన్నోడు చుట్టుపక్కల అంతా వెదికి ఒక చెట్టు కనబడితే దాన్ని నరికి ముక్కలు చేసి మరలా మర్రిచెట్టు దగ్గరికి వచ్చినాడు.

ఆ మర్రిచెట్టుపైన ఒక దయ్యం వుంది. అది ఉత్త పిరికిది. ఎవరైనా గట్టిగా ఒక్కరుపు అరిస్తే చాలు గజగజలాడిపోతాది. అది వీళ్ళని చూసి భయపడి చిటారుకొమ్మకు చేరి దాక్కోని చూడసాగింది. చిన్నోడు చెట్టు కింద కూర్చోని కొడుకుతో "రేయ్... పోయి ఆడ కట్టెలన్నీ తీసుకోనొచ్చి చిన్న చిన్న తుంటలు చేయి" అన్నాడు. వెంటనే వాడు "అట్లాగే నాయనా" అని వురుక్కుంటా పోయి కట్టెలన్నీ తీసుకోనొచ్చి చిన్న చిన్న ముక్కలుగా నరకసాగినాడు.

చిన్నోడు కూతురికేసి తిరిగి "పాపా... ఆ కట్టెలపైనున్న నార తీసి పక్కన పెట్టు. మంచి మంచి తాళ్ళు పేనుతాను" అన్నాడు. దానికా పాప "ఎందుకు నాన్నా తాళ్ళు" అనడిగింది. దానికి వాడు "చెట్టు మీద ఒకడున్నాడులే... వాన్ని కట్టి తీసుకుపోడానికి... ఐనా నీకెందుకే అవన్నీ... నోర్మూసుకోని చెప్పినపని చెయ్యక" అన్నాడు. నవ్వుతా వెంటనే ఆ పాప వురుక్కుంటా పోయి గబగబా నార తీసి అందించసాగింది. అది చూసి దయ్యం అదిరిపడింది.

"ఓరి నాయనోయ్... వీడు తాళ్ళు పేనుతా వున్నది నా కోసమేనా... అదీగాక వీడు ఏం చెబ్తే అది పెండ్లాం బిడ్డలు నోరెత్తకుండా చేస్తా వున్నారంటే వీడు మామూలోడు గాదు. ఎట్లాగో ఒకట్లా వీన్ని మంచి చేసుకోవాల. లేకుంటే కష్టం" అనుకోని ఆ తెలివిలేని దయ్యం గజగజగజ వణుక్కుంటా కిందికి దిగింది.




దయ్యాన్ని చూసి అందరూ అదిరిపోయినారు. కానీ అది గజగజా వణికి పోతా వుంది గదా. అది చూసి చిన్నోడు ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు. దయ్యం వణికిపోతా చేతులు కట్టుకోని "అయ్యా... నేను నీకేం అపకారం చేసినాను. నా చెట్టు కింద కూచున్నారు. వంట చేసుకున్నారు. అన్నం తిన్నారు. కట్టెలు కొట్టుకున్నారు. నేనేమన్నా అన్నానా. గమ్మున మూసుకోని వున్నా గదా. ఐనా నన్ను కట్టెయ్యడానికి తాళ్ళు పేనుతా వున్నారు. ఇది న్యాయమేనా" అనింది.

దాంతో చిన్నోనికి విషయమంతా అర్థమైంది. తానేదో తమాషాగా అంటే ఇది నిజమనుకోనింది అనుకోని "ఏయ్... దొరక్క దొరక్క దొరికినావు. నిన్ను వదిలే ప్రసక్తే లేదు. కట్టి వూర్లో పెద్దోళ్ళ దగ్గరికి తీసుకోని పోతే అందరూ మెచ్చుకోని తలా ఇంత వేసుకోని పెద్ద బహుమతే ఇస్తారు" అంటూ మరింత బెదిరించినాడు.

దానికా దయ్యం మరింతగా వణికిపోతా "వద్దొద్దు... అంతపని చెయ్యొద్దు. ఐనా వాళ్ళెంత ఇస్తారు. మహా అయితే పదివేలో ఇరవైవేలో ఇస్తారు... అంతే గదా... అదే నన్ను గనుక ఏమీ చెయ్యకపోతే ఈ మర్రి చెట్టు కింద ఏడు మూటల బంగారముంది. అందులో సగమిస్తా. కానీ మరలా ఎప్పుడూ ఇటువైపు రాగూడదు. సరేనా" అనింది. దానికి వాడు సరే అన్నాడు. దాంతో దయ్యం పోయి మూడున్నర మూటల బంగారం తీసుకోనొచ్చి వాని

ముందు కుప్ప పోసింది. వాడు సంబరంగా ఆ బంగారమంతా తీసుకోని వూరు చేరుకున్నాడు. దాంతో పెద్ద ఇండ్లు కట్టుకోని, నలభై ఎకరాల నీళ్ళు పారే పొలం కొనుక్కోని, పదిమంది పనివాళ్ళను పెట్టుకోని హాయిగా సేద్యం చేసుకుంటా కాలం గడపసాగినాడు.

వాని వైభోగం చూసి వదినకు కన్ను కుట్టింది. ఇదేందబ్బా వీడు వూపుకుంటా వుత్తచేతులతో పోయి నెల తిరిగేసరికల్లా పెద్ద జమీందారులెక్క తయారయినాడు. ఇందులో ఏదో కతుంటాది. కనుక్కోవాల" అనుకోని మొగున్ని పంపిచ్చింది. పెద్దోడొచ్చి అడిగేసరికి తమ్ముడు జరిగిందంతా పూసగుచ్చినట్టు వివరించినాడు.

తరువాతరోజు పెద్దోడు పెండ్లాం బిడ్డలను తీసుకోని అడవికి బైలుదేరినాడు. మర్రిచెట్టు పైనున్న దయ్యం వీన్ని చూసింది. "అరే... మరలా ఎవడో ఈ చెట్టు కిందకే వస్తా వున్నాడే... ఎందుకైనా మంచిది దాచిపెట్టుకోవాల" అనుకోని చిటారు కొమ్మకు చేరుకోనింది. వీడు సక్కగా ఆ మర్రిచెట్టు కిందికే చేరుకున్నాడు. నెమ్మదిగా తలెత్తి జాగ్రత్తగా పైకి చూసినాడు. చిటారు కొమ్మన దయ్యం కనబడింది. "ఆహా... తమ్ముడు చెప్పింది నిజమే... ఈ రోజు నా పంట పండినట్లే" అనుకున్నాడు.

పెద్దోడు పెండ్లాంకేసి తిరిగి "నేను పోయి యాడన్నా మంచి చెట్టుందేమో చూసొస్తా... అంతలోపు నువ్వు అన్నం చేసిపెట్టు" అన్నాడు. దానికామె "ఏందీ... ఈ అడవిలో అన్నం చేసి పెట్టాల్నా... భలే చెప్పినావులే... నువ్వే యాడయినా పండ్లో కాయలో వుంటే చూసి తెంపుకోనిరా... ఈ పూటకు అవే తిందాం" అనింది. వాడు పెండ్లాన్ని ఏమీ అనలేక పోయి ఒక మాంచి చెట్టు చూసి దాన్ని చిన్న చిన్న ముక్కలు చేసి మరలా మర్రిచెట్టు కిందకి వచ్చినాడు. వచ్చి కొడుకుతో "రేయ్... నీవు పోయి ఆ కట్టెలన్నీ తీసుకోనొచ్చి ఈడ కుప్పేయి" అన్నాడు. దానికి వాడు "ఏందీ... నేను పోయి కట్టెలు తీసుకోని రావాల్నా... ఇంకేం పనిలేదా నాకు. పో... పోయి నువ్వే తెచ్చుకోపో... నేను ఆడుకోవాల" అంటూ రయ్యిమని ఆన్నించి వెళ్ళిపోయినాడు. చేసేదేమీ లేక పెద్దోడే ఆ కట్టెలన్నీ చెట్టు కిందికి మోసుకోనొచ్చినాడు.

ఆడుకుంటా వున్న కూతురితో "పాపా...పో...పోయి వాటికి నార తీయి. తాళ్ళు పేనుతా" అన్నాడు. దానికా పాప "అబ్బబ్బబ్బ... ఎప్పుడు చూడు ఆ పని చెయ్యి ఈ పని చెయ్యి అని ఒగటే విసిగిస్తా వుంటావు. ఏం నీకు చేతగాదా... పో... పోయి నువ్వే చేసుకో. నేను వుయ్యాలాట ఆడుకోవాల" అంటూ వెళ్ళిపోయింది.

దాంతో వాడే ఆ కట్టెల నారంతా తీసి మంచి తాడు ఒకటి పేని పైకి చూస్తా "ఏయ్ దయ్యం... మర్యాదగా కిందకొచ్చి నాకు మూడున్నర మూటల బంగారమిస్తావా... లేక నిన్ను ఈ తాడుతో కట్టి వూర్లోకి తీసుకోని పోయి అందరి ముందు కిందామీదా యేసి తన్నాల్నా" అని గట్టిగా అరచినాడు.

ఆ మాటలింటానే పైనున్న దయ్యానికి తిక్కలేసింది. సర్రున కిందకొచ్చి "ఏంరా... వచ్చినప్పటి నుంచీ చూస్తా వున్నా... పెండ్లాం బిడ్డల్నే సరిగా పెట్టుకోలేనోనివి.... నువ్వు నన్ను తంతావా... ఏదీ తన్ను చూద్దాం" అంటూ ఒక లావు కట్టె తీసుకోని దొరికినోళ్ళని దొరికినట్లు కిందామీదా యేసి బాగా తన్ని పంపిచ్చింది.

# 88 దాసరయ్య - జంగమయ్య

ఒక వూరి బైట ఒక సత్రం వుండేది. వేరే వూళ్ళ నుంచి వచ్చేటోళ్ళు అందులో పండుకోని విశ్రాంతి తీసుకుంటా వుంటారు. ఒకసారి ఆ సత్రానికి ఒక జంగమయ్య వచ్చినాడు. జంగమయ్యలంటే శివున్ని పూజించేటోళ్ళు. ఒళ్ళంతా విబూదితో అడ్డంగా మూడు నామాలు పెట్టుకోని, శంఖంతో ఓం అని వూదుతా, శివుని పాటలు పాడతా జోలె పట్టుకోని ఇళ్ళిల్లూ తిరుగుతా వుంటారు. అదే రోజు ఆ సత్రానికి ఒక దాసరయ్య గూడా వచ్చినాడు. దాసరయ్యలు అంటే విష్ణువుని పూజించేటోళ్ళు. వీళ్ళు నిలువునామాలు పెట్టుకుంటారు. నారదున్ని చూసింటారు గదా... అట్లా తంబూర పట్టుకోని విష్ణువుకి సంబంధించిన పాటలు పాడుకుంటా ఇళ్ళిల్లూ తిరుగుతా వాళ్ళు పెట్టిన బిచ్చంతో కడుపు నింపుకుంటా వుంటారు.

ఇద్దరూ సత్రంలో ఒకరి ముందు ఇంకొకరు కూచున్నారు. అంతలో జంగమయ్య "ఏం... దాసరయ్యా... యాడికి పోతా వున్నావు. మీదేవూరు" అనడిగినాడు. దానికా దాసరయ్య "నాది ఆదోని పక్కన వురుకుందనే వూరు. అహోబిలంలో నరసింహసామిని చూసొద్దామని పోతా వున్నా. మరి నువ్వు యాడికి పోతా వున్నావు" అనడిగినాడు.

దానికా జంగమయ్య "నాది కర్నూలు పక్కనే కాల్వబుగ్గ. శ్రీశైలంలో పార్వతీ పరమేశ్వరులను చూసొద్దామని పోతా వున్నా. ఐనా ఆ అహోబిలం ఏం పోతావు గానీ ఆ నిలువు నామాలు తీసేసి నాలా అడ్డనామాలు పెట్టుకోని శ్రీశైలంరా... మా సామికి చానా మహిమలున్నాయి. ఒక్కసారి చూసినావంటే చాలు మళ్ళా జన్మలో ఏ దేవుని పేరూ ఎత్తవు" అన్నాడు.

ఆ మాటలకు దాసరాయనకు చానా కోపం వచ్చింది. "అబ్బో.. భలే చెప్పినావులే.. శ్మశానంలో శవాలతో కలసి వుండే నీ దేవుడు గూడా ఒక దేవుడేనా... నీవే ఆ అడ్డనామాలు తీసేసి నిలువునామాలు పెట్టుకోని నా వెంబడిరా... మా నరసింహసామి లీలలు చూపిస్తా" అన్నాడు.

అట్లా వాళ్ళిద్దరూ మా దేవుడు గొప్పంటే మా దేవుడు గొప్పంటా గొడవ పడసాగినారు. అది నెమ్మదిగా పెరిగి మాటల నుండి తిట్ల దాకా వచ్చింది. కాసేపటికి తిట్లు దాటి ఒకరి అంగీ మరొకరు పట్టుకోని కిందామీదా పడి కొట్టుకునే దాకా వచ్చింది. వాళ్ళట్లా ఒకరినొకరు తన్నుకుంటా వుంటే చూసి ఆ వూరి పెద్దలు ఇద్దరినీ విడిపించి "ఇదంతా ఎందుకు సామీ.. ఇట్లా ఎన్ని రోజులు తన్నుకున్నా మీ సమస్య తీరదు గానీ ఒక పని చేయండి. ఇద్దరూ వూళ్ళోకి పోయి మీ పాటలు పాడతా ఇంటింటికీ తిరగండి. సాయంకాలానికంతా ఎవరి జోలె ఎక్కువ నిండితే వాళ్ళ దేవుడు గొప్ప... సరేనా" అన్నారు.

ఇద్దరూ సరేనని చెరోపక్కా పోయినారు. ఒకపక్క అడ్డనామాల జంగమయ్య శంఖాన్ని నోటిలో పెట్టుకోని వూదుతా “శంభోశంకర” అంటా వీధి వీధీ తిరుగుతా వుంటే… మరోపక్క నిలువునామాల దాసరయ్య తంబూరా మీటుతా “నారాయణ… నారాయణ” అనుకుంటా తిరగసాగినాడు. కానీ ఆ రోజు అమావాస్య. ఆ రోజు ఆ వూరివాళ్ళు చచ్చినా ఎవరికీ ఏమీ పెట్టరు. వీళ్ళకది తెలీదు. దాంతో పొద్దున్నుంచీ సాయంకాలం దాకా ఎన్నిళ్ళు తిరిగినా “పోయిరాపో, మళ్ళారాపో, ఇంకా వంట కాలేదు, చేయి ఖాళీగా లేదు..” అనేటోళ్ళేగానీ పిడికెడు బియ్యం జోలెలో పోసినోళ్ళు ఎవ్వరూ లేరు. దాంతో ఇద్దరూ నీరసంగా కాళ్ళీడ్చుకుంటా తిరిగి వచ్చినారు. ఆకలి దంచేస్తా వుంటే కడుపునిండా నీళ్ళు తాగి నీరసంగా కూలబన్నారు.

కాసేపటికి దాసరయ్య పైకి లేచి “తిరిగీ తిరిగీ వున్నది కాస్తా అరిగిపోయింది. మరొక్కసారి పోయొస్తా… ఒక్క ఇల్లన్నా తగలకపోతాదా” అనుకుంటా సక్కగా జోలె తీసుకోని బైలుదేరినాడు. అట్లా పోతా వుంటే ఒక ఇంటి ముందు చక్కని చుక్కలాంటి ఒకమ్మాయి కూచోని కనబడింది. దాసరయ్యకు పొద్దున్నుంచీ పాటలు పాడీ పాడీ గొంతు బొంగురు పోయింది. దాంతో ఆ అమ్మాయిని చూస్తా “పాపా.. బాగా ఆకలైతా వుంది. కొంచం ఏమన్నా వుంటే పెట్టవా” అంటా పొట్ట చూపిస్తా సైగలు చేసినాడు. ఆ పాప మూగది. వాడట్లా సైగలు చేయగానే చూసి “ఓ” అని ఏడుస్తా లోపలికి వురికింది. అట్లా పోయిన కాసేపటికే లోపలి నుంచి ఇద్దరు కట్టెలు తీసుకోని బైటకొచ్చి “ఏంరా… వూకే వాకిట్లో కూచోని తన పనేదో తాను చేసుకుంటా వుంటే వచ్చి సైగలు చేసి నీవు మూగదానివంటూ ఏడిపిస్తావా… ఎంత ధైర్యంరా నీకు” అంటా కిందామీదా యేసి మెత్తగా తన్నినారు. వాడు ముక్కుతా మూలుగుతా కాళ్ళీడ్చుకుంటా తిరిగి సత్రానికి వచ్చినాడు.

లోపలికొచ్చి పండుకోనింటే పక్కనున్న జంగమయ్య “ఏం దాసరీ ఏమన్నా దొరికిందా తినడానికి” అనడిగినాడు ఆశగా. దానికి దాసరయ్య నవ్వుతా “అబ్బో… ఏం వంటకాల్లే… వద్దు వద్దంటున్నా వినకుండా పెట్టినారు. ఆహా తలచుకుంటే ఇప్పటికీ నాలుక జివ్వుమంటోంది” అన్నాడు. ఆ మాటలింటానే జంగమయ్యకు ఒక్కసారిగా ఆకలి లేచి కూచోనింది. “ఎక్కడ… ఇంకా పెడతా వున్నారా” అన్నాడు ఆశగా.. “ఆ … పెడతావున్నారు. చక్కగా పోయి కుడివైపుకు తిరుగు. పెద్ద ఇల్లు. లోపల ఒక అమ్మాయి కూచోనుంటాది. ఆ పిల్ల చానా మంచిది. జాలిగుండె. ఎదుటోళ్ళు బాధపడతా వుంటే చూసి కొంచం గూడా తట్టుకోలేదు. కాకపోతే ఆ అమ్మాయి మూగది. ఆకలైతా వుంది అన్నం పెట్టమని నోటితో అడగకుండా సైగలు చేసి చూపించాల. అంతే… నువ్వు వద్దు వద్దన్నా వినకుండా వాళ్ళ అన్నోళ్ళొచ్చి లోపలికి పట్టుకోని పోయి పంచభక్షపరమాన్నాలు పెడతారు” అని చెప్పినాడు.

దాంతో జంగమయ్య లొట్టలేసుకుంటా ఆ ఇల్లు వెదుక్కుంటా పోయి ఆ పిల్ల కనబడగానే పొట్ట చూపిస్తా సైగలు చేసినాడు. అంతే… ఆ పాప ఓ అని ఏడుస్తా లోపలికి వురికింది. అది చూసి జంగమయ్య “అబ్బో… పాపం ఎంత జాలిగుండె. ఆకలైతా వుందని చెప్పగానే తట్టుకోలేక ఏడుస్తా పోయింది” అనుకున్నాడు. అంతలో ఆ అమ్మాయి అన్నలిద్దరూ తలా ఒక కట్టె తీసుకోని బైటకొచ్చి “ఏంరా .. అడుక్కుతినేటోనివి అడుక్కోని పోవాలగానీ అనవసరంగా మా చెల్లెలిని మూగదానివంటా ఎగతాలి చేస్తావా” అంటా కిందా మీదా యేసి పొర్లించి పొర్లించి తన్నినారు. వాడు ముక్కుతా మూల్గుతా మట్టసంగా తిరిగొచ్చి సత్రంలో పండుకున్నాడు.

“ ఏం జంగమయ్యా ఎట్లా వున్నాయి పిండివంటలు” అన్నాడు దాసరయ్య లోపల్లోపల నవ్వుకుంటా. అది కనిపెట్టి జంగమయ్య పల్లు నూరుకుంటా “నువ్వు చెప్పిన ఇల్లు కనపడలేదు దాసరయ్యా… అట్లాగే వెదుక్కుంటా పోతాంటే ఒక ఇంట్లో శుభకార్యం జరగుతా వుంది. కడుపు నిండా పెట్టినారు. వంటలు ఆహా అద్భుతం. ఒక్కసారి

తింటే చాలు బతికినన్నాళ్ళు జ్ఞాపకముంటాయి" అన్నాడు. ఆ మాటలు విని 'వీనికి నిజంగానే విందుభోజనం దొరికినట్లుందే' అని దాసరయ్య లోపల్లోపల కుళ్ళుకున్నాడు.



ఇద్దరికీ ఒళ్ళు ఒకటే నొప్పిగా వుంది. ఒకవైపు ఆకలి. మరొకవైపు నొప్పి. జంగమయ్య అటూ యిటూ చూస్తా వుంటే ఒకమూల ఆకూవక్కలు ఎవరో పెట్టినేటివి కనబన్నాయి. ఏదో ఒకటి కనీసం ఇవన్నా నములుదాం అనుకుంటా అవి తీసుకున్నాడు. సున్నం వుంటే బాగుంటుంది గదా అని చుట్టూ చూసినాడు. దూరంగా ఒక గూట్లో సున్నంకుండ కనబడింది. పోయి దానిలో చేయి పెట్టినాడు. అంతే... లోపల ఎప్పటి నుంచి వుందో గానీ ఒక దుబ్బ తేలు వుంది. అది వాడు చేయి పెట్టడం ఆలస్యం లటుక్కుమని ఒక్కటేసింది. అంతే వానికి ఒళ్ళంతా ఒక్కసారిగా కింది నుంచి పై వరకు జివ్వుమనింది. అబ్బా... అని విలవిలలాడుతా ఎక్కడ దాసరయ్యకు తెలిసి నవ్వుకుంటాడోనని పళ్ళ బిగువున బాధ వుగ్గబట్టుకోని తిరిగివచ్చి పన్నుకున్నాడు. బాధ తెలియగూడదని వక్క నోట్లో వేసుకోని టకటకటక కొరకసాగినాడు.

ఆ చప్పుడు విన్న దాసరయ్య "ఏం జంగమయ్యా... ఏందో నములుతా వున్నావు" అన్నాడు.

దానికి జంగమయ్య "ఆ... ఏం లేదు. ఇందాక బాగా పంచభక్ష పరమాన్నాలు తినొచ్చినాను గదా... వాళ్ళు పోయేటప్పుడు ఆకువక్కా ఇచ్చినారు. అది వేసుకున్నా" అన్నాడు.

" అట్లాగా... అయిపోయినాయా... ఇంకా ఏమన్నా వున్నాయా" అన్నాడు ఆశగా దాసరయ్య. "వుండు ఇస్తా..." అని ఆకువక్కా తెచ్చి ఇచ్చినాడు జంగమయ్య.

దాసరయ్య వాటిని అందుకుంటా "మరి సున్నం" అని అడిగినాడు.

" అదిగో... ఆ గూట్లో కుండలో వుంది చూడు తెచ్చుకోపో" అన్నాడు జంగమయ్య.

దాసరయ్య సక్కగా పోయి లోపల చెయ్యి పెట్టినాడు. అంతే... ఆ దుబ్బ తేలు వాన్ని గూడా యేసి ఒక్కటి పెరికింది. అంతే... చేయి సుర్రుమనింది. దాంతో దాసరయ్య గూడా బాధ లోపల్లోపల పంటి బిగువున వుగ్గబట్టుకోని మట్టసంగా తిరిగొచ్చి జంగమయ్య పక్కన పన్నుకున్నాడు.

ఆ రాత్రంతా వాళ్ళకి ఒకపక్క ఆకలి, మరొక పక్క నొప్పి. దాంతో కొంచం గూడా నిద్రపట్టలేదు. పొద్దున్నే లేసి "ఛ..ఛ... నీ నిలువునామాలు నిన్నూ కాపాడలేదు. నా అడ్డనామాలు నన్నూ కాపాడలేదు. ఈ దేవుళ్ళను నమ్ముకుంటే అందరికీ పంగనామాలే" అనుకుంటా అన్నీ తుడిచేసుకోని సక్కగా ఎవరింటికి వాళ్ళు మట్టసంగా తిరిగి పోయినారు.

# 89 అనుభవమే అన్నీ నేర్పిస్తుంది

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు లోకమెట్లా వుందో చూద్దామని ఆకాశంలో తిరుగుతా వున్నారు. అట్లా తిరుగుతా వుంటే వాళ్ళకి ఒకచోట ఒక మేకలు కాసేటోడు కనబన్నాడు. వాడు కొండ మీద వెదురు బొంగులు, తడికెలతో ఒక గుడిసె వేసుకుంటా వున్నాడు. అది చూసి పార్వతీపరమేశ్వరులు కిందికి దిగి వచ్చి "ఇదేందిరా... ఈ కొండ మీద... ఎవరూ లేని చోట తడికెలతో గుడిసె వేస్తా వున్నావు. గాలీవానా వస్తే ఇదెక్కడ నిలబడతాది. కొట్టుకపోతాది గానీ" అన్నారు.

దానికి ఆ పశువుల కాపరి నవ్వి "ఇంకెక్కడ వాన సామీ... మేఘాలన్నీ ఎప్పుడో కురిసి వెళ్ళిపోయినాయి. ఇంకో మూడు నెలల వరకు వాన కాదు గదా తుంపరలు గూడా రాలవు. అందుకే ఈ పాక వేసుకోని మేకలు మేపుకుంటా వున్నా" అన్నాడు.

ఆ మాటలకు శివుడు వాని వంక చూసి "నీకెట్లా తెలుసు మూడు నెలల వరకూ వానలు రావని. మధ్యలో వస్తే ఏం చేస్తావు" అనడిగినాడు.

దానికా పశువుల కాపరి నవ్వి "సామీ... వానలు ఎప్పుడొస్తాయో... ఎప్పుడు పోతాయో... ఈ భూమ్మీద బతికే నాలాంటి మట్టిమనుషులకు తెలుస్తాది గానీ... చల్లగా మంచుకొండ మీద కూచునే నీకేం తెలుస్తాది" అన్నాడు.

ఆ మాటలకు శివుడు "అరెరే... ఎంత పొగరు వీనికి, నన్నే అంత మాటంటాడా. వుండు వీని పని చెబ్తా" అనుకుంటా వానలు కురిపించే వరుణదేవుని దగ్గరికి పోయి "వానదేవా... అదిగో ఆ కొండల మీద ఒకడు పాక వేసుకోని వున్నాడు చూడు... ఆడికి ఒక్కసారిగా మేఘాలన్నిటినీ పంపి... భూమీ ఆకాశం కలసిపోయేలా పెద్దవాన కురిపించు" అన్నాడు.

ఆ మాటలకు వానదేవుడు "అయ్యయ్యో... సామీ... కోరక కోక ఒక్క కోరిక కోరినావు. కానీ ఇప్పటికే చానా ఆలస్యమైపోయింది. మేఘాలన్నింటినీ పడమటి దేశాల వైపు పంపించేసినాను. ఇప్పటికే అవి చానా దూరం వెళ్ళిపోయినాయి. ఇప్పటికిప్పుడు పోయి వాటిని వెనక్కి పిలుచుకురావాలన్నా చానా రోజులు పడుతుంది. మూడు నెల్లు ఆగు సామీ... నీవు చెప్పిన చోటికి పంపిస్తా" అన్నాడు. శివుడు ఏమీ చేయలేక మట్టసంగా మంచుకొండకు వెళ్ళిపోయినాడు.

నెమ్మదిగా మూడునెల్లు గడిచిపోయినాయి. శివుడు, పార్వతి ఆకాశంలో అట్లాఇట్లా తిరుగుతా మళ్ళా అదే కొండ మీదకు వచ్చినారు. చూస్తే ఇంకేముంది.... పశువుల కాపరి పాక విప్పుతా వున్నాడు. అది చూసి ఇద్దరూ

కిందికి దిగి వచ్చి "అదేమి అప్పుడే అట్లా విప్పుకోని పోతా వున్నావు" అనడిగినారు.

దానికి వాడు నవ్వి "సామీ... తొందరలో వానలు పడబోతా వున్నాయి. అందుకే అవి రాకముందే ఇప్పుకోని పశువులను ఇంటికి తోలుకోని పోవాల" అన్నాడు.

"వానలు వస్తాయని నీకెట్లా తెలుసు" మళ్ళా అడిగినాడు శివుడు.

వాడు చిరునవ్వు నవ్వి "చూడు సామీ... ఈ నేల మీద కష్టం చేసుకోని బతికేటోనికి తెలుస్తాది ఆకాశం గురించి భూమి గురించి. అంతేగానీ ఏ కష్టమూ లేని మీకేం తెలుస్తాది" అన్నాడు.



ఆ మాటలకు శివుడు "వీనికి చానా పొగరున్నట్లుంది. చూస్తా... ఈడ వానెట్లా కురుస్తాదో" అనుకుంటా రయ్యిమని వానలు కురిపించే వరుణదేవుని దగ్గరికి పోయి "వానదేవా... అదిగో ఆ కొండల మీద ఒకడు తడికెలతో వేసిన ఇంటిని విప్పుతా వున్నాడు చూడు.... ఆడ మాత్రం ఈసారి ఒక్క బొట్టు వాన గూడా కురిపియ్యొద్దు. సరేనా" అన్నాడు.

ఆ మాటలకు వానదేవుడు "అయ్యయ్యో.... అదేంది సామీ... అట్లా మాట మారుస్తా వున్నావు. అడగక అడగక అడిగినావు కదాని పడమటి దేశాల్లో వానలు కురిపించిన మేఘాలు తిరిగి వస్తానే ఇంతకు ముందు నీవు చెప్పిన కొండ దగ్గరికే పంపించేసినా. ఇప్పటికే అవి చానా దూరం వెళ్ళిపోయింటాయి. వాటిని ఆపడం ఇక నా చేతుల్లో లేదు" అన్నాడు.

ఆ మాటలకు శివుడు, పార్వతి నవ్వుకోని ఆ మట్టిమనిషి చెప్పింది నిజమే... ఎప్పుడు వానొస్తుంది.... ఎప్పుడు గాలొస్తుంది.... ఎప్పుడు పంటొస్తుంది... ఎప్పుడు కరువొస్తుంది... ఇట్లాంటి విషయాలన్నీ ఆ పనులు చేసేటోళ్ళకు తెలిసినట్లు వూకే చూసే మనలాంటోళ్ళకు తెలీవు గదా... "ఏదైనా అనుభవమే అన్నీ నేర్పిస్తుంది" అనుకుంటా గమ్మున మంచుకొండకు వెళ్ళిపోయినారు.

# 90 శ్రావణ భాద్రపదాలు

ఒకూర్లో ఒక బాపనాయన వుండేటోడు. ఆయనకు దేవుడంటే చానా భక్తి. ప్రతిరోజూ పూజ చేసి, ప్రసాదం పెట్టనిదే ఏమీ తినేటోడు కాదు. ప్రతి నెలా పూజలూ, వ్రతాలూ వరుస తప్పకుండా చేసేటోడు. ఆయనకో పెండ్లాం వుంది. ఆమె పెద్ద అమాయకురాలు. అచ్చరం ముక్క గూడా చదువుకోలేదు. మొగుడు ఏది చెప్తే అది మట్టసంగా నోరుమూసుకోని చేయడం తప్ప ఆమెకు ఏమీ తెలీదు.

ఒకరోజు వానికి కాశీకి పోయి రావాలనిపించింది. కాశీ అంటే చానాచానా దూరంగదా. పోయి రావడానికి ఎంత కాదన్నా రెండు మూడు నెలల పైన్నే పట్టాది. ఇప్పుడంటే యాడికయినా పోవాలన్నా బస్సులూ, రైళ్ళూ, విమానాలూ వున్నాయి. రయ్యిమని పోయి రయ్యిమని రావచ్చు. కానీ పూర్వకాలమట్లా కాదు. ఎంత దూరమయినా సరే నడుస్తానే పోవాలి. నడుస్తానే రావాలి.

అన్ని రోజులు పోతే ఇంట్లో పూజా పునస్కారాలు ఎట్లా... అదీగాక వచ్చేది శ్రావణ భాద్రపద మాసాలు. పూజలూ వ్రతాలూ బాగా చేయాల. అందుకని పెండ్లాన్ని పిలిచి "ఏమే... ఏమే... నేను కాశీకి పోయొస్తా. నువ్వు ఇంట్లో పూజా పునస్కారాలకు ఏమాత్రం లోటు రానియ్యొద్దు. అదీగాక నేను పోగానే శ్రావణ భాద్రపదాలు వస్తాయి. కాస్త జాగ్రత్తగా చూసుకో... అన్నీ పద్ధతి ప్రకారం చేసిపెట్టు" అన్నాడు. అప్పుడే ఇద్దరు దొంగలు దొంగతనం చేద్దామని వాళ్ళింటికి వచ్చినారు. కిటికీలోంచి ఆయన మాటలు విని "ఇప్పుడెందుకులే పోవడం... వీడు కాశీకి పోయినాక వద్దాం" అనుకున్నారు.

ఆ బాపనాయన పోయే ముందు ఇంట్లో వున్న బంగారమంతా మూటగట్టి ఇంటి వెనకున్న మల్లెచెట్టు కింద ఒక గుంత తవ్వి... దాంట్లో దాచిపెట్టి వెళ్ళిపోయినాడు. వాడట్లా పోవడమాలస్యం ఆ దొంగలిద్దరూ మట్టసంగా మంచి బట్టలేసుకోని వాళ్ళింటికొచ్చినారు. ఆమె వాళ్ళని చూసి "ఎవరు నాయనా మీరు... ఏం కావాల" అనడిగింది. ఆమె పెద్ద అమాయకురాలని వాళ్ళకు ముందే తెలుసు. దాంతో "అదేంటమ్మా... అట్లా అడుగుతావ్. మమ్మల్ని గుర్తుపట్టలేదా... నేను శ్రావణుడు... వీడు భాద్రపదుడు... మేమొస్తున్నట్లు నీ మొగునితో ముందే చెప్పినామే... నీకు చెప్పలేదా" అన్నాడు.

ఆమె అచ్చరం ముక్కగూడా చదువుకోలేదు గదా... దాంతో శ్రావణ భాద్రపదాలంటే తెలుగు నెలల పేర్లని ఆమెకి తెలీదు. అందుకని వాళ్ళ మాటలు నమ్మి "రండి... రండి... నిన్ననే నా మొగుడు పోతా పోతా మీరొస్తున్నారని చెప్పి పోయినాడు" అని లోపలికి పిల్చుకోని పోయింది.

"మొగుడు శ్రావణ భాద్రపదాల్లో ఏ లోటూ రాకుండా జాగ్రత్తగా చూసుకో" అన్నాడు గదా... దాంతో రోజుకో వంట చేసి చాలుచాలన్నా వినకుండా ఇంకొంచం... ఇంకొంచం... అంటూ కొసరికొసరి వడ్డించేది. వాళ్ళు హాయిగా ఆమె పెట్టినేటివన్నీ తినుకుంటా... లోపల్లోపల నవ్వుకుంటా... రెండునెలలు ఆన్నే కాలు మీద కాలేసుకోని దర్జాగా గడిపినారు.

కాశీకి పోయిన బాపనాయన తిరిగొచ్చే సమయం దగ్గరపడింది. వస్తే వాళ్ళ మోసం బయటపడిపోతుంది గదా... అందుకని ఆ దొంగలిద్దరూ ఇంట్లో వున్నవన్నీ ఎత్తుకోని ముందే పారిపోదామని ఆమె పన్నుకున్నాక రాత్రిపూట సప్పుడు గాకుండా ఇండ్లంతా తెగ వెదికినారు. ఎంత వెదికినా వాళ్ళకు బంగారు వస్తువులు ఒక్కటిగూడా యాడా కనబల్లేదు. ఇట్లా లాభం లేదనుకోని వాళ్ళు ఒక ఉపాయమాలోచించి ఒకరోజు పొద్దున్నే "అమా... అమా... మాకు కాస్త పనుంది. ఈ రోజు పోయి మళ్ళా వచ్చేవారం వస్తాం... రాత్రిపూట కొంచం జాగ్రత్త... చుట్టుపక్కల దొంగతనాలు ఎక్కువయిపోయినాయి. బంగారమంతా తీసి యాడన్నా జాగ్రత్తగా దాచిపెట్టు" అని చెప్పినారు.

దానికామె "మీరేం భయపడమాకండి... నా మొగుడు అంత తెలివితక్కువోడు కాదు. పోయేముందు దొంగలెవరికీ దొరకగూడదని... అదిగో... ఆ మల్లెచెట్టుంది చూడు... దాని కింద గుంత తవ్వి అన్నీ దాంట్లో భద్రంగా దాచిపెట్టి పోయినాడు" అని చెప్పింది. వాళ్ళు ఆమె తెలివితక్కువతనానికి లోపల్లోపల నవ్వుకోని సరే అని వెళ్ళిపోయినారు.

ఆ దొంగలిద్దరూ అట్లా పోయినట్లే పోయి... చీకటి పడగానే మట్టసంగా వెనక్కి తిరిగొచ్చి సప్పుడు గాకుండా మల్లెచెట్టు కిందున్న బంగారాన్నంతా తీసుకోని.... అట్లాగే ఇంట్లో వున్న విలువయిన వస్తువులన్నీ ఎత్తుకోని పారిపోయినారు.

వాళ్ళట్లా పోయిన వారానికల్లా ఆ బాపనాయన కాశీ నుండి తిరిగి వచ్చినాడు. స్నానం చేసి పెండ్లాం పెట్టిన తినుబండారాలన్నీ తింటా... తింటా... "ఏమే... శ్రావణ భాద్రపదాలు వచ్చినాయి గదా... ఏమేమి చేసినావు" అనడిగినాడు.

దానికామె సంబరంగా "నీవు చెప్పినాక చేయకుండా వుంటానా... బ్రమ్మాండంగా చేసినా... కావాలంటే వాళ్ళు రేపో... ఎల్లుండో వస్తారు. వాళ్ళనే అడుగు" అనింది.

వానికామాటలు అర్థంగాక "వాళ్ళెవరే" అన్నాడు. దానికామె "అదేనండీ... శ్రావణ భాద్రపదులు... మీరట్లా పోవడమాలస్యం వాళ్ళిట్లా వచ్చినారు. నీవు ముందే చెప్పి పోయినావు గదా... అందుకే ఏలోటూ రాకుండా చేసిన వంట మళ్ళా చేయకుండా రోజుకోరకం వంట చేసి పెద్తా ఈ రెండునెల్లూ బ్రమ్మాండంగా చూసుకున్నా... పోయిన వారమే ఏదో అత్యవసరమైన పనుందని, మళ్ళా వస్తామని చెప్పి పోయినారు. ఈరోజో... రేపో... వస్తారు. రాగానే అడుగు... నేనెంత బాగా చూసుకున్నానో వాళ్ళే చెబుతారు" అనింది.

ఆ మాటలకు వాడు అదిరిపడి "ఓసినీ తెలివితక్కువదానా... శ్రావణ భాద్రపదాలంటే తెలుగు నెలల పేర్లే... మనుషులు కాదు" అని అనుమానమొచ్చి వురుక్కుంటా పోయి చూస్తే ఇంగేముంది... ఇంట్లో విలువయిన వస్తువులూ లేవు... మల్లెచెట్టు కింద బంగారమూ లేదు.

# 91 నల్లడబ్బా - ఎర్రడబ్బా

ఒక అడవిలో ఒక ముని వుండేటోడు. ఆయనకు చానా మహిమలు వుండేవి. కానీ వాటిని ఎవరికీ ఎప్పుడూ చూపేటోడు కాదు. ఆ ముని రోజూ పొద్దున్నే వూర్లోకి వచ్చి ఒక్కొక్క ఇంటి దగ్గర అడుక్కుంటా వాళ్ళు పెట్టినవి తీసుకోని అడవికి వెళ్ళిపోయేటోడు. ఆ అడవిలోనే ఒక చిన్నఇల్లు కట్టుకోని అందులో తపస్సు చేసుకునేటోడు. ఒకసారి ఆ మునికి పెండ్లి చేసుకోవాలని అనిపించింది. కానీ ఆవూరి జనాలు "నువ్వే అడుక్కోని తింటా వుంటావు, ఇంక నీ పెండ్లానికి ఏం పెట్టి సాకుతావు" అంటూ పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఆ వూరిలో సుబ్బమ్మ అని ఒకామె వుండేది. ఆమెకు ఒక కూతురు, ఒక కొడుకు వున్నారు. వాళ్ళు చానా పేదోళ్ళు. చుట్టుపక్కల ఇళ్ళలో పనులు చేస్తా పొలం పనులకు కూలీకి పోతా, వచ్చిన డబ్బులతో కడుపు నింపుకునేటోళ్ళు. కొంతకాలానికి కూతురు పెద్దగయింది. పెద్దగయినాక పెండ్లి చేయాల గదా . కానీ ఆమె దగ్గర అంత డబ్బు లేదు. అప్పుడా కూతురు వాళ్ళమ్మతో "అమ్మా... అమ్మా... నువ్వెట్లాగూ నా పెండ్లి చేయలేవు. ఆ మునికన్నా నన్నిచ్చి చేయి" అనింది. వాళ్ళమ్మకు ఇష్టం లేకపోయినా వేరే దారి లేక మునికి కూతురినిచ్చి పెండ్లి చేసింది. పెండ్లి ఖర్చులన్నీ మునే పెట్టుకోని పెండ్లయినాక పెండ్లాన్ని తీసుకోని అడవికి వెళ్ళిపోయినాడు. ఆడ ఆమెను బాగా చూసుకోసాగినాడు.

కొన్ని రోజులయినాక సుబ్బమ్మ కొడుకును పిలిచి "ఆడ అక్క ఎలా వుందో చూసి రాపోరా" అని అడవికి పంపించింది. వాడు అక్కను చేరుకున్నాడు. అక్క తమ్మునికి రకరకాల పిండివంటలు చేసి పెట్టి క్షేమసమాచారాలన్నీ కనుక్కోని తమ్ముడు పోయేటప్పుడు మొగుని దగ్గరికి పోయి "సామీ మా అమ్మా వాళ్ళ పరిస్థితి ఏమీ బాగాలేదంట. కొంచం సాయం చేయండి" అనింది. దానికా ముని "వంటింటి గూట్లో ఒక ఎర్రడబ్బా వుంది. అదిచ్చి పంపు. వాళ్ళ కష్టాలన్నీ తీరుతాయి" అన్నాడు. ఆమె ఎర్రడబ్బాను తమ్మునికిచ్చి "దీన్ని జాగ్రత్తగా తీసుకోని పోయి అమ్మకియ్యి" అని చెప్పింది. తమ్ముడు ఆ డబ్బాను తీసుకోనిపోయి వాళ్ళమ్మకు ఇచ్చినాడు.

ఆమె ఏముందబ్బా ఆ డబ్బాలో అని మూత తెరిచి చూసింది. దాని నిండా సొరకాయ విత్తనాలు కనబడినాయి. ఆమెకు సొరకాయలంటే అస్సలు ఇష్టం లేదు. దాంతో "ఛీ... ఛీ.... ఏం చేయాల ఈ పనికిమాలిన విత్తనాలు" అంటూ విసిరి ఇంటిబైట పాడేసింది. కొంత కాలానికి వానలు పడడంతో ఆ విత్తనాలు మొలిచి ఇంటి చుట్టూ సొరకాయలు కుప్పలు కుప్పలు కాసినాయి. ఆమెకు సొరకాయలంటే అస్సలు ఇష్టం లేదుగదా దాంతో వాటి గురించి ఏమీ పట్టించుకోలేదు. ఆ ఊర్లో ఒక కోమటాయన వుండేటోడు. వాడు ఒకరోజు అటువైపు పోతాపోతా ఆ సొరకాయలు చూసి "అమ్మా అమ్మా ఒక సొరకాయ ఇస్తావా... ఒక రూపాయి ఇస్తా" అన్నాడు. ఆమె సంతోషంగా 'సరే తీసుకొనిపో' అంటూ రూపాయ తీసుకోని సొరకాయ వాని చేతిలో పెట్టింది. వాడు

సొరకాయ తీసుకోని పోయినాక కూర చేసుకుందామని మధ్యకు కోసినాడు. కోస్తే ఇంకేముంది లోపలంతా ధగధగధగమని బంగారం బంగారంకాదు. అది చూసి వాడు వెంటనే ఒక బండి కట్టుకోని ఆమె దగ్గరకు పోయి "అమ్మా అమ్మా మా వీధిలో అందరూ సొరకాయలు అడుగుతా వున్నారు. ఇస్తావా... ఒకొక్క దానికి ఒకొక్క రూపాయి ఇస్తా" అన్నాడు. దానికామె సంబరంగా అలాగేనంటూ సొరకాయలన్నీ తెంపి వాని బండికేసింది. వాడు ఆమె చేతిలో రెండువందల రూపాయలు పెట్టి ఇంటికి తీసుకోనిపోయి బంగారమంతా తీసేసుకున్నాడు. ఆరోజు నుండీ వారానికోసారి ఇంటికాడికి వచ్చి కాసిన కాయలు కాసినట్టు తీసుకోని పోసాగినాడు.

కొన్ని నెలల తరువాత అక్క ఎట్లా వుందో చూడడానికని తమ్ముడు మరలా అడవికి పోయినాడు. అక్క వానికి అడిగిన పిండివంటలన్నీ చేసి పెట్టి ఆమాటా ఈమాటా మాట్లాడతా ఇంటి పరిస్థితంతా తెలుసుకోనింది. తమ్ముడు పోయేటప్పుడు మొగుని దగ్గరికి పోయి, "సామీ... మా వాళ్ళ బాధలు ఎట్లున్నేవి అట్లానే వున్నాయంట. ఈసారయినా ఏదయినా మంచి సాయం చేయండి" అనింది. ముని ఏం జరిగిందబ్బా అని కళ్ళు మూసుకోని జరిగిందంతా కనుక్కున్నాడు. "గూట్లో ఒక నల్లడబ్బా వుంది, అదిచ్చి పంపు. ఈసారి మీ కష్టాలన్నీ తీరుతాయిలే" అని చెప్పినాడు. ఆమె తమ్మునికి నల్లడబ్బా ఇచ్చి పంపిచ్చింది. తల్లి కొడుకిచ్చిన నల్లడబ్బాలో ఏమున్నాయబ్బా అని తెరిచి చూసింది. దాని నిండా గుమ్మడి గింజలు కనబడినాయి. ఆమెకు గుమ్మడికాయలంటే గూడా అస్సలు ఇష్టం లేదు. దాంతో వాటిని గూడా విసిరి ఇంటిబైట పడేసింది. కొంతకాలానికి వానలు పడడంతో ఆ విత్తనాలు మొలిచి ఇంటి చుట్టూ గుమ్మడికాయలు గుంపులు గుంపులుగా కాసినాయి. కానీ ఆమెకు గుమ్మడికాయలంటే అస్సలు ఇష్టం లేదు గదా. దాంతో వాటి గురించి ఏమీ పట్టించుకోలేదు.

కోమటాయన ఆ గుమ్మడికాయలను చూసినాడు. సొరకాయల్లోనే అంత బంగారముంటే గుమ్మడికాయల్లో ఇంకెంత వుంటాదో అనుకున్నాడు. వెంటనే బండి కట్టుకోనొచ్చి "అమ్మా అమ్మా... మా వీధిలో అందరూ గుమ్మడికాయలు అడుగుతా వున్నారు. ఇస్తావా... ఒకొక్క దానికి ఐదు రూపాయలిస్తా" అన్నాడు. దానికామె సంబరంగా అలాగేనంటూ గుమ్మడికాయలన్నీ తెంపి వాని బండికేసింది. వాడు ఆమె చేతిలో ఐదొందలు పెట్టి వాటిని ఇంటికి తీసుకోని పోయినాడు.

ఎవరూ చూడకుండా తలుపులన్నీ మూసి సంబరంగా కత్తి తీసుకోనొచ్చి పరపరపర గుమ్మడికాయలను అడ్డంగా కోసినాడు. అంతే లోపల నుంచి తేళ్ళు, జర్రులు కుప్పలు కుప్పలుగా బైటికొచ్చి వాన్ని కుట్టిన చోట కుట్టకుండా ఒళ్ళంతా కుట్టి కుట్టి పెట్టినాయి. దాంతో వానికి ఒళ్ళంతా బాగా విషమెక్కి మంచం పట్టినాడు. ఎక్కడెక్కడి వైద్యుల్ని పిలిపించినా, ఎన్నెన్ని మందులు మింగించినా నొప్పి కొంచెం గూడా తగ్గలేదు. రోజురోజుకీ నొప్పి ఎక్కువవుతా లబలబలాడసాగినాడు.

అప్పుడు ఒకరోజు రాత్రి ముని వాని కలలో కనబడి "నీవు చేసిన తప్పు దిద్దుకుంటే నీ నొప్పి పోతుంది" అని చెప్పినాడు. దాంతో వాడు తర్వాత రోజు పొద్దున్నే ఇంట్లో వున్న బంగారమంతా బండి కేసుకోని పోయి సుబ్బమ్మ కాళ్ళ మీద పడి జరిగిందంతా చెప్పి బంగారాన్ని తిరిగి ఇచ్చేసినాడు. దాంతో వాడి నొప్పి అంతా తగ్గిపోయి ఎప్పట్లాగే మామూలుగా ఐపోయినాడు. సుబ్బమ్మ ఆ బంగారాన్ని అమ్మి వచ్చిన డబ్బులతో ఒక మంచి మిద్దె కట్టుకోని, పేదవాళ్ళను అవసరానికి ఆదుకుంటా హాయిగా కాలం గడపసాగింది.

# 92 ఏడుగురు మూర్ఖులు

ఒకూర్లో ఒక రాజుండేటోడు. ఆయనకొక రోజు మూర్ఖులంటే ఎట్లా వుంటారో చూడాలనిపించింది. వెంటనే మంత్రిని పిలిపించి "మంత్రీ! మంత్రీ! నాకు మూర్ఖులు ఎట్లా వుంటారో చూడాలని వుంది. నువ్వెట్లాగైనా సరే వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రానికల్లా ఏడుమంది మూర్ఖులని పట్టుకోని నా దగ్గరికి తీస్కోని రావాల" అన్నాడు.

రాజు చెప్పినాక చేయాల గదా... మంత్రి లోపల్లోపల గొణుక్కుంటా మూర్ఖుల కోసం బైలుదేరినాడు. అట్లా వెదుకుతా పోతా వుంటే దారిలో ఒకడు చెట్టు కింద ఏందో వెదుకుతా కనబన్నాడు.

మంత్రి వాని దగ్గరికి పోయి "ఏం పోయింది? ఎందుకట్లా వెదుకుతా వున్నావు" అనడిగినాడు. దానికి వాడు "నా పెండ్లి నాడు మా అత్త పెట్టిన బంగారు వుంగరం పడిపోయింది. దాని కోసం వెదుకుతా వున్నా" అన్నాడు. అప్పుడా మంత్రి "అట్లాగా! వుంగరం యాడ పడిపోయింది' అనడిగినాడు. దానికి వాడు దూరంగా వేలు చూపిస్తా "అదిగో ఆడ ముండ్లకంపల్లేవూ. దాండ్లల్లో పడిపోయింది" అన్నాడు. దానికి మంత్రి ఆచ్చర్యపోతా "వుంగరం ఆడ ముండ్ల కంపలలో పడిపోతే, మరి నువ్వేమి ఈడ చెట్టు కింద వెదుకుతా వున్నావ్' అనడిగినాడు.

దానికి వాడు కోపంగా "ఆడంతా ముల్లులు, ముల్లులు ఎట్లా వున్నాయో చూడు. దానికి తోడు ఎండ సుర్రుమంటోంది. ఆ ఎండలో ముండ్ల మధ్య వెదకడం కన్నా చల్లగా ఈ చెట్టు నీడన వెదకడం మేలు గదా" అన్నాడు.

వస్తువు పోయిన చోట వెదుక్కోకుండా వేరొకచోట వెదుకుతా వున్న వాన్ని చూసి మంత్రి "హమ్మయ్య! ఒక మూర్ఖుడు దొరికినాడు" అని లోపల్లోపల నవ్వుకోని "వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం రాజభవనానికి రా. రాజుకి నీ తెలివితేటల గురించి చెప్పి ఇంతకంటే మంచి వుంగరమిప్పిస్తా" అన్నాడు. వాడు సరేనని తలూపినాడు.

మంత్రి ఇంగో మూర్ఖుని కోసం వెదుకుతా పోసాగినాడు. అట్లా పోతా వుంటే ఒకడు నెత్తిన గడ్డిమోపు పెట్టుకోని, గుర్రమ్మీద కూచోని వస్తా కనబన్నాడు. అది చూసి మంత్రి ఆచ్చర్యపోయి "గడ్డిమోపు గుర్రమ్మీద పెట్టుకోని రాకుండా నెత్తిమీద పెట్టుకోని వస్తా వున్నావ్ ఏంది" అనడిగినాడు.

దానికి వాడు "ఏం చెయ్యమంటావ్ మహామంత్రీ! గుర్రం ముసలిదయిపోయింది. నన్ను మోయడానికే దానికి శక్తి లేదు. ఇంక గడ్డిమోపునేం మోస్తాది. అందుకే దాని మీద బరువు పెట్టకుండా నేనే గడ్డిమోపు మోస్తా వున్నా" అన్నాడు.

గడ్డిమోపు నెత్తి మీద పెట్టుకున్నా గుర్రమ్మీద పెట్టుకున్నా ఒకటే అని తెలియని వాడి మూర్ఖత్వానికి మంత్రి ఆచ్చర్యపోయి హమ్మయ్య మరో మూర్ఖుడు దొరికినాడని లోపల్లోపల నవ్వుకోని "వచ్చేనెల ఒకటో తేదీ సాయంత్రం రాజభవనానికి రా, నీ మంచితనం గురించి చెప్పి రాజుతో మంచి బహుమానమిప్పిస్తా" అన్నాడు. వాడు సరే అని తలూపినాడు.



మంత్రి మూడో మూర్ఖుని కోసం వెదుకుతా పోసాగినాడు, అట్లా పోతా వుంటే ఒకరోజు ఒకచోట ఇద్దరు కిందా మీదా పడి కొట్టుకుంటా కనబన్నారు. అది చూసి మంత్రి వురుక్కుంటా పోయి వాళ్ళిద్దరినీ విడిపిచ్చి "ఎందుకట్లా కొట్లాడుకుంటా వున్నారు? ఏంది మి బాధ" అనడిగినాడు.

దానికి ఒకడు కోపంగా "చూడు మంత్రీ! వీడు నా బంగారంలాంటి ఆవును చంపుతానంటున్నాడు" అన్నాడు. మంత్రి రెండోవానివైపు చూసేసరికి వాడు కోపంగా "ఆ దొంగసచ్చినేది నా తోటంతా తిని పాడు చేస్తా వుంటే ఎట్లా వూరుకునేది, అందుకే చంపుతానంటున్నా" అన్నాడు.

మంత్రి కాసేపాలోచించి "ఇంతకీ నీ తోట యాడుంది" అన్నాడు. దానికి వాడు "తోటనా ఇంగా ఎయ్యలేదు గదా" అన్నాడు. ఆ మాటలకు మంత్రి ఆచ్చర్యపోయి, రెండోవానికెళ్ళి తిరిగి "మరి నీ ఆవేది" అన్నాడు. దానికి వాడు "ఇంగా కొనలేదు గదా" అన్నాడు. మంత్రి ఆ మాటలకు మరింత ఆచ్చర్యపోయి "నువ్వు తోటా ఎయ్యలేదు. వాడు ఆవూ కొనలేదు. మరెందుకు ఇద్దరూ కొట్లాడుకుంటా వున్నారు" అనడిగినాడు. దానికి ఒకడు "నేను మా యింటి పక్కనే తోట ఎయ్యాలనుకుంటా వున్నా, వానిది మా పక్కిల్లే. వాడు ఆవును కొంటానంటున్నాడు. రేప్పొద్దున ఆ ఆవు పక్కనే వుంది గదా అని నా తోటలోనికి వచ్చి పాడు చేస్తాది గదా" అన్నాడు. వాళ్ళిద్దర్నీ చూసి మంత్రి లోపల్లోపల నవ్వుకోని హమ్మయ్య ఈసారి ఏకంగా ఇద్దరు మూర్ఖులు దొరికినారని సంబరపడి "వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం రాజభవనానికి రాండి. రాజుకి చెప్పి మీ తగవు తీరుస్తా" అన్నాడు. వాళ్ళు సరేనని తలలూపినారు.

మంత్రి ఐదో మూర్ఖుని కోసం వెదుకుతా పోసాగినాడు. అట్లా పోతా వుంటే ఒకచోట ఒకడు ఏడుస్తా ఆకాశం కేసి చూస్తా కనబన్నాడు. మంత్రి వాన్ని చూసి "ఎందుకట్లా ఆకాశంలో వెదుకుతా ఏడుస్తా వున్నావు? ఏంది నీ బాధ" అనడిగినాడు.

దానికి వాడు ఏడుస్తా "ఏం చెప్పమంటావు మహామంత్రీ! పోయిన్నెల నా మిత్రుడొకడు తీర్థయాత్రలకని పోతా పోతా దాచిపెట్టమని ఒక చెంబు నిండా బంగారు వరహాలిచ్చి పోయినాడు. రాత్రిపూట ఏ దొంగలో వస్తే

కష్టంగదా, అందుకని అర్ధరాత్రి ఎవరూ చూడకుండా ఈ అడవిలో ఒక గుంత తీసి దాచిపెట్టినా, యాడ దాచిపెట్టినామో గుర్తు బెట్టుకోవాల గదా, అంతా వెతికితే సరిగ్గా గుంత పైన్నే ఒక నల్లమేఘం కనబడింది. దాన్ని గుర్తు పెట్టుకున్నా. నా మిత్రుడు వచ్చేది రేపే. వాని చెంబు వానికిద్దామని ఈడికొచ్చి చూస్తే ఆ మేఘం యాడా కనబడ్డం లేదు. ఎవడో వరహాల్తో బాటు మేఘాన్ని గూడా ఎత్తుకోని పోయినట్టున్నాడు. అందుకే యాడన్నా కనబడ్తాదేమోనని వెదుకుతా వున్నా" అన్నాడు.

ఆ మాట విన్న మంత్రి "ఎవడైనా గాలికి చెదిరిపోయే మేఘాన్ని గుర్తు పెట్టుకుంటాడా మూర్ఖుడు కాకపోతే" అని లోపల్లోపల నవ్వుకోని "వచ్చే నెల ఒకటో తేదీ సాయంత్రం రాజభవనానికి రా, రాజుకి చెప్పి నీ చెంబూ, బంగారం నీకిప్పిస్తా" అన్నాడు. వాడు సరేనని తలూపినాడు.

ఒకటో తేదీ సాయంత్రానికి వాళ్ళంతా రాజభవనానికి చేరుకున్నారు. మంత్రి వాళ్ళు చేసిన పనులన్నీ ఒకొక్కటే వివరించి చెబుతా వుంటే రాజు వాళ్ళ మూర్ఖత్వానికి కిందామీదా పడి నవ్వినాడు.

ఆ తర్వాత రాజు వాళ్ళందరినీ లెక్కబెట్టి "అవునూ, నేను ఏడుమంది మూర్ఖులను తెమ్మంటే... నువ్వేంది ఐదుమందినే పట్టుకోనొచ్చినావు" అనడిగినాడు.

దానికి మంత్రి "నువ్వేమీ అనని మాటిస్తే మిగతా ఆ ఇద్దరిని కూడా చూపిస్తా రాజా" అన్నాడు. సరేనని రాజు మాటిచ్చినాడు.

అప్పుడు మంత్రి "ఆ మిగతా ఇద్దరూ ఎవరో కాదు మహారాజా! నువ్వూ, నేనూ" అన్నాడు.

దానికి రాజు ఆచ్చర్యపోతూ "మనిద్దరమా? అదెట్లా" అన్నాడు.

అప్పుడు మంత్రి "చూడు రాజా! ఈ దేశాన్ని పరిపాలించాల్సింది నువ్వూ నేనే గదా. మనం ప్రజల గురించి, వాళ్ళ బాగోగుల గురించి ఆలోచించాల గానీ ఇట్లా మూర్ఖుల గురించి ఆలోచిస్తే ఎట్లా? నెలరోజులపాటు పరిపాలన గాలికి వదిలేసి మూర్ఖులను పట్టుకొని రమ్మన్న నువ్వొక మూర్ఖునివి. నువ్వు అట్లా చెప్పడం ఆలస్యం మారు మాట్లాడకుండా సరేనంటూ అన్నీ వదిలేసి బైలుదేరిన నేనొక మూర్ఖున్ని నిజమా కాదా" అన్నాడు.

ఆ మాటలకు తప్పు తెలుసుకున్న రాజు చిరునవ్వుతో మంత్రి భుజం తట్టి మెచ్చుకున్నాడు.

# 93 పిల్లపెత్తనం చేసిన నక్క

ఒకూర్లో ఒకవ్వ వుండేది. ఆమెకో మనవడున్నాడు. కొడుకూ కోడలూ చిన్న వయసులోనే చనిపోవడంతో అవ్వే మనవన్ని పెంచుకుంటా వుంది. వాడు చానా మంచోడు. ఎవరికి ఎప్పుడు ఎలాంటి ఆపద వచ్చినా చేతనైన సాయం చేసేటోడు. ఒకరోజు అవ్వ మనవన్ని పిలిచి "రేయ్... సంతకు పోయి ఒక మంచి పాలిచ్చే బంగారంలాంటి బరగొడ్డుని కొనుక్కోని రాపోరా" అని పంపిచ్చింది. వాడు సరేనని డబ్బులు తీసుకోని పోతా వుంటే అడవిలో ఒక రైతు ఒక నక్కను తాడుతో కట్టేసి బరబరా గుంజుకోని పోతా కనబన్నాడు.

ఆ నక్క దారిలో కనబన్నోళ్ళనంతా "అనా... అనా... కొంచం కాపాడండనా... ఈ ఒక్కసారికి వదిలెయ్యమని చెప్పండనా" అని అడుగుతా వుంది. కానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అది చూసి వాడు "ఏందనా... దాన్ని పట్టుకోని అట్లా పోతావున్నావు. ఏమైంది" అన్నాడు. దానికా రైతు పళ్ళు పటపటమని కొరుకుతా "ఈ దొంగసచ్చినేది మొన్న ఎవరూ లేనిది సూసి నా మంచి కోడిపుంజును లటుక్కున పట్టుకోని చంపి తినేసింది. అందుకే ఈరోజు వలేసి పట్టుకున్నా. దీన్ని అడవిలోనికి తీసుకోని పోయి చంపితే తప్ప నా కోపం తీరదు" అన్నాడు. వాడు నక్కకెళ్ళి చూసినాడు. దాని ఒళ్ళంతా రక్తం కారతా వుంది. అయ్యోపాపమని జాలేసింది. దాంతో "అనా... ఏదో ఆకలై కడుపు నింపుకోడానికి తప్పు చేసింటాది. దానికే అంత శిక్ష వేస్తే ఎట్లా. ఇప్పటికే బాగా మెత్తగా తన్నినావు గదా. ఇంక వదిలెయ్యి. మళ్ళా జన్మలో ఈ దరిదాపులకు గూడా రాదులే" అన్నాడు. కానీ దానికారైతు ఒప్పుకోక "ఏంది బంగారంలాంటి నా కోడిపుంజుని చంపిన దీన్ని వదిలెయ్యడమా... చచ్చినా వదలను. ఈరోజు దీన్ని చంపి బూడ్చి పెట్టాల్సిందే" అన్నాడు కోపంగా. దాంతో వాడు "అనా... అనా... ఎందుకో దీన్ని చూస్తా వుంటే జాలేస్తా వుంది. కావాలంటే ఈ డబ్బులు తీసుకోని దాన్ని నాకియ్యి" అన్నాడు అవ్వ ఇచ్చిన డబ్బులు చూపిస్తా. అన్ని డబ్బులు చూసేసరికి ఆ రైతుకి ఆశ పుట్టింది. "వీడెవడో పిచ్చోనిలెక్కున్నాడు. ఆలస్యం చేస్తే బంగారంలాంటి అవకాశం తప్పిపోవచ్చు" అనుకోని వెంటనే వానికి నక్కను అప్పజెప్పి డబ్బులు తీసుకోని వెళ్ళిపోయినాడు.

వాడు నక్కకు కట్లు విప్పి దెబ్బలకు కట్టు కట్టి ఇంటికి తీసుకోనొచ్చినాడు. అది చూసి వాళ్ళవ్వ "అరే... ఇదేందిరా... మాంచి పాలిచ్చే బంగారంలాంటి బరగొడ్డును తీసుకోని రమ్మంటే ఇట్లాంటి పనికిరాని పోరంబోకు దాన్ని తెచ్చినావు. ఏం చెయ్యాల దీన్ని. అనవసరంగా తిండి దండుగ" అనింది. దానికా నక్క "అవ్వా... అవ్వా... అంతమాటనొద్దు. అన్నగాని కాపాడకపోతే ఇప్పటికల్లా సచ్చి శవమై పోతా వుంటి. నా ప్రాణాన్ని నిలబెట్టినాడు కాబట్టి మీరు కలలో గూడా వూహించనంత మేలు ఏదో ఒకటి చేస్తా. కొద్దిరోజులాగండి. ఈ దెబ్బలు కొంచం

తగ్గనీ" అనింది. "సర్లే... మాటలకేంలేగానీ కోటలు దాటించొచ్చు ఎవరైనా... చెప్పడం కాదు చేసి చూపించు. అప్పుడు నమ్ముతా" అనింది అవ్వ.

నక్క ఆ ఇంట్లోనే వుంటా... వాళ్ళు పెట్టింది తింటా కొద్దిరోజుల్లోనే మళ్ళా మామూలుగా తయారయ్యింది. ఒకరోజు అవ్వ దగ్గరికి పోయి "అవ్వా...అవ్వా... నాకు రేప్పొద్దున చద్ది కట్టు. ఈడికి కొంచం దూరంలోనే ఒక రాజున్నాడంట. ఆయనకు ఒకే ఒక కూతురుందంట. పోయి మనోనికి ఇస్తాడేమో కనుక్కోనొస్తా" అనింది. దానికా అవ్వ "ఏందీ... మనోనికి రాజు కూతురా.... తెలివుండే మాట్లాడతావున్నావా... వాళ్ళెక్కడ మనమెక్కడ... నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుంది" అనింది. దానికా నక్క నవ్వుతా "అవ్వా... అదంతా నీకెందుకు. చూస్తా వుండు నేనేం చేస్తానో" అని సర్ది చెప్పింది. తరువాత రోజు పొద్దున్నే అవ్వ లేసి అన్నం చేసి మూట కట్టింది. నక్క దాన్ని తీసుకోని పోతా వుంటే ఎదురుగా లక్ష్మిదేవి అడ్డం వచ్చింది.

"ఛీ... ఛీ... ఛీ... పొద్దున్నే ఈమె మొగం చూసినా. ఇట్లాంటోళ్ళ మొగం చూస్తే పనయినట్లే" అని గొణుక్కుంటా మరలా ఇంటికొచ్చి బువ్వ పాడేసింది. అది చూసి అవ్వ "ఏందే... బంగారంలాంటి బువ్వనట్లా నేలపాలు చేసినావు. ఏమైంది" అనింది. దానికా నక్క "ఏం చేద్దామవ్వా మంచి పనికి పోతా వుంటే లక్ష్మిదేవి ఎదురొచ్చింది. అందుకే తిరిగొచ్చేసినా" అనింది. దానికా అవ్వ "అదేందే... లక్ష్మిదేవి ఎదురైతే మంచిదే గదా" అనింది ఆచ్చర్యపోతా. ఆ మాటలకా నక్క "ఏందవ్వా అట్లంటావు. లక్ష్మిదేవి ఎప్పుడూ వున్నోళ్ళ దగ్గర్నే వుంటాది తప్ప మనలాంటి లేనోళ్ళకెళ్ళి కన్నెత్తయినా చూస్తాదా... వాళ్ళు మంచోళ్ళా చెడ్డోళ్ళా అని అస్సలు పట్టిచ్చుకోదు. జనాలని ముంచేటోళ్ళయినా, ఖూనీకోర్లయినా, దొంగలయినా, అచ్చరం ముక్క రానోళ్ళయినా ఏ మాత్రం పట్టిచ్చుకోకుండా వాళ్ళ దగ్గర్నే కులుక్కుంటా తిరుగుతా వుంటాది. అందుకే ఆమె అంటే నాకస్సలు పడదు" అనింది.

తరువాత రోజు పొద్దున్నే మళ్ళా అవ్వ కట్టిచ్చిన సద్దిమూట తీసుకోని నక్క బైటకొచ్చింది. అంతలో దానికీసారి సరస్వతీదేవి ఎదురొచ్చింది. ఆమె మొగం చూడగానే "ఛ... ఛ... ఛ... పొద్దున్నే ఈమె మొగం చూసినాను. ఇట్లాంటోళ్ళ మొగం చూస్తే ఇక పనయినట్లే" అని గొణుక్కుంటా మరలా లోపలికి వచ్చి బువ్వ పాడేసింది.

అది చూసి అవ్వ "అదేందే... మళ్ళా ఈరోజు కూడా పాడేసినావు. ఏమైంది" అనింది. దానికా నక్క "ఏం చేద్దామవ్వా... పోతా వుంటే సరస్వతీదేవి ఎదురొచ్చింది. అందుకే తిరిగొచ్చేసినా" అనింది. అందుకా అవ్వ "అదేందే... సదువుల తల్లి సరస్వతీదేవి ఎదురైతే మంచిదే గదా" అనింది ఆచ్చర్యపోతా. దానికా నక్క "ఏందవ్వా అట్లంటావ్... సరస్వతీదేవి ఎప్పుడూ వున్నోళ్ళ దగ్గర్నే వుంటాది తప్ప మనలాంటి లేనోళ్ళ వంక కన్నెత్తయినా చూస్తాదా... వాడు నాలుగు ముక్కలు సదువుకోని జనాలను వుద్ధరిస్తాడా లేక నిలువునా ముంచేస్తాడా అనేది అస్సలు పట్టిచ్చుకోదు. ఎంత పనికిమాలినోడయినా సరే డబ్బులుంటే సాలు కులుక్కుంటా వాళ్ళ నట్టింట్లో సంబరంగా దిగుతా వుంటాది. అందుకే ఆమె అంటే నాకస్సలు ఇష్టం లేదు" అనింది.

మూడోరోజు పొద్దున్నే మళ్ళా అవ్వ కట్టిచ్చిన సద్దిమూట తీసుకోని నక్క బైటకొచ్చింది. అంతలో దానికి అటువైపు పోతా వున్న అగ్నిదేవుడు కనబన్నాడు. వెంటనే "అవ్వా... అగ్నిదేవుడు కనబన్నాడు. ఇంగ పోయొస్తా"



అనింది. దానికా అవ్వ "అదేందే... నీకు లక్ష్మిదేవి, సరస్వతీదేవి చెడ్డయి, కొంపలంటించే అగ్నిదేవుడు మంచోడయినాడా... నేనెక్కడా చూళ్ళా ఇట్లాంటి విడ్డూరం" అనింది.

దానికా నక్క ''అదేందవ్వా... అంత మాటంటావు. ఎవరింట్లో పొయ్యి వెలగాలన్నా... నోట్లోకింత కూడు పోవాలన్నా అగ్నిదేవుడే గదా దిక్కు. పాపం వున్నోళ్ళా లేనోళ్ళా అని అస్సలు చూడడు. అందరింట్లోనూ వుంటాడు. అందుకే ఆయనంటే నాకు చానా ఇష్టం" అంటూ సద్ది తీసుకోని సక్కగా రాజుగారి వూరికి బైలుదేరింది. అడవులు దాటుతా, కొండలు దాటుతా, నదులు దాటుతా చివరికి ఆ రాజ్యానికి చేరుకోనింది. భటులు దాన్ని వూరివాకిలి కాన్నే ఆపేసినారు. "ఎవరు నువ్వు... యాన్నుంచి వస్తా వున్నావు. మా రాజ్యంలో నీకేం పని" అని అడిగినారు. దానికా నక్క "నేను చానా దూరం నుంచి ఒక రాజు పంపిస్తే వస్తా వున్నా. మీ రాజు కూతురు సక్కదనాల సుక్కంటగదా... మా పిల్లోనికేమయినా ఇస్తారేమో కనుక్కోవాల. పోండి పోయి మీ రాజుతో నేను పిల్ల పెత్తనానికి వచ్చిన విషయం చెప్పి రాపోండి" అనింది. సరేనని వాళ్ళు పోయి రాజుకు చెప్పినారు. "నక్కేంది... పిల్ల పెత్తనానికి రావడమేంది" అని రాజు ఆచ్చర్యపోయి దాన్ని పిలిపించినాడు. రాజు నక్కతో... "నా కూతురితో పెండ్లంటే మాటలు గాదు. మా భవనాలు, బంగారం, భోగభాగ్యాలు అన్నీ చూసినావు గదా... మరి మీ పిల్లోనికేముంది" అని అడిగినాడు.

దానికా నక్క "ఏంది రాజా అట్లంటావు. మాది అట్లాంటిట్లాంటి అల్లాటప్పా పట్టణం కాదు. పన్నెండామడల పట్టణం. ఇంటింటి ముందు బంగారు అరుగులు, రత్నాల ముగ్గులు వుంటాయి. కింద పోయే చీమ మాట్లాడతాది. పైన పోయే దోమ మాట్లాడతాది. వున్నోళ్ళు ఇంట్లో రత్నాల పళ్ళెంలో తింటే, ఎంత లేనోళ్ళయినా బంగారు పళ్ళెంలో తింటారు. చుట్టు పక్కల ఏడేడు లోకాల్లోనూ అట్లాంటి నగరం మరెక్కడా వుండదు" అని చెప్పింది. దాంతో రాజు సంబంధానికి ఒప్పుకోని ముహూర్తాలు పెట్టుకుందామన్నాడు. "సరే... ఇప్పటికి పద్దైదు రోజుల తర్వాత మంచి ముహూర్తం వుంది. ఆ రోజు పిల్లను తీసుకోని మా వూరికి రండి" అంటూ అన్నీ మాట్లాడుకోని ఎట్లెట్ల రావాల్నో చెప్పి బైలుదేరింది.

నక్క ముహూర్తాలైతే పెట్టించింది గానీ ఈడ చూస్తే తినడానికి తిండి గూడా సరిగా లేదు. దాంతో అడవిలోనికి పోయి నిమ్మకాయ మీద నిలబడి ఘోరమైన తపస్సు చేసింది. ఆ తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై "ఏందే నక్కా... ఏందీ తపస్సు. పద్మాసనంలో తపస్సు చూసినా, ఒంటికాలి మీద తపస్సు చూసినా, అన్నం

తినకుండా తపస్సు చూసినా, తలకిందులుగా తపస్సు చూసినా గానీ ఇట్లా నిమ్మకాయ మీద నిలబడి తపస్సు చేసినోళ్ళని ఇంతవరకూ చూల్లేదు. చెప్పు... ఎందుకిట్లా ఘోరంగా తపస్సు చేసినావు. ఏం కావాల నీకు" అని అడిగినాడు.

అప్పుడానక్క "ఏం లేదు సామీ... చానా చిన్న కోరిక. నాకు పన్నెండామడల పట్టణం కావాల. అందులో ఇంటింటి ముందు బంగారు అరుగులు, రత్నాల ముగ్గులు వుండాల. కింద పోయే చీమ మాట్లాడాల. పైన పోయే దోమ మాట్లాడాల. ఉన్నోళ్ళు రత్నాల పళ్ళెంలో తింటా వుంటే ఎంత లేనోళ్ళయినా బంగారు పళ్ళెంలో తింటా వుండాల. అట్లాంటి నగరాన్ని కేవలం పదేపది రోజులు వుండేలా నా కోసం తయారు చేసివ్వండి. అంతకు మించి ఇంకేం వద్దు" అనింది. "సరే... పదిరోజులే అంటా వున్నావు గదా... ఇస్తా పో" అన్నాడు శివుడు.

అంతే... మరుక్షణంలో అక్కడ కనీవినీ ఎరగనంత అద్భుతమైన పట్టణం ప్రత్యక్షమైంది. నక్క పోయి అవ్వను, మనవన్ని తీసుకోనొచ్చి పన్నీటిలో స్నానం చేయించి, పట్టుబట్టలు కట్టించి, అంగరంగ వైభవంగా వూరంతా వూరేగించి సింహాసనం మీద కూర్చోబెట్టి పక్కవూరి రాజుకు కబురు పంపింది.

రాజు కూతురిని తీసుకోని బంధువులతో, మిత్రులతో ఆ వూరిలో అడుగుపెట్టినాడు. యాడ చూసినా బంగారమే... యాడ చూసినా రత్నాలే... పైన పోయే దోమ పలకరిస్తా వుంది. కింద పోయే చీమ పలకరిస్తా వుంది. ఆ వింతలన్నీ చూసుకుంటా రాజభవనంలోనికి అడుగు పెట్టినారు. నక్క ఎదురొచ్చి అందరినీ విడిదింటికి తీసుకోని పోయింది. తాంబూలాలు మార్చుకున్నారు. మూడు రోజుల తరువాత పెండ్లి పెళ్ళికూతురి ఇంట్లో చేద్దామనుకున్నారు. నక్క అందరినీ తీసుకోని రాజుగారి వూరికి పోయింది. రాజు వాళ్ళకు ఏ మాత్రం తక్కువ చేయకుండా భూమంత అరుగేసి, ఆకాశమంత పందిరేసి కనీవినీ ఎరగనంత అద్భుతంగా పెండ్లి చేసి వూరు వూరంతటికీ మూడు పూటలా అరవై ఆరు వంటకాలతో అద్భుతంగా అన్నం పెట్టించినాడు. అట్లా ఆడ మూడురోజులు గడిచిపోయినాయి.

నక్క మరలి పెండ్లికి కొత్త కోడల్ని, రాజుని అందరినీ తీసుకోని వచ్చింది. అది ఆ పట్టణం తయారయిన పదవరోజు. శివుడు వరమిచ్చింది పదిరోజులకే గదా... దాంతో వాళ్ళు ఆ పట్టణంలో కాలు పెట్టడం ఆలస్యం పట్టణం మొత్తం మాయమైపోయింది. అది చూసిన నక్క వెంటనే "ఓరి నాయనోయ్... మీ పిల్ల కాలు మంచిది కానట్టుంది. దేవుడోయ్... ఆ పిల్ల అడుగు పెట్టగానే మా బంగారు పట్టణం కాస్తా మాయమైపోయింది... ఇంక పిల్ల కాపురానికొస్తే ఇంకేం జరుగుతాదో ఏమో నాయనోయ్. మాకు ఈ పిల్లా వద్దు. దీనితో సంసారమూ వద్దు దేవుడోయ్" అంటూ దొంగేడుపు ఏడవసాగింది.

అది చూసి రాజు "లేదు... లేదు... మీరేమీ బాధపడకండి. నాకెట్లాగూ కొడుకులు లేరు. వుండేది ఒక్కతే కూతురు. అల్లున్ని నాతోబాటే వుంచుకుంటా... ఎట్లాగూ నా తర్వాత రాజ్యం అల్లునికే గదా" అని చెప్పి కూతుర్ని, అల్లున్ని, అవ్వను తీసుకోని తన రాజ్యానికి వెళ్ళిపోయినాడు.

"హమ్మయ్య... నా ప్రాణాలు కాపాడినందుకు ఋణం తీర్చుకున్నాను" అనుకోని నక్క సంబరంగా తిరిగి అడవిలోనికి వెళ్ళిపోయింది.

# 94 నాకు మూడు నీకు రెండు

ఒకూర్లో ఒకడుండేటోడు. వానికీ వాని పెండ్లానికీ అస్సలు పడేదిగాదు. ప్రతిదానికీ నువ్వెంతంటే... నువ్వెంతంటూ... పందెం కోళ్ళలెక్క గొడవ పడేటోళ్ళు. ఎవరూ కొంచం కూడా వెనక్కి తగ్గేటోళ్ళు కాదు.

ఒకరోజు మొగుడు జొన్నపిండి తీస్కోనొచ్చి రొట్టెలు చేయమని పెండ్లానికిచ్చినాడు. సరే అని ఆమె పిండి తడిపి రొట్టెలు చేస్తే అవి సరిగ్గా ఐదంటే ఐదయినాయి. ఇద్దరికీ తలా రెండు పోతే ఇంకా ఒకటి మిగులుతుంది గదా... దాంతో గొడవ మొదలైంది.

"తెచ్చింది నేను కాబట్టి నాకు మూడు నీకు రెండు" అని వాడు, "కష్టపడి చేసింది నేను కాబట్టి నాకు మూడు నీకు రెండు" అని ఆమె నాకెక్కువంటే నాకెక్కువంటూ అరచుకోసాగినారు.

అప్పుడు మొగుడు "ఇట్లాకాదుగానీ... మనమొక పందెం వేసుకుందాం... ఇద్దరమూ కదలకుండా మెదలకుండా మంచమ్మీద మట్టసంగా పండుకుందాం. ఎవరు మొదట కదిల్తే వాళ్ళు ఓడిపోయినట్టు. గెలిచినోళ్ళకి మూడు. ఓడినోళ్ళకి రెండు... సరేనా" అన్నాడు. ఆమె ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా సయ్యంటే సయ్యనింది.

ఇంగచూడు ఇద్దరూ తలా ఒక మంచమ్మీద కదలకుండా మెదలకుండా అచ్చం శవాల్లెక్క బిగదీసుకోని పండుకొన్నారు. గంటయింది... రెండు గంటలయింది... మూడు గంటలయింది... నాలుగు గంటలయింది... వూహూ ఒక్కరంటే ఒక్కరు కదిల్తే ఒట్టు.

అప్పుడే పక్కింటామె తోడుకి కాస్త పెరుగు అడుగుదామని లోపలికొచ్చింది. వచ్చి చూస్తే ఇంగేముంది. ఒకొక్కరూ ఒకొక్క మంచమ్మీద అడ్డంపడి అచ్చం శవాల్లెక్క బిగదీసుకోని పోయి కనబన్నారు. "ఏమయిందబ్బా వీళ్ళకి" అని ఆమె తట్టితట్టి లేపినా లేస్తే ఓడిపోతామని మరింత బిగదీసుకోని పండుకున్నారే గానీ ఒక్కరు గూడా వూ అనలేదు... ఆ అనలేదు...

దాంతో ఆమె వాళ్ళిద్దరూ చచ్చిపోయినారేమో అనుకోని వురుక్కుంటా బయటకు పోయి వూరందరినీ పిలుచుకోనొచ్చింది. వచ్చినోళ్ళందరూ వాళ్ళిద్దరినీ చూసి "అయ్యో... పాపం... ఏమయిందో ఏమో... ఒకేసారి ఇద్దరూ చచ్చిపోయినారు" అని బాధపడినారు. చచ్చిపోయినోళ్ళని ఇంట్లోనే వుంచరు గదా... శ్మశానానికి తీసుకోని పోవాలగదా... దాంతో వూర్లోవాళ్ళు ఇద్దరినీ కూచోబెట్టి నీళ్ళతో స్నానం చేపిచ్చి... కొత్త బట్టలు తొడిగి... పాడె మీదికి ఎక్కిచ్చినారు. ఇంత జరుగుతావున్నా వాళ్ళు లేస్తేనా... పందెం పందెమే అనుకోని అట్లాగే కట్టు కదలకుండా మట్టసంగా ఎట్లున్నవాళ్ళు అట్లాగే వుండిపోయినారు.



వూరు వూరంతా వెంట రాగా వాళ్ళిద్దరినీ మోసుకుంటా... ముందు తప్పెట్లు మోగుతా వుంటే.. పూలు, బొరుగులు, డబ్బులు చల్లుకుంటా... చల్లుకుంటా... ఆఖరికి శ్మశానానికి తీసుకోనొచ్చినారు.

ఇద్దరినీ పాడె మీద నుండి దించి కట్టెల మీద పెట్టి... వాళ్ళ మీద గూడా ఒళ్ళంతా కట్టెలు, పిడకలు పేర్చి ఒకేసారి రెండింటినీ అంటించినారు. అంతే... మంట సుర్రుమని తగిలేసరికి అదిరిపడి ఇద్దరూ ఒకేసారి ఓ అని అరుస్తా పైకి లేచినారు. లేవడం... లేవడం... ఒకరినొకరు చూసుకోని నువ్వు ముందు లేసినావంటే... నువ్వు ముందు లేసినావంటూ... నేను మూడు తింటానంటే... నేను మూడు తింటానంటూ గట్టిగా అరుచుకోసాగినారు.

వచ్చినోళ్ళందరూ వాళ్ళిద్దరూ ఒక్కసారిగా చితి మీది నుండి అట్లా పైకి లేచేసరికి వీళ్ళు చచ్చి దయ్యాలయినారేమోనని భయంతో గజగజా వణికిపోయినారు. అంతలో "నేను మూడు తింటానంటే.. నేను మూడు తింటానంటూ" వాళ్ళిద్దరూ కొట్లాడుకోవడం చూసి... అవి తమని తినడానికే వంతులేసుకుంటున్నాయని బెదపడి "రేయ్... దయ్యాలు... దయ్యాలొస్తున్నాయి... పారిపోండి.... పారిపోండి" అని అరుచుకుంటా ఎక్కడి వాళ్ళక్కడ వెనక్కి తిరిగి చూడకుండా వూరి వైపు వురకడం మొదలుపెట్టినారు.

దయ్యాలొస్తున్నాయనేసరికి వీళ్ళిద్దరు గూడా అదిరిపడి నిజంగా వస్తున్నాయేమో అనే భయంతో వాళ్ళు గూడా వూరోళ్ళ వెనకాల్నే వురకడం మొదలుపెట్టినారు. అట్లా ముందు వాళ్ళూ... వెనుక వీళ్ళు... ఒకర్ని చూసుకోని ఒకరు కిందా మీదా పడ్తా వురకడం వురకడం కాదు...

ఆఖరికి విషయం తెల్సుకోని వూరువూరంతా "ఓరినీ.. మీ మీద బండపడ... భయంతో సచ్చినాం గదరా... అనవసరంగా" అని నవ్వుకుంటానే వాళ్ళను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టినారు.

# 95

# అమ్మో...
# ఇది సామాన్యురాలు గాదు

ఒకూర్లో ఒక పిల్లోడున్నాడు. వాడు అన్నీ అతికం పనులే చేస్తా వుంటాడు. వానికి పెండ్లి ఈడు వచ్చింది. వాని స్నేహితులు పెద్ద పోరంబోకోళ్ళు. వాళ్ళు ఒకరోజు వాన్ని కూచోబెట్టుకోని "రేయ్... పెండ్లాన్ని మొదటి నుంచే అదుపులో పెట్టుకోవాల. లేకుంటే ఏకు మేకైపోతాది. నువ్వు కొట్టినా, తిట్టినా ఎవరైతే మారు మాట్లాడకుండా గమ్మున పడుంటారో అట్లాంటోళ్ళనే పెండ్లి చేసుకో" అని బాగా ఎక్కించినారు. దాంతోవాడు గూడా చెప్పుడు మాటలు విని "చేసుకుంటే అట్లాంటి పిల్లనే చేసుకుంటా... లేదంటే లేదు" అని అడ్డం కూచున్నాడు. ఎవరైనా సరే చూసి చూసి అట్లాంటోనికి తమ పిల్లను ఎట్లా ఇస్తారు. దాంతో వానికి పెండ్లి చేయలేక వాళ్ళ నాన్న తల పట్టుకున్నాడు. ఆ వూళ్ళోనేగాక చుట్టుపక్కల అన్ని వూళ్ళలోనూ సంబంధం కోసం వెదికీ వెదికీ అలసిపోయినారు.

ఆ వూరికి కొంచం దూరంలోనున్న ఇంకో వూరిలో ఒక అమ్మాయి వుంది. ఆ అమ్మాయి చానా తెలివైంది. చూడ్డానికి బంగారు బొమ్మలాగా వుంటాది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. కానీ వాళ్ళు చానా పేదోళ్ళు. దాంతో ఆ పాప పెండ్లీడుకొచ్చినా డబ్బుల్లేక వాళ్ళ అమ్మానాయనా పెండ్లి చేయలేకపోయినారు. ఆ పాపకు వీని విషయం తెలిసి... "కట్నం గిట్నం అడగకుండా, పెండ్లి ఖర్చులు కూడా మగపిల్లోని తరపువాళ్ళే పెట్టుకునేటట్లయితే నేను చేసుకుంటా" అని ముందుకొచ్చింది. ఏ చెట్టూ లేనిచోట ఆముదం చెట్టే గతన్నట్లు వాళ్ళు సరేనన్నారు.

పక్కింట్లో గలాటయితే విడిపిచ్చేటోళ్ళకన్నా ఎగేసేటోళ్ళు, వీధుల్లోకొచ్చి వినోదం చూసేటోళ్ళు ఎక్కువ గదా మనలో... దాంతో చానామంది పెండ్లికొచ్చినారు తంతా వుంటే చూద్దామని. గుడిలో అందరి ముందూ అంగరంగ వైభవంగా పెండ్లి అయ్యింది. తాళి కట్టిన వెంటనే మొగుడు ఇంత లావు కట్టె తీసుకోనొచ్చి "ఏమే... ఇంగ వెనక్కు తిరుగు. అందరి ముందు నిన్ను కిందా మీదా ఏసి తంతా" అన్నాడు సంబరంగా. దానికామె చిరునవ్వు నవ్వి "తాళి కట్టి కాసేపన్నా కాలేదు. అప్పుడే అంత తొందరెందుకు. అదీగాక ఇది గుడి. ఇక్కడ తంతే దేవునికి కోపం వచ్చినా వస్తాది. ఆపైన నిన్నేమయినా చేస్తే కష్టం. రేపు ఇంటికాడ తందువుగానీలే" అనింది. వానికి దేవుడంటే కొంచం భయం. దాంతో ఎందుకొచ్చిన గొడవలే అనుకోని 'సరే' అన్నాడు.

తరువాతరోజు పొద్దున్నే తలుపుకాడ నిలబడి "ఏమే... ఇంగరా బైటకి. ఈ రోజు నిన్ను వుతికి ఆరేస్తా" అన్నాడు సంబరంగా తొడ కొడతా. దానికామె చిరునవ్వు నవ్వుతా "ఎందుకట్లా తొందరపడతావు. ఈ రోజు ఇంట్లో వ్రతం చేస్తా వున్నారు. అంతా నిష్ఠతో వున్నారు. ఇప్పుడు గనుక తంతే వ్రతం చెడిపోయి వూరు వూరంతా మొగమ్మీదే వుమ్మేస్తారు. రేపు తందువుగానీలే" అనింది. ఆమె చెప్పింది గూడా నిజమే గదా అనుకోని వాడు 'సరే' అన్నాడు.

తరువాతరోజు పొద్దున్నే కట్టె తీసుకోనొచ్చి "ఏమే... ఇంగరా బైటకి... ఇప్పటికే రెండు రోజులైపోయింది. ఈ రోజు నీ సంగతి అటో ఇటో తేల్చి పారేస్తా" అన్నాడు చిందులు తొక్కుతా. దానికామె చిరునవ్వు నవ్వుతా "చూడు... ఎందుకట్లా అనవసరంగా అరుస్తా ఆయాసం తెచ్చుకుంటావ్. ఇది మా వూరు. మా ఇండ్లు. ఇక్కడ నువ్వు కొట్టినా, తిట్టినా ఏం లాభం. ఎవరికి తెలుస్తాది. గొడవపడిన విషయం గడప దాటదు. ఇంగో రెండు రోజులు ఆగితే మీ ఇంటికొస్తా గదా. అప్పుడయితే నీ ప్రతాపం నీ వూరు వూరంతా మోగిపోతాది. ఏమంటావు" అనింది. దానికి వాడు కొంచం ఆలోచించి 'సరే' అన్నాడు.

రెండ్రోజుల తరువాత ఆమె పుట్టింటి నుంచి అత్తింటికి చేరుకోనింది. చుట్టుపక్కల జనాలంతా పెండ్లికూతురిని చూడ్డానికి ఎగబడి వచ్చినారు. వాడు అందరి ముందు చిందులు తొక్కుతా "ఏమే... ఇప్పటికే పెండ్లయి అయిదురోజులు దాటిపోయింది. ఇంగరా బైటకి. అందరి ముందు వీధిలో నిన్ను కిందామీదా ఏసి తన్ని మా వూరోళ్ళందరికీ నా ప్రతాపం చూపిస్తా" అన్నాడు.

దానికామె చిరునవ్వుతో బైటకొచ్చి "ముందు నేను అడిగిందానికి సమాధానం చెప్పు. నన్ను నువ్వు డబ్బులు ఖర్చుపెట్టుకోని పెండ్లి చేసుకున్నావా... లేక మీ నాయన ఖర్చు పెడ్తే చేసుకున్నావా" అనడిగింది. దానికి వాడు "నా దగ్గర డబ్బులెక్కడివి. మా నాయనే ఖర్చు పెట్టి చేసినాడు" అన్నాడు. అప్పుడామె చిరునవ్వు నవ్వి "మరి చేతిలో దమ్మిడీ గూడా లేదు. పెండ్లానికి సొంతంగా తిండి పెట్టే గతిగూడా లేదు. అట్లాంటిది నన్ను కొట్టే అధికారం నీకెక్కడిది. పో... పోయి... ముందు డబ్బులు సంపాదించుకోనొచ్చి ఇండ్లు నడుపు. అప్పుడు కొడుదువు గానీ అందరి ముందు" అనింది.దాంతో వానికి అందరి ముందు తల కొట్టేసినట్లయింది. రోషంగా "సరే... అయితే పోయి నూటికి నూరు వరహాలు సంపాదించుకోని వస్తా... అప్పుడు చెబ్తా నీ సంగతి" అంటా వాళ్ళ నాయన దగ్గర నూరు బంగారు వరహాలు అప్పు తీసుకోని బైలుదేరినాడు.

ఆడికి చానా దూరంలో ఒక నగరముంది. ఆడ యాపారం చేసి సంపాదించుకొద్దామని పోసాగినాడు. సగం దూరం పోయేసరికే బాగా చీకటి పడింది. బాగా అలసిపోయినాడు. ఎట్లాగబ్బా అని చూస్తా వుంటే కొంచం దూరంలో ఒక చిన్న వూరు, అక్కడ ఒక పూటకూళ్ళ పెద్దమ్మ ఇండ్లు కనబడింది. ఆమె చానా దొంగది. వీనికది తెలీక ఆ ఇంటికి పోయి "అవ్వా... అవ్వా... ఆకలవుతా వుంది. అన్నం పెట్టి కొంచం ఈ రాత్రికి ఈన్నే పండుకోడానికి చోటివ్వు. ఒక బంగారు వరహా ఇస్తా" అన్నాడు. ఆమె 'సరే' అనింది. వానికి బాగా మాంచి కమ్మని భోజనం వండిపెట్టి చివరలో ఆకూవక్కలో మత్తుమందు కలిపి ఇచ్చింది. దాంతో వాడు మబ్బెక్కి కదలకుండా మెదలకుండా అట్లాగే పడి నిద్రపోయినాడు.

అర్ధరాత్రయినాక ఆ పూటకూళ్ళామె నెమ్మదిగా వాని సంచీ తీసి అందులో ఎన్ని వరహాలున్నాయో లెక్కపెట్టింది. తన పెట్టెలోనుంచి వంద బంగారు వరహాలు తీసుకోనొచ్చి వాని సంచీలో వేసి దాన్ని ఎప్పట్లాగే మూటగట్టి వాని పక్కన పెట్టింది. వానికిదంతా తెలీదు గదా... దాంతో హాయిగా నిదురపోతా వున్నాడు.

పొద్దున్నే పూటకూళ్ళమ్మ అందరినీ పిలుస్తా "ఓరి నాయనోయ్.. ఓరి దేవుడోయ్... నా ఇంట్లో ఎవరో దొంగతనం చేసి, నేను దాచిపెట్టుకున్న రెండువందల బంగారు వరహాలు ఎత్తుకోనిపోయినారు దేవుడా... మూసిన తలుపులు మూసినట్లే వున్నాయి. వేసిన తాళం వేసినట్లే వుంది. కానీ పెట్టెలో వున్న వరహాలు మాత్రం

మాయమైపోయినాయి. నిన్న నా ఇంట్లో వీడు తప్ప ఇంకెవరూ లేరు. నాకు వీని మీదే అనుమానంగా వుంది" అంటా దొంగ ఏడ్పులు ఏడ్వసాగింది.

అది చూసి అందరూ వాన్ని పట్టుకోని సంచీ వెతికితే వరహాల మూట బైటపడింది. అది చూసి వాడు "అది నాదే... దాంట్లో వంద వరహాలు వున్నాయి. ఏదయినా యాపారం చేద్దామని తెచ్చుకున్నా" అన్నాడు. "అట్లాగా... సరే... ఎంచుదాం ఎన్నున్నాయో" అంటా జనాలు లెక్కబెడితే ఇంగేముంది మొత్తం రెండు వందలున్నాయి. దాంతో అందరూ వాన్ని పట్టుకోని మెత్తగా తన్ని "దొంగ వెధవా... వరహాలు కొట్టేసింది గాక మళ్ళా అబద్ధాలు చెబుతావా. ఇక నుంచీ ఈ ఇంట్లోనే పని చేసుకుంటా పడుండు. బైటికొచ్చినావా రాజభటులకు పట్టిస్తాం చూడు. ఇదే నీకు శిక్ష" అన్నారు.

దాంతో వాడు కక్కలేక మింగలేక ఆన్నే ఆమె ఇంట్లో గొడ్డుచాకిరీ చేస్తా వుండిపోయినాడు. ఈడ వాని ఇంట్లో మొగుడు వస్తాడు.... వస్తాడు... అని ఎన్నినాళ్ళు ఎదురుచూసినా రాకపోవడంతో ఏమైందో... ఏమోనని ఆమె మొగవాని వేషం వేసుకోని, వందవరహాలు తీసుకోని, గుర్రమెక్కి మొగున్ని వెతుక్కుంటా వాడు వెళ్ళిన వైపే బైలుదేరింది.

దారిలో కనబడిన వాళ్ళనంతా అడుగుతా అడుగుతా చీకటి పడే సమయానికంతా పూటకూళ్ళ ఇండ్లు చేరుకోనింది. మొగుని గురించి కనుక్కుందామని లోపలికి పోయింది. పోయి చూస్తే ఇంకేముంది అంట్లు తోముతా కనబన్నాడు. ఆమె మూతికి మీసం, మొగానికి గడ్డం, నెత్తికి తలపాగా తగిలించుకోని మొగోని వేషంలో వుందిగదా... దాంతో వాడు కొంచెం గూడా గుర్తుపట్టలేక పోయినాడు.

ఆమె పూటకూళ్ళామెతో "అవ్వా... అవ్వా... ఆకలవుతా వుంది. అన్నం పెట్టి కొంచం ఈ రాత్రికి ఈన్నే పండుకోడానికి చోటివ్వు. ఒక వరహా ఇస్తా" అనింది. ఆమె సంచిలో గలగలాడతా వున్న వరహాలను చూసి ఆ ముసల్దానికి ఆశ పుట్టి సరే అని.. బాగా మాంచి కమ్మని భోజనం వండి పెట్టింది. చివరలో మత్తుమందు కలిపిన ఆకువక్క ఇచ్చింది. అది నోట్లో వేసుకోవడంతోనే ఆమెకు రుచిలో తేడా అనిపించింది. దాంతో దాన్ని మింగకుండా నములుతా నములుతా బైటకు పోయి అంతా వుమ్మేసి ఏమీ తెలీనట్లు లోపలికి వచ్చి పండుకోనింది.

అర్ధరాత్రయినాక ఆ ముసల్ది లోపలికి వచ్చి ఆమె సంచీలో వున్న బంగారు వరహాలన్నీ లెక్కపెట్టి అందులో తన దగ్గరున్న వంద వరహాలు కలిపింది. ఆమె దొంగనిద్ర పోతా ఇదంతా గమనించసాగింది. ముసల్ది అవతలికి పోగానే ఒక గంట ఆగి ఆమె బాగా నిదురపోయినాక ఆ వరహాలన్నీ తీసుకోని నెమ్మదిగా లోపలికి పోయి, ఆ దొంగదాని పెట్టె తెరచి అందులో రెండువందల వరహాలు పెట్టడంతోబాటు, తన చేతికున్న వుంగరం కూడా పెట్టి గమ్మున వచ్చి హాయిగా నిద్రపోయింది.

ఆ పూటకూళ్ళామెకు ఇదంతా తెలీదు గదా... దాంతో పొద్దన్నే లేచి చుట్టుపక్కనోళ్ళనంతా పిలిచి "నిన్న రాత్రి నా ఇంట్లో దొంగతనం చేసి నా పెట్టెలో వున్న రెండువందల వరహాలు ఎత్తేసినారు. నిన్న నా ఇంట్లో కొత్తగా వచ్చిన వీడు తప్ప ఎవరూ లేరు. వీని మీదే నాకనుమానంగా వుంది... నాకు న్యాయం చేయండి" అంటా ఏడ్వసాగింది.

దాంతో అందరూ వచ్చి ఆమె సామాన్లన్నీ వెదికినారు. కానీ యాడా చిల్లిగవ్వ కూడా దొరకలేదు. దాంతో ఆమె "నిన్న నేను పండుకొనేటప్పుడు నా సంచీలో రెండువందల వరహాలతో పాటు, రాములోరి బొమ్మ వున్న

వుంగరం గూడా పెట్టింటి. అవి గూడా కనబడ్డం లేదు. మూసిన తలుపులు మూసినట్టే వున్నాయి. వేసిన తాళం వేసినట్టే వుంది. నాకు ఈ ముసల్దే అందరినీ మోసం చేస్తా వున్నట్లు అనుమానంగా వుంది. కాబట్టి ఆమె సామాన్లు గూడా వెదుకుదాం" అనింది. దాంతో అందరూ అదిగూడా నిజమేగదా అని ఆ ముసల్దాని సామాన్లు వెతుకుతా వుంటే పెట్టెలో రెండువందల వరహాలతోపాటు, రాములోరి వుంగరం కూడా దొరికింది.

దాంతో అందరూ ఆ ముసల్దాన్ని పట్టుకోని "ఏమే... ముసల్దానా... వేరే వూళ్ళ నుంచి వచ్చిపోయే వాళ్ళందరికీ వండిపెట్టి వాళ్ళిచ్చినేవి తీసుకోవాల్సింది పోయి... ఇట్లా దొంగతనాలు చేస్తా మనవూరి పరువు తీస్తావా..." అంటూ ఆమెను మెత్తగా తన్ని ఆ వూరి నుండి తరిమేసినారు.

ఆమె మొగున్ని పిలిచి "నా గుర్రానికి బాగా స్నానం చేపిచ్చి, దాని పెంటంతా తీసి శుభ్రం చేయి. ఒక వరహా ఇస్తా" అనింది. స్నానం చేపించినాక "నాకు బాగా కాళ్ళు నొప్పి పెడతా వున్నాయి. కొంచం విసనకర్రతో వూపుతా కాళ్ళు నొక్కు. ఒక వరహా ఇస్తా" అనింది. సరేనని వాడు కాళ్ళు నొక్కాక ఒక వరహా ఇచ్చి "నాకు ఈ వూరిలో కొన్ని రోజులు పనుంది. రోజూ వంట చేసి ఇంటి పనులన్నీ చేయి. రోజుకో వరహా ఇస్తా" అనింది. అట్లా ఆమె రోజూ మొగునితో రకరకాల పనులు చేయించుకుంటా ఒకొక్క వరహా ఇవ్వసాగింది. అట్లా వాడు ఒక నెలరోజుల్లో రెండువందల వరహాలు సంపాదించినాక ఆమె "ఇంక ఈ వూరిలో నా పనులన్నీ అయిపోయినాయి. పోయొస్తా" అంటా ఆన్నుంచి వెళ్ళిపోయింది.

వానికి రెండువందల వరహాలు చేతిలో పడినాయి గదా... దాంతో సంబరంగా ఇంటికి వచ్చినాడు. రావడం రావడం తలుపుకాడ నిలబడి పెండ్లాన్ని పిలిచి "చూడే... ముందే చెప్పినట్లు నూటికి నూరు వరహాలు సంపాదించుకోని వచ్చినా... ఇప్పుడేమంటావు. దా బైటకి. ఈ రోజు అందరి ముందు నిన్ను కిందామీదా యేసి తన్ని నా ప్రతాపం చూపిస్తా ఈవూరికి" అన్నాడు వుత్సాహంగా వూగిపోతా...

ఆమె బైటకి వచ్చి "సరే... సంపాదిస్తే సంపాదించుకోని వచ్చినావుగానీ... ముందు అదంతా ఎట్లా సంపాదించుకోని వచ్చినావో చెప్పు. అప్పుడు తింటా తన్నులు" అనింది.

ఆ మాటలకు ఏం చెప్పాలో తెలీక వాడు నోరు వెళ్ళబెట్టినాడు. అప్పుడామె చిరునవ్వుతో "ఆ... ఏముంది... నాకు తెలీదా ఎట్లా సంపాదించినావో... ఎవని గుర్రాన్నో శుభ్రంగా కడిగి, దాని పెంట ఎత్తిపోసి, వానికి అన్నం చేసిపెట్టి, పనోనిలాగా కాళ్ళు ఒత్తి సంపాదించినావు. ఆ మాత్రం దానికే ఓ అని అంత నీల్గుతా వున్నావు. నీలాంటోని దగ్గర తన్నులు తినడానికి నేనేం సిద్ధంగా లేను. కావాలంటే వూర్లో పంచాయితీ పెడ్తా... వచ్చి నువ్వెట్లా సంపాదించినావో చెప్పు చూద్దాం" అనింది.

అంతే.... వాని నోట మాట రాలేదు. తన పెండ్లానికి తన గుట్టంతా ఎట్లా తెలిసిందో అర్థంకాక "ఇది సామాన్యురాలు గాదు. దీంతో పెట్టుకోవడం కన్నా గమ్మునుండడమే మేలు. లేకుంటే మందిలో నా మర్యాదే పోయేటట్లుంది" అనుకుంటా అప్పటినుంచీ మట్టసంగా వుండిపోయినాడు.

# 96 పిసినారి - టెంకాయ

ఒకూర్లో ఒకడుండేటోడు. వాడు పెద్ద పిసినారి. పదిపైసలు ఖర్చు పెట్టాలన్నా పదిసార్లు ఆలోచించేటోడు. వానికో రోజు పెద్ద జ్వరమొచ్చింది. ఎంతమంది వైద్యులకు చూపిచ్చినా, ఎన్ని మందులు మింగినా కొంచం గూడా తగ్గలేదు. దాంతో ఒకరోజు దేవుని గుడికి పోయి "సామీ! సామీ! నాకు జ్వరం గనుక తగ్గిపోతే నీకు ఒక టెంకాయ కొడతాను. ఎట్లాగయినా తగ్గించు సామీ" అని వేడుకున్నాడు. కొద్దిరోజులకు వైద్యులిచ్చిన మందులు బాగా పని చేసి జ్వరం తగ్గిపోయింది.

జ్వరం తగ్గితే దేవునికి టెంకాయ కొడతానని మొక్కుకున్నాడు గదా! దాంతో ఒకరోజు టెంకాయలంగడికి పోయి "ఒక టెంకాయెంత" అనడిగినాడు. వాడు "నాలుగు రూపాయలు" అని చెప్పినాడు.

వీడు పెద్ద పిసినారోడు గదా, వాడడిగినంత ఇవ్వడం ఇష్టంలేక బేరం చేద్దామని "మూడుకియ్యవా" అన్నాడు. ఆ మాటలకు వాడు "మూడు రూపాయలకు ఈడ యాడా దొరకవుగానీ పక్కనే వున్న తాండ్రపాడుకు పో. ఆడ దొరుకుతాయి" అన్నాడు.

రూపాయ మిగులుతుందనేసరికి వాడు సంబరంగా పదిమైళ్ళు కిందా మీదా పడి నడిచి తాండ్రపాడులో టెంకాయలంగడికి చేరుకోని "ఒక టెంకాయెంత" అనడిగినాడు. వాడు "మూడు రూపాయలు" అని చెప్పినాడు.

వీడు పెద్ద పిసినారోడు గదా. వాడడిగినంత ఇవ్వడం ఇష్టం లేక బేరం చేద్దామని "రెండుకియ్యవా" అన్నాడు. ఆ మాటలకు వాడు "రెండు రూపాయలకు ఈడ యాడా దొరకవుగానీ పక్కనే వున్న నన్నూరుకుపో ఆడ దొరుకుతాయి" అన్నాడు.

రూపాయ మిగులుతుందనేసరికి వాడు సంబరంగా పదిమైళ్ళు కిందామీదాపడి నడిచి నన్నూరులో టెంకాయలంగడికి చేరుకోని "ఒక టెంకాయెంత" అనడిగినాడు. వాడు "రెండు రూపాయలు" అని చెప్పినాడు.

వీడు పెద్ద పిసినారోడుగదా వాడడిగినంత ఇవ్వడం ఇష్టం లేక బేరం చేద్దామని "రూపాయకియ్యవా" అన్నాడు. ఆ మాటలకు వాడు "రూపాయకు ఈడ యాడా దొరకవుగానీ పక్కనే వున్న ఓర్వకల్లుకు పో ఆడ దొరుకుతాయి" అన్నాడు.

రూపాయ మిగులుతుందనేసరికి వాడు సంబరంగా పదిమైళ్ళు కిందామీదాపడి నడిచి ఓర్వకల్లులో టెంకాయలంగడికి చేరుకోని "ఒక టెంకాయెంత" అనడిగినాడు. వాడు "ఒక రూపాయ" అన్నాడు.

వీడు పెద్ద పిసినారోడు గదా... రూపాయ గూడా ఖర్చు పెట్టడం ఇష్టం లేక "వూరికే ఇయ్యవా" అన్నాడు. ఆ మాటలకు వాడు "వూరికే ఈడ యాడా దొరకవుగానీ పక్కనేవున్న కాల్వబుగ్గకు పో ఆడ దొరుకుతాయి" అన్నాడు.

రూపాయ మిగులుతుందనేసరికి వాడు సంబరంగా పదిమైళ్ళు కిందామీదాపడి నడిచి కాల్వబుగ్గలో టెంకాయల తోటకి చేరుకోని "ఒక టెంకాయెంత" అన్నాడు. వాడు "డబ్బులేమీ వద్దులే వూరికే తీసుకో" అన్నాడు.

వీడు పెద్ద పిసినారోడు గదా ఇచ్చిందాన్ని పుచ్చుకోని సంతోషంగా తీసుకోని పోక "వూరికే రెండి య్యవా" అన్నాడు. ఆ మాటలకు వాడు పక్కనే ఉన్న ఒక కొబ్బరి చెట్టు చూపించి "రెండేం ఖర్మ నీకెన్ని కావాలంటే అన్ని నువ్వే కోసుకో పో" అన్నాడు.



దాంతో వానికి ఆశ పుట్టి గబగబా టెంకాయచెట్టు దగ్గరికి పోయినాడు. అది ఒక పెద్ద బావి పక్కనే వుంది. నెమ్మదిగా చెట్టు ఎక్కసాగినాడు. టెంకాయ చెట్టు బాగా పొడుగ్గా, కొమ్మలు రెమ్మలు లేకుండా సక్కగా, నున్నగా వుంటాది గదా. దాంతో వాడు కొంచం దూరం ఎక్కి పట్టు తప్పి సర్రున జారి దభీమని బాయిలో పడినాడు. ఆ బాయికి మెట్లు లేవు. దాంతో వాడు లబోదిబోమని అరుస్తా వుంటే టెంకాయలోడొచ్చి గమ్మున చూస్తా కూచున్నాడు.

వాడు వాన్ని చూసి "బాబూ! బాబూ! నన్ను కాపాడవా" అనరిచినాడు.

దానికి వాడు చిరునవ్వు నవ్వి "టెంకాయలయితే వూరికే ఇస్తాగానీ... ఎవరినీ వూరికే కాపాడను. వందరూపాయలు ఇచ్చేటట్టయితే చెప్పు కాపాడుతా" అన్నాడు. వాడు చేసేదేమీ లేక ఆఖరికి "సరే" అన్నాడు. దాంతో వాడు తాడేసి వాన్ని పైకి లాగి వందరూపాయలు తీసుకున్నాడు.

రూపాయకు చూసుకుంటే ఆఖరికి వందరూపాయలు పోయిందే అని బాధపడతా వాడు మళ్ళా నడుచుకుంటా ఇంటికి చేరుకున్నాడు.

# 97 రోకలి పూజ

ఒకూర్లో రంగయ్య అని ఒకడుండేటోడు. వానికి బంధువులంటే చానా చానా ఇష్టం. ఇంటికి ఎవరు వచ్చినా సరే వాళ్ళని కాలు కింద పెట్టనీయకుండా మర్యాదలు చేసేటోడు. రోజుకోరకం పిండివంటలు చేపిచ్చి కడుపు నిండా తినిపించేటోడు. ఎప్పుడూ పొరపాటున గూడా ఎవ్వరినీ విసుక్కునేటోడు కాదు. రంగయ్య వుండేది నగరంలో, దాంతో నగరంలో పనిబడి వచ్చేటోళ్లందరూ రంగయ్య ఇంటికే వచ్చేవాళ్ళు. కొంతమంది ఏకంగా పదిరోజులూ, ఇరవై రోజులూ గూడా తిష్ట వేసేటోళ్ళు.

రంగయ్య గురించి తెలిసి ఎక్కడెక్కడి దూరపు బంధువులు గూడా వరుసలు కలుపుకోని ఇంటికి రావడం మొదలుపెట్టినారు. ఏదో ఒకరోజు రెండురోజులంటే పరవాలేదు. కానీ రోజూ ఎవరో ఒకరు వస్తా వుంటే ఎట్లా? వచ్చినవాళ్ళందరికీ అడిగినవన్నీ చేసిపెట్టలేక రంగయ్య పెండ్లాం కిందామీదా ఐపోతా వుండేది. అదీగాక అందరు అది కావాల ఇది కావాల అని అడిగేటోళ్ళే గానీ పనిలో కొంచంగూడా సాయం చేసేటోళ్ళు కాదు. అంతేగాక రంగయ్య సంపాదించేదంతా వాళ్ళకే సరిపోసాగింది. పెండ్లాం బిడ్డలు పస్తులున్నా పరవాలేదు గానీ వచ్చినవాళ్ళకి కొంచెంగూడా లోటు రాకూడదు అంటూ రంగయ్య అప్పుల మీద అప్పులు చేస్తా మరీ పెట్టసాగినాడు. పెండ్లాం ఎంత నెత్తీనోరూ కొట్టుకున్నా రంగయ్య పట్టించుకొనేటోడు కాదు. ఇది ఇట్లాగే జరిగితే ఏదో ఒకరోజు వీధిలో పడడం ఖాయం అనుకోనింది రంగయ్య పెండ్లాం. దాంతో బంధువులు ఇంటికి రాకుండా చేయడం కోసం ఒక ఉపాయం పన్నింది.

ఒకసారి ఇంటికి ఐదుమంది బంధువులు వచ్చినారు. రంగయ్య వాళ్ళకి బాగా మర్యాదలు చేసి "కూర్చోండి బజారుకి పోయి మాంచి నాటుకోడి తీసుకోని వస్తా. మధ్యాన్నం కూర తిందురుగానీ" అంటూ బజారుకు పోయినాడు. రంగయ్య అట్లా పోయిన కాసేపటికి రంగయ్య పెళ్ళాం ఒక మంచి రోకలి బండ తీసుకోనొచ్చి బంధువులకు కనబడేటట్లు దేవుని గదిలో పెట్టి, దానికంతా పసుపు పూసి, బొట్లు పెట్టి పూజ చేయసాగింది.

అదిచూసి బంధువులు, "ఇదేందబ్బా ఈమె రోకలికి పూజ చేస్తా వుంది. ఇట్లాంటి పూజ యాడా చూడలేదే" అనుకోని ఆమె దగ్గరకొచ్చి "ఏందమ్మా. ఏం పూజ చేస్తా వున్నావు" అనడిగినారు. దానికామె మా ఆయనకీమధ్య బాగా డబ్బు పిచ్చి పట్టుకోనింది. మా ఇంటి పక్కనే ఒక పెద్ద మంత్రగాడున్నాడు. వాడు "ఏం లేదూ... ఎవరయితే ఈ మంత్రించిన రోకలిబండతో రోజుకొకరి చొప్పున నూటా ఒక్క రోజుల్లో నూట ఒక్కమంది తలకాయలు పగలగొట్టి ఆ రక్తంతో అమ్మవారికి అభిషేకం చేస్తారో, వాళ్ళకి అమ్మవారు ప్రత్యక్షమయి అడిగినంత

సంపదలిస్తుంది అని చెప్పినాడు. ఆరోజు నుండీ మా ఆయన ఇంటికొచ్చిన బంధువుల తలకాయలన్నీ పగలగొట్టి పూజ చేస్తా వున్నాడు. నిన్నటికి అరవైమంది పూర్తయినారు. ఈరోజు మీలో ఎవరికి మూడిందో ఏమో" అనింది. ఆ మాటలు వింటూనే వాళ్ళు అదిరిపడినారు. ఆమె ఆగు ఆగంటున్నా వినకుండా బెరబెరా సామాన్లన్నీ సర్దుకోని పెట్టెలు తీసుకోని బైటకు వురికినారు.



వాళ్ళట్లా బైటకి పోవడం ఆలస్యం, రంగయ్య కోడి తీసుకోని ఇంటికి వచ్చినాడు. వచ్చి చూస్తే ఇంకేముంది ఇంట్లో బంధువులూ లేరు, వాళ్ళ సామాన్లూ లేవు. "ఇదేందే యాడికి పోయినారు వీళ్ళంతా" అనడిగినాడు.

దానికామె "ఏం చెప్పమంటావు. వాళ్ళకు మనింట్లో రోకలిబండ బాగా నచ్చిందంట. అదివ్వమన్నారు. కొంచెంసేపు ఆగండి మసాలా దంచి ఇస్తా అన్నా... దానికే వాళ్ళకు కోపం వచ్చింది. అడిగిన వెంటనే ఇవ్వనందుకు అలిగి పెట్టెలు సర్దుకోని ఎంత పిలుస్తా వున్నా ఆగకుండా అట్లాగే వెళ్ళిపోయినారు. ఇదిగో తొందరగా ఇది తీసుకోని పోయి ఇచ్చి రాపోండి" అని రోకలిబండ రంగయ్య చేతిలో పెట్టింది.

రంగయ్య రోకలిబండ తీసుకోని వాళ్ళని వెతుక్కుంటా వేగంగా పోతా వుంటే వూరి పొలిమేరల్లో ఐదుమంది పోతా కనబన్నారు. రంగయ్య గట్టిగా "ఆగండి ఆగండి. ఇదిగో మీరడిగిన రోకలిబండ తీసుకోండి" అని అరిచినాడు. వాళ్ళు ఎవరబ్బా పిలుస్తా వున్నారు అని వెనక్కు తిరిగి చూసినారు. చూస్తే ఇంకేముంది చేతిలో రోకలిబండ పట్టుకోని వేగంగా తమవైపే వురుక్కుంటా వస్తా వున్న రంగయ్య కనబడినాడు. అంతే వాళ్ళు అదిరిపన్నారు. "రేయ్... వాడు మన తలలు పగులగొట్టడానికి రోకలిబండ తీసుకోని వస్తా వున్నాడు. దొరికినామా మనపని అంతే" అంటూ మరింత వేగంగా వానికి దొరకకుండా పారిపోయినారు.

అట్లా పారిపోయిన వాళ్ళు కనబడిన బంధువులకంతా రంగయ్యకు పట్టిన పిచ్చి గురించి చెప్పడం మొదలుపెట్టినారు. కొద్దిరోజుల్లోనే విషయం బంధువులకంతా తెలిసిపోయింది. భయంతో అందరూ రంగయ్య ఇంటికి పోవడం మానుకున్నారు. ఎవరన్నా కనబడినా పలకరించినా పలకకుండా తప్పించుకొని పోసాగినారు. ఎందుకట్లా అందరూ ఒక్కసారిగా తనింటికి రావడం మానుకున్నారో రంగయ్యకు ఎంత ఆలోచించినా ఏమీ అర్థం కాలేదు. రంగయ్య పెండ్లాం మాత్రం తన ఉపాయం పారినందుకు లోపల్లోపల చానా సంబరపడింది.

# 98 కొండముచ్చు పెండ్లాం

ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు లేకలేక ఒక కొడుకు పుట్టినాడు. వానికి నెమ్మదిగా కొన్ని సమ్మచ్చురాలకు పెండ్లి వయసొచ్చింది. పెండ్లి వయసొచ్చినాక పెండ్లి చేయాల గదా... దాంతో ఆ రాజు దేశదేశాల అందగత్తెల బొమ్మలన్నీ తెచ్చి వాని ముందు పెట్టి "నీకు ఎవరు నచ్చినారో చెప్పు. తెచ్చి చేస్తా" అన్నాడు. వాడందరినీ పట్టిపట్టి చూసినాడు గానీ వానికెవరూ నచ్చలేదు. దాంతో వాళ్ళ నాయన దగ్గరకు పోయి "నాయనా... నాయనా... నాకు నచ్చే పిల్లను తీస్కోని రావడం నీ వల్ల కాదు గానీ నేనే పోయి నాకిష్టమయిన పిల్లను వెదుక్కోనొస్తా" అన్నాడు. ఆయన సరే అన్నాడు. అప్పుడా యువరాజు గుర్రమేసుకోని తనకు నచ్చిన పిల్ల కోసం వెదుకుతా... దేశదేశాలు తిరగడం మొదలు పెట్టినాడు.

ఆ వూరికి ఏడువందల మైళ్ళ దూరంలో ఒక రాజ్యముంది. ఆ రాజు కూతురిది అట్లాంటిట్లాంటి అందం గాదు. ఏడేడు పధ్నాలుగు లోకాల్లోనూ అంత అందగత్తె యాడా వుండదు. మెరుపుతీగ లెక్కుంటాది. ఒక్కసారి చూస్తే మల్లా మల్లా చూడాలనిపిస్తాది. కానీ ఆమెకు తాను పెద్ద అందగత్తెనని చానా చానా పొగరు. దాంతో ఎవరినీ లెక్కజేసేది కాదు.

ఒకరోజు ఆమె చెలికత్తెలతో అడవిలో పోతా వుంటే ఒకచోట ఒక పెద్దతోట కనబడింది. అందులో ఒక ముని తపస్సు చేసుకుంటా వున్నాడు. ఆ రాకుమారి మునినేమాత్రం పట్టిచ్చుకోకుండా మిగతా చెలికత్తెలతో అక్కడ బంతాట ఆడుకుందామనింది. ముని తపస్సు చేసుకుంటా వున్నాడు గదా... అల్లరి చేయడం మంచిపని కాదుగదా... కానీ ఆ పిల్లకు పొగరుతో కండ్లు తలకెక్కినాయి. అందుకే స్నేహితురాళ్ళు "ఈడ వద్దులే" అని అంటావున్నా వినకుండా కిలకిలకిల నవ్వుతా ఆన్నే ఆడడం మొదలుపెట్టింది. అట్లా ఆడ్తా ఆడ్తా వుంటే ఒకసారి ఆ బంతి పోయి తపస్సు చేసుకుంటావున్న ముని మొగానికి దభీమని తగిలింది. దాంతో ఆయనకు చానా కోపమొచ్చింది.

"నీ అంత అందగత్తె ఈ లోకంలో యాడా లేదనే పొగరుతోనే గదా నువ్వింత ఎగిరెగిరి పడతా వున్నావ్... ఈరోజు నుండీ నువ్వు పొద్దునంతా ఇట్లాగే మానవరూపంలో వుంటావు గానీ రాత్రి కావడమాలస్యం నీ ఒళ్ళంతా బొచ్చు బొచ్చు వచ్చి అచ్చం కొండముచ్చులెక్క అయిపోతావ్" అని శాపం పెట్టినాడు. ఆ దెబ్బతో ఆమెకు పొగరు దిగిపోయి ముని కాళ్ళ మీద పడి "సామీ... సామీ... పొరపాటయిపోయింది. ఈ ఒక్కసారికి నన్ను మన్నించు. మల్లా జన్మలో ఇట్లాంటి పొరపాట్లు ఎప్పుడూ చేయను" అని కిందామీదా పడి ఏడ్చింది.

అప్పుడాముని జాలిపడి "నిన్నెవరయినా పెండ్లి చేసుకున్నాక... నీమొగుడు ఒక సమ్మచ్చరం పాటు వేరేవాళ్ళనెవరినీ పెండ్లి చేసుకోకుండా వుంటే అప్పుడు నీ మొదటిరూపం నీకు వస్తాది. నీ మొగుడు వేరేవాళ్ళని పెండ్లి చేసుకున్నా... నీ శాపం సంగతి నీ మొగునికి చెప్పినా... ఇక నీవు ఎప్పటికీ ఇట్లాగే వుంటావు" అని చెప్పినాడు.

రాకుమారుడు అందమైన పెండ్లాం కోసం వెదుక్కుంటా... వెదుక్కుంటా... వస్తా వున్నాడు గదా... అట్లా ఒకరోజు ఆ రాజ్యానికొచ్చినాడు. యువరాణిని చూసి "అబ్బ... ఎంత ముచ్చటగుంది... అచ్చం బంగారు బొమ్మలెక్క" అనుకోని రాజు దగ్గరికి పోయి తానెవరో చెప్పి పిల్లనియ్యమన్నాడు.

కూతురు రాత్రిపూట కొండముచ్చవుతున్న సంగతి ఎవరికీ తెలియగూడదు గదా.... అందుకని ఆ రాజు "ఇస్తాగానీ... నా కూతురు ఒక వ్రతం చేస్తా వుంది. ప్రతిరోజూ రాత్రిపూట చీకటి పడగానే నరమానవుడెవడూ చూడని రహస్యప్రదేశంలో ఆమె క్రమం తప్పకుండా సమ్మచ్చరం పాటు ఆ పూజ చేయాల. నీవు గూడా పట్టపగలే తప్ప రాత్రిపూట నీ పెండ్లాం పక్కనుండగూడదు. సరేనా" అన్నాడు. వాడు సరే అన్నాడు. దాంతో రాజు వూరందరినీ పిలిపించి ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగు వేసి బ్రమ్మాండంగా పెండ్లి చేసినాడు.

ఆ యువరాజు పెండ్లయినాక ఇచ్చిన మాట ప్రకారం ఆమె కోసం ప్రత్యేకంగా ఒక గది కట్టిచ్చి ఆ తరువాత ఆమెను ఇంటికి తీస్కోని పోయినాడు. ఆరోజు నుండీ రాకుమారి చీకటి పడడం ఆలస్యం పరుగు వురుక్కుంటా ఆ గదిలోనికి పోయి లోపల గడేసుకునేది.

కొన్నాళ్ళు దాటినాక ఆ యువరాజుకు తన పెండ్లాం ఏమి వ్రతం చేస్తావుందో చూడాలనిపించింది. దాంతో ఒకరోజు రాత్రి సప్పుడు గాకుండా మట్టసంగా పోయి కిటికీలోంచి తొంగి చూసినాడు. చూస్తే ఇంగేముంది లోపల పెండ్లాం లేదు. కొండముచ్చుంది. ఓరినీ.. ఏమో అనుకుంటి గానీ ఇదా సంగతనుకోని... అందరినీ పిల్చి కుప్పేసి జరిగిందంతా చెప్పినాడు. ఆమె ముని ఇచ్చిన శాపం గురించి చెప్పగూడదు గదా... దాంతో ఏమీ మాట్లాడకుండా గమ్మున నోరుమూసుకోనింది. దేశదేశాల్లో యాడా లేనంత అందగత్తెను పెండ్లాన్ని చేసుకోవాలనుకుంటే.... ఆఖరికి ఈ కొండముచ్చు పెండ్లామయిందే అని బాధపడి తరువాతరోజు పొద్దున్నే ఆమెను ఆమె పుట్టింటికి పంపించేసినాడు.

రాజుపెండ్లాం కొండముచ్చని తెలుసుకోని వూరువూరంతా కిందామీదా పడి నవ్వుకుంటా వుంటే చూసి తట్టుకోలేక వాళ్ళ నాయన ఇంకో సంబంధం చూసినాడు. ఈ విషయం తెలిసిన యువరాణి పెండ్లి గనుక జరిగితే ఆమె ఇంగ ఎప్పటికీ కొండముచ్చులాగానే వుండిపోవాల్సి వస్తాది గదా... అందుకని ఎట్లాగయినా సరే పెండ్లి చెడగొట్టాలనుకోనింది.

పెండ్లికి ముందురోజు పగటిపూట ఆమె నెత్తిన పెరుగుకుండలు ఒకదానిమీదొకటి పెట్టుకోని "పెరుగమ్మా... పెరుగు" అని అరుచుకుంటా పెండ్లికూతురి విడిది ముందు పోసాగింది. పెండ్లికూతురు మిద్దెపై నుండి ఆమెని చూసి "అమా... అమా... ఆమె వెండ్రుకలు చూడుమా... ఎంత పొడుగ్గా నల్లగా నిగనిగలాడుతా వున్నాయో... ఆమెని పిల్చుమా... ఆమె వెండ్రుకలు అంత అందంగా ఎట్లా వున్నాయో కనుక్కుందాం" అనింది.

సరేనని వాళ్ళమ్మ ఆమెని పిల్చి "పాపా... పాపా... నీ వెండ్రుకలు అంత అందంగా మెరుస్తా వున్నాయి గదా... ఏంది సంగతి" అనడిగింది. దానికామె చిరునవ్వు నవ్వి "ఏమీ లేదమ్మా... నున్నగా గుండు చేసుకోని...

సున్నం పసుపు కుంకుమ గంధంలో ఏసి బాగా కలిపి గుండంతా పట్టిచ్చి... వెంద్రుకలు వెంకటేశ్వరస్వామి ముందు పెట్టి... పూజ చేసి ఆన్నే కటిక నేల మీద పండుకుంటే చాలు. పొద్దున లేసి చూసేసరికి ఎక్కడలేని వెంద్రుకలు నాలాగే నిగనిగలాడుతా... ఇంతలావు... ఇంత పొడుగు... వచ్చేస్తాయి" అని చెప్పింది.

వాళ్ళమ్మ అది నిజమనుకోని మంగలోన్ని పిలిపించి పెండ్లికూతురికి నున్నగా గుండు చేపిచ్చి, ఆమె ఎట్లా చెప్పిందో అచ్చం అట్లాగే చేపిచ్చింది. పొద్దున లేసి చూస్తే ఇంగేముంది. ఒక్క వెంద్రుక గూడా రాలేదు. విషయం బైటకి తెలిస్తే మర్యాద పోతాది గదా. దాంతో వాళ్ళు ఆమె గుండు కనబడకుండా నెత్తి నిండా ముసుగేసి పెండ్లికొడుకు పక్కన పీటల మీద కూచోబెట్టినారు.

పెండ్లికొచ్చినోళ్ళంతా ఆమె మొగం ఒక్కసారన్నా చూద్దామని "ముసుగు తియ్యి... ముసుగు తియ్యి..." అని ఎంతడిగినా ఆమె తియ్యనే తియ్యలేదు. దాంతో ఒకామెకు అనుమానమొచ్చి ఛటుక్కున దాన్ని లాగేసింది. అంతే... ఇంగేముంది తళతళలాడుతా గుండు బయటపడింది. అది చూసి పెండ్లికొచ్చిన జనమంతా నవ్వడం నవ్వడం గాదు. దాంతో యువరాజు నాకీ గుండుపెండ్లాం వద్దంటే వద్దంటూ ఆన్నించి లేచిపోయినాడు.

వూరువూరంతా "ఎంత డబ్బుండి ఏం లాభం... మొదట చేసుకున్నది కొండముచ్చయితే... మళ్ళా చేసుకోవాలనుకున్నది గుండని" ఒకటే నవ్వుకోసాగినారు. ఇది చూసి వాళ్ళమ్మా నాయనా ఈ సారన్నా మంచి పిల్లను తీసుకోనొచ్చి చేయాలని ఒక మూన్నెల్లు కిందామీదా పడి వెతికితే ఆఖరికి ఒక అందమైన పిల్ల దొరికింది. దాంతో పెండ్లికి ముహూర్తాలు పెట్టించినారు.

పెండ్లి గనుక జరిగితే ఆ యువరాణి ఇంక ఎప్పటికీ కొండముచ్చులాగా అట్లానే వుండిపోవాల్సొస్తాది గదా... అందుకని ఆమె ఎట్లాగయినా సరే పెండ్లి చెడగొట్టాలనుకోని... పెండ్లికి ముందురోజు పగటిపూట బంతిపూల బుట్ట నెత్తిన పెట్టుకోని "పూలమ్మా... పూలు" అని అరుచుకుంటా వాళ్ళింటి ముందు పోసాగింది. పెండ్లికూతురు మిద్దెపైనుండి ఆమెని చూసి "అమా... అమా... ఆమె పండ్లు చూడుమా... ఎంతందంగా వున్నాయో... అచ్చం దానిమ్మ గింజల్లెక్క... ఆమెని పిల్చుమా... ఆమె పండ్లు ఎట్లా మెరుస్తా వున్నాయో కనుక్కుందాం" అనింది.

సరే అని వాళ్ళమ్మ ఆమెను పిలిచి "పాపా... పాపా... నీ పండ్లు దానిమ్మ గింజల్లెక్క తళతళలాడుతతా వున్నాయి గదా... ఏంది సంగతి" అనడిగింది. దానికామె చిరునవ్వు నవ్వి "ఏమీ లేదమ్మా... ముందు నోట్లో ఒక్క పండు గూడా మిగలకుండా అన్నీ పీకి... నోటి నిండా దానిమ్మగింజలు పోసుకోని.. పొద్దున్నుంచీ రాత్రి వరకూ అన్నం తినకుండా... వెంకటేశ్వరస్వామికి పూజ చేసి... ఆన్నే కటికనేల మీద పండుకుంటే చాలు... పొద్దున లేసి చూసేసరికి అచ్చం నాలాగే పండ్లు మిలమిలలాడుతా వచ్చేస్తాయి" అని చెప్పింది.

వాళ్ళమ్మ అది నిజమనుకోని పెండ్లికూతురికి ఒక్క పన్నుకూడా మిగలకుండా అన్నీ పీకి... అచ్చం ఆమె ఎట్లా చెప్పిందో అట్లానే చేసింది. పొద్దున్నే లేసి చూస్తే ఇంగేముంది.... ఒక్క పన్ను గూడా తిరిగి రాలేదు. విషయం బైటికి తెలిస్తే మర్యాద పోతాది గదా... దాంతో వాళ్ళు ఆమె బోసినోరు ఎవరికీ కనబడకుండా గమ్మున నోరు మూసుకోని వుండమని చెప్పి పెండ్లికొడుకు పక్కన పీటల మీద కూచోబెట్టినారు.

పెండ్లికొచ్చినోళ్ళంతా ఆమెని చూసి "నీ పేరేందమ్మా... అంటే నీ పేరేందమ్మా" అని అడుగుతా వుంటే మూగెద్దులెక్క మట్టసంగా వుందే గానీ నోరు తెరచి ఒక్కమాటా మాట్లాల్లేదు. ఇదేందబ్బా... ఇట్లా నోరుమూసుకోని

కూచోనిందని అనుమానపడి ఒకామె వెనుక నుండి నడుమ్మీద గిలిగింతలు పెట్టింది. దాంతో ఆమె ఆ గిలిగింతల్ని తట్టుకోలేక పడీపడీ నవ్వింది. అంతే... ఆమె బోసినోరు చూసి పెండ్లికొచ్చినోళ్ళంతా నవ్వడం నవ్వడం గాదు. దాంతో యువరాజు నాకీ బోసి నోటి పెండ్లాం వద్దంటే వద్దంటూ ఆన్నించి లేచిపోయినాడు.

వూరు వూరంతా "ఎంత డబ్బుండీ ఏం లాభం... మొదటిసారి చేసుక్నుది కొండముచ్చయితే... రెండోసారి చేసుకోవాలనుకున్నది గుండు, మూడవసారి చేసుకోవాలనుకున్నది బోసి నోటిది" అని ఒక్కటే నవ్వుకోసాగినారు. అది చూసి వాళ్ళమ్మా నాయనా ఈసారన్నా మంచిపిల్లని తీసుకోనొచ్చి చేయాలనుకోని ఒక మూన్నెళ్ళు కిందామీదా పడి వెతికితే ఆఖరికి ఒక పిల్ల దొరికింది. దాంతో వాళ్ళ నాయన పెండ్లి చేయడానికి ముహూర్తాలు పెట్టించినాడు.

రాజకుమారికి ఇంగో నెల దాట్తే సమ్మచ్చరం పూర్తయి ముని ఇచ్చిన శాపం పూర్తయిపోతాది. అందుకని ఎట్లాగయినా సరే ఈ పెండ్లి గూడా చెడగొట్టాలనుకోని ఎక్కడా లేనంత కమ్మని వాసన వుండే అత్తరు ఒంటికి పూసుకోని... నెత్తిన పండ్లబుట్ట పెట్టుకోని "పండ్లమ్మా... పండ్లు" అని అరుచుకుంటా పోసాగింది. ఆమె అట్లా నడుస్తా వుంటే ఆ వీధి వీధంతా ఘుమ్మని వాసన కొడతా వుంటే చూసి పెండ్లికూతురు "అమా... అమా... ఆమె ఒంటి మీద నుండి వస్తున్న కమ్మని అత్తరు వాసన పీల్చినావా.... వేయి రోజాపూలు ఒకేచోట కుప్పపోసినట్టు ఎంత బాగుంది గదా... ఆమెని పిల్చుమా... ఆ అత్తరు యాడ దొరుకుతాదో మనమూ కనుక్కుందాం" అనింది.

సరేనని వాళ్ళమ్మ ఆమెను పిలిచి "పాపా... పాపా... నీ ఒంటి మీదున్న ఆ కమ్మని వాసనకు వీధి వీధంతా ఘుమ్మని అదిరిపోతా వుంది. యాడ కొన్నావ్ దాన్ని" అనడిగింది. దానికామె చిరునవ్వు నవ్వి "ఏమీ లేదమ్మా... ఒంటి మీదున్న బట్టలన్నీ తీసేసి... ఆవు పేడలో కాస్త పందిపెండ కలిపి... ఒక చచ్చిన ఎలుకను దాంట్లో ఏసి బాగా నూరి... తల నుండి కాలిబొటన వేలి వరకూ అంగుళం గూడా వదలకుండా బాగా పట్టిచ్చుకోని... ఆ గబ్బు వాసన భరిస్తా... వెంకటేశ్వరస్వామికి పూజ చేసి ఆన్నే అట్లాగే కటికనేల మీద పండుకోని... పొద్దున్నే గాడిదపాలతో స్నానం చేస్తే సరి... నా మాదిరే నీకు కూడా ఆ కమ్మని వాసన కొన్ని నెలలపాటు ఘుమ్మని అదరగొడ్తా వుంటాది" అని చెప్పింది.

వాళ్ళు అది నిజమనుకోని పెండ్లికూతురి ఒంటి మీదున్న బట్టలన్నీ తీసేసి ఆమె ఎట్లా చెప్పిందో అచ్చం అట్లానే చేసినారు. పొద్దున్నే లేచి గాడిదపాలతో స్నానం చేసి చూస్తే ఇంగేముంది. కంపు కంపు కాదు. ఎలక సచ్చిన కంపు... చుట్టుపక్కనున్నోళ్ళంతా ముక్కులు మూసుకోని బిందెల మీద బిందెలు పోసి సబ్బుల మీద సబ్బులు పెట్టి ఎంత రుద్దినా ఆ కంపు ఒక్క ఇంచు గూడా తగ్గలేదు. వాళ్ళు ఏమీ చేయలేక అట్లానే ఆమెను పెండ్లికూతురిని చేసి తీసుకోని వస్తా వుంటే పెండ్లికొచ్చినోళ్ళంతా ఆ గబ్బువాసనకు ముక్కుమూసుకోని ఒకటే నవ్వడం నవ్వడంగాదు. దాంతో యువరాజు నాకీ కంపు పెండ్లాం వద్దంటే వద్దంటూ పీటల మీద నుండి లేచిపోయినాడు.

ఇదేందబ్బా... ఎవరిని చేసుకుందామనుకున్నా... ఏదో ఒకటి జరుగుతానే వుంది. ఇంగ నాకు పెండ్లయితాదా... కాదా... అని ఆ యువరాజు బాధపడ్తా వుంటే... మొదటి పెండ్లాం సమ్మచ్చరం పూర్తి కాగానే వురుక్కుంటా ఆడికొచ్చి జరిగినేదంతా పూసగుచ్చినట్టు వివరించింది. అది విని వూరంతా సంబరపడినారు. విషయం తెలీక అంత అందమైన పెండ్లాన్ని అనవసరంగా ఇంట్లో నుంచి దొబ్బేసినానే అని యువరాజు బాధపడి ఆమెని దగ్గరకు తీసుకున్నాడు. అప్పటినుంచీ వాళ్ళిద్దరూ హాయిగా చిలకా గోరింకల్లెక్క కలిసిమెలసి వున్నారు.

# 99 నలుగురు చెవిటోళ్ళు

ఒకూర్లో రంగయ్య, రంగమ్మని మొగుడూపెండ్లాలు వుండేటోళ్ళు. వాళ్ళిద్దరికీ బ్రమ్మచెవుడు. రంగయ్య, రంగమ్మలిద్దరికే గాక వాళ్ళ కొడుకు సుబ్బయ్య, కోడలు సుందరమ్మలకు గూడా చెవుడే.

వాళ్ళ నలుగురికీ చెవుడు అయినా అది ఎవరికీ తెలియగూడదని, ఎదుటోళ్ళు చెప్పేది ఏమీ వినబడకున్నా అంతా బాగా వినబడుతున్నట్టు తలలూపేటోళ్ళు. నోటికేదొస్తే అది వాగేటోళ్ళు. అవతలోళ్ళు ఏం అడుగుతున్నారో వీళ్ళకి అర్థంగాదు. వీళ్ళేం మాట్లాడుతా వున్నారో వాళ్ళకు అర్థంగాదు. తామొకటి అడిగితే, వాళ్ళొకటి చెబ్తా వుండేసరికి వూరోళ్ళకి నెమ్మదిగా వాళ్ళ గురించి అర్థమైపోయింది. అప్పట్నించీ కనబడగానే మారు మాట్లాడకుండా మట్టసంగా తప్పించుకోని పారిపోయేటోళ్ళు.

ఒకరోజు పక్కూరి నుండి ఒకడు ఆ వూరికి వస్తావస్తా దారి తప్పిపోయినాడు. 'వూర్లోకి ఎట్లా పోవాలబ్బా' అని ఆలోచిస్తా... ఆలోచిస్తా... ఎవరన్నా కనబడతారేమోనని వెదుకుతా వుంటే సుబ్బయ్య పొలంలో దున్నుతా కనబన్నాడు.

సుబ్బయ్య చెవిటోడని వానికి తెలీదుగదా. దాంతో బెరబెరా సుబ్బయ్య దగ్గరికిపోయి "అనా! అనా! మాది పక్కూరు. దారి తప్పిపోయినా. వూర్లోకి ఎట్లా పోవాల" అనడిగినాడు. సుబ్బయ్యకి వినబడదు గదా, దాంతో వాడు "వీడెవడో ఎద్దుల కోసం వచ్చినట్టున్నాడు" అనుకోని "ఈ ఎర్రెద్దు ఏడువేలు. ఆ పచ్చెద్దు పదివేలు. కొంటే కొను. లేదంటే లేదు" అన్నాడు. దానికి వాడు "ఎద్దులు కాదనా! వూర్లోకి ఎట్లా పోవాల" అన్నాడు. ఆ మాటలకు సుబ్బయ్య కోపంగా "చూడు నువ్వెన్నయినా చెప్పు, ఒక్క పైసా గూడా తగ్గను. ఇష్టముంటే కొను. లేదంటే లేదు" అన్నాడు. వాడు తల గీరుకుంటా "వీడెవడో చెవిటోడన్నా అయ్యిండాల లేదా తిక్కోడన్నా అయ్యిండాల. అందుకనే ఇట్లా మాట్లాడ్తా వున్నాడు" అనుకుంటా మట్టసంగా ఆన్నించి వచ్చేసినాడు.

వాడు మరలా దారి కోసం వెదుకుతా వుంటే సుబ్బయ్య పెండ్లాం మొగుని కోసం నెత్తిన సద్దిమూట పెట్టుకోని వస్తా కనబడింది. ఆమె గూడా చెవిటిదే గదా... అది తెలీక వాడు సంతోషంగా ఆమె దగ్గరకు పోయి "అమ్మా! అమ్మా! మాది పక్కూరు. దారి తప్పిపోయినా, వూర్లోకి ఎట్లా పోవాల" అనడిగినాడు. దానికామె వాడు అన్నం అడుగుతున్నాడేమో అనుకోని "చూడు నాయనా! గంపలో వుండేది పడన్నమే. ముందు నా మొగునికి పెడ్తా, ఆయన తిన్నాక మిగిల్తే నీకు పెడ్తా సరేనా!" అనింది.

దానికి వాడు తానడిగింది ఆమెకు సరిగా వినబడలేదేమో అనుకోని "అన్నం కాదమ్మా! వూర్లోకి. వూర్లోకి ఎట్లా పోవాల' అన్నాడు గట్టిగా. దానికామె కోపంగా "ఏందీ! నా మొగునికన్నా ముందే నీకు పెట్టాల్నా... సచ్చినా ఒక్క ముద్ద గూడా పెట్టను. నీకిష్టమైతే వుండు లేకపోతే పో" అనింది. వాడు తల గీరుకుంటా "ఆడ వాడు... ఈడ ఈమె... ఇద్దరూ తలతిక్కగా మాట్లాడ్తా వున్నారు" అనుకోని మట్టసంగా ఆన్నించి వచ్చేసినాడు.

వాడు మరలా దారి కోసం వెదుకుతా వుంటే ఒకచోట సుబ్బయ్య నాయన రంగయ్య మేకలు కాస్తా కనబన్నాడు. రంగయ్య గూడా చెవిటోడే గదా... అది తెలీక వాడు సంతోషంగా "హమ్మయ్య వీన్నడిగైనా దారి తెలుసుకోవాల" అనుకోని బెరబెరా రంగయ్య దగ్గరికి పోయి "తాతా! తాతా! నాది పక్కూరు. దారి తప్పిపోయినా, వూర్లోకి ఎట్లా పోవాల" అనడిగినాడు.

రంగయ్య వాడు మేకల కోసం వచ్చినాడేమో అనుకోని "చూడు మంచి మేకలు నేను అమ్మను. కావాలంటే ఆ కుంటిదిగానీ, ఈ గుడ్డిది గానీ ఇస్తా, ఏది కావాల్నో చెప్పు" అన్నాడు. ఆ మాటలకు వాడు అదిరిపడి "ఇదేం వూరబ్బా... కనబన్నోడల్లా ఏందేందో తిక్కతిక్కగా మాట్లాడ్తా వున్నాడు" అనుకోని "మేకలు కాదు తాతా! వూర్లోకి పోవాల. దారెట్లా" అన్నాడు గట్టిగా. దానికి రంగయ్య కోపంగా "అరే! మంచి మేకల్ని అమ్మనని ఒక్కసారి చెప్తే అర్థంగాదా, నీకిష్టమైతే తీస్కో లేదంటే లేదు" అన్నాడు. ఆ మాటలకు వాడదిరిపడినాడు. "ఈ వూర్లో అందరూ ఇట్లా తిక్కలోళ్ళు కాదు గదా. ఎవడు చూసినా ఒకటడిగితే ఒకటి మాట్లాడ్తా వున్నాడు" అనుకుంటూ మట్టసంగా ఆన్నించి వచ్చేసినాడు.

వాడు మరలా దారి కోసం వెదుకుతా వుంటే ఒకచోట రంగయ్య పెండ్లాం బరగొడ్డు దగ్గర కూచోని పాలు పిండుతా కనబడింది. ఆమెకు బ్రమ్మచెవుడని వానికి తెలీదు గదా. దాంతో "ఆఖరిసారి ఈమెను అడిగి చూద్దాం" అనుకోని ఆమె దగ్గరికి పోయి "అవా! అవా! నాది పక్కూరు. దారి తప్పిపోయినా, వూర్లోకి ఎట్లా పోవాల" అనడిగినాడు.

దానికామె వాడు పాల కోసం వచ్చినాడేమో అనుకోని "చూడు నాయనా! ఇదిచ్చేది అరలీటరే. మాకే సరిపోవు. ఇంగ నీకెట్లా పోసేది. వేరేచోట అడుగుపో" అనింది. ఆ మాటలకు వాడదిరిపడి "ఓరినీ... ఈమె గూడా అట్లానే తిక్కతిక్కగా మాట్లాడ్తా వుందే" అనుకోని దగ్గరికొచ్చి "పాలు కాదవ్వా! వూర్లోకి పోవాల. దారెట్లా" అన్నాడు గట్టిగా. దానికామె కోపంగా "ఏందిరోయ్! పాలియ్యనని ఒకసారి చెబ్తే అర్థంగాదా... మీదిమీదికొస్తా వున్నావ్. పొరక తీసి కొడ్తా చూడు ఏమనుకుంటా వున్నావో" అంటూ పొరక తీసుకోనింది.

వాడదిరిపడి 'ఓరి నాయనోయ్. ఇది మామూలు వూరుగాదు. లోపలికి పోకముందే ఇట్లా వుంటే... పోతే ఇకేమన్నా వుందా... నాకు గూడా వీళ్ళ మాటలు వినీ వినీ తిక్కపడ్తాదేమో' అనుకోని మట్టసంగా వెనక్కు తిరిగి చూడకుండా పారిపోయినాడు.

# 100 రేచీకటి అల్లుడు

ఒకూర్లో సుంకన్నని ఒకడుండేటోడు. వానికి రేచీకటి...చీకటి పడితే చాలు కండ్లు సరిగా కనబడవు. అందుకని వాడు ఎంత పనున్నా రాత్రిపూట మాత్రం బైటికెక్కడికీ పోయేటోడు గాదు. మట్టసంగా ఇంట్లోనే కూచునేటోడు.

వానికి పెండ్లి వయసొచ్చింది. రేచీకటని తెలిస్తే పిల్లనెవరిస్తారు? అందుకని వాళ్ళమ్మా నాన్నా వానికి రేచీకటని ఎవరికీ చెప్పకుండా మాంచి సంబంధం తెచ్చి పెండ్లి చేసినారు. వానికి ఇంట్లో ఏది ఎక్కడుంది, ఎంతదూరం నడిస్తే ఏమొస్తాది అన్నీ బాగా తెలుసు. దాంతో ఏమాత్రం తడుముకోకుండా అటూ యిటూ మామూలుగానే తిరుగుతా వుంటే బంధువులకెవరికీ కొంచంగూడా అనుమానం రాలేదు.

రోజూ సాయంత్రం ఐదైతే చాలు వురుక్కుంటా, వురుక్కుంటా ఇంటికొచ్చే మొగున్ని చూసి వాని పెండ్లాం "అబ్బ! నా మొగునికి నేనంటే ఎంత ప్రేమ. అందరి మాదిరి ఆడా ఈడా గప్పాలు కొట్టుకుంటా తిరగకుండా పొద్దుగూకుతే చాలు వురుక్కుంటా నాకోసం ఇంటికొస్తాడు" అనుకోని మురిసిపోయేది.

ఒకరోజు వాని అత్తా మామా దసరాపండుగకు వారంరోజుల ముందరొచ్చి "అల్లుడూ! అల్లుడూ! మీ పెండ్లయినాక ఇదే మొదటి పండగ. నీవు నీ పెండ్లాంతో రేపే మాయింటికొచ్చి వారం దినాలుండాల" అన్నారు. దానికి వాడు వారం రోజులు ఆన్నే వుంటే దొరికిపోతానేమోనని భయపడి "అదికాదు మామా! వూర్లో నాకు చానా పనులున్నాయి. కావాలంటే నీ కూతుర్ని రేపే తీసుకోనిపో, నేను మాత్రం పండగనాడు వస్తా" అన్నాడు. వాళ్ళు సరేనని తరువాత రోజు పొద్దున్నే కూతుర్ని తీసుకోని పోయినారు. దసరా పండగొచ్చింది. అత్తోళ్ళింటికి పోవాల గదా... దాంతో సుంకన్న పొద్దున్నే లేచి, తలస్నానం చేసి, కొత్తబట్టలేసుకోని, కిర్రుచెప్పులు తొడుక్కోని టకాటకా నడుస్తా బైలుదేరినాడు. వాళ్ళత్తోళ్ళ వూరికి పొద్దున తప్పిపోతే మళ్ళా సాయంత్రానికి గానీ బస్సుండదు. అందుకని వురుక్కుంటా పోయి బస్సెక్కినాడు.

ఆ వూరికి రోడ్డు ఏమీ బాగాలేదు. యాడ చూసినా గుంతలు గుంతలే. దాంతో బస్సు ఎగురుతా వూగుతా పోవడం మొదలుపెట్టింది. లోపలందరూ కిందామీదా పడ్తా వున్నారు. బస్సు సగం దూరం పోయిందో లేదో ఎవడో రోడ్డు మీద పాడేసిన పెద్ద ఇనుపసీల గుచ్చుకోని చక్రం కాస్తా తుస్సుమనింది. దాంతో అందరూ కిందికి దిగినారు. అప్పటికే బస్సు సగం దూరమొచ్చేసింది గదా... దాంతో వెనక్కు పోడానికి లేదు. సుంకన్న "ఏం చేద్దాం ఖర్మ" అని తిట్టుకుంటా పెట్టె నెత్తిన పెట్టుకోని వూరికి నడుస్తా బైలుదేరినాడు.

వాడు ఎంత బెరబెరా నడిచినా ఆ వూరి పొలిమేర చేరుకొనేసరికే చీకటి పడటం మొదలుపెట్టింది. దారి

సరిగా కన్పించడంలేదు. “వూర్లోకి ఎట్లా పోవాలబ్బా” అని ఆలోచిస్తా వుంటే పక్కనే బరగొడ్లు పోతా కనబన్నాయి. బరగొడ్లు పొద్దునంతా వూరిబైటి బీడుపొలాల్లో తిని తిరిగి సాయంకాలం కాగానే వాటంతటవే వూళ్ళోకి చేరుకుంటాయి గదా. అందుకని వాడు ఒకదాని తోక పట్టుకోని దాని వెనకాలనే పోవడం మొదలుపెట్టినాడు.

ఆ బరగొడ్డు అట్లా పోతా వుంటే దానికి ఒకచోట ముండ్ల కంపల్లో పచ్చగడ్డి కనబడింది. దాంతో అది దాన్ని తిందామని ఆ ముళ్ళ కంపల్లోకి దూరింది. వీడు గూడా దాని తోక పట్టుకోని అట్లే లోపలికి పోయినాడు. ఒళ్ళంతా ముండ్లు తగుల్కోని గీరుకుపోయింది. పాపం! వానికి బైటికెట్లా రావాల్నో అర్థం కాలేదు. ఎటు అడుగేసినా ముండ్లకంపలే. దాంతో అటూ యిటూ తిరుగుతా వుంటే అప్పుడే అటువేపొచ్చిన వూరోడొకడు “ఎవరు నువ్వు? ఎందుకట్లా ముండ్లకంపల్లో తిరుగుతా వున్నావ్” అని అడిగినాడు.

బరగొడ్డు తోక పట్టుకోనొచ్చి ఇట్లా ఇరక్కపోయినానని చెప్తే మర్యాద పోతాది గదా! అందుకని వాడు “ఏం లేదు. ఒంటికి పోస్తా వుంటే ఉంగరం జారి పడిపోయింది. యాడ పడిందా అని వెదుకుతా వున్నా” అన్నాడు. “అట్లాగా” అని వాడు కూడా వెదకడం మొదలుపెట్టినాడు. వీడు నెమ్మదిగా వేలికున్న ఉంగరం చేతిలోకి తీసుకోని “ఆ దొరికింది! దొరికింది!” అంటూ చూపిచ్చి, వానెంబడే నెమ్మదిగా ముండ్లకంపల్లోంచి బైటకొచ్చినాడు.

వాడు మళ్ళా దారి పట్టుకోని నడుస్తా నడుస్తా కొంతదూరం పోయి ఎటు పోవాల్నో అర్థంగాక దిక్కులు చూస్తా వుంటే అప్పుడే అటువేపుగా వచ్చినోడొకడు “ఎవరు నాయనా నువ్వు? ఏంది వెదుకుతా వున్నావ్. యాడికి పోవాల” అనడిగినాడు. దానికి వాడు “అన్నా! అన్నా! నేను చిన్న రంగన్న చిన్న కూతురి మొగున్ని. దారి మర్చిపోయినా. వాళ్ళింటికి ఎట్లా పోవాల్నో కాస్త చెప్పవా” అనడిగినాడు. దానికి వాడు “చిన్నరంగన్న ఇండ్లేగదా. ఇట్లానే సక్కగా పో.. ఒక పది నిమిషాలు నడిచినాక కుడివైపుకు సందొస్తాది. ఆ సందులో మూడోదే మీ మామోళ్ళ ఇండ్లు” అని చెప్పి పోయినాడు.

వాడు నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటా జాగ్రత్తగా నడవసాగినాడు. అట్లా పది నిమిషాలు నడిచినాక కుడివైపు సందొచ్చింది. అటు తిరిగినాడు. అంతకు ముందురోజే ఆ సందులో కొళాయి వేయడానికని పేద్ద గుంత తవ్వినారు. రెండు అడుగులేసినాడో లేదో దభీమని దాంట్లోకి పడిపోయినాడు. గుంత లోతుగా వుండడంతో పైకెట్లా రావాల్నో అర్థంగాక తడుముకోసాగినాడు.

అప్పుడే అటువేపు వస్తావున్న వాడి పెండ్లాం తమ్ముడు గుంతలో నుండి చప్పుడు వస్తావుంటే “ఏందబ్బా? ఏం పడింది దీంట్లో” అని తొంగి చూస్తే అక్కమొగుడు కనబన్నాడు. వాడు ఆశ్చర్యంగా “ఏంది బావా? గుంతలో ఎట్లా పడినావ్” అనడిగినాడు. పడినానంటే మర్యాద పోతాది గదా, అందుకని వాడు “అబ్బే అదేం లేదు. గుంతలో ఒక చిన్న మేకపిల్ల పడి గిలగిలా కొట్టుకుంటా వుంటే అయ్యో పాపమని దిగి దాన్ని బైటికేసినా” అన్నాడు. ఆ మాటలకు వాడు “మా బావెంత మంచోడు” అనుకోని “పైకి దా బావా!” అంటూ చేయందించినాడు. వాడు పైకొచ్చి బామ్మర్ది ఎంబడే పోయి ఇంటికి చేరుకున్నాడు.

అల్లున్ని చూడగానే అత్తామామా బైటికొచ్చి “ఏందల్లుడూ ఇంత ఆలస్యమైంది. అమ్మా నాన్న బాగుండారా” అంటూ పలకరించినారు. బస్సు చెడిపోయి నడిచొచ్చినేది తెలుసుకోని “అయ్యో పాపం” అని బాధపడి ఇంట్లోకి తీసుకోని పోయినారు.

అల్లుడొస్తున్నాడు గదా, అదీ మొదటి పండుగ గదా... అందుకని వాళ్ళత్త బాగా ద్రాక్షా,జీడిపప్పేసి నెయ్యితో బ్యాళ్ళ పాయసం చేసింది. అల్లుడు అన్నం తిన్నాక పల్లెంలో పాయసం పోయసాగింది. పాయసం

పైనుండి పల్లెంలో పద్తా వుంటే "బళుక్! బళుక్!" అని చప్పుడు రాసాగింది. అది విని వాడు కుక్క పల్లెం నాకుతుందేమో అనుకోని "థాయ్" అని చేత్తో అట్టనే కొట్టినాడు. చెయ్యి అత్తకు తగిలి సుర్రుమనింది. దాంతో అత్త "ఏంది నాయనా! పాయసం చాలనుకుంటే వద్దనాలగానీ అట్లా కొడ్తావా" అనింది. "కుక్కనుకోని కొట్టినా" అని చెబితే మర్యాద పోతాది గదా... అందుకని వాడు "అది కాదత్తా! బ్యాళ్ళ పాయసమంటే నాకు చానా చానా అసహ్యం. అందుకే పోస్తా వుంటే వద్దని ఆపబోతే తొందరలో చేయి గట్టిగా తగిలింది. ఏమనుకోవద్దు" అన్నాడు. ఆమె "సరే" అని పాయసం గిన్నె తీసేసింది.

అన్నం తిని గదిలో పండుకున్నాక పెండ్లాం వచ్చి పక్కన కూచోని "బ్యాళ్ళ పాయసం ఎందుకు తినలేదు? అమృతం లెక్క ఎంత బాగుందో తెలుసా. మా అమ్మ నీ కోసమని బాగా నెయ్యేసి, జీడిపప్పేసి కష్టపడి చేసింది" అనింది. ఆ మాటలింటానే వానికి నోట్లో నీళ్ళూరినాయి.

రాత్రి అందరూ పండుకున్నాక నెమ్మదిగా లేసి బ్యాళ్ళ పాయసం తిందామని తలుపు తీసుకోని బైటికొచ్చినాడు. వానికి వంటగది ఎక్కడుందో అర్థంకాక వెదుకుతా పోతా వుంటే వాళ్ళత్త పడుకున్న మంచం ఠకీమని తగిలింది. దాంతో ఆమె అదిరిపడి లేచి చూస్తే ఎదురుగా అల్లుడు కనబన్నాడు. ఆమె "ఏందల్లుడూ ఇంత రాత్రిపూట ఇట్లా వచ్చినావు" అనడిగింది. పాయసం కోసం వచ్చినానని చెబ్తే మర్యాద పోతాది గదా... అందుకని వాడు "ఏం లేదత్తా! రాత్రి పాయసం పోసేటప్పుడు పొరబాటున చేయి తగిలింది. నేను కావాలని కొట్టలేదు. నన్ను మన్నించు" అని కాళ్ళ మీద పడినాడు. దానికామె "నా అల్లుడెంత మంచోడు" అనుకోని "లేదులే నాయనా! నేనేమీ అనుకోలేదులే!పో...పోయి నువ్వు పండుకోపో" అని పంపిచ్చింది. వాడు మట్టసంగా మరలా గదిలోకి వచ్చేసినాడు.

వానికి ఎంత పడుకుందామన్నా నిద్ర రాలేదు. మాటిమాటికీ బ్యాళ్ళ పాయసమే గుర్తుకు రాసాగింది. దాంతో ఒక గంట దాట్నాక మల్లా లేచి గొంగలి కప్పుకోని నెమ్మదిగా అడుగులో అడుగేసుకుంటా వంట గదిలోకి పోయినాడు. ఒక్కొక్క గిన్నే వాసన చూస్తా పాయసం గిన్నె అందుకోని లోపలికి చేయి పెడితే ఇంకేముంది... అడుగు తప్ప ఏమీ లేదు. సరే కనీసం ఇదైనా దొరికింది గదా అనుకోని గిన్నెలోకి తల దూర్చి నున్నగా నాకేసినాడు. అట్లా అంతా నాకేసినాక తల తీయబోతే రాలేదు. గిన్నెలోనే ఇరుక్కోని పోయింది.

వానికసలే కండ్లు సరిగా కనబడవు. మళ్ళా ఇదొకటి. దాంతో వాడు దాన్ని పీక్కోడానికి కిందామీదా పడతా వుంటే కాళ్ళకూ, చేతులకూ అంట్ల గిన్నెలన్నీ తగిలి ధనాధనా కిందబన్నాయి. ఇంట్లో నిద్రపోతావున్న వాళ్ళంతా వులిక్కిపడి లేచి వురుక్కుంటా వచ్చి చూస్తే ఇంకేముంది ఒళ్ళంతా గొంగలి కప్పుకోని ఎగురుతా కనబన్నాడు.

వాళ్ళు దొంగోడేమో అనుకోని ఒక్కసారిగా మీదపడి పట్టుకొని స్తంభానికి కట్టేసి కట్టెల్తో మెత్తగా తన్నినారు. వీడు లబోదిబోమని ఎంతరచినా గిన్నె అడ్డముంది గదా దాంతో ఎవరికీ ఏమీ వినబళ్ళేదు. అంతలో వాళ్ళ బామ్మర్ది "వీని మొగం చూద్దాం" అని గిన్నె పట్టుకొని గట్టిగా ఒక్క పెరుకు పెరికినాడు. అంతే...అల్లుడు కనబడి అందరూ అదిరిపన్నారు.

"నువ్వా అల్లుడూ! ఎంత పని జరిగిపోయింది" అంటూ బెరబెరా కట్లిప్పి "ఏం జరిగింది" అనడిగినారు. ఇక వాడు "ఇట్లాగే దాచిపెడ్తే ముందు ముందు ఇంగెన్ని కష్టాలు వస్తాయో ఏమో" అనుకోని భయపడి మట్టసంగా జరిగిందంతా చెప్పేసినాడు.

# 101 భం... భం... చుకచుక

ఒకూర్లో ఒక కట్టెలు కొట్టేటోడుండేటోడు. వాడు చానా చానా పేదోడు. పొద్దున లేసినప్పటి నుండీ రాత్రి చీకటి పడేదాకా కిందా మీదా పడి పని చేసినా కడుపులోనికి నాలుగు ముద్దలు పోవడమే కష్టమయిపోయేది. దాంతో ఒకరోజు వాని పెండ్లాము "ఇట్లా ఏ రోజుకారోజు తిండికి వెదుకులాడతా ఎంత కాలమని బతుకుతాం. పో...పోయి... యాడైనా బాగా డబ్బు సంపాదించుకోని రాపో" అనింది.

వాళ్ళ వూరి పక్కనే ఒక అడవుంది. దాన్ని దాటితే ఒక పెద్ద రాజ్యమొస్తాది. ఆ రాజ్యానికి పోతే ఏదైనా మంచి పని దొరుకుతాదేమో అనే ఆశతో వాడు బైలుదేరినాడు. అడవంటే అదేమీ చిన్నా చితకది కాదు. చానాచానా పెద్దది. వాడా అడవిలో పోతా వుంటే నెమ్మదిగా చీకటి పడసాగింది. చీకట్లో అడవిలో పోవడం అంత మంచిది కాదు గదా...దాంతో ఎట్లాగబ్బా...అని దిక్కులు చూస్తా వుంటే దూరంగా ఒకచోట ఒక పెద్ద పాడుబన్న మేడ కనబడింది.

ఈ అడవిలో మేడ కట్టుకోని ఎవరున్నారబ్బా అని ఆచ్చర్యపోతా...పోయి తలుపు కొడ్తే ఇద్దరు ముసిలోల్లు నవ్వుతా తలుపు తీసినారు. "చీకటి పడ్తా వుంది. ఈ రాత్రికి ఈన్నే పండుకోడానికి కొంచం చోటిస్తారా" అనడిగినాడు. వాళ్లు "సరే...లోపలికిరా" అని పిల్చినారు. లోపలికి పోయి చూస్తే ఇంగేముంది...బైటికి పాడుబన్న మేడ మాదిరి వుంది గానీ...లోపల మాత్రం ఇంద్రభవనంలా బ్రమ్మాండంగా వుంది. యాడ చూసినా బంగారువీ, వెండివీ వస్తువులు ధగధగా మెరిసిపోతా కనబన్నాయి. వాళ్ళు మంచి మంచి పిండి వంటల్తో భోజనం పెట్టి, పండుకోడానికి గది చూపించినారు. "వీళ్ళకింత డబ్బెక్కడిదబ్బా" అని ఆచ్చర్యపోతా పండుకున్నాడు.

వాడు నిద్ర పోతా వుంటే అర్ధరాత్రి ఏదో కిర్...కిర్...మని చప్పుడవుతా వుంటే వానికి మెలకువొచ్చింది. "ఇదేందబ్బా... ఇంత రాత్రప్పుడు చప్పుడవుతా వుంది" అని ఒక్కొక గదే వెతుక్కుంటా... వెతుక్కుంటా... పోయి చూస్తే... ఇంకేముంది... ఆ సమయంలో ఒక గదిలో ముసిలోడు అటక పైనుండి ఒక పెట్టె కిందికి దించుతా కనబన్నాడు. ఇంత రాత్రప్పుడు వీనికి ఈ పెట్టెతో పనేముందో అనుకోని వాడు ఆన్నే దాచిపెట్టుకోని మట్టసంగా చూడసాగినాడు. వాళ్ళు పెట్టె తెరచి లోపలి నుండి రెండు ఎర్రటోపీలు తీసుకోని తలా ఒకటి నెత్తిన పెట్టుకోని "భం...భం...చుక చుక" అన్నారు. అంతే ఇద్దరూ ఆన్నించి లటుక్కున మాయమైపోయినారు.

"ఇదేందిరా నాయనా...ఇట్లా మాయమైపోయినారు" అని ఆచ్చర్యపోతా లోపలికి పోయి పెట్టె తెరచి చూస్తే దాంట్లో వానికి ఇంగో టోపీ కనబడింది. దాని సంగతేమిటో చూద్దామని వాడు గూడా టోపి నెత్తిన పెట్టుకోని ఇందాక ముసిలోల్లన్నారు గదా... అచ్చం అట్లానే "భం... భం... చుక చుక" అన్నాడు. అంతే అట్లా అనడం ఆలస్యం వాడు కూడా ఆన్నించి టక్కున మాయమైపోయి ఒక రాజుగారి భవనంలో ప్రత్యక్షమయినాడు.

రాజుగారి భవనమంటే మాటలుగాదు గదా... యాడ చూసినా బంగారు, వెండి వస్తువులే. ఆచ్చర్యంగా వాటిని చూస్తా పోతా వుంటే ఒకచోట ముసిలోల్లిద్దరూ అందినేవి అందినట్టు మూట గట్టుకుంటా కనబన్నారు. ఓహో...ఇదా సంగతనుకోని వాడు గూడా దొరికినేవి దొరికినట్లు ముసిలోల్లకు కనబడకుండా బెరబెరా మూటగట్టుకోని "భం...భం...చుక చుక" అని వాళ్ళ కన్నా ముందే తిరిగి ఇంట్లో ప్రత్యక్షమయినాడు. వాడు వెంటనే ఆ ఎర్రటోపీని, మూటను తీసుకోని ముసిలోల్లు రాకముందే రాత్రికి రాత్రే ఆన్నించి పారిపోయినాడు.

వాడు మూట నిండా బంగారం తీసుకొచ్చినాడు గదా...అది చూసి వాని పెండ్లానికి సంబరం సంబరం కాదు. మంచి మిద్దె కట్టుకున్నారు. కావల్సినవన్నీ కొనుక్కున్నారు. కానీ...వాని పెండ్లాం దొరికినదాంతో తృప్తిపడక "ఇంగా తేపో...ఇంగా తేపో..." అని వేధించడం మొదలుపెట్టింది. దాంతో వాడు పెండ్లాం బాధ భరించలేక ప్రతిరోజూ రాత్రి టోపీ పెట్టుకోని పోవడం...దొరికినవన్నీ మూటగట్టుకోని రావడం మొదలుపెట్టినాడు.

అట్లా రోజురోజుకీ ఒక్కొక్క వస్తువు మాయమైపోతా వుంటే రాజుకి అనుమానమొచ్చింది. ఎవడో దొంగ రాత్రిపూట వస్తా వున్నాడు అనుకోని రహస్యంగా సైనికుల్ని కాపలా పెట్టినాడు. వీనికది తెలీదు గదా...దాంతో ఎప్పట్లాగే ఆరోజు కూడా పోయి మట్టసంగా బంగారు వస్తువులన్నీ మూట గట్టుకుంటా వుంటే చూసిన సైనికులు వెనక నుంచొచ్చి లటుక్కున పట్టేసుకోని రాజు దగ్గరకు ఈడ్చుకోని పోయినారు. "నా భవనంలోనే దొంగతనం చేస్తావా... ఎంత ధైర్యం రా నీకు" అని రాజు సైనికులతో "వీన్ని స్తంభానికి కట్టేసి బాగా కొరడాలతో కొట్టి వురెయ్యి"మన్నాడు. 'సరే' అని వాళ్ళు పట్టుకోనిపోయి కొరడాతో కొట్టినచోట కొట్టకుండా కొట్టినారు. పాపం...ఆ దెబ్బలకు వాని ఒళ్ళంతా రక్తం రక్తం గాదు.

ఎవరినయినా వురేసే ముందు "నీ ఆఖరి కోరిక ఏమి" అనడుగుతారు కదా...అందుకని వాళ్ళు "నీకేం కావాల్నో చెప్పు...తీరుస్తాం" అన్నారు. వెంటనే వానికి ఎర్రటోపీ గుర్తుకొచ్చింది. దాంతో "ఏమీ లేదు...నాది ఒకే ఒక కోరిక. నా ఎర్రటోపీ అంటే నాకు చానా ఇష్టం. దాన్ని నెత్తి మీద పెట్టుకోని చచ్చిపోతా...అది తెప్పియ్యండి" అన్నాడు.

వాళ్ళకు ఎర్రటోపీ గురించి తెలీదు గదా...దాంతో అది మామూలు టోపీనే అనుకోని తెచ్చి వాని నెత్తిన పెట్టినారు. వెంటనే వాడు క్షణం కూడా ఆలస్యం చేయకుండా "భం...భం...చుక చుక" అని ఒక్కరుపు అరిచినాడు. అంతే ఆన్నించి మాయమైపోయి ఇంట్లో ప్రత్యక్షమయినాడు. ఇంక అప్పట్నించీ వాడు జన్మలో మరలా రాజుగారి భవనం వైపు పోలేదు. దొంగతనమూ చెయ్యలేదు.

# 102 దెబ్బకు ఏడుమంది

ఒకూర్లో ఒక పిల్లోడు వుండేటోడు. వాడు పెద్ద సోమరిపోతు. ఎప్పుడూ, ఏ పనీ చేయకుండా గప్పాలు కొట్టుకుంటా వూరంతా తిరిగేటోడు. ఒకరోజు వాడు ఇంట్లో కూచోని, వాళ్ళమ్మ చేసిన నేతిలడ్లు తింటా వుంటే... ఆ కమ్మని వాసనకు ఎక్కడెక్కడి ఈగలన్నీ వచ్చి రయ్యిమని ముసురుకున్నాయి. ఎన్నిసార్లు తోలినా అవి మళ్ళీ మళ్ళీ రాసాగినాయి. దాంతో వానికి బాగా కోపమొచ్చింది. ఇట్లాగయితే లాభం లేదనుకోని ఈసారి ఈగలన్నీ వాలగానే ఒక్కసారిగా రెండుచేతులతో ఫట్టుమని ఒక్కటి కొట్టినాడు. అంతే దెబ్బకి ఏడు చచ్చి కిందబన్నాయి. వాటిని చూసి వాడు "అబ్బ... నేనెంత వీరున్ని ఒక్కదెబ్బకి ఏడింటిని చంపేశాను" అని సంబరపడినాడు. వెంటనే ఒక బట్టలు కుట్టే దర్జీ దగ్గరికి పోయి భుజమ్మీద నుండి నడుము వరకు వేలాడేటట్టు ఒక పెద్ద పట్టీని కుట్టిచ్చుకున్నాడు. దాని మీద "దెబ్బకి ఏడుమంది" అని పెద్ద పెద్ద అక్షరాలతో రాయించి అంగీ మీద తగిలించుకున్నాడు. అట్లా తగిలిచ్చుకొనేసరికి వానికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

వానికి తన బలం ఆవూరి మహారాజుకి చూపించి ఆడ ఏదయినా మంచి వుద్యోగం సంపాదించాలనిపించింది. రాజుండేది పక్క ఊరిలో. మధ్యలో పెద్ద అడవి వుంది. దాన్ని దాటాల. దాంతో వాడు దారిలో ఆకలయితే తినడానికని జేబు నిండా లడ్లు వేసుకొని బైలుదేరినాడు. అట్లా అడవిలో పోతా వుంటే, దారిలో ఒకచోట ఒక గద్ద ఒక పిట్టను పట్టుకోవడం కనిపించింది. వెంటనే వీడు అయ్యో పాపమని జాలిపడి వెంటనే ఒక రాయి తీసుకోని గద్దను ఈడ్చి ఒక్కటి పెరికినాడు. ఆ దెబ్బకు అది అదిరిపడి అక్కడికక్కడే పిట్టను వదిలి పారిపోయింది. వాడు ఆ పిట్టను తీసుకోని దానికి నీళ్ళు తాపి, గింజలు పెట్టి భద్రంగా జేబులో వేసుకొని పోసాగినాడు.

ఆ అడవి మధ్యలో ఇద్దరు పెద్దపెద్ద రాక్షసులున్నారు. వాళ్ళకి అడవిలో ఎవరయినా మనిషి కనబడితే చాలు వెంటబడి చంపి తినడం అలవాటు. అందుకే అటువైపు ఎవరూ వెళ్ళేటోళ్ళు కాదు. కానీ వీనికి ఆ రాక్షసుల సంగతి తెలీదు. దాంతో అట్లాగే పోయినాడు.

చానా రోజుల నుంచి మనుషులెవరూ దొరకక అల్లాడతావున్న రాక్షసులు వీన్ని చూడగానే లొట్టలేస్తా ఎగురుకుంటా వచ్చి "రేయ్ ఎవడ్రా నువ్వు. మా అడవిలోకి రావడానికి ఎంత ధైర్యం నీకు" అన్నారు గట్టిగా. వాళ్ళని చూడగానే మనోనికి గుండె గుభేలుమనింది. కాళ్ళు, చేతులు వణికిపోయినాయి. అయినా ధైర్యం కూడగట్టుకోని "నేనెవరినా. ఇదిగో చూడండి" అంటూ పట్టీని చూపించినాడు. దాని మీద దెబ్బకి ఏడుమంది అని వుంది గదా... అది చూసి రాక్షసులు ఆచ్చర్యపోయి "మా మోకాలెత్తు లేవు. నీవు దెబ్బకి ఏడుమందిని

చంపినావా మేము నమ్మము" అన్నారు. దానికి వాడు నవ్వి "సరే... అయితే ఏదయినా పోటీ పెట్టుకుందాం. సరేనా" అన్నాడు. ఆ రాక్షసులిద్దరూ 'సరే' అన్నారు.

మొదట ఒక రాక్షసుడు ఒక రాయి తీసుకోని నువ్వు నాలాగా రాయిని చేత్తో ముక్కలు చేయాల. చేస్తావా, అంటూ రాయిని గట్టిగా నొక్కినాడు. వాని బలానికి అది ముక్కలు ముక్కలు అయ్యింది. అది చూసి మనోనికి ఏం చేయాల్నో అర్థం కాలేదు. అంతలో జేబులో వున్న లడ్డు గుర్తుకు వచ్చింది. వెంటనే ఆ రాక్షసులకు కనబడకుండా అది బయటికి తీసి అరచేతిలో దాచిపెట్టుకోని "రాయిని ముక్కలు ముక్కలు చేయడం ఏం గొప్పతనం. ఆ మాత్రం పని ఏ గొట్టంగాడయినా చేస్తాడు. నన్ను చూడు ఏకంగా రాయిలోంచి నూనెను గూడా పిండగలను" అంటూ, ఒక రాయి తీసుకోని గట్టిగా పిసకసాగినాడు. ఆ చేతిలోనే నేతిలడ్డు గూడా వుంది గదా.. దాంతో గట్టిగా ఒత్తేసరికి అందులోనించి కొన్ని నేతిచుక్కలు కారి కిందబడినాయి. అది చూసి రాక్షసులు అదిరిపడి 'అబ్బో వీడెవ్వడోగానీ నిజంగానే మనకన్నా బలవంతునిలాగున్నాడే' అనుకున్నారు.

అయినా అనుమానం తీరక, రెండో రాక్షసుడు 'సరే ఇందులో నువ్వే గెలిచినావుగానీ ఇంకొక పోటీ పెట్టుకుందాం. మనిద్దరమూ చెరొక రాయి విసురుదాం. ఎవరిది దూరంగా పడితే వాళ్ళు గెలిచినట్టు' అన్నాడు. 'సరే నువ్వు ముందు విసురు' అన్నాడు.

రాక్షసుడు ఒక రాయి తీసుకోని తన బలమంతా వుపయోగించి వేగంగా విసిరినాడు. అది సర్రున చానా దూరం పోయి దబ్బుమని చప్పుడు చేస్తూ ఒకచోట పడింది. తరువాత వాడు విసరాల గదా. రాక్షసునికన్నా దూరం ఎలా విసరాలబ్బా అని ఆలోచిస్తా వుంటే జేబులో వున్న పిట్ట గుర్తుకు వచ్చింది. వెంటనే ఆ రాక్షసులకు కనబడకుండా జేబులోని పిట్టను తీసి ఆ మాత్రం దూరం ఏ గొట్టంగాడయినా విసురుతాడు. నేను చూడు కనీసం చిన్న చప్పుడు గూడా వినిపించనంత దూరం విసురుతా అంటూ ఆ పిట్టను విసిరినాడు. అంతే అది సర్రున ఆగకుండా ఎగిరిపోయింది. అది చూసి రాక్షసులు అదిరిపడి "అబ్బో... వీడెవడో నిజంగానే మనకన్నా బలవంతునిలాగున్నాడే" అనుకున్నారు. వెంటనే నువ్వే మా కన్నా బలవంతునివి అని ఒప్పుకుంటా "ఇప్పటికే బాగా చీకటి పడింది. ఈరోజు రాత్రికి మా ఇంటికి వచ్చి మేమిచ్చే విందు తీసుకోని మా ఇంట్లోనే పడుకో. రేప్పొద్దున్నే పోదువుగానీ" అన్నారు. వాడు సరేనంటూ దగ్గర్లోనే వున్న వాళ్ళ ఇంటికి పోయినాడు.



రాక్షసులు వానికి ఆ రాత్రి మంచి మంచి పిండివంటలు పెట్టి తిన్నాక పండుకోడానికి ఒక పెద్ద గది చూపించినారు. దాంట్లో పెద్ద మంచమూ, మెత్తని పరుపులూ వున్నాయి. పోయి పండుకున్నాడుగానీ వానికి

రాక్షసులపైన నమ్మకం కుదరలేదు. కాసేపున్నాక చప్పుడు చేయకుండా అడుగులో అడుగు వేసుకుంటా ఆ రాక్షసులున్న గదికాడికి వచ్చినాడు. అప్పుడే ఒక రాక్షసుడు ఇంకో రాక్షసునితో "ఒరేయ్ ఇంతవరకూ వీడు తప్ప మనలని ఎదిరించి నిలబడిన వీరుడెవడూ లేడు. వీన్ని ఇట్లాగే వదిలేసినామంటే విషయం అందరికీ తెలిసి మన మర్యాద పోతాది. అందుకే ఎట్లాగయినా సరే... ఈ రాత్రే వాన్ని పండుకున్నోన్ని పండుకున్నట్టు ఇనుపస్తంభాలతో కొట్టి చంపేద్దాం" అన్నాడు. రెండోవాడు 'సరే' అన్నాడు.

కిటికీ పక్క నుండి ఆ మాటలన్నీ విన్న ఆ పిల్లోడు 'ఓహో! ఇదా సంగతి' అనుకోని పరుగుపరుగున గదిలోనికి పోయి మంచం మీద దిండ్లన్నీ వరుసగా పెట్టి, వాటి మీద దుప్పటి నిండుగా కప్పి దీపాలన్నీ ఆర్పి ఒక మూలన దాగి చూడసాగినాడు.

అర్ధరాత్రి కాగానే ఆ రాక్షసులిద్దరూ తలా ఒక కడ్డీ లావుది చేత పట్టుకోని గదిలోకి వచ్చినారు. గదంతా చీకటిగా వుండటంతో మంచమ్మీద వున్నది మనిషే అనుకున్నారు. చెరో పక్కన చేరుకోని ధనధనధన దెబ్బ మీద దెబ్బ... దెబ్బ మీద దెబ్బ వేసినారు. అంతే... ఆ దెబ్బలకు అంత లావు మంచం విరిగి తునాతునకలయ్యింది. 'దెబ్బకు కిక్కురుమనకుండా చచ్చినాడు వెధవ. వీనితో మనకు పీడా పోయింది' అనుకుంటా వాళ్ళు సంబరంగా వెళ్ళిపోయినారు.

తరువాత రోజు పొద్దున్నే రాక్షసులిద్దరూ ఇంటిబైట కూచోని వేపమొద్దుతో పండ్లు తోముకుంటా వుంటే వాడు ఒళ్ళు విరుచుకుంటా వాళ్ళ మధ్యలోకి వచ్చినాడు. వాన్ని చూసి ఆ రాక్షసులిద్దరూ అదిరిపడినారు. చిన్న రాక్షసుడు భయంతో వణికిపోతా ర్ర... ర్ర... ర్ర... రాత్రి నీకు నిద్ర పట్టిందా అనడిగినాడు. "ఆ... ఆ... బాగానే పట్టింది. కానీ అర్ధరాత్రి ఎలుకలు మీద తిరుగుతా తోకలతో కొట్టి కొంచం అల్లరి చేసినాయ్" అన్నాడు. అంతే ఆ రాక్షసులు "ఓరినాయనోయ్... వీడు మామూలోడు కాదు. ఇనుప కడ్డీల దెబ్బలు ఎలుకతోక దెబ్బలని అనుకుంటా వున్నాడు. మనం వీన్ని చంపాలనుకున్న విషయంగానీ తెలిసిందంటే మనల్ని ప్రాణాలతో వదలడు" అని వాడు పిలుస్తావున్నా ఆగకుండా ఆన్నించి పారిపోయినారు. వాడు నవ్వుకుంటా నెమ్మదిగా నడుస్తా పక్కనే వున్న రాజ్యానికి చేరుకున్నాడు.

ఆ రాజ్యం పొలిమేరల్లో ఇంకో ఇద్దరు రాక్షసులున్నారు. వాళ్ళు చానా చెడ్డోళ్ళు. ప్రతిరోజూ పొద్దున్నే వూరి మీద పడి దొరికినోన్ని దొరికినట్టు చంపి తినేటోళ్ళు. రాజు ఎంతమంది సైనికులని వాళ్ళ మీదకు పంపించినా అందరూ వాళ్ళ చేతిలో చచ్చేటోళ్ళేగానీ వాళ్ళని ఏమీ చేయలేక పోయేటోళ్ళు. దాంతో రాజుకు ఏం చేయాల్నో పాలుపోక ఎవరయితే ఆ రాక్షసులని చంపుతారో వానికి తన రాజ్యంలో సగభాగమిస్తానని దండోరా వేయించినాడు. ఆ దండోరా విన్న పిల్లోడు రాజుని కలవడానికని పోయినాడు. సైనికులు వాన్ని బైటనే ఆపి 'ఎవరు నువ్వు ... ఏం కావాల' అనడిగినారు. దానికి వాడు కోపంగా "నేనెవరినా. దెబ్బకు ఏడు మందిని చంపిన మొనగాణ్ణి. చూడండి" అంటూ అంగీ మీద వేసుకున్న పట్టీ చూపించినాడు. దాంతో వాళ్ళు భయపడి రాజు దగ్గరికి తీసుకోనిపోయినారు. వాడు రాజుతో "ఓరాజా! నేను ఆ రాక్షసులను చంపి వస్తాను. నీవు మాట నిలబెట్టుకుంటావా?" అన్నాడు. 'అలాగే' అన్నాడు రాజు. దాంతో వాడు ఆ రాక్షసులు రాజ్యానికి ఏ పక్కనున్నారో కనుక్కోని అటువైపు పోయినాడు.

ఊరిబైట ఒక పెద్ద మర్రిచెట్టు వుంది. ఆ చెట్టు కింద రాక్షసులిద్దరూ పండుకోని గురకలు పెడ్తా కనబడినారు. వాళ్ళని ఎట్లా చంపాలబ్బా అని ఆలోచించి కొన్ని రాళ్ళు తీసుకోని జేబులో వేసుకోని చప్పుడు గాకుండా చెట్టు పైకి ఎక్కి కనబడకుండా కొమ్మల నడుమ కూచున్నాడు. ముందుగా ఒక రాయి తీసుకోని పైనుంచి ఒక రాక్షసుని తల మీద ఈడ్చి ఒక్కటి పెరికినాడు. ఆ దెబ్బకి వాడు అదిరిపడి లేచినాడు. చుట్టూ చూస్తే ఎవరూ కనిపించలేదు. పక్కనే పడుకున్న రాక్షసుడే కొట్టి ఉంటాడనుకోని వాన్ని లేపి... 'నేను కొట్టలేదు' అన్నా వినకుండా ఏంరా... హాయిగా పండుకోని వుంటే రాయితో కొట్టి మళ్ళీ ఏమీ తెలీనోని మాదిరి గమ్మున పండుకుంటే నేను కనిపెట్టలేను అనుకుంటున్నావా, ఇదిగో ఇంకొకసారి గనుక ఇట్లా చేసినావంటే వుంటాది చూడు. ఏమనుకుంటా వున్నావో" అని అరిచి పండుకున్నాడు.

మరలా కాసేపటికి వాడు పైనుంచి ఇంకొక రాయి తీసుకోని మరలా అదే రాక్షసుని మొగమ్మీద ఈడ్చి ఒక్కటి పెరికినాడు. అంతే... వాడు అదిరిపడి మళ్ళీ లేచినాడు. కోపంతో బుసలు కొడతా పక్కనున్నవాన్ని నిద్ర లేపి "ఏంరా... ఒళ్ళుగాని కొవ్వెక్కిందా. ఒకసారి చెబితే అర్థంగాదా" అంటూ ధనధనధన నాలుగు గుద్దులు గుద్దినాడు. దాంతో వానికి  గూడా చానా కోపమొచ్చింది. "అరే... నేను కొట్టలేదంటావున్నా వినకుండా నన్నే తంతావా. ఏం నీవేనా తన్నేది. నేను తన్నలేనా. దా చూసుకుందాం" అంటూ లేచి ఎగిరి వాని మీదకు దుంకినాడు. ఇంగ చూడు నా సామిరంగా! ఇద్దరూ పెద్దపెద్ద బండరాళ్ళు తీసుకోని కిందామీదా పడి కొట్టుకోసాగినారు. కాసేపటికి ఇద్దరికీ బాగా దెబ్బలు తగిలి రక్తం కారీ కారీ ఆఖరికి ఇద్దరూ చచ్చిపోయినారు.

వెంటనే వాడు చెట్టు పైనుండి దిగి రాజు దగ్గరికి పోయినాడు. "రాజా! నీకు చెప్పినట్టే ఆ రాక్షసులిద్దరినీ చంపి వచ్చినాను. నువ్వు ఇచ్చిన మాట నిలబెట్టుకో" అన్నాడు. రాజు ఆచ్చర్యపోయి అడవిలోనికి పోయి చూస్తే ఇంకేముంది ఇద్దరూ చచ్చిపడి కనిపించినారు. వెంటనే రాజు సంబరంగా వాన్ని బంగారు పల్లకీలో కూచోబెట్టి తప్పెట్ల నడుమ వూరంతా తిప్పినాడు. అన్నమాట ప్రకారం అర్ధరాజ్యం ఇవ్వడమేగాక, తన కూతురిని గూడా ఇచ్చి అంగరంగవైభోగంగా పెండ్లి చేసి అల్లున్ని చేసుకున్నాడు.

# 103 వ్వే...వ్వే...వ్వే...

ఒకూర్లో ఒక రైతున్నాడు. ఆయనకు చానా పెద్ద చేనుంది. కానీ వాడు పెద్ద పీనాసోడు. ఒకరోజు ఆ రైతు చేనంతా గింజలు చల్లినాడు. వానలు బాగా పడడంతో నెమ్మదిగా అవి బాగా పెరిగి పెద్దగయి కొంతకాలానికి బ్రమ్మాండంగా కంకులేసినాయి.

ఆ పొలం పక్కనే వున్న ఒక చెట్టు మీద ఒక గుడ్లగూబ వుంది. దానికి చిన్న చిన్న పిల్ల లున్నాయి. దాంతో అది ప్రతిరోజూ రాత్రిపూట వచ్చి ఏదో ఒక కంకి మీద వాలి తిన్నన్ని తిని, మిగిలినవి పిల్లలకు తీసుకోని పోయేది.

రోజుకో కంకి నాశనమయి పోతా వుంటే ఒకరోజు రైతు గమనించినాడు. "ఎవరబ్బా ఇట్లా రోజుకొక్క కంకి తినిపోతా వున్నారు" అని చెప్పి ఒకరోజు రాత్రి చేనులో కాపు కాసినాడు. గుడ్లగూబ ఎప్పట్లాగే ఆ రోజు కూడా చీకటి పడగానే గింజల కోసమని వచ్చి కంకుల మీద వాలింది.

అది చూసి ఆ రైతు నెమ్మదిగా వెనుకవైపు నుండి సప్పుడు కాకుండా అడుగులో అడుగు వేసుకుంటా వచ్చి దాన్ని లటుక్కున పట్టేసుకున్నాడు. వాడు దాన్ని అట్లా పట్టేసుకోగానే అది భయంతో "ఇద్చు ఇద్చు పొరపాటయిపోయింది. మల్లా జన్మలో నీ చేనుకాడికి రాను. నాకు చిన్న చిన్న పిల్లలున్నాయి. వదిలెయ్" అని ఎంత ఏడ్చినా వాని మనసు కరగలేదు. "నువ్వు నా గింజలు తిన్నావు గాబట్టి నేను నిన్ను కూర చేసుకోని తింటాను. అప్పుడుగానీ నా కసి తీరదు" అన్నాడు.

వాడు ఆ గుడ్లగూబను తీసుకోని వస్తా వుంటే దారిలో ఒక రైతు ఎదురుగా వస్తా కనబన్నాడు. వాన్ని చూసిన వెంటనే ఆ గుడ్లగూబ

**"గూగూ... గూగూ....గుడిసే వుందీ**
**గుడిసే లోనా పిల్లాలున్నాయ్**
**పిల్లల కోసం వదలమని చెప్పు**
**వదుల్తె మల్లా ఎప్పుడు రాను"** అనింది.

అది విన్న ఆ రైతు "పాపం దానికి చిన్న చిన్న పిల్లలున్నాయంట. ఈ ఒక్కసారికి వదిలెయ్యి మల్లా రానంటుంది గదా" అన్నాడు. కానీ వాడు

**"తింటే దీని కూరే తినాల**
**నములైతే దీని కండే నమలాల**
**కొరుకుతే దీని ఎముకే కొరకాల**
**తాగితే దీని చారే తాగాల"** అన్నాడే గానీ వదలలేదు.

దారిలో ఎంతమంది ఎన్ని మాటలు చెప్పినా పట్టిచ్చుకోకుండా ఇంటికి వచ్చి దాన్ని గంప కింద మూసిపెట్టినాడు.

వాని పెండ్లాం ఇంటిబైట రోట్లో వడ్లు దంచుతా వుంటే ఆమె దగ్గరకు పోయి "ఒసేవ్! నేను గంప కింద ఒకటి తెచ్చి పెట్టినా. దాన్ని మసాలా యేసి బాగా కూర చేసిపెట్టు. అంతలోపు నేను వూర్లోకి పోయొస్తా" అని చెప్పి పోయినాడే గానీ గంప కింద ఏమి పెట్నాడో చెప్పడం మాత్రం మరచిపోయినాడు.

కాసేపటికి పక్కింటామె "అకా! అకా! కాస్త ఈ గంటె నిండా నూనె ఇస్తావా, పప్పులోకి తిరువాత ఎయ్యాల" అంటా వచ్చింది. కానీ ఆమె వడ్లు దంచుతా వుంది గదా "నా చేతులు ఖాళీగా లేవు గానీ నువ్వే పోయి పోసుకోపో, వంటింట్లో వుంటాది" అనింది. సరేనని ఆ పక్కింటామె లోపలికి అడుగు పెట్టగానే ఆమెను చూసిన గుడ్లగూబ వెంటనే



**"గూగూ... గూగూ....గుడిసే వుందీ**
**గుడిసే లోనా పిల్లాలున్నాయ్**
**పిల్లల కోసం వదలమని చెప్పు**
**వదులైతే మల్లా ఎప్పుడు రాను"** అనింది.

ఆమె అయ్యో పాపమని జాలిపడి గంప లేపింది. అంతే అది తుర్రున ఎగిరిపోయింది.

గంప కింద ఏదో ఒకటి పెట్టకుంటే బాగుండదని ఆమె బెరబెరా వెనక్కి వచ్చింది. అది చూసి ఆమె "ఏమక్కా నూనె తీస్కోకుండానే పోతా వున్నావ్" అనడిగింది. దానికామె "ఏంలేదు పొయ్యి మీద పాలు పెట్టి మరిచొచ్చినా, పొంగిపోయినాయో ఏమో చూసొస్తానాగు" అని వురుక్కుంటా పోయింది. అట్లా పోయి గంపకింద ఏమి పెడదామా అని ఇంటి వెనకాల వెదుకుతా వుంటే ఒక కుక్కపిల్ల కనబడింది. ఆమె మట్టసంగా దాన్ని చీరదాపున దాచిపెట్టుకోని మల్లా వచ్చి ఆ గంప కింద పెట్టేసి ఏమీ తెలీని నంగనాచి లెక్క నూనె తీసుకోని వెళ్ళిపోయింది.

ఇదంతా ఆమెకు తెలీదు గదా. వడ్లు దంచడం పూర్తి కాగానే మొగుడేం తెచ్చినాడో చూసొద్దామని పోయి గంప లేపి చూస్తే ఇంగేముంది నల్ల కుక్కపిల్ల కనబడింది. "ఇదేందబ్బా! కుక్కపిల్లని తెచ్చుకున్నాడు. ఎవరయినా తింటారా దీన్ని" అనుకోని "నాకెందుకొచ్చిందిలే! వానికసలే ముక్కు మీద కోపం..." అనుకోని దాన్నే కోసి వండిపెట్టింది.

వానికిదంతా తెలీదు గదా. ఇంటికి రాగానే బెరబెరా కాళ్ళూ చేతులు కడుక్కోని, పళ్ళెం ముందు పెట్టుకోని కూచున్నాడు. ఆమె ఏమీ మాట్లాడకుండా గమ్మున వాని పళ్ళెంలో కుక్కకూర ఏసి బైటికి పోయింది. వానికది కుక్కకూరని తెలీదు గదా. గుడ్లగూబ కూరే అనుకోని దాన్ని లొట్టలేసుకుంటా తినడం మొదలుపెట్టినాడు. అంతలో

**"తింటే నా కూరే తినాల**
**నమిలితే నా కండే నమలాల**
**కొరుకుతే నా ఎముకే కొరకాల**
**తాగుతే నా చారే తాగాల**

అంతేగానీ.....

**కుక్కకూర తింటారా ఎవరయినా"** అని వినబడింది.

"ఎవరబ్బా ఇట్లా ఎగతాళి చేస్తా వున్నారు" అని తలెత్తి చూస్తే మిద్దెపైన కూచోని కిందా మీదా పడి నవ్వుతా వున్న గుడ్లగూబ ఆ రైతు చూడగానే "వ్వె...వ్వె...వ్వె...." అని వెక్కిరిస్తా ఆన్నించి ఎగిరిపోయింది.

# 104 మంత్రి - సేవకుడు

ఒక రాజు దగ్గర ఒకడు పని చేస్తా వుండేటోడు. వాడు ఎప్పుడూ రాజు వెంటనే వుంటా రాజు ఏ పని చెబ్తే ఆ పని చేస్తా వుండేటోడు. రాజు వానికి మూడుపూటలా తిండి పెట్టి నెలకు వంద వరహాలు జీతంగా ఇచ్చేటోడు.

రాజు దగ్గర ఒక మంత్రి వుండేటోడు. రాజుకు పరిపాలనకు కావలసిన సమాచారం అందిస్తా, సలహాలు ఇస్తా వుండేటోడు. వానికి రాజు ఒక పెద్ద రెండంతస్తుల ఇంటినీ, పదిమంది సేవకులనూ ఇచ్చి నెలకు పదివేల వరహాలు జీతంగా ఇచ్చేటోడు.

రాజు దగ్గర పని చేసే సేవకునికి మంత్రిని చూస్తే చానా అసూయగా వుండేది. "మంత్రికి అస్సలు పనిలా, పాటలా... వూకె అప్పుడప్పుడు వచ్చి అరగంటసేపు హాయిగా కూచోని వుత్తమాటలు చెప్పి పోతా వుంటాడు. ఒంటి మీద చెమటా పట్టదు, వేసుకున్న అంగీ నలగదు. అయినా ఆయనకు పదివేల జీతం. కానీ నాకు ఎంత పని. పొద్దున్నుంచీ సాయంత్రం వరకు గానుగెద్దులా రెక్కలు ముక్కలు చేసుకుంటా... అట్లా ఇట్లా మాటిమాటికీ తిరుగుతా, చెప్పినవన్నీ అందిస్తా, యాడికి పొమ్మంటే ఆడికి పోతా, ఏం తెమ్మంటే అది తెచ్చిపెడతా... లేసినప్పటి నుంచీ పండుకొనేదాకా ఒకటే పని. అయినా నాకు వంద వరహాల జీతం. ఈ పద్ధతేం బాగాలేదు" అనుకునేటోడు.

ఒకరోజు రాజు ఒంటరిగా వున్నప్పుడు ఆయన కాళ్ళు నొక్కుతా "రాజా.... ఏ మాత్రం పనీపాటా లేకుండా వూరికే వచ్చి కాసేపు కబుర్లు చెప్పి పోయే మంత్రికి పదివేల వరహాలు ఇచ్చి, నీవు లేసినప్పటి నుండీ పండుకునేదాకా నీ వెనకాల్నే తిరుగుతా నీవు చెప్పిన పనల్లా చేసే నాకు మాత్రం వంద వరహాలు జీతంగా ఇవ్వడం న్యాయమేనా... నిజానికి నాకు పదివేల వరహాలు ఇచ్చి, ఆయనకు వంద వరహాలు ఇవ్వాల గానీ" అన్నాడు.

రాజు ఆ మాటలకు చిరునవ్వు నవ్వి "ఒరేయ్... నీకు అవసరానికి డబ్బులు కావలసి వస్తే అడుగు... ఇస్తా... జీతం సరిపోకపోతే సరిపోవడంలేదు రాజా అని చెప్పు... పెంచుతా... అంతేగానీ మంత్రితో పోలికెందుకురా నీకు. మీ ఇద్దరికీ నక్కకు, నాగలోకానికి వున్నంత తేడా వుంది. నీకు శరీర కష్టం చేస్తా వున్నందుకు డబ్బులిస్తా వుంటే మంత్రికి తెలివితేటలను వుపయోగిస్తా వున్నందుకు ఇస్తా వున్నా. లోకంలో ఎప్పుడయినా, ఎక్కడయినా భుజబలం కన్నా బుద్ధిబలానికే విలువెక్కువ' అని చెప్పినాడు. కానీ వానికి ఆ మాటలు కొంచం గూడా తృప్తి కలిగించలేదు. రాజు అది గమనించినా "కొన్ని విషయాలు కొందరికి ఎంత చెప్పినా అర్థం కావు. దానికి సరియైన సమయం రావాలి" అనుకున్నాడు.



ఒకసారి రాజు వేటకు పోయినాడు. వెంబడి మంత్రి, సేవకుడు కూడా వున్నారు. రాజు వేటాడుతా వేటాడుతా బాగా అలసిపోయి, అలసట తీర్చుకోడానికి ఒక నది ఒడ్డున చెట్టు కింద కూచున్నాడు. రాజు అటూ ఇటూ చూస్తా వుంటే నదికి అవతలవైపు కొంతమంది గుంపుగా కనబన్నారు. రాజుకు వాళ్ళని చూడగానే తళుక్కున ఒక ఉపాయం మెరిసింది. వెంటనే సేవకున్ని పిలిచి "రేయ్... అవతల కొంతమంది గుంపుగా కనబడతా వున్నారు గదా... వాళ్ళెవరో కనుక్కోని రాపో" అన్నాడు.

నది చానా పెద్దగా వుంది. కాకపోతే నీళ్ళు లేవు. పరుగెత్తుకుంటా పోయినా అవతలికి పోయి ఇవతలికి రావడానికి పావుగంట పైన్నే పడుతుంది. సేవకుడు "సరే రాజా" అని వురుక్కుంటా నది అవతలికి పోయి వాళ్ళతో మాట్లాడి మళ్ళీ వేగంగా తిరిగొచ్చి 'రాజా! వాళ్ళు నాటకాలు వేసే వాళ్ళంట' అని చెప్పినాడు గసబెట్టుకుంటా.

"అట్లాగా.... వాళ్ళది ఏ వూరు" అన్నాడు రాజు.

"ఒక్క నిమిషం రాజా... ఇప్పుడే కనుక్కోనొస్తా" అంటా మళ్ళా వేగంగా వురికినాడు.

కాసేపటికి వచ్చి "రాజా... వాళ్ళు నంద్యాల నుంచి వచ్చినారంట" అన్నాడు. వాని ఒళ్ళంతా చెమటలు కారిపోతా వున్నాయి.

"అట్లాగా మరి యాడికి పోతా వున్నారంట" అన్నాడు రాజు.

సేవకుడు తల గోక్కోని "ఒక్కనిమిషం రాజా... అడిగొస్తా" అని వురుక్కుంటా పోయి ఆయాసపడతా, ఒళ్ళంతా చెమటలు గక్కుతా వుంటే, గసబెడతా తిరిగొచ్చి "రాజా వాళ్ళు కందనవోలులో పదిరోజులు నాటకాలు వేయడానికి పోతావున్నారంట." అన్నాడు కాళ్ళు పీకుతా వుంటే ఆన్నే ఒక పక్కకు కూలబడి.

రాజు అది విని "అట్లాగా... మరి మన రాజ్యంలో గూడా నాటకాలు వేయడానికి వస్తారంటనా" అన్నాడు. ఆ మాటలకు వాడు నోరెళ్ళబెట్టినాడు. అప్పటికే నది అవతలికీ, ఇవతలికీ వురికీ వురికీ, అలసిపోయి చెమటలు కక్కుతా వున్న వాడు "రాజా! కాసేపాగి వెళతా... ఇప్పుడే వెళ్ళడం నా చేతగాదు. కాళ్ళు పీకుతా వున్నాయి" అన్నాడు.

దానికి రాజు వాని వంక చూసి "అదెట్లరా.... అంతలోపు వాళ్ళు వెళ్ళిపోతే" అన్నాడు.

సేవకునికి ఏం చేయాల్నో తోచక "రాజా... ఈ ఒక్కసారికి నీ మాట కాదన్నందుకు మన్నించి ఎవరినైనా పంపు రాజా... నాచేత అస్సలు కావడం లేదు" అన్నాడు కండ్లనీళ్ళు పెట్టుకోని.

రాజు సరేనని మంత్రిని పిలిపించి, "మంత్రీ! నదికి అవతల ఏదో గుంపు కనబడతా వుంది. ఎవరు వాళ్ళు" అన్నాడు.

మంత్రి అటుపక్క చూసి "రాజా! వాళ్ళు నాటకాలేసేవాళ్ళు. నంద్యాల నుండి వచ్చినారు. పదిరోజులు కందనవోలులో నాటకాలు వేయడానికి పోతున్నారంట. మనం పిలిస్తే మన రాజ్యానికి గూడా వస్తారంట. తినడానికి ఇంత తిండి పెట్టి మీకు తోచినంత ఇస్తే చాలన్నారు. రామాయణం, భారతంలో ఏ కథయినా నాటకంగా వేయగలరంట. మొత్తం పదిమంది వున్నారు" అని చెప్పినాడు.

మంత్రి టకటకటక వివరాలన్నీ ఒక్క క్షణంలో చెబుతా వుంటే పనోడు నోరు వెళ్ళబెట్టుకోని వింటా వున్నాడు.

రాజు మంత్రితో "మంత్రీ! ఇవన్నీ నువ్వెప్పుడు కనుక్కోని వచ్చినావు" అన్నాడు.

మంత్రి నవ్వి "రాజా... నిన్ను, రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడమే గదా నా పని. నీవు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటా వుండగా... అవతల ఒక గుంపు కనబడింది. వాళ్ళు ఎవరు? ఆడ ఎందుకున్నారు? వాళ్ళ వల్ల నీకేమయినా ప్రమాదమా? అని సందేహం వచ్చి వెంటనే అవతలికి పోయి రహస్యంగా అన్నీ విచారించుకోని వచ్చినాను" అన్నాడు.

"అట్లాగా... మరి నాకెందుకు చెప్పలేదు. మన రాజ్యానికి పిలిపిస్తా వుంటిమి గదా" అన్నాడు రాజు.

మంత్రి చిరునవ్వు నవ్వి "రాజా... ఇది మంచి పంటల కాలం. వాళ్ళను పిలిపించి అనవసరంగా రైతుల పనులు చెడగొట్టడం ఎందుకు. కోతలు పూర్తయ్యాక అందరూ విశ్రాంతిగా వుంటారు. అప్పుడు పిలిపిస్తే అందరికీ సంతోషంగా వుంటాది. అందుకే వాళ్ళ వివరాలన్నీ తీసుకున్నాను. ఇక ఇవన్నీ మీకెందుకు చెప్పలేదంటే ఇప్పటికే మీరు వేటాడి వేటాడి బాగా అలసిపోయి వున్నారు. ఏదో హాయిగా విశ్రాంతి తీసుకుంటా వుంటే ఇప్పుడు ఇవన్నీ చెప్పుకుంటా మీ విశ్రాంతిని పాడు చేయడం ఎందుకు. తీరిగ్గా వున్నప్పుడు చెప్పొచ్చులే అని చెప్పలేదు" అన్నాడు.

మంత్రి వెళ్ళిపోగానే రాజు సేవకుని వైపు తిరిగి "ఇప్పుడు అర్థమయ్యిందా? మంత్రికీ, నీకూ వున్న తేడా.... మనిషి శారీరక శ్రమ కన్నా తెలివితేటలకే విలువెక్కువని" అన్నాడు.

సేవకుడు సిగ్గుతో తల వంచుకున్నాడు.

# 105 గిలిగాడు

ఒకూర్లో ఒక ముసల్ది వుండేది. ఆమె దగ్గర చానా గొర్రెలుండేవి. దాండ్లను ఆ ముసలమ్మ చానా జాగ్రత్తగా కాపాడతా వుండేది. ఎందుకంటే ఆ వూరి పక్కనే ఒక పెద్ద అడవుంది. ఆ అడవిలో ఒక పులుంది. ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా అది మట్టసంగా వచ్చి లటుక్కున ఏదో ఒకదాన్ని పట్టుకోని అడవిలోనికి ఎత్తుకోని పోయేది.

ఒకరోజు ఆ ముసల్ది గొర్రెలకు కాపలాగా మనవన్ని కూచోబెట్టి "రేయ్! నిద్రపోకుండా బాగా కాపలా కాయి. రాత్రి గొర్రెల కోసం ఏదైనా పులిగానీ, గిలిగానీ రావచ్చు. జాగ్రత్త" అని చెప్పిపోయింది.

అప్పటికే పులి ఎవరి కంటా పడకుండా ఆ మందలోనికి వచ్చేసింది. ముసల్ది పులిగానీ గిలిగానీ వస్తాది జాగ్రత్త అనింది గదా, ఆ మాటలు విన్న పులి పులంటే నేను. మరి గిలంటే ఏంది? అది ఎట్లాగుంటాది? నా లెక్కనే వుంటాదా. లేక నాకన్నా భయంకరంగా వుంటాదా" అని ఆలోచించసాగింది.

అదే సమయంలో ఒక దొంగోడు ఏదైనా గొర్రెనెత్తుకపోదామని దభీమని ఎగిరి లోపలికి దుంకినాడు. ఆ చప్పుడుకి పులి అదిరిపడింది. చీకట్లో దానికి ఏమీ కనబడక 'కొంపదీసి గిలిగాని రాలేదు గదా?' అని భయపడసాగింది.

దొంగోనికి చీకట్లో ఏ గొర్రె ఎంత లావుందో అర్థంకాక ఒక్కొక్క గొర్రెనే పట్టుకోని, 'ఎంత లావుందా' అని తడిమి తడిమి చూడసాగినాడు. అట్లా ఒక్కొక్కదాన్నే తడుముతా తడుముతా పులి దగ్గరకొచ్చి తడిమినాడు. పులి భయంతో వణికిపోతా మట్టసంగా నోరు మూసుకోని కూచోనింది.

పులి బాగా బలంగా పెద్దగా వుంటాది గదా. దాంతో దొంగోడు 'ఈ గొర్రెదో బాగా బలిసినట్టుంది' అనుకోని దాని కాళ్ళు పట్టుకోని ఎత్తి భుజంపైన ఏసుకున్నాడు. అంతే పులికి పై ప్రాణాలు పైన్నే పోయినాయి. భయంతో బిక్క చచ్చిపోయింది.

దొంగోడు నెమ్మదిగా గోడ దూకి అడవిలో కొంత దూరం నడిచేసరికి వానికి భుజం పట్టేసింది. 'ఎంత బరువుందిది' అనుకుంటా దాన్ని కిందికి దించి దాని మీద ఎక్కి కూచోని "థాయ్! పా... పా..." అంటూ వీపు మీద ఒక్కటి పెరికినాడు.

ఆ దెబ్బకు పులి 'ఈ గిలిగాడెవడో సామాన్యుడు కానట్టుంది. అందుకే నా మీదే ఎక్కి కూచోని నన్నే తంతా వున్నాడు. వీడు సెప్పింది సెప్పినట్టు సేయకుంటే చంపినా చంపేటట్టున్నాడు. యాన్నో ఒకచోట వీడు దిగుతాడు



గదా, అప్పుడు సందు చూసుకోని పారిపోవాల. అంతవరకూ చెప్పినట్టు వినడం మంచిది' అనుకోని మట్టసంగా నడవడం మొదలుపెట్టింది.

అట్లా చీకట్లో చానాసేపు నడిచినాక నెమ్మదిగా ఆకాశంలో చంద్రుడు మాయమై పొద్దు పొడవడం మొదలుపెట్టింది. కొంచెం కొంచెం వెలుతురు రాసాగింది. దొంగోడు తాను ఎతుకోనొచ్చిన గొర్రె ఎంత లావుందో ఏమో చూద్దామని వంగి చూసినాడు. గొర్రె బదులు పులి కనబడేనరికి గుండె గుభేలుమనింది. ''ఓరినీ! అప్పన్నించీ నేను పులి మీద వస్తా వున్నానా'' అని భయంతో వణికిపోయినాడు. "ఎట్లాగబ్బా దీన్నుంచి తప్పించుకోవడం" అని ఆలోచించసాగినాడు.

పులి పరిస్థితి గూడా అట్లానే వుంది. దానికి దొంగోన్ని మోసుకుంటా నడిచీ... నడిచీ... కాళ్ళు పీకసాగినాయి. ఆగితే గిలిగాడు ఏం చేస్తాడో ఏమో అని భయంతో అట్లాగే నడుస్తా... వీన్నించి తప్పించుకోవడం ఎట్లాగబ్బా అని ఆలోచించసాగింది. అట్లా పులిని చూసి దొంగోడు, దొంగోన్ని చూసి పులి భయంతో వణికిపోతా వున్నాయి.

కొంత దూరం పోయేసరికి దారిలో ఒక పెద్ద చెట్టుకొమ్మ బాగా కిందికి వంగి కనబడింది. దాంతో వాడు ఆ చెట్టెక్కితే పులి నుంచి తప్పించుకోవచ్చు గదా అనుకోని ఆ చెట్టు దగ్గరికి రాగానే లటుక్కున దాన్ని పట్టుకోని టకటకటక పైకి ఎక్కేసినాడు. వాడట్లా ఎక్కినాడో లేదో పులి వెంటనే ఈ గిలిగాడు మళ్ళా కిందికి దిగకముందే తప్పించుకోవాల అని అటూ యిటూ చూడకుండా రయ్యిన పారిపోయింది. అప్పన్నించి గిలిగాని భయంతో పులి, పులి భయంతో దొంగోడు మళ్ళా ఎప్పుడూ ఆ ముసల్దాని గొర్రెల దగ్గరికి పోలేదు.

# 106 నలుగురు మూర్ఖులు

ఒకూర్లో నలుగురు అమాయకులున్నారు. వాళ్ళకు ఏమీ తెలీదు. మనమొకటి చెప్తే వాళ్ళొకటి చేస్తా వుంటారు.ఆ వూర్లోనే ఒక పెద్ద పిసినారి వున్నాడు. వానికి పైసా పైసా దాచిపెట్టడమే తప్ప ఖర్చు పెట్టడం తెలీదు. వానికి ఒక పెద్ద అంగడుంది. చానా పశువులున్నాయి. దాండ్లను చూసుకోడానికి ఎవరినయినా పనికి పెట్టుకోవాలనుకున్నాడు. కానీ ఎవరయినా సరే పొద్దున్నించీ రాత్రి వరకు పని చేయాలంటే డబ్బులు ఎక్కువడుగుతారుగదా... దాంతో ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే ఈ నలుగురు కనబన్నారు. వీళ్ళయితే మారు మాట్లాడకుండా గమ్మున ఏమి పెడ్తే అది తిని, ఎంతిస్తే అంత తీసుకోని మట్టసంగా చెప్పిన పని చేస్తా వుంటారు అనుకోని వాళ్ళని తెచ్చి పనిలో పెట్టుకున్నాడు.

ఒకరోజు నలుగురినీ పిలిచి "రేయ్..ఈ రోజు మీకు నలుగురికీ నాలుగు పనులు చెబ్తా, పోయి చేసుకోని రాపోండి" అని ఒకనికేమో మేకలు తీసుకోని పోయి అడవిలో మేపుకోని రమ్మన్నాడు. రెండోవానికేమో పక్కూరికి పోయి కట్టెలు కొనుక్కోని బండి నిండా ఏసుకోని రమ్మన్నాడు. మూడోవానికేమో వాళ్ళత్తోళ్ళ వూరికి పోయి నెయ్యి డబ్బా తీసుకోని రమ్మన్నాడు. నాలుగోవానికేమో 'మా అమ్మకు ఆరోగ్యం బాగా లేదు. దగ్గర కూచోని బాగా చూసుకో' అన్నాడు. నలుగురూ "సరే" అన్నారు.

మొదటోడు సద్ది కట్టుకోని మేకలన్నీ తోలుకోని అడవికి పోయినాడు. మధ్యాన్నం వరకూ దాండ్లను బాగా మేపి ఆకలయితా వుంటే అన్నం తిందామని ఒక బావి గట్టున కూచోని మూటిప్పినాడు. ఆ బావిలో కప్పలు కుప్పలు కుప్పలున్నాయి. అవి వీన్ని చూస్తానే బెదపడి బెకబెకమని గట్టిగా అరవసాగినాయి. అది విని వాడు "అరెరే..దీండ్లకు కూడా బాగా ఆకలవుతున్నట్టుంది. అందుకే అన్నం తింటా వుంటే మాకు కూడా పెట్టమని ఒకటే అరుస్తా వున్నాయి" అనుకోని "ఇదుగోమ్మా... తీసుకోండి" అంటూ అన్నమంతా బావిలోకేసినాడు.

దబ్బున అన్నం లోపలికి పడేసరికి అవి మరింత బెదపడి మరింత గట్టిగా బెకబెకమని అరవసాగినాయి. అది విని వాడు "అరెరే...దీండ్లకు ఇదింత అన్నం సరిపోనట్టుంది. అందుకే పాపం అట్లా అరుస్తా వున్నాయి" అనుకోని ఏం చేయాలబ్బా అని ఆలోచిస్తా వుంటే ఎదురుగా మేకలు కనబన్నాయి. "వుండండి... మీ కడుపు నిండా అన్నం పెడతాను" అని వురుక్కుంటా పోయి ఒక మేకనెత్తుకోనొచ్చి దభీమని బావిలోకి ఏసినాడు. కప్పలు బెదపడి మరింత గట్టిగా అరవసాగినాయే తప్ప నోరు మూసుకోలేదు. "అరెరే...దీండ్లకింకా ఆకలి తీరినట్లులేదే...ఎన్నిరోజులైందో ఏమో అన్నం తిని" అనుకోని ఒకొక్క మేకనే ఎత్తి ధనాధనా ఏయసాగినాడు.

నీళ్ళలో పన్న మేకలన్నీ వూపిరాడక చచ్చిపోయినాయి. మేకలన్నీ ఒకదానిమీదొకటి పడి కప్పలన్నీ చచ్చిపోయినాయి. దాంతో అరుపులాగి పోయినాయి. దాంతో వాడు "హమ్మయ్య...దాండ్ల కడుపు నిండినట్టుంది. అందుకే అన్నీ మట్టసంగున్నాయి." అనుకోని వుత్త చేతులూపుకుంటా ఇంటికి బైలుదేరినాడు.

రెండోవాడు పక్కూరికి పోయి కట్టెలు కొనుక్కోని బండి నిండా నింపుకోని తిరిగి రాసాగినాడు. అట్లా వస్తా వుంటే దారిలో ఒకచోట చానా పైకి ఎక్కాల్సొచ్చింది. ఎత్తు మీదికి పోవడం కష్టం గదా...దాంతో ఎద్దులు లాగలేక లాగుతా వుంటే బండిగాన్లు కిర్రు కిర్రుమని అరవసాగినాయి. ఆ చప్పుడు విని వాడు "అరెరే..బండి కట్టెలు మోయలేక ఏడుస్తా వుంది" అనుకోని కిందికి దిగి "లేదులేమ్మా..లేదులే..ఏడ్చొద్దు. కొన్ని తీసేస్తాలే" అంటూ సగం కట్టెలు తీసేసి మళ్ళా పోతా వుంటే కాసేపటికి అది మళ్ళా కిర్రుకిర్రు మనింది. వాడు దిగి "సర్లే..సర్లే... మొత్తం తీసేస్తాలే..ఏడ్చొద్దు" అంటూ కట్టెలన్నీ తీసి పారేసినాడు. బరువు తగ్గిపోవడంతో బండి చప్పుడు చేయకుండా ఎప్పట్లాగే మాములుగా రాసాగింది. "హమ్మయ్య..బండి ఏడుపు మానేసింది" అనుకోని వాడు వుత్తబండితో ఇంటికి బైలుదేరినాడు.

మూడోవాడు పక్కూరికి పోయి శెట్టివాళ్ళ అత్తోలింట్లో నెయ్యిడబ్బా తీసుకోని తిరిగి బైలుదేరినాడు. ఏ వస్తువైనా సరే మొదట్లో బరువుగా అనిపించదుగానీ మోస్తా మోస్తా వుంటే బరువు పెరిగిపోతున్నట్లుగా అనిపిస్తాది గదా...అదర్థంగాక వాడు "అరెరే...ఇదేంది మొదట్లో కొంచెం గూడా బరువు లేదు. సగం దారికొచ్చినానో లేదో ఇంత బరువెక్కింది. డబ్బాలోకి ఏమైనా దూరిందా ఏమి" అనుకోని డబ్బా దించి తెరచి చూసినాడు. నెయ్యిలో వాని నీడ వానికే కనబడింది. అది చూసి వాడదిరిపడి "అమ్మో..ఏమో అనుకుంటిగానీ.. ఈ డబ్బాలో దయ్యం దూరింది. అందుకే ఇంత బరువైంది" అనుకోని ధడాలున మూత మూసేసి ఎత్తుకోని పోయి ఒక పెద్ద చెరువులో పడేసి "హమ్మయ్య... దయ్యం పీడ వదిలి పోయింది" అనుకోని వుత్తచేతులూపుకుంటా ఇంటికి బైలుదేరినాడు.

నాలుగోవాడు శెట్టి అమ్మ దగ్గరనే కూచోని విసనకర్ర వూపుతా..ఏమి కావాలంటే అది అందిస్తా, సేవలు చేస్తా జాగ్రత్తగా చూసుకోసాగినాడు. కాసేపటికి ఆమె నిదురపోయింది. అంతలో ఒక ఈగ గుయ్‌మని అరుస్తా వచ్చి ఆమె మీద వాలింది. అది చూసి వాడు "అరెరే...పాపం ముసల్ది నిద్రపోతా వుంటే ఇదొచ్చి సతాయిస్తా వుందే" అని తోలేసినాడు. అది అట్లా పక్కకు పోయినట్లే పోయి మళ్ళా గుయ్‌మని అరుస్తా వచ్చి వాలింది. వీడు తోలడం మళ్ళా అది రావడం. కాసేపటికి వానికి బాగా కోపమొచ్చేసింది. "దొంగ సచ్చిందానా...ఎన్నిసార్లు తోలినా మళ్ళా మళ్ళా వస్తావా..వుండు నీ పని చెప్తా" అంటూ ఇంట్లోంచి రోకలిబండ తీసుకోనొచ్చి నిలబన్నాడు. ఈగ మళ్ళా ఎప్పట్లాగే గుయ్‌మని అరుస్తా వచ్చి ఆమె మూతి మీద వాలింది. అంతే! వాడు కోపంగా రోకలిబండ పైకెత్తి ఒక్క పెరుకు పెరికినాడు. ఆ దెబ్బకు ఈగకేమీ కాలేదు గానీ ముసల్ది మాత్రం మూతి పగిలి చచ్చిపోయింది.

శెట్టి వచ్చి చూస్తే ఇంకేముంది. తల్లి పోయింది. మేకలూ పోయినాయి, నెయ్యీ పోయింది, కట్టెలూ పోయినాయి. 'పీనాసితనంతో తెలిసి తెలిసీ మీలాంటోళ్ళను పెట్టుకున్నందుకు నాచెప్పుతో నేనే కొట్టుకోవాల' అనుకుంటా వాళ్ళందరినీ ఇంట్లోంచి తరిమేసినాడు.

# 107 వురుములయ్య మెరుపులమ్మ

ఒకూర్లో నలుగురు అన్నదమ్ములుండేటోళ్ళు. వాళ్ళకో చెల్లెలుంది. ఆమెది అద్భుతమైన అందం. ఆమెని చూస్తే కండ్లు మిరుమిట్లు గొలుపుతాయి. అందుకే అందరూ ఆమెకు 'మెరుపులమ్మ' అని పేరు పెట్టుకున్నారు. వాళ్ళన్నోళ్ళకే గాక వదినెలకు గూడా ఆమె అంటే చానా ప్రేమ. అడిగింది అడిగినట్లు తెచ్చియ్యడమే తప్ప కాదు... కూడదు... అని అనేటోళ్ళు కాదు.

ఒకరోజు అన్నావదినలంతా చేనుకి పోతా వుంటే చూసి "నేనొస్తా... నేనొస్తా..." అని ఆ పాప వెంట పడింది. "వద్దమ్మా...అంతదూరం నువ్వు నడవలేవు...అదీకాక ఎండకూడా" అని వాళ్ళు ఎంత చెప్పినా వినలేదు. దాంతో వాళ్ళు చెల్లెలు నడచి కష్టపడగూడదని ఎద్దులబండి కట్టి, ఎండ పడకుండా దానిపైన ఒక దుప్పటి వేసి ఆమెని దాంట్లో తీసుకోని పోయినారు. పొలంలో ఆమెను ఒక చెట్టు కింద కూచోబెట్టి ఎద్దులకు నాగలి కట్టి దున్నుతా వుంటే... వానదేముడు... ఒక్కొక్కరోజు ఒక్కొక్క వూర్లో వాన కురిపిస్తా... కురిపిస్తా... ఆరోజు మిట్టమధ్యాన్నం వాళ్ళుండే వూరికి వచ్చినాడు. వానదేముడొచ్చేది వాన కురిపియ్యడానికే గదా...దాంతో కుండపోతగా వాన కురిపియ్యడం మొదలుపెట్టినాడు. నేలంతా తడిసి ముద్ద ముద్ద కాసాగింది. పనంతా మధ్యలో ఆగిపోయింది.

అది చూసి మెరుపులమ్మ "ఈ వానదేముడు వచ్చేదేదో రాత్రిపూట రావొచ్చుగదా... ఇట్లా మిట్టమధ్యాన్నం వచ్చి సతాయించే బదులు" అనింది. ఆ మాటలు విన్న వానదేముడు ఎవరబ్బా ఇట్లా అంటున్నారని కిందికి చూసినాడు. చూస్తే ఇంగేముంది మిరుమిట్లు గొలుపుతా మెరుపులమ్మ కనబడింది. "అబ్బ ఎంత బాగుంది అచ్చం పాలరాయి లెక్క" అని ఆచ్చర్యపోయి "సరే...రాత్రికే వస్తాలే" అని చెప్పి ఆగిపోయినాడు. అది చూసి అన్నలంతా "నా చెల్లెలు చెప్తే ఆఖరికి వానదేముడు గూడా మాట వింటాడు చూడు" అని మురిసిపోయినారు.

ఆరోజు రాత్రి ఆమె గదిలో నిద్రపోతా వుంటే అర్ధరాత్రి తలుపు చప్పుడయ్యింది. "ఎవరబ్బా... ఇంతర్ధరాత్రి తలుపు కొడ్తా వున్నారు" అని తెరచి చూస్తే ఇంగేముంది నెత్తిన కిరీటం ధగధగా మెరిసిపోతా వుంటే చిరునవ్వులు నవ్వుతా వానదేముడు కనబన్నాడు. ఆమె ఆచ్చర్యపోయి "ఏమిట్లా వచ్చినావు...ఇంత రాత్రప్పుడు" అనడిగింది. దానికా వానదేముడు "నువ్వేగదా... ఈ రోజు మధ్యాన్నంపూట మీ వూరికొచ్చి వాన కురిపిస్తా వుంటే...ఇప్పుడెందుకొచ్చినావ్...రాత్రిపూట రాగూడదా... అనింది... అందుకే వచ్చినా... నువ్వంటే నాకు చానా ఇష్టం. నన్ను పెండ్లి చేసుకుంటావా" అనడిగినాడు. దానికామె "సరే...రేప్పొద్దునొచ్చి మా అన్నోళ్ళతో మాట్లాడు" అనింది సిగ్గు పడతా.

వానదేముడు తరువాతరోజు పొద్దున్నే లెక్కబెట్టలేనన్ని నగలూ, వజ్రాలు, వైఢూర్యాలు తీసుకోనొచ్చి "మీ చెల్లినియ్యమని" వాళ్ళన్నోళ్ళని అడిగినాడు. ఏకంగా వానదేముడే వచ్చి నీ చెల్లెల్ని పెండ్లి చేసుకుంటా అనడిగితే ఎవరు కాదంటారు... దాంతో వాళ్ళు సరే అన్నారు. వూరు వూరంతా వచ్చి ఆ చూడముచ్చటైన జంటని ఆశీర్వదిస్తా వుంటే అంగరంగ వైభోగంగా పెండ్లి చేసినారు. వానదేమునికి ఆమె అంటే చానా చానా ఇష్టం గదా... దాంతో ఆడికీ ఈడికీ తిరగకుండా మట్టసంగా అమె దగ్గరే వుండిపోయినాడు.



వానదేముడు అట్లా ధర్మం తప్పి ఒక్కచోటనే వుండిపోతే ఎట్లా... దేశమంతా తిరుగుతా అంతటా వానలు కురిపియ్యాల గదా... కానీ ఆయన కొత్త పెండ్లాం మోజులో పడి అన్నీ మరచిపోయినాడు. దాంతో చుట్టుపక్కల వూళ్ళలో యాడా వానల్లేక చెట్లూ చేమలు అన్నీ ఎండిపోయి మనుషులకే గాక పశువులకు గూడా తిండి దొరకని పెద్ద కరువు వచ్చేసింది.

దాంతో ఒక ముసల్ది "యాదున్నాడబ్బా... ఈ వానదేముడు" అని ఒకొక్క వూరే వెదుక్కుంటా... వెదుక్కుంటా... ఒకరోజు ఆ వూరికొచ్చింది. వచ్చి చూస్తే ఇంగేముంది... ఆ వూరు యాడ చూసినా గలగల పారే నీళ్ళతో... పచ్చని పంటపొలాలతో కళకళలాడతా కనబడింది. అప్పుడా ముసల్ది "ఓహో... ఐతే వానదేముడు ఈ వూర్లోనే ఎవరో ఒకరింట్లో వుంటాడు... అందుకే చుట్టుపక్కల అన్ని వూళ్ళూ కరువుతో నాశనమయి పోతా వున్నా... ఈ వూరు మాత్రం పచ్చగా వుంది" అనుకోనింది.

ఆ ముసల్ది నెత్తిన పుచ్చు చింతకాయల గంప పెట్టుకొని "చింతకాయలమ్మా... చింతకాయలు" అని అరుచుకుంటా పోసాగింది. అట్లా ఒకొక్క ఇండ్లే దాటుకుంటా... దాటుకుంటా... ఆఖరికి వీళ్ళింటికి చేరుకోనింది. చింతకాయలనే మాటినగానే నోట్లో నీళ్ళూరి మెరుపులమ్మ ఆమెని ఇంట్లోకి పిల్చింది. పిలిచి చూస్తే ఒక్కటి గూడా మంచిది లేదు... అన్నీ పుచ్చులే... అది చూసి ఆమె "ఏందమ్మా ఇది... అన్నీ ఇట్లా వున్నాయి. ఎవడు కొంటాడు దీండ్లని" అనింది. దానికా ముసల్ది కండ్లనీళ్ళు బెట్టుకోని "ఏం చేద్దాం చెప్పమ్మా...మీ వూళ్ళో మాదిరి అన్ని వూళ్ళలో బాగా వాన పడ్తే మంచి మంచి చింతకాయలు వద్దన్నా వస్తాయి. కానీ మా వూళ్ళో వాన లేక ఇప్పటికి మూడు సంవచ్చరాలయిపోతా వుంది. అందరినీ సమానంగా కన్నబిడ్డల్లా కడుపులో పెట్టుకోని చూసుకోవాల్సిన

ఆ వానదేమునికి ఏం పోయేకాలమొచ్చిందో ఏమో... మీ వూళ్ళో తప్ప యాడా వాన కురిపియ్యడం లేదు. వాని మీద బండబడ... సర్వనాశనమయి పోతాడు" అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది.



తన మొగున్ని అట్లా తిడ్తా వుంటే మెరుపులమ్మ చానా బాధపడి ఆ ముసల్ది పోగానే మొగుని దగ్గరికి పోయి "దేశమంతా నిన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తా వుంటే... నువ్వేమో హాయిగా యాడికీ పోకుండా ఈన్నే కూచోనున్నావ్. వానదేముడన్నాక ఒకూర్లో... ఒకింట్లో... వుంటే ఎట్లా చెప్పు. పో... పోయి... అంతా తిరిగిరాపో" అనింది.

కానీ వానదేమునికి పెండ్లాన్ని ఇడ్చిపోవడం ఇష్టం లేక "నేనుగాని బైటికి పోయినానంటే మళ్ళా ఎప్పుడొస్తానో నాకే తెలీదు. ఒక వూరూ కాదూ... ఒక దేశమూ కాదూ. ఈ భూగోళమంతా ఆ మూల నుండి ఈ మూల వరకు పిలిచిన చోటికల్లా పోయి రావాల" అన్నాడు.

అప్పుడామె "అందరితోనూ మాట పడ్తా బతికే బతుకూ ఒక బతుకేనా... మనిషి పుట్టుక పుట్టినాక కాస్తన్నా మానం మరియాద వుండాల. నీ ధర్మం నువ్వు నెరవేరిస్తే మనం మాట పడాల్సిన అవసరం లేదుగదా" అనింది.

అప్పుడు వానదేముడు ఆమెని విడిచిపెట్టిపోలేక "సరే... నువ్వు అంతగా చెబుతావున్నావు గాబట్టి పోతా... కానీ నువ్వు గూడా నాతో రావాల. నిన్ను విడిచి నేనుండలేను" అన్నాడు. దాంతో ఆమె జనాలందరి బాగు కోసం సరే అనింది. అంతే... వెంటనే వానదేముడు వురుముకుంటా వానలు కురిపియ్యడానికి బైలుదేరితే... ఆయన వెంబడే మెరుపులమ్మ కూడా మెరుసుకుంటా ఆకాశానికి ఎగిరింది.

పూర్వకాలంలో వాన పడ్తా వున్నప్పుడు ఆకాశంలో వురుములే తప్ప మెరుపులు ఎప్పుడూ కనబడేవి గాదట. కానీ ఇద్దరూ అట్లా వురుముకుంటా, మెరుసుకుంటా బైలుదేరినప్పటి నుండి మనకు వానతోపాటు మెరుపులు గూడా మిరుమిట్లు గొలుపుతా కనబడ్తా వున్నాయి.

# 108 దొరికిన దొంగ

ఒకూర్లో ఒకమ్మాయి వుండేది. ఆ అమ్మాయి చానా తెలివైనది. అంతేగాదు పెద్ద అందగత్తె కూడా. ఆమెది అట్లాంటిట్లాంటి అందంగాదు. ఏడేడు పద్నాలుగు లోకాల్లోనూ అంత అందగత్తె యాడా వుండదని పేరు. పాలరాయిలాంటి తెల్లని ఒంటితో, ముత్యాల్లాంటి పళ్ళతో, చందమామలాంటి మొగంతో, మెరుపుతీగలాగా మెరిసిపోతా వుంటాది. కానీ పాపం ఆ అమ్మాయి అనాథ. చిన్నప్పుడే అందరూ చచ్చిపోయినారు. నా అని చెప్పుకోడానికి ఎవరూ లేరు. ఆయింట్లో ఈయింట్లో పని చేసుకుంటా వాళ్ళు పెట్టినేది తినుకుంటా వుండేది.

ఆ వూరి పక్కనే వున్న ఇంకో వూర్లో ఒక పెద్ద గజదొంగ వున్నాడు. వాడు అట్లాంటిట్లాంటి మామూలు దొంగ కాదు. మెడకు తెలీకుండా గొలుసును, చేతికి తెలీకుండా గాజును, నడుముకు తెలీకుండా వడ్డాణాన్ని కాజేసే రకం. రాత్రయితే చాలు ఎవరెవరు ఎక్కడెక్కడ ఏమేమి దాచిపెట్టినారో కనుక్కోని చప్పుడు గాకుండా ఎత్తుకోని పోయేటోడు. వాన్ని పట్టుకోడం చేతగాక ఆవూరి రాజు ఎవరయితే ఆ దొంగను పట్టిస్తారో వాళ్ళకు లక్ష బంగారువరహాలు ఇస్తానని దండోరా వేయించినాడు.

ఆ దొంగ రోజూ పొద్దున్నే చీరలమ్మేటోని వేషం వేసుకోని, సంచి నిండా చీరలు పెట్టుకోని రోజుకొక పల్లెకు పోయేటోడు. చీరల కోసం ఆడోళ్ళు ఇండ్లలోకి పిలుస్తారు గదా. అప్పుడు ఒకవైపు చీరలమ్ముతూనే మరొకవైపు ఇంట్లో ఏమేమి ఎక్కడెక్కడ వున్నాయి, వాళ్ళు వున్నోళ్ళా, లేనోళ్ళా అన్నీ గమనించేటోడు. ఒకరోజు అట్లా ఆ పిల్ల వున్న వూరికి వచ్చినాడు. చీరలమ్ముతా అమ్ముతా ఆ ఇంట్లో పని చేస్తావున్న ఆ పిల్లను చూసినాడు. ఆమెది కన్ను తిప్పుకోలేని అందం గదా. చూడగానే అబ్బ... ముత్యాలహారంలెక్క ఎంత ముచ్చటగుందీ పిల్ల, చేసుకుంటే ఇట్లాంటి పిల్లనే చేసుకోవాల" అనుకున్నాడు. నెమ్మదిగా అక్కడి ఆడోళ్ళతో ఆమాటా ఈమాటా మాట్లాడతా ఆ పిల్ల వివరాలన్నీ కనుక్కున్నాడు.

తరువాత రోజు పొద్దున్నే శుభ్రంగా స్నానం చేసి మంచిగా కొత్తబట్టలేసుకోని, తలకు బాగా నూనె పట్టిచ్చి, చక్కగా దువ్వుకోని బుద్ధిమంతుని లెక్క వాళ్ళింటి కాడికి పోయినాడు. ఆ పిల్ల కనబడగానే “పాపా నన్ను గుర్తు పట్టినావా... నేను నీ మేనమామను, మీ అమ్మకు సొంత తమ్మున్ని. చిన్నప్పుడే మా అమ్మ కొట్టిందనే కోపంతో ఇల్లు వదిలి దేశాలు పట్టుకోనిపోయి బాగా సంపాదిచ్చి ఈనడుమనే పక్కూరిలో మంచి మేడ కట్టుకున్నాను. మా అమ్మానాన్నల కోసం, అక్కాబావల కోసం వెదుకుతా వుంటే వాళ్ళంతా చచ్చిపోయినారని, నువ్వొక్కదానివే బతికున్నావని తెలిసింది. ఇంక నీకు ఏ బాధా వుండదు. నువ్వు హాయిగా కాలు మీద కాలేసుకోని బతకొచ్చు.

నిన్ను పెండ్లి చేసుకుని పువ్వుల్లో పెట్టుకోని చూసుకుంటా... దాపోదాం" అంటూ వాళ్ళమ్మానాన్నల వివరాలన్నీ చెబుతా బాగా నమ్మబలికినాడు. దాంతో ఆ పాప ఆ దొంగోని మాటలు నిజమని నమ్మి సంబరంగా వాని వెంట వెళ్ళింది. కానీ, ఆ పాప సంతోషం కొన్ని రోజులు గూడా మిగలలేదు. ఆ దొంగోడు రాత్రుళ్ళు అందరూ పండుకున్నాక బయటికి పోవడం, జనాలింకా నిదుర లేవక ముందే పెద్దపెద్ద మూటల్తో లోపలికి రావడం గమనించింది. ఒకరోజు వాడు బైటికి పోగానే తలుపులన్నీ మూసి పెట్టెలన్నీ తెరిచి చూసింది. దాంట్లో అడుగున ఎవరికీ కనబడకుండా దాచిన బంగారం, వజ్రాలు కుప్పలు కుప్పలు కనబడినాయి. దాంతో ఆ పాపకు అనుమానమొచ్చి అలాగే మేలుకోని వాడు దొంగతనం చేసుకోని రాగానే, "చెప్పు ఎవరు నువ్వు. ఈ రాత్రిపూట ఏం తీసుకొస్తావున్నావు. నీకింత బంగారం యాడిది" అంటా నిలదీసింది.

ఆ దొంగోడు ఆ పాపను కత్తి తీసుకోని బెదపడిస్తా "అవునే... నేను దొంగనే. నిన్ను చేసుకోడానికి మాయమాటలు చెప్పి ఎత్తుకొచ్చినాను. అంతేగానీ నువ్వు నా కోడలివీ కాదూ, నేను నీ మామనూ కాదు" అంటూ ఆ పాపను ఒక చిన్నగదిలో ఏసి బైట తాళం వేసినాడు. ఆరోజు నుండి రోజూ బైటకు పోయేటప్పుడు ఆమెను ఒక గదిలో పెట్టి పోయేటోడు. రాగానే ఇంటి తలుపులు లోపల గడియపెట్టి, గది తలుపులు తెరిచేటోడు. ఇంటిపనులన్నీ ఆ పాపతోనే చేయించేటోడు. కసువులు వూడ్చి, బండలు తుడ్చి, అన్నం చేసి, అంట్లు కడిగి ఆ పాప బాగా అలసిపోయేది.

ఆ దొంగోని నుంచి ఎట్లా తప్పించుకోవాల్నా అని ఆలోచిస్తా వుంటే ఆ పాపకు ఒకరోజు వంటింట్లో ఒక చిన్న కిటికీ కనిపించింది. తలుపులు తెరుద్దామని చూస్తే తెరుచుకోలేదు. కిటికీ పక్కనే ఒక చిన్న మీట కనబడింది. దాన్ని నొక్కగానే సరిగ్గా ఒక మనిషి పట్టేంతగా కిటికీ తెరుచుకోనింది. భటులు ఎవరయినా తన సంగతి తెలుసుకోని పట్టుకోడానికి ఇంటి మీదికి వస్తే, వాళ్ళకి చిక్కకుండా పారిపోవడానికి దొంగ ఆ ఏర్పాటు చేసుకున్నాడు. దాన్ని చూసినాక ఆ పాపకు ఒక ఉపాయం తట్టింది.



తరువాత రోజు వంటగదిలో కట్టెలపై కొంచెం నీళ్ళు చల్లి వంట చేయసాగింది. దాంతో ఇల్లంతా పొగ కమ్ముకోనింది. వాడు ఖల్ ఖల్‌మని దగ్గుతా "ఏందే ఇంత పొగ బెట్టినావు" అని అరిచినాడు. కట్టెలు పచ్చిగా వున్నాయి, అందుకే పొగ

వస్తా వుంది, వంట అయిపోయేంత వరకూ తలుపులు మూసి బైటకూచో" అని చెప్పింది. వాడు సరే అని తలుపులు మూసి బైట కూర్చున్నాడు.

వెంటనే ఆమె నీళ్ళ సీసా మూతకి చిన్న బొక్క పెట్టి, దాన్ని పైన యాలాడదీసి, దాని కింద పొయ్యి పెట్టి పైన పెనం పెట్టి మంట పెట్టింది. ఇసుర్రాయికి తాడు కట్టి దానిని ఫ్యానుకు కట్టి మీట నొక్కింది. పెరట్లోని బరగొడ్డును చప్పుడు గాకుండా లోపలికి తోలుకోనొచ్చి దాని తోకకు పొరకను కట్టింది. నెమ్మదిగా వంటగది మూలనున్న కిటికీ తెరుచుకోని అవతలికి దుంకి పారిపోయింది. అట్లా పోయి ఆ వూరి రాజును కలసి జరిగిందంతా చెప్పింది. రాజు వెంటనే ఆ దొంగని పట్టుకోడానికి ఆమె వెంట సైనికులని పంపిచ్చినాడు.

దొంగోనికి ఇదంతా తెలీదు గదా, దాంతో బైట కూచోని వున్నాడు. కొంచెం సేపటికి ఫ్యాను గిరగిరగిర తిరుగుతా వుంటే దానికి కట్టిన ఇసుర్రాయి సురసురసురమని తిరగడం మొదలుపెట్టింది ఆ చప్పుడు విని వాడు 'ఓహో లోపల ఈ పిల్ల ఏదో పిండి విసురుతున్నట్టుందే' అనుకున్నాడు. కాసేపటికి పైన యాలాడదీసిన సీసాలోంచి నీళ్ళుకారి వేడెక్కిన పెనంపై పడ్డంతో సుయ్ సుయ్‌మనే చప్పుడు రాసాగింది. ఆ చప్పుడు విని వాడు "ఓహో లోపల ఈపిల్ల ఒక పక్క పిండి విసుర్తానే మరొకపక్క దోసెలు వేస్తా వున్నట్లుంది అనుకొన్నాడు. అంతలో లోపల బరగొడ్డు అట్లా ఇట్లా కదలసాగింది. దాంతో దాని తోకకు కట్టిన చీపురు గూడా అట్లా ఇట్లా కదులుతా సరసరసర చప్పుడు చేయసాగింది. ఆ చప్పుడువిని వాడు ఓహో లోపల ఈపిల్ల కసువు కొడుతున్నట్లుందే అనుకున్నాడు. అట్లా ఒక గంట దాటిపోయింది. కానీ చప్పుడు మాత్రం ఆగలేదు. ఇదేందబ్బా ఇంతసేపైనా చప్పుళ్ళు ఆగడం లేదు. ఐనా ఒకేసారి కసువు కొడతావున్న చప్పుడు, దోసెలు పోస్తావున్న చప్పుడు, పిండి విసురుతావున్న చప్పుడు వస్తా వుంది. ఒక మనిషి ఒకేసారి ఇన్ని పనులు ఎట్లా చేయగలదు అని అనుమానమొచ్చి బెరబెరా తలుపులు తెరిచి లోపలికి పోయినాడు.

చూస్తే ఇంకేముంది. పైన యాలాడదీసిన సీసా, ఫ్యానుకు కట్టిన విసుర్రాయి. బరగొడ్డు తోకకు కట్టిన పొరకా కనబడినాయి. "అరే ఇది నన్నే మోసం చేసి తప్పించుకోని పోయిందే... దీని అంతు చూడాల" అని పండ్లు పటపట కొరుక్కుంటా కోపంతో కత్తి తీసుకోని వెనక్కు తిరిగినాడు. కానీ అంతలోనే ఆమె రాజభటులతో ఆడికి వచ్చేసింది. దొంగోడు దొరికిపోయినాడు. రాజు ఆమె తెలివితేటలని, ధైర్యాన్ని, అందాన్ని బాగా మెచ్చుకోని "నీకు లక్ష బంగారు వరహాలేం సరిపోతాయి. నా కొడుకునే ఇస్తా చేసుకో" అంటూ తన ఒక్కగానొక్క కొడుకునిచ్చి అంగరంగ వైభవంగా పెండ్లి చేసి, కోడలిగా చేసుకున్నాడు.

# 109 నమ్మొద్దురా దొంగనక్కల్ని

ఒక అడవిలో ఒక నక్క వుండేది. అది పెద్ద దొంగది. ఎవరెవరిని ఎప్పుడెప్పుడు ఎట్లెట్లా మోసం చేయాల్నా అని చూస్తా వుండేది. ఒకసారి ఆ నక్కకు అడవిలో మోసం చేయడానికి ఎవరూ దొరకలేదు. వెదికీ వెదికీ అలసిపోయింది. ఎట్లాగబ్బా అని ఆలోచిస్తా వుంటే దానికి భూమమ్మ కనబడింది. భూమమ్మ చానా మంచిది. అమాయకురాలు. ఎవరేమడిగినా కాదనకుండా సాయం చేస్తా వుండేది.

నక్క భూమమ్మను చూడగానే వురుక్కుంటా దగ్గరికొచ్చి "అమ్మా... అమ్మా... చానా ఆకలిగా వుంది. నాలుగురోజుల నుండీ తిందామంటే తిండి లేదు. కొందామంటే డబ్బులు లేవు. ఆకలితో నేనూ, నా పెండ్లాం బిడ్డలు చచ్చిపోయేటట్లున్నాము. ఒక వెయ్యి రూపాయలు అప్పివ్వమ్మా... వారంలోగా తిరిగిచ్చేస్తా" అనింది. భూమమ్మకు నక్క దొంగఎత్తులు తెలీవు గదా... దాంతో నిజమని నమ్మి వెయ్యి రూపాయలు ఇచ్చేసింది.

ఇంగచూడు నక్క ఒకటే జల్సా... లడ్లు, కర్జికాయలు, కారాలు, బూందీలు, పనసపండ్లు, మామిడిపండ్లు, నన్నారీలు, నారింజరసాలు ఒకటని గాదులే... ఏది కనబడితే అది... ఎంత చెబితే అంత... ఒకటే తినేది. తాగేది. అట్లా వారానికల్లా పైసాగూడా మిగల్చకుండా నున్నగా కాజేసింది.

వారం దాటగానే భూమమ్మ వచ్చింది. "నక్కా... నక్కా... వారం దాటగానే నా వెయ్యి రూపాయలు నాకిస్తానంటివి గదా... ఇయ్యి" అనింది. ఇంకెక్కడి వెయ్యి రూపాయలు అన్నీ ఎప్పుడో పొట్టలోనికి వెళ్ళిపోయినాయి గదా.... దాంతో ఆ నక్క "అమ్మా... అమ్మా... నీ డబ్బులు తేవడానికే నా పెండ్లాం వాళ్ళ పుట్టింటికి పోయింది. ఇట్లా తీసుకోని రావడం ఆలస్యం అట్లా నీ చేతిలో పెట్టేస్తాలే... ఈ ఒక్కవారమాగు" అనింది. భూమమ్మ సరేనంటూ వెళ్ళిపోయింది.

వారం దాటగానే భూమమ్మ మళ్ళా వచ్చి "నక్కా... నక్కా... ఈ రోజు నా వెయ్యి రూపాయలు నాకిచ్చేస్తానంటివి గదా... ఇయ్యి" అనింది. "అరే... ఇదేందిరా నాయనా ఇట్లా తగులుకుంది ఫారం కంపలెక్క" అని నోట్లోనే తిట్టుకుంటా "అమ్మా... వారం నుండీ ఒకటే జ్వరం. లెయ్యడానికీ లేదు. కూచోడానికీ లేదు. డబ్బులన్నీ మందులకే అయిపాయ. ఇంకొక్క వారమాగు. ఇస్తాలే" అనింది. భూమమ్మ సరేనంటూ వెళ్ళిపోయింది.

భూమమ్మ అట్లా పోవడం ఆలస్యం "ఈడుంటే ఇది వదిలేటట్లు లేదు" అనుకోని వున్నవన్నీ మూటగట్టుకోని శ్రీశైలం అడవుల్లోకి పారిపోయింది. ఆడ హాయిగా తిరుగుతా వుంటే వారం దాటగానే భూమమ్మ వచ్చేసింది. 'అరే ఇది ఈడికి గూడా తగలబడిందే... దీని కన్నుగప్పి తప్పించుకోవటం ఎట్లారా నాయనా' అని గొణుక్కుంటా



"అమ్మా... నా కొడుక్కి కాలు నొప్పంటే కిందామీదా పడతా బండి బాడుగకు కట్టుకోని ఈడికొస్తి. డబ్బులంతా బాడుగకే అయిపాయ. ఇంకోవారమాగు ఇస్తా" అనింది. భూమమ్మ సరేనంటూ వెళ్ళిపోయింది.

భూమమ్మ అట్లా పోవడం ఆలస్యం ''ఇదేందిరా నాయనా... ఇది ఇట్లా పట్టుకోనింది. దీన్ని వదిలిచ్చుకోవాలంటే ఇట్లా దగ్గర దగ్గర వూర్లు కాదు. కనుచూపు మేరలో ఆనవాలు గూడా కనిపించనంత దూరం వెళ్ళిపోవాల" అనుకోని తట్టా బుట్టా సర్దుకోని ఈసారి ఏకంగా ఏడు జిల్లాలు దాటి పారిపోయింది. ఆడ హాయిగా కాలు మీద కాలేసుకోని ఆడుకుంటా పాడుకుంటా తిరుగుతా వుంటే వారం దాటడం ఆలస్యం భూమమ్మ ఎప్పట్లాగానే దాని దగ్గరికి వచ్చేసింది.

ఆమెని చూసి నక్క అదిరిపడింది. "అవురా... ఎంత అమాయకంగా తిక్కదానిలెక్క తిరుగుతా వున్నా. ఐనా భూమమ్మ లేనిదెక్కడ. ఇక దీన్ని తప్పించుకోవడం అంటే మాటలు కాదు. ఎవరైనా సరే కలలో గూడా వూహించనంత ఎత్తు వేయాల" అనుకోని "అమ్మా.. నీకు వారం వారం అంటా ఇట్లా తిప్పించుకోడానికి నాకే సిగ్గేస్తా వుంది. కానీ ఏం చేద్దాం. కాలం అట్లా వుంది. ఈ వూర్లో ఒకడు నాకు మూడువేలు అప్పు వున్నాడు. అవి వసూలు చేసుకోడానికే ఇంత దూరం వచ్చినాను. నాలుగు రోజులాగు. వడ్డీతో సహా తిరిగిచ్చేస్తానన్నాడు. ఈ ఒక్కవారమాగు" అనింది. దానికి భూమమ్మ 'సరే కానీ... ఇదే ఆఖరిసారి... ఏమోలే పాపం అనుకుంటా వుంటే ఏదో ఒకటి చెబుతా వూరికే తిప్పిస్తా వున్నావు. ఇంగోసారిలా చేస్తే మర్యాదగా వుండదు. అడవిలో అందరినీ పిలిచి పంచాయితీ పెట్టి పరువు తీస్తా" అని హెచ్చరించి పోయింది.

నక్కకు ఎట్లా తప్పించుకోవాల్నో తోచలేదు. అట్లాగని డబ్బులూ ఇయ్యబుద్ధి కాలేదు. ఇంతవరకూ ఎప్పుడూ ఎవరికీ లొంగలేదు. ఇదేంది ఇప్పుడిట్లా అయింది అని ఆలోచించుకుంటా అడవిలోనికి పోయింది. ఒకచోట ఒక జొన్నదంటు కొశ్శగా కనబడింది. ఏదయితేనేం అనుకోని దాన్ని తీసుకోని ఎవరూ చూడకుండా ఒక పెద్ద చీకటి గుహలోనికి పోయి కంటికి ఒక పక్కగా, కన్ను దెబ్బ తినకుండా కసుక్కున పొడుచుకోనింది. అంతే.. దెబ్బకు సుర్రుమని రక్తం కారి రెప్పంతా ఎర్రగా వాచిపోయి కన్ను మూసుకోనిపోయింది. వారం తిరిగేసరికి భూమమ్మ మళ్ళా నక్క దగ్గరకు వచ్చేసింది. "నక్కా.. నక్కా... ఈ సారి నా వెయ్యి రూపాయలు నాకు ఖచ్చితంగా ఇచ్చేస్తానంటివి గదా...ఇయ్యి" అనింది.

నక్క అమాయకంగా ముఖం పెట్టి "వెయ్యి రూపాయలా... నేను నీకు ఇవ్వాల్నా.. ఎందుకు" అనింది. ఆ మాటలకు భూమమ్మ అదిరిపడి "అదేంది... అట్లా అంటివి. నా దగ్గర వెయ్యి తీసుకోని పదివారాల నుండి రేపు రేపంటూ తిప్పుతా ఇప్పుడు ఏమీ ఎరుగని నంగనాచి లెక్క మాట్లాడతా వున్నావు" అనింది.

ఆ మాటలకు నక్క కోపంగా "ఏందీ... నేనా... నంగనాచినా... చూడమ్మోవ్... నువ్వెవరని ఎవరి దగ్గరికొచ్చినావో గానీ నువ్వు చెప్పేది ఒక్క ముక్కా అర్థం కావడం లేదు. ఇంతకీ నువ్వు ఇచ్చింది ఒక్క కన్నున్న నక్కకా, రెండు కళ్ళున్న నక్కకా" అనింది.

ఆ మాటలకు భూమమ్మ "రెండు కళ్ళ నక్కకే" అనింది. వెంటనే ఆ నక్క "అదీ అట్లా చెప్పు. చూడు... నాకుండేది ఒక్క కన్నే.. రెండోది చిన్నగున్నప్పుడే దంటుదెబ్బ తగిలి పోయింది" అంటూ చూపిచ్చింది. ఎర్రగా మాడిపోయిన ఆ కన్ను చూసి భూమమ్మ నిజమని నమ్మి "అరెరే... పొరపాటయిపోయింది. ఏమీ అనుకోవద్దు. అనవసరంగా నిన్ను అనరాని మాటలన్నాను" అని బాధపడి వెళ్ళిపోతా వుంటే ఆ నక్క.

"అమ్మా... అమ్మా... నువ్వు అడిగిన వాళ్ళకంతా కాదనకుండా సాయం చేస్తా వుంటావంట కదా... అడవంతా తెగ చెప్పుకుంటా వుంటారు. గుడ్డిదాన్ని... ఒక కన్ను అసలు లేనిదాన్ని... వచ్చేవారం మా పిల్లకు పెళ్ళిచూపులు. ఒక ఐదువేలుంటే ఇవ్వమ్మా... పంట రాగానే తిరిగిచ్చేస్తాను" అనింది. దాని దొంగ మాటలకు ఆ అమాయకపు భూమమ్మ జాలిపడి "సరే... తీసుకో... కానీ ఆ దొంగనక్క లెక్క నన్ను మోసం చెయ్యొద్దు" అనింది. నక్క సంతోషంగా సరేనంటూ దొంగ వినయం నటిస్తా ఐదువేలు తీసుకోనింది.

భూమమ్మ అట్లా పోవడం ఆలస్యం సంబరంగా ఆ డబ్బు తీసుకోని వురుక్కుంటా పక్కూరులోని పేరు మోసిన ఒక వైద్యుని దగ్గరకు పోయి వేయి రూపాయలు ఖర్చుపెట్టి మంచి మంచి మందులు తెచ్చుకోనింది. భూమమ్మకు కనబడకుండా ఒక పెద్ద కొండ ఎక్కి గుహలో దాక్కోని రోజూ మందులు వేసుకోసాగింది. పదిరోజులు దాటగానే కన్ను వాపంతా తగ్గిపోయి మళ్ళా మామూలయిపోయింది. దాంతో నాలుగువేలూ తీసుకోని మళ్ళా తన వూరికి వచ్చేసింది.

నక్కను చూడగానే భూమమ్మ వురుక్కుంటా వచ్చి "యాడికి పోయింటివే నువ్వు. నా వెయ్యి రూపాయలు నాకియ్యకుండా" అని పట్టుకోనింది. దానికా దొంగనక్క "ఎంత మాటంటివమ్మా నువ్వు. నిన్ను మోసం చేయడమా... పురుగులు పట్టిపోతారు అట్లా చేస్తే. నీకు డబ్బులివ్వడం కోసమని మా అత్తోళ్ళ వూరికి పోయి రోజూ కూలీ చేసి ఈ డబ్బులు సంపాదించుకోనొస్తి. తీసుకో" అంటా వెయ్యిరూపాయలు చేతిలో పెట్టింది. భూమమ్మ సంతోషంగా వెళ్ళిపోయింది.

అదట్లా పోవడం ఆలస్యం నక్క నవ్వుకుంటా మిగతా మూడువేలు ఖర్చు పెట్టి జల్సా చేసుకోసాగింది. ఐదువేలు తీసుకున్న గుడ్డినక్క ఏమయిపోయిందో, యాడికి పోయిందో అర్థం గాక భూమమ్మ వెదుక్కుంటా తిరగసాగింది.

# 110 మల్లెపూల పిల్ల

ఒకూర్లో ఒక ముసిలామె వుండెది. ఆమె చానా పేదది. చానా మంచిది కూడా. ఆమెకు ఒక కూతురుంది. ఆ యింట్లో ఈ యింట్లో పని చేస్తా తాను తిన్నా తినకపోయినా కూతురికి మాత్రం పెట్టా బాగా ప్రేమగా చూసుకునేది. కొన్నాళ్ళకా పాప పెరిగి పెద్దగయింది. ఆమెది అట్లాంటిట్లాంటి అందంగాదు. అచ్చం మెరుపుతీగలెక్క వుంటాది. చూడచక్కనైన ముఖం. తల్లి తన కోసం కష్టపడతా వుంటే చూడలేక ఆ పాపగూడా రోజూ అడవికి పోయి, కట్టెపుల్లలన్నీ ఏరుకోనొచ్చి వూర్లో అమ్మి అమ్మకు డబ్బులు తెచ్చిచ్చేది.

ఒకరోజు ఆ పాప అడవిలో పోతా వుంటే దారిలో ఒకచోట ఒక ముసలిముని మంచి ఎండలో కిందపడి మూలుగుతా కనబన్నాడు. చుట్టుపక్కల ఎవ్వరూ లేరు. అయ్యోపాపమని ఆ పాప వురుక్కుంటా పోయి చేయి పట్టుకోని చూస్తే జ్వరంతో ఒళ్ళు సలసలసల కాగిపోతా వుంది. ఆ పిల్ల చానా మంచిది గదా... అయ్యో పాపమని మునిని ఎత్తుకోనిపోయి ఒక పెద్దచెట్టు కింద చల్లని నీడలో పన్నబెట్టింది. దగ్గర్లోని చెరువు నుంచి నీళ్ళు తెచ్చి ఒళ్ళంతా తడిబట్టతో తుడిచింది. వురుక్కుంటా వూర్లోకి పోయి వైద్యున్ని అడిగి మందులు తెచ్చి ఏసింది. పొద్దున్నించీ రాత్రి వరకూ తిండి గూడా తినకుండా పక్కనే కూచోని సేవలు చేసింది. దాంతో ఆ ముని నెమ్మదిగా కోలుకున్నాడు.

ఆ పాప చేసిన సాయానికి సంబరపడి “చూడమ్మా! నేనెవరో తెలీకపోయినా నాకోసం నువ్వు చానా కష్టపన్నావ్. పొద్దున్నించీ తిండి గూడా తినకుండా కన్నతల్లి లెక్క చూసుకున్నావ్” అంటూ తన దగ్గరున్న రెండు కుండలిస్తూ “ఇదుగోమ్మా! ఈ ఎర్రకుండలోని నీళ్ళు నీ మీద చల్లితే నీవు పూలచెట్టుగా మారిపోతావు. మళ్ళా ఈ నల్లకుండలోని నీళ్ళు చల్లితే మామూలు మనిషయిపోతావు. తీసుకో. కానీ ఆ పూలచెట్టుకు పూసేటివి మామూలు పూలు కాదు. ఏడేడు పధ్నాలుగులోకాల్లోనూ అంత మంచి వాసన ఏ పూలకూ వుండదు. ఎండాకాలమనిలా, చలికాలమనిలా, వానాకాలమనిలా ఏ కాలమయినా సరే పూలు గుత్తులు గుత్తులు పూస్తాయి. వాటిని అమ్ముకోని హాయిగా బతకండి. ముందు ముందు నీకు మంచిరోజులు వస్తాయి” అని చెప్పి వెళ్ళిపోయినాడు.

ఆ పాప సంబరంగా వురుక్కుంటా వాళ్ళమ్మ దగ్గరికి పోయి విషయమంతా చెప్పింది. అట్లాగా అని వాళ్ళమ్మ ఎర్రకుండలోని నీళ్ళు చల్లింది. కండ్లు మూసి తెరిచేంతలోగా ఆ పాప చక్కని మల్లెపూల చెట్టుగా మారిపోయింది. చెట్టు నిండా పూలే పూలు. కుప్పలు కుప్పలు. వాళ్ళమ్మ సంబరంగా జాగ్రత్తగా దాండ్లను తెంచి కుప్ప పోసి మళ్ళా ఆ పాప మీద నల్లకుండలోని నీరు చల్లింది. ఆ పాప ఎప్పట్లాగే మామూలు మనిషయిపోయింది.

వాళ్ళమ్మ ఆ పూలు తీసుకోని అమ్మడానికి వూర్లోకి పోతే వీధివీధంతా ఘుమ్మని వాసన అదిరిపోయింది. దాంతో జనాలందరు మాకియ్యమంటే మాకియ్యమని ఒకరికంటే ఒకరు డబ్బులు ఎక్కువిస్తామని ఎంటపన్నారు. అట్లా ఆమె నెలకొక్కసారి పూలు తీసుకోనిపోయి అమ్మితే ఆ నెలకంతా కావాల్సినంత డబ్బులొచ్చేవి.



ఆ పూల గురించి, దాండ్ల వాసన గురించి నెమ్మదిగా ఆ వూరి యువరాజుకు తెలిసింది. దాండ్ల వాసన చూసి ఆచ్చర్యపోయినాడు. ఇంతవరకూ ఎప్పుడూ ఎక్కడా ఇట్లాంటి పూల గురించి వినలేదు, చూడలేదు. ఇవి ఆ ముసిలామెకెట్లా వచ్చినాయి అని ఒకరోజు ఆ యువరాజు మారువేషమేసుకోని చెట్టును చూద్దామని వాళ్ళింటికాడికి పోయినాడు. పోయి చూస్తే ఆడ ఒక్క చెట్టు గూడా కనబళ్ళేదు. "చెట్టు లేదు. మరి పూలెట్లా వస్తున్నాయి? కనుక్కోవా"లని రోజూ రాత్రనకా, పగలనకా ఆ ఇంటి దగ్గర్లోనే ఎవరికీ కనబడకుండా కాపేసినాడు. ఆ ముసిలామెకిదంతా తెలీదు గదా ఎప్పట్లాగానే ఒకరోజు ఆ పాపను కూచోబెట్టి నీళ్ళు చల్లింది. ఆ పాప చక్కని మల్లెచెట్టయిపోయింది. పూలన్నీ కోసుకోని మళ్ళా నీళ్ళు చల్లింది. ఆ పాప ఎప్పట్లాగానే మామూలు మనిషయిపోయింది.

అదంతా దాచిపెట్టుకోని చూస్తా వున్న యువరాజు ఆమె అందం చూసి "అబ్బ ఎంత చక్కగుందీ పిల్ల! ఆకాశంలో మెరిసే చుక్క లెక్క" అని మురిసిపోయినాడు. ఈ పిల్లను చేసుకుంటే నా బతుకంతా సంబరాలే సబరాలు అనుకోని ఇంటికి పోగానే అందరికీ విషయం చెప్పి ఆ పిల్లను చేసుకుంటానన్నాడు. కానీ ఈ పాప చానా పేదపిల్ల గదా. దాంతో వాళ్ళమ్మ వద్దనింది. కానీ యువరాజు "చేసుకుంటే ఆ పాపనే చేసుకుంటా లేకుంటే చచ్చిపోతా" అంటా అన్నం నీళ్ళు ముట్టకుండా కూచున్నాడు. దాంతో వాళ్ళు తప్పనిసరై ఆ పిల్లను తెచ్చి అంగరంగ వైభోగంగా పెండ్లి చేసినారు. పెండ్లయిన తరువాత ఆమె ముని గురించీ, అతని వరం గురించీ జరిగిందంతా చెప్పింది. అప్పటినుంచీ యువరాజు తనకిష్టమయినప్పుడల్లా ఆమెని పూలచెట్టుగా మార్చి పూలు కోసుకోని మళ్ళా మామూలుగా చేసేటోడు. ఆ పూలు ఎవరికీ ఇచ్చేటోడు కాదు. రహస్యం ఎవరికీ చెప్పేటోడు కాదు.

ఒకరోజు మధ్యాన్నం యువరాజు గదిలోంచి మల్లెపూల వాసనొస్తా వుంటే వాళ్ళమ్మ గమనించి ఎవరికీ కనబడకుండా దాచిపెట్టుకోని కిటికీలోనించి తొంగి చూసింది. యువరాజు పూలు కోసుకుంటా కనబన్నాడు. పూలన్నీ కోసుకున్నాక మళ్ళా ఆమెను మామూలుగా చేసేసినాడు. అదంతా చూసిన ఆమె "ఓహో ఇదా సంగతి" అనుకోనింది.

ఆమెకు మొదట్నించీ ఆ పాపంటే ఇష్టం లేదు గదా. ఎట్లాగయినా సరే వాళ్ళని విడదీసి తన తమ్ముని కూతురినిచ్చి మళ్ళా పెండ్లి చేయాలనుకోనింది. ఒకరోజు ఆ దొంగసచ్చినేది యువరాజు ఇంట్లో లేనపుడు ఎవరి కంటా పడకుండా లోపలికి పోయి ఆమె పన్నుకోనుంటే వెనుక నుంచి ఎర్రకుండలోని నీళ్ళు చల్లింది. ఆ పాప ఎట్లున్నదట్లే పూలచెట్టుగా మారిపోయింది. వెంటనే ఆమె చెట్టుకొమ్మలన్నీ విరిచిరిచి పడేసి 'అవన్నీ మూటగట్టి ఒక సైనికున్ని పిలిచి ఎవరికీ కనబడకుండా దూరంగా అడవిలో పాడేసి రమ్మని పంపిచ్చింది. ఆ రెండు కుండల్నీ తీస్కోనిపోయి పగలగొట్టి నీళ్ళన్నీ పారబోసి ఏమీ ఎరుగని నంగనాచి లెక్క మట్టసంగా వుండిపోయింది.

యువరాజు ఇంటికొచ్చి చూస్తే పెండ్లాం కనబల్లేదు. యాడికి పోయిందబ్బా అని ఇండ్లంతా ఆ మూల నుండి ఈ మూలకు, ఈ మూల నుండి ఆ మూలకు వెదికినాడు. కానీ యాడా కనబళ్ళేదు. చుట్టుపక్కల వూర్లన్నిటిలో చూసిరమ్మని సైనికులని పంపించినాడు. ఎవరినడిగినా మాకు తెలీదంటే మాకు తెలీదన్నారేగానీ ఎవరూ ఏమీ చెప్పలేకపోయినారు. దాంతో పెండ్లాన్నే తలచుకుంటా బాధపడతా వుండసాగినాడు.

ఒకరోజు రాజ్యంలోని జనాలంతా గుంపుగా వచ్చి "రాజా! అడవిలో జంతువులు ఎక్కువయిపోయినాయి. అవన్నీ వూర్లమీద పడి మమ్మల్ని చంపుతా వున్నాయి. నీవే ఎట్లాగయినా కాపాడాల" అన్నారు. రాజుండేది వాళ్ళని కాపాడ్డానికే గదా... దాంతో యువరాజుని పిలిచి అడవికి పోయి జంతువులను చంపి రమ్మన్నాడు. సరేనని యువరాజు కొంతమంది సైనికులను వెంటేసుకోని అడవికి పోయి కనబన్న క్రూరజంతువునల్లా వేటాడసాగినాడు.

అట్లా అడవిలో పులుల్ని, సింహాల్ని, పాముల్ని చంపుకుంటా పోతా వుంటే ఒకచోట ఘుమ్మని మల్లెపూల వాసనొచ్చింది. ఆ వాసనకు అదిరిపడినాడు. "అదే వాసన" అనుకుంటా ఒకొక్క చెట్టే వెదుక్కుంటా.. వెదుక్కుంటా వాసనొస్తావున్న దిక్కు పోతా వుంటే ఒకచోట ఆ పూలచెట్టు కొమ్మలన్నీ విరిగిపోయి, ఆకులన్నీ రాలిపోయి, బాగా వాడిపోయి కనబడింది. దానిని చూసి యువరాజు కండ్లనీళ్ళు పెట్టుకున్నాడు.

ఆ చెట్టుని తీసుకోని ఆకులని సరిచేసి, కొమ్మలకి కట్టుకట్టి, దాన్ని పెద్ద కుండలోనికి మార్చి "ఎట్లాగబ్బా ఈ చెట్టును మళ్ళా మనిషిని చేయడం" అని ఆలోచిస్తా వుంటే ఆ నీళ్ళిచ్చిన ముని గుర్తుకొచ్చినాడు. దాంతో ఆ పూలచెట్టు తీసుకోని ఒకొక్క వూరే వెదుక్కుంటా, కనబన్నోళ్ళందరినీ ఆ ముని గురించి అడుగుతా ఆఖరికి ముని వున్న చోటుకి చేరుకున్నాడు. ఆయన కాళ్ళ మీద పడి "ఎట్లాగయినా సరే నీవే కాపాడాల" అని కండ్లనీళ్ళు పెట్టుకున్నాడు. సరేనని ముని ఇంట్లోకి పోయి ఏవో నీళ్ళు తీసుకోనొచ్చి మంత్రించి ఆ చెట్టు మీదకి చల్లినాడు. అంతే... ఆ చెట్టు మళ్ళీ మామూలుగా మారిపోయింది. మొగున్ని చూసి ఆమె జరిగిందంతా చెప్పింది.

యువరాజు ఇంటికొచ్చి వాళ్ళమ్మను తిట్టిన తిట్టు తిట్టకుండా బాగా తిట్టినాడు. దాంతో ఆమెకి బుద్ధి వచ్చి తప్పయిపోయిందని ఒప్పుకోని కోడలిని క్షమించమని వేడుకోని ఇంటికి పిల్చుకోనొచ్చింది. అప్పటి నుంచీ అందరూ కలసి మెలసి ఎటువంటి గొడవలూ లేకుండా హాయిగా వున్నారు.

# 111 ఒకళ్ళను మించిన ఘనుడు ఇంకొకడు

ఒక వూళ్ళో ఒక ధనవంతుడు వుండేటోడు. వాడు బాగా సంపాదించి ఒక పెద్ద మేడ కట్టుకొన్నాడు. కానీ ఆ ఇంటికి వాకిలి కొంచం చిన్నగా వుంది. ఆ ధనవంతునికి చానామంది పనివాళ్ళు వుండేటోళ్ళు. యాడికీ కాలు కదిపే పని లేకుండా అన్నీ వాళ్ళే చూసుకునేటోళ్ళు. దానికి తోడు వానికి ఒకటే తిండి పిచ్చి. ఏది తినాలనిపిస్తే అది తెప్పిచ్చుకోని ఎంత తినాలనిపిస్తే అంత లాగించేటోడు. దాంతో ఆ ధనవంతుడు రోజు రోజుకీ లావైతా గున్నఏనుగులెక్క బలిసిపోయినాడు. దాంతో ఎప్పుడూ మేడ మీదనే వుండేటోడు.

ఒకరోజు దారిలో ఒక పిల్లోడు పోతా పోతా ఆ ఇంటి ముందాగి ఆ మేడను, పైన కూచున్న ధనవంతున్ని మార్చి మార్చి చూస్తా నవ్వుకోసాగినాడు. అది చూసి వాడు "ఈ పిల్లోడెవడోగానీ నన్నూ, నా సంపదని చూసి చానా సంబరపడుతున్నట్టున్నాడు" అని ముచ్చటపడి ఆ పొట్టెగాన్ని పైకి రమ్మని పిలిచినాడు.

వాడు పైకి వచ్చినాక "ఏమి బాబూ... ఇంటినీ, నన్నూ చూసి అట్లా నవ్వుతా వున్నావు" అని అడిగినాడు.

దానికి వాడు "ఆ.... ఏం లేదు. నువ్వేమో బాగా బలిసిన గున్న ఏనుగులెక్క ఇంత లావున్నావు ఇంటి వాకిలి చూస్తేనేమో చానా చిన్నగా వుంది. మరి నువ్వు చస్తే నీ శవాన్ని బైటికి ఎట్లా తీసుకోనొస్తారు. కొంపదీసి గోడగాని పగలగొడతారా అని ఆలోచన వచ్చి నవ్వుకుంటా వున్నా" అన్నాడు.

ఆ మాటలకు వానికి చానా కోపం వచ్చింది. "వీడెవడో గానీ చానా అతికమోని లెక్కున్నాడు. వీళ్ళ పెద్దవాళ్ళను పిలిపిస్తే... ఎవరితో ఎట్లా మాట్లాడాల్నో కొంచం బుద్ధి చెబుతారు" అనుకోని పనోళ్ళని పిలిపించి వాళ్ళింటి కాడ ఎవరైనా వుంటే పిలుచుకోని రమ్మన్నాడు. వాళ్ళు పోయి వాళ్ళ అన్నను పిలుచుకోని వచ్చినారు.

ఆ ధనవంతుడు జరిగిందంతా చెప్పి "వీడు చిన్నా పెద్దా లేకుండా ఏది బడితే అది వాగుతా వున్నాడు. కొంచం బుద్ధి చెప్పండి" అన్నాడు. వాళ్ళ అన్న కోపంగా తమ్ముని వంక తిరిగి "ఏంరా.... కొంచమన్నా బుద్ధుందా నీకు. శవం తలుపులోంచి బైటకు రాకపోతే బంగారంలాంటి గోడను బద్ధలు కొడతారా ఎవరైనా. అంతగా అయితే ముక్కలు ముక్కలుగా నరికి తీసుకోనొస్తారు గానీ.... ఆ మాత్రం గూడా తెలీదా.... ఇంత ఎత్తు ఎదిగినావు. ఛూ.... ఛూ.... నిన్ను నా తమ్ముడని చెప్పుకోడానికే సిగ్గుగా వుంది" అని తిట్టసాగినాడు.

ఆ మాటలు వినేసరికి ధనవంతుడు అదిరిపోయినాడు. "తమ్ముడే అనుకుంటే అన్న కూడా తక్కువోడేం కాదు. ఒకరిని మించిన ఘనులు ఇంకొకరు వున్నట్టున్నారు. వీళ్ళిద్దరికీ బాగా బుద్ధి చెప్పాలి" అనుకోని వాళ్ళ నాయనను పిలిపించినాడు. "నీ ఇద్దరు కొడుకులూ చిన్నా పెద్దా లేకుండా నోటికి ఏదొస్తే అది అడ్డంగా వాగుతా వున్నారు. నువ్వయినా కాస్త గడ్డిపెట్టు వీళ్ళకి" అంటా జరిగిందంతా చెప్పినాడు.



దాంతో వాళ్ళ నాయన సలసలసల మండిపోతా కొడుకుల వంక తిరిగి “ఏంరా... వాళ్ళు డబ్బున్నోళ్ళు. చస్తే గోడ బద్దలు కొట్టాల్సిన అవసరమూ లేదు. అట్లాగని శవాన్ని ముక్కలు ముక్కలు చేసి బైటకు తీయాల్సిన అవసరమూ లేదు. ఇంట్లోనే గుంత తీసి బూంచి పెడతారు. లేకుంటే ఇంటి మధ్యలో శవం పెట్టి మొత్తం ఇంటినే తగలబెడతారు. అయినా మధ్యలో మనకెందుకు. వాళ్ళ శవం వాళ్ళిష్టం. మనం వూరికే చూడాల గానీ అనవసరంగా నోరు పారేసుకోగూడదు” అన్నాడు.

ఆ మాటలింటా వుంటే ధనవంతునికి నోట మాట రాలేదు. “ఓరి దేవుడోయ్.... అన్నాదమ్ములే అనుకుంటే వాళ్ళ నాయన గూడా తక్కువోడు గాదు. వీళ్ళ మాటలింటా వుంటే ఇప్పుడే ఈన్నే చచ్చిపోయేటట్లు వున్నాను. వీళ్ళకు చెప్పాలనుకోవడం నాదే బుద్ధి తక్కువ” అనుకుంటా అందరినీ ఆన్నుంచి తన్ని తరిమేసినాడు.

# 112 సూడ సక్కని పిల్ల

ఒకూర్లో ఒక పూటకూళ్ళామె వుండేది. ఆమె తన పొలంలో జొన్నిత్తనాలు వేసుకోనింది. విత్తనాలైతే మొలిచినాయి కానీ పూత సరిగ్గా రాలేదు. దాంతో వినాయకుని గుడికి పోయి "సామీ...సామీ...నా చేనులో పంట బాగా పండేటట్లు చేయి సామీ! అట్లా చేస్తే నీకు గంపెడు వుండ్రాళ్ళు చేసి పెడతా" అని మొక్కుకోనింది. వుండ్రాళ్ళంటే వినాయకునికి చానా చానా ఇష్టం గదా...దాంతో నోట్లో నీళ్ళూరి ఆమె పంట బాగా పండేటట్లు చేసినాడు. వూర్లో ఎవరికీ పండనంత పంట ఆమెకు పండింది. ఆమె జొన్నలన్నీ అమ్ముకోని హాయిగా కాలు మీద కాలేసుకోని కూచుండే కానీ...దేవునికి మొక్కుకున్నట్లు వుండ్రాళ్ళు మాత్రం చేసిపెట్టలేదు.

వినాయకుడు "ఈ రోజు చేసి పెడ్తాదిలే...రేపు చేసి పెడ్తాదిలే..." అనుకుంటా ఆశగా చాన్నాళ్ళు ఎదురు చూసినాడు. కానీ ఆమె అసలు ఆ విషయమే మరిచిపోయింది. దాంతో వినాయకునికి తెగ కోపమొచ్చేసి "ఓసి...దొంగదానా...నన్నే మోసం చేస్తావా...వుండు నీ పని చెబుతా" అని ఆమె కడుపులో ఒక ఎలుక పిల్లను వేసినాడు. ఆమెకు లోపలున్నది ఎలుకని తెలీదుగదా...దాంతో "అబ్బ నా కడుపు పండింది" అని తెగ సంబరపడింది. "ఆడపిల్ల పుడ్తాదా...మొగపిల్లోడు పుడ్తాడా" అని ఎదురు చూస్తా వుంటే తొమ్మిదినెలలు దాట్నాక ఒక ఎలుకపిల్ల పుట్టింది. కడుపున పుట్టిందాన్ని పారేయలేం కదా. అందుకని ఆమె "సరే...ఏదో ఒకటిలే" అనుకోని దాన్నే ప్రేమగా పెంచుకోసాగింది.

ఆ రాజ్యానికి దూరంగా వున్న మరొక రాజ్యంలో ఒక రాజున్నాడు. ఆయనకు ఏడుమంది కొడుకులు. ఆరుమందికి పెండ్లయింది కానీ చిన్నోనికి కాలేదు. ఒకరోజు వాళ్ళ నాయన వాన్ని పిలిచి "ఒరే... నాయనా... నీకెట్లాంటి పిల్ల గావాల్నో చెప్పు. తెచ్చి చేస్తా" అనడిగినాడు. దానికి వాడు "నాయనా... నాకట్లాంటిట్లాంటి పిల్లను చేసుకోవడం ఇష్టం లేదు. నా పెండ్లాంలాంటి అందగత్తె ఈ మూడు లోకాల్లోనూ యాడా వుండగూడదు. మెరుపులా మెరిసి పోవాల. చుక్కలా వెలిగిపోవాల. బంగారంలా ధగధగలాడాల, పువ్వులా కళకళలాడాల. అట్లాంటి సూడసక్కని పిల్ల కావాల" అన్నాడు. "సరే" నని వాళ్ళ నాయన దేశదేశాల అందగత్తెల బొమ్మలన్నీ తెప్పించి వానికి సూపిచ్చినాడు. కానీ వానికి ఎవరూ నచ్చలేదు. దాంతో ఒకరోజు వాడు వాళ్ళ నాయన దగ్గరికి పోయి "నాయనా... నాకు నచ్చేటటువంటి పిల్లను తేవడం నీ వల్లగాదు గానీ...నేనేపోయి బుడుక్కోనొచ్చుకుంటా... నన్నాశీర్వదించు" అంటూ ఆశీర్వాదం తీసుకోని నచ్చిన పిల్లను పెండ్లాడ్డం కోసం గుర్రమేస్కోని బైలుదేరినాడు.

అట్లా... పోతా పోతా... ఒగటిగాదు రెండు గాదు కనబన్న రాజ్యాలల్లా తెగ వెదికినాడు. కానీ యాడా వానికి వాడు కోరుకున్నంత అందగత్తె దొరకలేదు. అలా ఒక్కొక్క వూరే దాటుకుంటా... దాటుకుంటా... ఆఖరికి

పూటకూళ్ళామె ఇంటికి చేరుకున్నాడు. ఆమె వాని మొగం చూసి "ఏం నాయనా... యాన్నించొస్తా వున్నావు. ఎందుకట్లా విచారంగా వున్నావు" అనడిగింది. దానికి వాడు నెమ్మదిగా తన కథంతా చెప్పినాడు.

దానికామె వెంటనే "ఓరినీ... దానికంత బాధెందుకు. నీకు కావలసింది సక్కదనాల సుక్కనే గదా. నాకో కూతురుంది. దానిది అట్లాంటిట్లాంటి అందం గాదు. అసలు ఈ సుట్టుపక్కల యాడా అంత అందమైన పిల్లనే లేదు. కాకపోతే ఇప్పుడు దీక్షలో వుంది. ఉగాది పండగొచ్చేంత వరకూ ఎవరూ సూడగూడదు. నీకు కావాలంటే చెప్పు పెట్టెలో పెట్టిస్తా...తీస్కోని పో" అనింది. వాడు సరేనన్నాడు.

వెంటనే పూటకూళ్ళామె ఎలుకను తీసునోనొచ్చి మట్టసంగా ఒక పెద్ద పెట్టెలో పెట్టి వానికిస్తా "జాగ్రత్త నాయనా...పండగ వరకూ పెట్టె తెరవద్దు. మధ్యలో తెరిచినావనుకో ఆమె ఎలుకైపోతాది. ఆపైన నీయిష్టం" అని చెప్పింది. వాడు ఆనందంగా పెట్టె తీస్కోని ఒకొక్క వూరే దాటుకుంటా తిరిగి వాళ్ళ రాజ్యానికి చేరుకోని పెట్టె తీస్కోనిపోయి జాగ్రత్తగా తన గదిలో దాచిపెట్టుకున్నాడు.

వాళ్ళ నాయన వాన్ని పిలిచి "ఏరా...లోకంలో యాడా వుండనంతటి సూడసక్కనైన పిల్లని నాకు కోడలిగా తెస్తానంటివి గదా...తెస్తివా"అనడిగినాడు. దానికి వాడు "తెచ్చినాగానీ...ఇప్పుడు దీక్ష పట్టి వుంది. ఉగాది పండగనాడు మీకందరికీ చూపిస్తా" అని చెప్పినాడు.

ఒకరోజు వాడు వుండబట్టలేక "నాక్కాబోయే పెండ్లాం ఎట్లాగుందో ఏమో... ఎన్ని రోజులని చూడకుండా వుండేది. ఒక్కసారన్నా చూద్దాం" అనుకోని సప్పుడు కాకుండా మూత తెరిచినాడు. అంతే... అందులో నుండి ఎలుకపిల్ల చెంగున ఎగిరి బైటకు దుంకింది. వానికి నిజంగానే పూటకూళ్ళామె పెట్టెలో పెట్టిచ్చినేది ఎలుకపిల్లనే అని తెలీదు గదా... దాంతో "వారినీ... అనవసరంగా మూత తీసి బంగారుబొమ్మ లాంటి పిల్లను కాస్తా ఎలుకపిల్లను చేసుకుంటిని గదా" అని తెగ బాధపడినాడు.

అట్లా కొద్దిరోజులు దాటగానే ఉగాది పండుగ దగ్గరకొచ్చింది. ఒకరోజు వాళ్ళమ్మ వాన్ని పిలిచి "ఒరే...నాయనా...పండుగ దగ్గరకొస్తా వుంది గదా...వడ్లు దంచాల...మీ వదినలందరూ మొత్తమంతా మేమే ఎందుకు దంచాలా...సిన్నమరిది గూడా కాబోయే పెండ్లాన్ని తెచ్చుకున్నాడు గదా...వాళ్ళ వాటాను వాళ్ళే దంచుకోమను అంటావున్నారు. ఎట్లారా..." అనడిగింది.

వాడు ఏమీ చెప్పలేక మట్టసంగా వచ్చి గదిలో కూచోని "ఏమి చేయాలబ్బా" అని బాధపడతా వుంటే ఎలుకొచ్చి "ఏమైంది...ఎందుకట్లా ఒక్కనివే కూచోని తెగ బాధపడ్తా వున్నావ్" అనడిగింది. వాడు జరిగిందంతా చెప్పినాడు. దానికా ఎలుక "ఓస్... అంతేనా... దానికంత బాధెందుకు... రాత్రికి వడ్లమూటలు గదిలో ఏపిచ్చి బైటకు పో... రేప్పొద్దునకల్లా ఏమైతాదో నువ్వే సూద్దువు గానీ" అనింది. "సరే"నని వాడు రాత్రి వడ్ల మూటలు లోపల పెట్టి తలుపులేసేసినాడు.

వెంటనే ఆ ఎలుక వూళ్ళో వున్న ఎక్కడెక్కడి ఎలుకలనంతా పిలుచుకోనొచ్చింది. అంతే...అవి రాత్రికి రాత్రి ఒక్క వడ్లగింజ కూడా మిగలకుండా అన్నిట్నీ శుభ్రంగా వొలిచి కుప్ప చేసి వెళ్ళిపోయినాయి. పొద్దున్నే అందరూ వచ్చి చూస్తే ఇంగేముంది పెద్ద బియ్యం కుప్పుంది. అది చూసిన రాజు, రాణి, అన్నా, వదినలు "అబ్బ...ఏమో అనుకొంటిమి గానీ నీక్కాబోయే పెండ్లాం ఇంత పనిమంతురాలా?" అంటూ తెగ మెచ్చుకున్నారు.

అట్లా ఒక నాలుగు రోజులు గడిచేసరికి ఇండ్లంతా సున్నం వేయడం మొదలు పెట్నారు. వాళ్ళమ్మ వాన్ని పిలిచి ""ఒరే...నాయనా...పండుగ ముందు ఇళ్ళంతా సున్నం కొట్టుకోవాల గదా...మీ వదినలందరూ మొత్తమంతా మేమే ఎందుకు కొట్టాల...సిన్నమరిది గూడా కాబోయే పెండ్లాన్ని తెచ్చుకున్నాడు గదా...వాళ్ళ గదిని వాళ్ళే కొట్టుకోమను అంటావున్నారు. ఎట్లారా..." అనడిగింది.

వాడు ఏమీ చెప్పలేక మట్టసంగా వచ్చి గదిలో కూచోని "ఏమి చేయాలబ్బా" అని బాధపడతా వుంటే ఎలుకొచ్చి "ఏమైంది...ఎందుకట్లా ఒక్కనివే కూచోని తెగ బాధపడ్తా వున్నావ్" అనడిగింది. వాడు జరిగిందంతా చెప్పినాడు. దానికా ఎలుక "ఓస్... అంతేనా... దానికంత బాదెందుకు... రాత్రికి సున్నం కుండలు తెప్పించి పెట్టిపో... రేప్పొద్దునకల్లా ఏమైతాదో నువ్వే సూద్దువు గానీ" అనింది. కుండలన్నీ లోపల పెట్టి తలుపులేసేసినాడు.

వెంటనే ఆ ఎలుక వూళ్ళో ఎక్కడెక్కడి ఎలుకలనంతా పిలుచుకోనొచ్చింది. అంతే...అవి రాత్రికి రాత్రి తోకలు సున్నంలో అద్ది గదంతా శుభ్రంగా సున్నం కొట్టి బండలు అద్దం లెక్క తుడిచి వెళ్ళిపోయినాయి. పొద్దున్నే అందరూ వచ్చి చూస్తే ఇంగేముంది గదంతా ఒక్క మరక గూడా లేకుండా తళతళా మెరిసిపోతా కనబడింది. అది చూసి అందరూ "అబ్బ నీక్కాబోయే పెండ్లాం ఎంత పనిమంతురాలురా... ఏ పని చెప్పినా ఇట్టే చిటికెలో చిన్న వంకర కూడా లేకుండా చేస్తా వుంది. పనులే ఇంత చక్కగా చేస్తా వుంటే ఆమె ఇంకెంత సక్కగా వుంటాదో" అని తెగ మెచ్చేసుకున్నారు.

వాడు "ఉగాది పండగనాడు నా పెండ్లాన్ని అందరికీ చూపిస్తా" అని చెప్పినాడు గదా...పండగ దగ్గరకొచ్చేసింది. ముందురోజు రాత్రి మిద్దెపైన కూచోని "రేప్పొద్దున నీ పెండ్లాన్ని చూపియ్యరా అంటే నేనేం చేయాల" అంటూ తెగ బాధపడిపోసాగినాడు. ఎలుకొచ్చి "ఏమైంది...ఎందుకట్లా ఒక్కనివే కూచోని బాధపడ్తా వున్నావ్" అని అడిగింది..

దానికి వాడు విచారంగా "పండుగ నాడు నాక్కాబోయే పెండ్లాన్ని చూపిస్తానని అందరికీ చెప్పినాను గదా...రేపే పండుగ....నిన్ను చూపిస్తే అందరూ నవ్వరా" అన్నాడు. ఎలుకకు ఏం చెప్పాల్నో అర్థంగాక అది కూడా ఏడుస్తా... వూరిబైటున్న వినాయకుడి గుడికి పోయింది. వినాయకుడు అది ఏడుస్తా వుంటే చూసి "ఏందబ్బా... పాపం.... ఎలుక ఇట్లా ఏడుస్తా వుంది. దానికేం కష్టమొచ్చిందో... ఏమో" అనుకోని ప్రత్యక్షమై "ఎలుకా...ఎలుకా...ఎందుకే అట్లా ఏడుస్తా వున్నావ్" అనడిగినాడు.

ఎలుక కళ్ళెమ్మట నీళ్ళు కారిపోతా వుంటే వెక్కి వెక్కి ఏడుస్తా "ఎందుకు స్వామీ...నన్ను అందరిలెక్క పుట్టియ్యక...ఇట్లా ఎలుకలెక్క పుట్టిచ్చినావు...నేనేం పాపం చేసినాను" అంటూ జరిగిందంతా చెప్పింది. దానికి వినాయకుడు "సర్లే...ఐపోయిందేదో ఐపోయింది. ఇంక నువ్వేమీ దిగులు పడొద్దు. దీనికంతా కారణం నేనే కాబట్టి నేనే చక్కదిద్దుతా" అంటూ ఆ ఎలుకపిల్లను కాస్తా అందమైన పదహారేళ్ళ పిల్లగా మార్చేసినాడు. ఆమె సంబరంగా వురుక్కుంటా పోయి యువరాజుకు జరిగిందంతా చెప్పింది.

తరువాత రోజు పొద్దున్నే వాడు కాబోయే పెండ్లాన్ని తీసుకోని బైటకొచ్చినాడు. ఆమెను చూసినోళ్ళందరూ "అబ్బ...ఎంతందంగుందీ పిల్ల...అచ్చం ముత్యాల పందిరి లెక్క" అని తెగ మెచ్చేసుకోని, వాళ్ళిద్దరికీ పెండ్లి చేసి ఆశీర్వదించినారు.

# 113 రాజు - దేముడు

ఒకూర్లో ఒక పెద్ద చెరువుంది. ఒకసారి ఆ వూర్లో పెద్ద వానొచ్చి చెరువు నిండిపోయి గట్టు తెగింది. దాంతో నీళ్ళన్నీ వూర్లోకొచ్చి ఇండ్లూ వాకిళ్ళూ ఎక్కడివక్కడ కొట్టుకపోసాగినాయి. వెంటనే ఆ వూరి రాజు మనుషులను పిలిపిచ్చి ఆగమేఘాల మీద దానికి కట్ట కట్టిచ్చినాడు. కానీ తరువాత రోజు పొద్దున్నే వచ్చి చూస్తే రాత్రికి రాత్రి కట్టిన కట్ట మొత్తం కొట్టుకోనిపోయింది.ఎన్నిసార్లు కష్టపడి కట్ట కట్టినా మరుసటి రోజు పొద్దునకల్లా నున్నగా వూడ్చుకపోయేది. దేశదేశాల నుండి ఎంతో మంది వచ్చి రకరకాలుగా కట్టి చూసినారు. వూహు... ఏదీ నిలబల్లేదు. దాంతో రాజు "ఎన్నిసార్లు కట్ట కట్టిచ్చినా నిలబడ్డం లేదు. దాని సంగతేందో పోయి ఆ దేవున్నే అడిగి కనుక్కోవాల" అనుకోని దేవున్ని వెదుక్కుంటా బైలుదేరినాడు.

రాజు అట్లా పోతా వుంటే దారిలో ఒక మామిడిచెట్టు కనబడి "రాజా!రాజా! యాడికి పోతా వున్నావు" అనడిగింది. దానికా రాజు "మా వూర్లో చెరువుకు ఎన్నిసార్లు కట్ట కట్టిచ్చినా పడిపోతా వుంది. ఎందుకో కనుక్కుందామని ఆ దేవుని దగ్గరకు పోతా వున్నా" అని చెప్పినాడు. అప్పుడా మామిడిచెట్టు "రాజా! రాజా! నేను ప్రతి ఎండాకాలం విరగబడి కాస్తావున్నా. నా కాయలు తియ్యగుంటాయి. బాగా లావుగుంటాయి. అయినా ఒక్క పక్షి గానీ, పశువు గానీ దాండ్లను ముట్టుకోడం లేదు. నా కాయలు ఎందుకు ఎవరూ తినకుంటున్నారో కొంచం కనుక్కోని రా" అనింది. "సరే" అని రాజు ముందుకు కదిలినాడు.

అట్లా పోతా వుంటే దారిలో రెండావులు ఎదురొచ్చినాయి. అవి రాజును చూసి "రాజా! రాజా! యాడికి పోతా వున్నావు" అనడిగినాయి. దానికి రాజు "మా వూర్లో చెరువుకు ఎన్నిసార్లు కట్ట కట్టిచ్చినా పడిపోతా వుంది. ఎందుకో కనుక్కుందామని ఆ దేవుని దగ్గరకు పోతా వున్నా" అని చెప్పినాడు. అప్పుడా ఆవులు "రాజా! రాజా! ఈ అడవిలో యాడ చూసినా మా మోకాలెత్తున గడ్డుంది. గిట్లల్దాకా నీళ్ళున్నాయి. కానీ వాటిని తినడానికీ లేదు, తాగడానికీ లేదు. మా మెడలెందుకు కిందకు వంగకుండా వున్నాయో కొంచం కనుక్కోని రా" అన్నాయి. "సరే" అని రాజు ముందుకు కదిలినాడు.

అట్లా పోతా వుంటే దారిలో ఒక పందిపిల్ల కనబడి "రాజా! రాజా! యాడికి పోతా వున్నావు" అనడిగింది. దానికా రాజు "మా వూర్లో చెరువుకు ఎన్నిసార్లు కట్ట కట్టిచ్చినా నిలబడ్డంలేదు. ఎందుకో కనుక్కుందామని ఆ దేవుని దగ్గరకు పోతా వున్నా" అని చెప్పినాడు. దానికా పందిపిల్ల "రాజా! రాజా! ఈ లోకంలో అందరూ బాగా అందంగా, ఆనందంగా వుంటే నేనెందుకిట్లా అసహ్యంగా వున్నాను. ఎవరి దగ్గరికీ పోడానికీ లేదు. ఇష్టమొచ్చిన చోట తిరగడానికీ లేదు. నేనెందుకిట్లా పందిపిల్లగా పుట్టినానో కొంచం కనుక్కోనిరా" అని అడిగింది. రాజు "సరే" అని ముందుకు కదిలినాడు.

అట్లా అరవై రాత్రుళ్ళూ అరవై పగల్లూ, ఎండనకా వాననకా అడవిలో వెదుకుతా... వెదుకుతా... పోతా వుంటే అది చూసి జాలిపన్న దేవుడు వాని ముందు ప్రత్యక్షమై "ఏం నాయనా! ఏంది నీ బాధ! ఎందుకిట్లా తిండి తినకా నిద్రపోకా నా కోసమని రాత్రీ పగలూ వెదుకులాడ్తా వున్నావ్" అనడిగినాడు.

రాజు దేవున్ని చూస్తానే కాళ్ళ మీద పడి మొక్కుతా "సామీ! సామీ ! నా రాజ్యంలోని ప్రజలందరికీ మేలు చేద్దామని చెరువుకు కట్ట కట్టిస్తా వుంటే అది ఎన్నిసార్లు కట్టిచ్చినా నిలబడ్డం లేదు. ఎందుకని" అన్నాడు.

దేవుడు చిరునవ్వు నవ్వి "రాజా! నువ్వు వూర్లో అందరూ బాగుండాలని కోరుకుంటున్నావే గానీ నీ ఇంట్లో వాళ్ళను మాత్రం పట్టిచ్చుకోవడం లేదు. నీ కూతురు నీ దగ్గర పని చేసే ఒక పేదోని మీద మనసు పడి పెండ్లి చేస్కుంటానంటే నువ్వు వాన్ని కాదని, ఆమెకు ఇష్టం లేకపోయినా ఒక డబ్బున్నోనికిచ్చి పెండ్లి చేయాలనుకుంటా వున్నావ్. అందుకే నువ్వు వూరికి మేలు చేయాలనుకున్నా అది నిలబడ్డం లేదు. నీ కూతుర్ని ఆమె కోరుకున్న వానికిచ్చి పెండ్లి చేయి. అప్పుడు కట్ట నిలబడ్తాది" అని చెప్పినాడు. ఆ తర్వాత రాజు మామిడి చెట్టు, ఆవులు, పందిపిల్ల గురించి కూడా అడిగి తెలుసుకున్నాడు.

రాజు తిరిగి రాజ్యానికి వస్తా వుంటే దారిలో పందిపిల్ల కనబడి "రాజా! రాజా! నేనెందుకిట్లా పందిపిల్ల లెక్క పుట్టినానో కనుక్కోనొస్తివా" అనడిగింది. దానికా రాజు "నువ్వు ఇంతకు ముందు జన్మలో పెద్ద గయ్యాళివంట. నీ మొగుడు తనకున్నదాంట్లో అందరికీ దానం చేస్తా వుంటే, నువ్వు దానం చేయకపోగా నీ మొగున్ని నానాక తిట్లు తిట్టి సాధించే దానివంట. అందుకే ఈ జన్మలో నీ మొగుడు ఒక రాజ్యానికి రాజుగా పుట్టే, నువ్వు పంది లెక్క పుట్టినావంట" అని చెప్పినాడు.

రాజు తిరిగి రాజ్యానికి వస్తా వుంటే దారిలో ఆవులు రెండూ ఎదురొచ్చి "రాజా! రాజా! ఈ అడవిలో మా మోకాలెత్తున గడ్డుంది. గిట్టల దాకా నీళ్ళున్నాయి. అయినా తినడానికీ లేదు. తాగడానికీ లేదు. ఎందుకో కనుక్కోనొస్తివా" అనడిగినాయి. దానికి రాజు "మీరిద్దరూ పోయిన జన్మలో, మీ ఇంట్లో వున్న పశువులకు మేత ఎయ్యక,నీళ్ళూ తాపక బాగా సతాయించి బాధపెట్టినారంట. అందుకే ఈ జన్మలో మీకు ఇట్లాగయ్యింది"అని చెప్పినాడు.

రాజు తిరిగి రాజ్యానికి వస్తా వుంటే దారిలో మామిడిచెట్టు కనబడి "రాజా!రాజా! నేనెంత బాగా కాపు కాసినా నా కాయలు ఒక్క పక్షి గానీ, పశువు గానీ ముట్టుకోడం లేదు. ఎందుకో కనుక్కోనొస్తివా" అనడిగింది. దానికా రాజు "నీ కింద పెద్ద నిధి వుందంట. అది నీకు తెలిసినా ఎవరికీ చెప్పకుండా మట్టసంగా వూరుకున్నావు. డబ్బుండేది లేనోళ్ళకు సాయం చేయడానికీ, పంచడానికే గానీ ఇట్లా వూకే దాచిపెట్టుకోడానికి గాదు. నువ్వు నీ గురించి తప్ప ఇంకెవరి గురించీ ఆలోచించడం లేదు. కాబట్టి నీ దగ్గరికి కూడా ఎవరూ రావడం లేదు" అని చెప్పినాడు.

అప్పుడా మామిడిచెట్టు "రాజా! నాకింద పెద్దనిధి వున్నేది నిజమే. ఇన్ని రోజులు నేను తినకుండా ఇతరులను తిననియ్యకుండా మట్టసంగా వుండడం తప్పే. నువ్వు దీన్ని తవ్వి తీసుకోనిపోయి మీ రాజ్యంలో పేదలందరికీ పంచు" అనింది. రాజు సరేనని వూరి నుండి మనుషులను పిలిపిచ్చి అది చెప్పిన చోట తవ్వి చూస్తే ఏడుబండ్ల రత్నాలు, ఏడుబండ్ల వజ్రాలు దొరికినాయి. రాజు అవన్నీ తీసుకోని వూరికి చేరుకున్నాడు.

వూర్లోకి పోగానే కూతుర్ని పిలిచి "పాపా! నిన్ను బాధపెట్టినందుకు ఏమీ అనుకోవద్దు. నీ కెవరిష్టమో చెప్పు. వానితోనే నీ పెండ్లి జరిపిస్తా" అని చెప్పినాడు. తర్వాత రోజే అంగరంగ వైభోగంగా కూతురికి నచ్చినోనితో పెండ్లి చేసినాడు. ఆ పెండ్లిలో పేదోళ్ళందరికీ మామిడిచెట్టు కింద దొరికిన నిధంతా పంచి పెట్టినాడు. దాంతో ఆనకట్ట నిలబడింది.

# 114 దొరికిపోయినావురా మిడతంబొట్లూ

ఒకూర్లో శాస్త్రి అనే యువకుడుండేటోడు. వాడు చిన్నప్పుడు అల్లరి చిల్లరగా తిరుగుతా ఎప్పుడూ మిడతలను పడతా వుండేటోడు. దాంతో అందరూ వాన్ని 'మిడతంబొట్లు' అని అడ్డపేరుతో పిలిచేటోళ్ళు. కానీ వాడు చానా తెలివైనోడు. ఆవలిస్తే పేగులు లెక్కబెట్టే రకం. వానికి ఈ మధ్యనే పెండ్లయింది. వాని పెండ్లాం పండగకని పదైదు రోజుల ముందే పుట్టింటికి పోయింది. వీడు పండగకు ముందురోజు పొద్దున బైలుదేరినాడు. అప్పట్లో ఇప్పట్లా బస్సులూ, రైళ్ళూ వుండేటివి కాదుగదా... యాడికైనా కాలినడకనే. వాళ్ళత్తోళ్ళ వూరు చానా దూరం. దాంతో శాస్త్రి ఆడాడ ఆగుతా, అలసట తీర్చుకుంటా, వెంట తెచ్చుకున్నవి తింటా బాగా చీకటి పడే సమయానికి అత్తోళ్ళ వూరికి చేరుకున్నాడు. అప్పటికే బాగా నడిచీ నడిచీ అలసిపోవడంతో ఇంటి బైట్నే అరుగు మీద కూలబన్నాడు. రాత్రి కావడంతో తలుపులు మూసేసి వున్నాయి. తర్వాత రోజు పండగ కదా. అదీగాక కొత్త అల్లుడొస్తున్నాడు గదా.. అందుకని వాళ్ళత్త గారెలు చేద్దామని అప్పుడే నూనె పొయ్యి మీద పెట్టింది. గారె నూనెలో వేయగానే సుయ్‌మని చప్పుడు వచ్చింది. శాస్త్రికి ఒక తమాషా చేద్దామనిపించింది. దాంతో ఇంట్లోకి పోకుండా అరుగు మీదే కూచోని సుయ్‌మన్నప్పుడల్లా ఒకటీ... రెండు.. మూడు.. ఇట్లా వరుసగా లెక్కబెట్టసాగినాడు. మొత్తం అరవయ్యారయినాయి. అప్పుడు తలుపు తట్టి లోపలికి పోయినాడు.

అత్తామామా అంతా అల్లున్ని పలకరించి అన్నానికి కూచోమన్నారు. శాస్త్రి స్నానం చేసి కూచున్నాడు. అత్త వేడి వేడి అన్నం పెట్టి, పప్పూ, కూర, రసమూ పెట్టింది. శాస్త్రి అవి తింటా "ఏమత్తా అన్నం, పప్పూ పెడ్తా వున్నావు గానీ గారెలు ఒక్కటి గూడా పెట్టడం లేదు" అన్నాడు. ఆమె అదిరిపడి "అదీ.. అల్లుడూ.. రేపు పండగ కదా... దేవునికి నైవేద్యం పెట్టి పెడదామని అటక మీద పెట్టినా. ఐనా నీకెట్లా తెలిసింది మేం గారెలు చేసినామని" అనింది. దానికి శాస్త్రి నవ్వుతా "ఏమత్తా.. మీ అల్లుడంటే అట్లాంటిట్లాంటి అవలాగాడనుకున్నావా... వేదాలు, పురాణాలు పిండి కొట్టి, జ్యోతిష్యాలు, శాస్త్రాలు నమిలి మింగేసినోడు. ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ ఏమేమి జరుగుతుందో కళ్ళు మూసుకోని చిటికెలో చెప్పేయగలడు. కావాలంటే నా మంత్రశక్తితో నువ్వు మొత్తం ఎన్ని గారెలు చేసినావో చెప్పేయనా" అన్నాడు. ఆ మాటలకు అత్తా, మామా, పెండ్లాం ఆచ్చర్యంతో నోళ్ళు తెరిచి " చెప్పు చూద్దాం" అన్నారు. వాడు కళ్ళు మూసుకోని పెద్ద మాయగానిలా గాల్లో చేతులు తిప్పుతా, ఏదో ఆలోచిస్తున్నట్లు నటిస్తా, లెక్కలేస్తా " అత్తా... నువ్వు చేసింది మొత్తం అరవయ్యారు. కావాలంటే పోయి లెక్కబెట్టుకోపో" అన్నాడు. వెంటనే వాళ్ళు అటక మీదనుంచి గారెలతట్ట కిందికి దింపి లెక్కబెట్టి చూస్తే ఇంకేముంది... అల్లుడు చెప్పినట్టే మొత్తం అరవయ్యారున్నాయి. వాళ్ళు అల్లుని శక్తికి మురిసిపోయినారు. తరువాత రోజు అత్తామామలు కనబన్నోళ్ళందరినీ

పిలిచి పిలిచి తమ అల్లుని తెలివితేటల గురించి చెప్పీ చెప్పీ మురిసిపోయినారు. దాంతో ఆనోటా ఈనోటా పడి వీధివీధంతా విషయం తెల్సిపోయింది.

తరువాత రోజు పొద్దున్నే ఆ వీధి చివర వుండే చాకలాయన ఇంటి ముందుకొచ్చి నిలబన్నాడు. శాస్త్రి బైటకు రాగానే ఎగిరి కాళ్ళ మీద బడి “అయ్యా... నిన్న పొద్దుటి నుంచీ నా గాడిద యాడా కనబడ్డం లేదు. కనబడినోళ్ళందరినీ అడిగీ అడిగీ వూరంతా వెదికీ వెదికీ అలసిపోయినా... నువ్వు నీ మంత్రశక్తితో ఏదైనా ఇట్టే కనిపెట్టేస్తావని వీధివీధంతా చెప్పుకుంటా వున్నారు. ఎట్లాగైనా సరే నా గాడిద యాడుందో కొంచం కనుక్కోని చెప్పు. అంతవరకు నీ కాళ్ళు వొదిలేదే లేదు” అన్నాడు పట్టినపట్టు విడవకుండా. ఆ మాటలింటానే శాస్త్రి గొంతులో పచ్చి వెలక్కాయ పన్నట్టయింది. “ఒరే .. మిడతంబొట్లూ తెలీదంటే అత్తామామల ముందు మరియాద పోతాది. తెలుసంటే యాడుందో చెప్పాల. ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగా వుంది గదరా నీ పరిస్థితి” అని లోలోన అనుకుంటా కొంచం ఆలోచించి “ రేయ్ ... యాడికి పోతాది లేరా.. రేపు పొద్దునకంతా అదే మీ ఇంటికొస్తాది గానీ... నువ్వు పోయి హాయిగా కాలు మీద కాలేసుకోని పండుకోపో ... నా మంత్రశక్తితో అది యాడుందో కనుక్కుంటా” అన్నాడు ఎట్లాగయినా వాని బారి నుంచి అప్పటికి తప్పించుకోవాలని. ఆ రోజు రాత్రి అందరూ పండుకున్నాక లేసి గాడిద కోసం వెదకసాగినాడు. ఆఖరికి అది పక్కవూరి పొలిమేరలో మేత మేస్తా కనబడింది. దాన్ని పట్టుకోని మట్టసంగా తోలుకోనొచ్చి ఆ చాకలాయన ఇంటి వెనుక పెరట్లో వదిలేసి వెళ్ళిపోయినాడు.

చాకలాయన పొద్దున లేసి చూస్తే ఇంగేముంది శాస్త్రి చెప్పినట్టే గాడిద ఇంటి వెనుక గడ్డి మేస్తా కనబడింది. అంతే ఆ విషయం వూరువూరంతా నిమిషాల్లో పాకిపోయింది. “అబ్బో... మంగమ్మగారి అల్లునికి గొప్ప శక్తులున్నాయంట. ఏ సంగతయినా సరే ఇట్టే చెప్పేస్తాడంట” అని అందరూ అనుకోసాగినారు. మన జనాలంతా ‘ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు... మనమూ పోయి ఒక రాయేస్తే పోలా’ అనే రకం గదా... దాంతో ఆ వూరోళ్ళే గాక, చుట్టుపక్కల వూరోళ్ళు గూడా బండ్లు కట్టుకోని తిర్నాలలెక్క రాసాగినారు. “నాయనా.. నా కూతురి పెండ్లెప్పుడవుతాది, సామీ... మావోనికి వుద్యోగం ఎప్పుడు దొరుకుతాది, అయ్యా... నా దరిద్రం పోయే దారి సెప్పు, తండ్రీ.. ఈసారి ఏ పంట వేస్తే విరగబడి కాస్తాది..” ఇట్లా ఒకొక్కడు ఒకొక్కటి అడగడం మొదలుపెట్టినాడు. శాస్త్రి మామూలుగానే మాంచి తెలివైనోడు గదా... దాంతో బాగా ఆలోచించి జవాబులు సెప్పేటోడు. కొన్ని జరిగేవి. కొన్ని జరిగేవి కాదు. జరిగినోళ్ళు జరిగిన విషయం అందరికీ పడీ పడీ సెప్పేటోళ్ళు. జరగనోళ్ళు మన కర్మ ఇంతేలే.... అనుకోని వూరుకుండేటోళ్ళు. అట్లా కొన్ని రోజుల్లోనే మనోని కీర్తి ఇంటిగోడలు దాటి వూరి పొలిమేరలు దాటి, దేశాన్నేలే రాజు వరకూ పోయింది.

ఆరాజు దగ్గర ఒక రత్నాల హారముంది. అది తరతరాలుగా వాళ్ళ వంశంలో ఒకరి నుంచి ఒకరికి వస్తా వుంది. రాజుకి అదంటే చానా చానా ఇష్టం. పండుగలప్పుడు, ఉత్సవాలప్పుడు మెడలో వేసుకోని సంబరంగా తిరుగుతా వుంటాడు. అట్లాంటిది అది వున్నట్టుండి ఒకరోజు కనబడకుండా పోయింది. ఎంత వెదికినా, ఎంతమందిని విచారించినా దొరకలేదు. ఆ బాధతో రాజు మంచం పట్టేసినాడు. అప్పుడు అతనికి శాస్త్రి గురించి తెలిసింది. వెంటనే సైనికులని పంపించినాడు. వాళ్ళు శాస్త్రిని పిలుచుకోని రాజు ముందు నిలబెట్టినారు.

రాజు శాస్త్రి వైపు చూస్తా "చూడు... సామీ... మా వంశంలో ఎప్పుడూ జరగని అపచారం నా కాలంలో జరిగింది. ఎవరైనా వింటే నవ్విపోతారు. అంతఃపురాన్నే కాపాడుకోలేనోడు జనాల్ని ఏం కాపాడతాడని. నీ గురించి చానా విన్నా. నువ్వే ఎట్లాగైనా సరే నా మర్యాద నిలబెట్టాల. నీకు రేప్పొద్దున వరకు సమయమిస్తా వున్నా.. దొంగల్ని పట్టివా... నీకు బంగారంతో అభిషేకం చేయించి, ఏనుగు మీదెక్కించి వూరువూరంతా వూరేగిస్తా... లేదంటివా నీ ముక్కో చెవో కోయించి గాడిద మీదెక్కించి వూరిబైటకి తన్ని తరిమేస్తా..." అన్నాడు. ఆ మాటలకు శాస్త్రి గుండెలో రాయి పన్నట్లయింది. "ఒరే... మిడతంబొట్లూ... తప్పించుకోని పారిపోదామా అంటే ఇది అంతః పురం. చుట్టూ సైనికులున్నారు. ఇక తప్పదు. చెవో, ముక్కో ఏదో ఒకటి కోయించుకోవడం ఖాయంరా నువ్వు" అనుకుంటా గదికి చేరుకోని అద్దం ముందు నిలబడి "చెవా, ముక్కా... చెవా, ముక్కా" అనుకోసాగినాడు చూసుకుంటా.

ఆ అంతఃపురంలో పని చేసే దాసీలలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు వున్నారు. వాళ్ళు చూడ్డానికి చక్కని చుక్కల్లెక్క వుంటారు గానీ పెద్దదానికేమో ముక్కు పెద్దది. చిన్నదానికేమో చెవులు చిన్నవి. దాంతో అందరూ వాళ్ళని ఏయ్ చెవీ, ఏయ్ ముక్కూ అంటూ అడ్డపేర్లతో ఆట పట్టించేటోళ్ళు. వాళ్ళే ఆ రత్నాలహారాన్ని ఎవరూ లేని సమయంలో దొంగిలించింది. వాళ్ళకి శాస్త్రి వచ్చినప్పటి నుంచీ ఒగటే భయంగా వుంది. వూరువూరంతా వాని గొప్పతనం గురించి చెబుతా వుంటే వెన్నులో ఒణుకు వచ్చింది. దొరికామా వురిశిక్ష ఖాయం. దాంతో ఏం చేయాల్నో తోచక శాస్త్రి వున్న గది దగ్గరికి వచ్చి కిటికీలోంచి తొంగి చూసినారు. లోపల మనోడు "చెవా, ముక్కా... చెవా, ముక్కా" అని కొంచెం గట్టిగానే గొణుక్కుంటా వున్నాడు. ఆ మాటలినగానే వాళ్ళిద్దరూ అదిరిపన్నారు. "అయ్యబాబోయ్... శాస్త్రికి మన సంగతి తెలిసిపోయినట్లుంది. రాజుకి గనుక చెబితే ఈ రోజుతో మనకి భూమ్మీద నూకలు చెల్లిపోయినట్లే.. ఎట్లాగయినా సరే కాపాడి ఆపద నుంచి గట్టెక్కించమని అడుగుదాం" అనుకుంటా ఇద్దరూ లోపలికి పోయి శాస్త్రి కాళ్ళ మీద పన్నారు. "అయ్యా ... బుద్ధి పొరపాటై ఈ పని చేసినాం. ఎట్లాగైనా సరే మమ్మల్ని కాపాడండి" అంటూ, రత్నాలహారం తీసుకోనొచ్చి అతని చేతిలో పెట్టినారు. శాస్త్రి సరేనంటూ అందరూ పండుకున్నాక దాన్ని తీసుకోనిపోయి రాజు తోటలో ఒక చింతచెట్టు కింద గుంత తీసి కప్పి పెట్టినాడు.

తరువాతరోజు పొద్దున్నే సంబరంగా రాజు ముందుకి పోయినాడు. "ఏమి... శాస్త్రీ ... కనిపెట్టినావా" అన్నాడు రాజు ఆతృతగా. "హా.. మహారాజా... హారం కనబడుతోంది గానీ... దొంగ కనబడ్డం లేదు, బహుశా వాడు దేశం వదిలి పారిపోయినట్టున్నాడు" అని చెప్పినాడు. "సరే..సరే..దొంగదేముందిలేగానీ ముందు హారం సంగతి చెప్పు" అన్నాడు రాజు.

శాస్త్రి ఏవేవో లెక్కలు వేస్తున్నట్లు గాల్లో గీతలు గీస్తా, అటూ ఇటూ తిరుగుతా "మహారాజా ఈశాన్యం వైపున్న తోటలో ఏదో ఒక చింతచెట్టు కింద దాచినట్టు తెలుస్తా వుంది. భటుల్ని పంపించి అన్నింటి కిందా తవ్వించి చూడండి" అని చెప్పినాడు. రాజు అట్లే అని పోయి ఒకొక్క చెట్టు కింద తవ్విస్తా ఆఖరికి శాస్త్రి దాచిన చింతచెట్టు దగ్గరికి చేరుకున్నాడు. భటులు ఆడ తవ్వి చూడగానే ధగధగలాడుతా హారం బైటపడింది. దాన్ని చూడగానే రాజు సంబరంతో పొంగిపోయినాడు. ఆనందంతో కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. పరుగెత్తుకుంటా వచ్చి శాస్త్రిని గట్టిగా కౌగిలించుకోని "శాస్త్రీ... నువ్వు సామాన్యునివి కాదు. నీ అంత గొప్పోడు ముల్లోకాల్లోనూ యాడా వుండడు. నా పరువు, మరియాదా నిలబెట్టినావు" అంటా అప్పటికప్పుడు పట్టపుటేనుగును తెప్పించి, పట్టుబట్టలు తొడిగించి,

ముందూ వెనుకా తప్పెట్లు కొడతా వుంటే, వీధుల్లో అడుగడుగునా పూలు చల్లిస్తా, వూరువూరంతా దద్దరిల్లేటట్లు టపాకాయలు పేలిపిస్తా వూరేగించినాడు. ఆ తరువాత "శాస్త్రీ... ఇకపై నువ్వు నాతోబాటు ఈన్నే వుండు. నిన్ను నా మంత్రుల్లో ఒకనిగా నియమించుకుంటావున్నా" అని చెప్పినాడు. ఆ మాటల్తో శాస్త్రి గుండె దడదడలాడింది. ఒళ్ళంతా చెమటలు పట్టినాయి. కాదనలేక సరే అని అట్లాగే వుండిపోయినాడు. రాజుకు తన తెలివితేటలతో సలహాలు ఇస్తా నెట్టుకు రాసాగినాడు. కానీ శాస్త్రికి 'దినదినగండం నూరేళ్ళ ఆయుష్షు' అన్నట్టుగా ఎప్పుడు ఏ ఆపద ఏవైపు నుంచి వస్తుందో అని ఒగటే భయం. దాంతో ఎట్లాగైనా సరే దీన్నించి తప్పించుకోని ప్రశాంతంగా బతకాలని నిర్ణయించుకున్నాడు.

ఒకసారి రాజు శాస్త్రితో కలిసి తోటలో పచార్లు చేయసాగినాడు. ఎట్లాగైనా బైటపడ్డానికి ఇదే సరైన సమయమనుకోని "రాజా... ఎప్పటి నుంచో నీకు ఒక రహస్యం చెప్పాలనుకుంటావున్నా... నేను ఒక రోజు పోతా వుంటే ఒక ముని తపస్సు చేసుకుంటా కనబన్నాడు. అప్పుడే అటువైపు వచ్చిన ఒక పెద్దపులి ఆయనని చంపడానికి మీదకు దుంకింది. అది చూసి నేను ఏమాత్రం బెదపడకుండా నా దగ్గరున్న కట్టె తీసుకోని ఆ పులి మీదకు దుంకి దాన్ని ఆన్నించి తన్ని తరిమేసినా. దాంతో ఆ ముని నాకు కొన్ని అద్భుత శక్తులు ఇచ్చినాడు. కానీ అవి కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే పని చేస్తాయి. ఈ రోజుతో ఆ గడువు పూర్తవుతా వుంది. రేపటి నుంచీ నేనూ అందరిలాంటి మామూలు మానవున్నే కాబట్టి మీ దగ్గరిక కొలువు మానేసి నేనెవరో తెలీని కొత్తచోటుకు పోయి హాయిగా బ్రతుకుతా" అన్నాడు.

అంతలో రాజు ఎదుట వున్న పూవు మీద ఏదో వాలింది. రాజు లటుక్కున దాన్ని పట్టుకోని గుప్పిట మూసి "సరే... శాస్త్రీ.. రేపటి నుంచి గదా నీ శక్తులు మాయమయ్యేది. ఇదిగో ఇదే నీకు చివరి పరీక్ష. నా గుప్పిటలో ఏముందో చెప్పుకో. చెప్పావంటే నీవు మోయలేనంత బంగారమిచ్చి వీడ్కోలు పలుకుతా... లేదనుకో ఇంతవరకు నీకిచ్చినవన్నీ గూడా తీసేసుకోని కట్టుబట్టలతో వదులుతా" అన్నాడు. శాస్త్రికి ఎంత ఆలోచించినా అదేంటో అర్థం కాలేదు. దాంతో "ఛీ ఛీ... అదృష్టం ఎప్పుడూ మనవైపే వుండదు. ఈ రోజుతో దొరికిపోయినావురా మిడతంబొట్లూ" అని చిన్నగా గొణిగినాడు. పక్కనే వున్న రాజుకు ఆ మాటలు వినబన్నాయి. దాంతో అతను ఆచ్చర్యంగా "శభాష్.. శాస్త్రీ.. నిజంగా నీ శక్తి అద్భుతం. నేను పట్టింది మిడతనే" అంటూ చేయి తెరిచి చూపించినాడు. శాస్త్రి తన అదృష్టానికి మురిసిపోయినాడు. రాజు తాను ముందే చెప్పినట్టు మోయలేనంత బంగారమిచ్చి శాస్త్రికి వీడ్కోలు పలికినాడు. బ్రతుకు జీవుడా అనుకుంటా శాస్త్రి ఆ డబ్బంతా తీసుకోని రాత్రికి రాత్రి ఎవరికీ చెప్పకుండా పెండ్లాం బిడ్డల్తో కలిసి తనను ఎవరూ గుర్తుపట్టని రాజ్యానికి వెళ్ళిపోయి హాయిగా కాలు మీద కాలేసుకోని కులాసాగా బతకసాగినాడు.

# 115 నెయ్యి - పులగం

ఒకూర్లో ఒకడు ఉండేటోడు. వానికి చిన్నప్పుడే ఇంకా పేరు గూడా పెట్టకముందే వాళ్ళమ్మా నాయనా చచ్చిపోయినారు. దాంతో అందరూ వాన్ని 'రేయ్ రేయ్' అని పిలిచివాళ్ళు. వాడు నెమ్మదిగా పెరిగి పెద్దగయినాక తనలాగే ఎవరూ లేని ఇంకొకామెని చూసి పెండ్లి చేసుకున్నాడు.

పెండ్లయినాక కడపమానుదాటి లోపలికి పోయే ముందు మొగుని పేరు పెండ్లాం... పెండ్లాం పేరు మొగుడు చెప్పాల గదా! దాంతో వాని పేరు తెలీక ఆమె 'నీ పేరేమి' అనడిగింది. దానికి వాడు "ఏమోబ్బా నాకు తెలీదు. మా అమ్మానాన్న చిన్నప్పుడే పేరు పెట్టకముందే చచ్చిపోయినారు. ఇంతకూ నీ పేరేమి" అనడిగినాడు. దానికామె "మా అమ్మానాన్నా గూడా చిన్నప్పుడే చచ్చిపోయినారు. నాకు గూడా నీలాగే ఎవరూ పేరు పెట్టలేదు" అనింది.

దాంతో వాళ్ళిద్దరూ ఎవరూ పెట్టకుంటే ఏంలే, మనకు మనమే పెట్టుకుందాం అనుకోని ఆమెకు పులగమనీ, వానికి నెయ్యనీ, వాళ్ళ బరగొడ్డుకు దొంగనీ పేరు పెట్టుకున్నారు. ఆరోజు నుండీ వాళ్ళిద్దరూ ఏమే పులగం అంటే ఏమే నెయ్యా అని పిలుచుకుంటా హాయిగా వున్నారు.

ఒకరోజు ఒక దొంగ దొంగతనం చేయడానికని వీళ్ళ వూరికొచ్చినాడు. వాని కన్ను వీళ్ళింటి మీద పడింది. వాళ్ళకెవరూ లేరు గదా... దాంతో బంధువని చెప్పి మోసం చేసి ఇంట్లోవన్నీ మట్టసంగా ఎత్తుకోని పోవాలని అనుకున్నాడు.

నెయ్యి పొలం దున్నుతా వుంటే పోయి "ఏరా బాగున్నావా ఎంత కాలమయింది నిన్ను చూసి... నన్ను గుర్తుపట్టలేదా. మీ అమ్మకు వరుసకు తమ్ముడిని అవుతాను" అంటూ ఏవేవో దొంగమాటలు, దొంగ సంబంధాలు చెప్పినాడు. వాడు అవన్నీ నిజమనుకోని లేకలేక బంధువొచ్చినాడని సంబరపడి "ఇదింత దున్ని నే వస్తా గానీ నువ్వు ఇంటికి పో, ఇంటికాడ పులగముంటాది" అని చెప్పినాడు.

పులగమంటే వాని పెండ్లామని ఈ దొంగకు తెలీదు గదా, దాంతో ఓహో ఇంట్లో పులగం చేసినారన్నమాట. ఐతే పోయి బాగా మెక్కొచ్చులే అనుకోని సంబరంగా ఇంటికి పోయి జరిగిందంతా చెప్పినాడు. ఆమె గూడా నిజంగానే మొగుని తరుపు బంధువనుకోని కడుక్కోడానికి నీళ్ళిచ్చి కూచోడానికి మంచమేసి, ఆమాటా ఈమాటా మాట్లాడతా "ఇప్పుడే తింటావా లేక నెయ్యి వొచ్చినాక తింటావా అనడిగింది. నెయ్యంటే ఆమె మొగుడే అని వానికి తెలీదు గదా. దాంతో పులగంలో నెయ్యేసుకోని తింటే కమ్మగా వుంటాది అనుకోని "తొందరేం లేదులే నెయ్యొచ్చినాకనే తింటా" అన్నాడు.



కాసేపటికి నెయ్యి ఇంటికి వచ్చినాడు. వానికి ఇంటి బైట బరగొడ్డు తిరుగాడుతా కనబడింది. అది చూసి గట్టిగా పెండ్లాంతో" ఏమే... దొంగను అట్లా వదిలిపెట్టినావు. తాడు తీసుకోని తొందరగా రా కట్టేద్దాం" అని అరిచినాడు.

దొంగ అంటే బరగొడ్డని వానికి తెలీదు గదా. దాంతో వాడు "అయ్యబాబోయ్... నేను దొంగతనానికి వచ్చినేది వీనికి తెలిసిపోయినట్లుంది. అందుకే పెండ్లాంతో తాడు తెమ్మంటున్నాడు" అనుకోని అదిరిపడి వాళ్ళు ఆగు ఆగంటున్నా వినకుండా, వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయినాడు.

# 116 పుణ్యావతి - భాగ్యావతి

ఒకూర్లో ఒక రైతుండేటోడు. ఆయనకి ఇద్దరు ఆడపిల్లలు. ఒకరి పేరేమో పుణ్యావతి. మరొకరి పేరేమో భాగ్యావతి. వాళ్ళు చానా పేదోళ్ళు. ఒకరోజు సంక్రాంతి పండుగనాడు వాళ్ళిద్దరూ అడవిలో కట్టెపుల్లలు ఏరుకోని ఇంటికి వస్తా వుంటే దారిలో వాళ్ళకి ఒక గుడికాడ కొందరు ఆడవాళ్ళు పేదవాళ్ళందరినీ వరుసగా కూచోబెట్టి అన్నదానం చేస్తా వుండడం కన్పించింది.

అది చూసి పుణ్యావతి "అకా! అకా! మనం గూడా అట్లా అన్నదానం చేద్దామా" అనింది. దానికి భాగ్యావతి "ఎట్లానే?.. మన దగ్గర అంత డబ్బులు యాడున్నాయి" అనింది. దానికి పుణ్యావతి నవ్వి "పట్టుదలుండాలే గానీ సాధించలేనిదేముంటాది. వాళ్ళ లెక్క గొప్పగా చేయలేకపోయినా మనకున్న దాంట్లో ఈ సమ్మచ్చరం గాకపోయినా వచ్చే సమ్మచ్చరమన్నా చేద్దాం సరేనా" అనింది. అక్క గూడా 'సరే' అనింది.

అన్నదానం చేయాలంటే బాగా డబ్బులు కావాల గదా. దాంతో వాళ్ళు ఆ రోజు నుండీ తాము తిన్నా తినకపోయినా ఎంతో కొంత రోజూ దేముని దగ్గరి హుండీలో ఏయసాగినారు. అట్లా రోజులు వారాలై, వారాలు నెలలై నెమ్మదిగా సమ్మచ్చరం దగ్గర పడి మళ్ళా సంక్రాంతి పండుగ వచ్చింది. ఆరోజు వాళ్ళిద్దరూ పొద్దున్నే లేచి చెరువు దగ్గర శుభ్రంగా తలస్నానం చేసి, దేవునికి భక్తిగా మొక్కుకోని హుండీ పగలగొట్టి ఆ డబ్బుతో బచ్చాలకు, పరమాన్నానికి, సాంబారుకి, పప్పుకి కావాల్సినవన్నీ కొనుక్కోనొచ్చి అన్నీ చేసినారు. చేసినాక పేదోళ్ళందరినీ పిల్చుకోనొచ్చి చాలు చాలనేంతవరకు ఇంకొకటి ఇంకొకటి అనుకుంటా కడుపు నిండా పెట్టినారు.

ఆకాశంలో మొగున్తో రథమ్మీద పోతావున్న పార్వతీదేవి ఇది చూసి "సామీ! సామీ! ఆడ చూడు ఆ ఇద్దరు చిన్నపిల్లలు ఎంత కష్టపడతావున్నారో. మంచోళ్ళకి మంచి చేయడం, చెడ్డోళ్ళకి చెడు చేయడం ఇదే గదా మన పని. దా పోదాం వాళ్ళకేమన్నా మంచి చేసొద్దాం" అనింది.

శివుడు "ముందు వాళ్ళ భక్తి ఎంత గొప్పదో పరిశీలిద్దాం పా" అని ఇద్దరూ పేద ముసిలోళ్ళ వేషం వేసుకోని కిందకి దిగినారు. అప్పటికే ఆ అక్కాచెల్లెళ్ళు ఇంట్లో వున్నవన్నీ అందరికీ పెట్టేసి వున్న కొంచం అన్నం తలా ఇంత వేసుకోని తినడానికి కూచున్నారు.

అప్పుడు ఆ ముసిలోళ్ళు ఇంటి ముందు నిలబడి "అమ్మా ఆకలేస్తుందమ్మా... వూర్లో అందరినీ పిల్చి పెడ్తున్నారంట కదమ్మా. మాగ్గూడా కాస్త ఏమన్నా వుంటే పెట్టండమ్మా. ఎవరూ లేని ముసిలోల్లమమ్మా" అనరచినారు. అప్పటికే అందరికీ అన్నీ పెట్టేసినారు గదా... వాళ్ళు తినడానికి తప్ప ఇంట్లో ఏమీ లేవు. అయినాసరే ఆ అక్కాచెల్లెల్లిద్దరూ కడుపు నిండా వుత్తనీళ్ళు తాగి పళ్ళాల్లో పెట్టుకున్నవి పెట్టుకున్నట్టు మొత్తం తీసుకోనొచ్చి వాళ్ళకు పెట్టేసినారు.

అది చూసి ఆ ముసిలోళ్ళు "బంగారం లాంటి మనసు మీది" అని మెచ్చుకోని అన్నీ తిన్నాక మూడు పిడికెళ్ల ఇసక ఇచ్చి "మేం పోయినాక దేవునికి పూజ చేసి ఒక పిడికిలి మీ ఇంటి మీద, ఒక పిడికిలి మీ పేడదిబ్బ మీద... ఒక పిడికిలి మీ ఇంటి ముందున్న రాళ్ళ మీద చల్లండి" అని చెప్పి వెళ్ళిపోయినారు.

సరేనని వాళ్ళిద్దరూ దేవుని పూజ చేసి ఆ ఇసక తీసుకోని పోయి ఒక పిడికిలి వాళ్ళ కొట్టం మీద, మరో పిడికిలి వాళ్ళ పేడదిబ్బ మీద, మరో పిడికిలి ఇంటి ముందున్న రాళ్ళ మీద చల్లినారు. అంతే కొట్టం కాస్తా ఏడంతస్తుల మేడైంది. పేడముద్దలు కాస్తా బంగారు ముద్దలైనాయి. రాళ్ళేమో మణులూ, మాణిక్యాలుగా మారిపోయినాయి.

ఇంగ చూడు వాళ్ళ సంబరం సంబరం కాదు. వాళ్ళ నాయన అవన్నీ చూసి మురిసిపోయినాడు. అప్పటినుండీ అవసరమయినప్పుడల్లా ఒక రత్నమో, బంగారు ముద్దనో అమ్ముకుంటా హాయిగా బతకసాగినారు. ప్రతి సమ్మచ్చరం సంక్రాంతి పండగకు మాత్రం వూరు వూరంతా పిలిచి రకరకాల పిండివంటలతో విందుభోజనాలు పెట్టేటోళ్ళు.

అట్లా ఒకొక్క సమ్మచ్చరమే దాటీ దాటీ కొన్నేళ్ళకు ఆ అక్కాచెల్లెళ్లిద్దరూ పెరిగి పెద్దగయినారు. వాళ్ళ దగ్గర లెక్కలేనంత ధనముంది గదా. దానికితోడు వాళ్ళిద్దరూ అప్సరసల్లెక్క అందంగా వుంటారు. వాళ్ళ నాయన ఇద్దరు రాకుమారులకు వాళ్ళనిచ్చి వూరందరినీ పిలిచి ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగూ వేసి ఏడేడు పధ్నాలుగు లోకాలు 'ఆహా' అనేటట్లు పెండ్లి చేసినాడు.

పెండ్లయినాక ఎవరికి వాళ్ళు వాళ్ళ అత్తోళ్ళ ఇంటికి పోవాలగదా. వాళ్ళ నాయన అక్కనేమో పడమర దేశానికిస్తే, చెల్లెలినేమో తూర్పు దేశానికి ఇచ్చినాడు. రెండూ చానా దూరం. అందుకని వాళ్ళిద్దరూ గుర్తుగా ఒకరి వుంగరాలు ఇంకొకరు మార్చుకోని కండ్లనీళ్ళు పెట్టుకోని తిరిగి తిరిగి చూసుకుంటా ఎవరి రాజ్యానికి వాళ్ళు వెళ్ళిపోయినారు.

అట్లా వెళ్ళిపోయినాక మళ్ళా కొంతకాలానికి సంక్రాంతి పండుగ వచ్చింది. పుణ్యావతి మొగునికి చెప్పి వూర్లో వుండే పేదోళ్ళందరినీ పిలిచి అన్నదానం చేసింది. భాగ్యావతి కూడా అట్లాగే చేద్దామని మొగునికి చెప్పింది. కానీ ఆమె మొగునికి పేదప్రజలంటే అస్సలిష్టం లేదు. దాంతో "ఛీ!...ఛీ!... ఏందిదంతా... అన్నదానం లేదు, గిన్నదానం లేదు..." అనరిచినాడు. అప్పటి నుంచీ ఆమె మొగునికి భయపడి అన్నదానమన్నమాటే మరచిపోయింది.

ఒకరోజు పక్కూరి రాజు భాగ్యావతి వాళ్ళ రాజ్యం మీదకి దండయాత్రకొచ్చినాడు. భాగ్యావతి మొగుడు పెద్ద సైన్యాన్ని తీసుకోని యుద్ధానికి పోయినాడు గానీ వాళ్ళతో పోరాడలేక ఓడిపోయినాడు. శత్రువులకు చిక్కితే చంపుతారు గదా దాంతో ఎవరికీ చిక్కకుండా పారిపోయినాడు. అప్పటికే భాగ్యావతి కడుపుతో వుంది. మొగుడు ఓడిపోయినేది తెల్సుకోని ఆమె గూడా శత్రువులు కోటలోకి రాకముందే రాజ్యమిడిచి పారిపోయి ఎవరి కంటా పడకుండా ఒక చిన్నపల్లెలో దాచిపెట్టుకోనింది.

కొంతకాలానికి ఆమెకు అక్కన్నే ఒక కొడుకు పుట్టినాడు. భాగ్యావతి ఆ ఇంట్లో, ఈ యింట్లో పని చేస్తా కొడుకుని పెంచి పెద్ద చేయసాగింది. అట్లా పదైదేండ్లు గడిచిపోయినాయి.

ఒకరోజు ఆ పిల్లోడు వాళ్ళమ్మతో "అమా! అమా! నేను పుట్టినప్పటినుండీ చూస్తా వున్నా. మనమొకరింటికి పొయ్యిందీ లేదు, వేరొకరు మనింటికి వచ్చిందీ లేదు. మనకెవరూ బంధువుల్లేరా" అనడిగినాడు.

దానికి వాళ్ళమ్మ కండ్లనీళ్ళు పెట్టుకోని "ఎందుకు లేర్రా! మీ నాయన యాడున్నాడో ఏమయిపోయినాడో తెలియదుగానీ నీకో పెద్దమ్మ వుంది. ఈడికి ఏడువందల మైళ్ళ దూరంలో వుండే పడమర దేశానికి ఆమె రాణి" అని చెప్పింది. దాంతో వాడు "అమా! అమా! నేను పోయి పెద్దమ్మనోసారి చూసొస్తా" అన్నాడు. ఆమె సరేనని వాళ్ళు విడిపోయేటప్పుడు మార్చుకున్న వుంగరం కొడుక్కిచ్చి "రేయ్! దీన్ని మీ పెద్దమ్మకు చూపియ్యి, నిన్ను గుర్తుపడ్తాది" అని చెప్పింది.

సరేనని వాడు వాళ్ళమ్మ చేసిచ్చినేటివన్నీ మూటగట్టుకోని బైలుదేరినాడు. ఏడువందల మైళ్ళంటే చానా దూరంగదా. తింటా నడుస్తా... తింటా నడుస్తా... ఒకొక్క వూరే దాటుకుంటా ఆఖరికి ఒక నెలకల్లా ఆ పడమర దేశానికి చేరుకున్నాడు. చేరుకోని కోట లోపలికి పోతా వుంటే వాని మాసిపోయిన బట్టలు చూసి రాజ సైనికులు లోపలికి పోనియ్యలేదు.

ఎట్లాగబ్బా లోపలికి పోవడం అని బైటే కూచోని ఆలోచిస్తా వుంటే రాణి ఇంట్లో పని చేసే దాసీలు కొందరు నీళ్ళకని సంకలో బిందెలు పెట్టుకోని చెరువుకాడికి పోవడం కనబడింది. వెంటనే వాడు వురుక్కుంటా ఒకామె దగ్గరకి పోయి "అమా! అమా!... నేను మహారాణి చెల్లెలి కొడుకుని. నన్ను లోపలికి రానియ్యడం లేదు. కాస్త రాణికి చెప్పు" అన్నాడు. దానికి అందరూ వాని గుడ్డలు చూసి నవ్వుతా "నువ్వు మా రాణి చెల్లెలి కొడుకువా? మొగం చూడు ఎట్లా వుందో" అని ఎక్కిరించినారు. వాడు ఎన్ని చెప్పినా నమ్మకపోయేసరికి ఇట్లా కాదనుకోని వాళ్ళమ్మ ఇచ్చిన వుంగరం తీసి ఎవరూ చూడకుండా ఒకామె కడవలో ఏసి గమ్మున కూచున్నాడు.

దాసీలందరూ కడవల్తో నీళ్ళు తీసుకోని పోయి రాణిగారింట్లో బానలో పోస్తా వున్నారు. ఈ వుంగరమేసినామె గూడా అందరిలాగే పోస్తా వుంటే టప్పుమని చప్పుడయ్యింది. ఆ చప్పుడు విని రాణి "ఏమే! నీళ్ళు తెమ్మంటే నీళ్ళతో బాటు రాళ్ళు గూడా తెస్తున్నావా ఏమి" అని బానలో చేయి పెట్టి వెదికితే వుంగరం దొరికింది. ఆ వుంగరం ఆమె తన గుర్తుగా చెల్లెలికిచ్చినేది గదా! దాంతో ఆచ్చర్యపోయి ఆ దాసీతో "ఇది మా చెల్లెలికి నేనిచ్చినేది. నీ కడవలోకి ఎట్లా వచ్చింది" అనడిగింది. అప్పుడా దాసి జరిగిందంతా చెప్పింది.

రాణి వెంటనే భటులను పిలిచి ఆ పిల్లోన్ని గౌరవంగా లోపలికి పిలుచుకోని రమ్మనింది. రాగానే వానికి బాగా తలస్నానం చేపిచ్చి, ముచ్చటయిన పట్టుబట్టలు కట్టిచ్చి, రకరకాల వంటలతో విందుభోజనం పెట్టి, ప్రేమగా దగ్గర కూచోబెట్టుకోని "ఏరా! మీ అమ్మా నాయనా బాగున్నారా! నువ్వేంది ఇట్లా ఒక్కనివే ఒంటరిగా వచ్చినావు! ఏం జరిగింది" అనడిగింది. వాడు జరిగిందంతా చెప్పినాడు. ఆమె "అయ్యో పాపం" అని బాధపడింది.

వాడు వాళ్ళ పెద్దమ్మ దగ్గర ఒక నాలుగు వారాలుండి "ఇంగ నేను పోయొస్తా పెద్దమ్మా! ఇప్పటికే ఇల్లు విడిచి చానా రోజులయింది" అన్నాడు. ఆమె సరేనని లోపలికి పోయి ఒక పెద్ద సొరకాయ తీసుకోనొచ్చి లోపలున్న గుజ్జంతా తీసేసి దాన్నిండా బంగారు వరహాలు పెట్టి "రేయ్! జాగ్రత్త. ఇది యాడా పోగొట్టుకోకుండా ఇంటికి తీసుకోని పోయి మీ అమ్మకియ్యి" అని చెప్పింది.

"సరే" అని వాడు సొరకాయ తీసుకోని పోతా వుంటే అడవిలో ఒకరోజు ఒక పెద్ద దొంగల గుంపు ఎదురయింది. వాళ్ళు మీద పడి వాన్నంతా వెదికి ఏం దొరకక పోయేసరికి సొరకాయ గుంజుకోని పంపిచ్చినారు.

వాడు కండ్లనీళ్ళు పెట్టుకోని తిరిగి పెద్దమ్మ ఇంటికాడికొచ్చి జరిగిందంతా చెప్పినాడు. ఆమె "సర్లే! పోయిందేదో పోయింది. ఏడ్చొద్దు" అని చెప్పి తరువాత రోజు ఒక రాగి చెంబు నిండా వజ్రాలు, రత్నాలు పోసి ఎవరికీ కనబడకుండా పైన బట్టకట్టి "ఇదిగో ఈ చెంబు తీసుకోని పోయి మీ అమ్మకియ్యి" అని చెప్పింది.

"సరే" అని వాడు ఆ చెంబు తీసుకోని పోతావుంటే దారిలో వానికి బాగా దాహమయింది. దాంతో ఒక బావి మీద చెంబు పెట్టి నీళ్ళు తోడుకుంటా వుంటే పొరపాటున చేయి తగిలి అది లటుక్కున బావిలో పడిపోయింది. దాని కోసం వాడు బావిలోకి దిగి ఎంత వెదికినా అది దొరకలేదు. దాంతో వాడు కండ్లనీళ్ళు పెట్టుకోని తిరిగి పెద్దమ్మ ఇంటికొచ్చి జరిగిందంతా చెప్పినాడు.

దానికామె ఆచ్చర్యపోయి "ఇదేందబ్బా! వీళ్ళకు ఎంత మేలు చేద్దామనుకున్నా దరిద్రం ఇట్లా పట్టుకోనింది" అని ఆచ్చర్యపోయి "సర్లే నాయనా రేపు సంక్రాంతి పండగ. పండగ ఈన్నే చేసుకోని మర్నాడు పోదువులే" అనింది. వాళ్ళింట్లో పండగలూ, పబ్బాలూ ఏమీ చేయరుగదా. దాంతో వాడు ఆచ్చర్యంగా "అదేం పండగ పెద్దమ్మా... మా యింట్లో ఎప్పుడూ చెయ్యలేదే" అన్నాడు.

దాంతో ఆమె "ఓహో! ఇందుకా వీళ్ళిట్లా నాశనమైపోయింది" అనుకోని తర్వాతిరోజు వాన్తోనే వూర్లో వాళ్ళందరికీ అన్నదానం చేపిచ్చి "రేయ్! నువ్వు పోయి మీ అమ్మతో ఏది చేసినా చేయకపోయినా సంక్రాంతి పండగకు పేదోళ్ళకు అన్నదానం చేయడం మాత్రం మరచిపోవద్దని చెప్పు" అనింది. "సరే" అని వాడు తిరిగి బైలుదేరినాడు.

అట్లా అడవిలో పోతా పోతా వుంటే నడిచీ నడిచీ వానికి బాగా దాహమైంది. ఇంతకు ముందు చెంబు పోగొట్టుకున్న బావి కనబడింది. నీళ్ళు తాగుదామని బకీట లోపలికేసినాడు. తీసి చూస్తే ఇంగేముంది నీళ్ళతోబాటు అంతకు ముందు పడిపోయిన వజ్రాలున్న రాగి చెంబు కూడా అందులో కనబడింది.

వాడు సంబరంగా నీళ్ళు తాగి దాన్ని తీస్కోని పోతా వుంటే దారి మధ్యలో దొంగల గుంపు మళ్ళా ఎదురయ్యింది. వాళ్ళు వాన్ని పట్టుకోని చేతిలోని చెంబు గుంజుకుంటా వుంటే అప్పుడే అటువైపు వేటకొచ్చిన ఆ వూరి సైనికులు చూసి దొంగల మీద పడి వాళ్ళను మెత్తగా తన్ని చెంబుతో పాటు వాళ్ళ దగ్గరున్న సొరకాయ కూడా తిరిగిచ్చినారు.

వాడు అవన్నీ తీస్కోని ఇంటికొచ్చి "అమా! అమా! మన కష్టాలన్నిటికీ కారణం మనం సంక్రాంతి పండగకు పేదోళ్ళకి అన్నదానం చేయకపోవడమేనంట. పెద్దమ్మ చెప్పింది" అని చెప్పినాడు.

ఆమె అక్క పంపిన బంగారమంతా అట్లనే పక్కకు పెట్టి ఆరోజు నుండీ తిన్నా తినకపోయినా ఎంతో కొంత దాచిపెట్ట సాగింది. అట్లా సమ్మచ్చరం కాగానే తాను కష్టపడి సంపాదించిన డబ్బుతో పేదోళ్ళందరికీ అన్నదానం చేసి, అక్క పంపిన బంగారం గూడా వాళ్ళకే ఇచ్చేసింది. అట్లా ఒకొక్కరికీ అన్నం పెడ్తా పోతా వుంటే ఒకచోట ఒకడు మూలుగుతా జ్వరంతో ఒణుకుతా కిందపడి కనబన్నాడు.

"ఎవరబ్బా పాపం అట్లా వణుకుతా వున్నాడు" అని దగ్గరికి పోయి చూస్తే ఇంకేముంది... ఆమె మొగుడే... పారిపోయినప్పట్నించీ పెండ్లాం పిల్లలు యాడున్నారో తెలియక ఒకొక్క వూరే వెదుక్కుంటా ఆఖరికి ఇక్కడికి వచ్చినాడు. ఏదేమయితేనేం అట్లా ఆ రోజు మళ్ళా అందరూ కలుసుకున్నారు.

ఆమె వెంటనే మొగున్ని, కొడుకుని తీస్కోని అక్క దగ్గరికి పోయి జరిగిందంతా చెప్పింది. అప్పుడామె ఆమె మొగునికి చెప్పి చెల్లెలి మొగునికి పెద్ద సైన్యాన్నిచ్చి యుద్ధానికి పంపిచ్చింది. యుద్ధంలో వాళ్ళు శత్రువులను చంపి మళ్ళా తమ రాజ్యాన్ని తాము సంపాదించుకున్నారు.

అప్పటి నుండి ప్రతి సంక్రాంతికి దేశంలో వున్న పేదలందరికీ అన్నదానం చేస్తా తమ దగ్గరున్నదంతా వాళ్ళకి పంచి పెడ్తా ఎప్పుడు ఎక్కడ ఎవరికి ఏ కష్టమొచ్చినా ఆదుకుంటా మంచి రాజుగా పేరు తెచ్చుకున్నాడు.

# 117 ఆహా - అబ్బా

ఒక వూరిలో ఒక వ్యాపారి వుండేటోడు. వాడు పెద్ద పిసినారి. మోసగాడు. తన దగ్గర పని చేసేవాళ్ళకు డబ్బులు సరిగా ఇవ్వకుండా ఎగ్గొట్టేవాడు. దాంతో ఎవరూ వాని వద్ద పనికి చేరేవారు కాదు.

ఆ ఊరిలో గోపాలు అనే పిల్లోడు వుండేటోడు. వాడు చానా మంచోడు. అమాయకుడు. ఏది చెప్పినా వంచిన తల ఎత్తకుండా చేసేవాడు. వాడు ఒకసారి పని కోసమని ఆ పీనాసి వ్యాపారి దగ్గరికి పోయినాడు. వ్యాపారి ఆ పిల్లోని అమాయకత్వం గమనించి “సరే... ఇస్తాగానీ... నేను ఏ పని చెప్పినా వంక పెట్టకుండా మొత్తం చెయ్యాల. ఎందుకు, ఏమిటి, ఎట్లా... అంటూ ఎదురు అడగ్గాదదు. అట్లా చేస్తేనే జీతమిచ్చేది. ఎగ్గొట్తే మాత్రం ఒక్కపైసా గూడా ఇవ్వను. ఏం సరేనా” అన్నాడు. గోపాలుకు వాని గురించి తెలీదు కదా... దాంతో ‘సరే’ అన్నాడు.

ఆరోజు నుంచీ ఇంట్లో, అంగట్లో ఏ పని చెబితే ఆపని మారు మాట్లాడకుండా చేయసాగినాడు. నెల గడిచింది. జీతం కోసం అడిగితే ‘ఈ నెల వ్యాపారం అంత బాగా లేదు. వచ్చే నెల ఒకేసారి ఇస్తాలే’ అన్నాడు. గోపాలు అలాగేనంటూ మారు మాట్లాడకుండా పని చేయసాగినాడు. అట్లా ఆ నెల గూడా గడిచిపోయింది. అయినా వ్యాపారి జీతం ఇవ్వక “యాడికి పోతాయిలేవోయ్ డబ్బులు. నేనేమన్నా పారిపోతానా... ముచ్చటగా మూడు నెల్లదీ కలిపి ఒకేసారి ఇస్తాలే” అన్నాడు. అట్లా ప్రతినెలా ఏదో ఒకటి చెబ్తా వున్నాడే గానీ చేతిలో మాత్రం చిల్లిగవ్వ గూడా పెట్టలేదు. మాటల్తోనే సంవత్సరం దాటిచ్చినాడు. దాంతో గోపాలు ఇంక లాభం లేదనుకోని విషయమంతా చెప్పి వూరిలోని పెద్ద మనుషులందరినీ పిలుచుకోనొచ్చినాడు.

అప్పుడా వ్యాపారి “సరే... ఇస్తాలే గానీ ఇంక ఇది ఆఖరి పని. మా ఒప్పందం ప్రకారం ఏ పని చెప్పినా కాదు కూడదు, ఎందుకు ఏమిటి అని అడగకుండా చేయాల. ఏ మాత్రం వెనక్కు తగ్గినా ఒక్కపైసా గూడా ఇచ్చేది లేదు” అన్నాడు.

దానికి గోపాలు “అవునయ్యా... నిజమే... ఈ రోజు వరకూ మీ మాట ఎప్పుడు కాదంటి. చెప్పండి ఏం చేయాల్నో” అన్నాడు. అప్పుడా వ్యాపారి “నాకు ఆహా... అబ్బాలు కావాలి. అవి తెచ్చిచ్చి నీ డబ్బులు నీవు తీసుకోనిపో” అన్నాడు. ఆ మాటలకు గోపాలు అదిరిపన్నాడు. నోటమాట రాలేదు. “వీడు తక్కువోడు కాదురా. ఏదో ఒక మెలిక పెట్టకుండా వూరుకోడు” అనుకున్నారు వచ్చిన జనాలంతా. గోపాలుకు ఈ ఆహాలు, అబ్బాలు యాడ దొరుకుతాయో అర్థంకాక కనబన్న వారినంతా అడగసాగినాడు.

అట్లా అడుక్కుంటా పోతా వుంటే ఒక ముసిలోడు జరిగిందంతా విని "రేయ్... మనకు కుడిపక్క ఏడూర్ల తరువాత టక్కుపల్లిలో సుబ్బయ్య అని ఒకాయన వున్నాడు. ఆయనది అట్లాంటిట్లాంటి తెలివి కాదు. ఎటువంటి చిక్కు సమస్యనైనా చిటికెలో విప్పేయగలడు. ఆయన దగ్గరికి పో. నీకు దారి చూపిస్తాడు" అని చెప్పినాడు.

గోపాలు పొద్దున్నే లేసి సద్ది కట్టుకోని టక్కుపల్లికి బైలుదేరినాడు. ఎండ నడినెత్తికొచ్చే యాళకి సుబ్బయ్యను చేరుకోని జరిగిందంతా చెప్పినాడు. టక్కుపల్లి సుబ్బయ్యకు వ్యాపారి చేస్తావున్న మోసం మీద కోపం, గోపాలు అమాయకత్వం మీద జాలీ కలిగినాయి. దాంతో బాగా ఆలోచించి లోపలికి పోయి పైన బట్ట కట్టి వున్న రెండు మట్టి ముంతలను తీసుకోనొచ్చి గోపాలు చేతిలో పెట్టి "పో... పోయి నీ యజమానిని వీటిని ఒకదాని తర్వాత ఒకటి తెరవమను. ఆహాలు, అబ్బాలు దొరుకుతాయి" అని చెప్పినాడు.

గోపాలు ఆ రెండు ముంతలు తీసుకోని తిరిగి వ్యాపారి దగ్గరికి చేరుకున్నాడు. "ఇదేదో... వింత... చూద్దామాగు" అని ఊరి జనాలంతా పిల్లా జెల్లాను సంకకెక్కించుకోని వ్యాపారి ఇంటి ముందు మూగబన్నారు. వ్యాపారి అందరి ముందూ ఒక ముంతకున్న బట్ట తొలగించినాడు.

అంతే... అందులోనుంచి రెండు చూడముచ్చటయిన రంగురంగుల సీతాకోకచిలుకలు రెక్కలు టపటపా కొట్టుకుంటా బైటకి ఎగిరి వచ్చినాయి. ఆ అందమైన సీతాకోకచిలుకలని చూసి వ్యాపారి "ఆహా... అద్భుతం. ఎంత బాగున్నాయివి" అన్నాడు. వెంటనే గోపాలు నవ్వుతా "అయ్యా... మీరు చెప్పినట్లే ఆహా ఇచ్చినాను. ఇక అది గూడా తెరవండి అబ్బా గూడా దొరుకుతుంది" అన్నాడు.

ఆ మాటలకు వ్యాపారి "అరెరే... అనవసరంగా నోరు జారి 'ఆహా' అన్నానే. ఇక 'అబ్బా' మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గూడా అనకూడదు" అని అనుకున్నాడు. నోరు బిగబట్టుకోని రెండవదాని మూతికున్న బట్ట తొలగించినాడు. కానీ దానిలోంచి ఏమీ బైటకు రాలేదు. దాంతో "ఏందిరా... ఏమీ రాలేదు. అసలిందులో ఏమన్నా వున్నాయా... లేదా" అంటూ లోపలికి చేయి పెట్టినాడు.

అంతే... ఎప్పట్నుంచో బైటకు రాలేక లోపల తనకలాడుతా వున్న ఒక పెద్దతేలు చేయి లోపలికి పెట్టడం ఆలస్యం కోపంతో వేలు మీద కసుక్కున ఒక్కటేసింది.

ఇంకేముంది...

సుర్రుమనేసరికి నొప్పికి తట్టుకోలేక వాడు "అబ్బా..." అంటూ గట్టిగా అరిచినాడు. అది చూసి గోపాలు నవ్వుతా "అయ్యా నీవు కోరినట్లే అబ్బా గూడా ఇచ్చినాను. ఇంక నా డబ్బులు నాకియ్యండి" అన్నాడు.

ఇదంతా చూసిన వూరోళ్ళందరూ "అబ్బా ఏం కొట్టినాడ్రా దెబ్బ. తెలివంటే టక్కుపల్లి సుబ్బయ్యదే" అని కిందామీదాపడి నవ్వసాగినారు. వ్యాపారి లబలబలాడుతా లోపలికి పోయి గోపాలుకు ఇవ్వవలసిందంతా తెచ్చి ఇచ్చేసినాడు. ఆ డబ్బులన్నీ తీసుకోని గోపాలు నవ్వుకుంటా పోతా వుంటే... ఆ వ్యాపారి మాత్రం నొప్పికి ఏడ్చుకుంటా ఆన్నే వుండిపోయినాడు.

# 118 తిక్క పెండ్లాం

ఒకూర్లో ఒకామె వుండేది. ఆమె పెద్ద తిక్కల్ది. తిక్కల్దంటే తెలుసు గదా... లోకజ్ఞానముండదు. మనమొకటి చెప్తే వాళ్ళొకటి చేస్తా వుంటారు. తెలివితేటలు అస్సలుండవు. అంటే పెద్ద అమాయకురాలన్నమాట. సరే ఆమె పెరిగి పెద్దగయింది. పెద్దగయినాక పెండ్లి చేయాల గదా... దాంతో వాళ్ళమ్మానాన్నా ఆమె తిక్కల్దనే సంగతి దాచిపెట్టి ఒకనికి అడిగినంత కట్నమిచ్చి పెండ్లి చేసి కాపురానికి పంపిచ్చినారు.

ఒకరోజు వాడు పెండ్లాన్ని పిల్చి 'ఏమే... నేను చేనుకాడికి పోతా వున్నా... మధ్యాన్నానికి అన్నం చేసుకోని ఆడికే తీసుకోనిరా' అని చెప్పి పోయినాడు. సరేనని ఆమె మొగుడు చెప్పినట్లే మధ్యాన్నానికంతా అన్నం పప్పు చేసుకోని మూటగట్టుకోని... పోయేటప్పుడు తాళమేద్దామని తలుపులు మూయబోయింది. అవి చానా పాతవి. దాంతో ఏసేటప్పుడు కిర్రు... కిర్రు.. మని చప్పుడు చేసినాయి.


ఆమె పెద్ద తిక్కల్దిగదా... దాంతో ఆ చప్పుడు విని "అరెరే... నేను పోతా వుంటే ఇవి వద్దువద్దని ఏడుస్తున్నట్టున్నాయే..." అని తలుపుల దగ్గరికి పోయి " లేదులేమ్మా... ఇప్పుడే అట్లా పోయి ఇట్లా వస్తా... ఏడ్చుమాకండి" అని చెప్పి మళ్ళా మూయబోయింది. మళ్ళా అవి కిర్రు.. కిర్రు... మన్నాయి. దాంతో ఆమె "సరే... సరే... ఏడ్చొద్దండి. మిమ్మల్ని గూడా తీసుకోనిపోతాలే నాయెంట" అని గునపం తీసుకోనొచ్చి తలుపులు పెరికి దాండ్లను గూడా నెత్తిన పెట్టుకోని చేనుకు బైలుదేరింది.

నెత్తిన తలుపులు పెట్టుకోని వస్తా వున్న పెండ్లాన్ని చూసి వాడదిరిపడి "ఏందే... ఇట్లా తలుపులు తీసుకోనొస్తా వున్నావు" అన్నాడు ఆచ్చర్యంగా. దానికామె " ఏం చేయమంటావ్... వస్తా వుంటే ఇవి కిర్రు.. కిర్రు... మని ఏడుస్తా... మేమొస్తాం... మేమొస్తాం... అంటా వుంటే పాపమని పెరుక్కోనొచ్చినా" అని చెప్పింది. వాడు లబలబలబ నోరు కొట్టుకుంటూ " తలుపుల్లేకుండా ఇంటినట్లా వదిలేసి వస్తే ఇంగేమన్నా వుందా... ఎవరన్నా చూసినారంటే మట్టసంగా ఇంట్లో వున్నవన్నీ నున్నగా నూక్కపోతారు. నువ్వెంత తిక్కల్దానిలా వున్నావే" అంటూ ఆ తలుపులు ఎత్తుకోని ఇంటికి గబగబా వురికినాడు.

ఆమె ఆన్నే కూచోని అటూ ఇటూ చూడసాగింది. అంతలో ఆడ ఒక ఎద్దు వుచ్చ పోయసాగింది. అది చూసి ఆమె "అరెరెరే... దీనికి బొక్క పన్నట్టుంది. అందుకే నీళ్ళు సర్రున కారిపోతా వున్నాయి. పాపం" అనుకోని గబగబా కొత్తచీర సగం చింపి గట్టిగా కట్టు కట్టింది.

కాసేపటికి వాడు ఇంటి దగ్గర మళ్ళా తలుపులు బిగించి తాళమేసుకోని చేనుకాడికి వచ్చినాడు. వచ్చి చూస్తే పెండ్లాం యాడా కనబళ్ళేదు. యాడికి పోయిందబ్బా అని చుట్టూ చూస్తా వుంటే బండల చాటున

దాచిపెట్టుకోని కనబడింది. "ఏందే ... ఆడున్నావ్" అనడిగినాడు. దానికామె " మన ఎద్దుకు పెద్ద బొక్క పడింది. అందుకే సర్రున నీళ్ళు కారిపోతా వుంటే చీర చించి కట్టు కట్టినా... ఒంటి మీద సగం చీరనే వుంది. ఇంటికి పోయి వేరే చీర తేపో" అనింది. వాడు లబలబలబ నోరు కొట్టుకుంటా " నువ్వేం తిక్కల్దానివే... ఎద్దేంది... బొక్క



పడ్డమేంది... అనవసరంగా బంగారం లాంటి కొత్తచీర చినగ్గొట్టినావ్ గదా" అని వురుక్కుంటా మళ్ళీ ఇంటికి పోయి చీర తీసుకోనొచ్చి ఆమెకిచ్చినాడు. ఆమె దాన్ని కట్టుకోని ఇంటికి పోయింది.

ఇంటి దగ్గర కూచోని వచ్చే పోయేవాళ్ళని చూస్తా వుంటే ఒకడు "తేనెమ్మా ... తేనె" అని అమ్ముకుంటా కనబన్నాడు. ఆమెకు నోట్లో నీళ్ళూరి వాన్ని పిల్చి "అనా... అనా.. కొంచం తేనె ఇయ్యి" అనడిగింది. దానికి వాడు "వూరికే ఎవరిస్తారమ్మా... ఏమన్నా ఇస్తే ఇస్తా" అన్నాడు. ఆమె పెద్ద తిక్కల్ది గదా... వెంటనే ఇంటి ముందు కట్టేసిన బరగొడ్డును చూపించి "అదిగో... అది తీసుకోని పొయ్యి" అనింది.

వాడు అటూ ఇటూ చూసి ఇదేదో పెద్ద తిక్కల్దాని లెక్కుందనుకుంటా "సరే... దేంట్లో పోయాల" అన్నాడు. ఆమె నోరు తెరచి "నోట్లో పొయ్యి" అనింది. వాడు కొంచెం నోట్లో పోసినాడు. దాన్ని తాగి "నా మొగునికి గూడా కొంచం పోయి... వచ్చినాక ఇస్తా" అని మరికొంచం నోట్లో పోపిచ్చుకోనింది. వాడు సంబరంగా బరగొడ్డును విప్పుకోని ఆన్నించి బెరబెరా తోలుకోని ఎళ్ళిపోయినాడు.

ఆమె నోట్లో తేనె పోసుకోని దాన్ని మింగకుండా అట్లే పెట్టుకోని మొగుని కోసం ఎదురు చూడసాగింది. వాడు సాయంత్రందాకా చేన్లో పని చేసీ... చేసీ... అలసిపోయి చీకటి పడే ముందు ఇంటికొచ్చినాడు. వచ్చి చూస్తే ఇంగేముంది ఇంటి ముందు బరగొడ్డు కనబల్లేదు.

' ఏమే... బరగొడ్డు కనబడ్డం లేదు... యాడికి పోయిందే" అనడిగితే ఆమె నోటి నిండా తేనుంది గదా... దాంతో వూ... వూ... అంటాదే గాని ఒక్కమాటా మాట్లాడదు.

దాంతో వాడు " నేనింత నెత్తీనోరు కొట్టుకోని అడుగుతా వుంటే... వూవూ అంటావేగానీ... ఒక్కమాటా మాట్లాడవే... ఎంత పొగరు నీకు... వుండు నీ పని చెబ్తా" అంటా కోపంగా ఆమెను వంగబెట్టి దభీదభీమని వీపు మీద నాలుగు గుద్దులు గుద్దినాడు. అంతే... ఆ దెబ్బలకు ఆమె నోట్లో వున్న తేనెను గుటుక్కున మింగేసింది. మింగేసి "నీ కోసమని మధ్యాన్నం నుండీ మింగకుండా అట్లే పెట్టుకోని చూస్తా వుంటే మెచ్చుకోవలసింది పోయి... నన్నే తంతావా... వుండు నీ పని చెబ్తా" అని వురుక్కుంటా లోపలికి పోయి రోకలిబండ తీసుకోనొచ్చి మొగున్ని దభీదభీమని నాలుగు పెరికింది.

దాన్తో వాడు "థూ... థూ... ఈ తిక్కదాంతో ఈ ఇంట్లో వుండడం కన్నా పోయి ఆ అడవిలో వుండడం మేలు" అనుకోని వచ్చినోడు వచ్చినట్లే వెనక్కి తిరిగి వెళ్ళిపోయినాడు.

వాడు అడవిలో పోతాపోతా వుంటే కాసేపటికి బాగా చీకటి పడింది. చీకట్లో తిరగడం మంచిది కాదుగదా... దాంతో ఏం చేయాలబ్బా అని ఆలోచిస్తా వుంటే ఒకచోట ఒక పాడుబన్న గుడి కనబడింది. "ఈ రాత్రికి ఈడ పండుకోని రేప్పొద్దన్నే పోదాం" అనుకోని లోపలికి పోయి పండుకున్నాడు.

అర్ధరాత్రి దాట్నాక నిద్రలో ఏవో చప్పుళ్ళు వినబడి లేచినాడు. ఏందబ్బా ఈ రాత్రిపూట అని మట్టసంగా చప్పుడు కాకుండా అడుగులో అడుగేసుకుంటా బైటకొచ్చి చూస్తే... కొంతమంది దొంగలు అరుచుకుంటా, మాట్లాడుకుంటా అన్నం తింటా కనబన్నారు. వాళ్ళ పక్కనే కొన్ని గాడిదల మీద ఎక్కడెక్కడో దోచుకొచ్చిన బంగారమంతా వుంది. వాడు లోపల్నే దాచిపెట్టుకోని అట్లాగే చూడసాగినాడు. కాసేపటికి వాళ్ళు బాగా తిని పండుకోని నిద్రపోయినారు.

వాళ్ళట్లా నిద్రపోవడం ఆలస్యం వీడు నెమ్మదిగా బైటకొచ్చి చప్పుడు కాకుండా గాడిదలన్నిట్నీ తోలుకోని ఇంటికొచ్చినాడు. వచ్చి, దాండ్లమీదున్న బంగారమంతా ఇంట్లో దాచిపెట్టి గాడిదలను వూరి బైటకి తరిమేసి ఏమీ ఎరుగని నంగనాచిలెక్క మట్టసంగా వుండిపోయినాడు.

దొంగలు పొద్దన్నే లేసి చూస్తే ఇంగేముంది... గాడిదలూ లేవు... బంగారమూ లేదు... దాంతో వాళ్ళందరూ ఆ అడవి చుట్టూ వున్న ఒక్కొక్క వూరూ పోయి ఎవరింట్లోనన్నా గాడిదలున్నాయేమోనని వెదుకుతా... వెదుకుతా... వీళ్ళుండే వూరికి వచ్చినారు. వాళ్ళు వూర్లో ఒకొక్క ఇండ్లే వెదుక్కుంటా ... వెదుక్కుంటా... వీళ్ళింటి ముందుకి వచ్చినారు.

ఈమె ఇంటి ముందే కూచోని వచ్చేపోయే జనాలనంతా చూస్తా వుంటాది గదా... దాంతో వాళ్ళు కనబడితే పిల్చి "ఏందన్నా... ఏం కావాల... అట్లా వెదుకుతా వున్నారు.... అప్పట్నుంచీ" అనడిగింది. దానికి వాళ్ళు "ఏమీ లేదమ్మా... నిన్న రాత్రి మా గాడిదలు పోగొట్టుకోని పోయినాయి. ఎవరింట్లోనన్నా వున్నాయేమోనని వెదుకుతా వున్నాం" అన్నారు.

దానికామె "ఓరినీ... నా మొగుడే రాత్రి గాడిదల్ని ఎక్కన్నుంచో తోలుకోనొచ్చి... ఇంట్లో పెద్ద పెద్ద మూటలు దాచిపెట్టి... మళ్ళా ఎందుకో దాండ్లను తన్ని తరిమేసినాడు. గాడిదలు లేవు గానీ మూటలున్నాయి కావాల్నా" అనడిగింది. వెంటనే వాళ్ళు లోపలికొచ్చి ఆమె మొగున్ని మెత్తగా తన్ని తిరిగి బంగారమంతా తీసుకోని పోయినారు.

వాడు దెబ్బలకు ఏడుస్తా " వాళ్ళ మానాన వాళ్ళు పోతా వుంటే పిల్చి మరీ తన్నిస్తావా... నీలాంటి దాన్తో కాపురం చేయడం నావల్ల గాదు" అంటా ఆమెను తీసుకోనిపోయి వాళ్ళ పుట్టింట్లో దించి వచ్చేసినాడు.

# 119 ఒక రాకుమారి ఏడుమంది గంధర్వ కన్యలు

ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు ఏడుమంది కొడుకులు. వాళ్ళలో అందరికన్నా చిన్నోడు చానా చక్కనోడు. అచ్చం నెమలి లెక్క అందంగా వుంటాడు. ఆ ఏడు మంది కొన్నాళ్ళకు పెరిగి పెద్దగైనారు. పెద్దగైనాక పెండ్లి చేయాల గదా. కానీ వాళ్ళ నాయనకు ఒకొక్క ఇంటి నుండి ఒకొక్క అమ్మాయిని తెచ్చి తన కొడుకులకు పెండ్లి చేయడం ఇష్టం లేదు. యాడన్నా ఒకే ఇంట్లో ఏడు మంది అక్కచెల్లెళ్ళుంటే వాళ్ళను తన కొడుకులకు ఇయ్యాలని ఆయన కోరిక. అందుకని రాజ్యమంతా తెగ వెదికినాడు. కానీ ఆయనకు ఏ ఇంట్లోనూ ఏడు మంది అక్కాచెల్లెళ్ళు కనబళ్ళేదు.

దాంతో ఆ ఏడుమంది రాకుమారులు వాళ్ళ నాయన దగ్గరికి పోయి "నాయనా ... నాయనా...ఈ రాజ్యంలో మాకెక్కడా ఏడుమంది అక్కాచెల్లెళ్ళు కనబడ్డంలేదు. మేం దేశసంచారం పోయి చుట్టుపక్కల రాజ్యాల్లో యాడన్నా వున్నారేమో వెదికి, వుంటే పెండ్లి చేస్కోనొస్తాం" అన్నారు. దానికి వాళ్ళ నాయన సరేనని వాళ్ళందర్నీ దీవించి పంపించినాడు.

అట్లా...వాళ్ళు ఒకొక్క రాజ్యమూ వెదుక్కుంటా...వెదుక్కుంటా... ఏడు రాజ్యాలు దాట్నాక ఒక పేదరాశి పెద్దమ్మ కనబడి "ఏంది నాయనా ఏంది మీ కథ" అనడిగింది. వాళ్ళు జరిగినదంతా చెప్పినారు. అప్పుడా పేదరాశి పెద్దమ్మ "ఈడికి తూర్పు దిక్కున ఏడు మైళ్ళ దూరంలో ఒక రాజ్యముంది. ఆ రాజుక్కూడా ఏడుమంది కూతుర్లే. ఆయన కూడా మీ నాయన లెక్కనే ఇస్తే ఏడుమంది అన్నదమ్ములున్న ఒక్కింటికే నా కూతుర్లను ఇస్తా గానీ ఒకొక్కరిని ఒకొక్క ఇంటికి ఇయ్యనంటూ పట్టుబట్టి కూచున్నాడు. మీరు ఆడికి పోండి" అని చెప్పింది.

వాళ్ళు సంబరంగా వెంటనే ఆ రాజ్యానికి చేరుకున్నారు. రాజు వాళ్ళందరినీ రాజభవనంలోకి తీస్కోనిపోయి, మర్యాదలు చేసి తన ఏడు మంది కూతుళ్ళనీ వాళ్ళకిచ్చి అంగరంగవైభోగంగా పెండ్లి చేసినాడు. పెండ్లయినాక వాళ్ళు ఒక ఏడురోజులు హాయిగా అన్నే వుండి "ఇంగ మేం మా వూరికి పోయొస్తాం" అని అత్తామామల్తో చెప్పి, వాళ్ళిచ్చిన చీరాసారే అన్నీ తీస్కోని పెండ్లాలతో ఇంటికి తిరిగి బైలుదేరినారు.

అడవిలో సగం దూరం పోయినాక చీకటి పడింది. చీకట్లో పోవడం మంచిది కాదుగదా. అందుకని వాళ్ళు ఒక పెద్ద మర్రిచెట్టు దగ్గర ఆగి ఈ రాత్రికి ఈన్నే పండుకోని రేప్పొద్దున్నే పోదాం అనుకున్నారు. ఆ పక్కనే వున్న చెరువుకాడ కాళ్లూ చేతులు కడుక్కోని, తెచ్చుకున్నవన్నీ బాగా తిని హాయిగా నిద్రపోయినారు.

ఆ మర్రిచెట్టు పక్కనే ఒక చెరువుంది గదా... అందులో ప్రతిరోజూ అర్ధరాత్రి ఆకాశం నుండి ఏడుమంది గంధర్వ కన్యలు దిగొచ్చి స్నానం చేసి మళ్ళా పొద్దు పొడిచేకళ్ళా తిరిగి వెళ్ళిపోయేటోళ్ళు. వాళ్ళు చానా చెడ్డోళ్ళు. అందర్నీ సతాయిస్తా, భయపడిస్తా నవ్వుకునేటోళ్ళు. ఆరోజు గూడా వాళ్ళు ఎప్పట్లాగే స్నానం చేసొద్దామని కిందికి దిగినారు. దిగి స్నానానికి పోతా వుంటే చిన్నామెకు ఆడ పండుకొన్నోళ్ళు కనబన్నారు.

వెంటనే "అకా...అకా... అటు చూడు. ఎవరో మానవులు ఆ చెట్టు కింద పండుకోనున్నారు. పోయి భయపడిచ్చి వద్దామా" అనింది. సరేనని వాళ్ళందరూ ఆ చెట్టు కాడికి పోయినారు. వాళ్ళకు ఆడ చిన్నోడు కనబన్నాడు. చిన్నోనిది చూడచక్కని అందం గదా. దాంతో వాళ్ళు "అబ్బ...ఎంతందంగా వున్నాడీ మానవుడు. దేవ, గంధర్వ, కిన్నెర, కింపురుషుల్లో గూడా యాడా ఇంత సుందరాంగుడు వుండడు. చేస్కుంటే ఇట్లాంటోన్నే పెండ్లి చేస్కోవాల" అనుకోని నిద్రపోతున్న వాన్ని నిద్రపోతున్నట్టు...సప్పుడు గాకుండా మట్టసంగా ఎత్తుకోనిపోయి ఆ చెరువు కింద ఏడంతస్తుల మేడ కట్టించి అందులో దాచిపెట్టినారు.

పొద్దున్నే అందరూ లేచి చూస్తే ఇంగేముంది... చిన్నోడు లేడు. "యాడికి పోయినాడబ్బా అని అడవంతా తెగ వెదికినారు. వుంటే గదా కనబడ్డానికి. పాపం...మొగుడు కనబడకపోయేసరికి చిన్నరాణి బాధతో కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే వెక్కివెక్కి ఏడ్చింది. అందరూ వెదికీ వెదికీ అలసిపోయి..."చీకటి పడ్తోంది. మనం పోదాం పదండి. బతికుంటే వాడే వస్తాడు" అని బైలుదేరినారు.



చిన్నరాణి చూడ్డానికి సన్నగా, అమాయకంగా కనబడ్తాది గానీ ఆమె బలె ధైర్యవంతురాలు. కత్తి తిప్పడం, గుర్రంస్వారీ చేయడం అన్నీ ఆమెకు వచ్చు. అందుకే "మీరు పోండి...నేను వస్తే నా మొగున్తో వస్తా... లేదంటే లేదు" అని ధైర్యంగా చెప్పింది. సరేనని మిగతావాళ్ళందరూ ఆమెకు ఒక గుర్రం, కత్తి, తినడానికి పళ్ళూ, ఫలహారాలు ఇచ్చి వెళ్ళిపోయినారు.

రాకుమారి ప్రతిరోజూ పొద్దున్నే అడవంతా వెదికీ...వెదికీ...అలసిపోయి, రాత్రి కాగానే మళ్ళా అదే చెట్టు కింద నిద్రపోయేది. ఒకరోజు రాత్రి నిద్ర రాక అటూ ఇటూ దొర్లుతా వుంటే పైన్నుంచి గాజుల గలగలలు, నవ్వుల కిలకిలలు వినబన్నాయి. "ఇదేందబ్బా... ఇంతర్ధరాత్రిపూట" అని కండ్లు తెరిచి చూస్తే ఇంగేముంది... ఏడుమంది గంధర్వకన్యలు పైనుండి కిందికి దిగొచ్చి చెరువులోకి పోవడం కనబడింది.

ఆ చెరువులో ఏముందబ్బా...అని ఆమె తర్వాత రోజు పొద్దున్నే చెరువులోకి దభీమని దుంకి అడుగుకి పోయి చూసింది. చూస్తే ఇంగేముంది. ఏడంతస్తుల మేడ ధగధగా మెరిసిపోతా కనబడింది.

నెమ్మదిగా తలుపు తోసుకోని లోపలికి పోయి వెదుకుతా వుంటే ఒక గదిలో రాకుమారుడు కాళ్ళూ, చేతులు కట్టేసి కనబన్నాడు. ఆమె పరుగుపరుగున మొగుని దగ్గరకు పోయి అన్నీ ఇప్పేసింది.

అప్పుడా రాకుమారుడు పెళ్ళాన్ని ప్రేమగా దగ్గరికి తీసుకోని "వాళ్ళు ప్రతిరోజూ వచ్చి మమ్మల్ని పెళ్ళిచేసుకుంటావా... లేదా... అని భయపడిస్తా వున్నారు. నేనొప్పుకోవడం లేదు. అందుకే నన్నిట్లా కట్టేసి బాధపెడ్తా వున్నారు" అని చెప్పినాడు. సరిగా తిండి లేక బక్కచిక్కిపోయిన మొగున్ని చూసి ఆమె కండ్లనీళ్ళు పెట్టుకోనింది. అప్పట్నించీ ప్రతిరోజూ పొద్దున్నే పండ్లూ, కాయలూ తీసుకోని మొగుని దగ్గరకు పోయి, పగలంతా అన్నే వుండి చీకటి పడగానే తిరిగొచ్చేసేది.

ఒకరోజు ఆ గంధర్వ కన్యలకు ఆ గదిలో పగిలిపోయిన గాజుముక్కలు కనబన్నాయి. అది చూసి వాళ్ళు "ఓహో! ఐతే...ఎవరో రోజూ ఈడికి వస్తున్నారన్నమాట" అని కనుక్కోని రాత్రికి రాత్రే ఆ రాకుమారున్ని తీస్కోనిపోయి ఏడు సముద్రాల అవతల ఒక చిన్నదీవిలో దాచిపెట్టినారు.

తర్వాత రోజు పొద్దున్నే రాకుమారి పోయి చూస్తే... ఇంగేముంది... మేడా లేదు... మొగుడూ లేదు. "ఏమైపోయినాడబ్బా......" అని గుర్రమేస్కోని వెదుక్కుంటా... వెదుక్కుంటా... పోతా వుంటే... దారిలో ఒక చోట ఒక చెట్టు మీద నుండి "కాపాడండి... కాపాడండి..." అని అరుపులు వినబన్నాయి.

"ఎవరబ్బా...పాపం...అట్లా అరుస్తా వున్నారు!" అని తల పైకెత్తి చూస్తే ఇంగేముంది...ఏడు తలల నాగుబాము ఒకటి గండభేరుండ పక్షి పిల్లలను తినడానికి వస్తా కనబడింది. వెంటనే రాకుమారి ఒరలోంచి కత్తి తీసి చకచకా చెట్టు పైకెక్కి దాని మీదకి దుంకింది. రాకుమారేమీ సామాన్యురాలు కాదుగదా. కత్తి గిరగిరా తిప్పుతా వుంటే పాము ఆరు తలలూ ఆరు నిమిషాల్లో తెగి కిందపడినాయి. ఏడోతల నరకబోతున్నంతలో అది అనుకోకుండా కసుక్కున ఆమె కాలు మీద కాటేసింది. అంతే...పాపం...ఆమె శరీరమంతా విషమెక్కి నోట్లోంచి నురగలు రావడం మొదలుపెట్టినాయి. ఐనా సరే అంత బాధలో గూడా కత్తి వదలకుండా ఆ చిన్న పిల్లల్ని కాపాడ్డానికి శక్తినంతా కూడగట్టుకోని సర్రున ఏడోతల మీద కూడా ఒక్కేటు వేసింది. అంతే...ఆ పాము కింద పడి గిలగిలా కొట్టుకుంటా చచ్చిపోయింది. రాకుమారిని పాము కరిచింది గదా... దాంతో పాపం ఆమె గూడా పాముతో బాటే కింద పడి చచ్చిపోయింది.

కాసేపటికి గండభేరుండ పక్షి ఆడికి వచ్చింది. వెంటనే పిల్లలు "అమా... అమా..." అంటూ జరిగిందంతా చెప్పినాయి. అప్పుడా పక్షి "అయ్యో! మిమ్మల్ని కాపాడ్డానికి తన ప్రాణాలే పోగొట్టుకుందా....ఏది ఏమైనా గానీ ఈమెను తిరిగి బతికియ్యాల్సిందే" అంటూ ఏడువేల మైళ్ళ దూరంలోనున్న సంజీవనీ కొండ దగ్గరకు పోయి జీవపుల్ల తెచ్చింది. జీవపుల్లంటే తెల్సుగదా...అది అట్లాంటిట్లాంటి మామూలు పుల్లగాదు. దాన్ని ముక్కు దగ్గర పెడితే చచ్చినోళ్ళు గూడా టక్కున లేచి కూచుంటారు. ఎంత పెద్ద దెబ్బలైనా సరే చిటికెలో మాయమైపోతాయి. అట్లాంటి శక్తి గల ఆ పుల్ల రాకుమారి ముక్కు దగ్గర పెట్టేసరికి ఆమెకు జీవమొచ్చి మళ్ళా కళకళలాడుతా కళ్ళు తెరిచింది.

అప్పుడా గండభేరుండ పక్షి "అమ్మా...నీవెవరోగానీ నీ ప్రాణాలు అడ్డం పెట్టి నా పిల్లల ప్రాణాలు కాపాడినావు. చెప్పు ...నీకే సాయం కావాలన్నా చేసి పెడ్తా" అనింది. అప్పుడా రాకుమారి తన కతంతా చెప్పి "నా మొగుడు యాడున్నాడో కనుక్కోగలవా" అనడిగింది. దానికా పక్షి "నువ్వేం బాధపడొద్దు. ఈ భూప్రపంచంలో

ఎక్కడ ఏమూల నీ మొగున్ని దాచిపెట్టినా కనుక్కోనొస్తా... అంతవరకూ నువ్వు ఈన్నే హాయిగా విశ్రాంతి తీసుకో" అంటూ ఏడు రోజుల్లో భూప్రపంచం మొత్తం ఆ మూల నుంచి ఈ మూలవరకు సుడిగాలిలా చుట్టుకోనొచ్చి గంధర్వకన్యలు రాకుమారున్ని యాడ దాచిపెట్టినారో కనుక్కునేసింది.

తిరిగి రాకుమారి దగ్గరికొచ్చి "నీ మొగున్ని యాడ బంధించినారో తెల్సిపోయింది. దా పోదాం" అంటూ ఆమెను వీపు మీద ఎక్కించుకోని గంటకో సముద్రం చొప్పున, ఏడు గంటల్లో ఏడు సముద్రాలు దాటుకోని రాకుమారున్ని దాచిన దీవిలో దింపింది.

రాకుమారి వురుక్కుంటా పోయి మొగున్ని చేరింది. వాళ్ళ నుండి ఎట్లా తప్పించుకోవాలబ్బా అని ఆలోచించి మొగున్తో "మనకు ఒకటే దారి. వాళ్ళ ఆయుష్షు యాడుందో ఎట్లాగైనా కనుక్కో" అని చెప్పింది. సరేనని రాకుమారుడు ఆ రాత్రి గంధర్వ కన్యలు రాగానే వగలుపోతా "మిమ్మల్ని చేసుకోవడం నాకిష్టమే. కానీ మీవాళ్ళు వూకుంటారా. మీరు బైటికి పోయినప్పుడు నన్ను చంపినా చంపుతారు. అందుకే మీ ప్రాణాలు యాడున్నాయో చెప్పండి. నావి కూడా ఆన్నే దాచిపెడ్తా. అప్పుడు నన్ను కూడా ఎవరూ ఏమీ చేయలేరు" అన్నాడు.

దానికా గంధర్వ కన్యలు "నువ్వేం భయపడొద్దు. ఈడికి ఏడుమైళ్ళ దూరంలో ఏడంతస్తుల పెద్దమేడ ఒకటుంది. దాని ఏడోఅంతస్తులో ఏడు పంజరాలున్నాయి. అందులో ఒకొక్క దాంట్లో ఒక చిలకుంటాది. దాండ్లలోనే మా ప్రాణాలుండేది. నీ ప్రాణం కూడా ఆన్నే దాచిపెడ్తాంలే" అని చెప్పినారు. తర్వాత రోజు పొద్దున్నే రాకుమారికి వాడు విషయమంతా చెప్పినాడు.

అట్లాగా అని ఆ రాకుమారి గండభేరుండ పక్షినెక్కి ఆ ఏడంతస్తుల మేడకు చేరుకోనింది. లోపలికి పోదామని కాలు పెడుతున్నంతలో యాన్నించి వచ్చినారో... దాన్ని కాపలా కాస్తావున్న ఏడుమంది రాక్షసులు ఒక్కసారిగా ఆ రాకుమారి మీద పడినారు. వాళ్ళను చూసి రాకుమారి ఏమాత్రం భయపళ్ళేదు. వెంటనే ఒరలోంచి సర్రున కత్తి తీసి దెబ్బకొకని చొప్పున ఏడు దెబ్బల్లో ఏడుమంది తలలు నరికేసి లోపలికి పోయింది. ఏడో అంతస్తులో ఏడు పంజరాలు కనబన్నాయి. కత్తి తీసుకోని ఒకొక్క చిలకనే బైటకు తీసి చంపి పాడేసింది. అంతే చిలకల్లోనే గదా ఆ గంధర్వకన్యల ప్రాణాలుండేది. దాంతో ఆ ఏడుమంది ఎక్కడివాళ్ళు అక్కడ నిలుచున్నచోట నిలబన్నట్టుగా నెత్తురు కక్కుకోని చచ్చిపోయినారు.

అప్పుడా రాకుమారుడు, రాకుమారి సంబరంగా గండభేరుండ పక్షినెక్కి మళ్ళా తమ రాజ్యానికి చేరుకున్నారు. తిరిగొచ్చిన వాళ్ళిద్దర్నీ చూసి వూరువూరంతా సంతోషంతో సంబరాలు చేసుకున్నారు.

# 120 ఏం వదినా! చాలా ఇంకా కావాల్నా

ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు వరసగా ఏడుమంది మగపిల్లలు పుట్టినాక చానా కాలానికి బంగారు బొమ్మలాంటి ఒక ఆడపిల్ల పుట్టింది. ఆ పాప లేక లేక పుట్టింది గదా, అదీగాక అందరి కంటే చిన్నదిగదా దాంతో వాళ్ళన్నోళ్ళందరికీ ఆ పాపంటే ప్రాణం. ఏదడిగితే అది క్షణాల్లో తెచ్చిస్తా కాలు కింద పెట్టనీయకుండా అపురూపంగా చూసుకునేటోళ్ళు. ఏడంతస్తుల మేడ కట్టి, మెత్తని తివాచీలు పరచి, హంసతూలికా తల్పమేసి, అడుగడుగునా దాసీలను పెట్టి చిన్న కష్టం గూడా తెలీకుండా చూసుకునేటోళ్ళు.

కొంతకాలానికి ఆ ఏడుమందికీ పెండ్లిల్లయ్యి పెండ్లాలొచ్చినారు. మొగుళ్ళు తమకన్నా ఆ పాపనే బాగా చూసుకుంటా వుండటంతో నెమ్మదిగా వాళ్ళకు ఆ పాప మీద బాగా కోపం పెరిగిపోయింది. బయటకు ఏమీ అనకపోయినా లోపల్లోపల మాత్రం వుడుక్కునేటోళ్ళు.

ఒకసారి ఆ రాజ్యంలో వుండే కొంతమంది సైన్యాధిపతులు ఆడాడ తిరుగుబాట్లు చేయడం మొదలుపెట్టినారు. దాంతో ఆ ఏడుమందీ తిరుగుబాట్లను అణచడానికని ఏడువైపులా సైన్యంతో బైలుదేరినారు. అట్లా పోయేముందు పెండ్లాలను పిలిచి "మా చెల్లెలు జాగ్రత్త. ఇప్పుడెట్లా వుందో మళ్ళా మేం తిరిగి వచ్చేసరికి గూడా అట్లాగే వుండాల. ఏ చిన్న పొరపాటు చేసినా మిమ్మల్ని బతకనియ్యం. జాగ్రత్త" అని ఎచ్చరించి పోయినారు.

వాళ్ళట్లా పోవడం ఆలస్యం ఇంగ వీళ్ళు ఆ పిల్లని చంపుకు తినడం మొదలుపెట్టినారు. తివాచీల మీదనే తప్ప భూమ్మీద ఎన్నడూ నడవని ఆ పిల్లతో మండుటెండలో వుత్తకాళ్ళతో చెరువు నుండి నీళ్ళు తెప్పిచ్చినారు. మెత్తని పరుపుల మీదనే తప్ప యాడా పన్నుకోని ఆ పిల్లను దిండు కూడా ఇయ్యకుండా కటికనేల మీద పన్నబెట్టినారు. పంచభక్ష్య పరమాన్నాలే తప్ప ఏమీ తినని ఆ పిల్లకు పాచిపోయిన అన్నం, పాచిపోయిన కూరలు పెట్టినారు. పొద్దున లేసినప్పటి నుండి రాత్రి పన్నుకునేదాకా దాసీలు అడుగడుగునా సేవలు చేస్తా వుంటే కష్టమంటే ఏమిటో తెలీకుండా పెరిగిన ఆ పిల్లతో ఇంటి పనులన్నీ ఒకదానిమీదొకటి క్షణం గూడా తీరిక లేకుండా చేయించినారు.

ఆ పాప అన్నలు గనుక తిరిగొస్తే విషయం తెల్సుకోని వాళ్ళని వూరికే విడిచిపెట్టరు గదా.... దాంతో వాళ్ళు ఒకరోజు అర్ధరాత్రి పాపం ఆ పిల్లను జుట్టు పట్టుకోని వద్దు వద్దని ఏడ్చి మొత్తుకుంటా వున్నా వినకుండా ఈడ్చి ఇంటి బైటకు దొబ్బినారు. అప్పుడా పాప కండ్లు తుడుచుకోని "చూస్తా వుండండి, రోజులెప్పుడూ ఒకేలా వుండవు గదా! నాకూ ఒక రోజంటూ వస్తాది. అప్పుడు చెబ్తా మీ పని. నేను గూడా మిమ్మల్ని మించిన రాజుని పెండ్లి చేసుకోని, నుదుట కుంకుమ బొట్టు పెట్టుకోని, చేతుల నిండా బంగారు గాజులేసుకోని, కండ్ల నిండా

కాటుక పెట్టుకోని, బొట్ల బొట్ల రవికపైన బొట్ల బొట్ల చీరగట్టి, నా కొడుకు సంకలో ఆడుకుంటా వుంటే... మీకు బండిగానంత విస్తరాకేసి, చాటెడు బచ్చాలేసి, రత్నాల గిన్నెలోంచి ముత్యాల చెంచాతో నెయ్యి పోస్తా 'ఏం వదినా! చాలా... ఇంకా కావాల్నా' అని గంటెతో ఒక్క పోటు పొడవకుంటే నా పేరు తిప్పి పెట్టుకుంటా" అని ప్రతిజ్ఞ చేసి అన్నించి సరసరసర వెళ్ళిపోయింది.

ఆ పాపకు ఏ దిక్కున పోవాల్నో అర్థంగాక ఆ చీకట్లో ఎట్ల పడ్తే అట్ల నడుస్తా ఆఖరికి ఒక పెద్ద అడవిలోనికి చేరుకోనింది. నడిచీ నడిచీ ఇంక నడవలేక అలసిపోయి ఒక చెట్టు కింద నిద్రపోయింది.

ఆ అడవిలో ఒక పెద్ద రాక్షసుడున్నాడు. వాడా పిల్లని చూసి పండుకున్నదాన్ని పండుకున్నట్టే అరచేతిలో పెట్టుకోని వానింటికి తీసుకోనిపోయి ఒక గదిలో పన్నబెట్టి తాళమేసేసినాడు. పొద్దున్నే ఆమె లేచి చూస్తే చుట్టూ ఒక చెట్టూ లేదూ. కొండా లేదు. "నేనెక్కడున్నాను" అనుకుంటా వుంటే ఆ రాక్షసుడు ధడేలున తలుపులు తెరచుకోని లోపలికొచ్చినాడు. వాన్ని చూడగానే ఆ పాప భయంతో గజగజ వణికిపోయింది. ఆ రాక్షసుడు మాంచి భోజనప్రియుడు. అంటే వానికి రోజుకోరకం వంట చేపిచ్చుకోని తినాలని ఒకటే కోరిక. కానీ వానికి వంట రాదు. దాంతో ఈ పిల్లను చంపి తినకుండా గదిలో పెట్టుకున్నాడు.

"ఎవరు నువ్వు? నన్నెందుకు ఎత్తుకోనొచ్చినావ్" అని భయపడ్తా భయపడ్తానే ఆ పిల్ల అడిగింది. దానికి వాడు "నువ్వు నాకు రోజూ చాటెడన్ని బచ్చాలూ, విస్తరాకన్ని కర్జికాయలూ, బానంత అన్నమూ, కుండంత సాంబారు, చాపన్ని అప్పడాలు చేసి పెట్టాల. అన్నం తిన్నాక గంప ఆకులల్లో చెంబెడు వక్కపేళ్ళు, లోటా సున్నమూ ఏసి తాంబూలమియ్యాల. పన్నుకున్నాక నిద్రపోడానికి పాట పాడతా రోకలిబండతో జోకొట్టాల. అట్లా నువ్వు చేసినంత కాలమూ నేను నిన్ను ఏమీ చేయను. కానీ ఏ రోజయితే నువ్వు చేయడం మానేస్తావో ఆ రోజు నిన్ను చంపి తినేస్తా" అన్నాడు. పాపం ఆ పాప వాన్ని ఎదిరించలేదు గదా, దాంతో సరేననింది. వాడు ఆ పిల్ల పారిపోకుండా ఏడంతస్తుల ఒంటిస్తంభం మేడ కట్టి ఆమెను పై గదిలో పెట్టి కింద తలుపులన్నీ తాళమేసుకున్నాడు.



ఆరోజు నుండీ ఆ పాపకు పొద్దున లేసినప్పటి నుండి మళ్ళా రాత్రి పన్నుకునేదాకా ఒకటే పని. గంపలు గంపలు చేయలేక కిందామీదా పడ్తా వుండేది. క్షణం గూడా తీరిక వుండేది గాదు. ఏమాత్రం కొంచం తక్కువ చేసినా ఆ రాక్షసుడు వూరుకుండేటోడు కాదు.

ఇక్కడ ఇట్లా ఈ పాప బాధలు పడ్తా వుంటే ఆడ ఏడుమందీ అన్నలు తిరుగుబాట్లు అన్నీ అణచివేసి ఇంటికొచ్చినారు. వచ్చి చూస్తే చెల్లెల్లేదు. "యాడికి పోయిందే మా చెల్లెలు కనబడ్డం లేదు" అనడిగితే ఆ ఏడుమందీ కూడబలుక్కోని "మీ చెల్లెలు ఎవరో సైనికున్ని ఇష్టపడిందంట. మీరుంటే పెండ్లికి ఒప్పుకోరని మీరట్లా పోవడం ఆలస్యం మాకెవరికీ మాటమాత్రమయినా చెప్పకుండా అర్ధరాత్రి అందరి కన్నూ గప్పి... మట్టసంగా వాన్తో పారిపోయింది" అని చెప్పినారు. అందరూ అట్లాగే చెప్పేసరికి వాళ్ళు గూడా అదే నిజమనుకున్నారు.

చెల్లెలంటే వాళ్ళకు యాడలేని ప్రేమ గదా! దాంతో ఆమె యాడికి పోయిందో, ఎన్ని కష్టాలు పడతా వుందో అని ఆలోచిస్తా ఆఖరికి అన్నం గూడా సరిగా తినక మనోవ్యాధితో మంచం పట్టినారు. అదే సందనుకోని కొంతమంది సైన్యాధికారులు మళ్ళా తిరుగుబాటు చేసి యుద్ధానికొచ్చినారు. పాపం వీళ్ళు చానా బాధలో వున్నారు గదా దాంతో యుద్ధం సరిగా చేయలేక ఓడిపోయి... పెండ్లాలను తీసుకోని పారిపోయినారు. అట్లా పారిపోయి వాళ్ళని ఎవరూ గుర్తుపట్టలేని ఒక చిన్న పల్లెటూరికి చేరుకోని అడవిలో కట్టెలు కొట్టి వాటిని చుట్టుపక్కల అమ్ముకుంటా బదకసాగినారు.

అన్నలిక్కడ ఇట్లా కష్టాలనుభవిస్తా వుంటే చెల్లెలక్కడ ఆ రాక్షసుని చేతిలో బాధలు పడ్తా వుంది. ఒకరోజు ఆ అడవి పక్కనే వున్న ఒక పెద్ద రాజ్యానికి చెందిన యువరాజు వేటకని అడవిలోనికి వచ్చినాడు. వచ్చి అడవి నడుమ ఆ పెద్ద ఒంటిస్తంభం మేడ చూసి ఆచ్చర్యపోయి ఎప్పుడూ ఈ అడవిలో ఇంత పెద్దమేడ చూడలేదు. ఎవరు కట్టినారు దీన్ని అనుకోని గుర్రాన్ని చెట్టుకు కట్టేసి పోయి చూస్తే తాళమేసి కనబడింది.

"ఎవరూ లేరేమో" అనుకోని వెనక్కు తిరుగుతా వుంటే.. ఆమె పైన వంట చేస్తా వుంటాది గదా ఆ వెలుగూ, పొగా కనబన్నాయి. దాంతో రాజు ఒకొక్క మేడా కష్టపడి ఎక్కుతా నెమ్మదిగా ఏడో మేడ చేరుకున్నాడు. చేరుకోని చూస్తే అక్కడ నెమలీకలెక్క అందంగా వున్న ఆ పాప వంట చేస్తా కనబడింది. యువరాజు లోపలికొచ్చి ఆచ్చర్యంగా "ఎవరు నువ్వు? ఏం చేస్తున్నావిక్కడ" అన్నాడు. అప్పుడామె జరిగిందంతా చెప్పింది.

అప్పుడా యువరాజు "నువ్వు ఎట్లాగయినా సరే వాని ప్రాణాలు యాడున్నాయో కనుక్కో. మిగతాది నే చూసుకుంటా" అన్నాడు. ఆమె సరే అనింది. ఆ రోజు రాత్రి ఆ పాప కొత్త కొత్త వంటకాలు ఎప్పుడూ లేనంత రుచిగా చేసి రాక్షసుడు వస్తానే పెట్టింది. వాడు లొట్టలేసుకుంటా అన్నీ తినగానే గంప ఆకులల్లో చెంబు వక్కలు, లోటా సున్నమూ ఏసి నోటికందించింది. వాడు ఆనందంగా నములుతా వుయ్యాల మీద పన్నుకోగానే దాన్ని వూపుతా రోకలిబండతో జోకొడతా "నాకు నువ్వు, నీకు నేను తప్ప మనకెవరూ లేరు గదా. నువ్వు పొద్దుననగా పోతే రాత్రి వరకూ రావు. బైటకి పోయినప్పుడు నీకేమన్నా అయితే ఇక్కడ నాగతేం కావాల" అనింది దొంగేడుపు ఏడుస్తా.

దానికి వాడు పెద్దగా నవ్వుతా "ఓసీ పిచ్చిదానా! ఎందుకే అనవసరంగా భయపడతావు. నా ప్రాణాలు తీయడం అంత సులభం కాదులే. ఈడికి ఏడుమైళ్ళ దూరంలో ఒక పెద్ద మర్రిచెట్టు వుంది. ఆ మర్రిచెట్టు తొర్రలో ఒక చిన్న చిలకుంది. దాంట్లో నా ప్రాణాలున్నాయి. దాన్ని చంపితేగానీ నేను చావను" అన్నాడు. తర్వాత రోజు పొద్దున్నే ఆ రాక్షసుడు బైటకి పోగానే ఆమె ఆ విషయం యువరాజుకి చెప్పింది. అట్లాగా అని ఆ రాజు గుర్రమేస్కోని పోయి ఆ మర్రిచెట్టు తొర్రలో వున్న చిలకను పట్టుకోని ఒక్కవేటుతో తల నరికినాడు. అంతే ఆ

రాక్షసుడు అక్కడికక్కడే కిందపడి గిలగిలా కొట్టుకుంటా రక్తం కక్కుకోని చచ్చిపోయినాడు. ఆ యువరాజు ఆమెను పెండ్లి చేసుకున్నాడు. ఈమెను పెండ్లి చేసుకున్నది చానా పెద్దరాజు గదా. దాంతో మళ్ళా ఆమెకు రాజవైభోగం పట్టుకోనింది. రాజు ఆమెను చానా ప్రేమగా చూసుకునేటోడు. కొన్నాళ్ళకు వాళ్ళకో కొడుకు పుట్టినాడు. పుట్టినాక ఆమెకు అన్నోళ్ళను ఒకసారి చూడాలన్పించి మొగునికి చెప్పింది. మొగుడు "సరే... పోయిరాపో" అన్నాడు. పోయి చూస్తే అక్కడ అన్నల్లేరు, వదినల్లేరు. జరిగిందంతా తెలుసుకోని బాధపడింది. ఎట్లాగయినా సరే అన్నోళ్ళు యాడున్నారో కనుక్కోవాలని రోజుకొక వూర్లో అందరినీ పిలిచి వుచితంగా భోజనాలు పెడ్తా తాను మాత్రం ఎవరికీ కనబడకుండా మిద్దె మీద కూచోని వచ్చేపోయే వాళ్ళలో తన అన్నలేమయినా వున్నారేమోనని వెదకసాగింది.

వాళ్ళన్నోళ్లు అడవిలో కట్టెలు కొట్టుకోని అమ్ముతా ఒకరోజు చెల్లెలున్న వూరికి వచ్చినారు. ఆడ వుచితంగా అందరికీ అన్నం పెడ్తా వుంటే తిందామని వీళ్ళు గూడా పెండ్లాలను పిలుచుకోని వచ్చినారు. ఆమె మిద్దెపై నుండి అన్నావదినలను చూస్తానే గుర్తుపట్టింది. వెంటనే ఆమె కండ్లలో నీళ్ళు తిరిగినాయి. అంతలో ఆమెకు వదినల్తో చేసిన సవాలు గుర్తుకొచ్చింది.

వెంటనే నుదుట కుంకుమ పెట్టుకోని, చేతుల్నిండా వజ్రాల గాజులేసుకోని, కండ్లకు కాటుక పెట్టుకోని, బొట్ల బొట్ల రవిక పైన బొట్ల బొట్ల చీరగట్టి, సంకలో కొడుకు ఆడుకుంటా వుంటే వచ్చి అందరికీ మామూలు విస్తరాకులేస్తే వదినలకు మాత్రం బండి గానంత విస్తరాకులు ఏసింది." "ఇదేందబ్బా ఇంత పెద్ద ఆకేసింది" అని వాళ్ళు ఆచ్చర్యపోతా వుంటే ఒక్కొక్కరి ఆకులో చాటెడు బచ్చాలు ఏసి, రత్నాల గిన్నెలోంచి ముత్యాల చెంచాతో ఆ బచ్చాల మీద నెయ్యి పోస్తా "ఏం వదినా! చాలా... ఇంకా కావాల్నా" అని గంటెతో ఒక పోటు పొడిచింది. దాంతో అదిరిపడి వాళ్ళందరూ తలెత్తి చూస్తే ఆమె చిరునవ్వులు నవ్వుతా చిన్నబిడ్డను సంకనేసుకోని కనబడింది. వెంటనే వాళ్ళు ఆమెని గుర్తుపట్టి కండ్ల నీళ్ళతో "మమ్మల్ని మన్నించమ్మా! నీకు చానా అన్యాయం చేసినాం. అందుకే మా బతుకులిట్లా నాశనం అయినాయి" అని ఏడ్చినారు. అన్నలు జరిగినేదంతా తెలుసుకోని పెండ్లాలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టినారు.

''జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటినుంచయినా అందరమూ కలిసుందాం'' అని ఆమె అన్నావదినలందరినీ మొగుని దగ్గరకు తీసుకోని పోయి పరిచయం చేసింది. ఆయన వాళ్ళందరికీ బాగా మర్యాదలు చేసి, తన సైన్యాన్ని వాళ్ళకిచ్చి పొండి "పోయి మీ రాజ్యాన్ని మీరు గెల్చుకోని రాపోండి" అన్నాడు. వాళ్ళు సరేనని ఆ సైన్యంతో పోయి మళ్ళా తమ రాజ్యాన్ని తాము గెల్చుకున్నారు. అప్పటి నుంచీ అందరూ ఎటువంటి గొడవలూ లేకుండా పండగలకు ఒకరింటికొకరు వస్తాపోతా హాయిగా కలసిమెలసి వున్నారు.

# 121 మేమెప్పుడూ సూళ్ళా ఇట్లాంటి విచిత్రం

ఎప్పుడూ నీళ్ళతో, పచ్చని పంట పొలాలతో, మూడు కార్లు పండే భూములతో కళకళలాడే కృష్ణా జిల్లాలో రామయ్య అని ఒకడు వుండేటోడు. వాడొకసారి ఎండాకాలం సెలవుల్లో బంధువులందరినీ పలకరిద్దామని ఒకొక్క వూరికి పోతాపోతా కర్నూలుకు వచ్చినాడు. ఆ జిల్లాలోని ఒక మారుమూల పల్లెలో వాళ్ళ బంధువులు వున్నారు. కానీ అది అట్లాంటిట్లాంటి మామూలు పల్లెటూరు కాదు. చానా చానా వెనకబన్న ప్రాంతం. ఆటోలే తప్ప బస్సులు పోవు. గుంతలగుంతల మట్టిరోడ్డే తప్ప తారురోడ్డు లేదు. "ఇంత దూరం వచ్చినా... మళ్ళా జన్మలో ఇటువైపు వస్తానో రానో... ఏది ఏమయినా సరే... పోయి చూసొద్దాం" అనుకుంటా రామయ్య కిందామీదా పడతా ఆ వూరికి బైలుదేరినాడు.

ఆ వూర్లో నీటికి ఎప్పుడూ కరువే. వూరి బైటున్న పెద్దబాయిలోని నీరే ఇంటికి రెండు బిందెల చొప్పున పట్టుకోనొచ్చుకుంటుంటారు. ఇక ఎండాకాలం ముదిరిందంటే చాలు... ఆ బావి గూడా గుడ్లు తేలేస్తాది. జనాలు వూరికి పది కిలోమీటర్ల దూరంలో వున్న చింతలవాగుకాడికి పోయి చెలిమలు తవ్వి నీళ్ళు పట్టుకొచ్చుకొనేటోళ్ళు. రోజూ గుట్టలు, మిట్టలు ఎక్కుతా దిగుతా ఎర్రని ఎండలో అంతదూరం పోవడం కష్టం కాబట్టి పొద్దు పొడవకముందే బైలుదేరి ఒకటో రెండో బిందెలు తెచ్చుకునేటోళ్ళు. చుక్కచుక్క నీళ్ళు దాచిపెట్టుకోని దాచిపెట్టుకోని తాగేటోళ్ళు. స్నానాలు గూడా వారానికి ఒక్కసారే... అదీ తడిబట్టతో ఒళ్ళు తుడుచుకోవడమే. ఆ ఎండాకాలం ఏ ఇంటి తలుపు తట్టి చస్తా వున్నామన్నా గుక్కెడు నీళ్ళు పోసే దిక్కుండదు. యాడయినా బావ కానీ నీళ్ళ కాడ మాత్రం కాదన్నట్టుంటుంది పరిస్థితి.

అటువంటి వూరికి రామయ్య పోయినాడు. అదీ సెగలు కక్కుతా వున్న వేసవి కాలం. రాకరాక వచ్చినాడు గదా అని బంధువులు బాగా మర్యాదలు చేసి "ఈ రాత్రికి ఈన్నే వుండి రేప్పొద్దున పోదువులే" అని బలవంతం చేసినారు. వాళ్ళ అభిమానాన్ని కాదనలేక రామయ్య 'సరే' అన్నాడు. వాళ్ళు రాత్రి ఒక మాంచి నాటుకోడిని తెచ్చి బాగా మసాలా, పచ్చి మిరపకాయలేసి కూర చేసినారు. దానిలోకి జొన్న సంకటి పెట్టినారు. రామయ్య సంకటి తినడం అదే మొదటిసారి. దాంతో మాంచి రుచి తగిలింది. దాంతో ఇంగో ముద్ద.... ఇంగోముద్ద... అంటూ బాగా కూర నంజుకోని కడుపు నిండా తిన్నాడు.

కూరలో మంచిగా మసాలా, కారం పడడంతో, అదీ ఎండాకాలం కావడంతో అందరికీ గొంతులెండుకపోయి సారికిన్ని నీళ్ళు తాగడం మొదలుపెట్టినారు. అట్లా రాత్రి పండుకునే సమయానికి ఇంట్లో చుక్క నీరు గూడా

మిగలకుండా కుండ ఖాళీ అయిపోయింది. పండుకున్నాక తాగేదేముంది. పొద్దున లేస్తానే పోయి తెచ్చుకోవచ్చులే అనుకున్నారు. వాళ్ళకు అట్లా నీళ్ళు లేకుండా పండుకోవడం పుట్టినప్పటి నుండీ అలవాటే. దాంతో అందరూ హాయిగా గుర్రుకొట్టసాగినారు.

కానీ... రామయ్యకు ఇంట్లో రోజూ లోటాలకు లోటాలు నీళ్ళు బాగా తాగడం అలవాటు. రాత్రి పండుకునే ముందైతే పెద్ద చెంబుతో నీళ్ళు తాగడమే గాక, పక్కన మళ్ళొక చెంబు నీళ్ళు పెట్టుకోని మధ్యమధ్యలో లేచి తాగుతా వుండేవాడు. అట్లాంటిది ఎండాకాలం... అదీగాక బాగా కారం తిన్నాడు. దాంతో నాలుక తడారిపోసాగింది. చేసేదేమీలేక అట్లాగే ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూస్తా... చూస్తా... నిద్ర రాక దొర్లసాగినాడు. అట్లా నెమ్మదిగా సమయం రెండు దాటింది.

ఎట్లాంటోనికయినా రాత్రిపూట ఏదో ఒక సమయానికి నిద్ర వచ్చేస్తాది గదా... అట్లా... రామయ్యకు మూడు దాటేసరికి నిద్ర ముంచుకొచ్చేసింది. నీళ్ళ కోసం కలవరిస్తా... కలవరిస్తా... అట్లాగే నిద్రపోయినాడు.

రామయ్య అట్లా నిద్రపోయిన కాసేపటికి నీళ్ళ కోసం తట్టుకోలేక రామయ్య ఆత్మ నిద్ర లేచింది. పండుకొన్నప్పుడు కొన్నిసార్లు చానా అవసరమైతే అట్లా ఆత్మలు శరీరం వదిలి బైటికి వచ్చేస్తాయంట. అవి పనయిపోగానే మల్లా తిరిగి లోపలికి దూరుతాయంట. కానీ నిద్ర లేచినాక మనకు అవేమీ గుర్తుండవంట. రామయ్య ఆత్మ యాడయినా నీళ్ళు దొరుకుతాయేమోనని వెదకడానికి బైలుదేరింది. ఇంట్లో యాడా నీళ్ళు లేవు. దాంతో నెమ్మదిగా పక్కింట్లోకి దూరింది. ఆడా నీళ్ళు లేవు. ఒక్కొక్క ఇల్లే వెదుకుతా వెదుకుతా ఆఖరికి వీధి చివరి వరకూ వచ్చింది. ఎవరింట్లోనూ చుక్కనీళ్ళు లేవు. అందరిండ్లలోనూ ఖాళీ కుండలే. ఏం చేయాల్నో అర్థంగాక ఆ వూరి పెద్దరెడ్డి ఇంటికాడికి బైలుదేరింది.

పెద్దరెడ్డికి చానామంది గాసగాళ్ళు వున్నారు. కేవలం నీళ్ళు తేవడానికే ఇద్దరిని పెట్టుకున్నాడు. వాళ్ళకు లేచింది మొదలు పండుకునేదాకా అదే పని. తేవడం... పోయడం... తేవడం... పోయడం... అంతే. రామయ్య ఆత్మ నెమ్మదిగా రెడ్డి ఇంటికాడికి చేరుకోనింది. వెదుక్కుంటా పోతా వుంటే ఒక గచ్చులో అడుగున కొంచం నీళ్ళు కనబన్నాయి. సర్రున లోపలికి దూరి గడగడగడ నీళ్ళు తాగసాగింది. అట్లా తాగుతా వుంటే ఆ చప్పుడుకు ఆన్నే పండుకున్న ఒక గాసగాడు నిద్ర లేచినాడు. ఏ కుక్కనో, బర్రెనో నీళ్ళు గతుకుతా వున్నట్లుంది అనుకోని "థాయ్... పో" అని రాయి తీసి విసుర్తా ఆడికి వచ్చినాడు. గచ్చు మీద పెట్టే బండరాయి కింద వుంది. దాన్ని ఎత్తి గచ్చు మీద పెట్టినాడు. అంతే... లోపల రామయ్య ఆత్మ ఇరుక్కోని పోయింది. బైటకి ఎట్లా రావాల్నో తెలీక తనకలాడసాగింది. బండ చానా బరువుంది. యాడా చిన్న సందు గూడా లేదు. దాంతో లోపల్నే కూర్చోని ఎదురుచూడసాగింది. అట్లా గంటా గంటా గడుస్తా నెమ్మదిగా తెల్లారింది.

ఊరంతా నిద్ర లేచినారు గానీ రామయ్య లేయలేదు. దాంతో బంధువులు, చుట్టుపక్కల వాళ్ళు చుట్టూ చేరి "అయ్యో పాపం... నిన్న రాత్రి వరకూ అందరితో మాటా మాటా కలుపుతా నవ్వుతా నవ్విస్తా వుండె. అట్లాంటిది పండుకున్నోడు పండుకున్నట్టే నిద్రలోనే ప్రాణం ఇడిచినట్టున్నాడు" అని కళ్ళనీళ్ళు బెట్టుకున్నారు. బంధువులకు, పెండ్లాం బిడ్డలకు అందరికీ కబురు పంపినారు. చీకటి పడక ముందే సమాధి చేయాల గదా... దాంతో ఏర్పాట్లు మొదలుపెట్టినారు. పాడె కట్టే ముందు శవానికి స్నానం చేపియ్యాల గదా... దాంతో చూస్తే

ఎవరింట్లోనూ నీళ్ళు లేవు. పొద్దున్నించీ ఈ గొడవలో పడి ఎవరూ నీళ్ళకు పోలేదు. దాంతో ఒకతను కడవ తీసుకోని పెద్దరెడ్డి ఇంటికి పోయినాడు.

"రెడ్డీ... నిన్న మా బంధువు ఒకాయన మమ్మల్ని చూద్దానికని వచ్చి రాత బాగలేక ఈన్నే రాత్రి నిద్రలోనే కాలం చేసినాడు. ఒక బిందె నీళ్ళుంటే ఇయ్యి రెడ్డీ. శవానికి స్నానం చేపియ్యాల" అన్నాడు. దానికి రెడ్డి "అరెరే... పాపం..." అని జాలిపడతా గాసగాన్ని పిలిచి "ఒరేయ్... ఆ గచ్చులో గాని నీళ్ళుంటే ఒక కడవకు పోసి పంపురా... ఎప్పుడైనా కాదనొచ్చు గానీ సావుకాడ, పెండ్లికాడ మాత్రం వుండి గూడా లేదనకూడదు. అది ఆవును చంపినంత పాపం" అన్నాడు.

గాసగాడు పోయి నీళ్ళ కోసమని గచ్చు మూత తెరిచినాడు. అంతే... అప్పటివరకూ ఎప్పుడెప్పుడు మూత తెరుస్తారా... ఎప్పుడెప్పుడు బైటకి వద్దామా అని లోపల కాసుక్కూర్చున్న ఆత్మ అట్లా తెరవడం ఆలస్యం... ఒక్కుదుటున ఎగిరి బైటకి దుంకి సర్రున ఇంటివైపుకి దూసుకోని పోయింది. ఆడ చూస్తే ఇంకేముంది... ముక్కులో దూది పెట్టినారు. వెనుక దీపం వెలుగుతా వుంది. పక్కన పెండ్లాం, బిడ్డలు లబలబలాడుతా వున్నారు. మరోపక్క పాడె సిద్ధమవుతా వుంది. "ఓరినాయనో ఇంకొంచం ఆలస్యం గానీ అయింటే ఇట్లాగే తీస్కోని పోయి గుంతలోయేసి భూంచేసేటోళ్ళు... ఏ నీళ్ళ కోసమైతే ఇరుక్కోనిపోతినో మళ్ళీ ఆ నీళ్ళ వల్లనే తప్పించుకోగలిగితి" అనుకుంటా పోయి లటుక్కున శరీరంలోనికి దూరింది.

అంతే... అంతవరకూ నీలుక్కోని పోయి కట్టెలా పడి వున్న రామయ్య కదలడం మొదలు పెట్టినాడు. అది చూసి ఆడున్న వాళ్ళందరూ అదిరిపడినారు. మొదట ఇదేందిరా శవం కదులుతా వుంది అని కొందరు భయపడినారు గానీ "రేయ్... మన రామయ్య సావలేదురోయ్... బతికే వున్నాడు" అని ఒక ముసిలోడు అరవడంతో అందరూ అవాక్కయినారు. ఏడుపులు మానేసి సంబరపన్నారు.

రామయ్య ఆత్మ లోపలికి పోగానే రామయ్య అంతా మరచిపోయినాడు. దాంతో లేచి కూర్చోని "ఇదేందిరా నాయనా... నిక్షేపంగా వున్న నన్ను పట్టుకోని ఇట్లా చేస్తా వున్నారు. అసలేమైంది" అన్నాడు.

దానికి వాళ్ళ బంధువు నవ్వుతా "ఏమోరా... పిలిస్తే పలకక పోతివి. లేప్తే లేయకపోతివి. కాలూసేయీ సల్లగుండేసరికి గుండె గుభేలుమని అందరినీ పిలిపిస్తిమి. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ వులకక పలకక శవం లెక్కనే పడుంటివి. నీ అదృష్టం ఏమో గానీ యమధర్మరాజు లెక్కల్లో ఏదో పొరపాటు వచ్చి నిన్ను పట్టుకోనిపోయి విషయం తెలిసి నాలిక్కరుచుకోని వెంటనే తిప్పి పంపినట్టున్నాడు. లేకపోతే పుట్టి ఇన్నాళ్ళయింది. నేనెప్పుడూ సూళ్ళా వినలా ఇట్లాంటి విచిత్రం" అన్నాడు.

జనాలంతా ఆ వింతని కథలు కథలుగా చెప్పుకుంటా ఆన్నించి కదిలినారు. రామయ్య శవానికి స్నానం చేపియ్యడానికి తెచ్చిన కడవలోంచి ఒక పెద్ద చెంబు నిండా నీళ్ళు ఒంపుకోని తాగి తిరిగి పెండ్లాం బిడ్డలతో సొంతవూరికి బైలుదేరినాడు.

# డా॥ ఎం. హరికిషన్ రచనలు

1. మాయమ్మ రాచ్చసి
2. నయాఫత్వా
3. నేనూ మా అమ్మ
4. మూడు అబద్దాలు
5. ఒక చల్లని మేఘం
6. కందనవోలు కథలు
7. టీచర్ చెప్పిన కథలు

**చరిత్ర**

8. కర్నూలు జిల్లా చరిత్ర
9. కొండారెడ్డి బురుజు
10. కర్నూలు జిల్లా మహనీయులు

**సంపాదకత్వం**

11. కర్నూలు కథ

**బాలసాహిత్యం**

12. ఉంగురుబిళ్ళ
13. నక్కబావ - పిల్లిబావ
14. చిన్నారి గేయాలు
15. జానపద గేయాలు
16. తేనేటీగ - కందిరీగ
17. బంగారు చేప - గంధర్వకన్య
18. మెరుపుల వాన
19. పావురం దెబ్బ
20. చెప్పుకోండి చూద్దాం
21. బొమ్మలతో సామెతలు - 1
22. బొమ్మలతో సామెతలు - 2
23. తిక్క కుదిరిన నక్క
24. నమ్మొద్దురా నాయనా దొంగ నక్కల్ని
25. మూతి పగిలిన పిల్లి
26. రాము టోపి
27. కుందేలు దెబ్బ
28. ఒక వీరుని కథ
29. పుచ్చకాయ తపస్సు
30. సముద్రంలో చిన్నచేప
31. కోటకొండ మొనగాడు
32. బూర
33. తేనె చినుకులు
34. పిండిబొమ్మ వీరుడు
35. పిల్లలు కాదు పిడుగులు
36. నాకు మూడు - నీకు రెండు
37. కిర్రు కిర్రు లొడ్డప్పా
38. ఒకటి తిందునా రెండు తిందునా
39. నలుగురు మూర్ఖులు
40. కమ్మని ఊహలు
41. చిలుక ముక్కు పూడిపాయ
42. రేపటి వెలుగులు
43. నల్లకుక్క
44. రెక్కల ఎలుక
45. టక్కరికోతి
46. అమ్మో దయ్యం
47. మంచిమాట చెబుతా
48. చేయి చేయి కలుపుదాం
49. చందమామలో కుందేలు
50. మూడు కోరికలు
51. గాడిద మెచ్చిన పాట
52. ఛం... ఛం... చుక చుక
53. లబో దిబో
54. గొడవపడకు - దెబ్బ తినకు
55. మిన్ను
56. చిటికెల పందిరి
57. సోమరిపోతు మహావీరుడు
58. చింతపండు - జాంపండు
59. రాయలసీమ జానపద హాస్యకథలు
60. కర్నూలు జిల్లా జానపద కథలు

